రజ్జు సర్ప భ్రాంతి

రాజారావు

The Serpent and the Rope

రజ్జు సర్ప భ్రాంతి

తెలుగు సేత:

అశ్వినీకుమార్

రాజారావు

The Serpent and the Rope

రజ్జు సర్ప భ్రాంతి

© వల్లభనేని అశ్వినీకుమార్

September, 2020

Cover Design : **V.A.K.**

Price: ₹ **295 /-**

AK PublicationS

Cell : 939-343-6969

ISBN: 978-81-927170-0-5

For Copies :

Misimi Monthly

Kala Jyothi Process Private Limited,
2nd Floor, 1-1-60/5, R.T.C. X Roads,
Musheerabad, HYDERABAD-500020.
Ph : 040 - 27645536, 994 951 6567.

Printed at :

Mudrika Quality Offset Printers

H.No. 26-13-64/A, Sanyasi Raju Street,
Gandhinagar, Vijayawada - 520 003.
Ph : 944 015 9456.

ఏది తాడు? ఏది పాము?

"ప్రాచీన భారతీయ సాహిత్యం ఆధ్యాత్మిక సాధనకెక్కువ ప్రాధాన్యతనిచ్చింది. అంటే? ఆనాటి సాహిత్యకారుల ప్రకారం ఈ లోకంలో మనిషి ఒంటరి. అందువల్ల, కేవలం నా కోసం నేను రాసుకుంటానని మాత్రమే చెప్పగలను. జీవిత శేషం అడవిలో గడపవలసి వచ్చినా నేను రాస్తూనే ఉంటాను. పదం, శబ్దం ఒక అద్భుతం - ఆ నాదాన్ని ఆనందిస్తాను. అంతర్ నిశ్శబ్దం వల్ల మాత్రమే ఈ మ్యాజిక్‌ను ఆనందించటం సాధ్యపడుతుంది. నేను సమాజంలో భాగమే. కాని దానికి దూరంగా ఉంటాను. ప్రాచీన భారతీయ సాంప్రదాయానికి చెందినవాణ్ణి నేను. ఆ అనాది కాలంలో సాహిత్యం, సాధనలో ఒక సోపానం మాత్రమే..." అంటాడు రాజారావు.

అధిభౌతిక అద్వైత వేదాంతం రాజారావు నిర్మించిన సాహిత్య సౌధానికి పునాది. తన ఆధ్యాత్మిక ప్రస్థానంలో, సత్యాన్వేషణలో ఆయన అనేకమంది గురువులను ఆశ్రయించాడు. మతాలకు, దేశ కాల పరిస్థితులకు అతీతంగా సార్వజనీనమైన మానవ స్వభావాన్ని తన రచనల్లో చిత్రిస్తాడు రాజారావు. పద్దెనిమిదవ శతాబ్దంలో నవలా ప్రక్రియ బహుళ ప్రాచుర్యం పొందిన తర్వాత ప్రత్యేకమైన వ్యక్తుల గురించీ ఈ లోకంలోని వాళ్ళ అస్తిత్వం గురించీ రచయితలు సుదీర్ఘంగా చర్చించారు. కానీ *The Serpent and the Rope* లో రాజారావు ఇందుకు పూర్తి విరుద్ధమైన దృక్పథం అనుసరించాడు. "చరిత్రలో ఈ భౌతిక ప్రపంచ అస్తిత్వాన్ని ప్రశ్నించిన ఏకైక దేశం ఇండియా. వీరగాథలు, పురాణాలు, ఇతిహాసాలు మన సంస్కృతి. వీటిని నరనరానా జీర్ణించుకున్న రాజారావు ఇంగ్లీష్‌లో రాయాలనుకున్నప్పుడు ప్రాక్పశ్చిమ సంస్కృతులను సమన్వయించే ప్రయత్నం చేశాడు. ఒకే దేశ సంస్కృతికి చెందిన అధిభౌతిక చర్చలను మరొక విదేశీ భాషలో అనాయాసంగా కొనసాగించటం రాజారావుకే సాధ్యం అనిపిస్తుంది" అంటారు విమర్శకులు.

సంస్కృతి, సాహిత్య రూపాన్ని నిర్ణయిస్తుంది. భారతీయ భాషలలోని నవలలు పశ్చిమ దేశాల నవలలకన్న భిన్నంగా ఉండటానికి ఇదే కారణం. "భారతీయులెప్పుడూ (పశ్చిమ దేశాల వాళ్ళలాగ) నవల రాయలేరు" అంటారు రాజారావు.

పురాణాలు మన వారసత్వం అవి భారతీయ సంస్కృతిలో భాగం. "సృష్టికి మూలం ఏది?" అన్న ప్రశ్నతో ప్రారంభమై దేవతలు, వీరాధివీరులు, రాజులు వంశ క్రమం వగైరా అన్నీ ఉంటాయందులో. వీటి ప్రభావం భారతీయుల ఆలోచనల మీద, వ్యూహాల మీద, సాంప్రదాయిక జీవన విధానం మీద ఎంత లోతుగా ఉందో ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. వేదాలు, ఉపనిషత్తులు, భారతీయ

సంప్రదాయం అన్నీ మనకు వాటి ద్వారానే సంక్రమించాయి. క్రమంగా అవి పండగలు, ఆచారాలుగా మారాయి. రామాయణ, మహాభారతాలు ప్రాంతీయ భాషల్లో ఈ కర్తవ్యాన్ని నిర్వర్తించాయి. దేశంలో, ముఖ్యంగా దక్షిణ భారతంలో ఈ రెండు మహాకావ్యాలను పారాయణం చేయటం అనూచానంగా వస్తున్నది.

సంస్కృతమంటే రాజారావుకు Obsession. "మన సంస్కృతీ మూలాలిక్కడే ఉన్నాయి. సంస్కృతంలో మాత్రమే రాయాలనే కోరిక నాలో చాలా బలంగా ఉండేది'' అంటారు. మేథోపరంగానూ, భావోద్వేగపరంగానూ భారతీయ సాంప్రదాయ పరంపరతో అవినాభావ సంబంధముందనడానికి ముఖ్యంగా ఎనిమిదవ శతాబ్దికి చెందిన ఆదిశంకరుల అద్వైత తాత్త్విక ప్రభావం ఆయన రచనల్లో ప్రతిఫలిస్తుంది.

రచనలో పదం/శబ్దం యొక్క ప్రాముఖ్యతను వివరించటానికి పతంజలి, భర్తృహరిలను ఉదహరిస్తాడు రాజారావు.

"పువ్వు - అనాలంటే నువ్వు పలికే పదం వల్ల పువ్వు రూపం శ్రోతల మనసుల్లో సృష్టింపబడాలి. పదం మంత్రమైతేగాని రచయిత - రచయిత కాలేడు. పాఠకుడు - పాఠకుడు కాలేడు. మన వారసత్వాన్ని మనం గుర్తించవలసిన అవసరమున్నది. ముఖ్యంగా భర్తృహరిని మనమెప్పుడూ విస్మరించకూడదు.''

వ్యుత్పత్తి అర్థంలో 'మంత్రం' అంటే ఆలోచనకు పనిముట్టు. (మన్ - ఆలోచించటం + త్ర - పనిముట్టు).మౌఖిక సంప్రదాయంలో (భారతీయులది మౌఖిక సంప్రదాయమే) ఆలోచనా ధోరణి పదాలను గుర్తుపెట్టుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. అందులో ఒక ఆంతర్యముంటుంది. పదాలు కొన్నిసార్లు రూపం మార్చుకుని పునరావృతమవుతాయి. విశేషణాలు, సామెతలలాంటివి కూడా మౌఖిక సంస్కృతిలో ముఖ్యమే. వెరసి పదాలలో గొప్ప శక్తి నిక్షిప్తమై ఉందని స్పష్టమవుతుంది. అలాగే రాజారావుకి గంగానది అన్నా, హిమాలయాలన్నా, వారణాసి అన్నా ఎనలేని గౌరవం, ఆరాధన. ఆయన రచనలలో ఎన్నోసార్లు వీటి ప్రస్తావన తప్పనిసరిగా వస్తుంది.

భారతీయాంగ్ల రచయితల్లో రాజారావుకో ప్రత్యేకమైన స్థానముంది. ఈయన తన రచనల్లో ఇంగ్లీష్‌ను భారతీకరించాడు. అంతేకాదు సంస్కృత పదాలను ఎంత ఎక్కువగా వాడాడంటే Sanskritise చేశాడని కూడా అనవచ్చు. ఇంగ్లీష్‌కు ఆంగ్ల ప్రభావం నుండి తాత్కాలికంగా విముక్తి కలిగించి, దానితో భారతీయ భాషలాగా, మాతృభాషలాగా సాము చేశాడు. ఈ నవలలో భారతీయ - యూరోపియన్ సంబంధాలలాగే ఇంగ్లీష్, సంస్కృతం కూడా కలగలసిపోయాయి.

"పదాల ఎంపికలో, వాటి శబ్దసౌందర్యాన్ని, గాంభీర్యాన్ని బేరీజు వేయటంలో, వాక్యనిర్మాణంలో, ఒక కామా ఇక్కడ, ఒక డాష్ (-) అక్కడ పెట్టడంలో రచయిత అంతరంగంలోని కదలికలు, అతడి జీవన గమన వేగం, అతడి శ్వాస (ప్రాణం), ఆలోచనా సరళి - ఆత్మ - ప్రతిబింబిస్తాయి" అంటాడు రాజారావు.

ఉపనిషత్తులలోనూ, పురాణాలలోనూ వేదాంత చర్చలు కోకొల్లలు. ఆ కోణంలో *The Serpent and the Rope* వీటిని (ఉపనిషత్తులు, పురాణాలు) గుర్తు చేస్తుంది. కథారూపంలో మనల్ని ఆలోచింపజేసే తాత్త్విక మీమాంస ఈ నవల ప్రత్యేకత. ఇందులోని తాత్వికత కృత్రిమంగా చొప్పించింది కాదు. అది ఈ నవల నిర్మాణంలో అంతర్భాగం. కథను ముందుకు నడిపించే చోదకశక్తి అది.

The Serpent and the Rope (1960) రాజారావు రెండవ నవల. (మొదటిది కాంతపుర - 1938). ఆదిశంకరులు తన అద్వైతానికి ఉదాహరణగా చెప్పిన *రజ్జు సర్ప భ్రాంతి* ని కథావస్తువుగా తీసుకొన్న ఈ నవల ఆత్మకథాత్మకం. రాజారావు జీవితంలోని వ్యక్తులు, పలు సంఘటనలు ఈ నవలలో నాటకీయంగా పునరావృతమవుతాయి. అందువల్ల మొదట ఆయన జీవిత విశేషాలు క్లుప్తంగా తెలుసుకుందాం: ఆనాటి మైసూరు సంస్థానంలోని హాసన్‌లో సాంప్రదాయ కన్నడ కుటుంబంలో 1908లో జన్మించాడు రాజారావు. (నవలలోని మొదటి వాక్యం ఇదే.) తొమ్మిదిమంది సంతానంలో పెద్దవాడు. తండ్రి, హైదరాబాద్‌లోని నిజాం కాలేజీలో కన్నడం బోధించేవాడు. రాజారావు నాలుగేళ్ళున్నప్పుడే తల్లి మరణించింది. ఆమె లేని లోటు, అతడి రచనల్లో తరచూ కనిపించే ఇతివృత్తం. అలాగే తాతగారి వద్ద పెరగటం గురించి కూడా ఎక్కువగా రాస్తాడు.

హైదరాబాద్‌లోని మదర్సా - ఇ - ఆలియా స్కూల్లోనూ, నిజాం కాలేజీలోనూ చదువుకున్నాడు రాజారావు. అప్పుడే ఫ్రెంచి నేర్చుకొని హైదరాబాద్ ప్రభుత్వ స్కాలర్‌షిప్ మీద ఫ్రాన్సులోని మాంట్ పెలియర్ యూనివర్శిటీలో ప్రవేశించి తరువాత సార్బాన్‌లో ఉన్నత విద్య కొనసాగించాడు. 1931లో కెమికా హెలీని వివాహం చేసుకొన్నాడుగాని ఆ బంధం ఎక్కువ కాలం కొనసాగలేదు (నవలలో ఇదో ముఖ్యాంశం).

ఆత్మ జ్ఞానం కోసం సాగిన ఆధ్యాత్మిక ప్రస్థానాన్ని చిత్రించిన *The Serpent and The Rope* లో కథానాయకుడు రామస్వామి. క్షయవ్యాధి పీడితుడు. బలహీనంగా ఉంటాడు. ఫ్రాన్సులో చదువుకొంటున్నప్పుడు మెదలీనా - ఫ్రెంచి యువతిని వివాహం చేసుకొని, ఆల్బిజెన్సియన్ హియర్‌సీ తాత్వికాంశం మీద తన థీసిస్ పూర్తి చేయటానికి ప్రయత్నిస్తుంటాడు. అయితే అప్పటికే

వివాహంలో కొన్ని సమస్యలు తలెత్తుతాయి. పరస్పర అవగాహన లోపిస్తుంది. మొదటి సంతానం, కొడుకు, పుట్టిన ఏడు నెలలకే మరణిస్తాడు. ఇప్పుడితడి తండ్రి మరణశయ్య మీదున్నాడు. ఇండియాకు రాక తప్పదు.

భార్యను ఫ్రాన్సులో వదలి ఇండియాకొస్తాడు రామస్వామి. పెంపుడు తల్లి, తండ్రికి చివరిదాకా సేవ చేసింది. ఆమెను "చిన్నమ్మా" అని పిలుస్తాడు. అంత్యక్రియలు ముగించి తీర్థయాత్రలకు బయలుదేరతాడు. ఆ సందర్భంలోనే కాశీ ఘాట్‌లో తండ్రి చితాభస్మాన్ని, చిన్నమ్మ సమక్షంలో, గంగలో నిమజ్జనం చేస్తాడు. అలహాబాదు సంగమం, హరిద్వార్, బొంబాయి నగరాలను చిన్నమ్మతో దర్శిస్తాడు. ఆ తర్వాత తిరిగి ఫ్రాన్సుకు చేరుకొంటాడు.

తనలో ఏదో వెలితి ఉన్నట్లుగా తెలుసుకొంటాడు రామస్వామి. లోపల ఏదో అలజడి తనకు క్షణం విరామం లేకుండా చేస్తున్నది. 'నేను ఆలోచించకుండా ఉండలేను' అంటాడు. తన గురించి తను మరింత లోతుగా అర్థం చేసుకోవాలి. ఇండియా వచ్చినప్పుడే కేంబ్రిడ్జి విద్యార్థిని సావిత్రి పరిచయమవుతుంది. రామస్వామి మిత్రుడితో ఆమె పెళ్లి జరగాలి. కాని తను అతణ్ణి ప్రేమించటం లేదని చెబుతుంది సావిత్రి. మొదట "ఈ కాలం పిల్లలు ఇలాగే ఉంటార"ని తేలికగా తీసుకొంటాడు రామస్వామి. అయినప్పటికీ ఆమెను తన ఆలోచనల్లోంచి తొలగించుకోలేకపోతాడు. ఈలోగా భార్యతో దూరం మరింత పెరుగుతుంది. "ఈ పరిణామానికి తనే కారణమా?" అని అడుగుతుంది మెదలీనా.

కొంతకాలం క్రితం రామస్వామికి తల్లి మెదలీనా కాలి వేళ్ళకు తొడగమని అతనికి మెట్టెలిస్తుంది (అవే ఆమె తన కోడలికిచ్చిన దీవెనలు). కాని ఈ పరిస్థితిలో రామస్వామి వాటిని మెదలీనాకు ఇవ్వలేకపోతాడు. అతనికి తెలియకుండానే సావిత్రి పట్ల ఆకర్షితుడవుతాడు. క్రమంగా అది ప్రేమోద్ధృతంగా, ఆమెను విడిచి ఉండలేని విరహంగా మారుతుంది. ఇప్పుడది ప్రేమగాయం. దంపతుల మధ్య అఘాతం ఏర్పడింది. పేరుకు మాత్రమే భార్యాభర్తలు. అతడి హృదయంలో సావిత్రికి తప్ప మరెవరికీ స్థానం లేదు.

ఒకనాడు సావిత్రి ఫ్రాన్సుకు వచ్చి మెదలీనాను కలుస్తుంది. 'రామా! వేల సంవత్సరాల భారతీయ సంస్కృతి మాత్రమే సావిత్రిలాంటి స్త్రీని సృష్టించగలదు' అంటుంది మెదలీనా.

రామస్వామి తన రీసెర్చ్ పూర్తి చేసే క్రమంలో సావిత్రిని ఇంగ్లండు దాకా అనుసరిస్తాడు. మొత్తం మీద ఇద్దరి మధ్యా ప్రేమబంధం బలంగా ఉందని గ్రహిస్తారు. కాని రామస్వామి తన ప్రేమను వ్యక్తపరచలేడు. వివాహితుడు. "పెళ్ళి

చేసుకుందాం'' అని నోరు విప్పి ఆమెతో ఎలా చెప్పగలడు? కాని తన ప్రేమకు సంకేతంగా మెట్టెలు బహూకరిస్తాడు. సావిత్రి వాటికి అభ్యంతరం చెప్పదు. వాళ్ళ ప్రేమబంధంలో ఇదో ముఖ్యమైన మలుపు. కానీ అప్పుడే మెదలీనా రెండోసారి గర్భం దాలుస్తుంది. రామస్వామి చెల్లెలు - సరోజ పెళ్ళి కోసం ఇండియా వెళ్ళాల్సి వస్తుంది. అనారోగ్యం నుండి కోలుకొంటూ అతడు బెంగుళూరులో ఉన్నప్పుడు మెదలీనాకు పుట్టిన రెండో కుమారుడు కూడా మరణించాడని తెలుస్తుంది. ఇష్టం లేకపోయినా సావిత్రి ఎవరినో వివాహం చేసుకుంటుంది. ఫ్రాన్సుకు తిరిగి వెళ్ళిపోతాడు రామస్వామి. మెదలీనా బౌద్ధ మతం స్వీకరించి భర్తకు దూరమౌతుంది.

ఊపిరితిత్తుల సర్జరీ కోసం రామస్వామి లండన్‌కు వెళతాడు. అక్కడ సావిత్రి అతణ్ణి చూడటానికి వస్తుంది. జరిగిన సంఘటనలను విధి వైచిత్రిగా భావించి ఇద్దరూ ఎవరి పద్ధతిలో వాళ్ళు జీవించాలని తీర్మానించుకొంటారు. "మరొకరి ఆనందాన్ని తమదిగా భావించుకోవటమే నిజమైన ప్రేమ'' అన్న సత్యం ఆవిష్కృతమవుతుంది. మెదలీనా రామస్వామికి విడాకులు ఏర్పాటు చేస్తుంది. తన సత్యాన్వేషణకు, ఆధ్యాత్మిక ప్రస్థానానికి లక్ష్యం, సమాధానం చూపగలిగింది 'గురువు' మాత్రమే అని తెలుసుకొంటాడు. ఇప్పటిదాకా జరిగిన తన జీవితానుభవాలన్నీ ఈ విషయాన్నే స్పష్టం చేస్తున్నాయి.

స్థూలంగా ఇదీ కథ. కాని నవలలో కీలకమైనవి వేదాంత చర్చలు. అద్వైత వేదాంతం - మీమాంస, వాదోపవాదాలు, ప్రాక్పశ్చిమ తాత్విక తులనాత్మక పరిశీలన, అసమాన కథా కథన నైపుణ్యం, స్థలపురాణాలు, ఉపకథలు దీన్ని సుసంపన్నం చేస్తాయి. రాజారావు మేథోపరిణతికి శిఖరాయమైన ఈ నవలను చదవటానికి ఇవీ అసలు కారణాలు. మేథోపరమైన, కొండకచో జటిలమైన రచనలను ఇష్టపడే పాఠకులకు ఆనంద సింధువు *The Serpent and the Rope.*

ఇదంతా ఇంగ్లీష్ పుస్తకం గురించి.

"అద్వైతం గురించి మనకు తెలియందేముంది? దాన్నెవరైనా తెలుగులో చెప్పొచ్చు'' అనుకొంటారేమో, రాజారావు ఇంగ్లీషు, అనువాదకులకు జారుడుబండలాగుంటుంది. అంతా అర్థమైనట్టే ఉంటుంది కాని తెలుగులో చెప్పాలంటే పట్టు దొరకదు. సహనంతో, పరిశ్రమతో, తదేక దీక్షతో మాయజలతారులాంటి మూలరచయిత వేదాంత చర్చలను సమర్థవంతంగా, కవితాత్మకంగా, సరళంగా తెలుగు చేసిన అశ్వినీకుమార్ గారికి అభినందనలు.

అశ్వినీకుమార్ బహుగ్రంథకర్త. రచయితగా, కవిగా లబ్ధప్రతిష్టుడు. అంతకు మించి ఆయన విశ్వయాత్రికుడు. తెలుగులో Foot Loose రచయితలు అరుదు.

ఎప్పటికప్పుడు యాత్రా కథనాలు ప్రచురిస్తూనే ఉన్నాడు. చైనా ప్రయాణం గురించి ఇటీవలే "చైనా ఛాలెంజ్" పేరుతో విలువైన సమాచారాన్ని పొందుపరిచి ఒక పుస్తకం విడుదల చేశారు. సహజంగానే విదేశాలలో జరిగిన కథలూ, విదేశీ పాత్రలున్న కథలను కూడా విరివిగా రాశారు. *అమాహ*, *మాలి*, *లేమి*, *పంజరం*, *సంకెళ్ళు*, *రెప్పపాటు లోకంలో*, *పులివేట* వగైరా కథలు మనల్ని ఒక Exotic లోకంలో విహరింపజేస్తాయి. 'అమాహ' కథలకు మరికొన్ని కలిపి *పారిజాతం* కథాసంపుటి విడుదల చేశాడు. *నాలో నేను*, *అనంతరంగం* అద్భుతమైన కవితా సంకలనాలు - అంతరిక సంఘర్షణ, సంవేదన, సంతాపం ఉంటుందనుకోవడానికి ఒక చిన్న ఉదాహరణ ఈ కవితలు - అంటాడు వేగుంట మోహన్ ప్రసాద్.

ఇవికాక ప్రపంచ రచయితలనూ, కళాకారులనూ తెలుగువారికి పరిచయం చేసే ఉద్దేశ్యంతో, సవ్యసాచిలా, అనువాదాలలో కూడా తన విలక్షణ విద్వత్తును ప్రదర్శించాడు అశ్వినీకుమార్. తెలుగు అనువాద సాహిత్యానికి అంతర్జాతీయ గౌరవాన్ని సంపాదించి పెట్టాడు.

విదూషక చక్రవర్తి, క్లాసిక్ సినిమాల నిర్మాత, దర్శకుడు, ట్రాంప్ సృష్టికర్త చార్లీ చాప్లిన్ ఆత్మకథ ఈయన మనకిచ్చిన అపూర్వమైన కానుక. ఆ తర్వాత, ఆస్కార్ వైల్డ్ 'అగాథం' (De Profundis) కవితాత్మకంగా మనల్ని విషాద సాగరంలో ముంచే మరో రచన.

ఆంద్రీ మార్వా రచించిన షెల్లీ, బైరన్‌ల జీవిత కథలను తెలుగు చేయటం అశ్వినీకుమార్ అనువాద నైపుణ్యానికి గీటురాయి. పది వేల పేజీలకు పైగా రాసిన రాక్షసుడు. దశాబ్ద కాలంగా ***మిసిమి*** మాసపత్రిక సంపాదక బాధ్యతలో నిత్య కృషీవలుడు అశ్వినీ.

ఇంతకూ మనం ఆయన తొలి అనువాదం *సిద్ధార్థ* గురించి చెప్పుకోలేదు. సత్యాన్వేషకుడూ, జ్ఞానాన్ని అనుభవంలోకి తెచ్చుకోవాలని సాధన చేసిన హెర్మన్ హెస్సీ *సిద్ధార్థ* తరువాత, ఇన్నాళ్ళకు ఇంచుమించు అలాంటి ఆత్మకథా నవలే - రాజారావు *The Serpent and the Rope* ను మనకందిస్తున్నాడు అశ్వినీకుమార్.

రాజారావు సత్యాన్వేషణలో మనమూ ప్రయాణం చేయాలనుకుంటే
అశ్వినీకుమార్ చేయి పట్టుకుని ముందుకు వెళదాం రండి...

హైదరాబాద్
20.7.2020

ముక్తవరం పార్థసారథి

కాలి బాట..

ఈ నవల భారతీయాత్మకం. సంప్రదాయంలో, ఆలోచనల్లో, సహజమైన చిలక పలుకులలో, సామెతలలో, అభూత కల్పనలలో పూర్తిగా భారతీయమ్.

ఈ కథ భారతదేశంలో ప్రవహించే జీవనదులలో నుంచి ఉద్భవించిందని చెప్పటానికి వెనుకాడను..

ఆంగ్లం మనల్ని మేథోపరంగా ఆక్రమించింది కానీ, ఆధ్యాత్మికంగా ఆకర్షించలేకపోయింది. మన భావనాధార మాతృభాషకే పరిమితం.. గతం వర్తమానంలో లీనమైపోతుంది.. దేవతలు భూమి మీదకు దిగి వచ్చి మనతో కలిసిపోతారు. విశ్వాసం కథలు వినిపిస్తుంది.. ఇదిగో, ఇప్పుడు మీరు వినబోయే కథ అలాంటిదే..

ఇక్కడ ఎండలో ఏదో చైతన్యం చిరచిరలాడుతుంటుంది.. మనల్ని కూర్చోనివ్వదు, నిలబడనివ్వదు.. ఒకవిధమైన వింత పరుగు, మన బ్రతుకు.

ఈ దారులకు అంతే ఉండదు. నీ కాలిబాట ఆగిపోదు. ఈ ప్రయాణంలో ఎన్నో బంధాలు, మరెన్నో భ్రమలు. అనాథను చేసిన అమ్మ - ఆదరించిన చిన్నమ్మ - ఆరాధించిన అర్ధాంగి - మమతలు పంచిన మారుటి చెల్లెలు - పెద్దరికం కట్టబెట్టిన వంశ మూలాలు - ప్రేమించి, వెళ్ళిపోయిన ప్రియురాలు...

మరి ఈ బంధాలన్నీ భ్రమలేనా!

నువ్వు యాత్రికుడవైతేనే నీకు నువ్వు పరిచయమవుతావు..

సంస్కృతి మనల్ని అజ్ఞాతంలో ఉంచుతుంది.. సంప్రదాయం, వర్తమానంతో ముడిపెట్టుకుని గతాన్ని ముందు కాలంలోకి తీసుకుపోతుంది.

సంస్కృతీ సంప్రదాయాలు మన వ్యక్తిత్వానికి నిజాయితీని కట్టబెడతాయి.. ముందుచూపునీ ఇస్తాయి..

కొన్ని సందర్భాల్లో మనకు తెలిసిన సత్యాలన్నీ నీటి మీద రాతలయిపోతాయి.. ఈ ప్రపంచం అసత్యమో, సత్యమో - సర్పమో, తాడో - వీటి మధ్యలో ఏమీ లేదు. ఉన్నదంతా కవిత్వం.. కాషాయం.. మనం ఎక్కడకెళ్ళినా.. పాము కళ్ళతోనే చూస్తాం.. అది ద్వైతమా, అద్వైతమా! అలాగే తాడునూ చూస్తాం.. కానీ నువ్వే సర్పానివి.. నువ్వే బంధానివి.. నిజానికి ఏ దృష్టితో చూసినా సర్పమంటూ లేదు. గురువు దీపపు వెలుగులో నీ భ్రమలన్నీ పోగొడతాడు..

రాజారావు శైలి అనన్య సామాన్యం, అనితర సాధ్యం. ప్రతి వాక్యమూ విశ్వజనీనం. భావవ్యక్తీకరణ కవితాత్మకం. అలంకార రహితంగా, సహజభూషణ సహితంగా, సంభాషణా రీతిలో సాగిపోతుంటుంది.
ఆత్మకథాత్మకమైన తన జీవన ప్రయాణాన్ని.. హిమాలయాలతో, గంగాప్రవాహంతో, కాశీవిశ్వనాథునితో, ఆల్ప్సు పర్వత సానువుల్లో, మధ్యధరా సముద్రపు స్థిరత్వంలో, దక్షిణ ఫ్రాన్స్ లోయల్లోని వందల ఏళ్ళ నాటి దేవదారు వృక్షాలతో, కామ్ నదితో, దానిపై వంతెనలతో (Cambridge).. హిట్లర్‌తో, స్టాలిన్‌తో, చివరికి బ్రిటిష్ రాణి పట్టాభిషేకానికి జరిగే అలంకారాలతో కలగలిపి Nonlinear Narrationతో మనల్ని ఆహ్లాదకరంగా, ఆశ్చర్యంగా తన వెంట తీసుకుపోతుంటాడు.. మైసూర్ హైమావతీ నది వరదల్ని కూడా చూపిస్తాడు.
మిరియాల, పోకచెట్ల ఎస్టేట్లలో తిప్పుకొస్తాడు..
భాగ్యనగరానికి భాష్యం చెప్పి, మధ్యమధ్యలో మనల్నీ,
ఈ స్థితిలో మీరైతే ఏమి చేస్తారు అని సలహా అడుగుతుంటాడు.
ప్రేమ ఒక భావన అనీ, మన భయాందోళనలతో ముడిపడి ఉన్న మానసిక శృంఖలాలే మన విధి అనుకోవాలని సిద్ధాంతీకరిస్తాడు.
మధ్యలో మన ప్రయత్నాలు మన జన్మ నక్షత్ర రాశులేమోనని అనుమాన పడతాడు..
కర్మ నిర్వర్తించడం నిన్ను నువ్వు వ్యక్తీకరించుకోవడానికే అని నమ్మకంగా వివరిస్తాడు.
స్వేచ్ఛ పూర్తిగా మానసికమైనదని అంటూ, కాదంటారా అని ప్రశ్నిస్తాడు..

ధవళ కాంతితో మెరిసే దేవకన్య,
దివి నుండి భువికి దిగివచ్చినవేళ,
భూమి వనరులన్నీ ఆమెలో నిక్షిప్తమై ఉన్నాయి..
ఈ శుభోదయం మన మీద వెలుగులు విరజిమ్ముతూ ఉంది.. - *ఋగ్వేదం*





రామస్వామి ప్రయాణం

ఒకటవ అధ్యాయం	:	చిన్నమ్మ.....	1
రెండవ అధ్యాయం	:	మెదలీనా...	39
మూడవ అధ్యాయం	:	సావిత్రి...	113
నాల్గవ అధ్యాయం	:	సరోజ...	181
అయిదవ అధ్యాయం	:	కాతరీన్...	231
ఒక రాజారావు	:	...	285
ఒక అశ్వినీకుమార్	:	...	287

ఒకటవ అధ్యాయం:

చిన్నమ్మ

నాది బ్రాహ్మణ పుట్టుక - అది సత్యానికీ సర్వానికీ చెందినది!

బ్రాహ్మణుడంటే బ్రహ్మజ్ఞానం కలవాడు!

కానీ ఈ విషయం నా పూర్వీకులకు ఎంతమందికి తెలుసు? అదీ, ఉపనిషత్తుల సారం అయిన యాజ్ఞవల్క్యుని కాలం నుంచి శంకరాచార్యుల తర్వాత వేదవేదాంగాలకు వ్యాఖ్యానం చెప్పి ఒక మహా సామ్రాజ్య స్థాపనకు మూలపురుషుడైన మాధవ మునీశ్వరునికి తప్పించి ఈ విషయం ఎంతమందికి తెలుసు?

అంతేనా - గృహస్థాశ్రమంలోని తమ భౌతిక సుఖాలను వదులుకుని, నదుల ప్రాతఃపవనాల ప్రాణవాయువులకు దూరంగా మహారణ్యాలలో - మహోన్నత పర్వత శిఖరాలపై దైవ సాక్షాత్కారం కోసం అన్వేషించి, సాధించగలిగి - వారంతా తిరిగి వచ్చి గుళ్ళూ గోపురాలూ నిర్మించలేదా - కాని వారంతా మరణించలేదా? వారికి దహనసంస్కారాలు జరగలేదా? వారి చితాభస్మాలు పవిత్ర నదీప్రవాహాల్లో కలిసిపోలేదా? కానీ వారు నిజంగా చనిపోయారా? ఎవరన్నారు? వారంతా జీవించే ఉన్నారు - నాతోనే ఉన్నారు - నాలోనే ఉన్నారు! సజీవంగా - అందుకు నేనే సాక్షి!

ఆ విధంగా నా పూర్వీకులు ఒకరి తర్వాత ఒకరు నిష్క్రమించారు - వారి చితాభస్మాలు నదీప్రవాహాల ద్వారా మళ్ళీ ఈ మట్టిలో కలిసిపోయాయి.

నేనెప్పుడు నదిలో నిలుచున్నా, నా చిన్నతనంలో ఇప్పటికీ గుర్తు - చంద్రగ్రహణం - రోజున దర్భలు తీసుకుని తలిదండ్రులకు తిలోదకాలతో ప్రార్థనలు చేయలేదా?

ఆ విధంగా నేను సద్బ్రాహ్మణుణ్ణి - నాకు బ్రహ్మసూత్రాలు - ఉపనిషత్తులు నాలుగేళ్ళ ప్రాయంలోనే కంఠతః వచ్చు. ఏడేళ్ళకే పవిత్రమైన యజ్ఞోపవీతాన్ని (జంధ్యాన్ని) ధరించాను. ఎందుకంటే - అమ్మ చనిపోయింది - ఆ కర్మకాండలు నేనే నిర్వహించాలి మరి! తర్వాత, సంవత్సరం తర్వాత సంవత్సరం నా తండ్రి వివాహం చేసుకుంటూనే ఉన్నారు.

మడి కట్టుకుని - తడి బట్టల్తో, కడుపు మాడ్చుకుని, భక్తిశ్రద్ధలతో, నుదుట గంధం పూసుకుని అమ్మకు అర్పించిన అన్నం ముద్దల ముందు మోకరిల్లాను - నాకు దుఃఖం ఆగలేదు - అమ్మ నన్ను అనాథను చేసి వెళ్ళిపోయింది!

తర్వాత ప్రపంచమంతా తిరిగాను - బస చేసిన ప్రతి గదిలో నాకు దుఃఖం పొర్లుకు వచ్చేది. రైలుబండి కిటికీలో నుంచి దూరంగా పర్వతాలు కదిలిపోతుంటే

కన్నీరు ఆగేది కాదు. నాకు అమ్మ లేదు - అప్పటికి నాకు 22 ఏళ్ళు. 'పైరనీస్'లో హోటల్ గదిలో కూర్చొని వెక్కివెక్కి ఏడ్చాను - అమ్మ ఎప్పటికీ కనిపించదు!

మా అమ్మ మహాసాధ్వి అనీ, మహా సౌందర్యవతి అనీ చెప్పేవారు కిట్టన్న తాత! "ఆమె గొంతులో వీణలు మ్రోగేవి! రామేశ్వరాలయంలో సరిగమలు ధ్వనించే స్తంభాల మాదిరి - ఎక్కడి నుంచో తెలియని లోతుల నుంచి ప్రతిధ్వనించి దేవుణ్ణి పునీతుణ్ణి చేసేది! నాకు గుడిసాని చంద్రమ్మ గుర్తుకు వచ్చేది! ఆమెదీ ఇలాంటి కంఠస్వరమే! ఇది నీకు తెలియదు - యాభై ఏళ్ళ నాటి మాట!" అనేవాడు. కిట్టన్న తాత మా వంశంలో చాలా సాహసవంతుడు. బహుశా ఆయన అంశ నాలో ఉండి ఉంటుంది. అసాధ్యాన్ని ప్రేమించే మనస్తత్వం అలవాటయిపోయింది! ఈ భవనం ఎగిరిపోగలదని, స్టాలిన్ - సన్యాసం స్వీకరిస్తాడని - జపాన్‌లో అందరూ బౌద్ధ సన్యాసులుగా మారిపోతారని - మహాత్మాగాంధీ మాతోపాటు నడుస్తాడని నమ్ముతుండేవాడిని. ఒక్కోసారి ఈ రైలు పట్టాలు నిలువునా నిలబడతాయని అనిపించేది. ఏనుగు 24 రోజుల్లో కనగలదనీ, విమానం ఎగురుతూ వెళ్ళి ఆ కొండ కొన పైన కూర్చుంటుందని చూసేవాణ్ణి. ఫతేపూర్ సిక్రి వెళ్ళి అక్బర్ చక్రవర్తితో మాట్లాడగలనని నమ్మేవాణ్ణి. ఆలోచించకుండా ఉండటం నాకు చేతగాని పని. నేను వెర్సైలో ఉన్నపుడు రాయిసోలేల్ స్వరం వినిపించేది. వీక్స్‌లో బోసెట్ - ముక్కుపొడెం అరచేతిలో నలుపుతున్నట్లు చూసేవాణ్ణి - మన దేశంలో ఇప్పటికీ అలాగే చేస్తారు కదా! అప్పుడు నాకు తుమ్ము కూడా వచ్చేది! సరిగ్గా అక్కడే బోసెట్ - శ్మశాన గీతం పాడుతుండేవాడు! తనకు మరణం లేదని బోసెట్ గాఢంగా నమ్మేవాడు - అలాగే రాయి సోలేల్ కూడా. చనిపోతే వారు ఎక్కడికి వెళ్తారు చెప్పండి!

కిట్టన్న తాత చాలా సాహసవంతుడు. ఆయన గుర్రపు స్వారీ చాలా ప్రసిద్ధం. ఎంతటి పెంకి గుర్రాన్నైనా ఇట్టే లొంగదీసి స్వారీ చేసేవాడు. ఒకరోజు తన గుర్రం - సుందరాన్ని స్వారీ చేస్తూ అడవిలోకి వెళ్ళాడు. వాళ్ళకి పులి ఎదురైంది! అంతే! సుందర్ ఒక్క ఉదుటున గాలిలోకి ఎగిరి అడవి చెట్లను ఒరుసుకుంటూ పులికి అందకుండా కిట్టన్న తాతను జర్మన్ జీనుతో సహా మా తోటలో దింపింది! దాని సకిలింపు విని చౌడయ్య గుర్రాన్ని పట్టుకుని శాలలోకి తీసుకుని వెళ్ళాడు. కిట్టన్న తాత ఇంట్లోకి వెళ్ళి వేడినీళ్ళ స్నానం చేశాడు. సీతమ్మ ఎప్పుడూ వేడినీళ్ళు అందిస్తూ ఉండేది. గుర్రానికి ఆ గాయాలేంటి? వంటినిండా, గీరుకుపోయిందే అంది. అప్పుడు పూజకు కూర్చున్న కిట్టన్న తాత పులి సంగతి చెప్పాడు. ఆయనకైతే అలాగే గాలిలో తేలిపోయి బృందావనంలో దిగాలని ఉండేది! అలా మరో మూడేళ్ళు సుందరాన్ని స్వారీ చేశాడు. అతిసారంతో సుందరం చనిపోయింది. అవును, గుర్రాలు కూడా

చనిపోతాయి. కిట్టూరు కొండమీద ఖననం చేశాం - గుర్రాలంటే అరేబియావే కదా - వాటిని ముసల్మాన్ మత పద్ధతిలోనే ఖననం చేయాలి. హైద్రాబాద్‌లో చేసినట్లు - ఆ సమాధి మీద గులాబీ రంగు 'మస్లిన్' కప్పిపెట్టాం. ప్రతి సంవత్సరం దాని సమాధిని చూసి వస్తుంటాం - అవును - ఇప్పుడు సుందర్ ఎక్కడున్నాడు?

కిట్టన్న తాతకి అసాధ్యం ఎప్పుడూ సుసాధ్యమే. ఆయన బ్రాహ్మణునిగా ఎప్పుడూ ప్రవర్తించలేదు. తుపాకులన్నా, కత్తులన్నా భయం లేదు. కానీ ఆయన అంతరాంతరాల్లో తన మంత్రాలు మోగుతుండేవి. ఆయన పూజాగృహం నుంచి బయటకు వస్తుంటే సీతమ్మ - "చూడు - ఆయన ధర్మరాజులాగా వెలిగిపోతున్నారు" అని అంటుండేది! కానీ, నాకు కత్తులన్నా - తుపాకులన్నా వణుకు పుట్టేది. చిన్నపాటి హింసను కూడా భరించగలిగేవాడిని కాదు. అక్కడ నుంచి ఎంతో దూరం పరుగెత్తేవాణ్ణి. మళ్ళీ అంత వేగంగా తిరిగి వచ్చేవాణ్ణి. నాకు భయం అంటే భయం లేదు. నేను భయపడేవాడినంతే! నాకు నదులన్నా - సరస్సులన్నా ఎంతో ఇష్టం. నా ఇల్లు నీటి ప్రక్కనే కడతాను. అలాగే రాజప్రసాదాలంటే చాలా ఇష్టం. అవి చీకటిలో ఉండిపోయి గతాన్ని ప్రతిధ్వనిస్తాయి. అందులో ఎప్పుడో నివసించిన సాధ్వులంతా కనిపించేవారు. వారికి మరణం లేదు కదా! వారి దృష్టిలో అనాథలెవ్వరూ ఉండేవారు కాదు. తరతరాలుగా అనాథలను వారు సాకేవారు. అలాంటి సాధ్వి లక్ష్మమ్మ. ఒక రాజకుటుంబీకుణ్ణి పెళ్ళి చేసుకుంది. ఆమె ఎనిమిదేళ్ళకే విధవరాలయింది. అప్పటి నుంచి మా తాతలను, వారి పిల్లలు - మనుమలు ఆమె ఆలనా పాలనలోనే పెరిగారు. ఆమెకు వయస్సే తెలిసేది కాదు. లక్ష్మమ్మ తన పద్దెనిమిదవ శతాబ్దం ట్రంకుపెట్టెలో ఈ పిల్లల బట్టలన్నీ జాగ్రత్త చేసి పెట్టింది. ఎవరైనా చనిపోయినపుడు తప్ప ఆ ట్రంకుపెట్టె ఎప్పుడూ తెరిచేది కాదు. కిట్టన్న తాతకంటే ఏడెనిమిదేళ్ళు పెద్దదయిన లక్ష్మమ్మ చనిపోయిందని చెబితే నేను నమ్మలేదు. ఆమెకు వయస్సే లేదు. మూడువందల సంవత్సరాలు జీవించాలి - అప్పుడే ఎలా చనిపోతుంది? ఎప్పుడూ చిన్ని తుమ్ము కూడా తెలియని ఆమె ఆరోగ్యం - ఏనాడూ కంట నీరు పెట్టని ఆమె ధైర్యం మరణానికి ఎలా లొంగిపోతుంది? అందుకే ఈ చావు అనే మాట నాకర్థం కాదు! నాన్నకు నేనంటే ప్రాణం - నన్ను ఎప్పుడూ లక్ష్మమ్మకు అప్పగించడు - "అరే! ఆమె దగ్గర చెడు వాసనరా - నీవు రాజకుమారుడవు - కథానాయకుడవు - ఆమెకు దూరంగా ఉండు" అనేవాడు.

అమ్మ చనిపోయింది. ఆమెకు వింతలు కనిపించేవి. నా మునుపటి మూడు జన్మలు ఆమె చూసింది. తెల్లగా అందంగా గంభీరమైన గొంతుతో అందరికంటే భిన్నంగా! అలాంటి ఒక జన్మలో నేను రాజకుమారుణ్ణి! అందుకే నా చెవులకు,

మెడలకు, చేతులకు ఎప్పుడూ మణులు మాణిక్యాలతో అలంకరించేది. ఆమె చనిపోయిందని చెప్పారు. అప్పుడు కూడా ఆమె నాకు ఏదో నగ చేయిస్తుంది. దీని కోసం కంసాలికి (వడ్డాబత్తుని) దగ్గరకు కబురు చేసిందని చెప్పారు. ఆమెను కోయంబత్తూరు నుంచి తెప్పించిన తెల్లని మల్లెపూలతో కప్పారు. చాముండి నుంచి చంపకమాలలు తెచ్చారు. పసుపు కుంకుమలు ఆమె వళ్ళంతా జల్లారు. అప్పుడు దహన సంస్కారం చేయటానికి తీసుకువెళ్ళారు. నాకు గుండు చేయించారు. తిరిగి వచ్చిన తర్వాత ఏవో చిరుధాన్యాలు, తీపి తినిపించారు. అసలేం జరిగిందో నాకైతే తెలియదు. ఇప్పటికీ అర్థం కాలేదు. నాకు తెలుసు - నా తల్లి గౌరి చనిపోయిందని. కానీ నేను అనాథనెలా అవుతాను? నేనెప్పుడూ అనాథగానే మిగిలిపోతానా?

మా నాన్న మూడుసార్లు పెళ్ళి చేసుకున్నాడు. నా మారుటమ్మ చనిపోయింది. ఆమెకు ముగ్గురు సంతానం. సరోజ, సుకుమారి - పెద్దవాడు కపిల్. కొత్తగా వచ్చిన అమ్మ నన్ను చాలా ప్రేమించింది. ఆమె చిరునవ్వు లేకుండా మా ఇంటిని ఊహించలేను. ఇంట్లో ఇత్తడి పాత్రలలాగే మెరిసిపోయేది. అలాగే శబ్దాలు చేసేది, వినడానికి ఇంపుగా! ఆమె నిండుగా నవ్వితే ఆకర్ణాంతంగా వెలిగేది. నాకేది కావాలంటే అది ఇచ్చేది. అయినా నాకు అమ్మ గుర్తుకు వచ్చి ఏడుపు ఆగేది కాదు. అప్పుడు మా నాన్న కాలం చేశాడు. రెండో చంద్రమాసంలో మూడోరోజున పోయారు. అప్పుడు చిరుజల్లులు మొదలయ్యాయి.

నాన్న గురించి ఎక్కువ చెప్పలేను. ఆయనంటే నాకెప్పుడూ ప్రేమ లేదు. కానీ ఆయన తెల్లని చితాభస్మంగా మారిపోయినపుడు నాకు ఒక్కసారిగా ఆయనంటే ప్రేమ తెలిసింది. ఇప్పటికీ నాకు కలలొస్తుంటాయి. ఆ కలల్లో ఆయన "నాన్నా - ఎందుకురా నేనంటే నీకు ఇష్టం లేదు? నాకు పెద్ద కొడుకువు నీవే కదా" అంటుండేవాడు. నాకిప్పుడు పశ్చాత్తాపం లేదు. అసలదంటే ఏమిటో కూడా తెలియదు. ఎందుకంటే ముందు నేను 'మరణం' ఉందని, అదేమిటో నమ్మాలి కదా - అదే శాశ్వతమైన సత్యం - నేను మరణాన్ని నమ్మను. మరి ఎవరి కోసం ఏడవాలి? ఇప్పుడు నాన్నంటే ప్రేమ తెలుస్తోంది. ఆయనే కదా మాకు రక్షకుడు - దయాళువు - కానీ అమ్మ నన్ను రాజకుమారునిలా చూసిన విషయం ఆయనకెందుకు తెలియదు? నాది బ్రాహ్మణ పుట్టుక కదా - మరి రాజకుమారుణ్ణి ఎలా అవుతాను? రాజునెలా అవుతాను? అంతే ఒక దేశదిమ్మరిలా తిరిగాను - దేశాలు పట్టుకు పోయాను. కిట్టన్న తాత పులిమీద నుంచి దూకితే నేను ఎన్ని విమానాలు ఎక్కాలి - ఎన్ని కారు ప్రమాదాలలో బ్రతికాను - నేను జనారణ్యంలో ఎన్ని దారుణాలు ఎదుర్కొన్నాను - నన్ను ప్రేమించినవాళ్ళను ఎంతగా అపార్థం చేసుకున్నాను. నన్ను

ద్వేషించిన వాళ్ళను ఎంతగా అర్థం చేసుకున్నాను? చివరికి ఒంటరిగా మిగిలిపోయాను - నాలో ప్రేమ నింపుకుని - ఏకాకిగా నిలిచిపోయాను - ఎవరైనా ఒంటరితనంలో ప్రేమిస్తారు. ప్రేమిస్తే ఏకాకిగా ఉండిపోతాం - అందుకే మనకు మరణం రాదు.

ఒకసారి మార్చి నెలలో వారణాసి వెళ్ళాను. అప్పటికింకా చలిగాలి పూర్తిగా తగ్గలేదు. నాన్న పోగానే చిన్నమ్మ - విశాలాక్షిని, నా చిన్న తమ్ముణ్ణి తీసుకుని (అప్పటికి శ్రీధర్‌కి పదకొండు మాసాలే) - వారణాసి చేరాను. నాకప్పుడు ఇరవయి రెండేళ్ళు. అప్పటికే ఐరోపా వెళ్ళి వచ్చాను. నాన్నకు అనారోగ్యం అని తెలిసి తిరిగి వచ్చాను. చిన్నమ్మ నన్ను చూసి ఎంతో గర్వంగా దగ్గరకు తీసుకుంది - "చూడండి - పొడవుగా పవిత్రంగా రావిచెట్టులా ఉన్నాడు. చుట్టూ పాముపుట్టలు ఉన్నట్టున్నాయి. అతని చుట్టూ ప్రదక్షిణ చేస్తే మనకూ పుణ్యం వస్తుంది!" అని అంటూ. కానీ వారణాసి బ్రాహ్మణులకు ఇవన్నీ పట్టవు. వారికి మా ముత్తాత - తాతలు కూడా తెలుసు! ఆ విధంగా ఏడు తరాల రామకృష్ణయ్య, రంగన్న, మాధవ స్వామి, సోమసుందరయ్య, మంజప్ప, గంగాధరయ్య - వీరందరి సంతానం - కొడుకులు - వారి కొడుకు (కూతుళ్ళు తెలిసినట్లు లేదు) - అందుకని - వారి అభ్యంతరం - "చూడండి మీ పెద్దబ్బాయి - సముద్రాలు దాటాడు - కిరస్తానీ అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు - పైగా జంధ్యం కూడా లేదు. ఈ పిండప్రదానాలకు అతను అర్హత కోల్పోయాడ"ని - కరాఖండిగా చెప్పారు. పాపం చిన్నమ్మ యాభై వెండి రూపాయలు మూట తీసి ఇచ్చింది. అంతే, అన్నీ సర్దుకున్నాయి. శవాలు మోసే బ్రాహ్మణులు - "మేము నాలుగు భుజాలున్న మానవులం" - అంటూ నా చిన్ని తమ్ముడి పేరును బిగ్గరగా మంత్రాలతో కలిపి చదివారు. ఈ తంతు ఎంత త్వరగా ముగిసిపోతే అంత మంచిది. ఎందుకంటే - ఇది వారణాసి. ఇక్కడకు శవాలు ఎక్కువ వస్తాయి. వారి పూర్వీకులు - వారి పూర్వీకులు అంతా ఆకాశంలో చేరి చూస్తుంటారు. మీరు జాగ్రత్తగా గమనిస్తే పొరలు పొరలుగా కనిపిస్తారు కూడా. అదీ చంద్రగ్రహణం రోజున! తెల్లగా పాలిపోయి, పొడవుగా, బలహీనంగా తండ్రులు - తాతలు - ముత్తాతలు, అమ్మలు - అక్కలు - చెల్లెళ్ళు, అన్నలు - తమ్ముళ్ళు, అల్లుళ్ళు, స్నేహితులు, రాజులు - సన్యాసినులు, మేనమామలు - అందరు - అందరూ - ఈ వారణాసి గాలిలో గుంపులు గుంపులుగా చేరతారు. మీరు చూడవచ్చు - వారి గుంట కళ్ళతో - దూరదూరంగా ఉండి - వారి పిండాల కోసం అర్థిస్తుంటారు. మీరు సమర్పించే అన్నం ముద్దలు - తిలాదానాలు వారికి శాంతినిస్తాయి. కర్మకాండలు జరిపే మన పవిత్ర బ్రాహ్మణులూ శాంతిస్తారు.



వారి యాభై నాణాలు వారికి చేరాయి కదా - నా చిన్ని తమ్ముడికి ఇవేమీ అర్థం కావు. వాడికి పదకొండు నెలలే. చిన్నమ్మ దుఃఖిస్తుంటే, మరణ సత్యాన్ని అంగీకరించటానికి ఎంతో సమయం కావాలి - నా చిన్ని తమ్ముడు ఆమె చనుబాల కోసం ఏడుస్తున్నాడు! నేను ప్రశాంతంగా గంభీరంగా ప్రవహిస్తున్న గంగా నదిని చూస్తున్నాను. గంగ ఎప్పుడూ నూతనంగానే ఉంటుంది - పవిత్రంగానే ఉంటుంది - మా అమ్మలాగా. అప్పుడే గుడిగంటలు మ్రోగుతున్నాయి - కాకులు పిండాలు తినటానికి వాలుతున్నాయి. "అవిగో, ఆత్మలు వస్తున్నాయి - తృప్తిగా తింటున్నాయి" అంటున్నాడు బ్రాహ్మణుడు!

నా తమ్ముడు "కా... కా.." అని అరిచాడు. అంతలో కోతిని చూసి చిన్నమ్మ ఒడిలోకి చేరాడు. ఎంత సుకుమారంగా ఉన్నాడు! చిన్నమ్మ వాడిని ఒడిలోకి తీసుకుని పాలు కుడుపుతోంది! తద్దినపు బ్రాహ్మణులు ఇంకా ఏదో గొణుగుతూనే ఉన్నారు. అప్పటికే కొందరు గంగలో కాళ్లు కడుక్కొని వస్తున్నారు - చేతి ఉంగరాలు చూసుకుంటూ - ఇంకా మేము ఏమి ఇస్తామా అని ఆలోచిస్తుండాలి. మా పూర్వీకులు ఎంత ఇచ్చారో వాళ్ళకి తెలుసు! అందులో చాలా దూరం నుంచి వచ్చాం కదా - మొగలుల బంగారపు నాణాలా - ఈస్టిండియా వెండి నాణాలా? అని వారి ఆలోచన! క్వీన్ విక్టోరియా చిన్ని ముఖం - లావుపాటి బొమ్మతో కూడా ఉన్నాయి కదా! నాకైతే ఈ వెండి నాణాలను ఎగబడుతున్న కోతులకు వెయ్యాలని ఉంది. కానీ, చిన్నమ్మ ఉందిగా - తమ్ముణ్ణి నా చేతుల్లోకి తీసుకున్నాను - ఒక్కో రూపాయి వాడి చేతిలో పెట్టాను. వాడికి తనేమి చేస్తున్నాడో తెలిసినట్టు రూపాయి బిళ్ళలు వరసనే కూర్చున్న బ్రాహ్మణుల చేతిలో పెట్టాడు. వాడికి నాన్న చనిపోయినట్లు తెలిసినట్లుంది. ఒక్కసారిగా అరిచాడు. ప్రక్కనే నాన్న కనిపించినట్లు - అంటే శరీరంతో కాదు - నీలి మేఘంలా! చిన్నమ్మ తప్పకుండా నమ్ముతుంది - చిన్న పిల్లలకు చనిపోయినవాళ్ళు కనిపిస్తారని. ఎందుకంటే వాళ్ళు మనలాగా చెడిపోలేదు కదా! అక్కడితో చిన్నమ్మ కన్నీళ్ళు ఆగిపోయాయి. అప్పుడే మబ్బులు కమ్ముతున్నాయి.

మెట్లు దిగి హరిశ్చంద్ర ఘాట్‌కి వచ్చాం. పడవ మాట్లాడుకుని నదిలోకి ప్రవేశించాము. చిన్నమ్మకు తులసిదాసు రేవా రాజమందిరంలో *రామాయణం* రాశాడు అని చెప్పాను. రామానందస్వామి కబీర్‌ను తలమీద కొడుతూ తూలి రామ రామ అంటూ కబీర్ మీద పడిపోయాడు. అప్పుడు కబీర్ "స్వామీ! మీరే

నా గురువు - నేను మీ శిష్యుణ్ణి" అని అన్నాడు. ఆ విధంగా కబీరు, బట్టలు నేసే కబీరు, ఆయన శిష్యుడై గొప్ప కవిగా ప్రసిద్ధి పొందాడు. ఇంకా నది వాలుకు వెళ్ళాము. అదిగో, అక్కడే బుద్ధుడు నడిచాడు, అక్కడే తన భిక్షాపాత్రను శుద్ధి చేస్తున్నాడు. ఈ మెట్లెక్కి ఇక్కడే తన చతురార్య సత్యాలను, అష్టాంగ మార్గాన్ని బోధించాడు. కోరికలు తిరస్కరించాలని, సంతోషాన్ని బాధను వదిలివేయాలని - ఇవన్నీ నిర్వాణం మార్గంలో సాధించాలని బోధించాడు. చిన్నమ్మ అన్ని విన్నది. అర్థం చేసుకున్నట్లే ప్రశాంతంగా ఉంది. నా తమ్ముని పూరేకుల్లాంటి వేళ్ళతో ఆడుకుంటూ, అంతలో గాలిలో ఓ రామచిలక కనిపించింది. "చూడు - చూడు - రామా - అది రాముని చిలక కదూ?..." అంటూ పాడటం మొదలుపెట్టింది "ఓ చిలుకా - నా చిలుకా - రామ చిలుకా..." అంటూ. అంతలో నా చిన్ని తమ్ముడు ప్రశాంతంగా నిద్రలోకి జారుకున్నాడు.

నా తండ్రి నిజంగానే చనిపోయాడు - చిన్నమ్మ దుఃఖం చిరునవ్వులో కరిగిపోయింది. వారణాసిలో మరణం - ఒక భ్రమ అని అందరికీ తెలుసు. ఉదయపు పొగ మంచులా, గంగ ప్రవహిస్తూనే ఉంటుంది. సూర్యుడు రాగానే - ఓహ్! ఎంత వేడిగా ఉంటుంది?!

యూరోప్‌లో ఉన్న మిత్రులకు ఉత్తరాలు రాశాను - నాన్న పోయారని - గంగలో చితాభస్మాన్ని కలపటానికి వారణాసి వచ్చానని. ఈ నగరం ఎంత పవిత్రమో - అంత అసత్యం! ఎక్కడ నిజం మొదలవుతుందో ఎక్కడ భ్రమ అంతమవుతుందో తెలియదు. ఈ వారణాసి బ్రాహ్మణులు - కావుకావుమని అరుస్తూ పిండాల కోసం ఎగబడే కాకులా - లేక ప్రేమ మరొకరు ఇచ్చేది కాదు - తనకు తను పునీతుణ్ణి చేసుకునేదని నమ్మిన సాధుపుంగవులా - ఎంతో హుందాగా తమ నెగళ్ళలో తపస్సు చేసుకునేవారా?

చూడండి - త్రిశూలం ముందు పెట్టుకుని - పవిత్ర గ్రంథాలు చదువుతూ తన చీవరాలు దగ్గరలో గోడమీదో, కొమ్మమీదో ఎండలో రెపరెపలాడుతుంటే ఒక్కసారి ఒక గొడుగు నీడలో ఆరిపోతున్న మంట అతని కంటిలో వెలుగుతుంటే - అవును వారణాసిలో ఈ చిరుమంటలే వీరిని రక్షిస్తుంటాయి - వీరు కఠినాత్ములు - కర్కోటకులు కాదు - ప్రతి బ్రాహ్మణుడు ఒక శివుడే సుమా! ఒక్కసారి పైకి చూస్తే ఓ గుడిసాని సమ్మోహనంగా నవ్వుతూ కనిపిస్తుంది. తన వక్షస్థలాన్ని, కోమలమైన శరీరాంగాన్ని నదిలో పునీతం చేసుకుంటూ మరో ప్రియుని కోసం! వారణాసి వారకాంతలు ఎంతో అందగత్తెలు - వారు పార్వతీదేవిని పూజిస్తారు.

ఎప్పటికీ యౌవనంతో ఉండిపోవాలని! అందుకనే దామోదరగుప్తా తన గ్రంథాన్ని 'వారణాసి వేశ్యలు' అన్నారు - "ఓ గంగామాతా - నీవు పవిత్రతకు రూపం కదా - శివుని జటాజూటం నుంచి జాలువారుతున్నావు కదా!" అంటూ. ఇన్ని శరీరాలు - ఇన్ని శరీరాంగాలు - ఈ నదిలో తమ పాపాలను కడిగేసుకుంటుంటే ఇంక అవయవాలకు- అపవిత్రతకు అర్థం ఏముంది?

మరణం మమకారాలను సుందరంగా మార్చి వేస్తుంది. మరణం - వారకాంతల అవసరం తెలియజేస్తుంది. మళ్ళీ నాకు గుర్తు వస్తోంది కిట్టన్న తాత చెప్పింది - "అరే, మీ అమ్మది కోమల స్వరంరా - గుడిసాని చంద్రమ్మ గొంతులా మధురంగా ఉంటుందిరా" అన్న మాటలు!

అది యాభై యేళ్ల నాటి మాట - మైసూరులో.

మెదలీనా గుర్తొస్తుంది. ఎలా మర్చిపోతాను? ఎంతో దూరాన ఫ్రాన్సులో ఉంది. అసలామె కోలుకోలేదు. పియరీ మరణం ఆమెను క్రుంగదీసింది. వాడికి ఏడు నెలలు వచ్చేవరకు 'కృష్ణా!' అంటూ పిలిచింది. వాడికి దగ్గు మొదలైన దగ్గర్నుంచి ఆమెకు తెలిసిపోయింది. అవును - 'అమ్మ'కు అన్నీ ముఖ్యంగా తమ సంతానం ఎంత ప్రమాదంలో ఉందో తెలిసిపోతుంది. ఆ శనివారం కాలేజీ నుంచి తిరిగి వచ్చిన తనకు స్పష్టంగా అవగాహనకు వచ్చింది. నాలుగు వారాలు - మూడు వారాలు - రెండు వారాలు - అంతే - ఇక వారంలో ఆ పాపిష్టి జబ్బు కృష్ణను పొట్టనపెట్టుకుంది. బందోల్‌లో చిన్న ప్రసూతి ఆసుపత్రిలో వాడు జన్మించాడు. అప్పటి నుంచీ మెదలీనా వాడిమీదే ఆశలన్నీ పెట్టుకుంది. "చూడు రామా! వీడు నీ అంత అవ్వాలి - ఇంజనీర్ అవ్వాలి - ఇండియాలో వంతెనలు కట్టాలి" అంటుండేది. దుఃఖితులంతా వంతెనల గురించే ఆలోచిస్తారు. వాటినే ప్రేమిస్తారు. సత్యం మరో తీరంలో ఉంది. ఈ వారధి ఆ తీరానికి దారి అనుకుంటారు. "అవును, నువ్వు ఈసారి హడ్సన్‌లో పుడుదువుగాని" అనేవాణ్ణి!

ఆమెకు ఎన్నో పుస్తకాలు కొనిచ్చాను. అవన్నీ ప్రొరెన్సు సార్దినియా గురించి. అక్కడే రోమన్లు నిర్మించిన అందమైన వారధులున్నాయి ఎంతో అలంకరించి. ఒకరోజు సెయింట్ జుహైడ్ పోర్ట్ వారధి చూద్దాం - వెళ్దాం పద అని బయలుదేరదీసింది. అంత అర్థాంతరంగా కారులో బయలుదేరాం. ఆర్డెబీ ఆర్చి క్రింద నుంచి వెళుతూ కాహార్స్ దాటి పాంట్ డి వాలెంత్రీ చూపించాను. ఆమె దీనిని పట్టించుకోలేదు. రోమన్ వారధి చేరగానే "రామా! నాకు వెన్నులో వణుకు వస్తోంది" అంది. స్పెయిన్

అంతర్యుద్ధం కాలంలో ఆమె చిన్న పిల్ల. అప్పటి నుంచి స్పెయిన్ వెళ్ళనే లేదు. అక్కడ నుంచి కొండమీద అందమైన నగరం పావ్ చేరాం. అక్కడే హెన్రీ IV నిర్మించిన కాజిల్ ఉంది. బహుశా ఆ రాత్రే 'కృష్ణ' ఆమె గర్భంలో ప్రవేశించాడు.

నా బిడ్డను మోయాలని ఎంత తాపత్రయ పడింది - ఆ ముచ్చట ఏడు నెలలు కూడా నిలవలేదు. అప్పుడు మెదలీనాకు 26 ఏండ్లు. నాకు ఇరవయి ఒకటో యేడు. మేము కెయిన్ విశ్వవిద్యాలయంలో కలిశాం. ఆమె తలిదండ్రులు చిన్నప్పుడే పోయారు. ఆమెకు ఒక ఎస్టేట్ వదిలి మేనమామ ప్రాపకంలో పెరిగింది. ఆయన నార్మందీవాడు - ఆ ఎస్టేట్ ఏమయిందో ఈ పాటికి అర్థం అయి ఉంటుంది! మెదలీనా ఎంతో లావణ్యవతి. బంగారు రంగు జుత్తు - వాళ్ళ అమ్మ 'సవాయి' నుంచి వచ్చింది. మెదలీనా అవయవాలు ఎంత మార్దవంగా, స్వచ్ఛంగా ఉంటాయంటే అవి నిజమనిపించవు! అందుకేనేమో ఎవ్వరినీ పెళ్ళి చేసుకోలేదు - ఎవ్వరినీ ముట్టుకోలేదు - అనాఘ్రాత పుష్పంలా ఉండిపోయింది.

1943 చివర్లో నాజీల ఆక్రమణ సమయంలో జరిగిన సంఘటన చెప్పింది - ఓ జర్మన్ మిలిటరీ అధికారి ఆమె జుత్తును ముట్టుకోవడానికి ప్రయత్నించాడు - అతనికది ఒక వింతలా అనిపించింది - చక్కటి 'నార్డిక్ తలకట్టు' - అతని చేతులు ఆమె మోముకు దగ్గరగా వచ్చినపుడు ఆమె చిన్నగా నవ్వింది - అంతే! అతను మరి దగ్గరగా రాలేకపోయాడు. వెనుదిరిగి వెళ్ళిపోయాడు. దేవతలను మానవమాత్రులు ఏమి చేస్తారు? వంగి అభివాదం చేసి మరీ వెళ్ళిపోయాడు.

నాలో బ్రాహ్మణుణ్ణి స్పృశించింది. "ఈ స్పర్శ చాలా ముఖ్యం రామా - నాకు తెలుసు - నీ స్పర్శ నాకు కొత్త అనిపించలేదు" అంది! నన్ను ఆమె బంగారు వెంట్రుకలు సవరించనిచ్చింది. ఆమె శరీరం పాలరాతి కొండను తవ్వి తీసిన విగ్రహం -



వాటితోనే కదా మన చలవ మందిరాలు కట్టుకుంటాం. చల్లగా ప్రక్కన సరస్సులో - క్రింద నెమలి తిరుగుతుంటే చివరి సంగీత స్వరాలు గాలిలో తేలి వస్తుంటే ఒక్కసారిగా ఈ పాలరాతి మందిరం వెలుగుతో నిండిపోతుంది. మనలోకి మనం చూసుకోవటమే అన్వేషణ! దానినే మనం ఇష్టపడతాం. శంకరాచార్య చెప్పినట్లు ఈ ప్రపంచం అద్దంలో కనిపించే ఓ మహానగరం.

మెదలీనా - అంబర్ పాలరాతి రాజమందిరం - వెన్నెల్లో వెలిగిపోతున్న మందిరం.

ఈ వెలుగుల మార్మికత - ఎంతో లోతుగా వెళ్ళగలిగితే - అది నీలోకి నీ ప్రయాణం - ఆ విధంగా 'కృష్ణుడు రూపుతీసుకున్నాడు'.

రోమన్ వారథి ఎప్పటికీ దాటనే లేదు! లీనాకి ఈ వంతెనలంటే ఎంత భయమో! ఆమె ఇండియాలో పుట్టి ఉంటే తెలిసేది - మలబార్‌లో ఇలాంటి వంతెనలు దాటే ముందు మందుగుండు పేలుస్తారు - దయ్యాలు పారిపోవడానికి - ఒకవేళ వంతెనల మీద ఉంటే! ఎన్ని మందులు పేలిస్తే ఏమిటి - కృష్ణ తన జీవన వారథి దాటనేలేదు! బహుశా అందుకేనేమో - ఒక మూఢనమ్మకంతో కృష్ణ పేరు - జబ్బు బైట పడిన రెండో రోజే మార్చింది - పియరీ అని. ఆమె భారత స్త్రీలాగే బిడియస్తురాలు. నన్ను పేరు పెట్టి పిలవటానికి వెనకాడేది. "చూడు ప్రియా - హిందూ దేవుళ్ళ కోపగించవచ్చు - నువ్వు బ్రాహ్మణుడివి - నేను కాదు కదా - మన సంతానాన్ని 'కృష్ణ' అనే పవిత్రమైన పేరుతో పిలవనిస్తారా? అది ఎంత పవిత్ర నామం!" అంది. ఆ చిన్నారిని నేను పియరీ అని పిలిస్తే ఏమి అర్థం అవుతుంది? ఆమె నమ్మకాన్ని సమర్థిస్తూ అలాగే అన్నాను. కానీ మనం చేసేవన్నీ ఇలాంటి పిచ్చి నమ్మకాలే కదా - నిజానికి నా పేరు రామస్వామా? మెదలీనా పేరు మెదలీనానా? ఏమిటి అన్ని నమ్మకాలే... పియరీ ఆరోగ్యం బాగుపడలేదు - డాక్టర్ పిరీ మార్మసన్ - చాలా మంచి పిల్లల వైద్యుడు - అమెరికాలో చదివి వచ్చాడు - చాలా శ్రద్ధ తీసుకున్నాడు కూడా. కాని అమ్మవారు సోకిన తర్వాత - బ్రాంకో న్యూమోనియా ఎలా తగ్గుతుంది? మెదలీనాకు నా మీదా, నా శక్తుల మీదా ఎక్కువ నమ్మకం. వాణ్ణి తీసుకువచ్చి నా ఒడిలో పడుకోబెట్టింది. వాడు ఒక్కసారి ఒళ్ళు విరుచుకుని - ప్రశాంతంగా ఉండిపోయాడు - కనీసం ఏడవను కూడా లేదు! అంతే! పిల్లవాడి అంత్యక్రియలకు మాకు ప్రత్యేకమైన అనుమతి ఇచ్చారు. విల్లా సీ యానీ వెనక ఆలివ్ చెట్ల క్రింద సమాధి చేయటానికి - చాలా పెద్ద విల్లా - చల్లని ఉత్తరపు గాలి దక్షిణంగా విసురుగా వీస్తున్నప్పుడు వాంట్ విక్టరీ కనిపిస్తుంది. ఆ గాలి ఎంత ఉధృతంగా వీస్తుందంటే మన శరీరాలే ఎగిరిపోతాయి - కోటు - మఫ్లర్ అన్నీ. చివరికి నీ మనసు కూడా తేలిపోయి 'మాంట్ విక్టరీ'పైన కూర్చుంటుంది. ఆక్స్‌లో చెప్పుకుంటారు - "ప్రేతాత్మలు ఈ చర్చి టవర్ మీద సేదతీరతాయ"ని! ముఖ్యంగా చిన్నారులు - కన్యలు! వారి కోసం ఒక పాట కూడా ఉంది. అందుకే మెదలీనా - రోజూ వెళ్ళేది - కొవ్వొత్తులు మేరీమాతకు వెలిగించేది. తరువాత తన సుకుమారమైన చేతులతో నన్ను నిమిరేది. ఆమె ఉనికి నాకు ఎంతో దూరాన ఉన్నట్లుండేది. ఎంత దూరమంటే

ఆమె చేరువ - స్పర్శ - వాసన కూడా నాకు తెలిసేది కాదు. చెంతనున్నా మన్వంతరాల దూరాన ఉండేది! ఇక్కడ ఏ వారధీ లేదు - అన్ని స్పెయిన్ వైపు ఉన్నాయి! అప్పుడే నాన్నకు అనారోగ్యం అని కబురు వచ్చింది. నన్ను రమ్మని పిలుపు చేరింది. మెదలీనా - "వెళ్ళు - ఇక్కడ విషయాల గురించి నువ్వు బాధపడకు - నేను ధైర్యంగానే ఉంటాను" అంది. నాకు కూడా వెళ్ళడమే మంచిదనిపించింది. ఆమె స్కూల్‌కు వెళ్ళి పాఠాలు చెప్పుకుంటుంది. నేను ఇంటి దగ్గర అన్నీ చక్కబెట్టుకు రావచ్చు. అమ్మ ఆస్తి అంతా ఎస్టేట్ దివాను సుందరయ్య నానా రకాలుగా చేశాడు. అద్దెలు వసూలు చేయటం లేదు. దస్తావేజులన్నీ కంగాళిగా ఉన్నాయి. నేను కూడా విశ్వవిద్యాలయానికి వెళ్ళి కలవాలి. నా కోసం ఉద్యోగం అలాగే ఉంచారు. ఇప్పటివరకూ నాకు స్కాలర్‌షిప్ ఇస్తూనే ఉన్నారు. డాక్టరేట్ అయిపోగానే మెదలీనాను ఇండియా - ఇంటికి తీసుకు రావచ్చు. ప్రతిరోజూ కాలేజీకి వెళ్లి ఐరోపా సాంస్కృతిక వైభవాన్ని విద్యార్థులకు తెలియజేయవచ్చు. నేను చరిత్రలో పరిశోధన చేస్తున్నాను. 'అల్బీజెన్సియన్' నాస్తికత్వంలో పరిశోధన!

బోగో మోలైట్సునీ డ్రూజెస్‌నీ లంకె పెట్టాలని ప్రయత్నిస్తున్నా - ఆ విధంగా వీరి మూలాలు భారత్‌లో ఉండవచ్చుని, జైనులు కాని, బౌద్ధం కాని, కాథర్ల్‌కి సంబంధించి స్వచ్ఛమైన మతాలంటే నాకు ప్రియమైనవి. మెదలీనా కూడా ఈ విషయంలో కల్పించుకుని నాకు సహాయం చేస్తున్నది. ఆమెకు స్పర్శ పడదు అని చెప్పాను కదా - కాథర్లు అస్పృశ్యులు. మరో అర్థంలో - వారి పవిత్రతను ఆమె ఎంతో ఇష్టపడింది. నన్ను బ్రహ్మచర్యం పాటించమని - మా పూర్వీకులలాగానే ఎంతో పోరింది. నా బ్రాహ్మణ మూలాలు ఓడిపోవడానికి ఇష్టపడలేదు సరికదా - గర్వంగా తలచాను. ఆ విధంగా ఆ వారధి అక్కడే ఉంది - కానీ నేను ఎప్పుడూ అది దాటి స్పెయిన్ వైపు వెళ్ళలేదు.

ఇండియా అద్భుతంగా ఉంది. అమృత పానంలా - విజేతగా - అమరత్వం కోసం సేవించే చిక్కటి రసంలా ఉంది. అరుదైన మల్లెలు - ఇంకా అరుదైన బంగారు పూల నుంచి తీసి ఎక్కడో నాగలోకం నుంచి జలకన్య - లేక వీరుడో పాత్రలో నింపి మరణాన్ని జయించటానికి, రాజ్యాల్ని పాలించటానికి తెచ్చిన శక్తినిచ్చే అమృత పానంలా అనిపించింది. మరి నేనెలా చనిపోతాను - ఇది నాకు తెలుసు - ఈ ప్రపంచాన్ని జయించటానికి ఉన్నాను - అది మరణమైనా సరే. చివరికి మా నాన్న మరణాన్ని చూసిన తర్వాత కూడా నా నమ్మకం సడలలేదు. 'నేను వెళ్తున్నాను' అన్నాడు - మా వంక చూసి. ఆయన ఎడమ కంటి చివర కాస్త తడి.

అంతే! ప్రశాంతంగా శాశ్వతంగా నిద్రలోకి జారుకున్నాడు! ఈ మట్టి వాసన ఎంతో మధురంగా ఉంది! మెదలీనా ఎంతో దూరాన ఉంది. చిన్నమ్మ - మెదలీనా ఫోటోను చూసి, కృష్ణ ఫోటో చూసి మౌనంగానే ఉండిపోయింది. ఆమె పూజామందిరపు గదిలోకి వెళ్ళి *రామాయణ* కావ్యం మీద పూలు ఉంచింది. అసలు ఈ విషయం ఎప్పుడూ మాట్లాడనేలేదు - నన్ను చూసినపుడు- “చావుపుటకలు మన భ్రమలు రామా” అనేది. నా కష్టం ముందు ఆమె వైధవ్యం చిన్నబోయినట్లు తలచింది. రోజులు గడిచేకొద్దీ ఆమె సంతోషంగా ఉండగలుగుతుంది. ఎప్పుడో మూల పెట్టిన వీణ తీసి పాడటం మొదలుపెట్టింది. అప్పటికి నాన్న ఇంకా ప్రాణంతోనే ఉన్నాడు. నీ పెద్ద కొడుక్కి నీ సంగీత పాండిత్యం చూపిస్తున్నావా అని బలహీనంగా నవ్వాడు.

మా తాత - “నాన్నకి ఎంతో గంభీరమైన కంఠస్వరం ఉండేది. ఆయన యౌవనంలో - పాడేందుకు సన్నగా మధురంగా - తర్వాత ఆయన గణిత శాస్త్రంలో పడి పూర్తిగా మునిగిపోయాడు, అంకెల్లో. అవి తిరుగు ముఖాలు వేసుకుని వెనక్కు తీసుకుపోతాయి. ఒక శూన్య ప్రపంచంలోనికి” అనేవాడు తాత. “ఆ తర్వాత మీ నాన్న ఒక కీర్తన కూడా పాడలేదు. ఆయన పురందరదాసు కీర్తనలు పాడినపుడు నువ్వు విని ఉండాల్సింది” నేను ఎప్పుడూ వినలేదు. ఆయన మంద్ర స్వరం గంభీరంగా ఉండేది. కానీ, తర్వాత ఆయన చేతిలో పెన్సిల్ మాత్రమే చూశాను. ఆయన గొప్ప గణితజ్ఞుడు. ఏదైనా లెక్క రాకపోతే సంస్కృతం - పాణినిని చూసేవాడు. తర్వాత భర్తృహరిని కూడా బాగా చదివాడు. ఆయనకు తత్త్వశాస్త్రం అంటే ఏమాత్రం ఇష్టం లేదు. అది స్వర్గంలో తిండివంటలు - పిండివంటలు చెప్పేది. మనం దోసకాయలు తిన్నా - గుమ్మడికాయ తిన్నా తేడా లేదు. ఆకలికి తింటాం - అంతే - అనేవాడు. ఆయన గణిత శాస్త్ర విద్యను - పాండిత్యాన్ని మరింత ముందుకు తీసుకు వెళ్ళే ప్రయత్నం నేను చేయలేదని బాధపడేవాడు నాన్న!

“ఈ ఆంగ్లేయులు అంత తేలిగ్గా మన దేశం వదిలి పోరు. వీరిని మన మేథాశక్తితోనే ఓడించాలి. ఆ విధంగానే సిగ్గుపడేలా చెయ్యాలి. అందుకు గణితం తప్ప మరో మార్గం ఏముంది చెప్పు?” అనేవాడు. యూలర్‌ని, ఆయన ఆల్జీబ్రా సూత్రాల్ని దాని ద్వారా దేవుని ఉనికిని నాన్న ఎంతో ఉన్నతంగా భావించేవాడు! నాన్న - రోజర్ - రామానుజం సామ్యాలు - టేరింగ్ ప్రశ్నలూ! వీటిమీద చేసిన కృషి ప్రపంచం అంగీకరించినపుడు మన దేశం స్వాతంత్ర్యానికి మరింత దగ్గరవుతోంది అనేవాడు. నేను ‘అల్బిజెన్సియన్ నాస్తికత’ పరిశోధనాంశంగా ఎంచుకున్నందుకు సంతోషించాడు. యూరోపియన్లకు - భారతదేశాన్ని మరింత యధార్థంగా చూపించటానికి ఇదొక సాధనం అనేవాడు. ఆయన ఎప్పుడూ యూరోప్ వెళ్లలేదు

- తాతగారికి తన ఇంటి పెద్దల్లుడు సముద్రాలు దాటి వెళ్ళడం ఇష్టం లేదు. ఆయన కొన్నాళ్ళకు తన అభిప్రాయాన్ని మార్చుకుని అంగీకరించినప్పటికీ ఇంటి దగ్గర సమస్యలు పెరిగిపోయి బాధ్యతలు మరింత ఎక్కువై ఆయన ప్రయాణం జరగలేదు. అయినా నాన్నకు ప్రయాణాలంటే పెద్దగా ఇష్టం లేదు. ఆయన తరం బ్రాహ్మణుల్లాగానే ఆయనా సంధ్యావందనాలు, పవిత్ర స్నానాలకు దూరమవటం ఇష్టం లేదు. బ్రాహ్మణ యువతుల ఉదయ గానాల సంగీతంతో, కర్పూర పరిమళాల ప్రాతఃపవనాలలో, వెల్లుల్లి సాంబ్రాణి ధూపాల తెరలలో ఆయనకు ఎంతో ప్రశాంతత దొరికేది - ఆ వాతావరణంలోనే కదా - ఇంటి ఆడపడుచు ప్రసూతికి ఏతెంచేది?

నా పెళ్ళి ఆయనకు ఇష్టం లేదు. ఎందుకంటే నా భార్య ఈ మంగళ హారతి పాడలేదు కదా! కాని ప్రపంచానికి తన విద్యాధికురాలయిన కోడలి గురించి గొప్పగా చెప్పుకునేవాడు! ఆయన ముందు బల్లమీద నాదీ - మెదలీనాది ఫోటో పెట్టుకున్నాడు!

ఆయనెప్పుడూ తను మరణిస్తానని అనుకోలేదు. అందుకని తన అంత్యక్రియల సంగతి ఆలోచించనే లేదు. బహుశా తాతగారు నిర్ణయించే ఉంటారు. ఎందుకంటే నేను ఆయన దగ్గరకు సలహా కోసం వెళ్ళినప్పుడు - అన్ని వివరాలు చెప్పారు. "అవును - వారణాసిలోనే జరగాలి - అదీ చిన్న తమ్ముడు పేరు మీద - అరే! నువ్వంటే ప్రేమ లేక కాదు రామా, నా కూతురు పెద్ద కొడుకైన నీ మీద ప్రేమ లేకుండా ఎందుకుంటుంది? కానీ మన పెద్దలు పెట్టిన సంప్రదాయాన్ని మనం కాదనకూడదు. అవి తరతరాలుగా వస్తున్నాయి మరి! ఇవ్వాళ ఒకరి కోసం ఎందుకు మార్చాలి? అనవసర విషయాలకు ఎక్కువ ప్రాధాన్యత ఎందుకివ్వాలి? అరే! దేవుడు ఏదైనా సూత్రంలోనో - సిద్ధాంతంలోనో ఉన్నాడా? నా ప్రేమ ఈ అంత్యక్రియలకే పరిమితమా? నీలాగా నువ్వు ఉండు, రామా - నీవు తాత్త్విక సిద్ధాంతాలపై చేస్తున్న పరిశోధన చాలా ఉత్తమమైంది. ఈ ఛాందస మతాలను నాలాంటి ముసలివాళ్ళకి వదిలిపెట్టు" అని ముగించాడు. నేను ఆయనకు పాదాభివందనం చేశాను. ఎంత గొప్పగా, ఎంత సాధారణంగా ఉన్నాడీయన, తాతగారు! కాని నా బాబాయిలతో ఇది అంత సాధారణంగా లేదు - అది మరొక కథ!

ఆ రకంగా వారణాసి ముందుగానే స్థిరపడిపోయింది. చిన్నమ్మతో పడవలో ప్రయాణం. శ్రీధర్ నా ఒడిలో ఉన్నాడు. నాకు మెదలీనా గుర్తు వస్తోంది. సీ యాని విల్లాలో ఎడమవైపు కిటికీ దగ్గర కూర్చుంటుంది. బహుశా నా చొక్కా గుండీ కుడుతుందేమో! సూర్యోదయం, అస్తమయాలు చూస్తూ చలికాలం గడిపేస్తుంది. అప్పుడు కూడా ఇల్లంతా సర్దాలి. ఆ సమయానికి నేను అక్కడ చేరిపోతాను. అది

ఆమెకు సంతోషాన్నిస్తుందా? కాని తప్పదు. జరగాలి అలాగే! ఈ జీవన వలయంలో నేను భాగమే. జులై 14 రాగానే మరో రెండు వారాలు ఇంటిని సరిచేస్తుంది. నెలాఖరువరకు. అప్పుడే మేము పర్వత ప్రాంతాలకు ఓ నెల రోజులు వెళ్తాము. తర్వాత మూడు రోజులు ఆమె బాబాయిని చూస్తాం. ఆ తర్వాత ఒక వారం పారిస్‌లో గడుపుతాము. సెప్టెంబర్ మూడో వారానికి అక్స్ ఇంటికి చేరిపోతాం. అక్టోబర్ ఒకటి నుంచి కాలేజీ మొదలవుతుంది. ఆమె ఉదయం లేవగానే నన్నే చూస్తుంది కదా!

అనురాగం - మనస్సులోని భావమే - మనోఫలకంపై ఒక బిందువు. ప్రేమ హృదయ గోళంపై ఒక బిందువు కాదా? ఆమెకు జాగ్రఫీ చాలా సత్యమూ - ఘనమైందని నమ్ముతుంది - భూమి మట్టి పొరల వాసన ఆమెకు బాగా తెలుసు.

శబ్దం - ఆకారం - స్పర్శ - రుచి - వాసన ఇవన్నీ సత్యాలే కదా - వీటిని దాటి ఎక్కడికి వెళ్తావు? నువ్వు ఎంత ప్రయత్నించినా వెళ్లలేవు కూడా.

ఆమె సవాయ్ వంశమూలాలు - పీగ్ మాంటిస్‌తో కలగలసిపోతూ ఉండాలి. లేకపోతే చారిటీ నుంచి వచ్చిన ఈమెకు లావెండర్ - పిప్పర్‌మెంట్ కలిసిపోయిన సువాసన ఇంకా ఆమె జుత్తులో ఉందేమిటి? చిన్నప్పుడు ఆమెకు బుల్ ఫైట్ అంటే చాలా ఇష్టం. అప్పటి మెటాడర్ డాక్ అబావెజ్ బొమ్మ గోడకు తగిలించుకుంది కూడా - కాని జంతువుల్ని చంపటం ఆమెకు ఏ మాత్రం నచ్చలేదు. నాతోపాటు శాకాహారిగా మారటానికి ఎక్కువ శ్రమ పడలేదు కూడా. కాని ఏదైనా అన్యాయం జరిగినపుడు లేదా చూసినపుడు ఆమె రక్తం మరిగిపోయేది. కోపంతో ఎర్రబడిపోయేది. నెమ్మదిగా చల్లబడి ఓ గంటసేపు కన్నీరు పెట్టుకునేది. ఆమె నియంతృత్వానికి వ్యతిరేకమైనా కమ్యూనిస్టులంటే సానుభూతి! నన్ను చేసుకోవటంలో ఇండియాకు బ్రిటీష్ వల్ల జరిగిన అన్యాయాన్ని వ్యతిరేకించినట్లే - ఎంతో కొంత తనవంతు ఉడతాసాయం అనుకుంది. భారత ప్రజలకు తన మద్దతు తెలిపినట్లే అనుకుంది.

గ్రీకు పుస్తకాలు చదివినపుడు తాను ఆ తరంలో ఎందుకు పుట్టలేదు - ఎథీనియన్ రిపబ్లికన్‌లో (వాలెరీ సాహసాలు) అని వాపోయేది. తర్వాత రోమోరోలా చదివినపుడు ఆయన రాసిన వివేకానంద, రామకృష్ణ పరమహంస - ఈ రుషుల ముందు గ్రీకులు నీరుగారిపోయేవారు. యూరోపియన్లు, గ్రీకులకంటే అల్బిజెన్సియన్ వినయ సంపద చాలా గొప్పదనిపించింది. అక్కడ నుంచి సహజమైన భారత సంప్రదాయాలపై మర్యాద పెంచుకుంది. ఆమె కాలేజీలో గ్రీకు పురాణాలు - చరిత్ర బోధించేది. తర్వాత నేను భారత చరిత్ర చెప్పినపుడు ఆమె సంతోషానికి

అంతు లేదు. క్రీస్తు మూలాలు హోలీ గ్రెయిల్ పై పరిశోధన మొదలుపెట్టింది. 'హోలీ గ్రెయిల్'కు బౌద్ధానికి దగ్గర సంబంధం ఉందని నమ్మకం ఒకటుంది. 'క్రీస్తు వాడిన పాత్ర - బుద్ధునిదేనని గాఢమైన విశ్వాసం - ఆ పాత్ర నెస్టోరియన్లు సంపాదించి, పర్షియా తీసుకు వచ్చినట్లు, ఆ తర్వాత 'మనిషేయిజమ్'తో కలగలసి 'హోలీ గ్రెయిల్'గా మారిపోయిందని మధ్య యుగాల్లో ఈ గాథ! మెదలీనాకు ఈ భౌగోళిక కలగలపు చాలా ఇష్టమైనది. ఈ దేశాల సరిహద్దులన్ని మనం పెట్టుకున్నవి. అవి ప్రకృతి సిద్ధం కాదు కదా! ఈ భూమి అంతా ఒక భౌగోళిక పదార్థమే - ఒకే నేల - ఒకే మట్టి!

నేను పుట్టిన దేశంలో గతం - వర్తమానం కలగలిసి ప్రవహిస్తాయి. ఈ గంగా నదిలాగా - వంశాలు - అనుభవాలు విడదీయరానివి - విడిపోనివి! (ఈ గంగానది దగ్గర్లోనే కదా!) తన భిక్షాపాత్రతో కరుణామయుడు - సరయూ తీరానికి వచ్చాడు! అందుకే నాకు దూరకాలాలపై అంతగా నమ్మకం లేదు. నాకు బాగా గుర్తు 1946లో యూరోప్ వచ్చినపుడు నేపుల్స్‌లో దిగాను. నాకేమీ ఇది నా యింటికి దూరమో, కొత్తగానో అనిపించలేదు. తర్వాత మెదలీనా బంగారు కురుల్లో నా ముఖాన్ని దాచుకున్నపుడు గాఢమైన వగరు వాసన - ఆఘ్రాణించినపుడు అశ్వగంధంలాగా అనిపించింది. నేను జన్మతః ధనుర్రాశి! నాకు తెలియందంటూ లేదనేది నా నమ్మకం - నా బ్రహ్మ జ్ఞానం - నా వంశ గౌరవం అలాంటిదని నమ్మేవాణ్ణి. ఆమె శయ్యపై ఆమె ప్రక్కనే ఉన్నప్పుడు అనేది -

"చూడు - నా పాలిపోయిన రంగు - నీది బంగారు ఛాయ - ఆ దేశంలో పుట్టటం ఎంత అదృష్టం - సంప్రదాయం ఇదే కదా సంస్కృతి - సంపద" అనేది. "తరతరాలుగా మీ శరీరాలు ఒక రాచరికపు మార్దవంతో రాటుదేలిపోయాయి" - అంటుంటే - నాకైతే - ఏమీ తెలిసేది కాదు.

నాకు తెలిసింది - నేను మా నాన్నకు పెద్ద కొడుకునని - ఆయన మా తాత - రామకృష్ణయ్యకు - ఆయన పేరు మైసూరులో ఎక్కడైనా ఎవరికైనా చెప్పండి - చివరికి మహారాజుకైనా - మీకు లభించే గౌరవానికి ఆశ్చర్యపోవాలంతే - మీకు శాలువా కప్పి కొబ్బరి బోండం ఇచ్చి భోజనం పెట్టి మర్యాద చేసి పంపిస్తారు. నాకు ఈ వ్యత్యాసాలన్నీ మనం కల్పించుకుంటున్నవే అనుకుంటాను - అందుకే మెదలీనా అంటే అంత ఇష్టం - ఆమె ప్రత్యేకం! అలాగే చిన్నమ్మ! ఇప్పుడు ఈ నావలో నా ఎదురుగా కూర్చొని ఉంది - ఈమె నా అమ్మ కాదు - కాని ప్రత్యేకమే - ఈమెని ప్రేమించకుండా ఎలా ఉంటాను?

ఈ ప్రత్యేకతలోనే అంగీకారం ఉంది. మనల్ని మనం అంగీకరించటం! సత్యాన్ని దర్శించడం - ఈ దృష్టి ప్రేమించటానికి అవకాశం కల్పిస్తోంది!

ఆ సాయంత్రం త్వరగానే చీకటి కమ్ముకొస్తోంది. చల్లని గాలి తెరచాపలను నింపుతోంది. మా పడవ ఏటికెదురు వెళుతోంది. కొన్ని విషయాలలో మెదలీనా - చిన్నమ్మలాగానే అనిపించేది. వారిద్దరికీ బిడియమే అలంకారం! ఇద్దరూ ఎక్కువగా మౌనంగానే ఉంటారు. తాము ప్రేమించిన విషయాలన్నీ అవసరమైనదానికంటే ఎక్కువగా గుర్తుకు తెచ్చుకుంటారు! జీవితమంటే ఆడుతూ - పాడుతూ గడిచిపోయేది కాదు - ఎన్నో ఒడిదుడుకులతో నిండినది. ఇద్దరికీ తెలుసు! మహా అయితే ఏదో పెళ్ళి ముచ్చట్లు, అప్పుడప్పుడు ఉండవచ్చు. ఎప్పుడైనా ఆ వంతెన దాటనూ వచ్చు. కానీ మళ్ళీ మట్టిలో కాలు పెట్టాలనీ, బహుశా వైధవ్యం ఎదురు చూస్తుందనీ ఇద్దరికీ తెలుసు. ఆ రోజు నాకు బాగా గుర్తుంది. అది మా పెళ్ళి మూడు రోజుల ముందు. మేము రోమ్ వెళ్ళి వచ్చాము. అంతకంటే పెద్దగా చేసే పనీలేదు. మెదలీనా చాలా విచారంగా కనిపించింది.

"నాకు చాలా భయంగా ఉంది. నాలో ఎప్పుడూ ఏదో అనుమానం పీడిస్తోంది. ఒకవేళ నిన్ను పోగొట్టుకుంటానేమోనని. నేను విధవగా మిగిలిపోతానని భయంగా ఉంది" అంటూ ప్రాధేయపడింది. "నన్ను పెళ్ళి చేసుకోకు. మనం దూరంగా ఉందాం. ఇంకా మనకు సమయం మించిపోలేదు" అంటూ విచారంలో మునిగిపోయింది. అప్పటికి ఆమెకు 26 ఏళ్ళు. "నేను చావును లెక్కచేయను (అలాంటి సమయాల్లో సాధారణంగా ఉండే ఆత్మవిశ్వాసంతో) - నీవు అనుమతి ఇచ్చేవరకూ నేను మరణించను, నన్ను నమ్ము" అన్నాను. ఆమె నావంక చూసింది. ఏదో దేవుణ్ణి చూసినట్లు. తర్వాత నవ్వుతూ అక్కడ ఉన్న విగ్రహాన్ని చూపింది. అది బ్రూగెస్ హెన్రెట్టి ది. ఆమె కొడుకు, చార్లెస్ స్పానిష్ యుద్ధాలలో వీరునిగా నిలిచాడు. తన తల్లి కోసం విగ్రహాన్ని నిలబెట్టాడు. బర్గుండీ కిరీటాన్ని చార్లెస్ తలమీదపెట్టి ఆమె ఒడిలో ఉన్నట్లు! తర్వాత పారిస్ చేరాం. అక్కడే, 'ఏడవ ఎరోన్డిస్‌మెంట్ మేరీ' సమక్షంలో పెళ్ళి చేసుకున్నాం. అప్పుడు నేను సెయింట్ డొమినిస్ వీధిలో ఉండేవాణ్ణి. ఆమె కోసం 'బ్రూగెస్' గ్రంథాన్ని కొన్నాను. ఇప్పటికీ నా దగ్గర ఉంది. ఘోర విపత్తు సంభవించిన తర్వాత మిగిలిన వాటిలో అదీ ఒకటి! బ్రూగెస్ (Bruges) చాలా అందమైన పట్టణం. కాలవలు, నీట సెలయేళ్ళతో ఎంతో మనోహరంగా ఉంది. కాని 'బ్రూగెస్ హెన్రెట్' లావుపాటి వికారమైన విగ్రహ రూపం - ఏదో మార్మికంగా జరగని - వివాహానికి సాక్షిగా నిలిచింది!

చిన్నమ్మ ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. శంకర నిర్వాణాష్టకం పాడి వినిపిస్తోంది. ఇది నా చిన్నప్పుడు కిట్టన్న తాత కాశీ నుంచి తిరిగి వచ్చి నాకు నేర్పించాడు. 'మనోబుద్ధి అహంకారా' అని మొదలుపెట్టేవాణ్ణి. మంద్ర స్వరంతో స్పష్టంగా చదివేవాణ్ణి - నేను సంస్కృతం చదివాను కదా! చిన్నమ్మ - నా ఉచ్చారణలు అనుసరించేది. శివోహం - శివోహం - అంటూ నాతో కలిసి పాడేది. ఇప్పటికే కాశీలో దీపాలన్నీ వెలుగుతున్నాయి. గంగా ఘాట్‌లలో ఎన్నో చితులు మండుతున్నాయి. ఇదంతా చాలా సహజంగా వెలుగు విరజిమ్ముతున్నట్లు ఉన్నది. అప్పటికే కోతులన్నీ చెట్ల మీదకు చేరాయి. సాధువులు తమ భోజనాలకు కూర్చుని ఉంటారు. అన్ని ఆలయాల నుంచీ - సాయంత్రపు సమయానికి ఢమరుక శబ్దాలు వినిపిస్తున్నాయి. వీటన్నిటి మధ్య నుంచి డల్‌హౌస్ వంతెన మీద మొగల్ సరాయ్ వెళ్తున్న కలకత్తా మెయిలు శబ్దం వినపడుతోంది. మరో తీరంలో - రామ్‌నగర్ ఉంది. అది రాముని నగరం నిజానికి! ప్రతి సంవత్సరం రాములవారి పండగ చూసేందుకు జనాలు వస్తుంటారు. ఆడవారు - మగవారు - రాజ కుటుంబాలవారు - ఏనుగులు, గుర్రాలు రామాయణ గాధ ఆడేవారు. చిన్నమ్మకు ఆ పండగ చూడలేకపోయినందుకు విచారంగా ఉంది. "నేను త్వరలోనే వచ్చి నిన్ను తీర్ధయాత్రలకు తీసుకు వెళ్తాను చిన్నమ్మా" అని చెప్పాను. బద్రీనాథ్, కైలాస్ పర్వతం కూడా వెళ్దాం అని వాగ్దానం చేశాను. కానీ నాకు హిమాలయాలు పడవని తెలుసు.

శ్రీధర్ నిద్ర లేచి మళ్ళీ పాలు తాగటం మొదలుపెట్టాడు. "కైలాసపురనాథ - కాలభైరవం భజే" అంటూ పాడటం మొదలుపెట్టాను.

కాలభైరవ నాథుడు - కాశీనాథీశుడు - అనంత సూర్య ప్రకాశమానుడు-

భవసాగరం దాటించే రక్షకుడు- నీలకంఠుడు - త్రినేత్రుడు - సకలవర ప్రదాత - కమలలో నేత్రుడు - మరణాధీశుడు - అనంతుడు - త్రిశూలపాణి - కంకాళధారుడు - కాశికా పురానాథుడు - కాలభైరవం భజే-

వారణాసి అనంతమైనది - ఇక్కడ మరణించినవారు - మరణించరు - జీవిస్తున్నవారు - జీవించీ ఉండరు! చనిపోయినవారు గంగా తీరానికి వచ్చి కేళీవిలాసంలో ఉంటారు. బ్రతికి ఉన్నవాళ్ళు పిండాలు పెట్టి - వారణాసి రాత్రి వెలుగుల భ్రమలో తిరుగుతుంటారు! చిన్నమ్మ అడిగితే దక్షిణామూర్తి స్తోత్రం గొంతెత్తి పాడాను. బహుశా ఈ సాయంత్రపు వాతావరణం - మరేదో తెలియరానిది నా హృదయాన్ని తాకింది. నా కన్నీటి చుక్కలు చెక్కిళ్ళ పైగా రాలాయి - పవిత్రతే - సంతోషం - ఆనందమే పునీతం! అందుకే బ్రాహ్మణుడు సంతోషంగా ఉండాలి -

నాలో నేను నవ్వుకున్నాను - ఇది పాస్కల్ చెప్పిన దానికి ఎంత భిన్నమైనది! నువ్వు అనంతంలోకి ప్రయాణం చేయాలనుకుంటే ఇదిగో ఇప్పుడు దీపాలతో వెలిగి అద్దంలా మెరిసిపోతున్న నగరాన్ని చూడు; నువ్వు అందులోకి ప్రయాణించాలంటే ఆ అద్దాల్ని పగలగొట్టాలి - అది సాధ్యమే - ఆ సత్యాన్ని సాధించవచ్చు - సత్యం మాదిరిగానే. కానీ అసత్యంలో నుంచి - సత్యానికి ప్రయాణించాలంటే ఈ అద్దాల నగరంలో కనిపించే దారుల్లో నడవాలి - దుశ్శాసనుడెవరు? మనిషిలోని భ్రమ - భ్రాంతి! మధ్యతరగతి మానవునికి, ఈ ప్రపంచం - ఈ బాంక్, వివాహపుటుంగరం, నోటరీ అన్నీ సత్యాలే.

మెదలీనా - నేనూ చివరి వేయి ఫ్రాంకులు ఖర్చు పెట్టాం - రెండు సన్నపాటి బంగారపుటుంగరాలు కొనటానికి! పెళ్ళి ముందు రోజు - ఇప్పటికీ నాకు గుర్తు - 3,700 ఫ్రాంకులు ఖరీదు ఒక్కటి - అప్పటికి 9 వేల ఫ్రాంకులే ఉన్నాయి. సెయింట్ మైకేల్ బోలివార్డ్ వెళ్ళాం - మాన్సియిర్ వీధిలో ఇండో - చైనా రెస్టారెంట్లో తినటానికి - అన్నమే తిన్నాం - మెదలీనా ఎంతో సంతోషించింది - ఇండియాని ఆ విధంగా గుర్తించినందుకు! మర్నాడు పదకొండు గంటలకు - ఇద్దరు సాక్షులతో 'మేరీ'కి వెళ్ళాం. ఒకరు కౌంటు ఆర్ - ఈయన డీ-బోగ్లీతో పనిచేసి - మళ్ళీ హంగేరీ వెళ్ళలేకపోయాడు. అక్కడ కమ్యూనిస్టు విప్లవం మూలంగా - ఆ విధంగా పారిస్‌లో ఉండిపోయాడు. రెండో రోజు - మెదలీనా తరపున - రోలాన్ - ఆమె కజిన్ - ఈయన ఫ్రెంచ్ నౌకాదళంలో ఆఫీసరు - ఆయన ఎంతో ప్రపంచం చూశాడు - నాలాంటి భారతీయుడు ఆయనకు కొత్త కాదు. ఆయనకు తిరుచునాపల్లి కూడా తెలుసు. ఆయన పెళపెళలాడే యూనిఫారంలో పెళ్ళికి వచ్చాడు.

ఈ అసంబద్ధపు వివాహాన్ని ఆయన ఏమాత్రం సమర్థించలేదు.

మెదలీనాని పెంచింది అవివాహిత అయిన పెద్దమ్మ - సెయింటోన్జీలో - ఆమె జ్ఞాతులు తరచూ కలిసేవారు. ఎంతో ఆనందంగా ఉండేవారు కూడా. "నువ్వెప్పటికైనా కాన్వెంటుకు వెళ్తావులే" అని ఏడ్పించేవారు. ఆస్ట్రేలేసియన్ దీవుల్లో ప్రపంచానికి తెలియని తెగలున్నట్లు రోలాన్ గుర్తించాడు. వాళ్ళని కురు - బురి అంటారు. "ఎప్పుడో నిన్ను తీసుకెళ్ళి అక్కడ వదలిపెడతాను. నీ పవిత్రత - వాళ్ళకు బాగా నచ్చుతుంది" అనేవాడు మెదలీనాతో. "నువ్వు వాళ్ళందర్నీ క్రిస్టియానిటిలో చేర్పించగలవు" అని నవ్వేవాడు. ఇలాంటి మాటలు నా ముందు ఎప్పుడూ అనేవాడు కాదు కాని మెదలీనా నాతో చెప్పింది - ఈ కథంతా.

"నన్ను కాథలిక్ సిస్టర్‌గా ఊహించు రామా! నాకు గ్రీకులంటే ఎంత అభిమానం! చెప్పరాదూ - నేను చిల్లర దేవతను కాదుగా" అన్నది. నేను కదా - చిల్లర దేవునిలాగా

- ఈ గంగానదిలో పడి పడవలో పోతున్నాను. ఈ నది ఎంత పవిత్రమైనది - ఎంత గంభీరమైనది! అవిగో పూలు కొట్టుకు వస్తున్నాయి. అప్పుడప్పుడు ఓ కొయ్య దుంగ, సగం కాలిన చితి కాష్ఠాలు - పడవ తెడ్లకు తగులుతుండేవి. ఈ నదిలో మొసళ్ళున్నాయని అంటారు. ఒక్కసారి కాలీ కాలని శవాలు - శరీరావయవాలు కూడా ప్రవాహంలో పడవకు తగిలేవి అని అంటారు. కానీ నేనిపుడు చూడలేదు. రాత్రి, అరుదైన విశాలమైన రాత్రి వారణాసిని ముసుగులా కప్పివేస్తోంది. ఎప్పుడో - నాలుగయిదువేల సంవత్సరాల క్రితం ఇక్కడే ఎక్కడో ఉపనిషత్ రుషులు - మానవ జీవితపు మూలాల గురించి చర్చించి ఉంటారు. యాజ్ఞవల్క్యుడు - మైత్రేయితో అన్నాడు- "ఎవరి క్షేమం కోసం భర్త - భార్యను ప్రేమిస్తాడు? భార్య కోసం కాదు - ఆమెలోని ఆత్మ కోసం" అని అన్నాడు. చిన్నమ్మ నా తండ్రి ఆత్మను ప్రేమించిందా? నేను మెదలీనా ఆత్మను ప్రేమించానా? ఏమో! నాకెలా తెలుస్తుంది? అసలు నేను ప్రేమించగలనా? చివరికి పియరీని కూడా?! నా చేతిలో గంగామాతను తీసుకుని మళ్ళీ నదిలో వదిలివేశాను - అది పియరీ శాంతికి!

కాశీ గురించి అంతకంటే మరేమీ గుర్తు లేదు. మరో రెండు మూడు రోజులు అక్కడ గడిపాం. చిన్నమ్మ పారాయణాలు వినటానికి వెళ్ళేది. నేను రికామిగా తిరిగేవాణ్ణి - ఆ పవిత్రమైన నగర వీధుల్లో ఒక గంగిగోవులాగా! అక్కడ దుకాణాలు బాగా నచ్చేవి. వాటి నిండా రాగి పాత్రలు - దంతపు నగిషీ వస్తువులు - రకరకాల తలవెంట్రుకల విగ్గులు - రంగురంగుల గాజులు - అన్నీ వ్రేలాడుతూ - పండగలాగా ఉండేది. భంగు ఘాటయిన వాసన గాలిలో కలిసిపోయి ఉండేది. మజ్జిగలోనో - పాలలోనే కలిపి ఇచ్చేవారు. బనారెస్ సిల్కు చీరలు చాలా అద్భుతంగా ఉండేవి. ఎంతో నైపుణ్యంతో నేసినవి, అందమైన డిజైన్లలో తయారుచేసి అమ్మటం ఆశ్చర్యకరం! ఒకరోజు ఒంటరిగా ప్రత్యేకంగా వెళ్ళి గులాబీ రంగు సిల్కు చీర - ఆకుపచ్చని అంచుతో - మామిడి పిందెల పైట చెంగుతో ఉన్నది మెదలీనా కోసం తీసుకున్నాను. ఆమె బంగారు రంగు జుత్తుకు - ఈ జరీ అంచు చీర బాగా నప్పుతుంది. సరోజ కోసం ఒక తెల్లని అల్లిక చీర కొన్నాను. గాజులు కూడా కొందామని అనుకున్నాను. కాని పగిలిపోతాయి అని భయంతో కొనలేదు. అంతేకాదు - చిన్నమ్మ ఇప్పుడు తన గాజులు పగలగొట్టుకోవాలి కదా - అలాంటప్పుడు

నేను గాజులు తీసుకెళ్ళడం ఎంతవరకు సబబు? అక్కడ గుళ్ళ లోపల ఉన్న గోవుల మధ్య తిరిగాను. ఎంతో గంభీరంగా, అమాయకంగా కనిపిస్తున్న గోముఖాలను తడిమి చూశాను. వాటికి పచ్చని గడ్డి తినిపించాను. ఇవి ఎంత గొప్ప జీవులు! మన పవిత్ర భూమిలో వాటి ముఖాలలో సనాతన మాతృమూర్తి ఉన్నట్లనిపించేది. అందుకే మనం గోమాతను పూజిస్తాం. ఒకరోజున కుంకుమ కొని ఒక గుడిలోని గోవుల ముఖాలన్నింటినీ పూజించాను. బైటకు వచ్చి - కోతులకు అరటిపళ్ళు, శనగలు పెట్టాను. అప్పటికే సాయంత్రపు చీకట్లు ముసురుతున్నాయి. మళ్ళీ హరిశ్చంద్ర ఘాటుకు వెళ్ళాను. శ్రీధర్‌తో కబుర్లు చెబుతున్న చిన్నమ్మను తోడ్కొని జట్కా మాట్లాడుకుని చిన్నమ్మను అన్నపూర్ణ ఆలయానికి తీసుకుని వెళ్ళాను. 'దేవి' ఎంత అందంగా ఉంది! ఆమె కాషాయరంగు చీరలో, సర్వాలంకరణలతో ఎంత ప్రశాంతంగా శక్తివంతంగా కనిపిస్తోంది - అన్నపూర్ణ మాత!

'అమ్మా - అన్నపూర్ణా - కాశీమాతా - నా మీద దయ చూపు తల్లీ' - అని ప్రార్థించాము! 'అన్నపూర్ణే - సదాపూర్ణే' అంటూ గొంతెత్తి పాడాను చిన్నమ్మతో కలసి! శ్రీధర్‌తో కలిసి కర్పూర హారతి ఇస్తున్నప్పుడు నాకనిపించింది - మా వంశపు చివరి అంశ అయిన శ్రీధర్ - మా పూర్వ తరాల పుణ్య ఫలాలను తప్పక ప్రోది చేస్తాడు అని! బహుశ వీడు నా ప్రశ్నలన్నిటికీ సమాధానం చెప్పగలడేమో - నావన్నీ క్లిష్టమైన ప్రశ్నలే - నా జీవితంలో ఏదో తప్పిపోయిందా - మరేదో నాలో - లేనిదేదో పెరిగిపోతోంది! చిన్న కొబ్బరిచెట్టుకు - పెద్ద బొండంలాగా ఏ అనురాగం ఏ జ్ఞానంతో పూడ్చలేనిది - సంతృప్తి పడనిది - పెరిగిపోతోంది. ఒక్కోసారి అలా కూర్చుండిపోయి - చేతుల్లో ముఖాన్ని కప్పుకుని అరే! నేను ఎక్కడికి వెళ్తున్నాను. ఏమిటి - ఎందుకీ అన్వేషణ అని ఆశ్చర్యపోతుంటాను! జీవితం ఒక తీర్థయాత్ర - నాకు తెలుసు - ఈ యాత్ర - ఎటు - ఎక్కడికి తీసుకుపోతుంది? ప్రతి ఒక్కరు - అనంత కాలం నుంచి - మానవ జాతి ప్రాదుర్భావం నుంచీ - కోటానుకోట్ల జీవులకు ఇదే - ఏదో - తెలియనిది - తప్పిపోతోంది - అని తపన - కాని ఏ ఒక్కరో - బుద్ధునిలాంటివాడు - అదేమిటో తెలుసుకోవాలని అన్వేషించ లేదా - మళ్ళీ ఆయన తిరిగి రాలేదు కదా - తన నిర్వాణ పథం నుంచి! మనకు సమాధానం ఏది? సన్యాసమో - దైవభక్తో దీనికి సమాధానం కాదు. బహుశా - గంగమ్మ తల్లికి తెలుసేమో! కానీ ఆమె ఏమి చేస్తుందో నాకు తెలియటంలేదు. నా చిన్నమ్మలాగా - గంభీరంగా - తన లోలోతు ఆలోచనలతో!

నాకేదో ఆందోళన - దీనికి మొదలు లేదు తుది లేదు - విపరీతమైన ఆందోళన! అంతే! ఈ బండ రాతి నేల మీద వెల్లకిలా పడుకుని రోజంతా గుళ్ళలోని గంటలు

మోగడం వింటూనే ఉన్నాను. యాత్రికులు మంత్రాలు చదువుతూ మెట్లు దిగుతూ వెళ్తూనే ఉన్నారు. ఒక్కసారి నదిలోని చేప దేనినో పట్టుకున్నట్లు అలజడి - రాత్రి నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ వినపడుతుంది - నీటి గలగల! కల్లోలం! చిన్నమ్మ నిద్రపోయింది; శ్రీధర్ తల నిమురుతూ తన గుండెలకు అదుముకొని నిద్రపోయింది. గంగామాత ఒడిలో ప్రశాంతంగా - మేమంతా అలలమైపోయినట్లు - చిన్నమ్మ నిద్రపోయింది! ఒక్కసారిగా ఉలిక్కిపడి లేస్తుంది. "రామా! నీకు చలిగా లేదు కదా - అని నీ ఊపిరితిత్తులు జాగ్రత్త - నాకు ఆందోళనగానే ఉంది రామా" అనేది. తడి గాలి నా గుండెల్లోకి వెళ్ళినా ఈ దోమలు మరీ ఇబ్బంది పెడుతున్నాయి. చిన్నమ్మ తన దోమ తెర నాకిచ్చింది. "నువ్వు కొంతసేపయినా నిద్రపో నాయనా" అంటూ - ఈ తెరలో కళ్ళు తెరుచుకుని నేను ఎంతో ఒంటరిగా అసలు నిద్ర అవసరం లేనట్లు శూన్యంగా అయిపోయాను. తిండి లేకపోవడం - తడిగాలి - నాకు మళ్ళీ దగ్గు వస్తోంది. చిన్నమ్మ ఆందోళన పడిపోయింది భయంతో.

మర్నాడు అలహాబాద్ బయలుదేరాం - మధ్యాహ్నం సమయానికి! చిన్నమ్మ "రామా! నాకన్నీ భయం గొలుపుతున్నాయి - అన్నింటికీ భయపడుతున్నాను రామా" అంటున్నది.

అలహాబాద్ ప్లాట్‌ఫాం మీద వెంకటరామయ్య కనిపించగానే చిన్నమ్మ సంతోష పడింది. హైదరాబాద్‌లో నాన్నగారితో పనిచేసిన వెంకట్రామ ఇప్పుడు అలహాబాద్ విశ్వవిద్యాలయంలో ఆంగ్లం బోధిస్తున్నారు. మేము వస్తున్నట్లు టెలిగ్రాం పంపాం. వెంకట్రామ తెలుగులో మాట్లాడుతుంటే చిన్నమ్మ ఆనందానికి అంతే లేదు! ఇక ఇంటికి చేరిన తర్వాత, మిరియాల రసం, కొత్తిమీర వేసి చేసిన కొబ్బరి పచ్చడి, దోసెలు, ఫిల్టర్ కాఫీ - ఓహ్! చిన్నమ్మ సంతోషంగా నవ్వింది చాలానాళ్ళకు! అరె! మన అలవాట్లకు - మనకు అలవాటైన పరిసరాల కోసం ఎంతగా ఆరాటపడతాం - ఆహారపుటలవాట్లకు ఎంతగా మొహం వాచిపోయాం! చిన్నమ్మ మళ్ళీ మామూలు మనిషి అయినట్లనిపించింది! వారణాసి ఆమెకు భరించలేనిదిగా అనిపించింది. నిజానికి ఉత్తరాది అంతా - ఒక్క గంగ తప్పించి. అంతా దుమ్ము - ధూళే! లక్ష్మమ్మ కూడా అంతే - అంతే అంది. వాళ్ళిద్దరూ పిల్లల గురించి పెళ్ళిళ్ళ గురించి మాట్లాడుకున్నారు. ఏ పెళ్ళిలో ఎవరు - ఏమి ఇచ్చారు అంటూ!

లక్ష్మమ్మ గారి ఒక కూతురు ఢిల్లీలో IFS ను పెళ్ళి చేసుకుంది. మరొక అమ్మాయి రైల్వే సర్వీస్‌లో ఉన్న కుర్రవాణ్ణి చేసుకుంది. కొడుకు ఇంజనీరింగ్ చదువుతున్నాడు - కాశీలో. ఇక్కడకు శలవుల్లో వచ్చాడు. లక్ష్మమ్మగారు చెప్పింది - మన కులాలు

వేరైనా మీ సరోజను మా కోడలుగా చేసుకోవటానికి అభ్యంతరం లేదని. చిన్నమ్మ మౌనంగా విన్నది. "అయ్యో రామా! మా రాముడు అప్పుడే పెళ్ళి చేసేసుకున్నాడు. లేదంటే మీ కౌముదికి సరైన జోడు" అంది. కౌముది - లక్ష్మమ్మ మూడో కూతురు. అప్పటికీ పదహారు నిండాయి. ఇంటర్ చదువుతోంది.

"దానిదేముంది.. జరగకూడదని ఉందా?" అంది లక్ష్మమ్మ. ఇవన్నీ నాకేమీ పట్టనట్లు వింటున్నాను. కానీ ఈ పరిసరాలు మా ఇంటి వాతావరణంలాగా నాకు ఎంతో ఆనందంగా ఉంది. నేను యూరోపు వెళ్ళినదగ్గర్నుంచి ఇలా ఇంటికి దగ్గరగా ఎప్పుడున్నాను? నేను - కౌముది - చిన్నమ్మ - లక్ష్మమ్మ అందరం అష్టాచెమ్మా ఆడాము. మర్నాడుదయం త్రివేణీ సంగమానికి తీసుకు వెళ్ళాను. అక్కడ కార్యక్రమాలు ముగిసిన తర్వాత 'ఆనందభవన్' చూపించాను! మరొక రోజు మ్యూజియం కూడా చూపించాను.

మేము అలహాబాద్ వచ్చిన రెండో రోజు లేక మూడో రోజు సాయంత్రం నేను ఏదో గణిత శాస్త్రానికి సంబంధించిన పుస్తకం తిరగవేస్తుండగా నా జీవన దృక్పథాన్ని సమూలంగా మార్చిన సంఘటనేదో జరిగింది! వెంకట్రామయ్య విశ్వవిద్యాలయం నుంచి తనతోపాటు ప్రతాప్‌సింగ్‌ను వెంటబెట్టుకు వచ్చారు. ప్రతాప్, ఆయనకు పూర్వ విద్యార్థి. ప్రతాప్ ఉస్మానియా యూనివర్శిటీలో చదివాడు. చాలా తెలివిగల విద్యార్థి ఇంగ్లీష్ ఆనర్స్‌లో అని తెలిసింది తర్వాత నాకు!

వెంకట్రామయ్య అతనికి ఐ.సి.ఎస్. కోచింగ్ ఇచ్చారు. అతను పరీక్ష రాశాడు కాని చాలా పోటీ ఉండటంతో ఉత్తీర్ణుడు కాలేదు. కానీ బ్రిటిష్ రెసిడెంట్ ప్రతాప్ నేపథ్యం తెలుసుకుని పాలనా వ్యవహారాల శాఖకు ఎంపిక చేశారు. ప్రతాప్ ముక్తాపురం జాగీర్దారు - ఇది ఔరంగాబాద్ జిల్లాలో ఉంది. అయితే చివరికి నాలుగైదు ఊళ్ళే మిగిలాయి. తల్లిని సంతోషపెట్టటానికి ఈ పరీక్షలు రాస్తున్నాడు. వారి కుటుంబం బ్రిటిష్ రాణిగారికి ఎంతో విధేయులై ఉంది చాలా కాలంగా. అదిగో, దాని పర్యవసానమే ఈ ఎంపిక! ఇంగ్లండ్ వెళ్ళిన చివరి ఐ.సి.ఎస్. సభ్యులలో ప్రతాప్ ఒకరు. ఇప్పుడు ఇంగ్లాండ్ నుంచి తిరిగి వచ్చాడు - ఇక తన తల్లి ప్రశాంతంగా కన్ను మూయాలంటే ప్రతాప్‌కి సరైన జోడీ తాహతుకు తగిన వివాహం జరగాలి. అందుకు రాజా రఘువీర్ సింగ్ గారి అమ్మాయి అయితే ఈడు జోడు కుదురుతుంది. ఆమె కూడా లండన్‌లో చదివింది. తండ్రి ఎంత కర్కోటకుడో ఆమె తల్లి అంత సౌమ్యురాలు. రఘువీర్ సింగ్ కొరడా చేతబట్టుకొని కిళ్ళీ ఉమ్ముతూ సేవకుల్ని శిక్షిస్తుంటాడు. ఆయనకు సహజంగా ఉండవలసిన



వ్యసనాలన్నీ ఉన్నాయి. దానికి ఒక రకంగా సంగీత నాట్యాలు తెలియని మన ఆడవాళ్ళ చేతగానితనమే అనుకోవాలి! సావిత్రి! అవును అమ్మాయి పేరు సావిత్రి! ఆమె పెద్ద కూతురు. ఈమె ఐ.సి.ఎస్. అధికారిని చేసుకోవటంలో ఎలాంటి చిన్నతనం లేదు రాజ రఘువీర్ సింగ్ కుటుంబానికి! ఎందుకంటే రాజులు ప్రజలను పాలిస్తారు. రాజులను ఐ.సి.ఎస్. అధికారులు పాలిస్తారు - ప్రభుత్వం దృష్టిలో ఇద్దరూ సమానమే.

ఈ కథ చాలా పెద్దది. కాని, సావిత్రి ఈ సంబంధానికి అంగీకరించలేదు. పైగా తన చెల్లెల్ని - పుష్పవతిని చేసుకోమని సలహా ఇచ్చింది. కానీ చివరికి సావిత్రికి ప్రతాప్‌కి నిశ్చయ తాంబూలాలు ఇవ్వడానికి సూత్రప్రాయంగా అంగీకారం కుదిరింది. ఎందుకంటే సావిత్రి వయసులో చిన్నదే - మనసు మార్చుకోవడానికి ఇంకా సమయం ఉంది. ఒకవేళ అలా మార్చుకోపోతే పుష్పవతి సిద్ధంగా ఉంటుంది. పుష్పవతికి చదువు మీద అంత ఆసక్తి లేదు. అంతేకాదు - ఆమెకు మంచి అత్తగారు, పెద్ద కుటుంబంలోకి వెళ్ళడం ఇష్టం కూడా. నిజానికి ప్రతాప్ తల్లికి పుష్పవతి బాగా నచ్చింది కూడా. ప్రతాప్ మాత్రం సావిత్రిని ఇష్టపడుతున్నాడు. అందుకని మంచి ముహూర్తంలో పసుపుకుంకుమలతో కొబ్బరికాయ కొట్టి నిశ్చయ తాంబూలాలు పుచ్చుకున్నారు! డోలు, సన్నాయి కూడా మోగించారు. లక్నో నుంచి మంచి-మంచి నాట్యకత్తెలను తీసుకు వచ్చారు. రాజుగారు - పాలెస్‌ను దీపాలతో అలంకరించారు. తుపాకులు పేల్చారు - ఓ పదిమంది సైనికులు (అంతవరకే ప్రోటోకాల్ ప్రకారం అనుమతిస్తారు) - పాలెస్ ముందు కవాతు చేశారు. ఏనుగులు, గుర్రాలు అలంకరించారు - అంబాదేవి ఆలయంలో దీపాలు వెలిగించారు - చిన్న పిల్లలకు మిఠాయిలు పంచిపెట్టారు. మొత్తానికి చాలా సందడిగా పండుగ జరిపారు! తీరా అలహాబాద్ వచ్చిన తర్వాత సావిత్రి ప్రతాప్‌ను చూడటానికే ఇష్టపడలేదు. ఇది కేవలం లాంఛనమే అన్నది. ఎటువంటి ప్రమాణాలు చేయలేదు - ఎలాంటి వివాహం జరగదని చెప్పేసింది. ఆమెకు బ్రిటిష్ పాలన అంటేనే గిట్టదు. ఇక వారి సేవకుణ్ణి ఎలా చేసుకుంటుంది. ఆమె కేంబ్రిడ్జికి వెళ్ళిపోయింది. ఒక్క ఉత్తరం కూడా రాయలేదు - ఇప్పుడు తిరిగి వచ్చినా అతన్ని చూడటానికి ససేమిరా అంది. అదిగో సరిగ్గా ఇక్కడే ఈ చిక్కు ముడి విప్పటానికి నేను ప్రవేశించవలసి వచ్చింది.

అసలెందుకు సావిత్రి అతన్ని చూడనంటోంది? ఎందుకు? యూరోప్‌లో చదువుతూ ఫ్రెంచ్ అమ్మాయిని పెళ్ళి చేసుకున్నా - నాకు ఈ విషయంలో అదే ప్రేమ వ్యవహారంలో అనుభవ జ్ఞానం ఉండవచ్చిన వాళ్ల ఆలోచన! నాకయితే

ఏమీ లేదని తెలుసు! అలాంటి సమయంలో ప్రతాప్ నన్ను కుమార్ విల్లాకు రమ్మని ఆహ్వానించాడు. ఈ కూలిపోతున్న 'సామ్రాజ్యాల' పట్ల నాకు ఎటువంటి సానుభూతి లేదు. భయపడుతూనే 'కుమార్ విల్లా'కు వెళ్ళాను. నేను భయపడినట్లే అది అసహ్యంగానే ఉంది. ఈ పైకి కనపడే మెరుగులు రాజాలవి - రాజాసాహెబ్‌లవి - చాలా పలచటి పొరలే - చిటికెన వేలి గోటితో ఆ పొరల్ని తొలగించి లోపలి గుంటల్ని చూడవచ్చు. మమ్మల్ని రాణిగారు ఆహ్వానించారు. కుమార విల్లా డ్రాయింగ్ హాలు! గోడలకు బ్రిటీష్ గవర్నర్ల బొమ్మలు తగిలించి ఉన్నాయి. రవివర్మ బొమ్మలు కూడా ఉన్నాయి. మూడు పులి తోళ్ళు పరిచి ఉన్నాయి. అందులో ఒకటి 9 అడుగుల పైగా ఉంది. దీన్ని రాజుగారే కుమాపున్‌లో చంపారు. పనివాళ్ళు ఇంగ్లీషు మాట్లాడుతున్నారు. టీ సెట్టు నీలి పింగాణీది. అంతలో సావిత్రి వచ్చింది మందపాటి కళ్ళద్దాలతో. బొద్దుగా అచ్చం భారత స్త్రీలాగా ఉంది. ఇక నేను ఫ్రాన్స్‌లో ఉండటం - బ్రాహ్మణుణ్ణి కావడం - అదీ దక్షిణ దేశం నుంచి వచ్చినవాణ్ణి - నాకేదో ప్రత్యేకత ఉందని - అదీ సహజమైన గౌరవంగానే భావించాలి. ప్రతాప్ నాకంటే నాలుగేళ్ళు పెద్దవాడు. కానీ అన్నిటికీ తొట్రుపాటు పడుతున్నాడు. మా నాన్న మరణం - బహుశా వీళ్ళిద్దర్నీ ఒకటి చేయటానికి పనికి రావొచ్చేమో?

సావిత్ర అచ్చం ఆధునిక యువతిలా ఉంది. నా దగ్గరగా కూర్చుంది. నా 'అల్బిజెన్సియన్' ఫిలాసఫీ - హిస్టరీ (చరిత్ర) ఆమెకు బాగా నచ్చింది. తనకీ చరిత్ర ఇష్టమనీ - వాళ్ళ నాన్న ఆంగ్లం తీసుకోమన్నారని చెప్పింది. కేంబ్రిడ్జికి వచ్చారా అని అడిగింది. నేను మెదలీనా గురించి స్టియానా విల్లా గురించి చెప్పాను. పియరీ సంగతి ఎత్తలేదు. సావిత్రి చాలా తెలివిగలది. ఆధునికంగా ఉంది. అప్పుడే సిగరెట్లు తాగుతుంది - ఫోన్‌లో ఏదో డాన్సు ప్రోగ్రాం గురించి మాట్లాడుతుంది. ఆమెలో విశేషమేమిటంటే ఉన్నప్పుడు మనకంతగా ఉన్నట్లుండదు. ఆమె లేకపోతే చాలా వెలితిగా అనిపిస్తుంది. ఆమెకూ సంస్కృతం వచ్చు. మేమిద్దరం రఘువంశం, ఉత్తర రామ చరిత్ర గురించి మాట్లాడుకోవచ్చు! ఈ ఉత్తర భారత దేశంలో త్వరగా పరదా సంస్కృతి నుంచి సిగరెట్టు కాల్చటానికి వచ్చేశారు. కాని దక్షిణాదిన అలా లేదు. ఇంకా సంప్రదాయానికే కట్టుబడి ఉన్నారు - ఎన్ని చదువులు చదివినా.

ఇంటికి వెళ్లి చిన్నమ్మకు - అంతా బాగానే ఉంది అని చెప్పాను. అంతకంటే ఏముంది? తర్వాత మనం హరిద్వార్ వెళ్తున్నాం. డెహ్రాడూన్ చాలా అందమైన ప్రదేశం అని చెప్పాను. ఆ దగ్గర్లోనే హిమాలయాల పాదాల చెంత గంగానది పుడుతుంది - ప్రవహిస్తుంది - మానవాళి పాపాలు కడిగివేయటానికి పరుగులు పెడుతుందని చెప్పాను.

దేవి సరస్వతి భాగవతి గంగా-
నువ్వు రక్షించాలి మూడు లోకాల్ని,
శివుని తలపై తిరుగుతున్న నువ్వు,
మమ్మల్ని రక్షించు తల్లీ!

స్టేషన్‌కి వెంకట్రామ్ - కౌముది వచ్చారు. అంతకు ముందు రోజు ఢిల్లీ నుంచి మెదలీనా ఉత్తరం వచ్చింది. నేను విప్పి చదవలేదు. నా కుడి కోటు జేబులో పెట్టుకున్నాను. ఆమె ఉత్తరాలన్నీ అక్కడే ఉంటాయి. రైలుబండి గంగ మీద వంతెన దాటే సమయంలో చిన్నమ్మ వెక్కివెక్కి ఏడ్చింది. బహుశా నాన్న అస్థికలు కలసిపోయిన గంగ క్రిందనే ప్రవహిస్తోంది. తరతరాలుగా మా దుఃఖాన్ని ఈ మాత భరిస్తూనే ఉంది. ఎందరో తల్లుల్లాగా గంగామాత ఆ మెట్ల మీద కూర్చునే ఉంది. ఆమె ప్రక్కన ఉన్న ఆ మూట ఏమిటి? ఎందుకమ్మా మా పాపాలన్నీ నీవు మూటకట్టుకున్నావు?!

చిన్నమ్మ ఎక్కువగా మాట్లాడదు. ఆమె నిశ్శబ్దంలో నుంచి మాటలు తక్కువగా వస్తాయి. ఆమె గొంతులో ఏదో పురాతన సంగీత వాయిద్యం ఉన్నట్లు - తరతరాలుగా అది సంగీత శబ్దాలు చేస్తున్నట్లనిపిస్తుంది. అవును. నిశ్శబ్దం నుంచే కదా సంగీతం ఉద్భవించేది!

బలారపుర్, హర్టర్‌పుర్ రజత్‌లాబ్ స్టేషన్లు దాటి పోతోంది రైలు - చుట్టూ పచ్చని ప్రకృతి. అక్కడొక చెరువు - ఇక్కడొక కొండ - బహుశా ఇవేనేమో - జాతి సంప్రదాయాన్ని కాపాడుతున్నాయి. ఇక్కడేగా ఆర్యులు తిరిగింది. ఈ పురాతన వృక్షాల క్రిందే కదా వాళ్లు సేద తీరింది. ఈ గంగామాతేగా వారికి ఆహారం ఇచ్చింది. ఈ ప్రాంతాలలోనే కదా - గూడుమంటల వేడిలోనే కదా - మన తత్త్వశాస్త్రం ప్రాదుర్భవించింది. ఆ ఉన్నతమైన, పురాతనమైన వారసత్వం - సంస్కృతం - పవిత్రమైన భాష - సాటిలేనిది - పరిపూర్ణమైనది - రూపుదిద్దుకున్నది ఇక్కడే కదా! సంస్కృతం నేర్చితే సర్వమూ తెలిసినట్లే!

రెక్క వాలితే, జెండా ఊగితే - గంట మోగితే రైలుబండి పరుగులు పెట్టి మమ్మల్ని హిమాలయాల వైపు తీసుకుపోతోంది. నా పూర్వీకులు సత్యాన్వేషణకై ఈ హిమాలయాల శీతల పవనాలలో ఏకాగ్రతలో తపస్సు చేశారు. అదిగో కైలాస పర్వతం - ఆకాశపు దిక్కుగా కనపడుతోంది. మానవజాతి కల్యాణం కోసం శివపార్వతులు అక్కడ కేళీవిలాసంలో ఉన్నారేమో?! నందివాహనం చూడండి - ఎంత ధవళ కాంతితో మెరిసిపోతుందో - ప్రపంచం చుట్టి వస్తోంది. మనిషి ఆక్రందనలు వింటూ - జనన మరణాలు, పాడిపంటలు, పేదరికం కొట్లాటలు - పేచీలు - అన్నింటినీ చూస్తూ ప్రదక్షిణ చేస్తూనే ఉంది. పార్వతీదేవికి అన్నీ తెలుసు. నంది ఎప్పుడూ తన యజమానికి ఏమీ చెప్పదు. కానీ, పార్వతి తన భర్తను - 'అదిగో ఆ అనాథను కాపాడండి - ఆ బిచ్చగాణ్ణి ఆదుకోండి' అని ప్రాథేయపడుతుంది. అదృష్టం ఎప్పుడు నీ తలుపు తడుతుందో నీకెలా తెలుస్తుంది? ఎప్పుడు బంగారపు సంచులు నీ వాకిలి ముంగిట పడివుంటాయో నీకెలా తెలుస్తుంది?

ఈ గంగా పరివాహక ప్రదేశమంతా ఓ విచారగ్రస్తమైన పవిత్ర గానం! ఎందుకంటే - దుఃఖాన్ని అంగీకరించినపుడే సత్యదర్శనం జరుగుతుంది. అక్కడ నుంచే భారతీయ తత్త్వ జ్ఞానం ఉదయిస్తుంది. దుఃఖమే మన నది - దుఃఖమే మన నేల. ఈ పచ్చని చెట్లు, ఆ తెల్లని మంచు పర్వతాలు సత్యానికి సంకేతాలు. ఈ జనన మరణాల ముగింపు తర్వాత మన సత్యాన్వేషణ ముగిసిపోతుంది. హిమాలయమే సత్యం - గంగామాతే మానవజాతి. అందుకే మనం చితాభస్మాలు ఆ తల్లి ఒడికి చేరుస్తాం. ఆమె సముద్రంలోకి సంగమింపజేస్తుంది. సూర్యభగవానుడు సముద్రాన్ని మబ్బులుగా మారుస్తాడు. ఆ విధంగా మళ్ళీ హిమాలయాలకు చేరతారు. ఇది అనాదిగా సాగుతూనే ఉంది. హిమం - నదుల మాదిరి. అందుకే పవిత్ర బద్రీనాథ్, హిమాలయాల్లో ఉంది. ఈ సత్యదర్శనం సత్యమే! శంకరాచార్యుడు మళ్ళీ నాకు మదిలోకి వస్తున్నాడు.

పార్వతీదేవి స్తోత్రం పాడుతూ మెల్లగా మత్తులోకి జారుకున్నాను. కనురెప్పలు మూసినప్పటి స్పర్శలాగా కరుణ దుఃఖాన్ని కప్పివేస్తుంది. ఈ విశాల భారతావనిలో ఇది సాధ్యమే. మనం ఆ స్పర్శవైపు, ఆ ఔన్నత్యంవైపు, ఆ సహజమైన జీవనం వైపు నడుస్తున్నాం. యవన కర్కోటకుల దాడులు లేకపోతే మనం ప్రకృతిలో కలసి సహజీవనం సాగించేవారమే. జనానాలలోని స్త్రీలలాగా పాలిపోయేవారమే - అద్భుతమే జరిగేది - బలహీన పడిపోయి ఉండేవారేమో - కాని గంగా తీరంలో వనవిహారం చేసేవారు కదా?

నా ఆలోచనలు ఎటో పోతున్నాయి. అచ్చంగా భారతీయునిలాగానే. సాయంత్రం సాగిపోతోంది. ప్రశాంతంగా. ఇలాంటి సమయంలోనే మెదలీనా ఉత్తరం చదవాలి!

"మామీ! నా నేస్తమా" ఆమె రాసింది. ఉత్తరం 29 మార్చి, 1951 నాటిది.

"నేను పోయిన వారం బండోల్ వెళ్ళాననంటే నీకు బాధ కలుగుతుందా? నిన్ను నొప్పించదు కదా? తప్పని సరిగా వెళ్ళి రావాలిగా - పియరీ మరణం నన్నెంతగా క్రుంగదీసిందో నీకెలా తెలుస్తుంది? నీకేమి మగమహారాజువు పైగా నీది భారతీయతలోని ఏకాగ్రత! నీకెలా అర్ధమవుతుంది చెప్పు అమ్మ మనసు! అదీ ఫ్రెంచి తల్లి - బిడ్డను కనడం అంటే - దేవునికి జన్మనివ్వటమే - క్రిష్టియన్ అయినా కాకపోయినా - బిడ్డను కనడం ఎంత అపురూపమైన అనుభవం - ఇది నీకెలా తెలుస్తుంది?

అవును - నీ బిడ్డనే కన్నాను - ఎంత ప్రేమతో - అవును - వాడు మన ప్రేమ స్వరూపమే. కానీ నువ్వు పుత్రోత్సాహంతోనే చూశావు - దృష్టి పెట్టుకున్నావు - కాని నా కొడుకని మరచిపోయావా? మీ దేశంలో ఆడదానికి ఎప్పుడూ వెనుకబాటే కదా - కాని వాడు నా కడుపులో పడినప్పటి నుంచీ నా ప్రేమకు అంతు లేకుండా పోయింది. ఎందుకో తెలుసా - వాడు నీ బిడ్డ కాబట్టి! వాడి భవిష్యత్తు గురించి నీవెంత ఆలోచించావు! కాని నేను వర్తమానం గురించే ఆందోళన పడ్డాను. నీవు చెప్పావు గుర్తుందా - కొడుకు ప్రయోజకుడవ్వాలంటే ఎలాంటి ఆహారం పెడతారు - ఎలాంటి మంత్రాలు చదువుతారో అని! కాని నేను? నా కొడుకు ఒక మగవాడిగా పెరగాలని అనుకున్నాను.

నీ 'అంతగా పట్టించుకోని' మనస్తత్వం నాకు వింతగా అనిపించింది. నిజానికి నిన్ను నువ్వే అంతగా పట్టించుకోవు కదా! నిజానికి అదే నాకు ఎంతో ఇష్టమైన నీ వ్యక్తిత్వ విశేషం - నేను ప్రేమించింది - నీ స్పర్శ! అది నాకు కొండగాలి తాకినట్లుంటుంది. తేనె వాకలు మోసుకొచ్చే పిల్లతెమ్మెరలుగా - మంచి గంధంలాగా కమ్మివేస్తుంది. నీ మనస్సు సెలయేరు - కొండవాగులా స్వచ్ఛంగా ఉంటుంది. నాకందులో స్నానమాడాలని ఎంత కోరికో! కాని నాలాంటి నా జాతి దానికి అది ఎంత కఠినమైన వ్యవహారమో! మీకు మార్మికమైన అదృశ్యమైన శక్తుల మీద మమకారం ఎక్కువ. మేము కనిపించేవాటిని ప్రేమిస్తాం. నాకు నీవు కనిపించని రాతి గోడవు సుమా! ఎంత బాగా కనపడతావో - ఒక అవతార పురుషుడులాగా - నా ప్రక్కనే నా పతి రూపంలో!

నీకెలా చెప్పను - నీకెలా అర్థం అవుతుంది - నీ బిడ్డడు నా ప్రక్కన ఉండడం అంటే ఏమిటో? వాడు నా చనుబాలు తాగుతుంటే వాడికెన్ని పిచ్చి కబుర్లు చెప్పానో

- అవన్నీ నీకు చెప్పాలనే అనుకునేదాన్ని. కానీ నాకా అవకాశమే రాలేదు. నీవు చిన్న విషయాలను పెద్దగా చేసి చెప్తావు. ప్రతి మనిషి నీకు నీ ముందు అసంబద్ధంగా కనిపిస్తాడు. ఒకరోజు నీవన్నావు గుర్తుందా - 'లీనా ఎందుకు ఆ పిచ్చి రసాయనపు పౌడరు - నీ వంటికి రాస్తావు - అది నీకు ఎలాంటి అందాన్ని తెస్తుంది - నీ అందాన్ని అది పెంచగలదా - ఇప్పుడే అంత మృదువుగా మెరిసిపోతున్న నీ చర్మ సౌందర్యాన్ని ఏ రసాయనం పెంపొందించగలదు?' అని నవ్వావు. ఆ రోజు నీతో అందరి ఆడువాళ్ళమాదిరిగానే అబద్ధం చెప్పాను - 'లేదు - అది ఈ వాతావరణం నుంచి రక్షిస్తుంది' అని. నువ్వు నమ్మావు కూడా! నువ్వు నిజంగానే నమ్మావా? తర్వాత నేను నిజం చెప్పినపుడు ఎలా నవ్వావు - ఎంతగా నవ్వావు - నీవు నిజంగా కఠినాత్ముడవు సుమా!

నిన్ను మోసం చేయటం ఎంత తేలిక? నీకు స్త్రీ అంటే ఏమీ తెలియదు రామా - నేను అమాయకురాలననుకున్నాను - నాకంటే నీ అమాయకత్వం మరీ పిచ్చిది. చార్లీ మామయ్య అన్నట్లు నీలాంటి మరో ప్రపంచపు జీవిని పెళ్ళి చేసుకోవడం నాకు తగిన శాస్తి అని!

ఉయ్యాలలో పసికందు! ఉయ్యాల అదిగో - మధ్యధరా సముద్రపుటంచుల్లో - అదే కదా మా సంస్కృతి మూలాలు. ఆసుపత్రిలో రాత్రి తర్వాత రాత్రి నిద్రలో మేల్కొనే ఉన్నాను. నీ గురించి, పియరీ గురించి ఆలోచిస్తూ కాదు. యులిసిస్ సాహస యాత్రలో - డిమీటర్ - పోసీడిన్ ఎలా గడిపారని. ఒకసారి అనుకున్నాను - కృష్ణని యులిసిస్ అని పిలవాలని. ఎన్నిసార్లనుకున్నానో - 'కృష్ణ యులిసిస్ రామస్వామి' అని మంత్రజపం చేశాను. ఎలా ఎలా నప్పుతుంది? కాని అలాగే ఎన్నోసార్లు జపించాను. అలవాటయిన తర్వాత అలవాటవుతుందని! తర్వాత 'అఖిల్లె' అని పిలవాలనుకున్నాను. కాని అది బ్రాహ్మణ కుమారునికి నప్పదనుకున్నాను. వీరోచితమైన పేరు కదా! సరే, తొందరేముందిలే - కృష్ణ - కృష్ణ అంతే! కృష్ణ - కృష్ణ అని నాలో నేను జపించుకున్నాను. చాలా ఆనందంగా ఉంది కూడా. రాగి రంగు శరీరంతో - నల్ల కళ్ళు - నీలాగే - అన్నీ నీ పోలికలే - చేతులు - కాళ్ళూ - చెవులూ! నీ బండ పెదాలు మాత్రం రాకూడదనుకున్నాను. ముక్కు మాత్రం నాదే ఉండాలి నాజూకుగా. అది వాడి అందాన్ని తగ్గించదులే. ఎన్ని ప్రార్థనలు - ఎన్నిసార్లు చేశాను?! తెలియని దేవతకు! వాడు మన బిడ్డ - అంతే అనుకున్నాను. వాడు పుట్టక ముందు రాత్రి రోన్ లోయల్లోంచి మధ్యధరా సముద్రం వరకూ విసురుగా ఉత్తర - పడమర గాలి వీచింది. కోర్సికా వరకూ కనపడుతోంది. దూరదూరాన నావలు సముద్రంలో తేలుతున్నాయి. బహుశా ఆఫ్రికా వెళ్తున్నాయేమో - తెరచాపలు నింపుకుని! ఇంకా

దూరం అమెరికా కూడా పోవచ్చు - చూశావా - ప్రపంచం కదలిపోతోంది! చేపలు పట్టే పడవలు చెల్లాచెదురుగా ఉన్నాయి. చేపలు గాలిలోకి ఎగురుతున్నాయి - వెన్నెల్లో కనపడుతున్నాయి వెండిముక్కల్లాగా. ఆలివ్ చెట్లతో పర్వతసానువులు పరచుకుంటే ఒకే ఒక్క 'సైప్రస్' నిలబడి ఉంది. నాకాశ్చర్యం - నేనెవ్వరిని? ఇక్కడేం చేస్తున్నాను? నువ్వు దూరంగా హోటల్‌లో ఉన్నావు - ఆ రాత్రి నేను చూసిన దృశ్యాన్ని నీకు తర్వాత చెప్పాను.

డిమిటర్- ఆ సముద్ర జలాల్లోంచి పైకి వచ్చింది. చేతిలో పళ్ళబుట్టతో - ఒక సిల్కు దారాల బొమ్మలాగా! పారదర్శకం - ఆమె కనపడుతోంది. ఆమెలో నుంచి కూడా చూడవచ్చు. ఆమెలోకి ఆమె మాయమయిపోతోంది! ఆమె పోసీడెన్ పుత్రిక కూడా కాదు. సముద్ర జలాలు పవిత్రంగా మెరుస్తున్నాయి. ప్రపంచం అంతా వెలుగుతో నిండిపోయింది. అంతా సవ్యంగా ఉంది. ఆనందం వెల్లివిరుస్తోంది. మనిషికి మరణం, దుఃఖం లేవు. మొక్కజొన్న పండుతోంది. దేవతలు ఆడుకుంటున్నారు! వేణుగానాలతో లోయలన్నీ నిండిపోతున్నాయి. బాలికలు ఆల్టర్ ముందు నాట్యం చేస్తున్నారు. పూలన్నీ అంతటా విరగబూస్తున్నాయి. గులాబీలు - ఊదా, పసుపు - తెలుపు క్రోకసులు - వయెలెట్ పూలు చుట్టూ తెల్లని అంచులతో మధ్యలో పసుపు పచ్చనితో నార్సిసస్ పూలు ఆహ్వానిస్తున్నాయి. ప్రకృతి అంతా సుందరమయంగా ఆహ్లాదకరంగా ఉంది. నా మనసు ఆనందంతో నిండిపోయింది రామా! ఇంతకు ముందు ఎప్పుడూ లేని ఆనందంతో నిండిపోయింది!

మర్నాటి ఉదయం అయిదు గంటలకు నొప్పులు మొదలయినాయి. పదకొండు గంటలకు - చిన్నారి ఉదయించాడు! వాణ్ణి చూసినపుడు నాకెలాంటి ఉద్వేగం కలగలేదు. తర్వాత నీవు నీ బిడ్డను చూసిన తర్వాత నీ ముఖం వెలిగిపోవటం గమనించాను. నాకర్థం కాలేదు - నన్నింత బాధపెట్టి భూమిన పడిన ఈ మాంసం ముద్ద నీకు అంత ఆనందాన్ని ఎలా కలిగించిందా అని! ఆశ్చర్యం కూడా! నీకు అది కేవలం బిడ్డ కాదు - వాడు నీ కొడుకు - నాకూ కొడుకే - కానీ నీ వారసుడు! కానీ ఒక్కసారి నా చేతుల్లోకి తీసుకున్న తర్వాత, నా గుండెలకు అదుముకున్న తర్వాత ఒక్కసారిగా ఈ సృష్టి రహస్యం ఏదో ఆ క్షణంలో అవగతమయినట్లయింది. నా ఉనికి, నా సంతానం - ఎంత గర్వించదగిన సంతోషం అది! అవును. పియరీ నా ఆనందం. కాని నాకు సంతోషాన్నివ్వలేదు. వాడే సంతోషం - సంతోషం వేరే లేదు.

ఇప్పుడు బండోల్ వచ్చాను కదా - ఆలివ్ చెట్లు అలా సముద్రంలోకి పరుచుకునే ఉన్నాయి. రేవు దగ్గరకు వెళ్ళాను. జెట్టీని అలాగే వదిలివేశారు. బాగు చేయకుండా - జర్మన్లు - ఇటాలియన్లు ఆక్రమణ తర్వాత. పూలు కొన్నాను. అదే నువ్వు రోజూ నా కోసం తులిప్ పూలు కొన్నావని చెప్పావు. అక్కడే! నాకు బండోల్‌లో నిద్ర చేయాలని ఉంది. అందుకే నువ్వున్న హోటల్‌కి వెళ్ళాను. నువ్వున్న గదినే తీసుకున్నాను. గదిలో తులిప్ పూలను సజ్జలో పెట్టాను. కారు గారాజ్‌లో పెట్టాను. ఆ రాత్రి, రాత్రిలోకి నడిచాను. నాకిప్పుడు ఎటువంటి విచారమూ లేదు (బాధ) అంతా ఖాళీ అయిపోయింది. మళ్ళీ నాకు డిమిటర్ కనపడుతుందా?

ఆకాశంలో చందమామ ఏదో వెలితిగా వెలుగుతున్నాడు. వెలసిపోయి ఉన్నాడు. నా బిడ్డ కోసం ఒక స్మృతి గీతం రాయాలని తాపత్రయపడ్డాను. 'సైప్రస్ సంతానం - ఓ మంచి పదానికి జన్మించాడు - నిశ్శబ్దం నుంచి ప్రాణం పోసుకున్నాడు. స్త్రీ మౌనానికి రూపం!' అలా రాయాలని అనుకున్నాను.

వాడు నీ మౌనం, రామా - వాడి జుత్తు మింట్ వాసన వచ్చేది!

గ్రీకు దేవతలకు అసూయ - నా సంతోషం చూసి అసూయ చెందారు. నా సమర్పణలు ఎటువంటి ఫలితాన్నివ్వలేదు. నాకు డిమిటర్ (Demetor) కనిపించలేదు. సముద్రంలో నుంచి ఏ పడవా బైటకు రాలేదు. అందులో నా బంగారు బాబూ లేడు! అక్కడే తీరంలో కూర్చుండిపోయాను. నువ్వెప్పుడు వస్తావు, యులీసిస్? అంతా వింతగా ఉంది రామా - ఇప్పుడు తరచుగా చర్చికి వెళ్తున్నాను. ఎందుకో నేను శిథిలాలు - ముఖ్యంగా చర్చి - శిథిలాలు బాగా ఇష్టపడుతున్నాను. తిరిగి వచ్చే ముందు సెయింట్ మాక్సిమిన్ (St. Maximin) చర్చికి వెళ్ళాను. అక్కడ నుంచి డొమినికన్ ఆశ్రమానికి వెళ్ళాను. ఎందుకో ఆ వాతావరణం నన్ను బాగా కదిలించింది. ఆ ప్రదేశమంతా తిరగాలని తాపత్రయ పడ్డాను. అక్కడే 'మేరీ మెదలీనా' అవశేషాలున్నాయి. ఒకప్పుడు ఆ ధూప పరిమళం బాధించేది - ఇప్పుడదే నాకు ఏదో తెలియని తీయని వేదన కలిగిస్తోంది. నేనెప్పుడూ మోకాళ్ళ మీద వంగి ప్రార్థన చేయను. అమ్మ చెప్పేది - 'ఎప్పుడూ అలా చేయకు - ఎవరికి తెలుసు - ఎన్ని అంటురోగాలుంటాయో ఆ ప్రదేశంలో' అని హెచ్చరించేది. ఆ భయం ఇంకా పోలేదు - ఇక ఇండియాలో ఎలా తిరగగలను? నువ్వు చిన్నమ్మతో వారణాసి వెళ్తున్నానని చెప్పావు. నాకు కాశీ గురించి తెలిసింది- గంగానదిలో మానవ శరీరావయవాలు కొట్టుకు రావటం. ఒడ్డున 'మండుతున్న చితులు'! కాని గంగా జలాల్లో ఎటువంటి బాక్టీరియా లేదని పరీక్షించి చెప్పారు కదా. యూరోప్‌లో బాక్టీరియా లేని సమాధులున్నాయా? చర్చి నేలమాళిగలున్నాయా? సెయింట్ మాక్సిమిన్ చర్చికి

వెళ్ళటం ఒంటరిగా ఇష్టం లేదు. అప్పుడప్పుడూ వెనక్కి తిరిగి చూసే దానిని. నీవు తెలియకుండా వచ్చావేమోనని. యాక్స్‌లో నేను కనపడకపోతే వెతుక్కుంటూ వచ్చావేమోనని! ఈ రోజుల్లో విమానాలున్నాయి. అన్నీ సాధ్యమే కదా! కానీ రామా, ఈ ఒంటరితనం ఎంత బాధాకరం! మగవాడు లేకుండా ఆమె పరిపూర్ణ ఎలా అవుతుంది - పవిత్ర ఎలా అవుతుంది? ఈ విషయంలో మీవాళ్ళే సరైన మార్గం చూపుతారు. అవును మగవాడే స్త్రీని దేవుని సన్నిధికి తీసుకు వెళ్ళగలడు!

రామా నువ్వంటే నాకు పిచ్చి ప్రేమ! వింతగా తెలియని పశ్చాత్తాపంతో నిండింది. నిన్ను ప్రేమిస్తున్నానంటే నామీద ప్రేమ లేదు అని! నీ పవిత్రతను ప్రేమించగలనా? నీ మనోబలాన్ని ప్రేమించగలనా? నీ గుండె గోడలను ఛేదించగలనా? చెప్పానుగా - నువ్వు కనిపించని రాతిగోడవి - నేనెలా కూలగొట్టగలను? ఒకసారి - ఓ జ్యోతిష్కుడు చెప్పాడు - 'ఎప్పటికీ నిరాశపరచనివాడు' అని ఏమో? నిన్ను నిజంగా ప్రేమించగలనా? ఎన్ని సందేహాలు! ఒక్కోసారి నా చెంతనే - నాలోనే ఉంటావు. కాని కనిపించవు - ఏదో నైరూప - రూపంలా మార్మికంగా ఉంటావు. నువ్వు పొద్దున్నే కాఫీ కలిపి ఇచ్చినపుడు - నేను పాడుకుంటూ కాలేజీకి వెళ్ళి పాఠాలు చెప్తుంటాను.

నువ్వు లేకపోతే నేనుంటానా? నీలాంటి ఉన్నతుడు - అమానవుడు - నా భర్త అయినందుకు - ఈ ప్రేమ నాకు అంతుబట్టటంలేదు - అసలు భారతీయులు ప్రేమించగలరా? రామా, కానీ నేను ప్రేమించగలను - అందుకే నీ కోసం ఎదురు చూసే ఓ పిచ్చిది..

పి.ఎస్.: ఒక్కోసారి నాకు ఆశ్చర్యం - నేను కూడా నీలాగా మారిపోతున్నానని!"

మా రైలు బండి కూడా మంత్రాలు వల్లిస్తున్నట్టుంది. నమస్తేతు - గంగే - త్వదంగే - భుజంగే - హరిరాం - హరిరాం - రామ హరే - కొండపైకి వెళ్ళినప్పుడు - శివ శివ - హర హర శివ - రాత్రంతా అలా గడిచిపోయింది - మధ్యలో శ్రీధర్ ఒకటి రెండుసార్లు లేచాడు - చిన్నమ్మ నిద్రలో ఏదో అస్పష్టంగా చెప్పింది - 'సరోజా' మంచినీళ్ళు తీసుకురామ్మా..' తర్వాత అంతా నిశ్శబ్దం. శూన్య - నిశ్శబ్దం - ఖాళీ - స్టేషన్లు - మధ్యలో చాయ్ - చాయ్ అంటూ కేకలు - యాత్రికుల మాటలు - రైలు కొండపైకి వెళ్తూనే ఉంది... బాగా చల్లబడిపోతోంది. నేను లేచి చిన్నమ్మ పాదాలపై రగ్గు కప్పాను - 'అరే రామా - నీ దగ్గు నేను భరించలేకపోతున్నానురా - భయంగా ఉంది' అంటోంది నిద్రలో - నేను దగ్గుతున్నానా?

బోగీ కిటికీ అద్దాలు - పొగమంచుతో తెల్లబడిపోయాయి. ఉదయంకాక ముందు కాఫీ తీసుకొచ్చాడు. పాంట్రీ నుంచి - వేడిగా ఉందిగాని బాగోలేదు.

హిమాలయాల సెడార్ చెట్లు - బిర్చి కొమ్మలు - పరచుకుని కదులుతున్నాయి. అక్కడక్క బంగళాలున్నాయి. లేళ్ళు పరుగులు పెడుతున్నాయి. రైలు మోతకు కంగారు పడుతున్నాయి. పచ్చని చిలుకలు మెడచుట్టూ పసుపు పచ్చని సన్నని కంఠాభరణాలతో ఎగురుతున్నాయి. హిమాలయాల ధవళకాంతులు ఆ పైగా కనువిందు చేస్తున్నాయి. శబ్ద తరంగాలతో చైతన్యంతో వెలిగిపోతున్నాయి. అక్కడ నుంచే గంగ చిన్న సెలగా - సెలయేరుగా మామూలుగా పరవళ్ళు తొక్కుతోంది. స్వచ్ఛంగా - ఎప్పటి నుంచో ప్రవహిస్తున్న గంగ - సర్వం తెలిసినట్లు నిత్యనూతనంగా పరుగులు పెడుతోంది. జ్ఞానమే జలమైతే అది గంగాజలమే - సప్తసముద్రాల సంగమానికి ఉరకలు వేస్తూ గంగాజలమే - జ్ఞానం!

ఎక్కడో ఆ చెట్ల మధ్య ఖాళీలో నుంచి ప్రసరించే వెలుగులు మరెక్కడో కస్తూరికా సుగంధం - హరిద్వార్ పర్వతాల నిశ్శబ్దం నుంచి నాకేదో సరికొత్త జ్ఞానం తెలియ వస్తోంది - ఒక శూన్యం! ఒక శూన్య జ్ఞానం! ఇది పర్వతాలకు తెలుసేమో - అందుకే ఆ దిక్కుగా చూశాను - హరిద్వార్ రిషికేశ్‌కి పైగా గంగోత్రి - గంగామాత జన్మస్థలం - ఆ మంచు పర్వతాల చెంతనే కదా - ఆ పర్వతాలకావైపు నుంచే బార్బేరియన్లు వచ్చారు - ఈ గంగ - ఈ బ్రహ్మపుత్ర వారి దాహాన్ని తీర్చింది. బ్రహ్మపుత్ర - టిబెట్టు దాటి గంగతో సంగమించి సముద్రాన్ని చేరింది. నిజానికి ద్వంద్వాలు - భారతీయులు అంగీకరించరు. అద్వైతమే వారి సిద్ధాంతం! అదే సత్యం! ఈ జలాలే మానవాళిని ప్రక్షాళనగావిస్తాయి. ఇక్కడ మరణానికి అర్థం లేదు. పియరీ చనిపోలేదు - ఎవరన్నారు - నా కొడుకు చనిపోయాడని - నా నడుము నరాల్లో వాడి కదలికలు నాకు తెలుస్తూనే ఉన్నాయి. నీ అస్తిత్వం తెలుసుకుంటే శూన్యము - లేనితనం ఉండదు. ఈ పర్వత లోయల్లో మ్రోగేది - శూన్య నినాదం - ఒకే ఒక అక్షరం - అనాదిగా వినపడుతోంది. అది ఓంకారం కాదా?

ఆ సాయంత్రం డెహ్రాడూన్ చేరాం. మర్నాడు చిన్నమ్మను ముస్సోరి తీసుకు వెళ్ళాను. హామిల్టన్ పాయింట్ నుంచి - హిమవత్పర్వతాల ధవళ సౌందర్యాన్ని చూసి ఆశ్చర్యపోయాం. ఆ రోజుల్లోని హిమపాతాలు - ఆకాశపు శూన్యాన్ని ప్రతిధ్వనిస్తున్నాయి. అక్కడేగా శివుడు నివసించేది - అక్కడేగా భవానికి భావానికి

మధ్య తేడా చెరిగిపోయేది - అక్కడేగా మన పూర్వ జన్మ నేపథ్యం తెలిసేది?! ఆ తర్వాత ప్రయాణం నాకంతగా గుర్తు లేదు - ఎంతో అయిష్టంగానే హిమాలయాలు, గంగా తీరం వదలి రాలేకపోయాం. దగ్గర బంధువుల్ని వదలి రాలేకపోయినట్లు - నుదుట కుంకుమ పెట్టి - పూలు దోసిళ్ళలో పోసి కాళ్ళకు పసుపు పూసి మమ్మల్ని సాగనంపినట్లుగా వ్యథ చెందాం - అదుగో గంగలో ఆ పూలు ప్రవహిస్తున్నాయి - పసుపుమయంతో ఆమె రంగు మారిపోతోంది. హిమాలయం అంటే శివుడే! సుదూరాన - స్పష్టంగా నా చెంతన ఉన్నట్లు నీవు లేనట్లు నీ వెనక ఆ వెనక ఇంకా వెనక అనంత కాలంలో శూన్యంలో కలసిపోతున్నట్లు ఆ శూన్యంలో నుంచి నీ ఆత్మ రూపుదిద్దుకున్నట్లు అన్నీ ఒకేసారి నీ అనుభవంలోకి వస్తున్నాయి. ఇక్కడ ఎవ్వరూ - ఎక్కువ కాదు - ఎవ్వరు తక్కువ కారు. అందరూ మర్త్యులే - ప్రకృతి తెలిసినవాడికి అన్నీ తెలిసి వస్తాయి - సుషిప్తిలో అన్ని మెలకువగా ఉంటాయి. ఈ సాధువులు చూడండి ఎలా నిద్రపోతున్నారో - యోగనిద్ర అదే జ్ఞానయోగం! హిమాలయాలంటే జ్ఞానం - యోగం - యోగం - శూన్య యోగం!

ఈ హిమాలయ సానువుల్లో సాధువులుంటారు - రాగద్వేషాలుండవు. పులులు - లేళ్ళు - అన్నీ కలిసి జీవిస్తాయని మన పురాణాలు ఘోషిస్తున్నాయి. కానీ వర్తమానంలో వార్తాపత్రికల్లో చదువుతూనే ఉన్నాం - పొలంలో పనిచేసేవారిని పులి చంపిందని - ఆహారం కోసం - పులిని చంపినవారికి 500 రూపాయలు బహుమతి ప్రభుత్వం ప్రకటించిందని! కానీ, ఆ చెట్ల క్రింద లేడి కళ్ళను చూడండి - అక్కడ నాట్యమాడుతున్న నెమలిని చూడండి - వేణుగానం వినిపిస్తుందని - తన్మయత్వంలో - మీరాబాయి.

కృష్ణకన్నయ్య - నేనెక్కడికి వెళ్ళాను? నువ్వెక్కడున్నావని నీ వేణు నాదం వినపడుతూనే ఉంది. గోవులు నీ చుట్టూ ఉన్నాయి! మీరాబాయి రాజపుత్ర వంశం కదా - కృష్ణుణ్ణి రాతోడ్‌ను చూసినట్లు చూడగలదు. అతని చేతి ఉంగరాలను సవరించగలదు. అతని కంఠాహారాల్ని లెక్కించగలదు! డోలు, సన్నాయి మోగుతుంటే, ఆ ఊరేగింపు ముందుకు వెళ్తుంటే రాధికలంతా అతని రాకను 'చూడరే కృష్ణుడొస్తున్నాడు' అని పాడుతుంటే నెమలి పింఛం విప్పి నాట్యం చేస్తుంది - తన ఈకను అతనికి అలంకరించవచ్చని - వేణుగానం వినిపిస్తూనే ఉంది. లేడి కూనలు పరుగులు మాని అతని చుట్టూ చేరుతున్నాయి.

మురారీ - నా గుండియ గిన్నెలో వెన్న తెచ్చాను-

నా చితి మంటను నీవే వెలిగించు - నా చితాభస్మం నీ నుదుట ధరించు-

మురాదాబాద్ నుంచి మళ్ళీ మామూలు పట్టాల ప్రయాణం - కొండ పట్టీని వదలి! అక్కడ నుంచి ఢిల్లీ, జమునా నది. జమున అంటే గంగమ్మ తల్లికి కాళింది నది - కూతురే! ఢిల్లీ అంతా బాధామయంగా ఉంది. కాందిశీకులతో, భర్త, కొడుకులు పోయిన స్త్రీ జనంతో విచారగ్రస్తంగా ఉంది. దేశ సరిహద్దులు మారిపోవడంతో చిన్నాభిన్నమైన కుటుంబాలు - ఎన్ని కమిషన్లు వేసినా న్యాయం జరిగేది ఎవరికి? చిన్నమ్మ మహాత్ముని సమాధి చూస్తానంది - జమునానది ప్రక్కన ప్రదక్షిణ చేసి వచ్చింది. నదిలో కాళ్ళు కడుగుకుని ముఖాన నీళ్ళు జల్లుకుంది. బహుశా ఈ మారణ కాండకు దూరంగా ఉండగలిగినందుకు ప్రార్థించి ఉంటుంది.

ఢిల్లీ నుంచి వింధ్య పర్వతాలను చుట్టి బొంబాయి చేరాము. మాతుంగలో స్నేహితుల ఇంట ఉన్నాం - మమ్మల్ని ఎంతో దయగా చూశారు. కాని ఇదేమి సిటీ? ఇంత దారుణంగా ఉందే! ఇక్కడ వ్యాపారం తప్ప మరేమీ లేదు - నాలాంటివాడు అసలు ఉండలేడు. ఇక్కడి భాష వీరి జీవన విధానం ఇది పూర్తిగా నాన్ ఇండియన్ (అభారతం). బొంబాయిలో వ్యాపారస్తులు తప్ప మహాత్ములు ఎవ్వరూ రాలేదు - కాలు పెట్టలేదు. ఇంత అసహ్యంగా ఉంది. ఎవరో చెప్పారు 'వనగంగ' దగ్గరకు వెళ్ళండి అని. చిన్నమ్మ గంగ పేరు వినగానే సంతోషం కలిగింది. "చూడు - చూడు అదిగో ఆ వెలుతురు వారణాసిలాగానే ఉంది!" అంటుంది. చిన్నమ్మ, నేను ఆ సముద్రపు ఇసుకలో కూర్చొని కుటుంబ విషయాలు మాట్లాడుకున్నాం. చిన్నమ్మ బాధ అంతా సరోజ, సుకుమారి గురించే. "రామా! నీ తల్లి వేరయినా నువ్వు నా కొడుకువే - ఇంటి పెద్ద కొడుకువి - కానీ సరోజ - సుకుమారి అలా కాదు - వాళ్ళమ్మగారి ఇంటితో వారి బంధం ఎక్కువ - నా తండ్రి చిన్ని గుమస్తా - నేను ఈ ఇంటికి అంకితమైపోయాను. ఇన్నాళ్ళు మీ నాన్న ఉన్నారు - వాళ్ళ మంచి - చెడు చూడటానికి - ఇప్పుడు నా బిడ్డే నెలలవాడు - నువ్వు ఎంతో దూరాన ఉన్నావు - ప్రతి రాత్రి నాకు నిద్ర పట్టదు - నీ దగ్గు వినిపించినప్పుడు నా బాధ చెప్పనలవి కాదు - ఆడవాళ్ల బాధ - మగవారికి ఎలా అర్థం అవుతుంది?" అంటుంది.

సముద్రపు నీరు వాసన మధ్యలో అగరబత్తులు పొగ సువాసన వస్తోంది. ఇప్పుడు శూన్యం - శూన్యం కాదు - అస్తిత్వానికి అది ఒక వలయం- "చిన్నమ్మా! నీకెందుకు దిగులు - నేనున్నాను - ఏమి చేయాలో చెప్పు - నేను చూస్తాను" అని భరోసా ఇచ్చాను. శివాలయంలో గంటలు మోగించి వచ్చాం - ప్రసాదం తీసుకున్నాం - కర్పూర హారతి మంగళ హారతి పాడుతున్నారు. తర్వాత చిన్నమ్మ "రామా! నాకు

మాటివ్వు'' అంది. ''మీ నాన్న ఎప్పుడూ చెప్పేవాడు - నా పెద్ద కొడుకు అందరిలాంటివాడు కాదు, వాడు సర్వ స్వతంత్రుడు, వాడి మానాన వాడిని బ్రతకనీ అని - అదే నేను కోరేది. నీ జీవితంలోకి మేము రాకూడదు. అప్పుడప్పుడు ఉత్తరాలు రాస్తుండు. రెండు సంవత్సరాలకు ఒకసారి వచ్చి కనపడు. ఇంటికి పెద్ద కొడుకు ఉన్నాడు - అతని రక్షణలో కుటుంబం ఉంది అని అందరికీ తెలుస్తుంది'' అన్నది. ''అలాగే చిన్నమ్మా - పెళ్ళిళ్ళకు పేరంటాలకు వస్తుంటాను'' అన్నాను.

శ్రీధర్ పెద్దవాడైతే నీ బాధ్యత వాడు తీసుకుంటాడని అంది. ఈ సంభాషణ తర్వాత చిన్నమ్మలో ఓ ప్రశాంతత ఏర్పడింది. సరోజ కోసం సుకుమారి కోసం మనం బట్టలు, చాక్లెట్లు కొనాలి అంది.

మా కోసం కుటుంబం అంతా స్టేషన్‌కు వచ్చింది. పనివాళ్ళు శ్రీను, కిట్టు, మామ శీతారాము - అందరూ! కిట్టన్న తాత తన ఆశీర్వాదాలు పంపాడు.

చిన్నమ్మ ఇల్లు వదలినప్పుడు ఒక విషాద చిత్రం, ఇప్పుడు బాగా కోలుకుంది.

సరోజ ముందుగా గుర్తించింది. ''చిన్నమ్మా! బాగా చిక్కిపోయావు. రామన్నకు అమ్మలా లేవు - అక్కలా ఉన్నావు'' అంది. నేను సరోజతో ''అవును, ఇంటికి పెద్దను ఇప్పుడు. నేను వెళ్ళిన తర్వాత చిన్నమ్మ ఈ ఇంటికి యజమానురాలు. మీరంతా ఆమె మాట వినాలి సుమా'' అన్నాను. ''అలాగే'' అని అన్నారు సరోజ, సుకుమారి.

ఇక ఆ రాత్రి చిన్నమ్మకు అన్ని సేవలూ చేశారు. ఇంటిల్లిపాదీ జరిగిన విషాదాన్ని మరిచిపోయి కొత్త జీవితాన్ని ప్రారంభించినట్లు సందడిగా వరండాలో చేరి మా ఉత్తర దేశ యాత్ర విశేషాలు అడిగి మరీ విన్నారు. చిన్నమ్మ ఎంతో ఉత్సాహంగా తన కలకత్తాలో బ్రాహ్మణ హోటల్‌లో పడిన పాట్లు - చేపల కూర శాకాహారం అని పెట్టారు అని ఓరి నాయనో అదేమి ఉత్తరాది! మన వల్ల కాదమ్మా అని గొడవ చేసింది.

వరండాలో చల్లగాలికి నిద్ర ముంచుకొస్తోంది. తాడిచెట్లు, మల్లెపందిరి - పిల్లతెమ్మెరలు - ఆహా - నేను ఇంటికి వచ్చేశాను! సరోజ - అవును సరోజకి ఇప్పుడు 17 సంవత్సరాలు. యువతి స్త్రీగా మారటం గమనించాను. ఎంత అందంగా యౌవనం ఉంటుంది. ఆమె పొడగరి. మిసిమి ఛాయ - మా అందరిలాగే ఆమె మౌనం. ఒక సంగీతం - ఎవరికీ ఏమీ చెప్పదు - అమూల్యమైన విషయాలు అసలే మాట్లాడదు

- నా చేతి గీతలు చదవగలదు - ఎన్ని కథలల్లగలదో - ఇదంతా తన రహస్యాల్ని దాచుకోవటానికే! సుకుమారి - ఇందుకు భిన్నం. ఆమెకు ఏదో భయం - అందుకే అందరితో పోట్లాటకు దిగుతుంది. చిన్నమ్మకు వంటింట్లో సాయం చేస్తుంది - రసం కాయటానికి!

సరోజ నాకు ఒక మాయగా కనిపించింది. గొప్ప ఉత్సాహంతో మెరిసిపోతోంది. ఇంతవరకూ నేను చూడనే లేదు. ఒక యువతి స్త్రీగా మార్పు చెందటం. ఎన్ని వేల రూపాల్లో దర్శనమిస్తోంది? సిగ్గుపడటంలో, భాషలో, మాటలో, నడకలో, అలంకరణలో తన నిండు రూపంతో! నేను యూరోపు వెళ్ళినప్పుడు ఆమెకు పదహేనేళ్ళు - సుకుమారికి తొమ్మిదేళ్ళు.

ఇప్పుడు సరోజ నాకు ఒక అబ్సెషన్! ఒక మొగలి పొదలా పరిమళాలు వెదజల్లుతోంది. తన ఉనికికి ఒక ప్రత్యేకత ఉన్నట్లు ఆ విషయం ఆమెకు తెలిసినట్లు! ఆమె నాకు చెల్లెలు. అందుకని నాకీ విషయం మరెంతో పరీక్షగా తెలుస్తోంది. ఆమె కోసం పూలు కోసి తెస్తుంటాను. ఇద్దరం చాలా దూరం నడుచుకుంటూ వెళ్తుంటాము. యూరోప్ గురించి మెదలీనా గురించి చెప్తుంటాను - సరోజకు యూరోప్‌లో చదవాలని డాక్టరు కావాలని కోరిక. తర్వాత చిన్నమ్మను తన వద్దకు తీసుకు వస్తానని అంటుంది. నాకు నిజంగా సరోజ సమక్షంలో నేనేదో మత్తులో జోగుతున్నట్లుంది. ఓ జలపాతం దగ్గర లేడిలాగా! ఓ పర్వతం ముందు ఏనుగులాగా - ఆమెలో నిద్ర లేస్తున్న యౌవన సౌరభం - సంరంభం స్పష్టంగా తెలియవస్తోంది. ఓ కొత్త చందమామలాగా - ఓ సమరాత్రిలాగా - ఆమెలో మృగయా పరిమళం - స్పష్టంగా తెలుస్తోంది. ముత్యపు చిప్పలో ముత్యం ఉన్నపుడు స్వాతి వానకు ఎదురు చూస్తున్నట్లు - అంతేనా - ఒక దేవాలయంలోని పవిత్ర భావన కూడా ఆమెను అల్లుకుని ఉన్నది! ఇప్పుడు నాకు అర్థమవుతోంది - ఆదిమ మానవులు తమ నేలను పంటకు సిద్ధం చేసే ముందు ఎందుకు స్త్రీ ఋతురక్తాన్ని సమర్పించేవారని. భారతీయులు తమ స్త్రీలకు ఎంత అందమైన పేర్లు పెడతారు! మాళవిక, శకుంతల - వీరు పూలను ఎలా పెంచారో కదా - స్త్రీ ముందు పురుషుడు మోకరిల్లవలసిందే - అందుకే సరోజ ఓ రాజకుమారి! అంతే!

సరోజ తన చీర ఒకటి మెదలీనా కోసం ఇచ్చింది - నేను యూరోప్ బయలుదేరే ముందు. ఆమె క్షేమం కోసం నేను ప్రార్థన చేశాను. నా అంతరంగపు లోతుల్లో నాకు తెలుస్తూనే ఉంది. ఇంతకు పూర్వం లేనిదేదో రూపుదిద్దుకుంటుందని-

నా అనుభవంలోకి వచ్చింది సరోజ సౌందర్యం - పరిమళం కాదు. అది గంగా యమునల సంగమం-

కాశీ క్షేత్రం ఎక్కడో లేదు.
నా ఉనికిలోనే ఉంది.
కాశీ క్షేత్రం శరణం, త్రిభువన జననం -
నాకు తెలుసు-
వధువులంతా వారణాసిలోనే జన్మిస్తారు!

రెండవ అధ్యాయం:

మెదలీనా

నా తిరుగు ప్రయాణం అంత శుభప్రదంగా సాగలేదు. నేనెక్కిన విమానం 5 గంటల తర్వాత అప్పటికి కైరో చేరవలసింది, తిరిగి బొంబాయి వచ్చింది. ఏదో సాంకేతిక లోపం కారణంగా. ఆ అర్ధరాత్రి మమ్మల్ని మరో విమానం ఎక్కించి, గాలిలోకి పంపారు. కైరోలో దిగకుండానే రోమ్ చేరాం. కానీ నైస్ వెళ్ళవలసిన నా విమానం అప్పటికే వెళ్ళిపోయింది. మెదలీనాకు తంతి పంపాను. నాకోసం విమానాశ్రయానికి రావద్దని. ఆమెను కిటికీ వెనీషియన్ తెర వెలుతురులో, లేత ఆకుపచ్చ కోటులో, ఆమె బంగారు కురులు భుజాలు కప్పుతుంటే, అదంతా ఆ వెనకనే ఉన్న అద్దంలో కనబడుతుంటే చూడాలని రావద్దన్నాను. రోమ్ నుంచి జెనీవాకి వెళ్లాను. అక్కడి నుంచి మార్సిలే వెళ్లేందుకు వీలుగాక పారిస్ వెళ్లాను. ఇక్కడి నుంచి మర్నాటి ఉదయమే విమానం ఉంది. 'మార్సిలే'కి. సామాను ఎయిర్‌పోర్టులోనే ఉంచి, ఆ అర్ధరాత్రి నుంచి ఉదయం వరకు సీన్ నది వెంట అలక్ష్యంగా తిరిగాను. పారిస్ నగరం నా నరాల్లోకి చేరిపోతోంది.

పారిస్ ఒక నగరం కాదు. దానికంటే ప్రత్యేకం. మనలో ఒక భాగం - మన అస్తిత్వంలో పారిస్ అంతర్భాగం. ఒక సమతాళం! ఇక్కడే సీన్ నది ప్రవహిస్తుంటుంది. ఈ నిర్మాణాలలో దైవత్వం లేదు. కానీ పారిస్ వీధుల చివర ఉన్న పైన్ చెట్లలో, బంగాళాదుంపలు, ఉల్లిపాయలు, బాతులు, ఆకుకూరలు, ఆవు మాంసం చేరవేసే లారీల మోతలో ఉంది. పంచదార, మింట్, మిరియాల సువాసనలలో పారిస్ ఆత్మ ఉంది. అదిగో మేరీకి విగ్రహాన్ని నిలిపాడు! శిల్పి తన బాధలను, తన ప్రార్థనలను, దైవ శక్తిని - అన్నింటినీ పాలరాతి విగ్రహంలో నివేదించుకుంటూ!

ఈ పాలరాతి పొరలలో తన ఆలోచనల తాదాత్మ్యాన్ని శూన్యాకాశం వైపు చూపిస్తూ తను క్రిందనే ఉండిపోవాలని తన లోతులను అన్వేషించుకోవాలని తపించాడు. వర్జిన్ మేరీ తన ఒడిలో దేవుని బిడ్డను పెట్టుకొని ఎలా కూర్చుందో! ఇదే వారణాసిలో అయితే ఒక గంగిగోవును ఆమె దగ్గరకు తీసుకు వెళ్ళేవాడిని. అప్పుడే తూరుపు వెలుగు

పారిస్‌లో ఒక వీధి

రేఖలు సీన్ వారధులను కలుపుతున్నాయి. ఈ మేల్కొలుపు త్వరలోనే మన చిల్లర పనుల్లో రోజు మాసిపోతుందని చెప్పకనే చెబుతోంది.

పారిస్ కూడా వారణాసిలాంటిదే. ఇది బాహిరికం. ఇదే వారణాసిలో అయితే ఈ 'బాడీవేర్' ఇంకా సత్యవంతంగా, ఇంకా అర్థంతరంగా, ఇంకా స్పష్టంగా దర్శనమిస్తుంది! గంగాప్రవాహం సూర్యోదయ కిరణాలను వజ్రాల అగాధంలోకి ఒంపినట్లు నిర్లక్ష్యంగా - ఈ సీన్ నదీతరంగాలు ఉదయ కాంతితో మెరిసిపోతున్నాయి.

అప్పుడే పనికి వెళ్తున్నవారితో కలిసి కాలి బాట, 'కేఫ్'లో వెచ్చని కాఫీ తాగాను. మళ్లీ నడుస్తూ 'నేనెక్కడ ఉన్నాను' అనుకుంటూ 'బోర్గె' (Bourget) చేరి విమానంలో కూర్చుని ఆనందంగా ఆవులించాను! ఫ్రాన్స్ అంతా కారెట్ల - తుర్లిప్ల తోటలా పరుచుకుంది క్రింద. తెల్లని మార్గాలు, పచ్చని చెట్లు, పురాతన రాజభవనాలు - ఇవన్నీ అనంతంగా ఉన్నాయి. అంతేనా - ఎక్కడో సముద్రాల్లో కలిసిపోతున్నాయి. ఫ్రాన్స్‌లో మార్గాలన్నీ, వీధులన్నీ నోట్రాడామ్ దగ్గర నుంచే మొదలవుతాయి!

లయన్ తర్వాత వాతావరణం బాగోలేదు. మారిజినానె (Marignane) రాగానే ఏదో మామూలు పారిస్ ప్రయాణం నుంచి ఇంటికి వస్తున్నట్లుంది. టాక్సీ డ్రైవర్ హెన్రీ నన్ను గుర్తు పట్టాడు. "చాలా సామాన్లున్నాయా" అన్నాడు నవ్వుతూ. నా దేశం వెళ్లి వస్తున్నట్లు చెప్పాను. "అవును, చాలా అందమైన దేశం కదూ" అన్నాడు. దారిలో ఓ పూల దుకాణం దగ్గర కారు ఆపాడు. అతనే పది - పదిహేను ఫ్రాంకులకు పూలగుత్తి కొని "ఇవి మదామ్‌కి" ఇవ్వండి అన్నాడు. ఇవి ఆమె వేసుకునే లేత పచ్చని సూటుకు బాగా సరిపోతాయి. వీటిని 'రాణిగారి పూలు' అంటాము అన్నాడు.

దక్షిణ ప్రాంతంలో నాగరీకులు ఇలాగే ఉంటారు. ప్రకృతిలో పవిత్రంగా జీవించేవాళ్ళు ఇలాగే ఉంటారు.

నాకిది వింతగా ఉంది. కారు కొండ మార్గంలో మెలికలు తిరుగుతూ వెళ్తుంటే నేను ఇంటికి తిరిగి వస్తున్నట్లు లేదు, ఏదో ఈ భూతలం మీద నా శ్వాసతో నా అవయవాలతో తాదాత్మ్యం చెందిన నాలో భాగంగానే అనిపించింది.

పరిచయం లేని జ్ఞానంలా, అపరిచిత పరిజ్ఞానంలా! ఇక్కడే - ఎక్కడో నా అస్తిత్వాన్ని దాచిపెట్టుకున్నట్లు అది ఇప్పుడే నా చేతనావస్థలోకి వస్తున్నట్లు - సూర్యుడు సైప్రస్ చెట్లలో దాగుడుమూతలాడుతున్నాడు. చూడండి - గాలికి వంగుతున్న ఆ చెట్లు నాలో బాధతో, వేదనతో మూలుగుతున్నట్లున్నాయి. కానీ

నాకు తెలుస్తూనే ఉంది - ఇది కొత్త కొనసాగింపుకు నాంది అని. మెదలీనా గురించి నా దేశానికి చెప్పాను కదా! చిన్నమ్మ తన కాలి మెట్లను, అవే మా అమ్మ పెట్టుకున్నది - తన ఆశీర్వాదంతో ఇచ్చింది కదా! 'అమ్మ నుంచి కోడలుకు - నాన్న నుంచి కుమారునికి ఈ పరంపర సాగవలసిందే' అని కదా అంది. చివరకు మెదలీనా నా సొంతం కాబోతోందన్న నమ్మకం కలిగింది! *వంశ పారంపర్యంగా వస్తున్న ఈ నగలు, ఈ బంగారం, వజ్రాలు, మామిడి పిందెల హారం, ఆమె మెడలో అలంకరించినప్పుడు ఆమె వ్యక్తిగతంగా నీ సొంతం అవుతుంది! ఈ పగడపు ఉంగరం తొడిగినప్పుడు ఆమెలో నీవంటే ఒక ఆరాధనా భావం కలుగుతుంది - ఆమె మానసిక ప్రదేశాన్ని నీవు ఆక్రమించినట్లే!*

ఆమె స్తనాల మధ్య స్వచ్ఛమైన ఈ నగ మెరుస్తుంటే ఆమె తన యౌవనాన్ని నీకు అర్పించుకున్నట్లే!

రాజులు, చక్రవర్తులు రాజ్యాలు ఏలారు - ఇలాంటి రాజముద్రికలతోనే!

ఈ కాలి మెట్లు మా అమ్మకి మా నాయనమ్మ ఇచ్చింది. అమ్మ తర్వాత సరోజ అమ్మకు చేరాయి. ఆమె బొద్దుగా ఉండేది. వాటిని సాగగొట్టారు. ఆమె తర్వాత ఇదిగో చిన్నమ్మకు వచ్చాయి. ఇప్పుడు చిన్నమ్మ మెదలీనాకు పంపింది. ఎంత చక్కటి ఆలోచన! మెదలీనా! ఆమేకదా నా బిడ్డ 'కృష్ణ'ను కన్నది. వాటికున్న చిరుగంటలతో మెదలీనా నడుస్తుంటే ఎంత కర్ణపేయంగా మ్రోగుతాయి - పియరీకి ఇవి ఎంతగా నచ్చేవో కదా - వాడికి తన గతం తెలిసేది కదా!

ఈ ఆలోచనలన్నీ నాకు ఏదో అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. మా ఇంటి వెనుక ఉన్న పర్వతాలు ఏదో సాధువులాగా నిలబడి ఉంటాయి. నా క్రిందగా స్టే - విక్టరీ చర్చి ఉంది. దానికి దగ్గరలోనే 'స్టే ఆనీ విల్లా' ఉంటుంది. అందులో రెండు గదులు - కళ్ళు తెరుచుకుని నాకోసం చూస్తుంటాయి. మా ఇంటి వెనక పర్వతం నాకు ఎక్కడ లేని శక్తినిస్తుంది. కైలాస పర్వతంలాగా పవిత్రంగా! ఒక్కోసారి గాలి స్తంభిస్తుంది - ఎక్కడి నుంచో నిశ్శబ్ద సంగీతం వినిపిస్తూ ఉంటుంది - "చూడు లీనా - పార్వతి తన పాటను శివునకు వినిపిస్తోంది" అనేవాడిని - మెదలీనా నవ్వేది. ఆమె బిగ్గరగా నవ్వేది - ఆమె అపనమ్మకమే నా విశ్వాసానికి రుజువులాగా ధ్వనించేది!

మెదలీనా అతి నమ్మకాలను నేను గౌరవించినా - ఆమె నా 'మూఢ' విశ్వాసాలకు విలువ ఇచ్చేది కాదు. డువాన్ దగ్గర్లో ఆల్ఫ్ పైన్ చెట్ల నీడలో పడుకుని ఎండ పొడ వెచ్చదనాన్ని ఇద్దరం పంచుకునేవాళ్ళం. ఒకరోజు అక్కడ ఉన్న రాళ్ళు పేర్చుకుంటూ చిన్న గుడి కట్టాను. గర్భగుడి కూడా తయారయింది. ''ఇప్పుడు శివలింగం కావాలి'' అని ఆమెతో అన్నాను. ''నీకు తెలుసా - బేలూరులో చెన్నకేశవస్వామి - నదిలో తేలి వచ్చాడు - ఊరంతా ఊరేగింపుగా మేళతాళాలతో వెళ్లి, స్వామిని 'ఓంకార' నాదాలతో పల్లకిలో తెచ్చి, గుడిలో ప్రతిష్టించారు - 'చెన్నకేశవ' అంటే 'అందమైన కురులు' అని అర్థం - ఆయన కురులు పెరుగుతుంటాయి తెలుసా'' అని అన్నాను.

''ఇక్కడ కూడా 'శివలింగం' ఉంటుంది - వెతుకుదాం'' - అని పురమాయించాను. నది బారునే వెతికాం. పచ్చల కోసం, చలువ రాళ్ళ కోసం. నీటి ఒరవడికి గుండ్రంగా మారిన 'గులక'రాళ్ళ కోసం వెతికాం. అదిగో నా 'శివుడు' దొరికాడు - నీటి అడుగున లింగాకారంలో! చంద్రవంకను - తులసి ఆకులను ఇవ్వలేము కదా - వన్నె పూలు - లేత నీలి పూలు - వీటితో అలంకరించాను. మెదలీనా నీటితో అభిషేకం చేసింది. ఇదిగో గంగ అంటూ శివశివ హరహర అంటూ వణికిపోయింది. సరిగ్గా 'రామా! నిన్ను ప్రేమిస్తున్నాను' అని చెప్పినప్పుడు కూడా ఇలాగే కదిలిపోయింది. అది సీన్ నది ప్రక్కన రోన్ దగ్గర! నన్ను హిందువుగా మారుస్తావా! కావాలంటే చీర కట్టుకుంటాను అంది. ఆ సాయంత్రం సీన్ ప్రవాహం ప్రక్కన - ఆమె భావావేశంలో తన్మయత్వంలో ఉంది!

''గ్రీకు దేవుళ్ళు - హిందూ దేవుళ్ళు ఉండరు - లీనా! వారంతా మనం సృష్టించుకున్నదే - చూడు - ఇక్కడ నాకు శివుడు దొరికాడు కదా - అలాగే గ్రీకు దేవతలను గ్రీకులు సృష్టించుకుంటారు - తర్వాత వారే రోమన్లు - క్రిష్టియన్లగా మారారు కదా! ఈ ప్రపంచం మనం తయారు చేసుకున్నదే'' అన్నాను. ఆమె ఆలోచనలో ఉండిపోయింది. ఈ మానవ శాస్త్ర విశేషాలు ఆమెకు అర్థమయినట్లు లేదు- ఇంటికి చేరేసరికి - ''చూడు - అదిగో నంది! మన గుమ్మంలోనే ఉంది'' అని ఒక తెల్లని వెడల్పు రాయిని చూపించాను. అది నందిలాగానే కూర్చుని ఉంది - మా తోటలో! ''చూశావా - నువ్వు శివుడు కావాలన్నావు - నంది కూడా వచ్చింది'' అని నా వంక చూసింది - నమ్మశక్యం కాని విశ్వాసంతో! అక్కడ ఉన్న పచ్చని గడ్డిపరకలు కోసి - ''ఇదిగో తిను'' అని నందికి పెట్టింది - అప్పటి నుంచి - మెదలీనా ఇంట్లోకి వచ్చేప్పుడు తప్పనిసరిగా నందికి పూలు పెట్టి వచ్చేది! గడ్డి పరకలు పెడుతూ - సంతోషంగా ఉన్నావా అని వీపు నిమిరేది! మాకు కొండమీద

ఒక ఏనుగు కూడా దొరికింది. మేము దాని మీద కూర్చొని కబుర్లు చెప్పుకునేవాళ్ళం. అది ఒక కాలు మీద నుంచి మరో కాలు మీదకి కదిలేది! మాకు ఎప్పుడు ఏ పేచీ వచ్చినా ఆ ఏనుగును సంప్రదించకుండా ఉండేవాళ్లం కాదు! ఒక్కోసారి మెదలీనా ఒంటరిగా వెళ్లి మాట్లాడి వచ్చేది - తిరిగి వచ్చేప్పుడు ఆమె ముఖం వెలిగిపోతుండేది! నేను కొండ ఎక్కే సమయంలో ఆయాస పడుతుంటే 'రామా రామా' అని చీకటి పడినా ఇంకా ఇంటికి రాని దూడ కోసం తల్లడిల్లే ఆవులాగా ఆర్తనాదం చేసేది!



నోట్రోడమ్

ఆదివారాలు స్కూలు పిల్లలు ఏనుగు పైకి ఎక్కి ఆడేవారు. సైనికులు బారక్స్ చేరక ముందు బూటు కాళ్లతో తొక్కేవారు. తర్వాత మేము వెళ్లి నీళ్లతో కడిగేవాళ్ళం. పనసపళ్ళు, పచ్చగడ్డి, పూలు ఇచ్చేవాళ్ళం. ఆ ఏనుగు వీపు మీద కూర్చొని నేను సంస్కృత శ్లోకాలు చదివేవాడిని. అవి ఎంతగానో ప్రతిధ్వనించేవి అక్కడ. గంగ మా కాళ్ళ చెంతనే ప్రవహించేది. త్వరలోనే కృష్ణ - భూమి మీదకి వస్తాడు!

దాదాపు సంవత్సరం తర్వాత మేము ఏనుగు దగ్గర్నుంచి విల్లా రాళ్ల దారిలోకి వచ్చేసరికి టెలిగ్రామ్ తీసుకొచ్చాడు. నాన్నకు ఎపొ ప్లెక్సీ వచ్చిందని - నన్ను వెంటనే ఇంటికి రమ్మని! ఆ సాయంత్రం మెదలీనా ఎంత దయగా ఉంది నాతో - నాన్న అంటే నాకు ప్రేమ లేకపోయినా దుఃఖం గొంతులోకి వచ్చింది. ఈ భూమ్మీద నా అస్తిత్వ మూలాలు ఒక్కొక్కటే చెరిగిపోతున్నాయి. నా వంశ పరంపర వత్తిడికి లోనై తెగిపోతోంది - మళ్ళీ నేను అనాథనైపోతాను! మెదలీనా నన్ను తల్లిలాగా ఆదరించింది. "అత్తయ్య ఉంటే నేనూ నీతో వచ్చేదాన్ని" అని అన్నది - ఆమె బాధలో భాగమయ్యేందుకు - చావుపుట్టుకలు ఒక్కొక్కరికి ఒక్కో విధంగా అర్థం అవుతాయి! మెదలీనా నాతో ఉంటే కోడలు ఇంటికి వస్తున్నట్లే కదా! ఆ రకంగా కుటుంబ బాధ్యతలు పంచుకోవచ్చు! ఇంటి గడప దాటి ఇంట్లోకి వచ్చినట్లు! మెదలీనా వస్తే నాన్న మరణించకపోవచ్చు - పెద్ద కోడలు ఇంట్లో అడుగు పెడుతుంటే ఆయన ప్రాణాలు ఎలా వదులుతాడు చెప్పండి! ఎంత శుభప్రదం - కుంకుమా, కొబ్బరికాయ, ఓ రవిక ముక్క, గాజులు చేతికి మోగుతుంటే, నల్లపూసలు మెడలో మెరుస్తుంటే, అదే కదా జీవితం!

హెన్రీ మాటలతో ఈ ప్రపంచంలోకి వచ్చాను - "మనం త్రిగోని వచ్చాం" - అంటే ఏక్స్ కింద లోయలో ఉంది - ఆ ప్రక్కనే చర్చి - క్రీస్తు దేవుని బిడ్డ కాదు - ఫ్రాన్స్ రాజు - క్రీస్తు కుమారుడు! ఈ పాత రాయల్ సిటీ విశాలంగా చెట్లతో, లోపలిగా ఉండే హోటళ్లు, ఇరుకైన అలంకరణలతో ఉన్న ద్వారాలు, ఈ నగరం పూలు, సంగీతంతో పెనవేసుకుపోతుంది. వీరికి జీవితం ఒక పండగ - తారలతో తోరణాలు కడతారు!

మెదలీనా ఇంటి దగ్గర లేదు - కిటికీ తెరలన్నీ దింపి, జాగ్రత్తగా తాళం వేసి ఉంది. ఏదో ఆందోళనలో ఉన్నట్లు నంది మీద పూలు వాడిపోయి ఉన్నాయి. మెదలీనా నిన్ననే వెళ్లి ఉండాలి. గ్యారేజీకి వెళ్ళేసరికి హెక్టర్ - "అయ్యా! నిన్నటి నుంచి కారు రాలేదు. మదామ్ బయట ఊరికి వెళ్ళిందేమో" అన్నాడు. పోస్టుమాన్ రెండు ఉత్తరాలు ఇచ్చాడు. ఒకటి చార్లెస్ అంకుల్‌ది, రెండోది లండన్‌లో ఉన్న నా స్నేహితుడు రాసింది. హెన్రీతో నన్ను 'హోటల్ డురోయి జీన్' తీసుకు వెళ్లమన్నాను. నన్ను చూసి మదామ్ పెటన్సీర్ ముఖం వెలిగిపోయింది. "మదామ్ నైస్ వెళ్లింది - నాకు రోమ్‌లో విమానం తప్పిపోయింది" అన్నాను. పెటన్సీర్‌కి మేము బాగా తెలుసు - మేము ఆక్స్ వచ్చిన దగ్గర నుంచి, విల్లా తీసుకునేవరకు - ఇక్కడే ఉన్నాం - నా అవసరాలన్నీ ఆమెకు తెలుసు - నా స్నానానికి ఏర్పాట్లు చేయమని అరిచింది - "శాకాహారం మాత్రమే తయారు చేయండి - సార్ మాంసం తినరు" అని గట్టిగా చెప్పింది. స్నానం, భోజనం తర్వాత అక్కడ బాగా తెలిసిన ప్రదేశాలన్నీ నడిచాను. మళ్ళీ కొత్తగా ఇక్కడకు రాబోతున్నట్లు. నీతో నీ సహచరిణి ఉన్నారా - లేరా - ఇదే ఈ ప్రపంచంలో ముఖ్యం! ఆమె సమక్షంలోనే ప్రపంచం నీకు పరిచితమైనదిగా కనపడుతుంది. భార్య కాకపోతే, మైసూర్‌లో ఉన్న సరోజ, లేదా వారణాసిలో చిన్నమ్మ!

మనం ప్రపంచాన్ని చూసే విధానంలోనే ప్రేమ ఉంటుంది. నీ ప్రేమ నిన్ను మరిపిస్తుంది. కంటికి కనపడేది భౌతిక దర్శనం కాదు - నీవు అవగాహన చేసుకునేది!

అందుకే స్త్రీ అంటే దేవుని ప్రతినిధి!

మెదలీనా ఎక్కడ ఉందో ఎలా తెలుస్తుంది? నైస్‌లో ఎక్కడని వెదకను? అక్కడ మాకు తెలిసినవారు ఎవరూ లేరు. మెదలీనా ఎవ్వరినీ కలవడానికి ఇష్టపడదు - ఆమెకు సంతోషమంటే మా ఇంటికీ - గుట్టమీద ఏనుగు రాతికి మధ్యనున్న ప్రదేశం! అది దాటితే అంతా కఠినమే - ప్రపంచం!

అనుమానంగానే మళ్లీ ఇంటికి వచ్చాను. నంది మీద పూలు, గడ్డిపరకలు బాగా ఎండిపోయాయి. నేను అవి తీసేసి, పచ్చని పరకలు, నీలి పూలు పెట్టాను. మెదలీనా వస్తే నేను వచ్చినట్లు తెలుస్తుంది! నాకు తెలుసు - ముందు ఆమెకు కోపం వస్తుంది. ఎందుకంటే భారతీయులు చెప్పినది చెప్పినట్లు చేయరు! అదే యూరోపియన్ అయితే నైస్ విమానం తప్పిపోతే అక్కడే ఉండి మరో విమానంలో వచ్చేవాడు. మనమే ఎప్పుడు ఎలా ప్రవర్తిస్తామో చెప్పలేం! పోస్ట్ బాక్స్ తెరిచాను - కాస్త కష్టంగా. వానకు, ఎండకు అది బిగిసిపోయింది. అందులో నేను పంపిన టెలిగ్రామ్, జెనీవా జర్నల్ ఉంది. మూల మూలా వెతికాను. ఎటువంటి సందేశం లేదు. అక్కడి నుంచి మెల్లగా పైన్ చెట్ల కింద నుంచి గుట్టమీద ఏనుగు రాతిని చేరాను. అక్కడి నుంచి చూస్తే పైన్ చెట్ల లోయలోని సముద్రం కనబడుతోంది. మెడిటీరియన్ నాకిప్పుడు ఏదో తెలియని నమ్మకాన్ని కలిగిస్తుంది! అందులోనేగా డువాన్ నది తన నీటినంతా కొండల మీద నుంచి కుమ్మరిస్తుంది.

ఆ సాయంత్రం రాత్రిలోకి మారలేదు. ఆ సమయంలో మెదలీనా అడుగుల చప్పుడు నమ్మకంగా వినిపిస్తుంది. అప్పుడు నంది మీద కూర్చుని ఉన్నాను. మెదలీనా రెండు చేతుల్లో సంచులున్నాయి. సామానుతో ఒక్కసారి నన్ను చూసి "నువ్వు..." అంది. అంతే, నా గుండె గొంతులోకి వచ్చి శ్వాస ఆడలేదు. దగ్గు వచ్చింది. అంతే, సంచులు పడవేసి నా చేయి పట్టుకుని బావురుమంది! నాకు నోట మాట రాలేదు! మెల్లగా ఇంటి తాళం తీసుకుని, ఆ సంచులన్నీ పట్టుకొని, గేటు తీసి ఇంట్లోకి వెళ్ళాం. "ఎందుకో రామా, నాకు తెలియదు. నీవు లేకుండా ఇంటిలోకి వెళ్లలేక పోతున్నాను" అంది. లైట్ వేశాను. ఆ వెలుతురులో నన్ను చూసి ఆశ్చర్యపోయింది. "ఎంత నల్లబడిపోయావు! ఎండలో తిరిగావు కదా!" అంది. అప్పుడు నన్ను ముద్దు పెట్టుకుంటుంది. తర్వాత రెండు నెలల తర్వాత చెప్పింది. "ఓ పామునో, ఓ శవాన్నో ముద్దు పెట్టుకున్నట్లనిపించింది" అని. ఆమె జుట్టంతా చిందరవందరగా ఉంది. కారులో గాలికి. అరే! మగవాడు ఆడదాన్ని ఎంతగా నిరాశ పరుస్తాడు - ముఖ్యంగా ఆతృతగా ఎదురు చూస్తున్నప్పుడు మరీ నిస్పృహకు లోను చేస్తాడేమో!

"రా, హోటల్ నుంచి సామాను తీసుకు వద్దాం!" అన్నాను.

"రామా; నువ్వు వెళ్ళు - ఈ లోపు నీకు భోజనం సిద్ధం చేస్తాను" అంది. ఆమెను అలా వదిలేసి నేను ఆ సాయంత్రపు పరిమళభరిత పవనాలతో శ్వాస నిండుగా తీసుకుంటూ నడిచి వెళ్ళాను, హోటల్‌కి! మొదటిసారిగా ఈ ఫ్రాన్స్‌లో అపరిచితుని భావన కలిగింది. నేను టాక్సీ కోసం వేచి ఉన్నప్పుడు మదామ్ పొటెన్సీర్ ఇండియా గురించి, గంగ గురించి ముఖ్యంగా హిమాలయాల గురించి ఎన్నో

వివరాలడిగింది. "బహుశా ఆల్ప్స్ మీద ఉన్నట్లు అక్కడ మంచు ఉండదేమో కదా" అంది. ఆల్ప్స్‌కంటే చాలా పెద్దవి - చాలా ఎత్తైనవి - 'హిమాలయాలు' అంటే మంచు పర్వతాలు అని చెప్పాను. 'అంటే మంచు మయం' అని చెప్పాను. ఆ తర్వాత ఈ ప్రపంచం అంతా బాగానే ఉంది. మూడుసార్లు అశుద్ధాన్ని దాటిన తర్వాత ప్రాయశ్చిత్తం చేసుకున్నట్లు. ఇప్పుడు ఈ దారి వారణాసి వెళుతోంది! మన విశ్వాసంకంటే పవిత్రత ఏముంది?!

ఆ రోజు సాయంత్రాన్ని నా జీవితాంతం మరచిపోలేను. వరండాలో సామానుతో వస్తున్న నాకు వంటింట్లో నుంచి వస్తున్న కొత్తిమీర, పుదీనా వాసన - ఆ సాయంత్రాన్ని జీవిత కాలం ఎలా మర్చిపోతాను?!

వంటింట్లోంచి మెదలీనా పిలుస్తోంది - "రిసోటా వెజిటబుల్ ఫ్రైడ్ రైస్ చేశాను - ఆపిల్ పిండితో పాస్తా కూడా" - అంటోంది. ఆమె సన్నని నీలిరంగు నైటీలో ఉంది! పోయిన వేసవికి పారిస్‌లో కొన్నాం. "రా, వచ్చి నన్ను వాసన చూడు" అని ఆహ్వానించింది. ఆమె ఉడుకు లాన్ పరిమళంతో స్వచ్ఛంగా ఉంది! మొదటిసారి రోన్‌లో కూడా ఇదే పరిమళం నాకు గుర్తు. "నీ కోసం కొత్త తువాళ్లు కొన్నాను. అవి తీసుకుని స్నానం చేసి రా' - డజను పైగా ఉన్నాయి - నీవు మడి కట్టుకోవడానికి" అని నవ్వింది! "ఇప్పుడు నీ కోసం అన్నం వండుతాను" అంది.

మామూలుగా అయితే మెదలీనా ఈ సరికే సూట్‌కేసులు తెరిచి, బట్టలు సర్దేది. కానీ అన్నీ సరిగా లేవు కదా! ఏదో విషాదం ఇద్దరి మధ్య పరుచుకుని ఉంది. "అయ్యో! అన్నం మాడిపోతుంది - మీ వాళ్ళు నన్ను కోపగిస్తారు - మొదటి రాత్రే మాడిన అన్నం పెట్టానని" అంటుంది.

"హెలీనా దగ్గర మీ కూరలు నేర్చుకున్నాను - ఇప్పుడు చక్కగా వండగలను" అంటోంది. హెలీనా హిస్టరీ టీచర్. వాళ్ళ అమ్మానాన్న ఇండియాలో సైన్యంలో పని చేశారు! మాతో ఇంగ్లీషులో మాట్లాడడానికి వస్తుంటుంది. బహుశా భాష ఆడవారి పెదవుల నుంచే పుట్టిందేమో! వారి అవ మానాన్ని, మొలక కురులతో కప్పిపుచ్చుకునేటట్లు - ఎందుకంటే వారు మాట్లాడే ఊసులన్నీ వారి విచారాన్ని దాచిపెట్టుకోడానికే! సరోజ ఇచ్చిన చీర జాగ్రత్తగా మడిచి, కుంకుమ భరణి, తమలపాకు ఆకులు పెట్టి ఉంది. కస్టమ్ ఆఫీసర్ కుంకుమ భరణి తెరిచి చూశాడు. దానిలో నల్లమందు ఉంచామేమోనని! అప్పుడే కుంకుమ ఆ చీర మీద పడింది. ఎంత శుభ సూచకం! అందుకే ముందుగా ఆ చీర తీసుకున్నాను. "నీ కోసం బహుమతి

తెచ్చాను. సరోజ ఇచ్చింది" అన్నాను. మెదలీనా నిరాశపడింది. ఆమెకు నా బహుమతి కావాలి!

"ఈ చీర నేను కడతాను నీకు" అన్నాను. ఆమె నైటీ తీసివేస్తుంటే - అందమైన ఆ వంపుసొంపులు చూస్తూ ఉండిపోయాను. ఎంతో సరళంగా, ఎంత గుంభనంగా, ఎంత లావణ్యంగా ఎంత బిగువుగా ఉందామె! నన్ను చీర చుట్టనిచ్చింది - నన్ను ఆ వంకతో వళ్ళంతా తాకనిచ్చింది. ఆమెను పొదివి పట్టుకోనిచ్చింది. నాకు బాగా తెలిసినది - మరింతగా తెలుసుకోవటంలో ఎంతగా తెలుస్తోంది. అంతా ఒకటిగా ఏకమైపోయినట్లు! కానీ నా మనసెక్కడో ఉంది! నా చేతులు జారిపోతున్నాయి! కుచ్చిళ్ళు ఎన్నిసార్లు మడిచానో - చివరికి ఆమె నడుము చుట్టూ చీర చుట్టి "ఇప్పుడు స్నానం చేసి వస్తాన"ని అన్నాను. "త్వరగా వచ్చేయి - ఆహారం చల్లబడి పోతుంది" అన్నది. స్నానాల గదిలో నీటి శబ్దం హాయిగా ఉంది. కిటికీలో నుంచి చూశాను. బయట మొండి సైప్రస్ చెట్లు తీసేశారు. అవి ఎప్పుడో రోమన్లు పెట్టినవి. ఆ ఖాళీ ప్రదేశంలో మిణుగురులు మెరుస్తున్నాయి. త్వరలోనే అవి నిండుగా ఎగురుతుంటాయి. స్నానం చేసి, వళ్ళు శుభ్రం చేసుకుని, కాస్త ధైర్యం తెచ్చుకున్నాను. శరీరం స్వచ్ఛంగా ఉండటమే జ్ఞానమంటే! పైజామా వేసుకొని మెదలీనా దగ్గరకు వచ్చాను. ఆమె సోఫాలో జారగిలబడి ఉంది. బహుశా దుఃఖిస్తుందేమో! ఆమెకు కన్నీళ్లను ఆపుకునే శక్తి ఉంది.

"తిందామా" అన్నాను. "ఆఁ... సాలడ్ చేస్తాను, ఒక్క నిమిషం" అని లేచింది.

"వెల్లుల్లి వేయకు" అన్నాను ఏదో అనాలి కదా! మెల్లగా భోజనం మొదలు పెట్టాం. నేను చిన్నమ్మ కబుర్లు చెప్పాను. బొంబాయి బీచ్‌లో ఆమె చేసిన ప్రమాణం - అదే నా దారికి అడ్డు రామని చెప్పింది కదా!

"అవును, మీరు దేనికైనా సమర్థులే" అంది.

"మాకు భావోద్రేకాలు ఎక్కువ. ప్రతి చిన్న విషయానికి బావురుమంటాం" అన్నాను.

"అవును, టాగోర్ కథలతోనే గంగను నింపివేస్తారా!" అని ఎత్తి పొడిచింది.

"కాదు మెదలీనా, మా దేశంలో చాలా దుఃఖం ఉంది. అలాగే మనిషికీ మనిషికి అంత బంధం ఉంది. స్త్రీ పురుషులకు కూడా గాఢానుబంధం ఉంది" అన్నాను.

"నీ దేశంలో ఉన్నప్పుడు యూరోపియన్‌లను ద్వేషించేవాడివా?" అంది.

"ఎందుకు? మాకు ఇంగ్లీషు వారంటే ఆరాధన, తెలుసా? చెడును త్వరగా మర్చిపోతాం - అంత సహజంగా మంచిని ప్రేమిస్తాం" అన్నాను.

"అంతేనా! అంటరాని వాళ్ళకు వేరే నీళ్లు - ఆడదాన్ని బానిసగా చూస్తారు" అంది. ఇది నేను ఎదురు చూడనిది - చేదు అనుభవం. బహుశా ఇది దాచిపెట్టుకోవడానికి "జార్జ్ ఇండియా గురించి ఎంతో తెలుసుకోవాలని తాపత్రయ పడుతున్నాడు. కాస్త మత పిచ్చి ఉంది. ఇండియా వెళ్ళి అందర్నీ మార్చివేయాలని ఉత్సాహ పడుతున్నాడు. మీ దేశాన్ని మొత్తంగా పోప్ గారికి బహుమతిగా ఇవ్వాలని కలలు కంటున్నాడు. అతను రామకృష్ణ పరమహంస, వివేకానంద గురించి బాగా చదివాడు. వేదాంతం ఆకళింపు చేసుకున్నాడు. నాకంటే మిన్నగా. నిన్ను చూడాలని ఎదురు చూస్తున్నాడు. ఎప్పుడు రమ్మందాం?" అంది.

"నీ ఇష్టం లీనా, నేనేగా అతన్ని గుర్తించింది.." అన్నాను.

"జార్జిని చూడటం నాకు ఆనందమే - రమ్మను" అన్నాను.

"నన్ను సెయింట్ మాక్జిమిన్‌కు తీసుకు వెళ్ళింది అతనే. అక్కడ ఫాదర్ జినోబీస్‌ను కలిశాను" అంది మెదలీనా.

"చివరికి మతాన్ని దెయ్యంలా అనుకోవడంలేదు నువ్వు.." అన్నాను.

"కానీ పౌరోహిత్యాన్ని వ్యతిరేకిస్తాను.." అంది మెదలీనా.

"నేను మాత్రం పోపుగార్ని సమర్ధిస్తానా?" అన్నాను.

"నేను ఏ మతాన్నీ అంగీకరించను - మనిషి తెలివిగా బ్రతకగలిగితే చాలు" అంది తను.

"తెలివి తేటలు సోషలిజంవైపు నడిపిస్తాయి" అన్నాను నేను.

మెదలీనా 'రిసోటో' తేవటానికి వెళ్ళింది.

ఇప్పటికీ నాకు బాగా గుర్తు - మా పళ్ళాలలో 'రిసోటో' ఘుమఘుమలాడుతోంది. మధ్యలో టమాటా ముక్కలతో వేడిగా లీనా ఒక స్పూన్‌తో నోటిలో పెట్టుకోవడం చూశాను. నా చేయి నోటిదాకా వెళ్ళటం లేదు - మా చుట్టూ విశాల శూన్యం పరచుకుంది. ఎవరో మాయ వృత్తం గీసినట్లు రాత్రి బరువెక్కి కదలకుండా ఉంది. నాకు ఊపిరి సలపక - "మెదూ - ఏదో జరిగింది.." అన్నాను.

"అవును, జరిగింది' అని "ఎవరికి" అంది మెదలీనా.

"అన్నిటికీ" అని అని తినటం ఆపాను.

నేనెక్కడ ఉన్నానో, నేను ఏమి చేస్తున్నానో స్పృహ కూడా లేకుండా పోయింది.

లీనా మెల్లగా లేచి, నా దగ్గరకు వచ్చింది. నా ఒడిలో కూర్చుంది. నా జుట్టు సవరించాలని ప్రయత్నించింది. వంట చేసిన వాసన వస్తోంది ఆమె దగ్గర. ఆమె శరీరం పరిమళంతో నాకు మత్తు వస్తోంది. ఆమె అవయవాలు వణుకుతున్నాయి.

బాధతో ఆమె వక్షాన్ని నా ముఖానికి అద్దింది! ఆమె ఎంతలా రోదిస్తోంది! ఆమె పాలిండ్లు ప్రేమతో నిండి ఉన్నాయి - అదే పరిమళం కూడా! దుఃఖంలోనే శరీరం పునీతమవుతుంది. ఇక్కడ ఏ మాటలు లేవు. ఈ జ్ఞానం సర్వోత్కృష్టమైనది. ఆ క్షణంలో ఆమె పరిపూర్ణ స్త్రీగా దర్శనమిస్తోంది. ఆమె పొత్తి కడుపు లోపలికి పోయినట్లు - ఆమె స్త్రీత్వం సంపూర్ణమైనట్లు.

స్త్రీ మూర్తిని మగవాడు ఎలా చూస్తాడు - కేవలం భౌతికంగానే - ఆమె ఔన్నత్యం అతనికి ఎప్పటికీ అర్థం కాదు. కానీ ఆమె అంతర్ముఖంగా ఎంతో ఎదుగుతుంది - ప్రపంచమంతా బిడ్డ జన్మించడం అంటే - కేవలం మరో శరీరం పుట్టడం కాదు - అది ప్రపంచాన్ని సృష్టించడం- పెంగ్విన్ కాళ్ల మధ్య గుడ్డు దాచి - పొదిగి ప్రపంచానికి ఇస్తుంది - మరో పెంగ్విన్ కాదు - మరో రాజ్యాన్ని సృష్టించి ఇస్తున్నది!

ఆమె అప్పుడే నన్ను తనలోకి తీసుకోగలదు - బహుశా నేను ఎవరో తెలియకుండా - కానీ - నా నిష్టను నాశనం చేయగలదా? నాకు ఈ స్పర్శ - ఈ జ్ఞానంలో పవిత్రత ఉంది - ఆమెకు నన్ను నేను సమర్పించుకోవాలి - వేదన - బాధ, ఇది ప్రేమ కాదు - బాధ మూర్తిమంతం కాదు - ప్రేమకు అది పైపూత - ఉద్రేకంగల ప్రియుడు - త్వరగా 'మాసి'పోతాడు - నిజమైన ప్రేమమూర్తి స్త్రీని తన మౌనంలోకి ఆహ్వానిస్తాడు - ఆమె తనను గుర్తించే వరకు - నాకు దుఃఖం ఆగలేదు - కన్నీళ్లు చెంపలను తడుముతున్నాయి. ఇంతటి సౌందర్యాన్ని ఎలా పొందాలి? ఆమె పవిత్రత అంతా నా దోసిట్లో ఒంపుతుంటే ఎలా ఒడిసి పట్టుకోవాలి?

"ప్రియా.." అంది - "నా స్నేహమా.." అన్నాను. కొంత దూరంగా జరిగింది - "ఏమీ లేదు..." అన్నాను. అందులోనే అంతా ఉందని ఆమెకు అర్థమయింది - "మీ దేవతలకు నిరాశ కలిగించాను" అంది.

కాదు - "నన్ను నిరాశ పరిచారు' అన్నా ఎందుకో - ఒక్కసారిగా నవ్వి నిలబడింది - ఆ చీరలో నిండుగా ఆ రాత్రిలో! "రా - బట్టలు మార్చుకుంటాను - ఏనుగు దగ్గరకు వెళ్దాం" అంది.

మరేదీ పని చేయకపోతే - మా నమ్మకాలు పనిచేస్తాయి!

ఆ రాత్రిలోకి ఇద్దరు దెయ్యాల మాదిరి కదిలాం - మా జీవితాల్ని - స్వర్గారోహణకు పణం పెట్టినట్లు!

భూమి మీద నడిచే దేవతలు - స్వర్గ ద్వారాలు తెరుచుకుని దిగిన మానవులు-

"లీనా - నీ 'హోలీ గ్రెయిల్' మార్మికమైనది కాదు - నేను చర్చి గ్రంథాలు చదివిన కొలది - అది నిజమనిపిస్తోంది" - ఈ విషయంలో జార్జి చాలా సహాయం చేశాడు.

నెస్టోరియన్ కథనం చదివాను - అల్బెజెన్సియన్‌కి 'సోదరి' ఇచ్చింది. తూర్పు ప్రాంత గ్రంథాలలో - అది బుద్ధుని అవశేషంగా ధ్రువీకరించారు. అక్కడి నుంచి పర్షియా - క్రీస్తు సామ్రాజ్యానికి చేరింది - 'చావోస్' కేవలం బుద్ధుని భిక్షాపాత్ర తిరగబడింది అంతే-

"చాలా కవితాత్మకంగా ఉందే" అంది మెదలీనా.

"మరి?' చరిత్రలో కవిత్వం ఉండకూడదు - కేవలం నిజాలు - రుజువులు ఉండాలి" అన్నాను.

"ఏమి మిగులుతుంది?" అంది మెదలీనా.

"సత్యం - ప్రతి సత్యప్రమాణం - కవితాత్మకమే చివరికి - మనం లఫాయత్‌లో చూస్తాము - చీపురు కట్టలు, తువ్వాళ్ళ మాదిరి!" అన్నాను.

హోలీ గ్రెయిల్ గురించి మరో కథ కూడా ఉంది. ఇది క్రీస్తు రక్తపు బొట్లు - ఒక్కోటి అమ్మ దోసిలి పట్టి ఎండిపోయింది. తర్వాత తురకలు వచ్చినప్పుడు దాన్ని దాచిపెట్టారు - గాల్ (Gaul)ని ఏ సందులోకో తీసుకు వచ్చారు. కానీ ఈ నెత్తుటి బౌల్ చంద్రుడు - ఎర్రటి చంద్రుడిలా మెరిసింది. పవిత్ర మంత్రాలను పలికింది - పర్షియా నుంచి - దొంగతనంగా పవిత్ర ప్రదేశానికి తీసుకు వచ్చినట్లు కథనం-

మరో కథ - అది ఒక బంగారు పాత్ర అనీ - చాల్డీన్స్ (Chaldeans) నిసుర్త ఆలయానికి - ఒక ఆరోగ్యవంతుడైన బానిసను బలి ఇచ్చి తెచ్చారని భూమాత - తన పునరుత్పత్తికి ఈ పాత్ర నుంచే పవిత్ర పానీయాన్ని సేవిస్తుందని - తన పురుషుణ్ణి పిలిచి అతనితో కూడా తాగిస్తుందని - అప్పుడే భూమి పంటలు పండుతాయని కథ. మొన్ననే చదివాను - ఇప్పటికీ ఆదిమ జాతులు తమ స్త్రీ రుతు రక్తాన్ని భూమి చాలుల్లో సమర్పిస్తారని - సమృద్ధిగా పంటలు పండుతాయని.

నిజానికి ఈ విషయమే కొన్నాళ్ల క్రితం నేను ఆలోచించాను - మా దేశంలో కూడా ఈ సాంప్రదాయం ఉండేదని విన్నాను - కానీ ఈ విషయంలో ప్రదేశాలకు భౌతికమైన సంబంధం ఉండవలసిన పనిలేదు - ఇలాంటి నమ్మకాలకు.

చూడు - మెక్సికో దేశంలో మాయాసంస్కృతికి - ప్రపంచంలో వారొక్కరే కదా - భారతీయుల తర్వాత 'పూర్ణానుసారం' విలువ పెట్టింది! ఈ రెండు దేశాలు ప్రపంచానికి రెండు ప్రక్కల ఉన్నాయి కదా! అంటే మంచి అనేది - మా దేశం నుంచే వచ్చిందన్నమాట - అంటూ నవ్వాను-

మెదలీనా నవ్వి "నాకు మాత్రం శుభమంతా నీ దేశం నుంచే వచ్చింది" అంది.

"ఇలాంటి మాటలతోనే కదా ఎంతటి కఠినాత్ముడైనవాడైనా కరిగిపోయేది!" అన్నాను. "అవును - చెడు కూడా" అని అంటూ గట్టిగా దగ్గు వస్తుంటే ఆగిపోయాను.

లీనా నా వీపు సవరించడం మొదలు పెట్టింది - అప్పటికే ఏనుగు రాతి మీద కూర్చున్నాం - ఆమె సాన్నిధ్యం నాకెంతో ఊరట కలిగించింది. నా భార్య కదా - నన్ను - ఇంటినీ - ఇంటిలో వేడినీ రక్షించేది ఆమే కదా!

ఒకసారి ఇలాగే నేను మంచం మీద చలికి వణుకుతుంటే - వేడి నీళ్ల సీసా తెచ్చి నా దుప్పట్లో పెట్టింది - అది మూత ఊడిపోయి పక్కంతా తడిసింది - ఇద్దరం పగలబడి నవ్వుకున్నాం - ఇలాంటి చిన్ని విషయాలే కదా - మనకు ఆనందాన్నిస్తాయి!

వాలిపోయిన చందమామ అప్పుడే ఆకాశంలో కనబడుతోంది - కానీ మా పైన ఉన్న నక్షత్రాలు మిణుకుమంటూ మెరుస్తున్నాయి. ఇద్దరం - చిన్న పిల్లల్లా నవ్వుకున్నాం - పోట్లాట తరవాత కలిసిపోతున్నట్లు - వాసన పరకలు కోసి పైకి తీశాను - దర్భలు కట్టుకున్న బ్రాహ్మణునిలాగా-

లీనా - తెల్లని పూలు కోసి, నా తలమీద పోసింది. మళ్ళీ సంతోషంగా ఉండగలం! ఏనుగు రాతి మీద కూర్చుని - వెంకట్రామయ్య కూతుళ్ళ సంగతి చెప్పాను - కౌముది - "అరే - మీ ఇంట్లో పెద్దవాళ్ళు లేకుండా ఎలా ఉంటారు" అని ఆశ్చర్యపోతుంది.

వారణాసి బ్రాహ్మణుడు అడిగాడు - యూరోప్‌లో ఎలాంటి మంత్రాలు చదువుతారు - మరణ కాలంలో అని!

ఇక్కడ - అంత్యక్రియలకు ఎంత ఖర్చవుతుందని అడగలేదు - నాకు తెలియదు కూడా-

లీనా అంది - అంత్యక్రియలు ఇక్కడ చాలా ఖరీదైనవి - కానీ నేను భారత్‌లోనే చనిపోతాను - నన్ను దహనం చెయ్యి - కానీ గంగా ఘాట్ దగ్గర వద్దు - అక్కడ కాలని శవాల్ని కుక్కలు పీక్కు తింటాయని విన్నాను.

"లేదు రాణీ, నిన్ను - హైమావతి కొండమీద చితి పేరుస్తాను - మంచి గంధం ముక్కలతో - మా తాత గారిని అక్కడే అలాగే దహనం చేశాం - నీ కోసం ప్రత్యేక మంత్రం చదువుతాను - 'బంగారు వన్నె దేవతకు ప్రత్యేకం' అని!

ప్రత్యేకమైన పరిమళ పచ్చికను తెస్తాను - ఆ వాసనకు నదిలోని చేపలు - లేడి కూనలు వస్తాయి - ఏమి జరుగుతోందని చూడటానికి!

నీవు చితాభస్మంగా మారిపోతావు కదా - అప్పుడు నది పొంగి నిన్ను తనలో కలుపుకుంటుంది - తాతయ్యను అలాగే తీసుకు పోయింది - చివరికి నీవు బ్రాహ్మణిగా మారిపోతావు! లీనా ఇదంతా వింటోందా? ఆమె ఆలోచనలు ఎక్కడో ఉన్నట్లున్నాయి. మా మధ్య మళ్లీ పల్చని నిశ్శబ్దం అలుముకుంది - చిన్నపిల్లల్లా నక్షత్రాలు లెక్కపెట్టాం-

మనిషికి - దూరంగా ఉండేవన్నీ అద్భుతంగా - ఆశ్చర్యంగా కనబడతాయి!

మెల్లగా దిగివచ్చి - ఇంట్లోకి ప్రవేశించాము-

నా సూట్‌కేస్ అలాగే ఉంది - సమాధానం లేని ప్రశ్నలుగా - మనుష్యులకు అబద్ధాలు చెప్పవచ్చు - కానీ జంతువులకు - సామానులకు ఎలా చెప్పగలం!

అలసిపోయి - మంచం మీదకు చేరాం - "అయితే రేపు ఉదయం రాకుమారుడు - ప్రొఫెసర్‌గారికి కాఫీ తెస్తాడన్నమాట" అన్నాను-

"నువ్వు బాగా అలసిపోయావు ప్రయాణంతో - బాగా నిద్రపో - నాకు పదింటివరకూ కాలేజీ లేదు - రేపు శుక్రవారం కదా" అంది.

మర్నాడు లీనా కాలేజీకి వెళ్ళిపోయింది. నేను లేచి పెట్టె వరండా చివరికి చేర్చాను - మదామ్ జీనీ వచ్చి ఇల్లు శుభ్రం చేసినప్పుడు - ఈ సూట్ కేస్‌ను మూసి బీరువాలో పెట్టేస్తుంది-

ఆ మధ్యనే జార్జి వచ్చాడు - అతను చైనీస్ బాగానే నేర్చుకుంటున్నాడు - కానీ తూర్పు దేశాలంటే అతనికంతగా పడదు - రోమారోలా చదివాడు - ఇండియా గురించి తెలుసుకోవడానికి - రామకృష్ణ పరమహంస, వివేకానంద, అరబిందో, దయానంద - ఇలాంటి రుషుల గురించి మరింత తెలుసుకోవాలనుకుంటున్నాడు-

తర్వాత కొంతసేపటికి లిజో వచ్చాడు - అతను 'Barque' కాందిశీకుడు. 18 భాషలు వచ్చు. భాస్క్ అకాడమీకి అతి పిన్న వయసులో అధ్యక్షుడైనాడు. అతను మాతృభాషలో చదువు చెప్పాలని ఉపన్యాసం ఇస్తుంటే ఫ్రాంకో మనుషులు తర్వాత అతన్ని మూడు నెలలు జైల్లో పెట్టారు. బయటకు రాగానే ఆక్స్ యూనివర్శిటీకి పారిపోయి వచ్చాడు - భాషాపరమైన అధ్యయనం చేస్తున్నాడు - అతనికి తన తండ్రి దగ్గర నుంచి రహస్యంగా కాస్త సొమ్ము అందుతోంది. లిజో కూడా సంస్కృత పాఠాలు చెప్పకుంటూ కాస్త సంపాదించుకుంటున్నాడు.

లిజోకి బౌద్ధం అంటే విపరీతమైన విశ్వాసం. అతను పాడిల్ బర్గ్‌లో సంస్కృతం చదివాడు - అక్కడ 'బాడెన్స్ పీజర్' ప్రభావంలో పడి బౌద్ధాన్ని అన్ని మతాలకంటే ఔన్నత్యం కలదని నమ్మకం పెంచుకున్నాడు-

లీజోకి 'వేదాంతం' గురించి - తెలిపింది సంస్కృత భాషే!

సంస్కృతంలో ఒక గాంభీర్యం ఉంది. అది ఓంకార శబ్దం నుంచి ఉద్భవించినట్లు-

గంటలు గంటలు నేను మంత్రాలు చదివేవాడిని - భర్తృహరి, కాళిదాసు, శంకరాచార్య కావ్యాలన్ని - ఈ శబ్దాలతో ఒక గంభీరమైన వాతావరణం సృష్టించబడేది! అది శూన్య వాతావరణం - అందులో నిన్ను నువ్వు చూసుకోవచ్చు - నీ శ్వాస నీకు వినిపిస్తుంది.

జార్జికి ఇదంతా అర్థమయ్యేది కాదు - ఈ శూన్య ప్రపంచంలో అతనికి దారి తెలిసేది కాదు - కానీ నిస్సహాయునిగా మిగిలిపోయాడు.

లీజో అతన్ని ఆటపట్టించేవాడు - "చూడు జార్జి! నీ క్రైస్తవ హైమన్లన్నీ బౌద్ధంలో నుంచి వచ్చినవే - అలెగ్జాండ్రియాలో బౌద్ధం బోధించే సమయంలో మీ జార్జి ఫాదర్లు విని నేర్చుకున్నారు" అనేవాడు.

గ్రీకు రాజులంతా ఆంటీయోకస్ (Antiochus), టోలెమి (Ptolemy), ఆంటిగోని (Antigone), అలెగ్జాండర్ - వీరంతా బుద్ధుని బోధలు విని అదే దారిలో నడిపించినవారే! బుద్ధుడు, శాక్యముని వారికి ఆరాధ్యుడు!

అలెగ్జాండ్రియా - అపోలోనస్ (Appollonius) వాళ్లంతా ఇండియా వెళ్లి అక్కడ బ్రాహ్మణోత్తములను కలిసి - వేదాంతం వంటబట్టించుకుని తిరిగి వచ్చిన వారే!

ఆ విధంగా 'వేదాంతం' బాగా చదివి, భగవంతుణ్ణి చేరే మార్గంలో జార్జి ఎంతో కృషి చేస్తున్నాడు.

"నేతి, నేతి - చదివాను - ఇది శూన్యం" అని - అతనికి బాగా నచ్చింది.

గంటలు గంటలు ధ్యానం చేసేవాడు - శివోహం - శివోహం అంటున్నప్పుడు జార్జి వణికిపోయేవాడు.

లీజో - "చెప్పటానికి ఎవరూ లేరన్నమాట - ఏమీ లేదన్న మాట" - అని రెట్టించాడు.

వసుబంధు నాగార్జునులు చెప్పిన శూన్యవాదంతో ఇది ఏకీభవిస్తోందని వాదించాను - శంకరుడే అంగీకరించాడని చెప్పాను.

ఈ చర్చలు జరుగుతున్నప్పుడు ఎక్కువగా లాభపడింది మెదలీనా - తను ఇప్పుడు చాలా ముఖ్యమైన నిర్ణయం తీసుకోవాలి - అడవిలో నుంచి బయటకు ఎన్నో దార్లుంటాయి. ఏది సుగమమైనది - ఏది దగ్గర దారో ఎలా తెలుస్తుంది?

ఇంకా జర్మన్లు ఏ గుట్ట వెనక ఉన్నారు - ఏ వారధి చివర ఉన్నారు? ఈ నిర్ణయానికి తన అంతర్వాణిని వినాలి - తనలో శక్తిని కూడదీసుకోవాలి - వేచి చూడాలి! దారి చేసుకోవాలి!

సంస్కృత మంత్రాలు మనం నిశ్శబ్దాన్ని వింటున్నట్లే లీనా మాట్లాడేది కాదు - సిగ్గుతో - కాస్త గర్వంతో - కానీ ఏమైనా అంటే మాత్రం అది ఎవరూ ఊహించలేనిదే!

తర్వాత మా వేసవి సెలవలకు గ్లాస్కోని వెళ్ళినప్పుడు లిజో - జార్జి ఇద్దరూ మాతో చేరారు.

నాకు కలిగిన అభిప్రాయం - తమ సంశయాత్మక జ్ఞానమే వారికి ఎక్కడలేని ధైర్యాన్నిస్తోందని-

ముఖ్యంగా మెదలీనాకు - లిజో - వీరిద్దరికీ ఆలోచనలెక్కువ - ఏదీ నమ్మరు - కానీ నిర్ణయాలు తీసుకోవటానికి వెనుకాడరు!

బౌద్ధులు - సర్రియలిస్టులు - లేదా డాడాయిస్టులు, ఇలా అనేసరికి జార్జికి చిర్రెత్తుకొచ్చేది - ఇలాంటి చెత్త వాగుడు అతను భరించలేడు-

"మీరు ప్రాచీన భాషా రచయితలా! లేక పదాలు అమ్ముకునే వ్యాపారస్తులా!" అని మండిపడేవాడు. లిజో - మౌనంగా ఉంటే - లీనా కాఫీ చేయటానికి వెళ్ళేది!

జార్జి మాట్లాడుతుంటే - లీనా ఒక హీరోని వింటున్నట్లు శుద్ధిగా వినేది - అతని దైవభక్తిని, బాధను, భాషను ఆకళింపు చేసుకునేది - జార్జి - "మనకు దేవుడు ఉన్నాడు - నేను నమ్ముతున్నాను" అనేవాడు - ఆ విధంగా లీనా దైవంలా చూసేది అమాయకంగా!

అతని నిజాయితీ నమ్మదగింది - బురదలో గజ్జి కుక్కలు, రోగిష్టి వేశ్యలో అతనికి దుఃఖంతో పాటు దేవుడు కనిపించేవాడు-

అతను దేవుణ్ణి చూసినట్లు - అతని ముఖం వెలిగిపోయింది - ఇదంతా మెదలీనా నమ్ముతుండేది - జార్జి ఆమెకు తన నిర్ణయాలను సలహా చేస్తున్నట్లు ఆమెకు అది చాలా సులువైన మార్గంలా కనిపించేది-

సాయంత్రం అలా నడుస్తున్నప్పుడు - లిజో నాతోనే ఉండేవాడు. మెదలీనా, జార్జి కొండ దారిలో వెళ్తుంటే వారు మోజెస్ దేవుని దగ్గరకు వెళుతున్నట్లు అతను ఒక మోకాలి మీద చెయ్యి పెట్టి రాళ్ళు దాటుతుండేవాడు. అప్పుడప్పుడు మెదలీనా చేయి అందించి - సహాయం చేసేది - అతనికి 31 ఏళ్లు - కానీ తన తండ్రికి సహాయం చేస్తున్నట్లు శుద్ధిగా సేవ చేసేది!

మెదలీనా అతన్ని చాలా గౌరవించింది. ఇదంతా బ్రాహ్మణ భర్తకు అంత సంతోషంగా ఉండదు కదా!

అతనిలో ఏదో శక్తి పర్వతాలను కదపగల మాయ ఉందని నమ్మింది. జార్జి ఆమెను సోదరి సమానంగా తన పెద్దరికంతో ఆదరించేవాడు. మెదలీనా దేవుడంటే

అజ్ఞానంలో ఉంది. నిజానికి అమాయకత్వంలోనే దైవత్వం ఉంది కదా అని జార్జి అనేవాడు! నీవు దేవతవు కాదు. సన్యాసినివి కాదు - నువ్వు పసిదానవు - నీలో దైవత్వం ఉంది అని-

జార్జి - లిజో పునర్జన్మ గురించి, క్రైస్తవ భాష గురించి వాదులాడుకుంటుంటే తెలియని పేరు, తెలియని శత్రువుతో పోరాడుతున్నట్లు ఆనందించేది-

ఈ వేసవికి మౌంట్ ప్యాలెస్‌కి వచ్చాం. ఈ చాటూ (Chateau) చిన్న కొండమీద ఒంటరిగా నిలబడి ఉంటుంది. 11వ శతాబ్దంనాటిది. ఎన్నో యుద్ధాలు, ఎన్నో మతాలు, మరెన్నో తిరుగుబాట్లు చూసింది.

ఇంగ్లీష్ చిత్రకారుడు - రాబర్ట్ ఫెర్న్ చివరికి దీనిని ఖరీదు చేశాడు - ఎన్నో పికాసో చిత్రాలు తగిలించాడు - ఆధునిక సౌకర్యాలన్నీ అమర్చుకున్నాడు. ఎక్కువగా ఈ పురాతన కట్టడంలో ఆయన నివసించడు. మధ్యధరా సముద్రంలో బోటులో షికారు చేస్తుంటాడు. ఫెర్న్ గారికి, మదామ్ ఫెర్న్ గారికి ఇండియా అంటే చాలా ఇష్టం. మమ్మల్ని ఇక్కడికి రమ్మని ఆహ్వానించారు. ఈ వేసవి గడపడానికి కాజిల్‌తోపాటు గుర్రాన్ని, కుర్రవాళ్ళని, పనివాళ్లని చిత్రాల్ని కూడా మాకు అప్పగించి - చాలా తక్కువ బాడుగకే, వారు షికార్లకు వెళ్ళిపోయారు.

మెదలీనా - నేను - జార్జి - లీజో నలుగురం ఇక్కడికి చేరాం - నేను చర్చిలో పడుకునేవాడిని. లీజో వచ్చి చూడండి - అది శిలువ కాదు - సరిగా చూస్తే స్వస్తిక్‌లాగా ఉంది - అని ఆశ్చర్యపోయాడు. హిట్లర్ కంటే ముందే స్వస్తిక్ తూర్పు దేశాల నుంచి వచ్చిందని అతని నమ్మకం.

మెదలీనా లీజోను దూరంగా పెట్టింది. లీజోకి మనుషులంటే తారీఖులు - వ్యాకరణమే - అతనికి దేవుడంటేనే నమ్మకం.

జార్జికి జంతువులంటే ప్రేమ. గుర్రపు శాల దగ్గర్లో ఉండేవాడు - అది రష్యన్లకు సహజమే! మెదలీనా బురుజు గదిలో పడుకునేది - అక్కడ నుంచి చూస్తే - స్పెయిన్ వైపు పర్వతాలు కనిపించేవి, ఫ్రాన్స్‌కు కాపలా కాస్తూ!

నేను 'బ్లాంచి' (గుర్రం) మీద సవారీకి వెళ్ళేవాడిని. బ్లాంచీ నాతో మాట్లాడేది. క్రింద నది వరకు వెళ్లేవాళ్ళం - దానికి నా సమస్య తెలియకపోయినా సానుభూతి చూపించింది!

అసలు నా సమస్య ఏమిటి? అది ఎక్కడ మొదలైంది? మెదలీనా ఎంత బాగా నా అవసరాలు చూసుకుంటోంది! నాకు మందులు ఇవ్వడం పెన్సిల్ అందించడం అన్నింట్లో - కానీ ఆమె ఇక్కడ లేదు! ఆమె ఎక్కడా లేదు! ఎప్పుడన్నా జార్జి మాట్లాడితే చిన్నగా నవ్వేది అంతే!

లీజోను దూరంగా పెట్టిందని చెప్పానుగా - అతను స్పానిష్ అవ్వటమే కారణం కాదు - అతని మాటలు, చేతలు కూడా ఆమెకు నచ్చలేదు, అంతే!

లీజోకు ఆ మాత్రం తెలీదా - త్వరలోనే నిర్ణయం తీసుకున్నాడు - ఇక్కడికి స్పెయిన్ సరిహద్దు చాలా దగ్గర - ఫ్రాంకో మనుష్యులు ఎప్పుడైనా రావచ్చు - అని వెళ్లిపోవడానికి సిద్ధపడ్డాడు.

లీజో వెళ్లిపోయిన తర్వాత కొత్త వాతావరణం ఏర్పడింది - అప్పుడు నేను రాసిన డైరీలలో కొన్ని పుటలు ఇప్పుడు చదువుతుంటే నా గురించి నేను రాసుకున్నవి చాలా ఆశ్చర్యంగా, ఆందోళనకరంగా కూడా ఉన్నాయి.

ఆగస్టు-3: ధర్మాన్ని ఎంచుకోవడం, ఆచరించడం కష్టంతో కూడుకున్న కార్యం. అధర్మాన్ని త్వరగా ఆశ్రయిస్తారు. అధర్మం అంటుంది - "రా - ఇదిగో నేను ఉన్నాను. నన్ను ఆశ్రయించు - మిగతా ప్రపంచాన్ని మర్చిపో" అని.

అదే ధర్మం - "ఇదిగో నన్ను చేరలేవు - అలాగే నన్ను మరిచిపోలేవు" - అని. దీనిలో మర్మం - ధర్మాధర్మాలు భిన్నధృవాలు - ధర్మం తనను తనే పరాజయంపాలు చేసుకుంటుంది - అధర్మం అప్రతిహతంగా విజయం సాధిస్తుంది!

ఇది ఎంతవరకు సత్యం - లిజో తను వెళ్ళిపోయేముందు - అప్పటికే మాకు ఎంతో దగ్గరగా వ్యక్తిగతంగా - కరుణామయునిగా ఒకవేళ మేమే అడిగితే - అతని 'క్లోక్' మాకు ఇచ్చి - వంగి అభివాదం చేసి వెళ్లిపోయేవాడు-

కానీ మెదలినా - నా గొంతుకు, ఊపిరికి అడ్డుపడుతోంది. డాక్టర్లు ఏమీ లేదంటారు - కానీ నా దగ్గు ఊపిరాడటం లేదు - ఒక రాత్రి దగ్గుతో సతమతమవుతుంటే - నా దుప్పటంతా రక్తం మరకలు పడిపోయింది. మెదలీనా తన పవిత్ర సేవతో నన్ను కూర్చోబెట్టి తన అందమైన కనురెప్పలు టపటపలాడుతుంటే నా ముఖం మీది రక్తమంతా జాగ్రత్తగా తుడిచి - ఒక వీరుని రక్తాన్ని తీసుకెళ్తున్నట్లు ఆ పళ్ళాన్ని తీసుకు వెళ్ళింది. సేవాధర్మం - మనిషికి సహజమే - కానీ అదే గొప్ప సుగుణం కాదు-

నన్ను పడుకోబెట్టి - హాల్లోకి వెళ్లి - జార్జితో అర్ధరాత్రి చాలాసేపు మాట్లాడింది. - ఇప్పటి వరకూ ఎప్పుడు రక్తం పడలేదు - మూడేళ్లుగా - నాకు చాలా ఆందోళనగా ఉంది - అంటోంది. జార్జి చాలా గంభీరమైన స్వరంతో ముఖ్యంగా, ఆ రాత్రి నిశ్శబ్దంలో - మాట్లాడుతుంటే - ఎవరో మాట్లాడుతున్నట్లు కాక గది గోడలే - నా భవిష్యత్తు - జాతకం నిర్ణయిస్తున్నట్లుంది!

మెదలీనా ఇప్పుడు మరింత అందంగా ఉంది - ఆమె సుగుణాలు మార్మికంగా మెరిసిపోతున్నాయి. సెయింట్ జాన్ గురించి - బౌద్ధం గురించి మరింతగా చదువుతోంది - బౌద్ధం ఆమెకు బాగా ఆనందాన్నిస్తోంది - కానీ జార్జి బోధిస్తున్న క్రిస్టియన్ మర్మాలు ఆమెను ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయి. ఆమెకు ఇప్పుడు సంస్కృత పాఠాలు చెబుతున్నా. ఇది ఆమెకు రుచించడం లేదు. దానికి లిజో కారణమని చెబుతోంది. కానీ జార్జి చెప్పే కారణం వేరు - నాకు సంస్కృతం ఒక భావావేశం - అది అర్థం కాదు - లిజో భాషను బాగా ఆకళింపు చేసుకునేవాడు - ఏ భాష అయినా అది ఐస్‌లాండ్ లేదా - లేక హీబ్రూనా అని చూసేవాడు కాదు - సాంప్రదాయమైన జ్ఞానం చాలా అద్భుతమైనది - అది నాకు లేదు - నా బలహీనత - మీకు గ్రహాలు కనబడితే నాకు నక్షత్రాలు కనపడతాయి. ఇలా సాగింది నా జర్నల్.

ఆగస్టు-17: ఈ వారం చాలా ప్రత్యేకమైనది - జార్జి నాకు మరింత దగ్గరగా వచ్చాడు - అతని సాధారణ, అంతర్ముఖమైన సహవాసం - మనల్ని స్వార్థపరుల్నిగా మారుస్తుంది - కాస్త మోటుగా కూడా - చూడండి - క్రిస్టియన్ వేదనలో ఎంత సౌందర్యం ఉందో - అదే నల్లని దుస్తుల్లో అంత్యక్రియలకు వచ్చే ఆడవారిని చూడండి! బ్రాహ్మణ వేదాంతికి ఒక రకమైన అహంకారం ఉంటుంది. అష్టావక్రుడు కూడా చెప్పింది అదే కదా - "చూడు - నేను ఎంత అద్భుతంగా ఉన్నానో" అని. ఎనిమిది రకాల లోపాలతో అద్భుతంగా ఉన్నాడట! అవును - ఆశ్చర్యమే. అది నీవు కానప్పుడు - కానీ నీవే అయితే?! కానీ వింతగా ఉంది - నేను బౌద్ధ ధర్మానికి దూరమవుతున్నాను - మెదలీనా మరింతగా బౌద్ధానికి ఆకర్షితమవుతోంది.

బౌద్ధంలోని కవిత్వానికి - కరుణకు ఆమె కరిగిపోతోంది. క్రిస్టియానిటీలో ఉన్న ఆత్మన్యూనత, మూర్ఖత్వం బౌద్ధంలో లేవు - బౌద్ధం కవితాత్మకం - మత వాసన లేని కవిత్వం - చూడండి "క్రిస్టియన్లు - ఈ శరీరాన్ని మరణం తర్వాత ఎక్కువ ప్రేమిస్తారు - బ్రతికి ఉన్నప్పటికంటే, వారికి అవశేషాలు కావాలి! వాదించుకోవడానికి చోటు లేనివారు తమ అవశేషాల కోసం కుటుంబ ఖజానా కోసం ప్రాకులాడుతారు" అంటుంది - "ఈ నేలమాళిగలు కుటుంబం ఖజానా నాకు నచ్చవు - నా అనంతరం - నా ఎముకలు - అదిగో ఆ దక్షిణ ప్రాంతపు ఎండలో వెచ్చగా ఉంటే బాగుంటుంది - భూమిలో మగ్గిపోవడంకంటే" - అనేది.

మెదలీనా మనసులో తనకే తెలియని ఒక 'క్రిస్టియన్ ప్రదేశం' ఉంది. కేవలం నన్ను ఆనందపరచాలని సెయింట్ జాన్‌ని విమర్శించేది.

ఒక్కోసారి జార్జితో అలా ఆరుబయట కూర్చున్నప్పుడు స్పానిష్ మర్మాలను చర్చించేది - వాటి గురించి తనకే ఎక్కువ తెలిసినట్లు - జార్జికి తనే బోధిస్తున్నట్లు అనిపించేది. 'క్యాథలిసిజమ్' ఆమె రక్తంలో ఉండిపోయింది. జార్జి చెప్పిందంతా ఆమెకు సహజంగానే ఉంది. నిజానికి మతం - సహజమైనదే. అది మన మనోవికాసం! ఒక అభివ్యక్తం! ఆమె బౌద్ధం గురించి మాట్లాడుతుంటే 'దుఃఖం' నా చేతుల్లో వంపుతున్నట్లుండేది. కానీ ఆమెకది విచారమే! ఈ సృష్టిలోని విషాదమే - దుఃఖం - బాధాకరమైన బాధలోని - బాధ - అది!

ఆగస్ట్-23: మెదలీనా నా దగ్గరకు వచ్చింది. నేను మంచం మీదే ఉన్నాను. బయట అద్భుతంగా రోజు వెలిగిపోతోంది. చిలుకల సందడి వినిపిస్తోంది. కోతుల అల్లరి తెలుస్తోంది. అవి చెట్ల మీద గంతులు వేస్తున్నాయి. ఎంత బాగా వెలుగుతోంది!

నేను సంతోషంగా ఉండటం గమనించింది.

జీవితం ఒక బిందువు నుంచి మరో మజిలీకి ప్రయాణించటమే - మధ్యలో ఆ జ్ఞానం, ఎరుక కలిగి ఉండటమే ఆనందం. కానీ దీనంతటికీ మూలం దుఃఖమే - ఈ క్షణాలన్నీ కదిలిపోయేవే - మారిపోయేవే - అది విచారకరమే.

మెదలీనా కూడా ఎంతో ఆనందంగా ఉంది - నా పెదవులను ఆర్తిగా ముద్దు పెట్టుకుంది. ఆమె ప్రేమనంతా నా మీద గుమ్మరిస్తున్నట్లుంది - నా ఆరోగ్యం ఆమె చర్యతో కుదుట పడాలని ఆకాంక్ష-

మెదలీనా నన్ను ప్రేమిస్తోందా? నేను ఉన్నతంగా ఎదగాలని ఆమె కోరిక - దాని కోసం నన్ను పవిత్ర గంగతో - పాలతో - తేనెతో - అభిషేకం చేయాలని ఆమె కోరిక - మనం కృష్ణుణ్ణి, శివుణ్ణి అలాగే చేస్తున్నాం కదా!

ఈ అభిషేకం తనను తను పునీతం చేసుకోవడానికే - మనం దేవుళ్ళను పూజిస్తాం - ఇదే ప్రేమ సారమంతా - మరొకరితో మమేకం అవటంలో మనం ఏమిటో తెలుస్తుంది!

ఆగస్ట్-24: జార్జి రెండు మూడు రోజుల్లో వెళ్లిపోవడానికి సిద్ధమవుతున్నాడు. ఇది నాకు బాధగానే ఉంది. అతను చాలా దృఢమైనవాడు - మానసికంగా అతని దృఢత్వం - మెదలీనా నన్ను ప్రేమించడానికి దోహదం చేస్తోంది - ఆమె చాలా ఆనందంగా ఉంది.

జార్జి ఊరేగింపులో విగ్రహంలాంటివాడు - అదే మనం ఉత్సవ విగ్రహం అంటాం. అలా పెద్దపెద్ద చేతులతో ఇంకా పెద్ద దండలతో - అరుపులతో - ఒక హీరోలాగా ఊరేగిస్తారు కదా! 'మా పాపాలు క్షమించు దేవుడా' అని అరుస్తుంటారు - ప్రజలందరి తరఫునా - అలాంటిదే కార్నివాల్ - ఊరేగింపు - ఉత్సవం.

ఇది ఒక రకమైన - మూర్ఖత్వమే కదా! మత మౌఢ్యమే. కాని దీనిలో చాలా శక్తి ఉంటుంది. ఆ శక్తి - సాధించలేనిది - అసాధ్యాన్ని సాధిస్తున్నట్లు భ్రమ కలిగిస్తుంది - అదే కొండలు ఎక్కుతుంటారు - పడిపోతామని భయం లేకుండా - ఇది ఒక రకమైన మతాహంకారం!

కానీ - సత్యం చాలా సాధారణంగా, సహజంగా, మధురంగా ఉంటుంది సుమా!

ఆగస్టు-26: ఈ శనివారం జార్జి నా దగ్గరకు వచ్చాడు - అప్పుడు మెదలీనా సరుకులు తేవడానికి వెళ్ళింది - 'ఆచ్'కి! అతను వచ్చి నా దగ్గర్లో కూర్చున్నాడు - ఇప్పటివరకు దేవునితో సంభాషించి వచ్చినట్లున్నాడు.

"రామా! నిన్నో కోరిక కోరదామనుకుంటున్నాను - ఇన్నాళ్లు నీతో కలిసి ఉండటం - నీ జ్ఞాన ప్రకాశాన్ని కళ్ళారా చూశాను - నేను దాని శక్తిని కూడా గుర్తించాను - నేను రష్యన్‌ని - నువ్వు ఇండియన్‌వి - మన మూలాలు మనల్ని వదలవు - మనకి 'సత్యదర్శనం' ముఖ్యం - నీ ప్రేమతో నేను మరింతగా క్రిస్టియన్‌గా రూపొందాను - మేము ఏది సాధించాలని సాధన చేస్తామో అది మీ వ్యక్తిత్వంలోనే ఉంది - సహజంగా-

చాలా సహజంగా వ్యక్తమవుతుంది!

నీవు అందరికీ అందుబాటులో ఉంటావు - ముఖ్యంగా మతపరమైన అడ్డుతెరలు లేకుండా నీవు మెదలీనాతో ఎంత బాగా 'సహచర్యం' చేస్తున్నావు!

ఇలా నేను ఎవరినీ ఈ ప్రాంతపు భార్యాభర్తలు ఉండటం చూడలేదు - ఎంత అన్యోన్యంగా ఉంటారు - 'శృంగారపరమైన కోర్కెలతో నిండిన పాపం అది" అన్నాడు.

ఆ తర్వాత నా ఆలోచనలు ఒక్కసారిగా ఆగిపోయాయి. చీకటి కమ్మాయి. ఇంతవరకు ఇంతటి మూర్ఖమైన పదాన్ని 1951లో తెలివిగలవాడు ఎవ్వడూ మాట్లాడడం నాకు తెలియదు - దీనిలో అతని లోతు ఆలోచనలు దాగి ఉన్నాయి.

ఇప్పటికీ నాకు వినబడుతోంది - 'శృంగారపరమైన కోర్కెలతో నిండిన పాపం' చెట్ల మీద పక్షులు కూడుతున్నాయి. వాటిని రాళ్లతో కొట్టాలని ఆవేశపడ్డాను.

నిష్కృతి మతం మారితేనే ఉంటుంది - రామా - ఇక్కడ నిష్కృతి లేదు - అది చర్చిలోనే ఉంటుంది.

తర్వాత అతను దుఃఖిస్తున్నాడు కన్నీళ్ల పర్యంతంగా - బహుశ అతనికి ఫాదర్ జెనోబి తన సమాధి నుంచి లేచి వచ్చి కనపడ్డాడేమో?!

ఆగస్టు-29: ఇది నన్ను చాలా చిరాకు పెట్టింది - రాత్రి తర్వాత రాత్రి చీకట్లలోకి చూస్తూ గడిపేవాణ్ణి. చెట్ల మీద పక్షుల కువకువలు వినపడేవి - దూరంగా ఒక దీపం కనిపిస్తుండేది.

నాకు దైవ దర్శనం కావాలి! ఈ తపన ఎక్కువైపోయింది.

ఇప్పుడు నాకర్థం అవుతోంది ప్రొఫెట్ మహ్మద్ - మనిషికి దేవుణ్ణి పరిచయం చేశాడు - అక్కడ సామాన్యునికి దేవునితో పనిలేదు - దేవుడు మహమ్మద్ ఉన్నాడు. అలాగే క్రీస్తు - దేవుడి బిడ్డ - కన్యకి పుట్టినవాడు - క్రీస్తుని సెయింట్ జాన్‌కంటే జూడాలే ఎక్కువ పవిత్రంగా మార్చారు.

విష్ణువు - శివుడు కనపడరు - ఒకవేళ దర్శనమిచ్చినా మాయమైపోతారు.

ప్రొఫెట్‌గాని - క్రీస్తుగాని ఉన్న మతం దేవునికి ఒక స్థానం కలిపిస్తోంది!

సెయింట్ లూయిస్, చరిత్ర పురుషుడే - జెరూసలేం చరిత్రలో ఎంత ఘర్షణ జరిగింది - సెయింట్ లూయిస్ ఎంత పోరాటం చేసి సాధించాడు-

వీరంతా చరిత్రలో లేకపోతే - క్రీస్తుగానీ మహ్మద్‌గాని చరిత్రలో లేకపోతే దేవునికి స్థానం ఎక్కడ?

ఆగస్టు-30: 'ఆల్బిజెన్సియన్ల' తత్వశాస్త్రం అధ్యయనానికి కదా ఇంత దూరం వచ్చాను - కానీ ఇప్పుడు నా ఆలోచనలు ఎటో పోతున్నాయి. నా గురించి నాలో నేను మాట్లాడుకుంటున్నాను. చరిత్ర నాకు ఏదో చెప్పాలని అనాలోచితంగా, గజిబిజిగా ప్రయత్నిస్తోంది. మనలో నుంచి మనం ఏ విధంగా బయటపడాలి?

క్రీస్తు - మహమ్మద్‌ల చారిత్రక సత్యం - సూత్రప్రాయంగా దేవుణ్ణి నిర్ధారిస్తుంది. క్రీస్తు చరిత్ర చెప్పేది ఇదే కదా!

కాథర్లు క్రీస్తును నమ్ముతున్నారా అంటే సమాధానం లేదు - కానీ వారు శాటర్న్ ఎలా విశ్వసిస్తారు? అనిశ్చితం - ప్రజలకు శత్రువు.

క్రిస్టియానిటీ, ఇస్లాం, జుడాయిజమ్ ఇవన్నీ ఈ ప్రాంతానికి చెందినవి. కానీ తావోయిజమ్, బౌద్ధం, వేదాంతం ఇవన్నీ అయోమయం సృష్టిస్తుంటాయి - ఈనాటి జీవనంతో అన్వయిస్తే వర్తమానం - వర్తమానంలా దర్శిస్తే - అందులో అయోమయానికి తావు లేదు.

అందుకేనేమో - భారతీయులు చరిత్ర రాసుకోరు. బౌద్ధం కూడా ఎంత చారిత్రకమైనా - అది మేథోపరంగానే మిగిలిపోతోంది. ఇప్పుడు మన వేదాంతం - అదే మహాయానంగా వర్ధిల్లుతోంది. అలాగే కన్ఫ్యూసినిజమ్ తావోయిజంగా చలామణి అవుతోంది- కాథర్లు వేదాంతులా? వారికి మరణం అంటే భయం లేదే - సత్యాన్ని - స్వచ్ఛతను ప్రేమిస్తారు - విశ్వసిస్తారు. కానీ చర్చి దేవుణ్ణి నమ్ముతుంది!

ఈ నాలుగు రోజులు నాకు ఈ పురాతన చర్చి నీడలో ఎంత ఆనందంగా ఉన్నాను - ఎంత సంరక్షణలో ఉన్నాను. నా జీవితం మీద ఎంత నమ్మకం కలిగింది- ఎంత సంతోషంగా ఉన్నాను!

జార్జి వెళ్ళిపోతూ డాస్టోవిస్కీపై బిర్డేవ్ రాసిన పుస్తకం ఇచ్చాడు.

మెదలీనాకి - నేను నీ దేవుణ్ణి నమ్ముతున్నాను అని చెప్పాలని ఎంతగా తాపత్రయ పడుతున్నాను.

ఆగస్టు-31: ఈ సాయంత్రం చాలా దూరం నడిచి - నా గదికి తిరిగి వచ్చాను. అవును - ఇది పాత చర్చి కదా - ఆ కిటికీ దగ్గరికి వెళ్లి మోకాళ్ళ మీద ప్రార్థన చేశాను - కానీ నాకు లాటిన్ బాగా రాదు - కానీ లాటిన్‌లో ప్రార్థిస్తేనే అది ప్రార్థనగా చెల్లుతుంది - మెదలీనాకు ఏదో అనిపించి వచ్చి చూసింది - మా ఇద్దరికీ ఒక సమస్థలం ఉందనిపించింది - నాకు ఒక తువ్వాలు ఇచ్చి - "రామా - ఇక్కడ చాలా బాక్టీరియా ఉంటుంది. ఇది వేసుకో" అంది. ఆమె కూడా నా ప్రక్కన మోకరిల్లింది. నా భార్య కదా! ఆమెను మళ్లీ పెళ్లి చేసుకున్నట్లు నాకు అనిపించింది.

ఆ రాత్రి నా ప్రక్కలోకి వచ్చింది - అప్పటికే జార్జి వెళ్లిపోయాడు - చివరి రోజుల్లో జార్జిని ఆమె అంతగా పట్టించుకోలేదు - అతను సెయింట్ జాన్ గురించి చెప్తుంటాడు - కొన్నాళ్లుగా మెదలీనా స్త్రీత్వంతో మెరిసిపోతోంది! అర్ధరాత్రి ఎప్పుడో లేచి ఈ పురాతన కాజిల్ నిశ్శబ్దంలో పూర్తి ఎరుకతో నా ఒడిలో చేరింది. ఎన్నో తీయని పేర్లతో ఆమెను అక్కున చేర్చుకున్నాను. ఎప్పుడో ఆమె తృప్తిగా నవ్వింది - ఆమె నవ్వు ఆ పర్వతాల చుట్టూ మెరుపులా చుట్టి వచ్చింది.

ఈ రోజు నేను ప్రత్యేకంగా ఉన్నాను - నిన్ను పెళ్లి చేసుకున్నాను అంటే నీ దేవుణ్ణి కూడా అంగీకరించాలి సుమా-

మేము మౌంట్ ప్యాలెస్‌లో ఉండగానే చార్లీ మామ మమ్మల్ని చూడడానికి వచ్చాడు. ఆయనతోపాటు జోబీ కూడా ఉంది. వీరిద్దరిదీ మారు మనువు. ప్రతి వేసవికి చార్లీ మా దగ్గరకు వస్తుంటాడు - ఈ యాత్రను - ఆయన - బ్రాహ్మణ తీర్థయాత్ర అంటాడు నవ్వుతూ - ఆయన తల్లికి మెదలీనా మరో దేశస్తుణ్ణి పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదు - కానీ ఆ నిర్ణయం మెదలీనాది కదా నన్ను వారి కుటుంబంలోకి మనస్ఫూర్తిగా ఆహ్వానించింది - 'జోబీ' ఆంటీయే. చార్లీ తల్లి - మెదలీనా ఒక మహారాజును పెళ్ళి చేసుకుంది అని అనుకుంటుంది. లేకపోతే ఇండియా నుంచి వచ్చిన సామాన్యుణ్ణి వివాహమాడవలసిన పని ఏమిటి? అని ఆమె ఆలోచన. ఇండియాలోని రాజకుమారులు - రాజులు - కులాలు - విష్ణువు -

శివుడు - బ్రహ్మ - ఇవన్నీ ఆమె చిన్ననాటి స్కూల్ పుస్తకాలలో చదివింది. ఇప్పుడు స్వతంత్ర భారతదేశం ఆమెకు తెలియదు. ఆమెకు వివాహాల గురించి ఎక్కువగా తెలియదు - కానీ సమాధుల గురించి, పునరుత్థానం గురించి తెలుసు - ఆమెనలా ఉండనివ్వండి - ఆమె కూడా సమాధికి దగ్గర్లోనే ఉంది కదా!

ఆ సాయంత్రం మేమంతా కొండ దిగి వస్తున్నప్పుడు చార్లీ తన మాటల్లో మీరు ఫ్రాన్స్‌లో ఉంటారా? ఇండియా వెళ్ళిపోతారా? అనే సందేహం వ్యక్తం చేశాడు.

మెదలీనా మాట్లాడలేదు - ఆ సాయంత్రం ఆమె నా గదికి వచ్చినప్పుడు నేను మౌనంగానే ఉన్నాను. ఈ పవిత్ర భూమి, ఈ క్రీస్తు దేశంలో ఉండటం గౌరవమైన జీవితమే అన్నాను.

ఆమె నా దగ్గరకు వచ్చి నా చెంపకు ఆమె వదనాన్ని చేర్చింది. ఓ కన్నీటి చుక్క నా చెంప తడిపింది.

"చార్లీ అంకుల్‌తో చెప్పు - మనం త్వరలోనే ఇండియా వెళ్లిపోతున్నామని" అన్నాను.

"కాదు - అది నిజమా?"

"అవును - నిజమే - నాకు ఇండియా స్వతంత్ర మాతృభూమి!"

"నాకు అది స్వర్గసీమ" అంది మెదలీనా!

మాతో చార్లీ, జోబీ ఇంట్లో తిరుగుతుంటే చాలా సరదాగా ఉంది. మేరీ (ఇంటి పని చేస్తుంది) లీజో వెళ్ళిన దగ్గర నుంచి నిరుత్సాహంగా ఉంది - కానీ ఇప్పుడు జోబీ పురమాయింపులు అన్నీ జాగ్రత్తగా చేస్తుంది.

పనివాళ్లు - చెప్పేవాళ్ళ మంచి చెడ్డలనుబట్టి తమ విధేయత తెలియపరుస్తారు.

కానీ ఎవరైనా మరొకరికి విధేయంగా ఎందుకు ఉండాలి? ఈ విషయంలో నాకు అర్థం కాదు - ఎవరి ధర్మం వారు నెరవేర్చడం న్యాయం కదా! అదే నిజమైన విధేయత!

ఆ సాయంత్రం నేనూ - చార్లీ గుర్రపుస్వారీకి వెళ్ళాం - నా దగ్గ చార్లీని కూడా ఆందోళన పరిచింది. ఇక్కడి నుంచి 'పావ్' వెళ్తున్నామని తెలిసి - 'అవును - అది చక్కటి వాతావరణం - బలహీనమైన ఊపిరితిత్తులకు అది చక్కటి చోటు' అన్నాడు.

'మనందరం ఎక్కడో ఒకచోట బలహీనంగా ఉంటాం - నాకు నా కాలేయం బలహీనంగా ఉంది. అందుకే 'వీచీ' (Vichy) మూడేళ్లకు ఒకసారి వెళ్లి వైద్యం

చేయించుకుంటాను. ఇక్కడ నేను సంతోషంగా ఉన్నాను - కానీ కారణం తెలియదు - ఈ సంతోషం మెదలీనాదా - లేక నాదా అనే విషయం కూడా చెప్పలేను. నేను ఒంటరిగా స్నానాల గదిలో అద్దంలో చూసినప్పుడు - నా కళ్ళ చుట్టూ మఖముల్ వలయాలు కనబడుతున్నాయి - ఎక్కడో అగాథంలో బాధ దాగి ఉన్నట్లు!!

ఇండియా నుంచి ఉత్తరాలు ఏవీ సంతోషాన్ని మోసుకు రాలేదు. సరోజ అంత ఆనందంగా లేదు. చిన్నమ్మ ఇంటి పెత్తనాన్ని ఆమె అంగీకరిగించలేక పోతుంది. దాదాపు ఇద్దరిదీ ఒకే వయస్సు కాకపోయినా చిన్నమ్మ చిన్నది కదా! ఈ విషయం చిన్నమ్మ నాతో ఎప్పుడూ చెప్పకపోయినా సరోజ ఉత్తరాలలో స్పష్టంగా తెలుస్తోంది. సుకుమారి చాలా బాగా చదువుతోంది. ఇప్పుడు స్కూలు సెక్రటరీగా ఎన్నికైంది. కారల్ మార్క్స్ గురించి చదవాలని పుస్తకాలు పంపమని రాసింది - నా చెల్లెలు మార్క్స్ గురించి చదువుతోంది!!

జీవితం ఎంతో విస్తృతమైనది. మార్క్సిజమ్, హిందూయిజమ్, క్రిస్టియానిటీ, ఇస్లాం - హిట్లర్ - బ్రిటిష్ కామన్వెల్త్ - అమెరికా - ఇవన్నీ ఎన్నో పేర్లయినా ఏదో తెలియని సిద్ధాంతం కోసం పుట్టినవే - మనం కూడా తెలుసుకోవచ్చు కానీ - ఇతమిత్థంగా పేరు పెట్టలేము. భగవద్గీత చెప్పినట్టు అన్ని మార్గాలు అనంత సత్యంలోకి దారితీస్తాయి.

నేను క్రిస్టియన్‌గా మారిపోవడానికి పడే బాధ కూడా ఇలాంటిదే.

మన అస్తిత్వంలో ఏదో తెలియని ఖాళీ ప్రదేశాలుంటాయి. అవన్నీ మన ప్రయాణంలో దాటి పోతుంటాము. మన గోమందలతో కలసి వెళ్ళిపోతుంటాము. అదంతా ఒకటే భూమి. ఎల్లలు లేని విశాల ప్రదేశం. కాని పక్షులు చూడండి - సాయంత్రానికి ఎవరి గూటికి అవి చేరిపోతాయి. భగవంతుడు వాటి పేర్లు ఎక్కడో చక్కగా రాసి ఉన్నట్లు ఆ చెట్టు మీదకే చేరతాయి - తరువాత అక్కడే తమ చిన్నారులకు జన్మనిస్తాయి.

నాగరికత అంటే తెలుసుకోవడమే - మన అంతర్లోకాలను పరిచయం చేసుకోవడమే - ఆ ప్రదేశాలను ఇక్కడ ఎరువు పోసి పంటలు పండించుకోవడమే - నదులు ప్రవహించేది - వర్షాలు తడిపేది - అలాంటి సారవంతమైన భూమినే! అక్కడే కదా తడి నేల కమ్మని వాసన వస్తుంది. మామిడి పండ్లు పండి మనం తింటాం - ఇవన్నీ వేల సంవత్సరాల నాటి ఫలాలు.

యుద్ధాలు - కరువు - ఇవన్నీ ఇందులో భాగమే - ముందుగా తురుష్కులు, తర్వాత బ్రిటిష్ వాళ్ళు - మనల్ని ఆక్రమించారు - ఎంత జరిగినా మన దేశం మనకు మిగిలి ఉంది. దాన్ని ఎవరు జయిస్తారు?

మన పంటను పొలం నుంచి పోచమ్మ గుడికి మోసుకుపోతాం - ఊరు ఊరికీ పోచమ్మ తల్లి లేదా - ఆ దేవత వేల సంవత్సరాల నుంచి చూడటం లేదా - ఈ దేవతలంతా మనలో ఉండేవారే, తరతరాలుగా మనతో వచ్చినవారే.

ఫ్రాన్స్‌లో 'నేను మౌంట్‌మోరెన్సీ' అంటారు. అంటే ఏ ప్రాంతానికి, ఏ జాతికి - చెందినవాడో వెంటనే తెలిసిపోతుంది - దీని కోసం ఏ పుస్తకాలు చదవనవసరం లేదు. ఎల్లలు సరిహద్దులు ఇవన్నీ భౌతికమైనవి - మనం ఏర్పరచమన్నవి - నాగరికత - అంతకు మించినది - ఎన్ని తరాలను గుదిగుచ్చినా ఆల్ఫ్ పర్వతాలను ఏర్పరచగలమా?

నాలో నేను 'బ్రాహ్మిణ్ - బ్రాహ్మిణ్' అనుకున్నాను - నన్ను నేను పరిచయం చేసుకోవడానికి - మళ్లీ శంకరాచార్యను ఆశ్రయించాను - మనోబుద్ధి అహంకార చిత్తాని నహమ్ - నాకు కన్నీళ్ళు ఆగలేదు.

బహుశా నేను బలహీనపడిపోతున్నానేమో - ఆకలి బాగా తగ్గిపోయింది - బరువు పెరగాలనే నా ప్రయత్నం ఏమీ ఫలితాన్నివ్వడం లేదు - నాకు పదిహేడేళ్ళు కూడా లేవు - డాక్టరు నా జబ్బును నయం చేసినప్పుడు - అది అప్పుడే మొదలై ఉంటుంది - తరువాత ఎక్స్‌రేలో కూడా దాని పొడ కనిపించలేదు. మంచి ఆహారం - క్రమం తప్పక నడకతో పూర్తిగా కోలుకుంటావు అని చెప్పాడు డాక్టర్. ఇప్పటికి ఏడేళ్లు గడిచిపోయాయి - ఏమో - కుటుంబ భారం ఎక్కువై బలహీన పడుతున్నానేమో - పియరీ మరణం నన్నెలా కోలుకోనిస్తుంది? ఆ బాధతోనే క్రుంగిపోతున్నానేమో - చార్లీ అంకుల్ చాలా చైతన్యవంతంగా ఉంటాడు. జోబీ ఆంటీ కూడా చాలా సరదాగా మమ్మల్ని ప్రేమగా చూస్తుంటుంది. మెదలీనా చాలా సంతోషంగా కనపడుతోంది - ఆమెలో ఎలాంటి మార్పూ గమనించలేదు.

రాత్రి పూట మేము ప్రక్కప్రక్కనే పడుకున్నప్పుడు కప్పలు అరుస్తుండేవి వర్షానికి. రాత్రంతా ఈలకోళ్లు పాడుతుండేవి - ఆమె ఇండియాలో ఈ శబ్దాలన్నీ వినపడతాయా? అని అడిగేది - ''రామా, నీ ప్రక్కన ఉంటే నాకు ఎంతో ధైర్యంగా ఉంటుంది'' అంటుంది. జోబీ ఆంటీ మెదలీనాని బాగా ఆటపట్టించేది. ఆడవాళ్లు చెప్పడానికి సిగ్గుపడే విషయాలు గుచ్చిగుచ్చి అడిగేది.

మీ ఇద్దరూ ఇంత ఆనందంగా ఉన్నారు - నాకు చాలా సంతోషంగా ఉంది. "మీకు పుట్టబోయే అమ్మాయికి పేరు ఏం పెడతారు" అని అడిగితే - మెదలీనా - "ఎస్కలార్‌మండి" (Esclarmaonde) అని చెప్పింది. "ఎంత చక్కటి పేరు" అంది జోబీ - "అవును ఆంటీ - అది ఈ ప్రాంతంలో చాలా గొప్ప పేరు - వీర వనిత! రోమన్‌లు దండెత్తి వచ్చినప్పుడు మెరుస్తున్న 'గ్రెయిల్'ను ఆమె కాపాడింది" అన్నది.

"అది సరే, తర్వాత అమ్మాయికి?" అంటే "దానికి తొందరేముంది?" మెదలీనా సిగ్గుపడింది - అలా కాదు - ప్రేమికులకు కాలం ఇట్టే దొర్లిపోతుంది - వెన్నెలకంటే ముందు!

"ఇసోబెల్" అని చెప్పింది. "ఈ మౌంట్ పాలెస్‌లో కౌంటెస్ ఇసెబెల్ ఉండేది!" అని సమర్థించుకుంది.

"మీ ఆయన నాకు బాగా నచ్చాడు" - అని నన్ను తన గుండెలకు హత్తుకున్నది. చూడు, రామాను చూస్తుంటే నాకు జిరాఫీ గుర్తుకొస్తుంది. శతాబ్దాల కాలంలో తన మెడను స్వర్గంవైపు ఎలా సాగదీసుకుందో! ఇప్పుడు దేవతావృక్షపు ఆకులు తింటోంది! ఎంత పవిత్రమైంది!

మా ఇద్దరి ప్రేమకు ఆమె రక్షకురాలుగా ఉంటోంది. మా సంతానానికి ఆమె పేరు పెట్టుకోవాలని ఆశ కూడా ఉంది.

నా ఆలోచనలన్నీ ఎక్కడ ఉన్నాయో మెదలీనాకు తెలుసు. "రామా - నా కొడుకు పేరు రంజిత్ - అని పెడదాం" అని నా జుట్టులో చేయిపెట్టి నన్ను దగ్గరకు తీసుకొంటూ అంటోంది. "అవును - అది రాజపుత్ర నామం. నా కొడుకు హీరోగా ఎదగాలి - ఆడవాళ్ళకి వారి అమ్మాయిలు - మగవాళ్ళకి తమ కొడుకులు వారసులు కదా" అని నవ్వుతుంది. నేను చాలా ఆనందంగా ఉన్నాను - మెదలీనాతో - ఆమె నా గురించి తెలిసిన జ్ఞానంతో నన్ను స్వంతం చేసుకోగలదు. నా మౌనాలు, నా భావావేశాలు - గాఢానురక్తి - ఇవన్నీ ఆమెకు బాగా తెలుసు.

ఇంకా జీవితపు లోతుల్లో - ఆలోచనలతో పనిలేని అగాధంలో ఆమె నా కోసం వేచి ఉండగలదు - తలుపు దగ్గర సేవకిలాగా నా పిలుపు కోసం - అప్పుడు నన్ను స్పష్టంగా వింటుంది!

మొన్న ఆదివారం - అందర్నీ 'ఆచ్' తీసుకెళ్ళాను - ఒక పాత గోతిక్ చర్చికి - అది చాలా అసంబద్ధంగా ఉంది. బహుశా ప్లేగ్, కరవుతో ప్రజలు చనిపోతున్నప్పుడు దీన్ని కట్టారేమో? అయినా ఈ ఉదయం అది ఎండలో మెరిసిపోతోంది. ఏదో సత్యాన్ని దాచుకున్నట్లు - మెదలీనా అంటోంది - "ఈ రోజు మొదటిసారిగా తువాలు

లేకుండా - బాక్టీరీయాకు దడవకుండా - మోకరిల్లాను - చాలా ధైర్యం చేశాను కదా!" అని.

జోబీ ఆంటీ - "మెదలీనా - నీ అందాన్ని ఈ ప్రక్కనుంచి చూడనివ్వు - ఆ ఆకుపచ్చ టోపీతో ఎంత అందంగా ఉన్నావో తెలుసా - కాథరీనాకు నువ్వు నేర్పు - ఎలా అలంకరించుకోవాలో - (కాథరీనా ఆమె కూతురు) - కోర్టు గుమాస్తాలాగా బట్టలు వేసుకుంటుంది. ఆమెకు కొడుకు పుడితే 'Titus Lewitas' అని పేరు పెట్టాలి (జడ్జి)" అని అంటుంది.

"'జోబీ నోటిని దబ్బళంతో కుట్టాలి" అనేవాణ్ణి మెదలీనాతో.

ఆమె చాలా ప్రియమైన హృదయం కలది - ఉదయాన్నే లేచి మా అందరికీ ఫలహారం చేస్తుంది - మేరీ సాయంతో - ఎన్నో రకాల జామ్‌లు ఇచ్చింది - సగం పైగా నా కారులో పెట్టింది - ఇరవై రోజుల్లో పదహారు జాము సీసాలు తిన్నాను.

"రామా - ఏమీ వదలకు - మిగిలినవన్నీ నీకే" అనేది. "మెదలీనా - నీవు కూడా సంతోషంగా ఉండు - గుడ్‌బై" అని చెప్పి ముందుగా ఆమె వెళ్ళిపోయింది - అంకుల్ - ఆంటీ మధ్యలో కూర్చుని - మెదలీనా ఎంత ఆనందంగా ఉందో చెప్పలేను -

"రామా, నీ ఆరోగ్యం జాగ్రత్త - మెదలీనా భద్రత మాకు వదిలిపెట్టు" అని వాళ్ళు మరీ-మరీ చెప్పారు.

మెదలీనా - "ఓ రామ - నిన్ను వదలి వెళ్తున్నానా?" అని ముద్దుపెట్టింది. చాలా లావణ్యంగా ఉంది. ఆమె జుట్టు మెరుస్తూ వెనక పరచుకుంది - నెక్లెస్ ఆమె వక్షోజాల మధ్య మెరుస్తుంది - "మెదలీనాని బాగా లావు చేసి పంపిస్తాము" అంటున్నారు వారు.

ఒంటరిగా ఇల్లంతా తిరిగాను. మళ్ళీ చర్చికి వెళ్ళాను. ఇలా బాధగా చర్చిని వదిలి రాగలిగాను-

అక్కడున్న 'ఫిగ్' చెట్టును చూశాను. అవి లోయలోకి చూస్తున్నాయి. బ్లాంచి గుర్రాన్ని వళ్ళంతా తడిమాను - కానీ ఎండుగడ్డితో రుద్దలేకపోయాను. నీళ్ళ దగ్గరకు తీసుకొని వెళ్లలేక పోయానని బాధగా ఉంది.

మేరీ - ఫ్లాస్క్‌లో పాలు, కాఫీ పోసింది. ఆమెను ఓదార్చడానికి "నీకు పెళ్లి చేసుకోవాలని ఉంటే చెప్పు - నేను మదామ్ నీకు సహాయం చేస్తాం" అన్నాను. "చాలా దయగలవారు - కానీ ఇంకా చాలా సమయం ఉంది. ఇక్కడ సామెత - 'వైన్ యార్డ్ కొనాలన్నా - వెడ్డింగ్ రింగ్ తొడగాలన్నా చాలా బంగారం కావాలి" అని

అంది విచారంగా. "నీదయితే నీకు దక్కుతుంది - నీది కానిది ఆ దేవుడు కూడా ఇవ్వలేడు!" అన్నాను.

రోజు చాలా విశాలంగా అనిపించింది. ప్రాణవాయువుతో నిండి ఉంది - మేరీ ఒక దువ్వెన - ఒక చేతి రుమాలు మెదలీనా మర్చిపోయినవి తెచ్చి ఇచ్చింది. జేబులో పెట్టుకున్నాను - అవి మేరీ ఇచ్చిన బహుమతిలాగా-

చెట్ల మధ్య - జంతువుల మధ్య పూల మధ్య నివసించేవారి హృదయం నిర్మలంగా ఉంటుంది.

"నేను రాబర్ట్ గారికి - మీరు ఇంటిని ఎంత జాగ్రత్తగా చూసుకున్నారో చెప్తాను" అని అంది మేరీ.

మరో విషయం బ్లాంచిని డాక్టరుకు చూపించమని - "దానికి కడుపులో పురుగులున్నట్టున్నాయి - గోడకు రుద్దుకుంటోంది. పైగా నీటి దగ్గరకు వస్తే తుమ్ముతోంది" - అన్నాను.

"అలాగే - అయ్యా" అని వీడ్కోలు చెప్పింది.

మౌంట్ ప్యాలెస్ - వెనకబడిపోయింది. నేను మళ్ళీ తిరిగి చూడలేదు. ఆ రోడ్డు చివరి నుంచి - మళ్ళీ సంవత్సరం, చాలా రోజులు - ఈలోపు భూమి తన చుట్టూ ఎన్నోసార్లు తిరుగుతుంది కదా! ఆర్కిటెక్ - ఆఫ్రికా వెళ్లిన ఎన్ని పక్షులు తిరిగి వస్తాయి! ఇంకా కొరియా యుద్ధం జరుగుతూనే ఉంది - ఈ పిచ్చి ప్రపంచంలో ఇంకా ఏం జరుగుతుందో- ఫ్రాన్స్ ఎప్పుడూ శాంతికాముక దేశమే - ఎన్నో యుద్ధాలు జరిగాయి. కొరియా కొరివి ఇక్కడ వరకు రావడం కష్టమే. కాని నేను దారిలో చాలా - తలుపులు మూసి ఉండటం చూశాను - పంచదార - బంగాళాదుంపలు ఇళ్లకు చేరవేస్తున్నారు - ముందు జాగ్రత్తగా. స్పెయిన్ దగ్గరకు వచ్చేసరికి వాతావరణం మారిపోయింది. ఇక్కడ ప్రజలు భయం లేకుండా చైతన్యంతో ఉన్నారు - ఇది రెండు సరిహద్దుల మధ్యగా ఉంది. పవిత్రమైన పిరినీస్ ఒక అభయమిస్తుంది. నెపోలియన్ - హిట్లర్ చేయలేని సాహసం - రష్యా చేస్తుందని అనుకోను - అవకాశం లేదు. పావ్ పై నుంచి పిరనీస్‌వైపు చూస్తుంటే మనకనిపిస్తుంది - దృఢంగా ఉండాలంటే స్వచ్ఛంగా ఉండాలని - అదీ మంచులా ధవళ కాంతితో ఉండాలని!

అవును - మెదలీనా - నాతోనే ఉంది!

హోటల్ యాంగ్లిటిర్రిలో ఉన్నాను. అది ఉత్తరం వైపు చూస్తూ ఉంటుంది. నా గది నుంచి Pic du Midi చాలా దగ్గరలో చేతికి అందుతున్నట్లు ఉంటుంది. చక్కని - చిక్కని - ఆకుపచ్చని పచ్చిక బయలు! ప్రొద్దున్న పొగమంచు ఎండను కప్పివేస్తుంటుంది. తర్వాత వెలుతురు రాగానే ఓ సర్పంలా కనిపించకుండా దాగిపోతుంది. మధ్యాహ్నానికి మబ్బులు దట్టంగా ఆకాశానికి రంగులు పూస్తాయి. సాయంత్రాలు చలిగా ఉంటాయి - ఎక్కువమంది సెప్టెంబర్ మాసంలో పిరనీస్ ప్రొమెనెడ్‌లో కనిపించరు. జీవితం ఎంతో సత్యవంతంగా - నాకూ - ఈ పర్వతాలకు మధ్య పరచుకున్న ప్రకృతిలా అనిపిస్తోంది - సహజ జ్ఞానంతో! ఇక్కడ పొద్దు దిగిపోతూ కేవలం మా సేవకే అంకితమైనట్లు - సూరీడు చిన్ని గ్రహంలా అనిపిస్తాడు. హిమాలయాల్లో కానీ, ఆల్ప్స్‌లో కానీ ఇలా ఉండదు. నీకు - సూర్యునికి ఏదో అవినాభావ సంబంధం ఉన్నట్లు తెలుస్తుంది. అతను దిగంతాలలో దిగిపోతుంటే - మీ తండ్రి, మిత్రుడు మీకు వీడ్కోలు చెబుతున్నట్లు - ఎప్పుడు రమ్మంటే అప్పుడు రాగలను అని చెబుతున్నట్లు అనిపిస్తుంది. అందుకేనేమో డాన్ కిక్సోట్ గాలి మరల్ని సైనికుల్లా భావించాడు - అర్తగ్నాన్ (Artagnan) ఫ్రాన్స్ వీరునిగా తలపోశాడు! పగలంతా నా ఊపిరి తిత్తులు వెలుగుతో నిండిపోయేవి. కానీ రాత్రి చీకటి లోయల్లో నిండిపోతుంటే - గాలిని ఆవహిస్తుంటే అప్పుడనిపిస్తుంది - నిజానికి సూర్యుడు మనల్ని మోసం చేస్తున్నాడు - ఈ రాత్రి ఖాళీలో - ఇది ఏ సూర్యుడు నింపలేడు - ఈ లోయ దీనిని భరించలేదు అని తెలిసి వస్తుంది. ఇక్కడ ఓ శూన్యం - చాలా పరిచయమైన శూన్యం - మనం చూడగలిగింది - కానీ - ఈ కళ్ళతో కాదు - ఈ తెలివితో కాదు - ఏదో వర్తమానంలో ధ్వనిస్తున్న సన్నని సంగీతంలా వినవస్తోంది! చక్షురింద్రియాలతో అనుభవంలోనికి రానిదేదో ఈ వర్తమానంలో ధ్వనిస్తున్న సన్నని సంగీతంలా వినవస్తోంది.

హెన్రి IV చాటు (Chateau) ఇది రినైజాన్స్ ఆరంభంలో కావచ్చు - కానీ అది రాజ్‌పుత్ర వ్యక్తిత్వం ఏదో ఉన్నట్లు చితోర్‌ఘడ్‌లో రాథోర్ కోసం పాడుతున్న రాణిలాగా అనిపించేది. ఇలాంటి కలలెన్నో నాకు వచ్చేవి. తెల్లని పట్టు వస్త్రాలతో తేలుకుంటూ వచ్చి ఆమె నిండైన వక్షాలు పావురాయి ఈకల్లా మెత్తగా తగిలేవి. నేను సమయాన్ని నా చేతులతో కొడుతూ - లెక్కిస్తూ - త్వరలో ఇండియాలో ఉదయించబోతున్న సూర్యుణ్ణి - వేడిమిని అనుభవించేవాడిని!

ఖేలిత నందకుమారా - కుమారరే! అదిగో బృందావనంలో నందకుమారుడు నర్తిస్తున్నాడు!

ఇలాంటి సమయంలో మెదలీనా నాకు ఎంతో దూరంలో ఉన్నట్టు అనిపిస్తుంది. "నీ ఎక్సరే సరిగా లేకపోయినా - డాక్టర్లు ఎలాంటి సందేహాన్ని వెలిబుచ్చినా నాకు వెంటనే టెలిగ్రాం పంపు" అని మరీ-మరీ చెప్పింది. "అంకుల్ చార్లీతో ప్యారిస్ వెళుతున్నాను - కాథరీనా పెళ్లి బట్టల కోసం - ఆమెకు అన్నీ నేర్పాలి - లిప్‌స్టిక్ ఎలా వేసుకోవాలి - ఎలాంటి తలకట్టు చేసుకోవాలి - పగలు వేసుకునే బట్టలు - రాత్రి వేసుకోవలసిన గౌన్లు - అన్నీ కొనాలి - చిన్న మామ తన కోసం ప్రత్యేకమైన సూటు తయారు చేయించుకున్నాడు. ఇవన్నీ నేను లేకుండా జరగడం నాకిష్టం లేదు. అందుకని నీకు ఆరోగ్యపరంగా ఏ ఆందోళన ఉన్నా నేను వెంటనే వస్తాను - ఏదీ నీకంటే ఎక్కువ కాదు" అంది .

అదృష్టవశాత్తు ఎక్సరే బాగానే ఉంది - కాథరీన్ తన పార్టీని నిరాటంకంగా జరుపుకోవచ్చు!

రెండు రోజుల తర్వాత - మెదలీనా చక్కని ఉత్తరం రాసింది - "మొదట రెండు మూడు రోజులు నాకు కలలో ఏనుగులు, సర్పాలు - ఇండియా గురించి కనిపించాయి - "నన్ను అమ్మమ్మ దగ్గరకు తీసుకు వెళ్ళండి!' అని గొడవ చేసింది. ఆరాస్ (ARRAS)లో ఉన్న అమ్మమ్మ దగ్గరకు వెళ్ళింది. ఇప్పుడున్న ఇల్లు మారిపోయింది. నాన్న అక్కడే నిలబడ్డాడు - సైనికునిలాగా యూనిఫాంలో - అమ్మో! ఎంత భయం వేసిందో - నేను చీర కట్టుకుని, కుంకుమ పెట్టుకుని నిలబడ్డాను. అంతే! ఇక కాథరీన్ పార్టీ కోసం సిద్ధమైపోతున్నాను" - అని సంతోషంగా రాసింది.

"అమ్మమ్మకు ఇవేమీ తెలియవు - ఏమీ జరగనట్లే ఉంది. అసలు మెదలీనాకు పెళ్లి అయినట్లు కూడా గుర్తున్నట్లు లేదు - 'నువ్వు పారిస్ వెళ్ళు - ఇదిగో - ఈ గొలుసు నీ నిశ్చితార్థానికి ధరించు - ఇది మీ నాన్న ఇచ్చాడు - ఈ సందర్భం

హెన్రి IV చాటు (Chateau)

కోసం - తీసుకో - ఇప్పుడు నా వయసు మళ్ళిపోయింది - 87 సంవత్సరాలు - ఎప్పుడు ఏమి జరుగుతుందో - ఎవరికి తెలుసు? నీకు పెళ్లి అయిన తర్వాత ఆ వజ్రాల 'బ్రోచ్' పెట్టుకో - టర్కీ నుంచి తెచ్చాడు - అది అరేబియాది - అదృష్టాన్ని తెస్తుంది'' అంటారు.

అమ్మమ్మ నాకు చూపించింది - రామా, ఎంత బాగుందో తెలుసా? అర్ధ చంద్రాకారంగా వజ్రాలు - కెంపులు పొదిగి ఉన్నాయి. క్రింద నల్లపూసలు ఉన్నాయి. నీ ప్రక్కనుంటే వెంటనే ధరించేదాన్ని - ఆక్స్ వచ్చిన తర్వాత పెట్టుకుంటాను. నువ్వు లేకపోతే రోజులు గడవడం లేదు - రాత్రులు గట్టిగా అరవాలనిపిస్తుంది - ఇదంతా ఆందోళన మూలంగా - రాత్రి బాగా నిద్రపోయాను - సాయంత్రం అంతా నీ గురించే మాట్లాడాను - నువ్వు నన్ను ఎంత గౌరవిస్తావో జోబీకి - కాథరీన్‌కి చెప్పాను. నీకు స్త్రీ అంటే ఒక వింత - అద్భుతం అంటావు కదా! ఇక్కడ వాళ్ళు తమ భార్యలను ఎంతో సన్నిహితంగా చూస్తారు. కానీ నీవు వారిని దేవతల్లా కొలుస్తావు. ఎంత బాధ పెట్టినా! పర్వాలేదు - ఆ బాధ నేను తట్టుకోగలను - నేను నీ బానిసను కదా! కాదు - నాకు బానిస ఎందుకు? నా యాత్రలో తోడు కావాలి - ఆ పర్వతాలను చూడు - ఆ వంకరటింకర దారుల్లో పెళ్లి గంటలు వినబడుతున్నాయి. పూజ సమయానికి వేళయింది - దేవుని ముందు మోకరిల్లు - ఇద్దరం ఒంటరిగా - అవును - దేవుని దగ్గరకు ఒంటరిగానే వెళ్ళాలి!

పగలంతా నా అల్బిజెన్సియన్లతో గడిపాను. భారతీయ అద్వైతం వివిధ దేశాలలో వ్యాపించిన తర్వాత కూడా కొందరు ఇంకా తద్వ్యతిరేక భావనలనే పట్టుక్కూర్చోవటం నిజంగా విచిత్రం. మహా విచిత్రం. ద్వైతము, వైరుధ్యాన్నీ నిరాకరించిన అద్వైతానికి బదులు జనం ఇంకా శారీరక, భౌతిక పవిత్రతను గాఢంగా నమ్మి ఎస్క్లార్ మోడ్ డి పెరల్వాలాగ - శలభాల్లా - అగ్నికి ఆహుతి కావడానికే ఉత్సాహం చూపిస్తున్నారు. శరీరాన్ని నిరాకరిస్తున్నారంటే దాని ఉనికిని అంగీకరించినట్టే - ఆలోచనను అధిగమించడం, అసాధ్యం. దాన్ని దాని నేపథ్యంలో మాత్రమే లీనం చేయగలం. అలాగే దుష్టత్వాన్ని నాశనం చేయలేము. కానీ అది ఏ రూపంలో ఆవిర్భవించిందో దానిలో లీనం చేయగలం. అంటే దుష్టత్వానికి మూలమైన రూపంలో. జీవితానికి కూడా మూల కారణం అదే. రెండు రెళ్లు నాలుగనే నియంతృత్వం అతి భయంకరమైనది అన్నాడు, దాస్తోయేవ్‌స్కీ - మనిషికి ఇక దాని నుండి విముక్తి దొరకనట్టే. కానీ దాస్తోయేవ్‌స్కీ సంఖ్యా సిద్ధాంతాన్ని అధ్యయనం చేసుంటే అన్ని అంకెలూ 'సున్నా'లో లీనమవుతాయని తెలుసుకోగలిగేవాడు. అన్ని అంకెలకు మూలస్థానం ఆ శూన్యమే కదా! మరి శూన్యం నియంతృత్వం ఎలా అవుతుంది?

కాదుగదా! అసంబద్ధమనుకున్నదే మనకు వాదన నుండి నిష్క్రమించడానికి అవకాశం కల్పిస్తుంది - ఇంద్రియాతీతమైన పరిస్థితి నుండి ఇంద్రియ నిగ్రహం సాధ్యమైన ప్రకృతిలోకి పలాయనం! నువ్వు ఆనందంగానూ, వ్యక్తిగాను ఏకకాలంలో ఉండటం సాధ్యం కాదు. నువ్వు ఆనందానికైనా కావచ్చు - లేదా వ్యక్తికైనా కావచ్చు - కాని వ్యక్తికి రెండూ ఏకకాలంలో అనుభవంలోకి రావాలి అనుకొంటాను.

ఈ లోకంలో స్వచ్ఛంగా, పవిత్రంగా ఉండటమే వ్యక్తిగానూ, మానవునిగానూ (మానవ జాతికి చెందిన జీవిగా) ఏకకాలంలో ఉండటం. నేనో కథ విన్నాను. భారతదేశం ఇంగ్లీష్ వాళ్ళ పాలనలో ఉన్నప్పుడు భారతీయులు బ్రిటిష్ పాస్‌పోర్టులతో యూరోప్‌లో ఏ దేశానికి వెళ్లినా తాము బ్రిటిష్ వాళ్లమని ప్రకటించుకోవలసి వచ్చేది, అప్పుడప్పుడు. ఈ విషయాల గురించి అంతగా జ్ఞానం లేని పోలీసు ఎవడో "నువ్వు బ్రిటిష్‌వాడివి కాదుగదా" అని నిలదీసేవాడట. అంతేకాదు - ఇమిగ్రేషన్ నియమ నిబంధనల పుస్తకంలో దీనికి సమాధానం కూడా వెతికేవాడట. కానీ అందులో ఇలాంటి ప్రశ్నలకు జవాబులుండవు. చివరికి "నువ్వు బ్రిటీష్ వాడివి కావు" అంటూనే ఈ దేశంలోకి అనుమతించేవాడు. ఎందుకంటే ఇలాంటి సందర్భాల్లో ఆ పోలీసు మనిషి ఏ నిర్ణయం తీసుకోవాలో రూల్సు పుస్తకంలో రాసి లేదు. ఈ పోలీసులాగే దాస్తోయేవ్స్కీ కూడా తర్కానికి అతీతమైనది సత్యమే అయి ఉంటుందని విశ్వసించాడు. కానీ సత్యం కఠినమైనది కాదు. అత్యంత సులభ గ్రాహ్యమైనది కూడా అయి ఉండొచ్చు. మనం కాతర్ (పవిత్రుడు క్రైస్తవ మత శాఖ) కాలేం. 'పవిత్రంగా' మారాలి. పవిత్రత ఉంటే అదే నువ్వు. అదే ఇందులోని తిరకాసు. క్రైస్తవమూ, ఇస్లాం కూడా ఈ తిరకాసును అధిగమించలేక పోయాయి.

కాతార్లు ఈ డోసీటిజం (క్రీస్తు శరీరము మానవమాత్రులకు చెందినది కాదు. దైవికమైనదది)ను బుద్ధిస్ట్ ఆలోచనాధోరణిగానో, జోరాష్ట్రియన్ ద్వైత సిద్ధాంతంగానో అర్థం చేసుకున్నారు. మానిచీజం (ద్వైత సిద్ధాంతం, మంచి-చెడులకు మధ్య సంఘర్షణ తప్పనిసరి) మూలాలు భారతీయ తాత్వికతలో లేవు. అది పర్షియాకు వ్యాపించినప్పుడు (మణి-జన్మతః పర్షియన్. అతడు భారతదేశాన్ని సందర్శించినప్పుడు భారతీయ ఆలోచనా విధానంతో ప్రభావితమయ్యాడు) అసలు గతితార్కికతకు మూలం అహుర మజ్దాలోనే ఉండి ఉండవచ్చు (ప్లేటోకు) అనేది నేటి భారతీయులు అంగీకరించిన వాస్తవం. పావురంతోనో, కొబ్బరికాయతోనో దాన్ని తుడిచేసుకోవచ్చు కానీ చీకటి వెలుగులు ఒకదానితో ఒకటి సంఘర్షించినప్పుడు వస్తాడు కథానాయకుడు - సెయింట్, రుషి. నీచే (జర్మన్ తత్వవేత్త) జరాతూస్త్రను ఆవాహన చేశాడు. కానీ అతడి కారణంగానే హిట్లరిజం పెరగడం విచిత్రం.

పార్శీలు జూనీ (Zuni) ఇండియా తెగవాళ్లను తలపిస్తారు. అత్యుత్తమమైన ఈ తెగ నైతిక విలువల్ని పాటిస్తుంది. వాళ్ళలో మంచి-చెడు స్పష్టంగా ఉంటాయి. పగలు-రాత్రి, సూర్యుడు-చంద్రుడు, వర్షాకాలం-ఎండాకాలంలాగా భిన్నమైన ప్రాకృతిక అంశాలివి. పారిశీలలో ఒక శతాబ్దానికి పైగా ఒక్క హత్యానేరం కూడా ఆరోపించబడలేదు. అలాగే ఎవ్వరినీ హిందూ సన్యాసుల్లాగా నెత్తినపెట్టుకుని పూజించనూలేదు. పారిశీల నిజాయితీయే వాళ్లను బ్యాంకింగ్ పరిశ్రమకు చేరువ చేసింది. క్వేకర్లు, చాకొలేట్ తయారీదారులుగా మారినట్లుగా కాతార్లు ఎలక్ట్రో-మాగ్నెటిక్ ఆసిలోగ్రాఫ్‌లతో పరీక్షించేవాళ్ళు. అలా జన్మించిన కాతర్లకు ఒక్క దుష్టాలోచన కూడా వచ్చేది కాదు. ఆ ఉక్కు గోడలను దాటినప్పుడు మాత్రమే వాళ్లకు పడిశం పడుతుంది. పశ్చిమ దేశాలలోనే అత్యంత ఉత్తమమైన కమ్యూనిస్టు సమాజాన్ని సృష్టించారు కాతర్లు.

అందువల్ల తొలి రోజులలో బౌద్ధాన్ని హిందూ మతం తీవ్రంగా వ్యతిరేకించింది. చివరికి బౌద్ధ నైతికతను నిర్వీర్యం చేసి దాన్ని తనలో లీనం చేసుకుంది. ఫలితంగా ఇప్పుడే వేదాంతానికీ, మహాయానానికీ తేడా ఏమిటో చెప్పలేరెవరూ. అలాగే చర్చి మాత్రమే కాక ఇతర మతాల నుండి కూడా ప్రభావితమైన కథాలిసిజం (క్యాథలిక్‌లు) కూడా కాథలిజం అంతం కాకపోయినట్లయితే యూరోపియన్ సమాజం నాశనమయ్యేదంటుంది. సంఘర్షణ క్రైస్తవం, కాతర్ల మధ్య కాదు. హోమర్ నుండి నేటిదాకా కొనసాగుతున్న జీవన సూత్రం గురించి. నిరాహార దీక్షలు చేయాలా లేక క్రమంగా మరణానికి సిద్ధపడాలా? డార్వినిజం జీవశాస్త్రానికి సంబంధించిందే కాదు. బహుశా ఆధ్యాత్మికంగా కూడా కావచ్చు. గాంధీజీ ఎలా వ్యాఖ్యానించినప్పటికి భగవద్గీత బోధించింది మంచి - సత్యాన్ని మాత్రమే నిర్దేశించింది. సత్యాన్ని గీటురాయిగా తీసుకున్నప్పుడు ఎవరి పక్షం వహిస్తామన్న సందేహం రాదు. ఎందుకంటే అది రెండు వైపులా ఉంటుంది. భారత యుద్ధంలో కృష్ణుడే హీరో. కానీ అతనికన్నా గొప్ప యోధుడు భీష్ముడు. అయినప్పటికీ భీష్ముడి ధైర్యసాహసాలు కృష్ణుడి కానుక. కృష్ణుడు తనకు వ్యతిరేకంగా తాను, తన ద్వారా, తన లోపల యుద్ధం చేశాడు. చివరికి మిగిలింది తనే - సత్యం!

కాతార్లు 13వ శతాబ్దికి చెందిన దివ్య జ్ఞానులు (థియోసాఫిస్టులు). నేను వాళ్ళ సమకాలికుణ్ణయి ఉంటే సైమన్ డి మాంట్ ఫోర్ట్‌తో జత కలిసేవాడిని. డబ్బు కోసమో, కీర్తి కోసమో కాదు - స్వీయానందం కోసం కూడా కాదు - కాతర్లకు వ్యతిరేకంగా పోరాడేవాణ్ణి - రోమన్ కాతలిసిజంలో ఉన్న సత్యం తరపున ఉద్యమించేవాడిని. ప్రతి యుద్ధంలోనూ ఒక కర్ణుడు, ఒక ఉత్తరుడూ ఉంటారు.

వాళ్ళ పేర్లు ఇన్నోసెంట్ III, హ్యూస్ డి నాయర్స్ (బిషప్ ఆఫ్ ఆక్సెర్)గా మారవచ్చుగాక. పాస్కల్‌కు, జెసూట్ ఫాదర్స్ మధ్య కూడా యుద్ధం జరిగింది.

పావ్ - ఇక్కడ స్వచ్ఛమైన గాలి, మనతో మనకు సాన్నిహిత్యం అనుభవంలోకి తెస్తుంది - ఇక్కడ నాకు క్రిస్టియానిటీలో ఒక లోదృష్టి సారించడానికి అనుకూలమైన వాతావరణం ఆవరించి ఉంది. ఇక్కడి నుంచే హెన్రీ IV, అతను చాలా ఔన్నత్యం గల రాకుమారుడు కదా - ప్రొటెస్టెంట్ శాఖ నుంచి కాథలిక్‌గా మార్పు చెందాడు. ఎందుకంటే - ఫ్రెంచ్ ప్రజలు వడ్డీ వ్యాపారస్తులుగా మారటం ఆయనకు ఇష్టం లేదు - వారిని ఆదర్శవంతులుగా - ధైర్యవంతులుగా చూడాలనుకున్నాడు. హిట్లర్‌కు శత్రువు చర్చిల్ మాత్రమే కాదు - సెయింట్ లూయిస్ - హెన్రీ IVలు కూడా. ఫ్రాన్స్ కూడా రాచరికపు వ్యవస్థలోకి వస్తుంది ఏదో ఒకరోజు. జార్జి - మన రష్యన్ మిత్రుడు. అతివాది కదా - వాడు చెప్పింది నిజమే అనిపిస్తుంది - మీరు నిజంగా ఫ్రాన్స్‌ను అర్థం చేసుకుంటే - మీరు తప్పక రాజరికాన్ని కోరుకుంటారు - బార్బోన్సు ఎన్ని అఘాయిత్యాలు చేసినా విన్సెంట్ ఆలోయిక్ సౌమ్యుడే - పోప్-III చేసిన పాపాలన్నీ కూడా పయిస్ XII ఫాసిస్టులతో చేసుకున్న ఒప్పందంతోసహా - వీటన్నిటినీ అధిగమించి - మతాధిపతులే - ఫ్రాన్స్‌ను కాపాడారు - బ్రిటిష్ హౌస్ ఆఫ్ కామన్స్ కాదు - ఇది ప్రజల నమ్మకం - లేకపోతే సర్వనాశనం అయిపోయేది. ఈ ఘర్షణ ఒక ఆధ్యాత్మిక వాతావరణం సృష్టించింది. దాని పర్యవసానమే అస్తిత్వ వాదుల అస్పష్ట సిద్ధాంతాలు రూపుదిద్దుకున్నాయి.

ఇవన్నీ క్రిస్టో కాథలిక్కుల ఆవిర్భావానికి నాంది. ఈ తిరుగుబాటుకు నాంది పలికింది రూసో కాదు - పీగూ జీని డి ఆర్కె.

ఫ్రాన్స్‌కు ప్రత్యేకంగా ఒక విశ్వ చరిత్ర ఉంది. ఫ్రాన్స్ చేసిన యుద్ధాలన్నీ మానవాళి కోసం చేసినవే - ఈరోజు ఇండియా స్వతంత్రంగా ఉందంటే అది నెపోలియన్ పుణ్యం - జెరిమీ బెంతమ్ కారణం కాదు.

నెపోలియన్ తనంత తాను చక్రవర్తిగా ఎదిగాడు. దానికి సెయింట్ పీటర్ ఆశీర్వాదం కూడా ఉంది.

ఇండియాకు చరిత్ర ఏది? ఎందుకంటే 'సత్యానికి' చరిత్ర ఉండదు. ఫ్రాన్స్ మానవ శ్రేయస్సు కోసం యుద్ధాలు చేస్తే - ఇండియా ఎప్పుడూ ఆ పని చేయలేదు. ఒకవేళ అలాంటి యుద్ధాలు జరిగినా - అవి చరిత్రలో కలిసిపోయాయి. కృష్ణుడు భీష్ముని ఓడించడానికి పోరాటం చేశాడు - దానికి అతనికి శక్తి కూడా కృష్ణుడే ఇచ్చాడు - మహాత్మా గాంధీ ముస్లింల కోసం పోరాడుతూనే వీరికి శత్రువైనాడు -

ఆయన హిందువుల కోసం వీరమరణం పొందాడు - ఆయన సత్యం కోసం మరణించాడు.

పావ్‌లో నాకు లీజో ఎప్పుడూ తోడుగా ఉండేవాడు. అతని స్నేహితులను కలవడానికి బియారిట్జ్ వెళ్ళి వచ్చాడు. నేను పావ్‌లో ఉన్నానని తెలిసి హుటాహుటిన వచ్చాడు. నన్ను చూస్తూనే స్కూల్ పిల్లాడిలా పరిగెట్టుకుంటూ వచ్చి నన్ను చేరాడు. ఆ తర్వాత తన కాందిశీకుల స్నేహితులను పరిచయం చేశాడు. వీళ్లంతా కాథర్లే - నేను ఎట్టి పరిస్థితుల్లో ఫ్రాంకోలాంటి నియంతను సమర్థించను. నాకు సోషలిస్టు భావాలు తలకెక్కాయి. కానీ నా రాజరికపు వ్యవస్థలో కుల వర్గాలు విస్తరించి ఉంటాయి.

లీజోతో బౌద్ధం గురించి చర్చలు జరిపాను - అతని బౌద్ధ జ్ఞానం ఆశ్చర్యం - చైనా గ్రంథాలన్నీ చదివాడు - అంతేకాదు - జపాన్ - ఇండియా గ్రంథాలూ చదివాడు. అవి ఆకళింపు చేసుకున్నాడు కూడా - అతనికి ఇప్పటి ఇండియా వాతావరణం - గాంధీ - ఇవన్నీ అతని అవగాహన ఉంది. నన్ను తన స్నేహితులకు పరిచయం చేసినప్పుడు - 'సార్, గాంధీ దేశం నుంచి వచ్చిన స్కాలర్' అని చెప్పేవాడు.

ఒకరోజు నాతో - 'జర్మనీలో విద్యార్థిగా ఉన్నప్పుడు - శాకాహారిగా మారాలని ప్రయత్నించాను - కొంతకాలం - మళ్ళీ ఆక్స్ వచ్చినప్పుడు ప్రయత్నిస్తాను - మరోసారి!

'నేను ఇండియా వెళ్ళి బౌద్ధ భిక్షువుగా ఉండాలనుకుంటున్నాను' అన్నాడు. మేము మెదలీనా గురించి అసలు మాట్లాడుకోలేదు - అతనే అడిగాడు - మదామ్ ఎప్పుడు వస్తారు అని - రెండు వారాల్లో ఆక్స్ (AIX) వస్తుందని చెప్పాను.

నేను రోజు కాథర్ల ఆరామాలలో తిరిగేవాడిని - లీజోను రమ్మని పిలవలేదు - ప్రతిరోజు అక్కడ పల్లెటూరు బైతులతో మాట్లాడేవాడిని - ఇక్కడ 'అల్బైజిన్సియన్' సంప్రదాయం ఇంకా నడుస్తూనే ఉంది - ఇక్కడ ఏదో మార్మికమైన గుహలు ఉన్నాయి - అందులో కాథర్లు ఎంతో సంపద దాచిపెట్టారని పుకార్లున్నాయి. ఇప్పటి గొర్లె కాపర్లు ఆ పర్వతాల సముదాయంలో ఒక శిఖరం మీద - ఒక నక్షత్రం కనిపిస్తుందని అంటారు - అది నీలం నుంచి ఎరుపులోకి మారుతుంటుంది. బహుశా అది పీటర్ నాస్టర్ ఆత్మ ఏమో - స్వర్గానికి వెళుతూ దారి తప్పిందేమో అనిపిస్తుంది. స్వచ్ఛమైన కాథర్‌ను చూడాలని ఎంతో కోరిక ఉండేది.

అలాగే బౌద్ధుల్ని ప్రేమించగలను - కానీ లీజో చాలా మొరటువాడు - నా ఆలోచనలు సున్నితమైనవి - అతనికి అంతుబట్టవు - నేను కేవలం సిద్ధాంత గ్రంథం రాయాలని అనుకోవటంలేదు - అది హిందూ తత్త్వ శాస్త్రానికి చరిత్రగా ఉండాలని అనుకుంటున్నాను. తెలుసుకోగలిగిన - తెలుసుకోవలసినదానికంటే ఎక్కువ ఆకళింపు చేసుకోవాలని నా ప్రయత్నం.

నా ఆరోగ్యం చాలా త్వరగా కుదుటపడింది - బరువు కూడా పెరిగాను - డాక్టర్ డాగర్ నవ్వి - అనుకున్నదానికంటే త్వరలో కోలుకున్నారు సుమా అన్నాడు.

నా ఎక్సరేలు ఫోటోలు ఇచ్చి ప్రతి మూడు నెలలకు ఒకసారి చూపించుకో - అద్భుతంగా ఉన్నావు - అని అభినందించాడు - 'రామా - ఇప్పుడు భయపడాల్సిన పనిలేదు - ఫాలిక్ యాసిడ్ కనిపెట్టిన తర్వాత వైద్యం తేలికయింది. మీ దేశస్థుడే ఫాలిక్ యాసిడ్‌ను తయారు చేశాడు' అన్నాడు - నాకు మరింత ధైర్యం ఇవ్వటానికి అన్నట్లు.

నా ప్రయాణం - 'లాగోడాక్' వెళ్లాలని - నేను నా సిద్ధాంత గ్రంథాన్ని పూర్తి చేయకముందు - 'బాస్క్' ప్రదేశంలో ఆరామాలన్ని చూడాలని అనుకుంటున్నాను - ఇక్కడ ఆ Beziers చర్చ్‌లో ఎన్నో వేల మందిని ఆడవారిని - పిల్లల్ని మంటలపాలు చేశారు. దాదాపు ఏడు వేల మంది కార్కసోనిలో వారి పేర్లన్నీ పుస్తకాలలో రాసి ఉన్నాయి. ఎంత దారుణం - వారు మంటల్లో కాలిపోతుంటే పేర్లన్నీ ఆ వెలుతురులో కనిపిస్తుంటే ఇప్పుడు తలుచుకుంటేనే గగుర్పాటుగా ఉంది.

పావ్ వదిలే రోజు అంత ఎండగా లేదు - ఆకురాలు కాలం చలికాలంగా మారబోతుంది. 'లాంగోడాక్' చాలా అందంగా ఉంది. సైప్రస్ చెట్లు ముళ్ళ పొదలు garrigues - అందం చాలా మోటుగా ఉంటుంది. అది ప్రశాంత ప్రదేశంగా అనిపించదు - Sere కూడా వెళ్లాను. మెదలీనాకు ఇది చాలా ఇష్టం - అక్కడే Paul Valery తన ఆత్మ కథలో తన స్వంత నగరాన్ని గురించి అద్భుతంగా రాసుకున్నాడు - "నేను ఒక మధ్యతరహా పోర్టులో జన్మించాను - ఇసుక మేట - రాళ్ళగుట్టలు, వీటి మధ్యలో నా జన్మస్థలం - వీటి జ్ఞాపకాలే ఇప్పటికీ నన్ను వెన్నాడుతున్నాయి." మళ్ళీ ఇంటికి రావటం - పూర్తి ఆరోగ్యంతో సంతోషంగా ఉంది.

నేను గేటు దగ్గరకు వస్తుంటే నంది శ్వాస వినిపిస్తోంది! బుసబుసమంటూ! పచ్చగడ్డి పెట్టి మోర సవరించాను-

స్టీ ఆనీవిల్లా చాలా పరిచయం ఉన్న స్వేచ్ఛావిహారం కదా - స్నానానికి వెళుతూ - నేను ఇండియా నుంచి వచ్చినప్పటి పెట్టెలు అలాగే ఉండడం చూశాను-

అవి తీసి - అలమరాలో పెట్టాను - గతం గతః! నేను మెదలీనాతో సంతోషంగా ఉండగలను - నా గదికి వెళ్లి ఉత్తరాలు చూశాను - ఇండియా నుంచి ఐదు ఉత్తరాలు ఉన్నాయి - ఒకటేమో పారిస్ నుంచి.

వేడి నీళ్ళ స్నానం చేసి - వెచ్చని చాకోలెట్ పాలు తాగి, దుప్పట్ల కింద దూరాను. ఎంత ఆనందంగా ఉంది!

ఇండియా నుంచి వచ్చిన ఉత్తరాలు నన్ను ఆందోళన పెట్టాయి - చిన్నమ్మ ఎంతో ఆశతో ఉంది - యూనివర్సిటీ వాళ్ళు నా కోసం ఉద్యోగం - అలాగే ఉంచినట్లు - సెనేట్ ఆ మేరకు తీర్మానం చేసినట్లు తెలియజేశారు - ఈ విషయం చిన్నమ్మకు చాలా ఆనందం కలిగించింది-

ఆమెకు మెదలీనాను ఇంట్లోకి ఆహ్వానించడం ఎంతో సంతోషం - ఆమె కోసం ఐరోపా ఇల్లు తయారుచేద్దాం - వంటవాడు - కమ్మోడ్, అన్నింటితో. సరోజ ఆమెకు మంచి స్నేహితురాలుగా ఉంటుందిలే - నువ్వు యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా వస్తావుగా - సుకుమారి నీ దగ్గరే చదువుతుంది - నేను సుకుమారి దగ్గర ఆంగ్ల పాఠాలు నేర్చుకుంటున్నాను - కోడలితో మాట్లాడాలిగా - అవునూ - నేను ఇచ్చిన కాలి వేళ్ళ మెట్లు - ఇచ్చావా? ఆమె వేళ్ళు ఎలా ఉంటాయో తెలియదు - లేదంటే ఇక్కడే సరిగ్గా ఆమెకు సరిపోయేటట్లు చేపించేదాన్ని - ఇంటి కోడలు మెట్లతోనే ఇంట్లోకి రావాలి రామా - నా ఆశీర్వాదాలన్నీ మీకే - మీ చిన్నమ్మ - విశాలాక్షి అని సంతకం!

సరోజ ఉత్తరం చాలా విచారకరం - నేను ఏమైనా సరే - యూరోప్ రావాలి - అక్కడే చదువుతాను - మరో సంవత్సరం ఈ ఇంటిలో ఉండలేను - నాన్నగారు పోయిన దగ్గర్నుంచి ఇది కన్నీటిమయం అయిపోయింది - మరేమీ లేదు. ఇప్పుడు కిట్టన్న తాత కూడా వెళ్ళిపోయాడు - ఇంటికి పెద్ద దిక్కు లేకుండా పోయింది. నువ్వు ఎంతో దూరాన ఉన్నావు - నువ్వు అనుకుంటే నన్ను తీసుకు వెళ్ళగలవు - 'మౌంట్ సెల్లర్'లో మంచి మెడికల్ స్కూల్ ఉందని విన్నాను. వదినకు సహాయంగా ఉంటాను. అయినా నువ్వు చేయలేనిది ఏముంది - ప్రపంచంలో - అని రాసింది. సరోజకు, సుకుమారికి ఇద్దరికీ ఎంత నమ్మకం - నా ప్రయోజకత్వం మీద నేను సాధించలేనిదేదీ లేదని వారి విశ్వాసం-

నాలో ఏదో తెలియని భావన - సరోజ 'విల్లా ఆనీ'లో నాతో ఉంటుందని - మాకు మరింత స్థిరత్వం కలిగిస్తుందని - మనందరికీ బాహిరకమైన ఒక ఆకర్షణ కావాలి - గురువు - తండ్రి ఇలా ఎవరైనా - కాని - ఇండియాలో ఉమ్మడి కుటుంబంలో ఒక్కరే? స్థిరంగా ఉంటారు - మిగతా ఇంటి సభ్యులంతా వీరి కదలికలతో ఆ స్థిర పరిమితిని మరింత బలపరుస్తారు. ముఖ్యంగా యుక్త వయస్కురాలైన మారుటి చెల్లెలు - ఆమె స్త్రీత్వం మరో స్త్రీ కోరికలు లేకుండా - ఆమెలోనే కుటుంబ గౌరవం - దివ్యత్వం ముడిపడి ఉన్నాయి. ఆ విషయం ఆమెకు ఎరుకలో ఉండి - మనకు తెలియజేస్తుంది కూడా. అది ఎంతో అద్భుతమైనది - పైగా సరోజ శరీరం వెదజల్లే పరిమళం నా సమయాన్ని అమరం చేస్తుంది - ఆ పరిమళం స్త్రీ మూర్తిమంతం కావడంలో ప్రధాన సూత్రం కదా! కానీ ఆమె రాదు - రాలేదు - ఎందుకంటే అంత ఖర్చు మా కుటుంబం భరించలేదు - ఎందుకో ఇది నాకు సంతోషమే - కానీ ఆమె తెల్లని చీర కట్టుకొని, ఎర్రటి కుంకుమ దిద్ది, భ్రుకుటి ముడివేసి - తీక్షణమైన



ఆక్స్ (AIX)

చూపుల్తో వస్తున్నట్లు నాకనిపిస్తోంది. ఆమె చేయి - వెచ్చని అరచేయి నా తలపై ఆనించి - ఇదిగో నా బలహీనమైన ఊపిరితిత్తిని ఆరోగ్యంగా మార్చి అందులోని రోగాన్ని బైటకు తీసేస్తుందని కలగంటున్నాను.

తర్వాత ప్రతాప్ రాసింది - ఆ ఉత్తరంలో అతనికి నా శక్తిసామర్థ్యాల మీద ఎనలేని నమ్మకం తెలియజేస్తాడు. సావిత్రి మనసు ఎలాగైనా నేను మార్చగలనని అతని నమ్మకం - నా భారతీయ సంప్రదాయ విలువలు ఆమె బాగా గౌరవిస్తుందని, కాని ఆమె లండన్‌లో ఎవరో ముస్లిం కుర్రాణ్ణి ఇష్టపడుతున్నట్లు తెలిసింది - ఇప్పుడు ఆమెకు 19 ఏళ్లు - ఇంకా ఎంతో తెలుసుకోవాలి - ఎలాగైనా మీరే నన్ను ఈ రొంపి నుంచి రక్షించి బయట పడేయాలి - మీ ప్రతాప్ - మరొక ఉత్తరం చిన్నది - సావిత్రి రాసింది - హడావిడిగా - ఆమె విమానం ఎక్కకూడదని డాక్టర్లు చెప్పారని - ఎస్.ఎస్. మలోజ నౌక ఎక్కింది - అది మార్సిలీ అక్టోబర్ 3వ తేదీన వస్తుంది - ఎట్లాగైనా వచ్చి నన్ను కలవమంది - మాతో ఉంటానని అనలేదు.

'మిమ్మల్ని మీ ఇంటిలో చూడటం నాకెంతో ఆనందం - అక్కడి నాగరికత వెర్రితలలు చూడాలని ఉంది - ఉత్తర భారతంలో ఇప్పుడే నాగరకత లక్షణాలు కొత్తగా వస్తున్నాయి - మిమ్మల్ని చూడాలని ఉంది - ఫ్రాన్సును చూడాలని ఉంది - ఇండియా గురించి తెలుసుకోవాలని ఉంది - అని ముగించింది -

ఇప్పటికీ ఆ ఉత్తరం నా దగ్గర ఉంది - అది వార్త మోసుకొచ్చింది కదా!

ఎందుకో - సరోజ వస్తే బాగుండు అనుకున్నాను!

చివరి ఉత్తరం అంకుల్ చార్లీ రాసింది - "మెదలీనా మాతో చాలా ఆనందంగా ఉంది - అందరం పారిస్ వెళ్ళాం - కాతరీన్‌కి మంచి తోడు - మెదలీనా వాళ్ళిద్దరూ చాలా సన్నిహితంగా ఉన్నారు - జోబీ - నేను ఎన్నోసార్లు అనుకున్నాం - మెదలీనా అదృష్టవంతురాలు - రామస్వామిలాంటి భర్త లభించినందుకు - నీ కోసం నేను ఎన్నోసార్లు ప్రార్థించాను - నువ్వు ఎంతో ఉన్నత స్థానానికి వెళ్తావు - నీ దేశానికి, నీ కుటుంబానికి ఎంతో కీర్తిప్రతిష్టలు చేకూరుస్తావు. నీలాంటి విద్యాధికుడు సాధించగలడు - కాథరీనా కోసం ఇద్దరు కుర్రాళ్ళను చూశాను - ఆమెకు నాన్న లేడు - మెదలీనాలాగానే ఆలోచిస్తుంది - మా కుటుంబంలోకి మరో రామస్వామి రావాలేమో?" - అంకుల్ చార్లీ. జబ్బుతో ఉన్న వ్యక్తికి ఇలాంటి ఉత్తరాలు ఎంతో శక్తినిస్తాయి. రేపు ఉదయం రైల్లో మెదలీనా వస్తోంది - నాలుగు గంటలకే తెల్లవారురఝామున లేవాలి - స్టేషన్‌కు వెళ్లాలి - ఆమె ప్రకాశవంతమైన ముఖారవిందాన్ని ముందుగా చూడాలి - రైలు 'చార్లీ గారే' స్టేషన్‌లోకి వస్తుండగానే!

కారు లోయ లోపలికి పరిగెత్తించాను - దారిలో తులిప్ పూలు కొన్నాను - హెన్రీ కొన్నాడు అట్లాంటివి - నేను కొత్త పెళ్లికూతురుని ఇంటికి తీసుకు వస్తున్నాను కదా!

నా జీవితమంతా మెదలీనా ఆక్రమించినట్టు తోస్తోంది - ఈ భూమి మీద ఆమె లేని ప్రదేశం ఏమైనా ఉన్నదా? ఆమె మొగలి పొద వాసన లేని గాలి ఎక్కడైనా వీచిందా? అలాంటి ఏకాంత సమయాలన్నీ నావే కదా - జ్యోతిష్కుడు చెప్పారు - మాకు సంతానం ఎక్కువని! బలహీనమైన నా ఊపిరితిత్తి కొద్దిగా నొప్పి అనిపించింది - కానీ మెదలీనా ఆలోచనలో ఆ విషయం అడుగున పడిపోయింది. ఈ రాత్రి త్వరగా ముగిసిపోతుంది. ఉదయకిరణాలకు దారి వదులుతూ - కోడిపుంజు సరిగానే కూసింది - నేను లేచి కారు తీశాను - తొలితొలి గాలులు ఎంతో ఆహ్లాదకరంగా ఉన్నాయి. నేలంతా గులాబీల వాసన వస్తోంది సుమా!

ఆ మర్నాడు ఉదయం మెదలీనాకి కాఫీ తెచ్చిచ్చాను వెచ్చగా - కాలేజీ మొదలవుతోంది - సంవత్సరం అంతా ఎంతో నింపాల్సి ఉంది - జీవితాన్ని కూడా!!

ఆ మధ్యాహ్నం జార్జి వచ్చాడు - గత పదిహేను రోజులుగా ఫాదర్ జనోబితో గడిపాడు - ఇప్పుడు జార్జి స్వారీకి సిద్ధమౌతున్న గుర్రంలా ఉత్సాహంగా ఉన్నాడు.

చర్చిలో ఈవిల్ గురించి చర్చిస్తూ ఆరామంలో ఉండిపోయాడు.

'రామా, నువ్వు కూడా ఉండాల్సింది - నేను - ఫాదర్ గంటలు గంటలు మాట్లాడుకున్నాము - సాయంత్రాలన్ని నిశ్శబ్దంగా - ప్రకాశవంతంగా గడిచిపోయాయి.

మనిషి ఆనందంగా ఉన్నప్పుడు అతని సౌందర్యాన్ని చూడలేం - కానీ అతని బాధలో ముఖం మీద ముడతలు చూసినప్పుడు - అసలైన అంతఃసౌందర్యాన్ని గమనించవచ్చు - చూడు - సిలువ మీద ఉన్న క్రీస్తు ముఖంలో వేదనలోని వెలుగు - ఆయన గలిలీకి బోధించినప్పుడు కనపడదు! ఈవిల్ చాలా మనోహరంగా ఉంటుంది. అది లేకపోతే - 'మంచి' ఎక్కడ ఉంటుంది? ప్రపంచం ఎక్కడ ఉంటుంది - క్రీస్తు ఎక్కడ ఉంటాడు? ఇప్పుడు నాకు లూసిఫర్ బలహీనత అర్థమవుతోంది - నీకు ఈవిల్ మత్తెక్కిస్తుంది - 'మంచి రసం' ఎంత తాగినా మత్తు రాదు!

"సహజంగానే - చెడులో మంచి వెతుకుతావు - కానీ మంచిలో నువ్వు మంచిగా ఉంటావు - మత్తు రావాలంటే తాగుబోతు కావాలి - అంటే తను తాగుతున్నట్లు -

అతనికి తెలుసు! బైబిల్‌లో ఉంది కదూ! కుడిచేతికి - ఎడమ చేయి చేసే పని తెలియకూడదని - అలాగే మంచికి తను మంచి అని తెలియదు - వెలుగులాగా!" అన్నాను.

"అలా అయితే - అది వెలుగు అని తెలిసేదెలా" అతని సందేహం.

"అదెలాగంటే - నువ్వు పారిస్ వెళుతున్నావు అనుకో - ఇంకా నాలుగు వందల కిలోమీటర్లు - ఇంకా రెండువందలు - ఇప్పుడు 'ఆక్సిర్' వచ్చాను - ఇంకా 58 కిలోమీటర్లు - ఫ్రాంటెన్ బ్లూ వచ్చాను. పోర్ట్ వానెవె చేరగానే - ఇంకా ఏడు కిలోమీటర్లే అనుకుంటావు - ఒక్కసారి నగరంలో ప్రవేశించగానే - 'సార్ - ఇది పారిసేనా - ఇంకా ఎంత దూరం వెళ్ళాలి' అని అడిగితే - 'ఇంకా 37 కిలోమీటర్లు - ఈ కూడలి నుంచి - కుడి ప్రక్కగా తిరుగు - అదిగో సూర్యకాంతిలో - మార్గం - తిన్నగా వెళ్ళు - విమానాశ్రయం దాటి - అక్కడ వంతెన దాటు - గులకరాళ్ళు పరిచిన వీధి - రెండు ప్రక్కలా చెట్లు ఉంటాయి - తర్వాత లోయ కనపడుతుంది. అక్కడ శ్మశానం - సమాధులు - రైల్వేస్టేషన్ - నగరం - అని చెబుతాడు -

"అరె! ఇది పారిస్ కాదా?" అని ఆశ్చర్యంగా అడుగుతావు.

'పారిస్‌లో - పారిస్ ఎక్కడ అని అడుగుతావా? ఎవరైనా నా దారి చెప్తారా? ప్యారిస్‌లో ప్రవేశిస్తే - నీకు పారిస్ తప్ప అంతా తెలుస్తుంది.

"దూరాలన్ని నోట్రాడామ్ నుంచి మొదలవుతాయి - పారిస్ - అక్కడి నుంచే - అక్కడే ఉంది!"

ప్యారిస్ అంటే 'ఎటోలి' - లూవ్రె (Louvre) 'యూలిసెస్ రెనాల్ట్' - ఇవన్నీ కలిపితే పారిస్! పారిస్ విడిగా ఉండదు - మొత్తంగా ఉండాలంటే - భాగాలుగా ఉండాలి- ఇప్పుడు తార్కికంగా ఆలోచిద్దాం - భాగం - మొత్తంలో భాగం - కానీ మనకు భాగాలే మొత్తంగా దర్శనమిస్తాయి. ఆ మొత్తంలో భాగాలున్నాయన్నమాట.

ఆ మొత్తాన్ని - మొత్తంలో తీసివేస్తే - చివరికి మిగిలేది మొత్తం! అదే కదా! ఉపనిషత్తులు చెప్పేది - ఇదేకాదూ!

పునర్జన్మకు కారణం మరణం కాదు - పునర్జన్మ అంటే జీవమే - ఎందుకంటే ఎవరూ మరణించరు - మరణం అనేది వ్యతిరేక భావన - అన్నాను.

"నువ్వు మళ్ళీ వేదాంతం చెపుతున్నావు - మాయ అంటే మాయ - మాయలో బ్రాహ్మణుడున్నచోట మాయ ఉండదు కదా!" అంటాడు జార్జి. అప్పుడు మెదలీనా - 'మాయ' గౌతముని తల్లి పేరు కదూ - అంటే బుద్ధుడు మాయలో నుంచి సత్యం జన్మించిందని కదూ! అంటే సత్యం ఉద్భవించింది - మాయ మరణించింది - అంటే భ్రమ అంతరించింది - అలాగే బుద్ధుని తల్లి మరణించింది' అంది.

“ఓల్డెన్ బెర్గ్ లాంటివాళ్లు అలా చెప్తారు - కానీ అది అలా కాదు - అలా అర్థం చేసుకోరాదు - సత్యం ఎప్పుడూ ఉంటుంది - ఎప్పుడూ ఉండేది - ప్రత్యేకంగా జన్మించదు - పునర్దర్శనం కాదు - అందుకోసం తల్లిగాని - తండ్రిగాని అవసరం లేదు -

మాయ సత్యదర్శనంతో - అంటే తనే సత్యంగా గుర్తించిన తర్వాత భ్రమ అనేది భ్రమ అని అర్థం చేసుకుంటాడు - భ్రమ ఎప్పుడూ ఉండదు - మాయ అంటే సత్యమనే అర్థం - ఎవరైనా శూన్యాన్ని చూశారా? నిర్వాణాన్ని దర్శించారా?

“శూన్యం ఎక్కడో లేదు - నాలోనే ఉంది. నేను కాదు - చెడు అనేది - నీతి - నైతికత - అది కనిపించేది - భౌతికం - అంటే భూమి ఆకర్షణలాంటిది - కానీ భూమి నుంచి కొంత దూరం ఊర్ధ్వంగా వెళితే - అక్కడ ఈ ఆకర్షణ శక్తి ఉండదు - అలాగే నీ మెదడులోని - ఏదైనా నరాన్ని తాకితే - ఈ భౌతిక దర్శనం మారిపోతుంది - పొట్టివి పొడవుగా - పొడవుగా ఉన్నవి పొట్టిగా కనిపిస్తాయి - నేత్ర వైద్యుడు అలాగే చేస్తాడు కదా!

“సాపేక్షం - సంపూర్ణం కాదు - నైతిక భావన - అది భౌతికమైన ఆలోచన -”

“అంటే - దేవుడు?” జార్జి అంటున్నాడు- దేవుడంటే దేవుడే కదా - దేవుడంటే మంచికి మారు పేరు కదా!’

‘దేవుడు - మంచితనం - మనలోని మంచితనం ‘మంచి అనేది సత్యం - గ్రీకులు అలాగే అంటారు కదా!’

‘అలా అయితే రాత్రి?’

రాత్రి - అంటే లేనిది అని-

‘మరి పగలు’ - ‘పగలంటే అది పగలే’

తర్వాత చాలా నిశ్శబ్దం - అనిశ్చిత నిశ్శబ్దం - పర్వతాలను ఆవరించిన నిశ్శబ్దం!

ఎటు వెళ్ళినా మంచు ఉంటుంది - లోతైన మంచు - అందులో ‘మంచుపాతం’ కనిపించదు.

ఇప్పుడు ఇక్కడ దొరికేది - మన ‘సహజ’ జ్ఞానం ముఖ్యం - ఎటు పోవాలి అని తెలుసుకోవటానికి-

సత్యమంటే - అంతరంతరం - దైవ భావన - సత్య భావన -

జార్జీ! అతను హిమపాతం చూస్తున్నాడు -

చార్లీ గారే స్టేషన్

ఇప్పుడు ఆశ్చర్యపోతున్నాడు - ఇప్పుడు అతనికి క్రింద సెలయేటి గలగలలు - పక్షుల కిలకిలలూ వినపడుతున్నాయి-

నీకు తెలుసా - రిల్కే (Rilke) అంటాడు - Une Charoyne - అతనికి కంఠతా వచ్చు - నువ్వు చెడుని గుర్తించినప్పుడు - నీలో 'సెయింట్ హుడ్' మొదలైనట్టు.

బాడీ లేర్ (Baude Laire) అన్న మాటలు గుర్తున్నదా?

"నా అందాన్ని - నా శుష్కించిన ప్రేమ రూపాన్ని - నేను దేవునికి సమర్పించిన భౌతిక చుంబనాలు - ఎవరు రుచి చూస్తారు?" ఎంత భయంకరం!

అందుకే రైనర్ రిల్కే - తను జబ్బుపడినప్పుడు ఏ వైద్యుణ్ణి తన శరీరాన్ని తాకనివ్వలేదు - శరీరం పవిత్రత - అతనికి ఆలోచనల పవిత్ర భావంలోనే ఉంటుంది -

అందుకని మనిషి - శారీరక - మానసిక పవిత్రత గురించి కాదు - తపించవలసింది - తనే పవిత్రంగా మారిపోవాలి - తీపిని రుచి చూడాలని అనుకోకూడదు - 13వ శతాబ్దంలో మాధవాచార్య చెప్పినట్టు తీపి - తీపిలో లేదు - నువ్వు తీపిగా మారిపో - అది వేదాంతి దర్శనం-"

"అదెలా తెలుస్తుంది" జార్జి.

అయితే విను - ఈ చర్చ అనేక హిమపాతాల - ప్రమాదకరమైన దారుల్లో వెళ్తోంది - కానీ నాకు దారి బాగా తెలుసు - మెదలీనా - జార్జి ఆదుర్దాగా వింటున్నారు.

'నీ - నీ జిహ్వలో ఉంది - తీపి తెలుసుకోవటం' ఎందుకంటే - చక్కెర ఒక్కసారి నీ నాలుకను తాకితే అది తీయగా ఉందంటావు - అదీ మరణించిన వాని నాలుకపై పెట్టు - లేదా నిద్రిస్తున్న పాప నోట్లో పెట్టు - వాళ్ళే లేచి ఇది తియ్యగా ఉందని చెప్పరు-

"అవును, చెప్పలేరు" జార్జి.

అంటే - నాలుక కదలాలి - లాలాజలం ఊరాలి - అందులో ఉన్న ఘన ద్రవ పదార్థాలు నీ గొంతు చేరాలి - అప్పుడే అది తీపి అని తెలుస్తుంది.

నువ్వు కాఫీ తాగినప్పుడు అది మంచి కాఫీనా లేక బాగోలేదా అని అంటావు కదా! అది నీలో నీలోకి ప్రవేశించి నిన్ను అంతర్గతంగా ఆనంద పరచినప్పుడు 'ఆహా' మదామ్ కాఫీ ఎంత రుచిగా ఉంది' అంటావు కదా!

'అవునవును - అంటాను' జార్జి.

'నా కాఫీ బాగుండదా' అన్నాను.

అందుకని తీపి - నీ నాలుక జిహ్వ.

సత్యం గుర్తించినదే - లేకపోతే అది లేదన్నమాట'

'కానీ అది ఒక యదార్ధమే కదా' జార్జి.

''ఒక ఋషి చెప్పాడు - నీ అనుభవంలో పదార్థం లేదు - అది అనుభవమే ఉంటుంది' అని.

లూవ్రె ప్యాలెస్

'అదెలా?' జార్జి.

"నీ అనుభవం పూర్తయిన తర్వాత జ్ఞానం ఉదయిస్తుంది. జ్ఞానంలో ఏ పదార్థం ఉండదు - అలాంటప్పుడు ఈ జ్ఞానం ఎవరిది? 'నేను' అనవచ్చు - అంటే నాకు జ్ఞానం ఉందని నాకు తెలుస్తుంటుంది."

"అది జ్ఞానం ద్వారానే తెలుస్తుంది" అని మెదలీనా పూర్తి చేసింది.

అంటే - జ్ఞానం ద్వారా జ్ఞానం కలుగుతుందన్నమాట. అదే 'నేను!'

'అవును - అలాగే ఉంది' జార్జి. అంటే చక్కెర తీయగా ఉండదు - అదే తీపి! జార్జి - మనిషి కాదు - మనిషే జార్జి!'

మెదలీనా ఆశ్చర్యపోయి కూర్చుండిపోయింది - ఆమెకు ఆశ్చర్యం - ఇంత జ్ఞానం నాకు ఎలా కలిగిందని - నేనే ఒక పర్వతాన్నని - పర్వతం నాలోనే ఉందని - నేను పర్వతం మీద లేనని - ఆమెకు ఇప్పటివరకు తెలియదు!

'జార్జికి అందరు మనుష్యులు జార్జిలే' అన్నాను.

'ఆ విషయం జార్జికి మాత్రమే తెలుస్తుంది.

'అవును, ఒప్పుకుంటున్నాను' జార్జి.

జార్జి మనుషుల్ని చూస్తాడు - చాలామందిని - అదిగో మనిషి - ఒక అస్పష్ట రూపం - 'అలాగే'

'కానీ జార్జి మనిషిని చూశాడా? చూశాడు - మనుషుల్ని'

'అంటే మనిషి అంటే' అని అడిగాడు.

'మనిషి అంటే అందరి మనుషుల సారం - అందులోని సత్యం - అదే జార్జి!' అన్నాను. అతనే మనిషి.

మనిషి వేరు - జార్జి వేరా? మనిషిలోని మానవత్వం జార్జిలో మానవత్వం రెండూ ఒకటే కదా!

'అవును, ఒకటే కదా' జార్జి.

అంటే జార్జి ఎవరు? మనిషి! జార్జి - జార్జి కాదు. జార్జి మనిషి! సాధారణ మనిషి! సూత్రప్రాయంగా అతనే సత్యం - అంటే జార్జి అతనే సత్యం!'

ఈ సంభాషణంతా నాకు నాకు గంగా స్నానంలా ఉంది - నా పాపాలన్నీ ప్రక్షాళన అయిపోయినట్లుంది.

జార్జ్ ఎక్కడో చూస్తున్నాడు - అతనికి కన్నీరాగటం లేదు - లోపల లోపల ఏదో ప్రార్థన చేస్తున్నాడు - రెండు చేతులు నుదుటి మీద కప్పుకున్నాడు - తన కళ్ళల్లోకి తనే చూస్తున్నాడు -

సాయంత్రం మమ్మల్ని చుట్టుముడుతోంది - పక్షులు చెట్లమీద చేరుతున్నాయి - రెక్కలు శబ్దంతో- మెదలీనా నా చేతులు తీసుకుని తన చంపకు వత్తుకుంది - ఇప్పుడు ఆమెను నేను పూర్తిగా జయించాను - నేను ఏ దేవుని ముందు మోకరిల్ల లేదు - దేవుడంటే దేవతే - ఆ దేవత ప్రేమించే మనిషే!

ఇప్పుడు మేము మెదలీనాతో 'ఆచ్' చర్చికి వెళ్ళి నిర్భయంగా మెదలీనా ప్రక్కన ప్రార్థనకు మోకరిల్లి 'భయాన్ని' గుర్తిస్తే అదే సత్యం కదా!

ప్రపంచం గోళాకారంలో పెద్దదిగా అనిపిస్తుంది. ఎక్కడైనా నివసించవచ్చు.

ఈ సాయంత్రం ఎంతో అందంగా ఉంది - కొండ దారిలో నడుస్తూ వెళ్ళాం - సెప్టెంబర్ - వసంతం వచ్చి పోయింది. ఇంకా చలి మొదలైనట్లు లేదు.

ఆకులు నవనవలాడుతూ సాయంత్రం వెలుగులో మెరుస్తున్నాయి. అదిగో దూరాన ఒక సత్యంలాగా మధ్యధరా సముద్రం విశాలంగా పరుచుకుని ఉంది.

సముద్రపు గాలి నా నాసికా పుటాలకు ఉప్పదనాన్ని చేరుస్తోంది.

ఏనుగు రాతి మీద నుంచి బిగ్గరగా పాడుతున్నాను - శివోహం - శివోహం - పూర్తి శ్వాసతో - 'వినకుండా - వాసన చూడకుండా - రుచి తెలియకుండా - నా జ్ఞానంతో - నీ దీవెనలతో శివా - నీవే నేను - నీవే నేను - ఇదంతా లోయలో ప్రతిధ్వనించింది. అనాకార ఆకారాన్ని ఊహలకందని దూరాన్ని - జ్ఞానంతో - దీవెనతో నీవే నేను' - శివా - నీవే నేను - !!

చెడు ఎక్కడ దాగి ఉంటుంది - సూర్యుడు ఎక్కడ ఉండడు - ఎప్పుడూ ఉంటాడు. అది మనలో ఉండటమే - ఇక్కడ చీకటిగా ఉంది - సూర్యుడు లేడని - ఈ రాత్రి చీకటి అని - కానీ వెలుగు ఎప్పుడు ఉంటుంది - చెడు ఒక మూఢ నమ్మకం - అది ఒక నీడ మాత్రమే. ఆ సాయంత్రం నాకు జార్జి ఒక 'సెయింట్'లాగా కనిపించాడు. అంత సుకుమారంగా - చిన్నపిల్లవాడిలా కనిపించాడు.

ఇప్పుడు నేను ఒక హీరోని! ఇప్పుడు మెదలీనాని జయించాను! ఇప్పుడు నేను ఎంతో స్వేచ్ఛగా ఉన్నాను. ఎన్నో రోజుల తరబడి సంస్కృత శ్లోకాలు వల్లిస్తూ - లోయలో, ఇంట్లో తిరిగాను - నా సిద్ధాంత శోధనలో ఎంతో శ్రమించాను - నా సిద్ధాంతం - నా తత్వశాస్త్రం ఎన్నో విషయాలను అల్బిజెన్సియన్ నాస్తికత్వాన్ని ఇప్పటివరకు యూరోపియన్లకు అంతుచిక్కని రహస్యాలను వెలుగులోకి తెచ్చింది.

అది జయించింది పోప్‌ను కాదు - ఛాందసత్వాన్ని!

ఇప్పుడు మెదలీనా హోలీగ్రెయిల్ వదిలేసింది. రోజురోజుకూ బౌద్ధంవైపు తన అధ్యయనాన్ని కేంద్రీకరిస్తోంది - బౌద్ధంలోని మేథోపరమైన చైతన్యం - ఎంతో గాఢమైన కరుణ ఆమెను మానసికానందంలో ముంచి ఆశ్చర్యపరిచింది! రాత్రులు నా పక్కలో చేరి ఒక దాని తర్వాత మరొకటి జాతక కథలు చెప్పి ఆనందించేది.

యూరోప్‌ను బౌద్ధం ఎందుకు జయించలేకపోయింది - క్రైస్తవంలాగా అని ఆశ్చర్యపోయేది. అప్పుడే నేను చెప్పాను - అశోకుడు తన కుమారులలో ఒకనిని అలెగ్జాండ్రియా పంపినట్లు - బౌద్ధ సిద్ధాంత ప్రచారం కోసం - దాని ప్రభావమే తర్వాత 'ప్లోటినస్' బోధనలపై ఉందని! గ్రీకులు - భారతీయులలాగానే ఎంతో ఆలోచనాపరులు - జ్ఞాన తృష్ణ కలవారు - అందుకని వారిని ఆహ్వానించారు - మా దేశం నుంచి ఒక ఋషి సోక్రటీస్‌ని దర్శించిన దాఖలాలు ఉన్నాయి. అప్పటికింకా బుద్ధుడు జీవించే ఉన్నాడు. ఆ తర్వాత అరిస్టాటిల్ బౌద్ధంతో ప్రభావితుడైనాడు కూడా - ఇంకా చాలా చాలా ఉంది మెదలీనా'' అన్నాను.

జార్జి - మెదలీనా ఎంతో నడిచే తిరిగేవారు - ఇప్పుడు మెదలీనాయే జార్జికి అధ్యాపకురాలు - ఆమె సన్నిధిలో జార్జి చాలా రక్షణలో ఉన్నట్లు స్థిరంగా ఉండేవాడు - ఇప్పుడు కొత్త జార్జిని చూస్తున్నాం - చాలా సాధువుగా - జ్ఞానవంతుడుగా (జ్ఞానిగా) ఒక్కోసారి అనిపిస్తుంది - ఇతను రాత్రంతా ప్రార్థనలో గడిపి ప్రొద్దున్నే ఇంత ప్రశాంతంగా ఉన్నాడా అని- అతనికి - తన తండ్రి నుంచి ఇంకా ఉత్తరాలు వస్తున్నాయి - అందులో నుంచి మాకు చదివి వినిపించేవాడు - 'చెడు' దైవానికి రుజువు కాదు - కానీ 'చెడు'ను దైవత్వానికి ఒక సూచనగా చూడవచ్చా! ఈ వ్యతిరేక భావన అలా మిగిలిపోయింది.

పిరనీ - మధ్యధరా

స్త్రీ సేవలోని 'సేద' బాధలు ఉన్న పురుషుని ఒక వరం - ఓ కరస్పర్శ - ఓ కంటి చూపు, కరుణ చూపడం - కోటు అందివ్వటం - పడిపోతుంటే చేయి అందివ్వడం - ఇవన్నీ కష్టంలో ఉన్న మగవానికి ఎంత ఊరట! మెలీనా - జార్జికి అంతగా ఆసరాగా ఉండేది! ఆమె ఆత్మస్థైర్యం - అంతఃసౌందర్యం - జార్జిని పవిత్రం చేసింది.

సావిత్రి అక్టోబర్ 13న వస్తుంది. నేను నౌకా రేవుకి వెళ్ళి ఆమెను కలవాలి! సావిత్రి తంతి కూడా పంపింది - ఈ విషయం 'లీనా'కు చెప్పాను కూడా - ఆమె కొంచెం ఆందోళనకు లోనయింది - ఈ భారత స్త్రీని ఎలా గౌరవించాలి - దానికి తాను సిద్ధంగా ఉన్నానా! అని. మా సంస్కృతికి నిండా వెయ్యేండ్లు లేవు. నీవు నన్ను భరించినట్లు సావిత్రి నన్ను మన్నించదేమో అని అనుమానం వ్యక్తం చేసింది. 'మేము చాలా సహన పరులం - నీ ప్రవర్తనలోని మోటుతనం సావిత్రిని ఆశ్చర్యపరచవచ్చు - కంగారు పడకు' అని భరోసా ఇచ్చాను. ఇప్పటికే సావిత్రి రెండేళ్లుగా ఇంగ్లాండ్‌లో ఉంది! అని కూడా చెప్పాను. నీవు ఎప్పుడూ సరిగానే చెప్తావు - నాకే లేనిపోని అనుమానాలు - అంటూ వంటింట్లోకి వెళ్ళింది - కాలీఫ్లవర్ను సాస్‌తో ఉడికించడానికి - బంగాళాదుంపలు - బీట్‌రూట్ - టొమేటోలు - ఆకు - పుదీనా - ఇవేగా శాకాహారం - ఇవన్నీ తప్పనిసరిగా - సరైన పాళ్లలో - సరైన వేడిలో - వండాలి - మెదలీనా చాలా నేర్చుకుంది కూడా - అదే మాంసాహారమైతే సిద్ధంగానే ఉంటుంది.

అక్టోబర్ పగళ్ళు - వెచ్చని ఎండ ఏటవాలుగా పడుతుంటుంది. సన్నటి గాలి వీచడం మొదలైంది. విక్టోరీ చర్చి మెలకువలోని కలలో కనపడుతోంది - నిర్మలాకాశం వెనుకగా ప్రశాంతంగా ఉంటే - చర్చి ఒక బిందువులా అనిపిస్తోంది - పొద్దున్నే నిద్ర లేస్తూ ఆపిల్ చెట్ల ఊగిసలాట చూడవచ్చు - ఆ వెనక మధ్యధరా సముద్రం ఎంతో నమ్మకంగా - ఇదిగో - నేను ఇక్కడే ఉన్నా - అదిగో - విక్టోరి చర్చి - అని చెబుతున్నట్లు - నువ్వు చూసేవి నిజమైతే - ఈ ప్రపంచం సత్య ప్రమాణమే!!

మరికొన్ని విషయాలు కూడా ఉన్నాయి - ఇంకా మెదలీనా డాక్టర్‌ను సంప్రదించలేదు - మరో వారం ఆగి వెళ్తానంది - నిజానికి డాక్టర్‌తో పని ఏముంది

- ఆమె మోము చూస్తేనే తెలుస్తోంది - ఆమె పొత్తి కడుపును చూస్తుంది - క్రింది చూపుల్తో - ఉడికించేవాడిని - పుచ్చకాయ ఏది మంచిదో - ఏది చెడ్డదో నేను చెప్పగలను - నీ పొత్తికడుపు వాసన చూసి - లోపల బాబా - పాపా - చెప్పగలను తెలుసా అని నవ్వుతూ - నీకు మరో రహస్యం చెప్పాలి - కాథరిన్‌ని ఇక్కడికి రమ్మని ఆహ్వానించాను - పాపం ఆ అమ్మాయికి ఇంతవరకు సెలవు లేదు - పైగా చార్లీ మామ సంబంధాలు చూస్తున్నాడు - కాథరీన్‌కు ఇష్టం లేదు - ఈ డబ్బు - దస్కం ఉన్నవాళ్ళంటే అస్సలు ఇష్ట పడదు - చాలా మంచి అమ్మాయి - ఆమెకు నీలాంటి మేధావి కావాలి - అంది!

ఆ చలి గాలికి రెండు రోజులు ముక్కు కారింది నాకు - తర్వాత మళ్ళీ కోలుకున్నాను - ఆకాశం చాలా యౌవనంలో ఉన్నట్లు మెరిసిపోతోంది నీలంగా - పిచ్చుకలు టెలిగ్రాఫ్ వైర్ల మీద బారులు తీరాయి - లోయలో ఓ గాడిద, తన చిన్న తోకతో ఈగలు తోలుకుంటోంది - ఒకసారి తలెత్తి నన్ను గుర్తుపట్టినట్లు చూసి మళ్ళీ గడ్డి మేస్తోంది - ఇలాంటి నిశ్శబ్ద సంకేతాలే నిజాన్ని నిర్ధారిస్తాయి!

మర్నాడు మెదలీనాకి వీడ్కోలు చెప్పి - సావిత్రిని కలవటానికి బయలుదేరాను - 'జాకీస్' రేవుకు వెళుతుంటే నైనిటాల్ వెళుతున్నట్లు ఉంది - గాలి చలిగా తాకుతోంది - ఆపైన ఆల్ఫ్ మీద మంచు కనబడుతోంది - హిమాలయాలు!

గంగానది ఇక్కడ కూడా ప్రవహిస్తుంది! అంతటా పరుగులు పెడుతోంది!

హిమాలయాలను కలవడానికి వెళ్తున్నాను.

లక్ష్మమ్మ మామ్మ అద్భుతమైన కథ చెప్పేది - అనగనగా ధర్మపురిని ధర్మరాజు పరిపాలిస్తుండేవాడు - ఆయనకు పదహారేళ్ల కుమారుడు సత్యకాముడు - రాజుగారి రెండో భార్య తన కుమారుడు లోకమిత్రుణ్ణి సింహాసనం ఎక్కించటానికి వీలుగా సత్యకాముణ్ణి అడవులకు పంపాలని రాజును ఒప్పించి దేశ సరిహద్దులు దాటించి మహారణ్య మార్గంలో వదిలివేశారు. సత్యకాముడు చాలా అందగాడు - వెన్నెల పోతపోసి అతని అవయవాలు తయారు చేసినట్లు మెరిసి పోతూ ఉంటాడు. ఆ కీకారణ్య మార్గంలో ఒంటరిగా తన ప్రయాణం సాగించాడు - సీతాకోకచిలుకలను, ఏనుగు గున్నలను దారి అడుగుతూ ముందుకు సాగాడు - సత్యకాముని కష్టానికి ఏనుగు కన్నీరు కార్చింది. అందుకే దాని చూపు మందగించింది. సీతాకోకచిలుక

కూడా కంట నీరు పెట్టుకుంది. అందుకే దానికి రెక్కల మీద రెండు కళ్ళు వచ్చాయి! అతని దారిలో ఉన్న చెట్లు గాలి వీస్తూ దుఃఖించాయి - ఆ శబ్దం అడవి అంతా మారుమోగింది. ఈ అరణ్యంలో సత్యకామునివంటి సత్యవంతుడు ఎప్పుడూ నడవలేదు - నక్క కూడా ఆశ్చర్యంతో కుందేలుతో చెప్పి చూపించింది. చూడు - రాజకుమారుని తలపై ధర్మచక్రం తిరుగుతోంది - అని-

ఒక్కసారిగా అడవి అంతా నిశ్శబ్దంగా మారిపోయింది - ఇక సత్యకాముని దారిలో ఓ గుండ్రని గులకరాయిలా, గుడిలో పూలసజ్జ పరిమాణంలో ఒక బుడంకాయ ప్రత్యక్షమైంది. నలుపు తెలుపు చారలతో - ఆ బుడంకాయ యువరాజు దారిలో దొర్లుకుంటూ వెళ్తోంది - సత్యకాముని కళ్ళు నీళ్ళతో నిండిపోయి - బుడంకాయను చూడనేలేదు - అంతలో దూరంగా ఎక్కడో గుహలో సింహం గర్జించటం వినిపించింది - భయంతో అతని కళ్ళు విప్పారాయి - అప్పుడు బుడంకాయను తన మార్గంలో దొర్లుకుంటూ వెళ్ళటం చూశాడు. బుడంకాయ కదలికలు అతన్ని ఆశ్చర్యపరిచాయి - దాన్నే అనుసరించి ఆ ఆడవిలో కదిలాడు -

పగలు ఎండ వేడికి కరిగి పోయింది - ఎండ చెట్ల నీడను చేరింది. ఎక్కడా ఒక్క ప్రాణీ కదలటం లేదు - బుడంకాయ దొర్లుకుంటూ వెళుతూనే ఉంది. యువరాజు ఆ మార్గంలోనే వెళుతున్నాడు. సాయంత్రం చల్లబడింది. పక్షులు నీళ్ల కోసం కదిలాయి. జంతువులన్నీ మేత కోసం తమ సంతానాన్ని తీసుకుపోతున్నాయి. అంతలో చీకటి పడింది. ఆ చీకట్లో బుడంకాయ దొర్లుతూ పెద్ద బండరాయిని గుద్దుకుంది - అంతే! ఒక్కసారిగా భళ్ళున పగిలిపోయి లోపలి నుంచి కళ్ళు చెదిరిపోయే అందంగల రాకుమారి ప్రత్యక్షమైంది. ఆమె అందం ఆ రాత్రిని వెలిగించింది.

'ఓ' అని సత్యకాముడు ఆశ్చర్యపోయాడు. అతను చూస్తుండగానే ఆ బండరాయి తలుపు ఎవరో తెరిచినట్లు బంగారు మెట్లు లోపలికి కనిపించాయి. లోపల అంతా కోలాహలంగా ఉంది. పనివాళ్ళు, సేవకులు (సేవకీ సేవకులతో) అంతా పెద్ద హాలు - పెద్దపెద్ద గదులూ - అంతా బంగారుమయం - అద్దాలతో మెరిసి పోతుంది. ఆరుగురు తెల్లని యువరాణులు సత్యకామునికి స్వాగతం చెప్పారు. వారు అభివాదం చేసి పక్కకు తప్పుకోగానే రాజకుమారిగా మారిపోయిన బుడంకాయ ఎదురుగా ఉన్న బంగారు ద్వారం దగ్గర నిలబడింది పూలహారం పట్టుకుని.

ఆమె అతని ముందు ఎంతో మర్యాదపూర్వకంగా వంగి నేను మా సప్త సహోదరి బృందంలో పెద్దదాన్ని - అవంతి రాజ్యానికి రాజకుమారిని - మమ్మల్ని మా కఠినాత్ముడైన తండ్రి బహిష్కరించాడు అని వివరించింది. సత్యకాముడు - అవంతి

రాజకుమారిని వివాహం చేసుకున్నాడు. ఆ రాజమందిరంలో ఒక దుర్మార్గుడు ఉన్నాడు, ఆ మర్కటాకారంలో! ఆ మర్కటాకారుడు నిద్రలో జోగుతూ పెద్ద పాలకుండ ప్రక్కన ఉన్నాడు - ఆ పాలు మరుగుతున్నాయి - కింద మంట ఉంది. రాకుమార్తెలు అందరూ కలిసి అతన్ని మరిగే పాల మండీలోనికి తోశారు. సేవకులు - పరిచారకులు ఎంతో ఆనందించారు - ఆ నిరంకుశుడు అంతమయినందుకు- ఆ తర్వాత ఇరవై ఏళ్లు సత్యకామ దంపతులు హాయిగా గడిపారు. వారి ప్రపంచం ఎంతగానో విస్తరించింది. పెద్ద రాజధాని నిర్మాణం అయింది. మార్గాలు - తోటలు - చెరువులు అన్నీ ఏర్పడ్డాయి - వర్షాలకు ఆశ్రయాలు నిర్మించారు - మార్గాలన్నీ సాయంత్రాలు మంచి గంధం పొడితో తడిపారు.

ఆ రాజధాని పేరు 'దండకావతి' గొప్ప నగరం అడవిలో రూపుదిద్దుకుంది.

సత్యకాముడు రమాదేవి తమ చిన్న రాజ్యాన్ని పరిపాలించుకుంటున్నాడు - ఒకరోజు ఏనుగులు - ఒంటెలు - గుర్రాలతో ఒక రాజు 'దండకావతి'లో ప్రవేశించాడు. ఆ ముసలి రాజు వారణాసి ప్రయాణం చేస్తున్నాడు. తీర్థయాత్రకు ఆయనతో నలుగురు రాణులు ఉన్నారు. వీరందరికీ స్వాగత సత్కారాలు జరిగాయి.

సత్యకామునికి వాళ్ళు ఎవరో వెంటనే తెలిసింది - కానీ రమాదేవికి ఆ విషయం తెలియదు - సత్యకాముడు గంగా జలాన్ని ఆ విందులో అందరికీ ఇచ్చాడు. అప్పుడే పెద్ద రాణి పాలిండ్ల నుంచి పాలసముద్రం పొంగింది. సత్యకాముడు తన తల్లి పాదాలపై మోకరిల్లాడు - తన కథంతా వారికి చెప్పాడు - సప్త సహోదరీ కథనం కూడా - రాజు తన ముగ్గురు రాణులు ఎంతో బాధపడి అతన్ని కౌగిలించుకున్నారు.

నాలుగో రాణి మంచిది కాదు - రాజుగారు అంతా పూసగుచ్చినట్లు చెప్పారు - నాయనా - నీవు దేశాన్ని విడిచినప్పట్నుంచి కరువు తాండవిస్తోంది - పంటలు లేవు - వర్షాలు లేవు - పాప ప్రక్షాళనకు వారణాసి బయలుదేరాం - ఈ తీర్థయాత్ర దేశానికి మంచి చేస్తుంది అన్న ఆశతో-

రాజు తన సేనానిని ధర్మపురికి పంపాడు - యువరాజు వస్తున్నాడని వార్త ప్రజలకు తెలియజేయాలని -

యువరాజుకు కుంకుమ - పసుపు నీళ్ళతో స్వాగతం చెప్పడానికి వెండి పాత్రలు పట్టుకుని ప్రజలు బారులు తీరారు - దారులన్నీ వరిపిండితో ముగ్గులు వేశారు - మామిడి తోరణాలు కట్టారు - వృద్ధ రాజు వారణాసి యాత్ర సాగించాడు తన రాణులు వెంటరాగా-

ధర్మపురి ప్రజలకు గాలిలో తమ యువరాజు రాక తెలిసిపోయింది - అతని మార్గానికి రెండువైపులా బంగారు మొలకలు మొలిచాయి - ముళ్ళన్నంటినీ ఈదురు

గాలులు ఊద్చేశాయి - రాకుమారుని చూడటానికి పసుపు పచ్చ పూలు మెడలు సాచి వేచి ఉన్నాయి - ఏనుగు అంబారీ మీద రాకుమారుడు రహదారిలో వస్తున్నాడు - తొమ్మిది రాగాలు సంగీతం గాలిలో తేలి వస్తున్నాయి - వినండి-

ఆ రాగాలు మీకూ వినపడతాయి - నిద్రపోండి హాయిగా - అని కథ ముగించింది లక్ష్మమ్మ మామ్మ.

అదే సంగీతం ఈరోజు నాకు వినిపిస్తోంది - ఆకాశం నిర్మలంగా ఉంది - చల్లని ఎండ చల్లగా ఉంది - రాకుమారుని దారిలో ముళ్ళను ఊడ్చినట్లు గాలి ఆకాశంలో మబ్బుల్ని తరిమేసింది - నీలంగా - నిర్మలంగా ఆకాశం ప్రశాంతంగా ఉంది.

సావిత్రి - జన్మతః యువరాణి - అసలు నాకీ కథ ఎందుకు గుర్తు వచ్చింది? ఆమె నావ మెట్లపై నుంచి క్రిందికి దొర్లుకుంటూ వచ్చినట్లు అనిపించింది - సావిత్రి బొద్దుగా ఉంటుంది - సిగ్గుపడుతూ పరిగెత్తుకుంటూ వచ్చింది - పట్టుకోపోతే పడిపోయేది కూడా - ఆమె చేయి పట్టుకుని ఆపాను -

మా ఆహ్వానాన్ని వెంటనే అంగీకరించింది - మాతో నాలుగు రోజులు గడపడానికి ఆమె సోదరుడు కూడా ఉన్నాడు - కానీ అతను వెంటనే వెళ్లిపోవాలి - ఇప్పటికే అతను లండన్‌లో ఉండవలసింది. మా ఇంటికి వెళ్ళే దారిలో - 'కాని బీ' రెస్టారెంట్లో భోజనం అయిందనిపించాము. సావిత్రి అంతగా నవ్వటం అక్కడ ఉన్నవారందర్నీ ఆశ్చర్యపరిచింది - సావిత్రి ముఖంలో అమాయకత్వం - నిజాయితీ - స్వేచ్ఛ అన్నీ దర్శనమిస్తాయి. ఆమె సోదరుడు ఆనంద్ మాత్రం ఇందుకు భిన్నం - అతను ఇంగ్లీష్ పోయెట్రీ - షెల్లీ వర్డ్స్‌వర్త్ చదివి - టీచర్ కావాలని ఆశిస్తున్నాడు - విక్టర్ హ్యూగో - బాడీలేర్ - పాల్ వాలిర్ కూడా - అంతలో సావిత్రి- 'మధ్యాహ్నంలో మంచు మండుతుంటుంది, సముద్రం ఎప్పుడూ పునఃసృష్టిలో ఉంటుంది' అని సన్నని గొంతులో ఫ్రెంచి పదాన్ని పాడుతోంది - మీరాలాగా!

సావిత్రికి జీవితం ఒక ఆట! ఒక పాట! ఆడుతూ పాడుతూ సందులూ గొందులూ తిరుగుతుంది - బంతులు ఎగరవేస్తూ - కాలితో తన్నుకుంటూ - గబగబా మాట్లాడుతుంది - గలగలా వాగుతుంది - ఆ మాటల - ఆ వాగుడు విరామంలో ఏదో విచారం దాగి ఉంటుంది - అది మరో జన్మది! ఆమె విచారం - బాధ - దాచుకోవడానికే పాడుతుంటుంది - ఇంకా తనకేదో తెలియని, పేరు తెలియని రోగం ఉన్నట్లు అది ఇతరులు గుర్తు పడతారేమోనని భయంతో - సిగరెట్లు తాగడం వింత శరీర కదలికలతో తన అనారోగ్యాన్ని దాచిపెట్టుకుంటుందనిపిస్తుంది-

ఆమె అందమైన విశాల నేత్రాలు ఏవో చీకట్లను దాస్తుంటాయి - ఇది మరో జన్మ రహస్యంలా మార్మికంగా ఉంటుంది.

సావిత్రి అప్పుడప్పుడు పాడే "ఆకాశం నీలంగా ఉంది - నిన్ను ప్రేమిస్తున్నాను" జాజ్ పాట - ఆమె 'మీరా' గీతాల స్మృతిలోనే పాడుతున్నట్లుంది!

ఆనంద్‌ని రైలు ఎక్కించేందుకు - హడావుడి పడ్డాం - అతను వెళ్ళిపోతూ - అక్కా - నువ్వు 'La Traviata' చూడడం మర్చిపోకు - నేను ఇంతకుముందే వాల్‌పోస్టర్ చూశాను' అని హెచ్చరించాడు.

మేము కారెక్కగానే సావిత్రి - 'మేరే మన్ చోర్ మేరే మన్ అమర్' అని పాడింది.

బహుశా ఆమె ఎక్కడుందో మర్చిపోయినట్లుంది ఫ్రాన్స్‌లో 'మార్సిలే'లో ఉన్నట్లు స్పృహ లేదు. నాకు ఈ జాజ్ అంతగా పరిచయం లేదు - స్కై ఈజ్ బ్లూ - ఐ లవ్ యు - ఇది వింతగానే ఉంది. నాకు తెలిసింది - మేరీ ఫ్రాన్స్ పాట - స్నేహితులారా - మనం - నేను లేక మీరు లేరు - మీరు లేక నేను లేను - మనమంతా మనమే...

లోయలో పైన్ చెట్లు ఆలివ్ చెట్లు తరతరాలుగా ఎండిపోతున్నాయి - బహుశా రోమన్ రాయబారుల్ని - బిషప్‌లను - నెపోలియన్‌ని కూడా అవి చూసే ఉంటాయి. మనం ఈ నేలను గౌరవించాలి - ఎక్కడున్నా - మనకు లేనిది ఇవ్వలేము - ఉన్నదే - అది చింతపిక్క అయినా - ఇతరులకు ఇవ్వజూపవచ్చు - తాతగారు తరచు అనేవారు - మనం ఫ్రాన్సుకు - మీరాబాయి - కీర్తనలు - శంకరుని గొప్పదనాన్ని గౌరవాన్ని చూపించగలం' అని. అంతే, వారి గొప్ప చరిత్రను ఇంకా అద్భుతమైన నదుల చరిత్రను వారి కవుల స్వచ్ఛతను మనం గుర్తు చేయాల్సిన పని ఏముంది?

ఫ్రాన్స్‌లో నడవటం అంటే - హెన్రీ IV తిరిగిన చోటు, సెయింట్ లూయీ అడుగులు వేసిన చోటు, సిజానే తిరిగిన వెండి - వెనీషియన్ ఆకుపచ్చని ప్రదేశాలు - Peguy పారిస్ నుంచి చార్త్రీకి 88 కిలోమీటర్లు నడిచి 'Beaune' తరపున ఫ్రాన్స్ రాణికి నివాళులు అర్పించ లేదా!

మా కారు కొండ దారిలో తిరిగి - మౌంట్ విక్టరీ వైపుగా మళ్ళింది - అంతలోనే మా విల్లా దీపాలు కనిపించాయి.

కారు ఆపగానే మెదలీనా పరుగున వచ్చి - సావిత్రిని - 'స్వాగతం స్వాగతం స్వాగతం' అని ఆప్యాయంగా ఆహ్వానించింది.

నేను సామాను కారు నుంచి ఇంట్లోకి చేర్చాను. సావిత్రి కిటికీ దగ్గరకు వెళ్లి తలుపులు తెరిచింది. ఓ అటు చూడు - శివుని చంద్రవంక! అని. నైనిటాల్‌లో ఇలాగే ఉంటుంది - అంది.

మెట్లెక్కి పైకి వెళ్ళింది - ఇది రాజమందిరంలాగా ఉంది సుమా - అని ఆనంద పడింది - మేమూ అంతేగా-

మనం మనకు కావలసినవి తయారు చేసుకుంటాం - అవి మనల్ని తయారు చేయవు కదా!

ఈ రాజమందిరం మెదలీనా చేసింది - నేను ఇంటినే ఇచ్చాను - నేను ఆమెకు అతిథిని మాత్రమే! నాకు ఆ విల్లా ఒక పవిత్ర స్థలం - పవిత్ర స్థలాలు దేవుళ్ళు ఉండటానికి కదా! నా పూర్వీకుల కోసం!

బ్రాహ్మణుడు వర్తమానంలో ఉండడు - అతను కాలంలో ముందు వెనుకలకు వెళ్తుంటాడు - అలాగే యోగి తన వంశ వృక్షాన్ని స్థాపిస్తాడు - గురువు ఈ జనన మరణాల శృంఖలాలను అంతమొందిస్తాడు -

ఇప్పుడు చెప్పండి - నేను ఇంటిని ఎక్కడ నిర్మించాలి? ఏ నది ప్రక్కన? ఏ తటాకం ఒడ్డున? ఏ గుడి వరండాలో? చెప్పండి? నేను ఇంటిని ఎక్కడ కట్టాలి?

ప్రావెన్స్ నగర ఉద్యానవనం చైనీస్ జానపద ప్రపంచాన్ని తలపిస్తుంది. బిషప్పులు, మతాధికారులు, చర్చి, రాకుమారులు, నశ్యపు డబ్బాలు, ఉంపుడుగత్తెలు, మంచి వైన్, అక్రమ సంతానం, తారస్కన్ రాక్షసుడు - వీళ్లందరూ కలిసి అక్కడి సంపదను సంరక్షిస్తారు. ఖైదీల కోసం మాంట్ మాజౌర్‌లో ఉన్న నేలమాళిగలు, ఊహాసుందరి - ఈమెను కవిత్వంతో తప్ప ఖడ్గంతోనో, గొడ్డలితోనో ప్రసన్నం చేసుకోలేం. ఆమె కరుణిస్తే నీటి అద్దాలలో అర్థం కనిపిస్తుంది. చైనీస్ రాణి యౌవన భారంతో శృంగార దేవతగా ఉంటుందేమోగాని, ప్రావెన్‌కాల్ రాణి మాత్రం అతిశయము, ఆత్మగౌరవమూ ఉన్న కన్య. సత్రంలో ఎవరో ప్రవచిస్తున్న పక్షుల జ్ఞాన వచనాలను వినాలనుకున్నా లేదా నక్షత్ర గమనాన్ని గురించి తెలుసుకోవాలనుకున్నా సరదాగా గాడిదనెక్కి అక్కడికి చేరుకోవచ్చు. వెన్నెల్లో - స్జ్వె - ష్వాన్‌లోలాగా వాంగ్ చూ లేక చాంగ్ ఇ (ప్రావెన్స్‌లోనే) రొట్లో దంచుతూ, సేవిస్తూ నూతన లోకాన్ని గానం చేయలేదా!

నవమి నాటి చంద్రుడు ఆకాశాన్ని కాంతివంతం చేసినట్టుగా, తొమ్మిది సీతాకోక చిలుకలతో పానీయం తయారు చేసినట్టుగా నాలుగు లోయలకు చెందిన

ఈ సీతాకోక చిలుకలనధిరోహించి, చంద్ర కిరణాల మీద చాంగ్ టో దుర్గాన్ని చేరుకోవచ్చు" అంటుంది చాంగ్ ఇ తో వాంగ్ చు. అక్కడ వెదురు వైన్ గంజాయితో రాకుమారి మనకు స్వాగతం పలుకుతుంది. సేవికలు మన చుట్టూ నాట్యం చేస్తారు. ఆనందంగా కొంత కాలం అక్కడ గడుపుదాం. అంతలోనే, ఏదో కథలో చెప్పినట్టుగా రాకుమారుని గర్విష్టి సేవకుడు గాడిదను దుర్గం అగ్రభాగానికి తీసుకెళతాడు. అప్పుడు చాంగ్-ఇ తో అంటుంది వాంగ్ చూ. "ప్రయాణం అద్భుతంగా జరిగింది. చంద్రకిరణాలు ఎంత అనుకూలంగా ఉన్నాయో. చాంగ్, మన ఈ నాలుగు అరచేతులంత సాలెగూడును తయారుచేసి మన వడ్డాణాలలో ఈ రాజ్యాన్ని ఇముడ్చుకోలేమా?" చాంగ్ - ఇ. "చెయ్యొచ్చు. మొదట ఈ నశ్యం నశాళానికి దట్టించు" అంటుంది వాంగ్ చూ.

దేవాలయంలో ఉదయ ఘంటికలు మ్రోగుతాయి. చాంగ్, వాంగ్ రోకలిని ప్రక్కన పెట్టుకొని నిద్రపోతున్నారు. సేవకుడు వచ్చి వాళ్ళను కదిపి లేపుతూ "అయిదు నాణేలు మేము మీకు ఊరికే ఇవ్వటంలేదు. నాణేలు చెట్టుకు కాస్తాయనుకుంటున్నారా ఏమిటి? బారెడు పొద్దెక్కింది, లేవండి" అంటాడు.

అప్పటికి బాగా ఎండొచ్చింది. నల్లని సైప్రస్ వృక్షాల వెనకాల చంద్రకళ. చెట్ల మీద వెండి చారలాగా. రోమన్ దుర్గ శిథిలాలు, ద్రాక్ష తోటల ప్రక్కనే రైలు పట్టాలు, మిణుగురులు సృష్టించిన వింత లోకమది. మంత్రనగరి కథలు వాస్తవరూపం దాలుస్తున్నాయి. రాకుమారి తన శిరోజాలంకరణలతో ఒక లోకాన్ని దర్శింప చేసింది. వంశీ గానం ముగ్ధ మనోహరంగా ఉంది. ఆమె లోకోద్ధారకుని కోసం నిరీక్షించింది.

నాకు తెలుసు ఇప్పటివరకు నేను చెప్పిన దానికి తలాతోకా లేదని- సావిత్రికి సత్యమంటే భ్రమతో కూడిన వాస్తవం, ఆమెకు అన్నీ ఆశ్చర్యమే. పసిపాపలా, చిన్నపిల్లలా ఆమె పెదవులు విచ్చుకుని, కన్నులింత చేసి ఆ వస్తువును ఇప్పుడే చూస్తున్న భ్రమతో వాస్తవాన్ని దర్శిస్తుంది. ఆమెకు జిలుగు వెలుగుల అసత్యపు ప్రపంచమే నిజమైనది! ఆమె నిజానికి రుజువులెందుకు?

ఈ ప్రపంచం, ఆమె రాజమందిరం ముంగిట ఓ బిచ్చగత్తె! ఎప్పుడూ ఎక్కడా ఎవ్వరూ లేరు - అంతా ఉంది! ఒక్కరే కాదు - నువ్వు ఉన్నదే సత్యం!

సావిత్రికి ఊరు చూపించడానికి ఆ రోజు ఉదయాన్నే బయలుదేరాను. మెదలీనా నా దగ్గరకు వచ్చి "రామా! ఈమె నిజమేనా? ఆమె భ్రమల ప్రపంచంలో నడుస్తోంది - చాలా వింతగా ఉంది - నాకు గందరగోళంగా ఉంది!" అన్నది.

“మీకు పెళ్లయి ఎన్నాళ్ళయింది” అడిగింది సావిత్రి కారులో ఎక్కుతూ! ఆమె ఏమి అడిగింది - నేనేమి చెప్పాను - అది అంత ముఖ్యం కాదు - ఏమి జరిగినా చందమామ వెలుగుతూనే ఉంటుంది - అలాగే సత్యం మెరుస్తూనే ఉంటుంది -

‘మూడున్నరేళ్లు’ అన్నాను.

‘మెదలీనా చాలా నిజాయితీగలది. ఆమె నన్ను బాగా కదిలించింది!

‘రామా! మనం నిజమే ఎప్పుడూ చెప్పగలమా?’

‘సాధ్యం కాదేమో - నేను అలా అనుకొంటున్నాను - అలా అని అసత్యమే చెప్తానని కాదు - మనందరం - కుస్తీ పోటీ చూస్తున్న చిన్నారుల్లాంటివాళ్ళం - నాన్న భుజాల మీద నుంచి - ఏమి జరుగుతుందో అని మెడలు నిక్కిస్తాం - నాన్న చూస్తున్నది వేరు - మనకు కనిపించేది భిన్నం - అలాగే ఊరేగింపు కూడా - ఊరేగే దేవుని కోసం - గుడి గుమ్మంలో దేవత ఎదురు చూస్తుంటుంది.

ఏదైనా మనం చూసే స్థితి నుంచి సత్యం కనిపిస్తుంది. శాస్త్రజ్ఞునికి కూడా పూర్తి సత్యం - అవగాహనకు రాదు’ అన్నాను. ‘చూడు ఆ నీళ్లల్లో కనపడే చందమామ - ఆకాశంలో చందమామ తనను తాను చూసుకుని - ఇది నేనేనా?’ అని అడిగినట్లు-

‘ఉండటమే సత్యం-’

‘ఉండటం అంటే?’ సావిత్రి-

‘ఇది అడిగేది ఎవరు?’



జాకీస్ రేవు

'నేనే' అంటే 'నేను' 'ఎవరు?' 'ఏమో' అంటే నేనంటే నేను - నేనే - సావిత్రి - సావిత్రే - అని సావిత్రి అంటుంది! 'సావిత్రి - నేను!' అంతే ఏమీ లేదు! చూడటంలో చూడటం ఉంటుంది - చూసేవారుంటారు - 'చూసేదెవరు?' అదే 'నేను' - అదే 'శూన్యం' - శూన్యంలో నేను - శూన్యమే కదా! ఈ వెన్నెల వెలుగులో - పైన్ చెట్లు చూస్తున్న నేను - నేనుగా చూసేది నేనే-

మౌంట్ విక్టరీ

'అదే సత్యం'. అప్పటికే నిద్రావస్థలో ఉన్న ఊరువైపు నడుస్తున్నాం - సావిత్రి మౌనంగానే నడుస్తోంది - ఎప్పుడైనా తన కాలు నన్ను తాకినప్పుడు 'సారీ' అంటుంది.

మనకు స్పర్శ చాలా విలువైనది - నేను - మా ఏనుగు రాయి - నంది గురించి చెప్పినది విని - చాలా బాగున్నాయి కథలు - నందికి నేను గరిక పెట్టవచ్చా-

'అరే - ఇక్కడ ఇంత చైతన్యం ఉంది - మరణం ఎలా సంభవం?' అని ఆశ్చర్యపోయింది.

'ఆక్స్‌లో చనిపోయినవాళ్ళు చర్చిల్లో తిరుగుతుంటారు - రాత్రి కుక్కలు నిద్రించే సమయంలో వినవచ్చు-'

'అరే - నా కాలెప్పుడూ నీకు తగులుతూనే ఉంది - సావిత్రి - 'నాన్న అనేవారు - నేను కుంటి గుర్రాన్నని - ఎప్పుడూ ఏదో తగిలి పడిపోయేదాన్ని - చివరికి చదును నేల మీద కూడా ఒకసారి - ఫ్లాట్‌ఫారమ్ మీద నుంచి రైలు పట్టాల ప్రక్కన పడ్డాను - నాన్న చాలా కంగారు పడ్డారు - అది మీటర్ గేజి - ఆయన గొలుసులు లాగారు - నేను లేచి రైలు వెనక పరిగెత్తాను - అప్పటి నుంచి నాకు కాపలాగా ఒక సేవకుణ్ణి నియమించారు' - అని చెప్పుకొచ్చింది.

'యూరప్ దాకా ఎలా వచ్చావు' అని అడిగాను.

"గొప్పతనానికి - రక్షణకు - మనం గొప్పతనాన్ని ఎంచుకుంటాం - రాజపుత్ర కుటుంబంలో మొదట స్త్రీగా నేను ఈ సాహసం చేశాను. మావాళ్లు ప్రోత్సహించారు కూడా!" ఇదిగో - ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందిన సావిత్రి అని మా కుటుంబాలకు చెప్పాలని తాపత్రయం - 'నాకు యూరోప్ నచ్చింది - ఇక్కడ స్వేచ్ఛ - నేర్చుకోవాలనే ఆకాంక్ష కూడా! నాకు చాలా బద్ధకం - అలాగే నిద్రపోతే నన్ను లేపడం చాలా కష్టం - నా దృష్టిలో నిద్రకు మించిన సుఖం మరొకటి లేదు.'

'అయితే నీకు ఆలస్యమైనందుకు బాధగా ఉంది - అంతే కాదు - ఒకసారి పడుకొంటే ప్రొద్దున్న తొమ్మిది గంటల వరకు లేవను - ఇంటికి చేరుతుండగా నందికి పరకలు పెట్టింది - ఏదో హారతి ఇస్తున్నట్లు!

ఆమె గదికి తీసుకువెళ్లి - నిద్రపో - బాగా నిద్రపో - సావిత్రి - అంటూ - వెన్నెలలాంటి ఆ గదిని ఒకసారి చూసి - మెదలీనా దగ్గరకు వచ్చాను - ఆమె కిటికీలో నుంచి వెన్నెల చూస్తోంది -

'రాత్రి ఎంత అందంగా ఉంది - రామా! అంది.

నన్ను సున్నితంగా కౌగిలించుకుంది-

ఆమె సన్నిధిలోని ఆనందాన్ని పూర్తిగా ఆస్వాదించాను - మా ఇద్దరికీ తోడు మరో ప్రాణి ఉన్నట్లు తెలుస్తోంది - ఇది ఎంత మార్మికమైన సత్యం!

ఎప్పుడో తరాల క్రిందట ఏ రోమనుడో నాటిన సైప్రస్ ఇప్పుడు మాకు తోడుగా ఉంది - ఇంకా పూర్తిగా రూపు సంతరించుకోని 'భ్రూణ' ఒక సత్యంగా ఆవిష్కరింపబడుతోంది. ఆది మధ్యంతాలతో అదే ఈ 'నేను'కి చివర ఏమో?

కాలానికి అతీతంగా ఈ 'జ్ఞానం' అదే సృష్టి - అదే సత్యం!

నాకు ఒక్కసారిగా మెలకువ వచ్చింది - మెదలీనా ఏదో తెలియని బాధతో - నొప్పితో ఏడుస్తోంది - ఆమె గర్భంలో మోయలేని వెలుగు ఉన్నట్లు సతమతమవుతోంది - ఆమెను అనుక్షణం కాపలా కాచాను - చెమట బిందువులు తుడిచాను - దుప్పటి కప్పాను - ప్రపంచంలో మానవాళికి 'ఇదే మొదటి నొప్పి' అన్నట్లు - పేరు లేని - చెప్పలేని ఈ నొప్పి ఆమె భరిస్తోంది - ఆడవాళ్ళు నొప్పులు భరించడానికే ఉన్నారు - మగవాడికి కాడి మోయటానికే వారి జీవితం - ఇంటి గుమ్మం చేరకముందే వర్షం విరుచుకు పడుతోంది - రాత్రి మిగులుతుంది - పగలు ఖర్చయిపోతుంది - మెదలీనా శరీరం పూర్తిగా స్త్రీత్వాన్ని నింపుకుంది - నేను మాత్రం శూన్యం! అసత్యం!

మర్నాటి ఉదయం నేను క్రిందకు వచ్చే సమయానికి సావిత్రి పూలమొక్కలతో గులాబీలను తాకుతూ - సంద్రపు గాలిలోని ఉప్పదనాన్ని - ఆలివ్ ఆకుల చల్లదనాన్ని - ఆస్వాదిస్తోంది. ఆమెలోనికి ఆమె చూస్తుందేమో? ఎక్కడో ఏదో జరిగింది - ఈ భూగోళం తన విపత్తు మార్చుకున్నదేమో! ఉత్తర ధృవం, హిమ సమూహాలు కరిగి పారుతున్నాయేమో! పోలార్ ఎలుగుబంట్లు దిక్కు తెలియక పరుగులు

పెడుతున్నాయేమో! పెంగ్విన్లు వేడికి తట్టుకోలేక మగ తోడు కోసం వెతుకుతున్నాయేమో! భౌగోళిక విచ్ఛేదనంతో శకలాలన్ని చెల్లాచెదురయ్యాయేమో? ఆకాశంలో అగాధం ఏర్పడి కొత్త ప్రపంచం రూపుదిద్దుకొంటుందేమో? తోటలు - పూలు విరబూస్తున్నాయేమో? కోతులు చెట్ల మీద గంతులేస్తున్నయేమో? మనుషులు ఎత్తుగా, కొత్తగా కనిపిస్తూ ఒకరినొకరు గుర్తుపట్టి నవ్వుకుంటున్నారా? భూమి మీద కాలం - ఎండలా పరుచుకుంది-

పూలు విచ్చుకునేది - పిందెలుగా మారటానికి కాదు - మంచు బిందువులు వచ్చి వాలటానికి - అదిగో ఆమె స్త్రీమూర్తి వచ్చి - తమ రేకులను సవరించాలని - ఈ నీరెండలో - అవి ఎదురు చూస్తున్నాయేమో! ఇక్కడ ఎందరో లేరు - ఆమె సావిత్రి - ఒక స్త్రీ మాత్రమే - ఒక్క ఆకారమే - ఒక్క శబ్దమే - ఒక్క అనురాగమే - ఇది ఒకరికొకరు చెప్పుకొనేది కాదు - ఇచ్చిపుచ్చుకొనేది కాదు -

కాలంతో చిక్కేమిటంటే - దాని మాయ అదే సృష్టించుకుంటుంది - మనమా మాయలో పడిపోవాలనుకుంటుంది - కారు ఒకచోట ఆపినట్లు - మన ఆలోచనలు కాలంలో ఒకచోట నిలపవచ్చా? అక్కడే వదిలి మన పనికి మనం వెళ్ళిపోవచ్చా? అదేగా జీవించటమంటే - కాలాన్ని మర్చిపోవడమంటే - జ్ఞానంతో జీవించటం - కవులు చెప్పారు ప్రేమ పుడుతుందని? అలా ఎప్పటికీ కాదు - ప్రేమ అంతటా ఉంటుంది - అక్కడకు నీవు కూడా వస్తావు - అదిగో - గులాబీ పువ్వు దగ్గరకు వచ్చి ఆ దారిన వెళ్తావు - అలాగే - కానీ గులాబీకి ఏమి తెలుసు? ఏమి జరిగిందో! జరిగినదానికి జరిగినది తెలియదు - లోపల ఉన్న దానికి లోపల ఎలా తెలుస్తుంది - ప్రేమను ప్రేమతో కలపగలవా?

ప్రేమ - ప్రేమ కోసమే - ప్రేమ - ప్రేమించడం - ప్రేమ - అదీ విషయం! ప్రేమించినవారి ఒడిలో ఒదిగిపోవడం - మనకు మనం ఆనందాన్ని పొందడమేనని అనుకొన్నదేమో సావిత్రి - కారు ఊర్లోపెట్టి - కొండమీద మేఘాల దగ్గరకు వెళ్లడం - ఆలోచనలు కాలంలో ఆపి, ఆమె - ప్రేమలో కొండగాలి - సముద్రపు నీలాన్ని చూడటం!

'ఇంత త్వరగా లేచిపోయావు?' అడిగాను - 'ఏమీలేదు - రాత్రి ప్రశాంతంగా నిద్రపోయాను. నాలాంటి లావాటి వాళ్లు బాగా నిద్రపోతారు!' అని నవ్వింది! అవును - ఆమె గుండ్రంగానే ఉంది - కానీ - ఆమె చుట్టూ ఏదో స్వచ్ఛత - నిజాయితీ - ఆత్మీయత ఉంది.

''అబ్బ -ఇక్కడ ఎంత బాగుంటుంది - ఈ తూనీగలు - ఈ తోట - ఈ పూలు - ఇవన్నీ వదిలి వెళ్లిపోవాలంటే - బాధగానే ఉంది!'

'ఆనీవిల్లా ఇక్కడే ఉంటుంది - రామస్వామి - మెదలీనా కూడా ఇక్కడే ఉంటారు - రాజకుమారి ఎప్పుడు వచ్చినా - అన్నీ ఆనందంగా ఆహ్వానిస్తాయి' అన్నాను.

ఆమె అమాయకత్వం - ఒక్కసారిగా పాటలా మ్రోగింది - ఇలా సాగింది.

'అశ్రుజలాలను జల్లి - ప్రేమలతలను పెంచాను' అంటూ పాడటం మొదలు పెట్టింది- కళ్లు మూసుకొని తన్మయత్వంతో ఉంది - ఆలివ్ చెట్ల మీద పిచ్చుకలు కిలకిలలాడుతున్నాయి - అక్కడ నుంచి మెల్లగా తప్పుకుని ఇంట్లోకి వచ్చాను - మెదలీనా గదిలో కళ్ళు తెరిచే పడుకుని ఉంది-

'పాటతో మెలకువ వచ్చింది - ఎందుకు మీ గొంతులో అంత విషాదం ఉంటుంది - రామా?' నువ్వు నవ్వి నప్పుడల్లా నాకు నీ నవ్వు ముసుగులో ఎంతో విచారం కనిపిస్తుంది!

'మన అస్తిత్వం - జనన మరణాల మధ్య ఒక ప్రయాణం - ఈ ప్రయాణంలో మనిషి ఎంత విషాదానికి లోను కావాలి?!'

బుద్ధుడు - రాజ మందిరాలు - రాకుమారులను - రాజ్య వారసత్వాన్ని - త్యజించి నిష్క్రమించాడంటే - తిరిగిరాని లక్ష్యానికి తరలి వెళ్ళిపోయాడంటే ఆశ్చర్యమేముంది?

మెదలీనా - మనదీ ప్రయాణమే - హోటల్ నుంచి హోటల్‌కి - ఊరి నుంచి ఊరికి - కొండ నుంచి కొండకు - గాలిలో, నీటిమీద - సముద్రాలలో - అంతా ప్రయాణమే. ప్రయాణమే జీవితం! నీవు జీవితంలోనే జీవిస్తావు. ఇంటిలోనో, ఊర్లోనో, నగరంలోనో కాదని గ్రహించడమే జ్ఞానం!

''రామా - ఒక్కోసారి నీ నుంచి దూరంగా - చాలా దూరంగా పారిపోదామనిపిస్తుంది!

సర్కస్ బఫూన్ ఫీట్లు చూసి నవ్వుకోవాలని, మామూలు జనం కబుర్లు నవ్వుల్లో కలిసిపోవాలని - నీ జ్ఞానబోధలు నన్ను భయపెడతాయి - ఎప్పుడో - నిజంగానే నీ నుంచి దూరంగా వెళ్ళిపోతానేమో!

నిన్న నీవు లేవు కదా - ఎంత ఒంటరిగా మిగిలి పోయానో, నిన్ను పోగొట్టుకున్నట్లే భయపడ్డాను - ఇల్లంతా సర్దాను - బ్యూటీషాపుకెళ్ళి - జుట్టు సవరించుకున్నాను - వారం ముందుగానే, వాళ్ళతో ఏదో అబద్ధం చెప్పాను - నీ కోసం పుస్తకాలు కొన్నాను - అప్పటికి సాయంత్రం ఆరుగంటలే అయినది - గ్రాండ్ మ్యాగజైన్ షాపు తెరిచి ఉంది - తర్వాత మిరియాలు కొన్నాను - నీ కోసం పొడి చేసి ఇస్తాను'' అని మంచం దిగి స్నానానికెళ్ళింది!

వరండాలో అందరికీ ఉదయం ఆహారం కోసం బల్ల వేశాను. సావిత్రిని పిలవడానికి వెళ్ళాను. ఆమె జుత్తు దువ్వుకుంటోంది. 'టిఫిన్ రెడీ' అని చెప్పి వచ్చేశాను. సావిత్రి హెయిర్ పిన్నులు చేతిలో పట్టుకొని, నా వెనకే వచ్చింది - ఆమె బల్ల దగ్గర కూర్చొని జుత్తు సవరించుకుంటూ ఉంది - నేను కాఫీ తేవడానికి వెళ్ళాను - వచ్చేసరికి మెదలీనా సావిత్రి జుత్తుకు పిన్నులు పెడుతూ కనిపించింది. భౌతికంగా ఆడవాళ్లు ఒకరికొకరు బాగా ఒదిగిపోతారు - పౌడరు అద్దుకోవడం - కాటుక దిద్దుకోవడం - చెప్పులూ - చీదటాలు - లోదుస్తులు - ఇలా వారికి దాపరికం ఉండదు - మరో స్త్రీ దగ్గర. కానీ ఇది మగవాళ్లకు కుదరదు - ఆడవారికి బ్రతుకు ఆల్జీబ్రా బాగా తెలుసు - గౌన్లు - నగలు - మందులు - బహిష్టులు - అన్నీ మాట్లాడుకుంటారు. మగవాళ్ళకి ఇలాంటివి ఏమీ పట్టవు - అడవి పందికి పద్మంలాగా.

జీవితమంటే స్త్రీమూర్తే - మగవాడు ఈ ప్రపంచానికి చెందడు. ఈ భూమ్మీద అపరిచితుడు.

అవును - మనందరం బోధిసత్వులమే - ఏదో ఒక రాత్రి - భార్యను - బిడ్డను ఆ రాత్రి దీపపు వెలుగులో - ఆమె కంటిరెప్పల చీకట్ల అగాధంలో - బ్రతుకు మడత పడిపోతుంది - అప్పుడే 'కంటక' మేల్కొని సకిలిస్తాడు - కపిలవస్తు నగర ప్రజ - నిద్రాభంగం కలగకుండా దేవతలు తలుపుల కంతలు మూసి వేస్తారు. అవును - చెన్నడు సిద్ధంగానే ఉన్నాడు - 'కంటక' అశ్వాన్ని తీసుకుని రాజమందిరం ద్వారం దగ్గరే - కాపలా దారులు తలుపుల ప్రక్కనే నిద్రిస్తున్నారు - కూర్చునే ద్వారం - తర్వాత ద్వారం - తెరుచుకుంటూనే ఉంది - దేవతలు - తలుపుల శబ్దం రాకుండా జాగ్రత్త పడుతున్నారు. కంటకాశ్వం గాలిలో పరుగులు పెట్టింది - గంగానది ఒడ్డునే గౌతముడు తన పొడవాటి కురులు కోసి ఆకాశంవైపు ఎగురవేశాడు - మహాప్రసాదంలా గంధర్వులు స్వీకరించారు-

కంటకాశ్వం - ప్రభు నన్ను కూడా రానివ్వండి అని వేడుకొంది - నేను తిరిగి రాని లక్ష్యానికి వెళ్తున్నాను - అని గౌతముడు కదిలిపోయాడు - కంటకాశ్వం కపిలవస్తు చేరి మరణించింది - మళ్లీ జన్మించి - కరుణామయుని చెంతకు చేరింది - అర్థాంతగా- "ఆనందా - సృష్టిలో అన్నీ నశిస్తాయి - నీ జ్ఞాన బిందువు - దానికి మాత్రం పునర్భవం లేదు - అన్వేషణ ముగుస్తుంది - అదే సత్యం-"

మగవాళ్ళంతా యాత్రికులే - ఈ ప్రపంచానికి పరిచయం లేని తీర్థయాత్రీకులే!

సావిత్రికి చాలామంది భారతీయులలాగా - బౌద్ధం గురించి తెలిసింది చాలా తక్కువ - నిజానికి మెదలీనా ఆశ్చర్యపోయింది - అంతటి గొప్ప బుద్ధుని గురించి ఇంత కూడా తెలియదా అని ఇప్పుడు బౌద్ధం - హిందూ మతంలో భాగమైపోయింది - రెంటినీ విడదీసి చూడటం చాలా కష్టం - దక్షిణాదిన ఆర్యుల సాంప్రదాయం ద్రావిడుల సంప్రదాయాన్ని విడదీసి అర్థం చేసుకోలేనంతగా కలిసిపోయాయి - ఉత్తర దేశంలోకంటే- భారతీయులు అన్నీ తమలో కలుపుకుంటారు - స్వంతం చేసుకుంటారు - అని అన్నాను. 'అవును - ఇండియానే అంతా - మీరు ఎక్కడ ఉంటే - అదే ఇండియా' అని కాస్త కోపంగానే మెదలీనా అంది - 'లేదంటే అది అసత్యం క్రిందే లెక్క-'

'అదే మాయ - అదే ఇంగ్లీషువాళ్ళు' అవునా అంది! ఇప్పుడు కాస్త హాస్యంగానే-

'అలా ఎందుకు? మేము బ్రిటిష్‌వాళ్లను చాలా ప్రేమిస్తాము - అవునా సావిత్రీ?' అన్నాను.

'అవును - మౌంట్ బాటెన్ ఇండియా వదిలి వెళ్లిపోతుంటే అందరూ కంటతడి పెట్టుకున్నారు - మాకు సెంటిమెంట్లు ఎక్కువ (భావావేశం) జాస్తి!'

'ఇంకా పాండిచ్చేరిలో ఫ్రెంచివాళ్ళున్నారు కదా!' అంది మెదలీనా - ఫ్రెంచి రైతు అంత తేలికగా వదిలి రాలేడు - అతను అన్నీ సొంతం చేసుకుంటాడు - పంటనూ - లాభాల్ని'' అని అంది నవ్వుతూ- ఈ తర్కం చాటున అందరం ముసుగులో ఉండాలని ప్రయత్నిస్తున్నాం- అంతలో పోస్ట్‌మాన్ ఉత్తరాలు తెచ్చాడు - సావిత్రి స్నానానికి వెళ్ళింది - 'ఇక నేను వంట చేస్తాను - సావిత్రి రైలుకి వెళ్లాలి కదా' అని మెదలీనా లేచింది.

'మిస్ట్రల్' 2:30 ని॥లకు బయల్దేరుతుంది. నేను ఉత్తరాలు చూస్తూ కూర్చున్నాను. కొన్ని ఇండియా నుంచి - కొన్ని లండన్ నుంచి - పారిస్ నుంచి కూడా-

ఇక్కడ ఉంది నేనేనా? నేను కాదేమో? నేను కాకూడదు సుమా!

చార్లీ అంకుల్ ఉత్తరం - కాతరీన్ ఎప్పుడు వచ్చేది - తెలుపుతోంది - వచ్చే శనివారం - పారిస్‌లో రైలెక్కిస్తాడు - ఆమె రైల్‌లో కూర్చునే నిద్రపోగలదు -

'ఆమెకు అన్నీ నేర్పండి - తన ఇంటిని చక్కగా సర్దుకోవాలి కదా' అంటాడు.

మీ ఇద్దరి నుంచి ఆమె చాలా నేర్చుకోవాలి - ఏ తండ్రి అయినా తన సంతానం సంతోషంగా ఉండాలని కోరుకుంటాడు కదా - రామా - కాతరీనాకు మీ సహాయం కావాలి - మీకు ఎప్పటికీ కృతజ్ఞుణ్ణిగా ఉంటాను - అని ముగించాడు.

కాతరీనా రాక నాకు కొత్త ఉత్సాహాన్నిస్తోంది - ఆమె చాలా అమాయకురాలు - చాలా ఉత్సాహంగా - వస్తువులన్నా, వ్యక్తులన్నా ఎంతో ప్రేమ చూపిస్తుంది -

ఆమెను ఒక తల్లిగా ఊహించటం తేలిక - ఆమెను చేసుకునేవాడు ఆస్తినే కాదు - మంచి భార్యను కూడా పొందుతాడు - ఆ మధ్యాహ్నం భోజనం - అంతంత మాత్రం - ఎవరి ఆలోచనల్లో వాళ్ళు ఉన్నారు - జార్జి, సావిత్రికి వీడ్కోలు చెప్పడానికి వచ్చాడు - అతని ప్రతి కదలికలో దేవుడుంటాడు - ఆడవాళ్ళిద్దరికీ వంగి అభివాదం చేసి - నాకు చేయి ఊపి మెట్లు దిగి వెళ్ళిపోయాడు-

'జార్జి చాలా మంచివాడు - అతను ఈ సన్యాసాన్ని వదలి సంసారంలోకి రావాలి - ఆడదాని వెక్కిళ్ళు - చిన్నారుల ఏడుపులు - అతన్ని మనిషిని చేస్తాయి. మనిషి సూపర్‌మాన్ కావాలంటే మామూలు మనిషిలాగా ఉంటే చాలు!' అని ఇద్దరూ నవ్వుకున్నారు.

'నాకూ యోగి కావాలని ఉంది - అరబిందో శిష్యునిగా మారి మరణాన్ని జయిస్తాను.'

'ఓ రామా - నువ్వు నన్ను వదిలి పోతావనే ఆలోచనే ఈ జన్మకి లేదు-' మెదలీనా అంది విచారంగా-

'శాశ్వతత్వం మగవాళ్లకే - ఆడవాళ్లు తమకు తగిన వయసులో మరణిస్తారు. ఈ ఏకపత్నీ వ్రతం - హిందువులకి - క్రిష్టియన్లకే - ముస్లింలకు ఇది వర్తించదు. అది సహజమైన జీవితాన్ని తెలుపుతుంది.

'అవును - అప్పుడు నువ్వు పాకిస్తాన్ వెళ్తావు' అని సావిత్రి ఘాటుగా అంది.

మనం ఫ్రాన్స్‌లో ఉన్నాం - ఇక్కడ రైళ్లు సమయానికే బయలుదేరుతాయి - మనలాగా కాదు - మనం బయలుదేరకపోతే - రైలు వెళ్లిపోతుంది - మీరు కాఫీ తాగుతుండండి - నేను పెట్టెలు కార్‌లో పెడతాను' కిందికి దిగి సామాను కారులో పెట్టాం - సావిత్రి నందికి గడ్డిపరకలు పెట్టింది - వెనక్కు తిరిగి విల్లా ఆనీని - రెండు కిటికీ కళ్ళని చాలాసేపు చూసింది- మెదలీనా సామాను కారులో సర్దింది - అందరం కారులో సర్దుకున్నాం - అప్పుడే సావిత్రి లండన్ గురించి - తన కోసం ఎదురు చూస్తున్న హుస్సేన్ గురించి ఆలోచిస్తూ ఉంటుంది-

'నాకు లండన్ వెళ్ళాలంటే భయంగా ఉంది - ప్రపంచం అంతా ఇలా 'ప్రావెన్స్'లా ఉంటే ఎంత బాగుండును-

'అలా అయితే - నీకు మధ్యాహ్నం - గురక వినపడుతుంది - 'మిస్ట్రల్' కూత గట్టిగా వినపడుతోంది - ఇక్కడ బద్ధకం పేరుకుపోతుంది!' అని మెదలీనా స్థిరంగా చెప్పింది-

సాయంత్రం జార్జి వస్తాడు అయిదింటికి - మెదలీనా సంస్కృత పాఠాలు మొదలు పెడుతుంది - లీజో కూడా వస్తాడు- కాతరీనాకి వీళ్ళిద్దర్నీ పరిచయం

చేస్తుంది - మెదలీనా అంతా పక్కాగా ప్రణాళిక వేస్తుంది! మెదలినా సావిత్రితో చెప్తోంది - రామాకు వెయ్యేళ్ళు వయస్సుంటుంది - లేదా మూడేళ్ళు - ఎంత తెలివిగలవాడో అంత అమాయకుడు - కారు బాగా నడుపుతాడు - ఉన్నట్లుండి సీట్లో ఎగిరి పడతాడు - ఏదో పాము ఉన్నట్లు - ఈ మిషన్లు అతనికి పడవు - నీకు చెట్ల గురించి బాగా చెప్పగలడు - పూర్వ జన్మలో తానొక చెట్టులాగానే ఉన్నాడేమో?

పొరపాటున మనిషిగా పుట్టాడు - లేదా సరదాగా! ఒకసారి ఆలోచించి - ఎక్కడో హరిహరపురంలో పుట్టిన రామా - ఇక్కడ ఫ్రాన్స్‌లో - పారో (Parosse) సెయింట్ మిదార్డ్ (St. Medard) వచ్చి ఫ్రెంచి అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు.

'రామా చెప్తుంటాడు - మైసూరు పల్లెటూరు అమ్మాయి ఇంద్రధనస్సు చూసి అదిగో - చూడు హరివిల్లు - ఎక్కడో - కుక్క - నక్క - పెళ్ళి జరుగుతోంది అంటుందని! అవును - 'రోన్'లో అదే జరిగినట్లుంది!

మెదలీనా చాలాసార్లు ఇలానే మాట్లాడుతుంది - పదేపదే చెబితే అసత్యం - సత్యంగా మారిపోతుందనే ఆశతో - ఆ తర్వాత తన పొత్తికడుపు మీద చేయివేసి సవరించుకుంటుంది - అంతకంటే మరో సత్యం తనలోనే ఉందని! అది చూసినప్పుడు నాకు విశ్వాసం మరింతగా దృఢపడుతుంది. మగవాడు పుడతాడు - మరణిస్తాడు - కానీ స్త్రీ జన్మ - మరో జన్మనివ్వడానికే అనేది సత్యం-

జీవితం, రైలు పట్టాలు - అలా వెళ్తూనే ఉంటాయి - ఎక్కడో ఒక ప్రక్కన చేరి ఆగిపోతాయి - మళ్ళీ గంట మోగితే మళ్ళీ సాగిపోతాయి - సైప్రెస్ చెట్లు - చెరువులు దాటుకుంటూ - St. PuJol, St. Trophime దాటి సెయింట్ మెదలీనా చేరతాయి. అక్కడే Tarscon ఉంటుంది. అది తెలిసినవాళ్లకి రోన్ నది మార్సే రేవు తెలుసు.

మార్సే రేవు చాలా పెద్దది - పెద్ద నౌకలు ప్రపంచ నలుమూలల నుంచి వస్తాయి - ఇండియా నుంచి కూడా - ఎందరో పౌరులు వస్తుంటారు - ఇక్కడ నుంచి పారిస్ - లండన్ రైళ్లలో వెళ్తారు. నేను కూడా లండన్ బ్రిటిష్ మ్యూజియంలో పనిచేయటానికి వెళుతుంటాను. ఈ విషయం సావిత్రికి చెప్పలేదు - మెదలీనాకి తెలుసు- సావిత్రికి తనేమిటో తెలుసు - అలాగే నేను కూడా - సావిత్రికి లండన్ ఒక నగరం కాదు - అదేదో ఒక బిందువు - తనలోనే లండన్ ట్రాఫిక్ సిగ్నల్ లైట్‌లాగా - ఒక్కసారిగా ఎర్రగా వెలుగుతుంది - కుంకుమలాగా - అదే బెంగాలీ అమ్మాయి నుదుటి మీద పెద్ద కుంకుమ బొట్టు! తర్వాత ఆకుపచ్చగా మారి లండన్ కనబడుతోంది-

ఈ రైళ్ళు వింత శబ్దం చేస్తాయి - రోడ్డుప్రక్క గుర్తులు ఎంతో వింతగా ఉన్నాయో - చాలా ప్రాథమికంగా! మాకు ఇండియాలో రోడ్ సైన్స్ లేవు - అప్పటికే గారే (gare St. Charles) స్టేషన్‌కు వచ్చాం- రైలు మెల్లగా - మెత్తగా వచ్చింది. తనకు ఇదేమీ కొత్త కాదన్నట్లు - సావిత్రి రైలు బాగానే ఎక్కింది - నాకు కొద్దిగా ఆందోళన కలిగింది. నీవు చేరగానే టెలిగ్రామ్ ఇవ్వు అన్నాను.

'అరె - మా నాన్నలాగా చెప్తున్నావు' అని ఆశ్చర్యపోయింది.

ఆమెకు 'భోజనం' టిక్కెట్టు కొని ఇచ్చాను - ఆమెకు వీడ్కోలు చెప్పి చేయి ఊపాను. మెదలీనాకి సావిత్రితో పరిచయం ఆనందాన్ని - ఆమె వీడ్కోలు విచారాన్ని కలిగించాయి.

'రామా - మూడు వేల సంవత్సరాల నాగరికత - ఇలాంటి స్త్రీని తయారు చేస్తుంది!' అంది.

'అవును నాలాంటి వాడికి - 5,000 సంవత్సరాలు!' ఉపనిషత్ ద్వారా సత్యాన్ని గుర్తు చేసుకుంటూ - నా తాతముత్తాతలు ఆ ఋషులను చూసి - వారి పవిత్ర భూమిని వారసత్వంగా పొందినట్లు! నా విచారం - మేధోపరమైన అయోమయం - దానికి ఈ వారసత్వపు ముసుగు కావాలి.

సాయంత్రం జార్జి రాకపోతే ఏమి చేస్తాను - ఇప్పుడు జార్జి దగ్గర - మెదలీనా దగ్గర - లాటిన్ - కాథలిక్ - క్రిస్టియానిటీ నేర్చుకుంటున్నాను - పనిలోనే పవిత్రత ఉంది - అది ప్రేమను ప్రేమ నుంచి దాస్తుంది -

అత్తి ఆకు - ఇది కదా - మొట్టమొదటి నాగరికత చిహ్నం! మెదలీనా చాలా సంతోషంగా ఉంది! పాట పాడుతుంది-

ఇప్పుడు నేను కారు డ్రైవ్ చేస్తాను అంది.

ఆమె స్టీరింగ్ తిప్పుతుంటే - పాట పాడుతూ చాలా సంతోషంగా ఉంది. గుర్రాలు - తమ ప్రియమైన యజమాని వచ్చినప్పుడు ఎంతో సంతోషంగా ఉంటాయి! ఇక నాలోకి - నా లోకంలోకి వెళ్లిపోయాను. అదిగో - అక్కడే - నాకు శాంతి - విశ్రాంతి! మెదలీనా - శాంతి ఎక్కడో లేదు - భార్య 80 కిలోమీటర్ల వేగంతో కారు నడుపుతుంటే - ప్రక్కన నా అగాథంలోకి వెళ్ళిపోతూ - నా నాసికాగ్రాన్ని చూస్తూ ఉండటమే - శాంతి!

'నీ ముక్కు మీద తేనె పోస్తాను - ఏదో ఒకరోజు - అంటూ నన్ను ముద్దు పెట్టుకుంది - నా ఘ్రాణేంద్రియాన్ని ముద్దు పెట్టుకుంది - తన ప్రేమను ప్రదర్శించడానికి-

పంతొమ్మిదేళ్లకు ప్రేమ ఒక భ్రమ - ఇరవైదేళ్ళకు సంతోషం - అంతే - పెళ్ళి ఒక బంధం - ఆ బంధంతో కలిసి ఉంటాం - కారు ఎవరైనా నడపవచ్చు.

అతిథుల కోసం కేకులు కొనవచ్చు - నేను కారులో ఒక్కడినే కూర్చున్నాను - మున్సిపల్ బంగళా దాటుతుండగా సైప్రెస్ చెట్లు లెక్క పెట్టాను - అవి 23 ఉన్నాయి

నా డైరీ నుంచి కొన్ని సంగతులు మీకు చెప్పాలి-

October-17: మొన్న కేథరిన్ వచ్చింది. ఆమెను జార్జి కౌగిలిలోకి - లోగిలిలోకి పంపాలనే ప్రయత్నం ఎంతవరకు సబబు?

ఆమె సిగ్గరి, కానీ మగవాళ్ళని లా పుస్తకం చూసినట్లు చూస్తుంది. అంటే అవసరమైనప్పుడు 'రిఫరెన్స్' కోసం అలాగే ఆధారం కోసం! ఆమె లాయర్ చదివిందని కాదు - కానీ ఒక స్థిరత్వం ఆశించి అనవచ్చు.

మనందరికీ ఒక స్థిరత్వం కావాలనే అనుకుంటా - ముఖ్యంగా మధ్యతరగతి మనుషులం.

మానవజాతి ఎక్కువశాతం - ధార్మికులు - ఎందుకంటే - ఈ ప్రభుత్వ కార్యాలయాలు - దేశాన్ని నగరానికి ఎంతో అవసరం అనుకుంటాం.

లేకపోతే ఆడవాళ్లకు పెళ్లి ఎలా అవుతుంది - పిల్లలు ఎలా పుడతారు? మగవాడు వ్యాపారం ఎలా పెడతాడు - పడుపు వృత్తికి లైసెన్స్ ఎలా దొరుకుతుంది?

జనన మరణాలకు చట్టం కావాలి - అది చిన్నది కానివ్వండి - పెద్ద చట్టం కానివ్వండి - అది జనన మరణాలకు అతీతంగా కూడా ఉంటుంది.

అన్ని నియమాలు స్వతంత్రం కోసమే. ధర్మాన్ని పాటిస్తే స్వేచ్ఛగా బ్రతకవచ్చన్నమాట!

అందుకే పోలీసులు - సైనికులు మహా స్వేచ్ఛను అనుభవిస్తారు. మధ్యతరగతి వారికి - ధర్మమే 'గతి' - గృహమే స్వర్గం!

ధర్మపాలనే పౌరసత్వం - ఈ ధర్మపాలకుడు - పుణ్యాన్ని మూట కడతాడు - రేపటి స్వర్గం కోసం! మరో జన్మ కోసం - మరో లోకం కోసం అతని పుణ్యాన్ని 'కూడ'బెడతాడు.

ఒకసారి మెదలీనా తను విన్నది చెప్పింది. ఆమె స్నేహితురాలి పిన్ని - చర్చి ఫాదర్‌ని అడిగింది-

"ఫాదర్ - స్వర్గంలో ఇంగ్లీషు వాళ్ళుంటారా?"

"ఉంటారమ్మా-" అయితే ఆ స్వర్గం నాకు వద్దు - వాళ్లకి నీతి ఉండదు - ఫాదర్ - నా తర్వాత నా మనుమరాలు స్వర్గానికి వస్తుందా?" 'ఆఁ... వస్తుందమ్మా" "నా మనుమరాలు - వంకాయ వేపుడు చాలా రుచిగా చేస్తుంది!" ఆ తర్వాత ఫాదర్ ప్రార్థన చేసుకుంటూ వెళ్లిపోయాడు!

October-23: నేను అలసిపోయాను. మా జాతి నీరసించి పోయింది. ఇప్పటికే నాలుగైదు వేల సంవత్సరాల నుంచీ ఇలా కఠినమైన - అల్పాహారంతో - కదలిక లేని జీవితంతో అలసి ఆగిపోయాను-

ఇవాళ జ్ఞానేంద్రియాలు వాటి సహజ గుణాలను కోల్పోయాయి. ఏదైనా అర్థం కావాలంటే మరో మార్గం వెతకాల్సి వస్తోంది. ఇదంతా సాటి మనిషిని వదిలి - దేవుళ్లతో మాట్లాడటంతో వచ్చిన చిక్కు. గులక రాళ్ళను పోగు చేశాం - స్తంభాలను కట్టకుండా. అదే గులకరాళ్ళ మీద నీళ్లులాగా - ఆలోచనలు జారిపోతున్నాయి.

ఇవాళ్టికీ - బ్రాహ్మణులు - ఇంజనీర్లు - డాక్టర్లు - మిలటరీ ఆఫీసర్లు అవుతున్నారు. కానీ ఇదంతా - మా మండువా ఇంటి చెక్క స్తంభాలు - చెద తినేసిన మొదళ్ళతో వెళ్ళాడుతున్నట్టు - తలలు మాత్రం - కేవలం విశ్వాసంతో గాలిలో నిలబడినట్లుంది.

ఆధునిక జీవన పోరాటం - నాగరికత, ఈ పోరాటం మొదలు కాక ముందే ఓడిపోయాం -

జ్ఞానం ఉంది - కానీ కాలు కదిపే ఓపిక నశించిపోయింది - ఇవాళ భూమ్మీద చేతకాని దద్దమ్మల్లా మిగిలిపోయాం-

October-26: ఆడదాని స్త్రీత్వం ప్రేమతో కనబడదు - అదంతా మెలోడ్రామా - కానీ ఆడ-మగ పెనవేసుకునేది వంశ పరంపర కోసమే. చూడండి - తల్లి ఏనుగు గున్న ఏనుగును - తన సంతానం కాకపోయినా - ఎలా కాపాడుకుంటుందో - తొండం ఎత్తి ఘీంకారం చేస్తోంది - పులుల్ని సైతం తరిమేస్తుంది. ఎందుకు - అమ్మతనానికి చిరునామా అవసరం లేదు. ఇవన్నీ మెదలినాకు తెలుసు - అందుకే కేథరిన్‌ని జార్జివైపు నడుపుతుంది. ఆమె స్థిరత్వం కోసం - జార్జికి కేథరిన్ అవసరం ఎంతో ఉందని మెదలీనా సూచిస్తుంది. వాళ్ళిద్దరూ కలవకపోతే నాగరికత ముందుకు సాగదని - నాగరికత భౌతికమైనది - సంస్కృతి మేథోపరమైనది - నాగరికతకు జనాభా కావాలి - జనాభాతోనే నాగరికత అభివృద్ధి చెందుతుంది - అమెరికాలో భౌతిక జీవనమే ముఖ్యం - అక్కడ మరణాలు శ్మశానాలలో కాదు - అందుకు అందమైన భవనాలుంటాయి - ప్రేమికులకు సుఖమైన పరుపులుంటాయి - ఈ విషయంలో మగవాడు ఈ భూమ్మీద అపరిచితుడే! అతను నిష్క్రమించాలి.

October-29: ఇవాళ సెయింట్ ఓఫిలీవైపు వెళ్లి సాయంత్రపు వ్యాహ్యాళికి - మెదలీనా కావాలనే - కేథరిన్‌ని - జార్జిని వదిలి నన్ను తీసుకొని వేరే దారిలో నడిచింది. సాయంత్రం చీకటిలోకి మారింది - కొండ కింద నుంచి మా ఇల్లు ఎంత అందంగా ఉందో - చూపిస్తోంది నాకు. నా బుగ్గ మీద వెచ్చటి ముద్దు పెట్టింది - చంద్రకళ ఆమె బుగ్గలు మీదగా జారిపోతోంది-

అంతలో కేథరిన్ కేకలు వినిపించాయి- "ష్.... కామ్‌గా ఉండు - శబ్దం చేయకు" అని నా నోరు మూసింది.

త్వరలోనే చీకటి పడుతోంది - జార్జికి రేచీకటి - ఒక చేయి అవిటి - పాపం! కేథరిన్ మీద ఆధారపడి మమ్మల్ని వెతుక్కుంటూ రావాలి-

ఆ రాత్రి భోజనాలు - జార్జి కూడా ఉన్నాడు - అన్నం కూరలు చేశాం - మాటల్లో కేథరిన్ వెళ్ళిపోతుంది - అని జార్జిని హెచ్చించింది మెదలీనా-

జార్జి - దైవత్వం కలవాడు - అతని ఆలోచనలన్ని దేవుని గురించే - కేతరిన్ అచ్చంగా భూమి! జార్జి స్వర్గానికి కేథరిన్ ఓ బంగారు నిచ్చెన వేయాలి!

నాకేదో జరుగుతోంది - రోజు రోజుకు నిరాశ పెరుగుతోంది - ఏదో తెలియని కోపం - తెలియని వ్యక్తి మీద ముంచుకొస్తోంది - ఇది ముళ్ళ పొదలాగా పెరిగిపోతోంది - ఇంకా పెద్ద స్థలం కావాలి!

హైమావతీ నది ప్రక్క పచ్చటి పొలాలున్నాయి - వడ్లు - కూరగాయలు - దోసకాయలు పండుతాయి.

చుట్టూ కొబ్బరిచెట్లుంటాయి. ప్రక్కనే కాలవగట్టు - రామన్న తాత - ప్రతి మధ్యాహ్నం - ఉపనిషత్తులు చెప్పేవాడు - ప్రతి మధ్యాహ్నం వినటానికి చాలామంది వచ్చేవారు.

అవును - 'మాయ' - అది గొడ్రాలి బిడ్డలాంటిది. కుందేటి కొమ్ములాంటిది - చుట్టూ వితంతువులు - బోడిగుళ్ళతో వినేవారు - అంటే - 'రామనోర్' అన్న మాట! నేను భట్టునిగా ఉండవలసింది - ముండకోపనిషత్తు గౌడపాదుని కారికతోపాటు పఠించవలసిందే. శంకరాచార్యుని వ్యాఖ్యానం చెప్పవలసింది. రామాయణంలోని ఉత్తరకాండ చదవాల్సింది. ముఖ్యంగా చుట్టూ ఉన్న గ్రామస్థుల కోసం. నా రాగి చెంబు తీసుకొని, చిన్ని గంటితో 'ఉదకం సమర్పయామి' అని మాత్రం చెప్పాల్సింది. దినాలకు, తద్దినాలకి వెళ్లి మంత్రాలు చదవాల్సింది. భుజాల మీద ఉత్తరీయం వేసుకుని తమలపాకులు నములుతూ, వెండి నాణేలు దక్షిణ తీసుకోవడం -

మర్చిపోకూడదు - అవి బొడ్డులో దోపుకొని - విసనకర్రతో విసురుకుంటూ - ఉసురుంటూ - ఇంటికి చేరి కౌముది - రుక్మిణి నా కాళ్లు నొక్కుతుంటే విశ్రాంతి తీసుకోవాల్సింది - 'ఎంత చల్లగా ఉంది గాలి' అని అంటుండాలి.

అలా దొర నిద్రపోతాడు - గొడ్లు నీళ్ళకు వస్తాయి - గ్రామస్తులు ముహూర్తాలకు వస్తారు - ఇవాళ ఒక రూపాయి ఎనిమిదణాలు ఇచ్చారు - నంజుండయ్య ఎనిమిది స్తంభాల ఇంటిలో నిద్రపోతున్నాడు - తిమ్మడు కూరలు - దోసలు తెచ్చాడు - అమ్మా - తిమ్మడు రేపు వస్తాడని చెప్పమ్మా - రేపు కొత్త పడవ నదిలో వదిలిపెట్టాలి' అంటాడు.

రుక్మిణి - కౌముది లేవగానే వెచ్చటి కాఫీ ఇస్తారు. సంధ్యావందనం కాగానే సాయంత్రం వ్యాహ్యాళికి వెళ్ళాలి - తమలపాకు నములుతూ - పందిట్లో అంట్లు తోముతున్నారు. 'అరే - ఇప్పుడే వెచ్చని పాలు తాగితే ఎంత బాగుంటుంది - రుక్మిణి అందమైన శరీరం నుంచి సుగంధం వస్తుంది - పక్షులు గూటికి చేరుతున్నాయి!

'వద్దు - నాకీ బ్రాహ్మణీకం వద్దు - ఈ తద్దినపు కూడు తినలేను - నా బట్టలు చింపుకొని - హిమాలయాలకు వెళ్లిపోవాలి - స్థిరంగా ఏదో పిలుపు వినపడుతుంది - 'అమ్మ - నేను వెళ్ళిపోతాను'-

November-1: 'ఏయ్ - నాలో నేను మాట్లాడుకోవడం ఆపివేయాలి-'

November-3: ఈ సాయంత్రాలు జార్జిని కేథరిన్ దగ్గర చేశాయి. జార్జి మరీ అంత అమాయకుడేమీ కాదు. అతని పాత్ర బాగానే పోషిస్తున్నాడు - 'మీరు పదండి - మేము మెల్లగా వస్తాం' అన్నాడు. అతను సంతోషంగానే ఉన్నాడు. కేథరిన్‌కి తన కన్యత్వం బాగా తెలుసు - తల్లి కావటానికి సిద్ధంగానే ఉంది-

వాళ్ళిద్దరూ దగ్గరవటం మేము రోజు గమనిస్తూనే ఉన్నాం-

మెదలీనా కేథరిన్ పెదవులని గమనించటం చూశాను - ఒకవేళ జార్జి మోటుగా కొరికాడేమో! ఇది నాకొకటి - గుర్తు చేస్తోంది - హిజ్రాలు - నవాబుల ఇళ్లల్లో కొత్తగా పెళ్ళైన దంపతుల పక్క దుప్పట్లు - పరీక్షగా చూసి ఇంటి పెద్దమ్మలకు చెప్పాలి - రాత్రి - అంతా సవ్యంగానే జరిగింది అని! జార్జి - కేథరిన్ చేయి పట్టుకోవడం - మాకు దూరంగా ఉంటూ నడవడం - గమనిస్తూనే ఉన్నాం- అలాంటి ఒక సాయంత్రం - కేథరిన్ చాలా విచారంగా కనిపించింది - కావాలనే ఆమెకు దగ్గరగా నడవసాగాను - ఆమె విచారాన్ని గమనించి - కేథరిన్‌తో హాస్యంగా మాట్లాడాను - ఆడవాళ్లకు హాస్యం నమ్మకాన్ని కలిగిస్తుంది - 'నువ్వు నాకు చెల్లెలులాంటి దానివి - నీ మనసులో మాట చెప్పడానికి వెనకాడవలసిన పని లేదు' అంటూ నమ్మకంగా

చెప్పాను. అప్పుడు కేథరిన్ తన మనస్సు విప్పింది - 'అవును అన్నా! నేను సంతోషంగా ఉండాలి - కానీ ఏదో తెలియని బాధ, బాధ పెడుతోంది - లోలోతుల నుంచి ఉబికి వచ్చి ఇబ్బంది పెడుతోంది - బిగ్గరగా మనసారా ఏడ్వాలని ఉంది - అది ఏమిటో తెలియక తికమక పడుతున్నాను.''

''చూడు చెల్లి - టీనేజ్ నుంచి స్త్రీత్వం సంతరించుకుంటున్నప్పుడు నీలో విశ్వమంతా తిరుగుబాటు చేస్తుంది - ఏదో రాజ్యాన్ని కోల్పోతున్నట్లు - స్వతంత్రాన్ని చేజార్చుకుంటున్నట్లు - ఆందోళన చెలరేగుతుంది - చూడు శీతాకాలం ముగిసే సమయంలో - మంచు గడ్డలు కరిగిపోతూ ఉంటాయి - వసంతం పూలు పూస్తుంది - అలాగే నువ్వు ఆందోళన చెందవలసిన అవసరం లేదు - అన్నలాంటివాడిని - అండగా నేను ఉన్నాను కదా!'' అని అనునయించాను. మేము మెల్లగా నడుస్తున్నాము - తెలుసుకోవటం బాధాకరం - కలలు కనడం ఆనందదాయకం! మేము వంటింటి గుమ్మం నుంచి ఒక్కసారిగా వెళ్లి మెదలీనాను భయ పెడదామనుకున్నాం - కానీ జార్జి - మెదలీనా పుస్తకాలు ముందేసుకుని ఏదో చర్చలో మునిగిపోయి ఉన్నారు-

''నేను కేథరిన్‌కి రాఖీ కట్టాను' అన్నాను. 'అంటే ఏమిటి' అని అడిగాడు జార్జి.

రాణి పద్మావతి - చక్రవర్తి అక్బర్‌కి పసుపు పచ్చని పట్టుదారం ముంజేతికి కడుతుంది - అంటే చక్రవర్తి అక్బర్ - పద్మావతికి సోదరునిగా భావిస్తోంది - అని! 'ఎంత మంచి కథ!' అన్నాడు జార్జి.

మెదలీనా 'ఇండియా'లో ఇలాంటి కథలకు ఏమీ కొదవలేదు-

నేను నా గదిలోకి వెళ్ళి సరోజ ఇచ్చిన రాఖీ వెతికి తీసుకువచ్చి కేథరిన్ చేతికి కట్టాలని అనుకున్నాను - నేను వచ్చేలోపు - జార్జి - కేథరిన్ ముద్దుపెట్టుకుంటూ కనిపించారు - మెదలీనా - నేను, దీపాలు చూస్తుండగానే. ఇదిగో - కేథరిన్ నీ కానుక - అని రాఖీ చేతికి కట్టాను - జార్జి - రామా - మరొకటి ఉందా - అని అడిగాడు. లేదు - అన్నాను. అంతలో మెదలీనా ఉల్లిపాయల కత్తి పట్టుకుని వంటింట్లోంచి వచ్చింది - జార్జి, కేథరీన్ చేతి నుంచి రాఖీ తీసి మెదలీనాకి కట్టాడు. అంతే - మేమంతా నవ్వుల్లో మునిగిపోయాం - అలా నవ్వుతూ చాలాసేపు గడిపాం - చిన్నపిల్లల్లా - జార్జ్ అందరికీ గుడ్‌నైట్ చెప్పి - ఏదో పుస్తకం తీసుకుని మెట్లు దిగి వెళ్ళిపోయాడు -

కేథరిన్ వచ్చి 'గుడ్‌నైట్ సోదరా - నన్ను రక్షించేవాడా' అని నాటకీయంగా చెప్పింది.

అలా మంచం మీద పడుకుని మెదిలినా కోసం ఎదురు చూస్తున్నాను - ఈ పుస్తకం - ఆ పుస్తకం తెరచి మూస్తున్నాను - మెదలీనా తన బంగారు కురులు

వదులుగా వదిలివేసి - నేను లండన్ నుంచి తెచ్చిన కాశ్మీర్ సిల్క్ నైటీ వేసుకొని వచ్చింది. ఆమె శరీరం కదలికలన్నీ దేనినో శాసిస్తున్నట్లున్నాయి - ప్రక్కమీదకు చేరి ఎంతో ఆర్తితో నన్ను తన మీదకు చేర్చుకుంది - తనలోనికి ఆహ్వానించింది!

November-4: మెదలీనాను ఎంతగా ప్రేమిస్తున్నాను? ఓ కొత్త ప్రపంచంలో - ఆమెను అణువణువు ప్రేమిస్తున్నాను - ఆమె మెడ వంపును - పాలరాతి తెలుపు - వెన్నెలతో ఆకాశంలోకి మారుతున్నట్లు - నా దగ్గరగా తీసుకున్నప్పుడు - ఆమె శరీరంలో నుంచి వచ్చే మదపు వాసనను ప్రేమించాను-

స్త్రీ శరీరం మంచిగంధపు కాండంలాంటిది - ఆమె చుట్టూ సుగంధపు మూలికలు లతలు అల్లుకుంటాయి - తూనీగలు తేనెటీగలు కమ్ముకుంటాయి - దగ్గరలో పులి తన తోడు కోసం మంద్రంగా గాండ్రిస్తోంది - చెంతనే పులి పిల్లలు ఆడుకుంటాయి - ముందు తలమీద - తరువాత మెడమీద, వీపు మీద జిహ్వ జారుతుంది - అంతలోనే ఆమె స్తనాలు అందుకుంటాను!

ఆమె నాభి వింత పులకరింపుతో వణికిపోతుంది - అక్కడే కాస్సేపు ఆగి నీలో నీవు తీయని శబ్దాలు చేస్తుంటావు - ఆమెలో ఏమి జరుగుతుందో నీకు తెలిసి ఆశ్చర్యపోతావు - ఆ వింత - సూర్యకిరణాలు వెదజల్లుతుంది - చంద్రకళలు వెలిగిస్తుంది - ప్రపంచంలో జరిగేదంతా నీకు తెలుస్తుంది - అరటికాయ పండుగా మారటం - కొబ్బరికాయ చెట్టు నుంచి సారవంతమైన నేల మీద పడుతుంది - నదులు నిండుగా పరుగులు పెడుతుంటాయి - పారిజాతం పరిమళాలను వెదజల్లుతుంది - గాలి వీస్తుంటే ఆకులు కదులుతుంటాయి - అలలు లేస్తుంటాయి - అదే సముద్రం అన్నట్లు - పర్వతాలు కదులుతుంటాయి - అంతలో నీలో నీవు స్థిరపడతావు - మళ్ళీ వినపడుతుంది - మెదలీనా తన పిరుదుల కదలికతో, ఆమెను ఆఘ్రాణించాలి - ఓ - నా వాసనే వస్తుంది - నేనే ఉన్నాను - ఆమె మైమరపు గొణుగుడు - రెప్పలు వాలిపోతుంటాయి - నన్ను పూర్తిగా తనలోకి తీసుకుంది - ఆమె అలగా - సముద్రంగా - భూమిగా - అంతటా పరుచుకుంది. మెదలీనా అని పిలవాలి - కానీ 'రామా' అని వినవస్తోంది - ఆమె పెదవులు నావే - ఆమె శరీరం అంతా నాదే - వింతగా మూలిగింది - అడవిలో జింకలా! నన్ను పిలుస్తోంది - నేను ఎంతో దూరంలో ఉన్నట్లు - ఏడుస్తోంది - ప్రియా ఇక్కడే ఉన్నాను - ఇవిగో ఈ నీటి ధారలు తాగుతున్నాను - సాయంత్రం అవుతోంది - ఇంకా పులులు గుహలో నుంచి రాలేదు - నేను పూర్తిగా నిండిపోయాను - ఒంటరిగా ఉండిపోయాను - ఈ పగలు నాదే - నీటి ధారలు నావే - ఆకాశంలోకి ఎగిరి పోతున్నాను - ఆకుల శబ్దం నేనే - నన్ను నీలోకి తీసుకో - కాశ్మీరు పట్టులో చుట్టి కౌగిలించుకో - ఆమెను

అక్కడి నుంచి మరో ప్రపంచంలోనికి తీసుకుపోతాను - ఇక అక్కడ నుంచి నిష్క్రమణ ఉండదు - టిబెట్టు టనకలా - క్రింద సైప్రెస్ చెట్లు - చంద్రకళలు - ప్రవాహాలు - అదిగో - డ్రాగన్ సింహాసనం -

ఇదిగో - దీనిమీద కూర్చో - లామా - అతన్ని జరీ బట్టతో కప్పు - గుమ్మంలో నగరా మ్రోగించు - ఆ శబ్ద తరంగాలు - ఒకటొకటి మార్మోగుతాయి - పర్వతాలు - లోయలు - ప్రతిధ్వనితో నిండిపోతాయి - లాసావరకు వినిపిస్తుంది - అక్కడే పునర్భవం చెందుతుంది - 'లామా'కు కిరీటం పెడతారు - 'పోటాలా' (Potala)లో కూర్చోబెడతారు - అప్పుడే ఖజానాలన్నీ తెరుస్తారు - కిటికీలు కూడా. శ్వేతాశ్వం పూర్తి అవయవాలతో సిద్ధంగా ఉంది - వేసవి విడిదికి కావలసిన హంగులన్నీ ఉన్నాయి. ఇక్కడ అంతా పరిమళభరితంగా ఉంది - పచ్చని గడ్డి - సంగీతం ఎక్కడి నుంచి - ఎప్పటి నుంచో వినపడుతోంది - చెవుల మధ్య కదా కళ్లుంది! బహుమతులు వస్తుంటాయి - అందుకుంటావు కూడా -

పాలిండ్ల మధ్య హృదయాన్ని తడుముతావు - ఆమె వెచ్చని సముద్ర తీరంలా - నీవు ఆక్రమించుకుంటావు - ఈ రాత్రి ముగిసింది - ఇంకా తెలవారలేదు - పవిత్ర స్నానాలకు సమయం ఇదే - మంత్రోచ్ఛారణతో గుడికి వెళ్ళే దారి - చెరువు గట్టునే - నీకు దేవుడు పరిచయమే - అతనికీ నీవు తెలుసు -

అతని ఆభరణాలన్నీ మెరుస్తున్నాయి - రాత్రి నుంచి వచ్చినట్టు ఒక్క క్షణం ఈ శరీరాన్ని వదిలి ఎటు వెళ్ళినట్లు - అయ్యో - మళ్ళీ తిరిగి రావటం ఎంత విచారకరం - ఇంతటి భారాన్ని ఒంటరిగా మోయటం ఎంత బాధ!

పది రోజులుగా మెదలీనాని చాలా బాధపెట్టాను - రోజూ రాత్రి తానే వచ్చేది - ఎందుకంటే - ఆడదానికి మగవాడు ఓడిపోవటం ఇష్టం ఉండదు - ఆడవాళ్ళంతా ప్రేమకు దాసులే - స్త్రీ ప్రేమికుని సానియే కదా! ఎంతటి దొరసాని అయినా దొరకు సానియే కదా! అప్పుడే మా తాత సంగతి చెప్పాను - మా చిన్నప్పుడు - సీతారామయ్య మామ - లక్ష్మీ అత్తను - ఎంతలా విసిగించాడో - గదిలోకి వెళ్ళి - వేళాపాళా లేదు - లక్ష్మీ అని పిలిచేవాడు - అంతే - ఆమె గదిలోకి వెళ్ళేది - తలుపు మూత పడేది - ఆమె బైటకు వచ్చినప్పుడు - మేమంతా చూసేవాళ్ళం - ఏం జరిగిందో మాకు తెలుసు - సీతారామయ్య మామకు పదిమంది సంతానం - ఎనిమిదిమంది బ్రతికే ఉన్నారు-

'రామా - నేను 11 మందిని కనిపెడతాను' అని మెదలీనా పెనవేసుకుంది-

November-6: మధ్యాహ్నం రెండయ్యింది - మెదలీనా జుట్టు సవరించుకుంది - స్నానాల గదిలోకి వెళ్లి - 'Au revoir, Rama' అంది.

November-7: జార్జి రాకుంటే బాగుండును - అసలు వాడు లేకుంటే బాగుండును - మాకు అన్నింటికీ అడ్డం వస్తున్నాడు - గదిలోకి వెళ్లి మెదలీనాని పిలిచాను - అంతే - వచ్చి ఒక్కసారి కలియ చూసింది - 'రా' అని తనలోకి తీసుకుంది - ఆ రాత్రి ఏమి జరిగిందో - అర్థరాత్రి మెదలీనా నన్ను పూర్తిగా ఆక్రమించింది - తర్వాత నేను ఎండిన నదిలా అయిపోయాను - ఎండ మాడుస్తోంది - రాళ్లు మండిపోతున్నాయి - జంతువులన్నీ నాలుకలు బైటకు పెట్టి ఒగరుస్తున్నాయి - వేపాకులు కదలకుండా గాలి ఆగిపోయింది - అక్కడక్కడ కాకి - కావ్‌మంటోంది -

మర్నాడు ఉదయం మెదలీనాకి నేను కాఫీ చేయలేదు - ఆమె లేచి సిగ్గుపడుతూ వంటింట్లోకి వెళ్ళింది - మళ్ళీ ఆమె వచ్చేసరికి నేను నిద్ర నటించాను.

ఈ ఇసుక తుఫానులు ఆపివేయాలి-

November-9: ఈ రాత్రి మెదలీనా నా మీదకు వచ్చింది - ఆమెకు తెలుసు - నేను ఆమె కోసం వెళ్లనని - మగవాడు ఓడిపోవడం ఆడది ఏ మాత్రమూ సహించలేదు - ఇవాళ చాలా దూరం వెళ్ళాం.

November-10: ఇవ్వాళ మెదలీనా తన పరిమళంతో నన్ను చుట్టివేసింది. ఆమెను ఎంతగానో ఇబ్బంది పెట్టాను - పూర్తిగా నలిపివేశాను - ఇక ఇది సాగదు.

మదపుటేనుగు హరితవనాన్ని నాశనం చేస్తోంది - త్వరలోనే వర్షం వస్తుంది.

నేను లండన్ వెళ్ళిపోవాలి.

November-15: రామా - కేథరిన్ - జార్జి విషయం చాలా దూరం వెళుతోంది - పౌడరు - లిప్‌స్టిక్ దాటింది - అంది, మెదలీనా. 'మగవాళ్ళకి ఎప్పటికీ అర్థం కాదు' నువ్వే కదా శంకరుని గురించి చెప్పావు - ఉదయ భారతి చేతిలో ఆయన ఓడిపోయి - తన శరీరాన్ని నర్మదా నది ప్రక్కన చెట్టు తొర్రలో వదిలి - చనిపోయిన రాజు కళేబరాన్ని ఆశ్రయించాడు - రాజు నలుగురు భార్యలతో రాసలీలలు సాగించి తన అనుభవాలను - అద్భుతంగా, పవిత్ర రూపంలో శ్లోకాలుగా చెప్పాడని - అంతటి గొప్ప కవి ఇంతవరకూ లేడని అన్నావు కదా!

'అవును - ఆయన ఆదిశంకరుడు కదా! అయినప్పటికీ నేను నిన్ను ఓడించగలను' అన్నాను.

'అలాగా - అయితే రాణివాసం ఎదురు చూస్తూ ఉంటుంది'

ఈ మాటలు మెదలీనా అన్నట్లు లేదు!

November-17: బాడిలేర్ పద్యాలు

November-౨౦: బాడిలేర్ పద్యాలే రాశాను! ఇలా ఎన్ని తారీఖులైనా చెప్పుకుంటూ పోగలను, కాని ఇక్కడితో ఆపుతా - నేను ఆ నెల చివర్లో ఇంగ్లాండ్ వెళ్ళిపోయాను - మెదలీనా అంతగా విచారించినట్లు లేదు.

మూడవ అధ్యాయం:

సావిత్రి

సావిత్రిని కేంబ్రిడ్జ్ గిర్టన్ కాలేజీలో దింపి అదే టాక్సీలో లయన్ హోటల్‌కి వచ్చి నా కోసం సిద్ధం చేసిన గదిలో చేరాను. అది ముక్కోణపు ఆకారంలో ఉంది. మంచం ప్రక్కన బల్ల మీద ఉన్న బైబిల్, పైన ఉన్న సిలువ, నేనెప్పుడూ యాత్రికుడనేనని గుర్తు చేస్తున్నాయి.

నిఘా రాత్రి - త్వరలోనే తెల్లవారింది. గ్రంథాలయానికి చేరి, కాస్త కష్టంగానే ఒక సభ్యత్వం సంపాదించి, నా పని మొదలు పెట్టాను.

గ్రంథాలయాలు ఎప్పుడూ నాతో సంభాషిస్తాయి. అవన్నీ నన్ను నేను తెలుసుకోవడానికి ఎంతో ఉపయోగపడతాయి. గంభీరంగా, విశాలంగా, బహుళార్థకమైన విజ్ఞానంతో నిండిన పుస్తకాలు నిండుగా ఉంటాయి. పుస్తకాలన్నీ ఆత్మకథలే. అవి, జెనిటిక్స్ అయినా, 22 దస్త్రాలు, ఆంగ్లికన్ చర్చి చరిత్ర అయినా, మోటారు కారు మెకానిజమయినా, పశు వైద్య శాస్త్ర గ్రంథమయినా అన్నీ ప్రాథమికంగా ఆయా గ్రంథకర్త జీవితానుభవసారమే. అతని నిద్రలేని రాత్రులు - బహుశా అతని భార్యా-బిడ్డల సేవలు కూడా ఉంటాయి. అన్నీ అతని సంవేదనల సారమే! పరీక్షగా చదివితే రచయిత సంపూర్ణ జీవితాన్ని అర్థం చేసుకోవచ్చు. రచయిత శైలి, అతను పదాల అల్లిక, వాక్య నిర్మాణం, శబ్దార్థాల ధ్వని, ఒక కామా, ఒక డాష్ - ఇవన్నీ అతని లోలోతుల ప్రాణాయామ నిర్ణయాలే. అతని ఆలోచనా ధోరణి - అతని మానసిక ఉద్రేకాల డోలాయమానమే. చిన్న చిన్న వాక్యాలు - దీర్ఘ సమాసాలు, ప్రశ్నార్థకాలు - ఇవన్నీ అతని ఆలోచనా సరళి మాత్రమే కాదు - అవి నిన్ను, నీ నాభిని, నీ మర్మాంగాలను, నీ దృష్టిని తాకుతాయి!

షేక్స్‌పియర్‌కి రక్తపోటు ఉండి ఉండవచ్చు - గోల్డ్ స్మిత్‌కి గాల్ బ్లాడర్ రాళ్లు - డాక్టర్ జాన్సన్ మగ గుర్రంలా - ఎక్కువసార్లు సంభోగించి ఉండవచ్చు. ముపాస (Moupassant) రోగభ్రమగ్రస్తుడై ఉండవచ్చు - ప్రౌస్ట్ (Proust) ఆస్మాతో మంచంలో పడి ఉండవచ్చు - ఆ విధంగా అతని ఆగని దగ్గులా సుదీర్ఘమైన వాక్యాలు అల్లి ఉండవచ్చు.

ఊపిరే ప్రాణవాయువు - ఋగ్వేదం ఘోషిస్తోంది కదా - అందుకే యోగా చేయాలి.

డాక్టర్ నార్మల్ కోల్‌మన్ (Coleman) జీవిత కథ - 'హూ ఈస్ హూ'లో దొరకదు. ఆయన రాసిన శీర్షికల లయలలో తప్పనిసరిగా అతని ఉచ్ఛ్వాస నిశ్వాసలు వినబడతాయి.

అలా ఎందరో జీవించి - తమ శ్వాసతో గ్రంథాలు రాశారు! గ్రంథాలయం ఎంతటి ప్రాణవాయువుతో నిండి ఉంటుంది! నాలాంటి బలహీనమైన ఊపిరితిత్తులుగలవాడికి ఈ వాతావరణం ప్రాణం పోస్తుంది. ఈ గ్రంథాలన్నీ కేవలం నా అధ్యయనానికే కాదు - నా ప్రాణాయామానికి ప్రమాణమే. నా ఆధ్యాత్మిక ప్రయాణానికి సాధనాలే. మధ్య-మధ్యలో ఎంతో విజ్ఞానం దాగి ఉంది. మార్మికమైన రాయని పదాల మధ్య తెలియని విజ్ఞానం నిబిడీకృతమై ఉంది. ఆ 'విరామం'లో, ఆ నిశ్శబ్దంలో ఈ గ్రంథాల మధ్య ఖాళీతో, వాటి వెనకాల నాకు ఏదో సత్యం, సావిత్రిలాంటి సూత్రం అవగతమవుతోంది. ఇన్ని పదాల పదార్థం ఆమె! శబ్దాలయం! అక్షరలక్ష్మి! ఉచ్చారణా సరస్వతి! రాత్రికి పగలే పరమార్థం! విజ్ఞాన సర్వస్వమే గ్రంథం. భవిష్యత్తుకు సూచకం, ఓ చిహ్నం!

యూనివర్సిటీ గ్రంథాలయం మెట్ల దగ్గర సావిత్రిని కలుస్తాను. అప్పుడు సాయంత్రం అయిదు. ఇద్దరం వంతెనలు దాటి నీటిని నియంత్రించే ఇనుప గేట్లను దాటి కామ్ (Cam) నది గట్ల మధ్య ప్రవాహపు సవ్వడిని వింటాం. క్లేర్ వంతెన - సెయింట్ జాన్ టవర్ మధ్య ఎండ పొడను చూస్తూ తిరుగుతాము. బహుశా ఈ ఖాళీని ఏ పక్షో తన పిల్లలు ఆడుకోవడానికి ఏర్పాటు చేసుకుందేమో! కామ్ నదిలో పూలు తేలుతున్నాయి. నావలు - నవ్వులు చైతన్యంతో వెలిగే చిన్నారులు! ఈ నదికి వార్ధక్యం ఎలా వస్తుంది? ఇరువైపులా ఉన్న భవనాలు పాతవైపోవచ్చు. ఈ కామ్ నది మనలాగానే నిత్య యౌవని! దీనికి చరిత్రతో పని ఏముంది? కాలావధిలాంటి తన ఇరు గట్ల మధ్య నుంచి ప్రవహిస్తూంటుంది. నది చరిత్ర ఎవరు రాస్తారు? మనిషికంటే ముందు నుంచి ఇది ప్రవహిస్తూనే ఉంది.

ఈ బ్రిటిష్ దీవులకు ప్రాణికోటి రాకముందే నది ఉంది. ఇంగ్లాండ్ - ఐరోపాలో కలిసిపోయినా - ఏదైనా భౌగోళిక విపత్తు జరిగి - థేమ్స్ - రైన్ నదిలో కలిసిపోయినా బ్రిటన్ మంచుతో గడ్డకట్టిపోయినా, ఉత్తర ధ్రువం వేడితో కరిగిపోయినా ఈ భౌగోళిక ప్రాంతం మానవ జీవనానికి అనుకూలం కాకపోయినా...

కామ్ నది నిశ్శబ్దంగానే నడుస్తోంది - తనలోకి తాను! మనతో చెప్తోంది కూడా! చరిత్ర మరొకరు రాస్తారు - నీ గురించి నీవు చరిత్ర రాయలేవు. నేను మీకు చరిత్రను - నాకు కాదు. మీరు నా జీవిత కథ రాయగలరు. కానీ నా జీవితాన్ని నేను జీవిస్తాను.

కామ్ నది మీద ట్రినిటీ వారధి ఉండవచ్చు. కానీ కామ్‌కి వారధి లేదు - నేను సావిత్రిని - సావిత్రి అని పలకరించవచ్చు - కాని సావిత్రి తనను సావిత్రి అని సంబోధించలేదు - శబ్దం - నిశ్శబ్దంలో నుంచి జనిస్తోంది! నది - ఖాళీప్రదేశం నుంచి ఏర్పడుతుంది. ప్రేమ ప్రేమించడంలో లేదు - 'నేను'లోనే ప్రేమ ఉంది!

రాత్రిలో సుకుమారమైన అమాయకత్వం ఉంది. ఎవరూ ఎవరినీ గాయపరచరు - రాత్రిపూట! పగటి పగలు - చిరాకుతో రాత్రిలోకి చొరబడవచ్చు. ఎవరైనా చీకటి రాత్రి గురించి మాట్లాడితే అది ముందటి పగటి నీడలన్నమాట!

కేంబ్రిడ్జి రాత్రి - పూర్తిగా నిశ్శబ్దంగా ఉంటుంది. ఒక్కసారిగా మార్గాలన్నీ ఆగిపోయినట్లు! ఆ ప్రక్కనుంచే కాలం కదిలిపోయినట్లు! హార్ట్‌ఫోర్డ్ షైర్ వైపుగా.

చెట్లన్నీ నేల తల్లికి చలి తగలకుండా తమ ఆకులతో దుప్పటి కప్పినాయి. మనిషికి తనలోనే నిప్పు ఉంది. అదో పదార్థం - అదో కాంతి! అతనికి రాత్రి - తన వెలుగుతోనే నింపుతాడు - తన స్పర్శతోనే, తన పెదవితోనే - తన వాసనతో, తన శ్వాసతో - తన నిశ్శబ్దంతో - దర్శనమే సత్యానికి నిదర్శనమైతే - ఒక్క క్షణం - ఒక్క చూపు - పదాలన్ని ఇలాంటి పదార్థాలతో శ్వాసతో నిండి ఉంటాయి.

వాస్తవం - అసంభవం - తక్షణమైన సాహసం - భావోద్రేకం - ఔన్నత్యం - ఫలాలు ప్రదేశంలో, తృణం - వెలుగులో ఉంటాయి. మానవాళి - దారులు - మార్గాలు చేస్తారు. ఇవన్నీ రాత్రి తన నిశ్శబ్దంలో కొలుస్తుంటుంది! రాజుగారి దేవళం - ఇటుకలతో అద్దాలతో కాదు - భక్తుల ప్రార్థనలతో సంపన్నమైంది - విద్యాలయాలు దాతల దానాలతో - కాదు - విద్యార్థుల జ్ఞాన తృష్ణతో - మనిషి జిజ్ఞాసతో వెలుగుతుంటాయి. అందులోనే దైవం ఒక భవంతిలా ఓ వారధిలా, ఓ గోపురంలా వ్రేలాడుతుంటాడు.

విద్యాలయాల వరండాలలో - విద్యార్థులు - దూరంగా విద్యార్థినులు వీటన్నిటికీ ప్రాణం పోస్తూ - ప్రదేశాన్ని జీవంతో నింపుతారు - ఇందులోనే జ్ఞానజ్యోతి వెలిగే చంద్రునిగా ఇంగ్లాండును సంపన్నం చేస్తూ ఇండియాను సుసంపన్నం చేస్తూ ప్రపంచాన్ని మరింతగా జ్ఞానవంతం చేస్తుంటారు. కామ్ నది ప్రవహిస్తుంటుంది - కలలను సాకారం చేస్తూ!

సావిత్రి చాలా సిగ్గరి! ఆమె స్పర్శ చాలా సాధారణమై - అనామకంగా ఉంటుంది. తల నిండా కొంగు కప్పుకుని - చెంగు మరింతగా వక్షంపై పరచుకుని

మాట్లాడుతుంది. ఆమెకు ఆమెతోనే సిగ్గు, ఇంకొకరిని చూసి కాదు - తన మాట తనకే తత్తరపాటు కలిగిస్తుంది - తన చేయి - తన నడుముకు తగిలితే వెంటనే తనే బెదిరిపోతుంది!

ఆమె గుండె చప్పుడు వినటం ఆమెకు బాగా ఇష్టపడుతుంది. అదిగో అక్కడే ఆమెతో కలవవచ్చు - మీకు ధైర్యం ఉంటే - కానీ ఈ పని చేయాలంటే - మీకు పవిత్రమైన వినయం కావాలి! ఈ పవిత్ర మౌనికి భిక్షాపాత్ర పనికిరాదు - నిరహంకారి అయిన వినయం కావాలి - పొద్దు పొద్దున్నే కవితా పంక్తులు చదివితే - రాత్రి నిద్రలో వచ్చిన కలలు గుర్తుకు వచ్చినట్లు! సావిత్రి తెలియాలంటే మెలకువలోని కలలో చూడాలి! అదీ సత్యాన్ని! ఆమె నిన్ను దూరంగా పెట్టదు - కానీ నీవు దగ్గరగా వెళ్ళలేవు! ఇక్కడ తెలిసిన భాష - తెలుసుకోవలసిన నియమాలు లేవు! ఆమె అమాయకత - నిరాడంబరత - సరళత - ఇవన్నీ కలబోసిన ఆమె వ్యక్తిత్వం - దృఢమైనది.

ఆమె నవ్వు - బాగా నవ్వుతుంది - నోరారా! అది సర్కస్ బఫూన్ నవ్వినట్లు! ఓ సింహం ముందు - తన శరీరం వణికి పోతుంటే - నవ్వినట్లు! సావిత్రికి ఏదో భయం!

నా ధైర్యం - ఒక వైఫల్యం - కానీ అదే నా బలం! ఆమె నవ్వు - భయంలో నుంచి వచ్చిన వినయం!

మా ఇద్దరినీ కలపడానికి క్లేర్ వారధి ఏమీ లేదు - చెరో గట్టు మీద నిలబడి - ఒకరినొకరు చూసుకుంటున్నాం - నీటిలో తేలుతున్న పడవకు - బాతు ముఖం ఒకవైపు - చుక్కాని మరోవైపు - నదిలో అగమ్యంగా కదిలిపోతూ...!

సావిత్రిని గిర్టన్ కాలేజీ వరకు వదిలిపెట్టి - ఒక సాయంత్రం - ఏదో సినిమాలో నవ్వుకున్నట్లు!

హోటల్‌కి రాగానే - జాన్ (పోర్టర్) ఒక ఉత్తరం ఇచ్చాడు - మెదలీనా రాసింది - బాధలూ - బంధాలు - ఆందోళనలు - అయినా నాకు ఎంతో ధైర్యాన్నిచ్చింది. మగవాడికి ఆడది కావాలి! తన పెడరీ ఎముకల మీద నిలబడటానికి-నీవు పారిపోవటానికి ఒక కేంద్రం కావాలి కదా!

చాలామంది - ముఖ్యంగా జార్జ్ - అడిగారు - నీకూ - సావిత్రికి మధ్య ఏమి జరిగింది అని! కేంబ్రిడ్జిలో...

నువ్వు పరీక్షగా చూస్తే - నిశ్శబ్దం - ఒక కేంద్ర బిందువు శబ్దానికి - అందుకే పార్వతి - హిమవంతుని పుత్రిక - నాగటి చాలులో సీత! నాకు వినిపించింది - నా నాదమే - నేను వీక్షించింది - నా చక్షువులే - ఆమె నా చేతనకు నేపథ్యం! నా అవగాహనకు అంతుపట్టని అనంతం - నా ప్రపంచం అదృశ్యమైపోయింది - అది ఆమెలో ఉండిపోయింది - ఐక్యమై పోయింది!

నేనిచ్చినదంతా ఆమె స్వీకరించింది - ఎలా?

హిమాలయాల నుంచి గంగా నది జలాలను స్వీకరించినట్లు - అక్కడ నుంచి సముద్రానికి చేరినట్లు - మళ్లీ అవి ధవళ హిమ ఫలకాలయి, నీలమయి - హరిత వర్ణమై - ఉత్తరాయణంలో సూర్యకిరణాల వేడికి - కరిగి - మళ్లీ గంగగా మారి చివరకు సముద్రాన్ని చేరినట్లు... ప్రేమను ఇచ్చిపుచ్చుకున్నాం ఎలా? అది మాకు సంబంధం లేని బంధంలా, సూత్రప్రాయంగా, అవ్యక్త సత్యంలా అక్కడ నుంచి ఒకరికి ఒకరు బహుమతిలా, ఒక ఉత్సవంలా... అందుకని మాకది ఒక పండుగలా ఒక వేడుక - బ్రతుకొక పండుగ - పండుగలంటే బహుమతులు - వేడుకలూ - తారాతోరణాలు - వెలుగు తారల మతాబులు - నవ్వుల చిచ్చుబుడ్డులు - జీవనోత్సవంలో జీవితమే - బహుమతులు?

సత్యమే వ్యక్తీకరణకు ఋజువు! వ్యక్తీకరణే సత్యం! మన అస్తిత్వం - సత్యానికి దర్పణం - మగవానికి స్త్రీయే తన సారాంశం! స్త్రీ యత్వ వ్యక్తీకరణే - అతని అస్తిత్వం! ఒకరు లేకపోతే మరొకరికి అర్థమే ఉండదు-

పార్వతి శివుని కోసం తపస్సు చేయకపోతే - శివుడు తన కనులు తెరిచేవాడా? అప్పుడు ఈ ప్రపంచమే లేదు కదా! జ్ఞాన మధుసారమే ప్రేమ! తెలుసుకోవటంలోనే మాధుర్యం ఉంది! అదే స్త్రీమూర్తి!

మగవాని ప్రపంచం - ఒకరి తర్వాత మరొకరు - హిమాలయాల శిఖరానికి చేరేవాళ్ళం. కాథర్లు - వీరు స్త్రీని నిరాకరించారు - సంతానాన్ని వద్దనుకున్నారు - శూన్యంలో చేరి ప్రార్థనలు చేశారు -

బౌద్ధం - స్త్రీని నిరాకరించి - భారతదేశంలో నిర్వాణం చెందింది - స్త్రీని కాదన్న సమాజం - పునరుత్పత్తిని నిరాకరించిన సిద్ధాంతం - కాథర్లలాగా అది ఆమరణ దీక్షలాంటిదే! గాంధీ ఆడవారిని గౌరవించాడు - సోదరీ సమానులుగా, సహచరులుగా చూడలేదు - స్త్రీ పురుష ప్రేమను - సంతానోత్పత్తిని ఆదరించలేదు - స్త్రీలను పురుషులుగా చేశాడు-

కేవలం మగవాడే ఉంటే - ప్రపంచాన్ని - భూమిని కాదన్నట్లే - రాజులేని రాజ్యంలా - రాజు లేని అధ్యక్షునిలా!

ప్రపంచమంతా స్త్రీలతో నిండిపోవాలి - అప్పుడే మగవాడు తనను తాను చూసుకోగలడు. ఏకత్వమే సత్యం - అద్వైతం!

బృహధారకోపనిషత్తు - నువ్వు నవవధువుని కౌగిలించుకున్నప్పుడు - నిన్ను నువ్వు అర్పించుకున్నట్లే - అక్కడ ద్వైత భావం ఉండదు - అద్వైతమే సంపూర్ణం - అద్వైతమే సత్యం! అద్వైతమే ఏకత్వమే అద్వైతం - ఏకత్వమే సత్యం-

సావిత్రి - నన్ను నేను తెలుసుకొనే రుజువు చేసింది!! చూపింది!

ఏ ఒక్కరూ ఈ ప్రపంచాన్ని పొందలేరు - నువ్వు అందులో భాగం కావచ్చు - నేను సావిత్రిలో నేను - నేనుగా నిలిచాను!! యాజ్ఞవల్క్యుడు ఆయన భార్యతో - భర్త తన భార్యను ఆమె కోసం ప్రేమించడు - భర్త - తన భార్యను - తన కోసమే ప్రేమిస్తాడు! అంటాడు.

ఆవిధంగా రాజ్యానికి రాజు కావాలి! అది సంపూర్ణమయ్యేది! స్త్రీతో సత్యం! పూర్ణ సత్యం!!

అన్నపూర్ణే - సదాపూర్ణే - శంకర ప్రాణవల్లభే - ఆదిశంకరుని మంత్రాలు - ఎంత మధురంగా ఉన్నాయి. ఇవి పదేపదే పాడుకుంటూ - కామ్ నది వెంట నడుస్తుంటే వింతగా అనిపించేది - ఏ బస్సో - ఏ కారో సావిత్రిని నా చెంత వదలి కదిలిపోయేది - ఆమె రాక - నాకు చరిత్ర లోతులు మానవ చరిత్ర లయలు విశద పరిచేది. నా ఆలోచనలు క్రిస్టియానిటీ ఈవ్ పతనం - అమ్మను మహోన్నతంగా కీర్తించే హిందూధర్మం - ఇవన్నీ వింతగా - విపులంగా తెలియవచ్చేవి. "అన్నపూర్ణే - సదాపూర్ణే / శంకర ప్రాణవల్లభే" అని మళ్ళీ-మళ్ళీ మంత్రించేవాడిని!

కానీ ఈ హిందూ ధర్మం - పతనం - స్వచ్ఛమైన వేదాంతాన్ని తలకెత్తుకుని స్త్రీని తాంత్రిక పూజలకు పరిమితం చేసింది! అలాగే దిగజారిపోయింది.

నాన్నగారు చెప్పింది - ఒక్కసారిగా నా మదిలో మెదిలింది! 16వ శతాబ్దానికి చెందిన నా ముత్తాతకు ఈ తాంత్రిక విద్యలు బాగా తెలుసు - ఆయన ఓ గ్రంథం కూడా రాశాడు. యోగచక్రాలను విశదీకరించి విపులంగా రాశాడు.

ఓ పదహారేళ్ల కన్యను ఇంటికి తీసుకువచ్చి - బహుశా ఈమె దేవదాసి కుటుంబానికి చెందినది కావచ్చు - ఆమెను నగ్నంగా నిలబెట్టి గంటలు - గంటలు మంత్రాలు వల్లిస్తూ, తంత్రాలు చేస్తూ, పాలు - తేనే - కర్పూరం - కదంబ పుష్పాలు

అన్నీ తెప్పించాడు. రాధ అనే ఆ కన్యను ఆ విధంగా ఇంటి మధ్యలో తాంత్రిక అంజనం వేసి రంగోలిలో దిశమొలతో నిలబెట్టాడు - అప్పుడు 16 మంది సన్యాసులు/ శ్రమణులు పదకొండు రాత్రులు - పగళ్ళు ఉపవాసం ఉన్నవారు - తెల్లని విభూదితో ఒళ్ళంతా పాలిపోయి ఉన్నారు - వారి కళ్ళల్లో - అక్కడ వెలుగుతున్న అగ్ని - పవిత్రాగ్ని - వారి కళ్లల్లో నిప్పులు రగిలిస్తుంటే - నుదుట బూడిద పూసుకుని - నడుముకు చుట్టుకున్న జరీ బంధనం మెరుస్తుంటే రాధను ఆవుపాలతో అభిషేకం చేశారు. తర్వాత పుట్టతేనెతో తడిపారు - ఆ తర్వాత కదంబ పుష్పాలు గుమ్మరించారు - ఆమె కురులన్నీ తడిసి ధారలుగా మొదలై బిందువులుగా ఆ అగ్నిశిఖలలో ఎర్రని కెంపుల్లా జారి పడుతున్నాయి - ఆమె లేత యౌవనాన్ని లేలేత చనుగుబ్బలను - ఆమె మర్మాంగాలను పూర్తిగా తడిపి తల్లడిల్లజేస్తున్నాయి. ఆమె స్త్రీయత్వాన్ని - అదే ప్రపంచానికి శరణ్యమన్నట్లు - ఈ తేనే - ఈ పాలు - ఈ పుష్పాలు - ఇవి పదార్థాలు అన్నట్టు - పూలే కదా - స్వచ్ఛమైన తేనెనందిస్తాయి!

పవిత్రమైన అగ్ని నాల్కలు చాస్తోంది - ఆమె యౌవనాన్ని ఆస్వాదించాలని-

నాకు శరీరం లేదు - నాకు మనసు లేదు-

ఈ సృష్టికి మూలం నేను - నేను సృష్టించబడలేదు-

ఈ ప్రపంచం నా గృహం-

కైలాసంలో నివసించే స్వామీ-

త్రిశూలధారీ - ఖండేందు మౌళీ-

నీవే నా భర్త - ఓంకారేశ్వరీ - నీవే ఓంకారానివి!

ఈ విధంగా శ్రావ్యంగా పాడుతుంది - ఆ మంట దగ్గరగా వచ్చి - ఏడుసార్లు ప్రదక్షిణలు చేసింది - తన శరీరం అంతా విభూది, బూడిద రాసుకొని - అక్కడున్న బ్రాహ్మణుని ఉత్తరీయం తీసుకుని - నిండుగా కప్పుకొని - ఒక సన్యాసినిలా - ఒక యోగినిగా మారిపోయింది.

ఆమెను ప్రపంచం పూజిస్తుంది - ఆ విధంగా తనను తాను నాశనం చేసుకుంటుంది. మనం శివునిగా మారి - స్త్రీని దహించి వేయాలి - ఈ ప్రపంచానికి అదే తగిన శాస్తి!

ఇక్కడ - కేంద్రం - స్త్రీ - ఈ సన్యాసుల మొలగుడ్డలు, కమండలాలు - మంత్రదండాలు - వారి పీల కాళ్ళు! ఇవన్నీ వారి సంభోగ వాంఛను - లైంగిక కోరికలను - స్త్రీ రూపంలో మూర్తీభవించటమే - అదే ప్రపంచం నాశనానికి సుగమ మార్గం! నిర్గమనం!!

కానీ జార్జిని చూడండి - పండ్ల రసాన్ని గుటకలు వేస్తూ జుర్రుకుంటున్నాడు - నోట్లో ఉంచుకుని గుర్రుమని మింగుతున్నాడు - అమాయకంగా మెదలీనా వైపు చూస్తూ- అప్పుడే కదా - చర్చి ఫాదర్ వచ్చి నశ్యాన్ని దట్టించి - ఒకరకమైన మైకంతో కళ్ళు మూసుకున్నాడు - ఇందులో పాపం ఏముంది - ఇంతవరకు - ఏ పాపీ - ఏ 'డాన్ వాన్' తిరిగి భూమి మీదకు రాలేదు కదా! కనీసం దయ్యంలాగానో - భూతంలాగానో కూడా - ఎందుకు దెయ్యాలు ఆడవారినే ఆవహిస్తాయి - అదీ పదహారేళ్ల పడుచునో - లేక పూర్వనువాసినినో!

క్లేర్ బ్రిడ్జి ప్రాంతంలో సావిత్రి కోసం చూస్తూ కమ్యూనిజం గురించి ఆలోచిస్తున్నాను - బహుశా ఆమె తన కమ్యూనిస్టు స్నేహితునితో ఏదో చర్చలో మునిగి ఉండచ్చు - ఆమెకు మధ్యతరగతి వాసనకంటే కమ్యూనిస్టుల పరిశుద్ధత ఇష్టపడుతుంది. బహుశా ఎప్పటికైనా కమ్యూనిజం కూలిపోతే - అది ఆటంబాంబువలన కాదు. అమెరికాలో పెచ్చు పెరిగిపోతున్న స్త్రీ శక్తి - రాత్రి క్లబ్బులు కారణం కావచ్చు!

అమెరికాలో స్త్రీని పూర్తిగా అంగీకరించారు - వారి ఐరోపా పూర్వీకులకంటే అమెరికావాడు విక్టోరియన్ విలువల్ని అక్కడే వదలి వచ్చేశాడు - స్త్రీని పూజించడమంటే - ప్రపంచాన్ని పొందటమే-

సావిత్రి వస్తుంది - నిన్నా - మొన్నా - వచ్చినట్లే. అదిగో, ఆకులు లేని చెట్ల క్రింద నిలచి - సోడియం దీపాల నీడల నుంచి - చీర కుచ్చిళ్ళు కదులుతుంటే చేతిలో పుస్తకాలతో వస్తుంది. ఆలస్యానికి క్షమాపణలతో గొంతు వణుకుతుంటే "మిమ్మల్ని మరీ ఎక్కువసేపు - మీరు ఎంతసేపటి నుంచి వేచి ఉన్నారు - అయ్యో క్షమించండి..." అలా ఏదో అంటుంది!

తన వెచ్చని చేతిని నా కోటు చేతి చుట్టూ చుడుతుంది! అప్పుడే అక్కడి స్లూయిస్ గేట్లు తెరుస్తారు - ఒక్కసారిగా అప్పటిదాకా ఆగి ఉన్న నీళ్ళు సుడులు తిరుగుతూ పరుగులు పెడతాయి - సంతోషంగా నురగల నవ్వులతో! గతాన్ని మరచిపోతూ - ఆ సుడుల శబ్దంలో ఏదో మంత్రం ఉందేమో - నా గుండెకు తాకుతాయి-

మనిషిలో శూన్య ప్రదేశం ఎక్కడుంది? అంతా పూజ్యభావంతో నిండి ఉంటుంది కదా!

అవును - సావిత్రికి ఏదన్నా గౌరవమే - ఆమె ఓ గంటి పట్టుకున్నా - పెన్ను తీసినా - తన కళ్ళజోడు కోసం వెతికినా - అవును - ఆమె ఎప్పుడూ తన కళ్ళజోడు మరచిపోతుంటుంది - చదువుల బల్లమీదో - రెస్టారెంట్ బల్లమీదో - నేను వెళ్లి రెస్టారెంటు వెయిటర్‌ని అడగడం ఎంతో ఆనందంగా ఉండేది - "ఆఁ... అవును - మీ ఇండియన్ లేడీ ఈ మధ్యాహ్నం మరచిపోయింది. ఇదిగో.." అని ఇచ్చేవాడు. మేము ఎప్పుడైనా ట్రినిటీ కాలేజీ గార్డెన్ బెంచి మీద కూర్చుని మెట్ట వేదాంతమో - మార్క్స్ కాపిటలో మాట్లాడుతుండగా - ఆమె తోటి విద్యార్థి ఎవరో నవ్వుకుంటూ వచ్చేవారు - కాపర్ కెటిల్ రెస్టారెంట్ లేదా లైబ్రరీలో - కళ్ళజోడు - పెన్ను ఏదో ఒకటి మరచి పోతుంది తెచ్చి ఇచ్చేవారు - 'రాజకుమారీ - మిమ్మల్ని ఇలా కలిసినందుకు క్షమించండి' అని మర్యాదపూర్వకంగా! 'ఆఁ.. అలాంటిదేమీ లేదు - ధన్యవాదాలు మిత్రమా..' అంటుంది.

ఇవేమీ నేను అంతగా పట్టించుకునేవాడిని కాదు - మా చర్చలు సాగుతూనే ఉండేవి - బోగోమల్ (Bogomol) ద్వైతం గురించి 1848 విప్లవం గురించి...

ఆమె పూర్తిగా కమ్యూనిస్టు అనలేము - కానీ ఒకసారి నాతో- "చూడండి రామస్వామిగారు - ఉత్తర భారతంలోని పేదరికపు దైన్యాన్ని - హింసను చూస్తే ఐదు రూపాయలకు హత్య చేస్తారు సుమా! నాన్నగారు పులి వేటకు వెళ్ళినప్పుడు ఆ ఊరి జనం ఆయనకు సన్మానం చేసేవారు - ఓ కాశ్మీర్ శాలువా - ఓ కరవాలం అందించి - ఇంకా చెప్పాలంటే ఒకసారి నాన్నగారే - అశ్రఫ్ అనే ముస్లిం యువకుడిని స్తంభానికి కట్టి కొరడాతో వీపు చిట్లగొట్టారు - కేవలం నాకు చిన్న కవిత రాసి కిటికీ కింద నుంచి చదివినందుకు - ఇది మీరు చూసినా, గోమతీ నది పొంగి ఊళ్ళు మునిగిపోతే - వారాల తరబడి చెట్లమీదే కాపురం చేసిన జనాన్ని చూసినా - ఇంకా ఇలాంటి కన్నీటి కథలు ఎన్నో - మీరు కమ్యూనిస్టు కాకుండా ఎలా ఉంటారు చెప్పండి" అని అడిగేది.

"అవునవును - దీనికి కారణం మన ఏడుపు - మనం ఏడవలేము కదా" అన్నాను.

"మీరు అన్నది నిజమే" అని ఎప్పుడూ నాతో అంగీకరించడానికి ఉత్సాహం చూపేది - నేనే ఆమెకు టీచర్‌ని.

"సావిత్రీ - నీకు దయ - కరుణ - ప్రేమ - ఒక వింత నైరూప్య భావన" అంటే "మీరు సరిగానే చెప్పారు" అనేది.

"లక్ష్మి ఎప్పుడూ అనేది - సావిత్రీ నువ్వు ఎవ్వరినీ ప్రేమించలేవు సుమా" అని.

కేమ్ బ్రిడ్జి

"నేను అన్నది అది కాదు - నీవు ప్రేమించగలవు - నీవే ప్రేమ కదా' అన్నాను.

"అంటే - అర్థమయ్యేటట్లు చెప్పండి.."

"ప్రేమ ఒక వ్యవస్థ కాదు - అది భావావేశానికి రహదారి - అది తక్షణ అనుభూతి - అది ఒక లోచూపు.. నేను నిన్ను చాలాసార్లు గమనించాను - ఓ పూల మొక్కకడ నిలిచి, నది కదిలిపోతుంటే నీలో నీవు మైమరచి ఉండిపోయేదానివి - 'చాలా సమయమయిందా' అని అడుగుతావు. నీ స్వరం ప్రవాహపు శబ్దంలో కలిసిపోయేది.."

"అంటే - ఏమిటి మాస్టారూ?

"అంటే సావిత్రి - సావిత్రిని కలిసేది - మొదటి సావిత్రి ప్రవాహాన్ని వింటుంటే - తర్వాత సావిత్రి ఆ శబ్దంగా మారిపోతుంది.. ఆమె అక్కడ లేదు.."

"మరి ఎక్కడికి వెళ్ళింది మాస్టారూ?"

"ఎక్కడికీ లేదు.."

"అంబోయతా సలిలం - సేవ తు తత్ సమగ్రమ్.."

"అది అంతా ఎప్పుడూ ఉదకమే.."

"ఏదో అర్థమయినట్లే అనిపిస్తోంది.. చెప్పండి.."

"ఫ్రాస్ట్ చెప్పినట్లు - చివరికి మనకు మనం తెలియవస్తాము.."

"అంటే మనం ఎవ్వరినీ ప్రేమించలేమా?"

"ఎందుకు ప్రేమించలేము - ప్రేమ ఒక భావన - మన చేతన - స్వార్థపరులు మాత్రమే ప్రేమించగలరు!"

"మరి ప్రేమ లేనివారు?"

"వారే ప్రేమ! ప్రేమగా మారిపోతారు.."

మరి అప్పటివరకు సోవియట్ కమ్యూనిజం వల్లెవేయవచ్చు.

గట్టిగా - బిగ్గరగా నవ్వుకున్నాం - మా నవ్వులు - అటుగా వెళ్తున్న ఇంగ్లీషు ప్రొఫెసర్ పెంపుడు కుక్కను కంగారు పెట్టినాయి - ఇది ఇంగ్లాండ్ రాజుని ఎగతాళి చేసినంత తప్పిదం సుమా! ట్రినిటీ కాలేజీ కారిడార్లు మా నవ్వుల్లో మారుమోగాయి - ప్రొఫెసర్‌గారి కుక్క అరుస్తూనే ఉంది-

పెంపుడు కుక్కలు బూర్జువా వర్గపు అలవాటు - అందుకని సోషలిస్టు ఆలోచనకు మూలమైన కమ్యూనిస్టు దేశాలలో దీనిని అంగీకరించరు - కుక్క మెడ పట్టీలు - కుక్క గొలుసులు - మున్సిపాలిటీ లైసెన్స్ బిళ్లలు - తోకలు కత్తిరించటాలు - కరవకుండా మూతికి గిన్నెలు పెట్టడం ఇవన్నీ బూర్జువా వర్గపు ఆలోచనలని కమ్యూనిస్టులు నిరసిస్తారు - అందుకని సోవియట్ ల్యాండ్‌లో పెంపుడు కుక్కలుండవు!

"అది అమెరికా వాళ్ళ తప్పుడు ప్రచారం" సావిత్రి.

"మీకు తెలుసా? నేను అమెరికా వాళ్ల స్కాలర్‌షిప్‌తో చదువుతున్నాను?" అని నవ్వాను!

"నా వేదాంతానికి - నా 'రాజరహిత రాజ్య సిద్ధాంతానికి' అమెరికావాళ్ళు నవ్వుకుంటారు - అయినా నేను 17వ శతాబ్దంలో పుట్టి ఉండవలసింది. రామభట్టారక నామధేయంతో - ఏ అనామక రాకుమారుని పొగుడుతూ కవిత్వం చెప్పేవాడిని - ఖ్యాతి చెందిన జగన్నాథ భట్టు వారిలాగా!"

"రాకుమారిని పొగడుతూ కాదా? జగన్నాథ భట్టు - షాజహాన్ కుమార్తెనే వివాహం చేసుకున్నాడు కదా..."

"అవును - ఆమెను వారణాసి తీసుకువెళ్తే - నగర ప్రజ కన్నెర్ర చేసి - ఒక ముసల్మాన్ రాకుమారిని వారణాసి నగరానికి తీసుకు వచ్చినందుకు - అప్పుడు ఆయన సందులు గొందులు త్రిప్పి గంగానది ఒడ్డుకు తీసుకువచ్చి - 'అమ్మా! గంగామాతా - గంగాభవానీ - ఇదిగో పెండ్లికుమార్తెను తీసుకువచ్చాను' అని గంగమ్మను పిలిచాడు - అప్పుడు అలలు అలలుగా గంగ పొంగి - వారి పాదాలను కడిగి పవిత్రం చేసింది - అప్పుడు జగన్నాథ భట్టారకు 'గంగాలహరి' పద్యాలను గానం చేశాడు -

ఓ ధర్మనిధీ - ఓ ఆనంద ప్రదాయినీ, ఓ పవిత్ర జలరాశీ - మూడులోకాల ముత్యాలహారమా అని గంగామాతను స్తోత్రం చేశాడు!

"రాకుమారిని కూడా..."" అంది సావిత్రి.

"ఎందుకు? నీ పై శార్దూల పద్యం చెప్పనా?"

"మా పూర్వీకులు రాకుమారిని పొగుడుతూ కవిత్వం చెప్పనీయలేదు - వారు అలెగ్జాండరు చక్రవర్తినీ - సుహ్రాబ్ రుస్తుంలను పొగిడించారు - ఎవరైనా రాకుమారి అందాన్ని కవిత్వంలో చెబితే - స్తంభానికి కట్టి తోలు వలిచేవారు!"

మహా అయితే ఓ పాలరాతి సుందరి మునివేళ్ల అశ్రు బిందువులు ఏ బుల్‌బుల్ పిట్టో ఆస్వాదించి ఉండేది.."

"ఇంతకీ ముస్లిం కుర్రవాడి కథ పూర్తిగా చెప్పలేదు - నాన్నగారు ఆ రాత్రి నిద్రపోలేదు - ఆ కుర్రవాని తండ్రిని తన దగ్గరే కూర్చోబెట్టుకొని ఇద్దరూ దుఃఖించారు - మర్నాడు అతన్ని అలీఘర్ చదువు కోసం పంపించారు.."

"ఏమని కవిత్వం రాశాడు నీ అందాన్ని అభినందిస్తూ?"

ఉదయం కిరణాలు చూసి - మంచుబిందువు అడిగింది-

"ఓ సర్వసాక్షీ - నాకో దివ్యదృష్టి ఇవ్వు-

ఉదయ సంధ్యలో కోయిల పాడకముందే-

ఆమె కనుబొమ్మలు ఎలా వంగుతాయో చూస్తా...

(ఆమె కనుబొమ్మల వంపులు చూస్తాను)

"ఆహా! బాగా చెప్పాడు - నీ కనుబొమ్మలు చాలా వయ్యారంగా వంగుతాయి సుమా!"

"అలాగా! ఇంకా.."

"నీ శరీర ఛాయ - ఇంకా అద్భుతం - ఐదు వందల సంవత్సరాలుగా - ఎండ పొడ తగలకుండా - జనానాలో ఉండిపోయింది కదా.."

"ఏడువందల సంవత్సరాలు ఆల్ మటాష్ - మమ్మల్ని అప్పుడే కదా జయించాడు.."

"కావచ్చు - ఏడు శతాబ్దాల చల్లదనం - నీ చక్కని చర్మాన్ని వెలిగేట్లు చేసింది.."

"అయితే.."

"అందుకే నీవు నిశ్శబ్దంలోకి వెళ్ళిపోయినప్పుడు - ఏదో రత్నదీపం నీలో వెలుగుతుంది.."

అంతే - సావిత్రి - నిశ్శబ్దంలోకి జారిపోయింది - అలా సావిత్రి ఆ స్థితికి వెళ్ళినప్పుడు - నాలోకి నేను వెళ్ళిపోతాను - సర్వం మర్చిపోయి - నా అస్తిత్వాన్ని కూడా - ప్రపంచం ఉందంటే - నేను ఉంటేనే! సావిత్రిని నా చేతుల్లోకి తీసుకుంటే ఎంత అద్భుతంగా ఉంటుంది! ఎంత సహజంగా - ఎంత సత్యవంతంగా ఉండేది! కానీ మాది ఒక నిశ్శబ్దం కాదు - మాది రెండు ఏకాంతాలు - మా ఇద్దరి మధ్యలో ఉంది ప్రతాప్ కాదు - సావిత్రే ఉంది.

ఆమెతో పాటు ఆమె పవిత్ర దేశం - ఆమె కామ్రేడ్లు - సోవియట్ సోషలిస్ట్ రిపబ్లిక్! అప్పటికి ఇంకా 'మావో' రాలేదు - ఇండియా సరిహద్దులను దాటడానికి వారికి ఆమె అనుమతి ఇచ్చినట్లు లేదు...!!

ఈ మధ్యాహ్నం సావిత్రి తన హైహీల్స్‌తో మరింతగా తడబడుతూ - అలవాటు ప్రకారం ఆలస్యంగానే వచ్చింది - బహుశా నేను మరింత ఒంటరిగా - కోపంగా కనిపించానేమో - పరుగున వచ్చి - తన చేతిని నా చేతి మీద పెట్టింది - వంతెన గోడమీద పెట్టినట్లు! ఏమీ మాట్లాడలేదు - మాట్లాడడానికి ఏమీ లేదు! ఆమె విచారం - గొంతులో కొట్టుమిట్టాడుతోంది - ఒక బరువైన దీర్ఘ నిశ్వాస వదిలింది. ఆమెతో పాటు వచ్చినవారు - వంతెనకావైపే నిలిచిపోయారు - నీళ్లలోకి చూస్తూ - గాలిలో తేమ నా ఊపిరితిత్తులకు ఏ మాత్రం మేలు చేయదు - "మీరు దగ్గటం చాలా కాలంగా నేను వినలేదు - అవునా" అని తన మనవడిని - నానమ్మ అడిగినట్లు అడిగింది! అవును కదా - ఆమె నా శ్వాసను సక్రమంగా సరి చేసింది.

"అసలు మర్చిపోయాను - ఈ రాత్రి జాక్‌తో డాన్స్-డిన్నర్‌కి వస్తానని చెప్పాను. డాన్స్ అంటే ప్రత్యేకమైన దుస్తులు - అలంకరణ" - అదేదో రగ్బీ మ్యాచ్‌లాగా చెప్తోంది సావిత్రి. అదిగో - ఇవన్నీ అయ్యేసరికి ఈ వేళ అయింది - ఈ గడియారాలు నాకు ఎప్పుడూ శత్రువులే సుమా!"

సావిత్రిని మొదటిసారిగా చూశాను - ఆగ్రా నగలు పెట్టుకుని - చాలా అందంగా కనబడుతోంది - కనుబొమ్మలు నల్లగా దిద్దింది - లక్నో అత్తరు చాలా మృదువుగా ఆమెను చుట్టుకుని ఉంది - మొదటిసారిగా జాక్‌తో బయటకు వెళ్తోంది!

ఆమెతో వచ్చిన మరో మిత్రుడు స్టాన్‌స్టన్ - నలుగురం నడుస్తూ ఆడెల్ఫీ వరకు వచ్చాం - ఈలోపు కమ్యూనిజం - స్టాలిన్ - టోక్యో - టొరంటో - అమెరికా - నీగ్రో - అన్ని విషయాలు నడిచాయి.

"డా. రామస్వామి గారు - ఏమి ఆలోచిస్తున్నారు" అడిగింది సావిత్రి - వారిద్దరితో -

"రామస్వామి చాలా వింతగా ఆలోచిస్తారు - అసలు సంబంధం లేని రెండు విషయాలను సమన్వయం చేసి చెప్పగలరు.."

ఆయనకు చరిత్ర చాలా పెద్ద పరిశోధనాంశం - ఏదైనా మెట్ట వేదాంతానికి విలువ కట్టాలంటే - వీరిని మించిన గురువు లేరు" అని కలిపింది.

"అంటే...?" అని అడిగాడు. జాక్ - "అంటే - అది విడమరిచి చెప్పడం చాలా కష్టం - గురువు నీకు సత్యానికి దారి చూపగలడు.."

"అబ్బో - ఇది చాలా కష్టమైన విషయం కాదా?" స్టాన్‌స్టన్ అందుకున్నాడు - ఆయనకు అప్పటికి మూడు పెళ్లిళ్ళయ్యాయి - సోషలిజం - కమ్యూనిజం - బాగా

తలకెక్కింది కూడా - ఆయనకు సత్యానికి ఒకే మార్గం ఉంటుందని నమ్మకం. మధ్యలో నేనందుకున్నాను - "నిజానికి కమ్యూనిజం తప్పదని అనుకుంటున్నాను - ఇది సరికొత్త కాథలిసిజమ్ - నాజీలు ఓడిపోలేదా - హిట్లర్ - సామాన్యుడా? అతను రావణాసురునికంటే ఎక్కువ చేయగలిగాడా? రాముని ఓడించగలిగాడా? రాముడు - జీవిత సారం - జీవన ప్రవాహం! జీవన్ముక్తి వైపు ప్రయాణం - మన అస్తిత్వానికి మూలం - రావణుడు - అందుకు పూర్తిగా భిన్నం - అతడు భూమిలాంటివాడు - అది విచ్ఛిన్నం అయిపోతుంది - అంటే భౌతిక జీవితానికి కట్టుబడినవాడు - జీవితానికి వ్యతిరేకంగా పోతున్నట్లే - బహుశా ఇదే కమ్యూనిజం అనుకుంటున్నా" అన్నాను.

"మీరు చెప్పిన విషయాలలో అర్థం కానివే ఎక్కువ ఉన్నాయి రామస్వామిగారూ" అన్నాడు స్టాన్‌స్టన్.

"రామస్వామి గారంతే - వారు చిహ్నాలతో సూత్రాలతో - చరిత్రను ఆల్జీబ్రాలాగా - అవ్యక్తం నుంచి - వ్యక్తీకరించగలరు" అంది సావిత్రి.

"అంతేకాదు - రామస్వామి చరిత్ర అధ్యయనం - సైన్స్ - విజ్ఞాన శాస్త్రంమాదిరి - దానికి నైతికత అవసరం లేదు - అక్కడ బూర్జువాలుండరు - పెట్టుబడిదారులు ఉండరు - ఆయనకు చరిత్ర అంటే - నిరంతర ప్రవాహం - అర్థవంతమైన వర్తమానం తక్షణ సత్యం!" అని నా వైపు తిరిగి "ఏవండీ - నేను సరిగానే చెప్పగలిగానా?"

ఆమె మెడలోని మణి వింతగా మెరిసింది!

"లంకేశ్వరుడు, రావణాసురుడు - రామాయణ మహా కావ్యంలోని రావణాసురునితో - బ్రిటీష్ పాలకుల్ని పోల్చారు గాంధీ - ఆ విధంగా స్టాన్‌స్టన్ తండ్రి - రావణాసురుని వారసుడు అనవచ్చు" - అన్నాను. "మీకు అభ్యంతరం లేకపోతే" అని కలిపాను. అప్పుడే సావిత్రి - "అవును - మా నాన్నగారు కూడా ఏమీ తీసిపోరు" అనగానే అందరం నవ్వుకున్నాం.

"రావణుడు - అతని అత్యాశతో - సీతను ఎత్తుకుపోయాడు - రాముడు యుద్ధం చేయాల్సి వచ్చింది - అతని ధర్మానికి ప్రకృతి అంతా అండగా నిలిచింది - అది ధర్మ చక్రం అంటే - మంచి - చెడు - ఇవి వ్యక్తినిబట్టి ఉంటాయి - అతని దృష్టినిబట్టి వ్యక్తమవుతాయి - వాని ధర్మం - వ్యక్తిగతం కాదు - రావణుడు ఓడిపోవడానికి - కారణం అదే - ఉడతలు - కోతులు - కూడా వారధులు కట్టి రాముని ధర్మానికి అండగా నిలిచి - బంగారు లంకను బూడిద చేశాయి. తగలబెట్టాయి - ధర్మం గెలిచి తీరాలి.."

"ధర్మం అంటే?" స్టాన్‌స్టన్ అడిగాడు.

"ధర్మం అనే పదం - ధ్రు నుంచి వచ్చింది - అంటే నిలకడగా - శాశ్వతంగా ఉండేది - అదే ధర్మానికి కట్టుబడి రాముడు సీతను నిండు చూలాలిని అడవులకు పంపాడు. రాజు అయినా ధర్మానికి కట్టుబడి ఉండాల్సిందే - ఇక్కడ వ్యక్తి ముఖ్యం కాదు - ధర్మమే శాశ్వతమైనదని చెప్పటం-

"మీరు కమ్యూనిజం తప్పదంటారా? ఈ ప్రపంచం కమ్యూనిజాన్ని తప్పించుకోలేదా?"

"అవును - మశూచిలాగా - అదే మశూచి టీకాలాగా అన్నమాట!" "సహజమైన పుట్టుకకూ - సహజమైన వర్తమానానికి కొంత భేదం ఉంది - మొదటిది మీకు జన్మనిస్తుంది - రెండవది మీరు మరింతకాలం జీవించడానికి - అదే టీకా తీసుకుంటే - మశూచి రాకుండా - వీలు కల్పిస్తుంది.

చరిత్ర డార్విన్‌ని అంగీకరిస్తుంది. అది జీవశాస్త్రానికి సంబంధించింది. బలవంతుడే బ్రతకగలడు - అంటే జీవకోటిని ముందుకు తీసుకెళ్లటం - అయితే ఈ ముందుకెళ్లడం ఎందుకు?

"ఎందుకు అని అడగటంలోనే ప్రాముఖ్యత - లేకపోతే ఏ వాదనా ముందుకు వెళ్ళదు - అందుకనే మార్క్సిజమ్ - దానితోనే ఆగిపోయింది.." "గతితార్కికత - సమాంతరం కాదు.." జాక్ - స్టాన్‌స్టన్ - మాట్లాడటం ఆపివేశారు - సావిత్రి అలాగే కూర్చుండిపోయింది. కాలం ఆగిపోయి తనలో కలిసిపోయినట్లు - అదే శివుడు గరళం మింగి - నీలకంఠుడయినట్లు! ఈ ప్రక్రియలో ఆమె శరీరం ప్రకంపనాలు పోయింది - ఒక జలతరంగిణిలాగా-

ఆలోచనలు సావిత్రికి మత్తు కలిగిస్తాయి... మగవాళ్ళు ఆమెకు ఆలోచనలు ఇవ్వగలరు - ఆమె కన్యత్వానికి భౌతిక స్థావరం లేదనుకుంటా! జానపద కథల్లో రాజకుమారుని వివాహం చేసుకోవాలంటే - ఏదో చిక్కుముడిని విప్పాలి - అలాగే సావిత్రి - జీవితమే ఒక చిక్కుముడి! ఆ విధంగా అందరినీ - రాజకుమారులందరినీ తిరస్కరిస్తూ వచ్చింది! వేదవిద్యయో - విలువిద్యయో ఆమెకు ముఖ్యం కాదు - అలాగే - రాకుమారుడు పొడగరి, పొట్టి కూడా - అది కూడా అవసరం లేదు - కానీ ఆమెకు కావాల్సింది ఇవ్వగలవాడు - ఎవరు? ఆ కావలసింది తెలియాలి కదా! ఆమెకు ఏదీ అక్కరలేదు - ప్రశాంత నిశ్శబ్దం కావాలి - నిశ్శబ్దమే ఆమె జీవితం - బహుశా - తెలిసో తెలియకో ఈ విషయం నేను తెలుసుకున్నాను. అందుకే నాతో

ఉండడానికి ఇష్టపడుతుంది. ఒకసారి ఆమెను ఎగతాళి పట్టించాను. "సావిత్రీ! నీవు పద - అర్థం గ్రంథ శాస్త్రం ప్రకారం నడుచుకుంటావనుకుంటాను.." అని - ఆమె పగలబడి నవ్వింది - తలలో పువ్వు క్రింద పడిపోయింది!

ఆమె ఆంగ్లం - చక్కని ఇండియన్ యాక్సెంట్లో పలుకుతుంది - ఆమె శ్వాసతో ఆ పదానికి అర్థం కూడా ఆవిష్కరింపబడుతుంది - కాళిదాసు - రఘువంశంలో - 'వాగర్థావివ సంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే జగతః పితరే వందే పార్వతీ పరమేశ్వరౌ!' అని చెప్పలా అలాగా!

అవిగ్నాన్లో ఆ రోజు సావిత్రి అమితాశ్చర్యంతో తనను తాను అర్థం చేసుకోవటంలో - ఆత్మీయ ప్రశంసలో సావిత్రి రాథోడ్ను దర్శించడం ఒక అద్భుతమైన అనుభవం! కమ్యూనిజం కూడా ఆమెకు ఒక చారిత్రక సత్యమే. తనకు సంబంధం లేనిదాన్ని ఆమె తామరాకు మీద నీటిబొట్టులాగా వదిలివేయగలదు. పనికిరాని విషయాలు ఆమెను చేరలేవు. ఆమె నిశ్శబ్ద పవిత్రతలో ఆమె తోటి గ్రాడ్యుయేట్లంతా పునీతమవుతారు-

ఒకరోజు సాయంత్రం లక్ష్మి నాతోపాటు భోజనం చేయటానికి నేనున్న హోటల్కు వచ్చింది. లక్ష్మికి సావిత్రి అంటే ఎనలేని ప్రేమ. తన కడుపులో పెట్టుకొని చూసుకుంటానని అనేది!

"రామస్వామి గారూ - సావిత్రిని ఎలా అర్థం చేసుకోవాలండీ - ఎంతోమంది మగవాళ్ళతో చెట్టాపట్టాలేసుకుని తిరుగుతుంది. ఇంత చపలత్వాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?" అంది.

నేను లక్ష్మిని తీవ్రంగా చూశాను - బ్రాహ్మణుడు పిట్టలు పట్టేవాడిని చూస్తాడే - అలాగా - ఇక్కడ మాటలు ఎందుకు?

లక్ష్మి ఆపలేదు- "కమ్యూనిస్టులు - సోషలిస్టులు - మిగతావారు - ఒక్కరేమిటి - అందరితో డాన్స్ చేస్తుంది - అందరూ ఆమె చుట్టూ తిరుగుతారు - ఇక్కడ ఉన్న మన దేశస్థులకు తల తిరిగిపోతుందనుకోండి" అంది.

"బహుశా - తన అంతఃపురం నుంచి శతాబ్దాల తర్వాత - స్వాతంత్ర్యం లభించిన పర్యవసానమేమో" అనీ కలిపింది.

"అది చిన్నారులు - చిట్టి పిట్టలు - కళ్ళు తెరచి నడవటానికి ప్రయత్నించి - పడిపోతారు, చూడు - ఎక్కడైనా పడవచ్చు - కానీ ఆ అమాయకత్వం - అది ఎంత ఆనందకర విషయం! నువ్వు - నేను దక్షిణ భారతం నుంచి వచ్చాం. మనకు

ఎంతో తెలుసు - కానీ ఆమె అమాయకత్వం మనకు లేదు - సావిత్రి ఒక యోగి!" అంతటితో ఆ సంభాషణ ముగించాను.

ఆ తర్వాత లక్ష్మి నాతో అంత చనువుగా ఉండలేకపోయింది. ఆమెకు అసూయ - అంతే - ఆడవాళ్లకు అసూయ చాలా సహజం. మగ సానులు లేకపోవడం - అది చాలా సహజమవటం బాధాకరం - ఆడవారికి త్వరగా పొందగల - జ్ఞానం ఉంది. పొందటం అంటే - ఉండటం - ప్రేమ అంటే ఇవ్వడం - బంధమే ఆడవారి గమ్యం - విధి - అదృష్టం - గతి - ఏమైనా అనవచ్చు.

కానీ సావిత్రి విషయంలో అలా కాదు. ఆమె తన గమ్యాన్ని గుర్తించింది కాబట్టే బంధవిముక్తురాలయింది. స్వేచ్ఛగా ఉండగలుగుతోంది. ఆడతనం అంటే మగవానితో కలవడమే - అలాంటివాడు లభించకపోతే ఇక మగసిరికి నిర్వచనం ఒకటే-

ఆడవారు తెలివితేటలుంటే - సత్యానికి దాసోహం అంటారు - అదే స్వేచ్ఛ-

జీవితం అంటే దుఃఖమే - ఆనందం ఎక్కడుంది?

కానీ బంధవిముక్తులవటంలోనే దుఃఖనివారణ ఉంది.

నేను శంకరాచార్య నిర్వాణ శతకం చెప్పినప్పుడు సావిత్రి ఎంతో ఆనందించింది. ఎంతో ఆర్తితో గానం చేసింది.

'మనోబుద్ధి అహంకార' అని కళ్లు మూసుకుని నిశ్శబ్దంలోకి వెళ్ళిపోయేది.

తర్వాత సావిత్రి సిగరెట్ వెలిగించి 'ఇప్పుడు కమ్యూనిజం గురించి మాట్లాడదాం' అంది. నాకు సిగరెట్ పడదని ఆమెకు తెలుసు. అందులో నాలాంటి దక్షిణ భారత బ్రాహ్మణ సంప్రదాయంలో పెరిగినవానికి ఒక భారతీయ స్త్రీ సిగరెట్ తాగడం ఎలా జీర్ణించుకోవడం? కానీ ఆమె గుప్పుగుప్పున పొగ వదుల్తూ నే ఉంది. అది ఆమె తన తోటి విద్యార్థులకు తన అస్తిత్వాన్ని తెలపడానికే అన్నట్లు! ఆమె వినయ సంపద సత్యాన్ని అంగీకరించడంలోనే ఉంది. అంతేకాదు ఆమె ఒక సంఘటన నుంచి మరో సన్నివేశంలోకి జారిపోతూ ఉంటుంది. నీళ్ళల్లో చేప ఒకచోటి నుంచి మరోచోటకు (అదే నీరు) మారిపోయినట్లు.

కమ్యూనిజం మంచిదే. అది జీవితానికి సంబంధించినది. కాబట్టి కదిలిపోతూ ఉంటుంది. అదే అమెరికన్లకు అర్థం కాలేదు. కమ్యూనిజం ఎలా వృద్ధి చెందిందో. చూడండి - జీవరాశుల్లో కొన్ని అంతమైపోతుంటాయి. వాటి జాతి లక్షణాలతో మరికొన్ని ఉంటాయి. అంతా అలా జరిగిపోతూ ఉంటుంది. ఏదీ మరణించదు. మరణం

అంటే జీవితం మిగిల్చిందని. నిజానికి ఏదీ చనిపోదు. చివరకు చావు కూడా. ఒక యోగి చెప్పినట్లు నీటిని అలగా మార్చాలంటే టైమ్, స్పేస్ రెండూ కావాలి. మరి జీవితాన్ని అలగా మార్చాలంటే? దానికది మారలేదు - మరి ఇంకేదీ ఆ పని చేయలేదు.

"అప్పుడేం జరుగుతుంది?" సావిత్రి అడిగింది.

స్టాన్‌స్టన్ ఇక ఆశ వదిలేశాడు. మాటలు అర్థంచేసుకునే ప్రయత్నం మానేశాడు.

"ఏమీ జరగదు - సావిత్రీ, నీ ప్రశ్నలోనే సమాధానం ఉంది..'

"మరి కమ్యూనిజం?" అంది.

"అది కూలిపోతుంది.."

"మరి మిగిలేది ఏమిటి?"

"సత్యం" - నేను చెప్పేది ఆమెకు తెలిసిన విషయమే అన్నట్లు!

"మరి చరిత్ర ఏమిటి?"

"చరిత్ర మనం పేర్లు చెప్పుకున్నట్లు - మనం ఉన్నామని నమ్మకం కోసం" మనిషికి గుర్తింపు పత్రం ఇవ్వడంలాంటిది (అంటే ఆధార్ కార్డు అన్నమాట)."

"అయితే కమ్యూనిజం తరువాత?" సావిత్రి.

"మళ్లీ రాజరికం" అన్నాను.

"ఏమిటి రాజా?" సావిత్రి ఆశ్చర్యం.

"ఇంటికి ఆడది రాణి అయినట్లు పరిపాలించేవాడే రాజు.. అది ఎలాంటి వ్యవస్థ అయినా.. పిరమిడ్ ఎక్కడున్నా పిరమిడే కదా.."

"అదేమిటి?"

"అదే భౌతికం. నిజమేనన్నమాట" స్టాన్‌స్టన్ అంటాడు..

"అరే ఇంతవరకు అలాంటిది జరగలేదు - పదార్థాన్ని ఎవరూ గుర్తించలేదు. అదే జరిగితే ఈ రాయల్ కాలేజీ, కేంబ్రిడ్జి అవసరం ఉండవు కదా!"

"ఏమిటిది - ఏమైనా అర్థం ఉందా " స్టాన్‌ఫర్డ్ అంటాడు.

"దయచేసి అర్థంచేసుకో. ఇప్పటికి భారతీయ సంస్కృతి - మూలాలు - చాలా చాలా పురాతనమైనవి."

"అవునవును - కొరడాతో, ఐదు రూపాయల హత్యలతో" అని ఎగతాళిగా అన్నాడు.

"అంతేకాదు - మహాత్మాగాంధీ కూడా.." అన్నది సావిత్రి.

"అంతకంటే ఎక్కువ" అని కలిపాను.

స్త్రీ-పురుషులు ఒకటైతేనే ఈ ప్రపంచం ఆగిపోతుంది. అప్పుడు ఆనందం అనేది ఉండదు. ఆనందం ఆలోచనలో ఉండదు. ఆలోచనలోని ఆలోచనే అది. మల్లార్మే చెప్పినట్లు 'అది ఆలోచనలోని విషయం'.

"అద్భుతం" అంది సావిత్రి.

"నేనొక్కడినే రాజరికాన్ని సమర్థిస్తాను" అన్నాను.

"అయితే నువ్వు రాజు - నేను రాణిని అన్నమాట" అంది సావిత్రి ఒక్కసారిగా.

"ఈ ఆశ్రమాన్ని శాంతపరచు
నా చేయి అదురుతుందేమి - ఇదేమి శకునము?
ఇప్పటి నుంచి - ఇక్కడి నుంచి - మన చుట్టూ ఉన్న దాని నుంచి
ఓ మహాద్వారం తెరుచుకుంటుంది - భవిష్యత్తు కార్యాల కోసం.."

అంతకు ముందు - సావిత్రి నన్ను ఒకటి అడిగింది. "రామస్వామి గారు - నాకు ఒక సహాయం చేయగలరా? పాపం, లక్ష్మి, షరీఫ సినిమాకు వెళ్లారు. వాళ్లను డిన్నర్‌కు తీసుకువెళ్ళగలరా? నేను ఈ డాన్స్ ప్రోగ్రాంలో ఇరుక్కుపోయాను". సావిత్రిని ఎలా కాదంటాను? అప్పటికే 8:30 కావచ్చింది. ఇక నేను త్వరగా వెళ్లాలి. సినిమా అయిపోతుంది. ఇప్పుడే సావిత్రి ఒక క్షణం - "సరే మీరు వెళ్ళకండి" అని అనబోయింది. నన్ను వదలటం ఇష్టంలేక. ఇది ఆమె ఆలోచనలోని భావం! అది క్షణ మాత్రమే. డాన్స్, జాజ్, సంగీతం, స్టాన్‌స్టన్ ఎర్రని టై, గోల్డ్ ఫ్రేమ్ కళ్ళజోడు, అన్నీ మర్చిపోయి నాతో ఉండడానికి క్షణకాలం ఆలోచనా ఘర్షణలో ఈ కామ్‌నది ప్రవహిస్తోంది. ట్రినిటీ టవర్ నిలబడి ఉంది. పక్షులు చెట్లమీదకు చేరి, కువకువలాడుతున్నాయి. ఇదిగో రాత్రి కమ్ముకొస్తుంది. ఈ చీకటి శూన్యభావనలతో శ్వాసను నింపివేస్తోంది...

ఇది క్షణ కాలమే. ఆమె ఆలోచనలలో మెదిలాయి. కానీ సావిత్రి సత్యాన్ని అంగీకరిస్తుంది. అంతలోనే నేను బయలుదేరగానే తాను మామూలు స్థితికి వచ్చింది. ఆమె హైహీల్స్ ప్రక్క గదిలో నుంచి వినిపిస్తున్న జాజ్ సంగీతానికి లయ వేస్తున్నాయి. అంతే - నేను అపరిచితునిగా కనిపించి ఉంటాను. స్టాన్‌స్టన్ అంటున్నాడు - 'మేడమ్ - పార్టీలో చేరమంటారా' అని- నేను సినిమా హాల్ చేరడానికి త్వరగా నడవాలి.

అప్పటికే చలి మొదలైంది. నేను కేంబ్రిడ్జి ఘనమైన నిర్మాణాల వెంట చర్చిలు, పుస్తకాల షాపులు, సైకిళ్ళు ఇవన్నీ నాకు వింత అనుభూతిని కలిగించాయి. అరే,

సావిత్రిని వదిలి వచ్చేశానే - ఆమెతో ఏకాంతంగా ఉంటే ఎంత బాగుండును - అని ఆమె స్టాన్‌స్టన్‌తో ఉందని ఆలోచన నాకు ఈ భావన కలిగిస్తే - పాపం లక్ష్మికి - సావిత్రి - నేను కలిసి ఉన్నప్పుడు ఇలాగే అనుకోవచ్చు కదా. ఒక్కసారిగా నాకు లక్ష్మి అంటే సానుభూతి కలిగింది. పొందడం చాలా సాధారణ విషయమనిపించింది. తప్పనిసరి అని కూడా అనిపించింది. ముఖ్యంగా మగవాడికి.

నీవేమీ పొందలేవు అని తెలిసినప్పుడు నీకు సత్యమంటే ఏమిటో తెలిసి వస్తుంది. మహా అయితే మనల్ని మనం స్వాధీనం చేసుకోగలం. మరొకర్ని ఎలా స్వాధీనపరచుకోగలవు?! జీవితం ఒక సుదీర్ఘ తీర్థయాత్ర - ఈ యాత్రలో ఈ స్వాధీన ప్రక్రియ ఒక ముఖ్యమైన భాగం. నాకు విచారము, జాలి కలిగింది. ఆ రాత్రి లక్ష్మితో, షరీఫతో ఎంతో నవ్వుతూ గడిపాను. వారిని భోజనానికి 'తాజ్‌మహల్'కి తీసుకు వెళ్ళాను.

నా దేశస్థులంతా దేశం బయట, నన్ను ఆశ్చర్యపరుస్తారు. వారికి ఒక అస్తిత్వం, గుర్తింపు లేని గుంపుగా అవన్నీ వారి రాష్ట్రంలోనో, జిల్లాలోనో, ఇంటి దగ్గరో వదిలి బొమ్మల్లా వచ్చినట్లు ఉంటారు.

వారణాసి బ్రాహ్మణుడు చెప్పినట్లు మీరు వారి పెద్దల కర్మకాండలు చేసి వాళ్లలాగే ఆవు తోక పట్టుకుని వైతరణి నది దాటడానికి వచ్చినట్లు ప్రపంచానికి మరో వైపు లేక మరో లోకంవైపు చేరటానికి అనిపిస్తారు.

నక్షత్ర మండలానికి - వీరి పెద్దలు చేరినట్లు!

కానీ వీరు తోక పట్టుకున్న ఆవు - తన ప్రయాణంలో ఒక అరటిపండు ఒక దుకాణం నుంచి మరో అరటిపండు మరో దుకాణం నుంచి లాగేస్తుంటుంది. ఇంతలో ఎవరో గడ్డిపరకలు తినిపిస్తారు. మరొకరు కుంకుమ పూస్తారు. పిల్లలు కదిలిపోతున్న ఆవు వెంట పడతారు. ముట్టుకోవడానికి ఓ విధవరాలు ఆవు ముఖానికి దండం పెడుతుంది. ఇంతలో పోలీసులు వచ్చి తన లాఠీతో దాన్ని రెండు పీకుతాడు. ఏ సందులోకో తోలి పోతాడు. అక్కడ అది విశ్రాంతి తీసుకుంటుంది. పచ్చగడ్డి నెమరు వేస్తూ. అప్పుడే సాయంత్రం - సూర్యాస్తమయం అయిపోతాయి.

తీర్థయాత్రికులు గంగా, గౌరీ, మహేశ్వరీ - మాతా అంటూ అన్ని వల్లిస్తూ ఆవును పూజిస్తారు. పళ్ళు, పచ్చగడ్డి తినిపిస్తారు. దహనసంస్కారాలు ఆలస్యం అవుతుంటాయి. శవాలు ఎక్కువ వస్తే కర్మకాండలు చేసే బ్రాహ్మణులు వెంటనే దొరకరు. చాలాసేపు వేచి ఉండాలి. ఒక్కరోజు మూడు నాలుగు శవాలు కాలుతుంటాయి. ఒక్కొక్క దిన బ్రాహ్మణుడు కర్మకాండలు జరపడానికి వారి కోసం

కొత్తగా వచ్చిన భక్తులు చాలాసేపు వేచి ఉండాలి. అప్పటికే ఆ బ్రాహ్మణుల పొట్టలు గుండ్రంగా ఉబ్బి ఉంటాయి. మూడు దిన కర్మ పిండివంటలు తిని.

ఆఁ, అది వారణాసి, కాశి, పవిత్ర గంగాఘాట్. నీవు చేసిన పాపాలన్నీ కడిగేసుకోవచ్చు. కుక్కయినా, ఆవయినా అదిగో ఆ శవ వాహకులు కర్మకాండలు జరిపే బ్రాహ్మణులు నీకు సాయుజ్యం తెచ్చి పెట్టగలరు.

ఇదంతా లక్ష్మికి - షరీఫకి చెప్పి వాళ్ళు బాగా నవ్విపోతే - ఆ విధంగా మనమంతా బ్రాహ్మణులమే. నువ్వు పెట్టే పిండం తినటానికి అప్పటివరకు నందిలాగా కూర్చుని ఉన్నది, ఒక్కసారిగా కాళ్ళలో సత్తువ తెచ్చుకుని లేచి మీ దగ్గరకు వస్తుంది. నీవు పెట్టిన అన్నం ముద్దతో పాటు పచ్చిగడ్డి కూడా తింటుంది.

ఆ విధంగా ఇక్కడ ఉన్న మనమంతా ఆ బ్రాహ్మణ నందిలాంటివాళ్ళం. మనల్ని ఎవరూ దండించరు. పవిత్రమైన వాళ్లం కదా! మనల్ని ఎవరూ శుద్ధి చేయరు. మనం చాలా 'క్లీన్'గా కనపడతాం కదా! మనల్ని అందరూ పూజిస్తారు. మనం ఏమీ చేయవలసిన పనిలేదు.

చనిపోయినవాళ్లను మరో తీరానికి చేరుస్తాం.

మా నవ్వులు మా చుట్టూ ఉన్న పంజాబీలను, దక్షిణాదివాళ్లకు అంతగా రుచించినట్లు లేదు. అసలు ఆడవాళ్లు నవ్వడమే తప్పు మహారాష్ట్రలో. ఆడవాళ్లు అంతగా నవ్వితే త్వరగా భర్తను కోల్పోతారని నమ్మకం చాలామంది భారతీయుల్లో ఉంది - కానీ మాకు దగ్గరలో ఉన్న ముస్లిం కుర్రవాళ్ళు మాత్రం మాతో పాటు హాస్యాన్ని పంచుకున్నారు.

విషయం మార్చడానికి 'చూడండి - ఇవాళ ఇండియా మరో సామ్రాజ్యంగా వెలుగుతోంది. కేంబ్రిడ్జిలో చదివేవాళ్ళంతా ముఖ్యంగా ఇండియా నుంచి వచ్చినవాళ్ళే. ఏ మంత్రి కొడుకో, ఏ అడ్వకేట్ జనరల్ కూతురో, మరో ముఖ్యమంత్రి మేనల్లుడో, జోద్‌పూర్ ఆర్థికమంత్రి కొడుకో, సర్దార్ పటేల్ మనవడో, రఫీ అహ్మద్ కిద్వాయ మారుటి కొడుకో, తిరువాన్కూరు దివాను బావమరిదో - ఇంతమంది మహారాజుల, చక్రవర్తుల వారసులో ఇక్కడ ఉన్నారు.

నెపోలియన్ బోనాపార్టీ అట్లాంటిక్ దీవిలోనే అంతమైపోవాలి. విప్లవం వస్తుంది. 1848 విప్లవం తర్వాత ఆర్థిక విప్లవం ఈ విధంగా చరిత్ర సంఘటనాపరంగాకాక, ఓ పద్ధతిలో మరో నెపోలియన్, మరో విక్టర్ హ్యూగో, కాందిశీకులుగా, మాస్కోలో

బిపిన్ ఛటర్జీ, తర్వాత బాల్జాక్, ఇప్పుడు ఆయన పేరు జైనేంద్ర కుమార్ జైన్, యూజీన్ రాజకుమారి - ఈ సన్యాసినిగా మారిపోతుంది.

షరీఫా బిగ్గరగా నవ్వింది. అయితే మూడో రిపబ్లిక్ ఎప్పుడు అంటూ.

అయ్యో, ఈసారి చరిత్ర తన మనసు మార్చుకుంది. ఇక రిపబ్లిక్‌లు లేవు. మళ్ళీ రాజుగారు వస్తారు.

'ఎవరు?' లక్ష్మి.

"ఎవరో రాథోడ్ రాజు. శ్రీరాముని వారసుడు - ఆయన వెనక వశిష్ఠుడు కూడా ఉంటాడు.."

"వేదాంతం మళ్ళీ సత్యవంతం అవుతుంది. ఇండియా స్వాతంత్ర్యం రాకముందే మహాత్మాగాంధీ చెప్పారు కదా - 'మాకు స్వతంత్రం అంటే బ్రిటిష్ వాళ్ళు వెళ్లిపోవడం కాదు - వాళ్ళు ఎలాగూ వెళ్ళిపోతారు. మేము సత్యాగ్రహులమయినప్పుడు నిజ జీవితంలో - అప్పుడే సత్యాన్వేషణ జరుగుతుంది - అదీ అహింసా మార్గంలో - మనస్ఫూర్తిగా అప్పుడే మాకు స్వతంత్రం' అన్నారు.

భారత్ అంటే ఒక దేశం కాదు. ప్రపంచ దేశాల్లో, చరిత్రలో ఏదో ఒక 'దేశం' కాదు. అది ఒక ఆధ్యాత్మిక అస్తిత్వంగా నిలబడుతుంది.

ఎవరో ఒక పుస్తకం ఇంతకు ముందు 'Forward from Liberalism' అని రాశారు. ఇప్పుడు 'Forward from Marxism' అని రాయాలి.

'Forward to ఎక్కడికి?' షరీఫ అంది.

'అదే - 'వేదాంతం' వరకూ' అన్నాను - నాలో నేను 'సావిత్రి' అనుకున్నట్లు.

"అరే, ఇది తిరోగమనం కదా?" లక్ష్మి.

"వేదాంతంలో ముందు వెనుకలుండవు. 'ఇండియన్ మ్యూజిక్'లో కొత్తదనం ఏమీ లేకుండా అంతా సంగీతమే ఉంటుంది. గంటలు గంటలు రాగాలు పాడటం. ఫయ్యాజ్ ఖాన్ 'ఖేలతా, నందకుమారా' నాలుగు రాత్రులు అలా పాడుతూనే ఉన్నాడు.

అలాగే 'ఇండియన్ హిస్టరీ' అదే - తన పాట తను శ్రావ్యంగా గానం చేస్తూ ఉంటుంది. అది సృష్టించుకుంటుంది. తనను తాను ఆవిష్కరించుకుంటూంది. ఈ భావన అందరిలో వచ్చినప్పుడు నిజమైన స్వతంత్రం సిద్ధిస్తుందని మహాత్ముడు 'మనం స్వతంత్రులమైతే ఈ ప్రపంచానికి స్వాతంత్రం సిద్ధిస్తుంద'ని చెప్పాడు.

'మనమంతా సత్యాగ్రహులమై సత్యాన్వేషణకు నడుం కడితే అదే భారతం..'

నేను పలికింది - నా దేశానికి నివాళిగా, నా పర్వతాలకు, మహానదులకు, మహారణ్యాలకు నివాళిగా అశోకునికో అక్బరు పాలించిన దేశానికో కాదు,

మార్మికమైన, అనామికమైన, అంతఃచక్షువులు, పంచేంద్రియాలుగల ఒక అస్తిత్వానికి, సౌందర్యానికి, సుందరాతి సుందరమైన మాతకు 'జననీ జన్మభూమిశ్చ, స్వర్గాదపీ గరీయసీ.."

ఆ రాత్రి ఇంటికి వెళ్లి మెదలీనాకు మధురాతి మధురమైన లేఖ రాశాను. నాకు ఏది నిజమో అదే చెప్పాను. ఆమెను ఎంతగా ప్రేమిస్తున్నానో చెప్పాను. నేను ఎంతగా మారిపోయానో, ఎంతగా పెరిగిపోయానో, అంతగా ఆమెను ప్రేమిస్తున్నట్లు వివరించాను.

ఆమెను నాకు బిడ్డను ఇచ్చినందుకు, మరో బిడ్డను ఇవ్వబోతున్నందుకు ఆమె స్త్రీయత్వాన్ని అది నా స్వంతం అయినందుకు ఈ సంఘటనా శృంఖలాలన్నీ ఒక కాంతిగా మారిపోతున్నందుకు ఆమెను ఎంతగా గౌరవిస్తున్నానో అంత విశాలంగా ప్రేమిస్తున్నట్లు.

ఇవన్నీ చెప్పడానికి నాకు భాష ఎలా లేదో - అందుకు - నీవు దూరంగా ఉండిపోయినందుకు ఏదో మన ఇద్దరి మధ్య ఉన్న 'ప్రదేశం' ప్రేమతో నింపుతున్నానని అందామె.

అలా రాస్తూ - రాస్తూ ఒక్కసారిగా నాకు తెలియవచ్చింది. ఈ ప్రేమలేఖ మెదలీనాకు రాస్తున్నానా లేక సావిత్రికా అని.

నేను త్వరగా ఆక్స్ వచ్చేస్తాను. వారం పది రోజుల్లో. ఈలోపు అందంగా మరింత అందంగా తయారవుతావుగా - నా ప్రేమ - నా భార్య - నా రాణి - అని ముగించాను.

ఆమె కోసం తెచ్చిన 'మెట్లు' పెట్టెలోనే ఉండిపోయాయి. నాకు శాంతి లేదు. అంతా శూన్యంగా ఉంది. ఆకుల్లేని చెట్లమీద, కామ్ నదిమీద పరచుకున్న శూన్య ప్రదేశంలా ఉంది.

ఎక్కడో అర్ధరాత్రి గంట మోగింది. తర్వాత నిశ్శబ్దం కేంబ్రిడ్జ్ దారుల వెంట ప్రయాణం చేసింది. జూదగాళ్ళు ఇళ్లకు చేరారు.

ఒక వర్షం కురిసిన రాత్రి, ఒక చీకటి రాత్రి, కేంబ్రిడ్జి వదిలి లండన్ చేరాను.

లండన్‌లో సంతోషంగా ఉన్నానా? ఏమో, చెప్పలేను. కెన్సింగ్టన్‌లోని నా గదిలో ఇది పాత మూడంతస్తుల భవనం. దూరంగా నది కనబడుతూ ఉంటుంది. గదిలో నిలకడగా అటూ-ఇటు తిరుగుతున్నాను. పుస్తకాలు అటూ-ఇటూ తిరగేస్తూ అప్పుడప్పుడు గ్యాస్‌మీటర్‌లో నాణాలు వేస్తూ, వేడిగా ఉండాలి కదా, పుస్తకంలో

ఆరవపేజీ చదివి, మంచం మీద ఓ అరగంట నిద్ర కోసం దొర్లుతూ, నన్ను నేను సంభాళించుకోవడానికి ప్రయత్నిస్తున్నాను. ఆలోచనలు, అభిప్రాయాలు నా గురించి, ఇతరుల గురించి ఇవే నాకు ఆహారం.

నాలో ఉన్న శూన్యాన్ని చూడగలుగుతున్నాను. అది నా మానసిక స్థితికి మరో కోణం. అది నాకంటే పురాతనమైనది. ఈ జ్ఞానంలో ఆనందం లేదు. ఉత్సాహం లేదు. అది కేవలం ఒక ఎరుక మాత్రమే. తీర్థయాత్రలోనో, తిరుణాలలోనో తమ్ముడు తప్పిపోయినట్లు, మైళ్ళకొద్దీ వెతుకుతూ తిరిగాను. కనపడినవాళ్ళందరిని అడిగాను. ఇంటి యజమానురాలినీ అడిగాను. వాడు కనిపించాడా? సెలూన్‌లో, దుకాణాల్లో, ఎదురైనా సాధువులని కూడా - కాలంలో వెనక - ముందు వెతికాను. మానవజాతి పూర్తిగా రూపుదిద్దుకోకముందు ఉన్న ఆకారాన్ని కూడా అడిగాను. వారి బండ పెదాలు కదల్లేదు. రాజమహల్లు, మసీదులు, ముసల్మానులు అందరిని 'సోదరా - నా సోదరుడు' కనిపించాడా అని అడుగుతూనే ఉన్నాను.

గంగా తీరంలో, కావేరి నది ఒడ్డున సాధువులను, సన్యాసులను చరిత్రలో వెనక్కి ప్రయాణిస్తూ శోధిస్తూనే ఉన్నాను. ఉపనిషత్ కాలంలో చివరికి యాజ్ఞవల్క్యుని - మైత్రేయుని కూడా ప్రశ్నించాను. ఒక్క ఊరి దగ్గరా నా జ్ఞానం ఏదో ఎంతో కొంత వదిలి వచ్చినట్లు - ఆ జ్ఞాపకాలే సత్యమైనట్లు - చివరికి ఈ ఎరుకే ఇప్పటి నా అస్తిత్వమని గుర్తించాను. నేనే కదా నా సోదరుణ్ణి!

నా కెన్సింగ్టన్ గదిలో, లండన్ చలిలో, తేమ గాలిలో, ఉచ్ఛ్వాశ నిశ్వాసల్లో ఈ స్మృతి జ్ఞానం పూర్తిగా తెలియవచ్చింది.

మనం గతంలో ఎంతకాలం జీవిస్తాము? ఫ్లోరింటైన్ బ్రిడ్జ్ మీద శాంతా మారియా మెడొన్నా విగ్రహం దగ్గర, పైరనీ రోజ్‌మేరీ ప్రాంతంలో ఈస్టర్ సర్వీస్ చేసే చిన్నారి ముఖంలో ఓ పుస్తకం పేరుతో (శీర్షికలు) బిషప్ గారి దృక్కులో - ఇంకా దూరంగా - ఇండియాలో చిన్న రైల్వేస్టేషన్లలో - వారి తలపాగాలు, బీడీ పొగలు - స్టేషన్ మాస్టర్లు - ధూమత్ ఖేడ్, భూమత్ ఖేడ్ అన్నీ తెలిసిన పేర్లలానే ఉంటాయి. మనం ఎప్పుడో అక్కడ నివసించినట్లే ఉంది. చరిత్ర పుస్తకాల్లో యుద్ధాల పేర్లన్నీ గుర్తుంటాయి - దోసకాయలు, కాకరకాయలు, వింధ్య పర్వతాలు, తేనె - కురువాయి తేనేకంటే బాగుంటుంది. నీ బావమరిది సుబ్బుకంటే సుబ్రహ్మణ్యం చూడగానే నచ్చుతాడు - బెంగుళూరు నుంచి అప్పుడే వచ్చాడు - నా చిన్నమ్మ నాకిష్టం - అమ్మమ్మ అంటే పడదు - సరోజ నా చెల్లెలు - ఆమె ఒక స్త్రీగా ఇష్టపడతాను - ఆ తర్వాత మెదలీనా నా జీవితంలోకి వచ్చింది.

ఎక్కడ ఈ చరిత్ర ఆగుతుంది? మళ్లీ ఎక్కడ నుంచి మొదలవుతుంది? శారీరక పరిణామాలు విచిత్రంగా ఉంటాయి. నీవు డైనోసార్‌లాగా, ఒరంగుటాలాగా, బైసన్‌లాగా, పాలపిట్టలాగా, కోయిలలాగా మారిపోయి ఉండవచ్చు. నెమలిలాగానో, ముళ్ళపందిలాగానో రూపాంతరం చెంది ఉండవచ్చు. చివరికి హిమాలయాలలో దేవదారు వృక్షంగా నిలబడిపోయి ఉండవచ్చు.

ఆ దేవదారు వృక్షం కింద కూర్చుని ఉన్నప్పుడు నీ స్మృతులన్ని సుడులు తిరుగుతుంటాయి. వాటికి కాలంతో పని ఏముంది? అవి ఎప్పుడూ నిన్ను వర్తమానంలో ఉంచుతుంటాయి. కానీ నీవు కాలాన్ని తప్పించుకోలేవు. నిన్ను నీవు ఏమార్చుకోవచ్చు. అలాంటి సమయంలోనే ఆ సమయపు చీకట్లలోనే జీవపరిణామపు భయాందోళనలు కలుగుతాయి. కానీ లోతుగా స్మృతుల్లో తవ్వుకుంటూపోతే నీకు బుడంకాయ తారసపడవచ్చు. అది భళ్ళున నీ అడవి మార్గాన పగిలి, శిలాతోరణంలో నుంచి ఓ రాజమహల్, అందులో ఏడుగురు అక్కచెల్లెళ్ళు, రాజకుమార్తెలు, కాథర్లు, అక్కడ నుంచి 'మణి'లోకి ప్రవేశిస్తావు - నీ చేతిలో హోలీగ్రెయిల్ ఉంది కదా!..

అసలు కాలం ఎక్కడుంది? చరిత్ర ఎక్కడ ఉంది? శివోహం - శివోహం - నేనే శివుణ్ణి - నేనే సర్వస్వం!!

నా కెన్సింగ్‌టన్ గదిలో తిరుగుతూనే ఉన్నాను. ఆ రోజు నాకు బాగా గుర్తు. గురువారం. బృహస్పతి రోజు! ప్రతాప్‌కి రాయవలసిన ఉత్తరం గురించి ఆలోచిస్తున్నాను. నా కేంబ్రిడ్జి దర్శన - సావిత్రి సందర్శన - కానీ అతనికి ఇంత కూడా సావిత్రి పట్ల 'ఆశ' కలిగే పదాలేమీ ఉండకూడదనే అనుకున్నాను. ఎందుకంటే ప్రతాప్‌కి సావిత్రి పట్ల 'ఆశ' ఉండటంలో ఆశ్చర్యం ఏమీలేదు. కానీ సావిత్రి ప్రతాప్ గురించి ఎప్పుడు మాట్లాడినా, ఏదో 'కార్యదర్శి' గురించి మాట్లాడినట్లు ప్రస్తావించేది. అదంతా రాజమహల్‌కి సంబంధించిన వ్యవహారాల్లోని భాగంలాగా. ఆమె దయాగుణం - కేవలం కరుణ వ్యక్తపరచడానికే గుర్రపు శాలలోని కుంటి గుర్రాలపట్ల జాలి, రాజమహల్ దొడ్డిలోని ముసలి ఎద్దుపట్ల, జాగ్రత్త - ఇలాంటిదే; ఆమె కరుణార్ద్ర హృదయానికి తర తమ భేదాలు లేవు. ఆ ముసలి ఎద్దుకి మంచి రకం ఉలవలు పెట్టాలి. పచ్చని, మెత్తని గడ్డి పెట్టాలని సూచించేది. ఎందుకంటే ఆ ముసలి ఎద్దు ఇవ్వాళో రేపో చనిపోతుంది - చనిపోవాలి కదా! సన్నాయి మేళంతో, సన్నజాజి పూలతో ఊరేగింపుగా ఖననం చేస్తారు, బత్తాయి తోటలో, తర్వాత ఒకటో రెండో

మామిడి మొక్కలు ఆ సమాధి మీద పెరుగుతాయి. తర్వాత ఏ కన్నెపిల్లో వచ్చి దీపం వెలిగించి, నందికి పూజ చేస్తుంది. అప్పటి నుంచి ప్రతి సాయంత్రం చీకటి పడగానే నూనె దీపం వెలిగించి, దీపం పెడతారు. ఆ రాజమహల్ ప్రహరీ గోడ లోపల. బత్తాయి తోటలో.... నిజానికి సావిత్రిలో ఈ జాలి గుణం నాకు అంతగా నచ్చదు. తన విషయం అసలు నిర్లక్ష్యం చేస్తూ పోతుందని. అందరి హిందూ స్త్రీల మాదిరిగానే. ఆమెకు జీవితం అంటే బండి చక్రం. రాత్రి పగలు తిరుగుతూనే ఉండాలి. కారంగొట్టు, చింతపండు వాసన, బియ్యం, కొబ్బరికాయ, ఇదంతా వర్షాకాలపు వరదలా, పర్వతాల చుట్టూ సెలయేరులాగా, ఒక తీర్థయాత్రలా సాగిపోవాలి. అంతే! ఏమవుతుంది చెప్పండి, వర్షంలో తడిస్తే - ఎండలో ఎండితే? పసుపు తీసుకెళ్లినా - చింతపండు మోసుకెళ్లినా - ఏదైనా? బ్రతుకు బండి చక్రం తిరుగుతూ పోవాల్సిందే. అదే ధర్మం! సావిత్రిని ఎవరైనా వివాహం చేసుకోగలరా? ఎవరైనా ఆత్మను పెళ్లి చేసుకో వీలు ఉంటుందా? ఎవరినైనా ఒకటే - పెళ్లి చేసుకోవచ్చు - అదే ప్రతాప్ కావచ్చు కదా! ఎందుకంటే హుస్సేన్ పాకిస్తాన్ వెళ్ళిపోయాడు. ప్రతాప్ చాలా పరిశుద్ధమైనవాడు - గౌరవప్రదమైన ఉద్యోగం - సావిత్రికి అన్ని విధాలా తగిన వరుడు.

"మీరేమంటారు" నన్ను అడిగింది. నేను కేంబ్రిడ్జి నుంచి లండన్ రావటానికి ఒకటి రెండు రోజుల ముందు అదీ ఒక సాయంత్రం! అప్పటికింకా నది దగ్గరకు చేరలేదు. అక్కడే మేము కవిత్వం, చరిత్ర, మీరా ఇవన్నీ మాట్లాడుకుంటాము.

కానీ ఈ వీధి దీపపు వెలుగులో ఏదైనా మాట్లాడవచ్చు. నెహ్రూ పాలన, ఆమె తండ్రి ఏనుగులు, ఇప్పుడు మూడే ఉన్నాయి. చివరికి ఓ బస్ షెల్టర్లో తడవకుండా నిలబడవచ్చు. లేదా కాపర్ కెటిల్‌లో కాఫీ తాగుతూ ప్రతాప్ గురించి మాట్లాడవచ్చు.

"ప్రతాప్ చాలా మంచివాడు - నీకంటే కూడా" అంది సావిత్రి.

"ఓహో! నేనెప్పుడూ నేను మంచివాడిని అని చెప్పలేదు కదా?"

"కాదనుకోండి. కానీ ఒక యోగిలాగా కనపడతారు కదా.."

"అలా నీవు అనుకుంటే అది నీ బాధ్యత.." అప్పుడే ట్రినిటీ టవర్లో గంటలు మ్రోగుతున్నాయి.

అంతే - ఆమె పుస్తకాలు, పెన్నులు తీసుకుంది. ట్యాక్సీలో ఆమెను గిర్టన్ గేటు దగ్గర దింపారు.

"నేనే మరీ ఆలస్యంగా వచ్చానా?" అంది. అక్కడి కాపలాదారునితో - అతను ముందు గడియారం - తర్వాత నన్ను చూశాడు. "రాకుమారీ, ప్రపంచం ఎప్పుడూ గడియారం ప్రకారం నడవదుకదా?" అన్నాడు. కాస్త కొంటెగా.

ఆమెకు నేనిచ్చిన ఎర్ర గులాబీ అతని బల్ల మీద ఉంచింది. ఇది కాతరిన్‌కి ఇవ్వండి - అని నావైపు తిరిగింది. కాతరిన్‌కి ఏడేళ్లు - చాలా మంచి అమ్మాయి - రామస్వామి గారు - శుభరాత్రి!

టాక్సీలో వస్తూ అనుకున్నాను - సావిత్రికి కాతరిన్ అయినా ప్రతాప్ అయినా ఏమీ వ్యత్యాసం లేదు. ఇద్దరూ మంచివాళ్ళే. ఇద్దరూ పరిచయస్తులే. ఇలా అందరితోనూ ఆమె జీవితం పెనవేసుకు పోతోంది.

ఇవన్నీ ఆలోచిస్తూ అసలు ప్రతాప్‌కి ఉత్తరమే రాయలేదు. ఆరోజు బ్రిటిష్ లైబ్రరీకి వెళ్ళలేదు. అప్పటికే సాయంత్రమవుతోంది. మబ్బుగా ఉంది. మెల్లగా థేమ్స్ నది వెంట నడవడం ప్రారంభించాను.

ఈ నది ఎంత రాజసంగా ఉంది! రంగు కాస్త ఎరుపుగానో కాస్త నీలంగానో ఉండవచ్చు. కానీ నది నడక ఎంత గంభీరంగా, పరిణత స్థాయిలో ఉంటుంది. తన గురించి తనకు పూర్తిగా తెలిసినట్లు - తన గమ్యం ఎక్కడికో ఎరుక ఉన్నట్లు - ప్రవహిస్తోంది! ఇరుప్రక్కలా ఉన్న నిర్మాణాలు - తమ నీడలు నీళ్లల్లో సాగుతుంటే - మనుష్యులు తన ఒడ్డునే నడుస్తూ - ఏదేదో మాట్లాడుతుంటే - చలికి గుర్రాలు సకిలిస్తుంటే - పబ్‌లకు వ్యాపారులు ద్రాక్షాసవాన్ని అందిస్తుంటే, ఆ పబ్బుల్లో గుసగుసలు - గలగలా వినిపిస్తుంటే - లండన్ వాసులకు ఇది వెన్నతో పెట్టిన విద్య - థేమ్స్ మీద వేలాడే మంచు ముత్యాలు జల్లుతున్నట్లు - ఏమో - ఎలిజిబెత్ రాణి - తన సంపాదనంతా అలా గుమ్మరించి వెళ్ళిందేమో - ఓబిరాన్ తన సంగీతాన్ని వినిపిస్తున్నాడేమో.

వనాలు, తోటలు, గుహలు, జనపదాలు, సృష్టింపబడుతున్నాయి. రాజ్యాలు నిర్మించారు. కూలిపోయాయి. వీరులు, బీరాలు పలికారు. యుద్ధాలలో మరణించారు - ఎక్కడో - ఓ యువతి - రాజకుమారి పుష్టిగా ఉన్న యౌవని తన ప్రియుణ్ణి కౌగిలించుకుని ప్రక్కలో చేరి అతని కుడి చేతికి తన ఎడమవైపు స్థనాన్ని అందించలేదా - తన పెదవులతో అతన్ని పరిహారంగా చుంబించలేదా? ఆనందమేగా పవిత్రమైనది!

ఎలిజిబెత్ సంతోషంగా ఉంది కాబట్టి షేక్స్పియర్ పవిత్రుడు - ఇంగ్లాండు మళ్ళీ అంతటి పవిత్రుణ్ణి చూస్తుందా!

నాకైతే నా గతకాలం చాలా ముఖ్యం. వర్తమానాన్ని అవగాహన చేసుకోవాలంటే ఇదిగో చెల్సీ చర్చి దగ్గర వంతెనపై నిలబడి పసుపు దీపాల వెలుగులో క్రింద

నీటిలో పడవలు కదిలిపోతుంటే, నాకు ఇంగ్లాండ్ నా నాడుల్లోకి శ్వాసల్లోకి చేరిపోతున్నట్లుంది - ఎంతగా గౌరవించాను! ఎత్తయిన బస్సులు పెరుగుతూ, పారిపోతుంటే టాక్సీలు నెత్తిమీద దీపంతో కదిలి పోతుంటే - యువతీ యువకులు ఎంతో బాధ్యతగా కేవలం ఈ నగరానికేగాక మానవ జాతి మనుగడ తమ బాధ్యత అన్నట్లు హుందాగా నడుస్తున్నారు - ఉద్యోగానికి వెళ్లే యువకుడు ఒక క్షణం ఆగి ఈ చరిత్రలో భాగమయిపోతున్నాడు - ఓ తండ్రి తన చిన్నారి కూతురుకి లండన్ చూపిస్తున్నాడు - ప్రేమికులు చెట్టాపట్టాలేసుకొని ఒదిగిపోతూ - వెనక చెట్ల క్రింద - నది - చరిత్రకు సాక్షిగా ఉండిపోతున్నారు - కాలం ఇక్కడితో ఆగిపోయి వెనుదిరిగి చూస్తోందా?

లండన్‌లో ఏదో రహస్య జ్ఞానం ఉంది - రాణిగారి పట్టాభిషేకానికి సిద్ధమవుతోంది - ఇంగ్లీష్ వారికి మానవ జాతి ఆంతర్యం తెలుసు.

ఇంగ్లీషు వాడే - తెల్లవాడు కాదు - ఈ బాధ్యత వహిస్తున్నాడు - అమెరికా అనే కొత్త ప్రపంచాన్ని కనుగొన్నది ఇంగ్లీషువాడే కదా-

ప్రపంచవ్యాప్తంగా వ్యాపార లావాదేవీలు, నౌకలు, విమానాలు, ప్రభుత్వాలు, ప్రపంచానికి మర్యాదలు, సమయ పాలన, గౌరవం, క్రమశిక్షణ ఇదంతా ఇంగ్లాండ్ పుణ్యమే. నేను భారతీయుడిగా ఇంగ్లీషు వానిని ఎంత ఏవగించుకున్నా ఇవన్నీ నేను అంగీకరిస్తున్నాను అంటే - అది ఇంగ్లీష్‌వారి ఆధ్యాత్మిక ప్రస్థానమే. ఇప్పుడు రాణీకి అభిషేకం చేస్తున్నారంటే - ఇది వారిని వారు అభిషిక్తుల్ని చేస్తున్నట్లే.

ఇప్పుడు దాదాపు ఆరు గంటలవుతోంది - సాయంత్రం జూలియట్, స్టాగ్ పబ్‌లో ఉంటుందని తెలుసు. నేను అందులో అడుగు పెట్టాను. బత్తాయి రసం తీసుకొని ఆమె కోసం ఎదురు చూస్తూ కూర్చున్నా. జూలీ సావిత్రికి చాలా మంచి స్నేహితురాలు. జూలీ గిర్టన్ కాలేజీ నుంచి పోయిన సంవత్సరం బయటకు వచ్చేసింది. నేను ఒకటి రెండుసార్లు కలిశాను. ఆమెతో ఏ విషయమైనా చర్చించవచ్చు.

జూలీ తరం - యువతరం - యుద్ధంలో పాల్గొని ఉండవచ్చు - లేదా ఆ ఫలితాలు అనుభవించి ఉండవచ్చు. 1945 జూలీకి పద్దెనిమిదేళ్లు. చాలా మనోహరంగా ఉంటుంది. ఇలాంటి విషయానికి పబ్ జీవితం అవసరం ఇతర దేశస్తులకి. కొత్త ఇంగ్లాండ్ కనిపిస్తుంది. పబ్‌లో కలిసేవారు ప్రత్యేకంగా యువతీ యువకులు - నిజానికి యుద్ధం తర్వాత ఇంగ్లాండ్ వయస్సు తగ్గినట్లుంది. ఇంగ్లీష్ వారు చాలా ఓపెన్‌గా ఉంటారు. ఆడపిల్లలు స్త్రీత్వంతో జవజవలాడుతూ

ఉంటారు. నదురూ - బెదురూ లేకుండా - ఈ పబ్‌లన్నీ - జేన్ ఆస్టిన్ (Jane Austen), థాకరే (Thackeray), వర్జీనియా వుల్ఫ్ ప్రపంచాలకు దూరంగా ఉంటాయి. అబ్బాయిలు - అమ్మాయిలు ఇక్కడే కలుస్తుంటారు. స్నేహితులవుతుంటారు - ప్రేమికులవుతుంటారు - ఆ విధంగా జీవితాన్ని ముందుకు తీసుకుపోతుంటారు. సావిత్రితో ఆమె స్నేహితురాలు - సావిత్రి చూశావా - "ఆపిల్ తినడంలోని వెసులుబాటు! నిజానికి ఇప్పుడు నేను ఆపిల్ తింటున్నాను" అంది మార్మికంగా! మార్గరెట్ - అతను ఆ పని చేసినప్పుడు - అందులో కాని పని ఏముంది? పైగా ఆ వ్యవహారం అంతగా మాట్లాడుకోవాల్సింది కాదు కదా!

నిజానికి ఆడామగా కలయిక రోజురోజుకు చాలా సామాన్యమైనపోతుంది. ఈ రోజుల్లో ఆధునిక లేడీ చాటర్లెకి తన ప్రియుడు ఏ థియేటర్‌లోనో తన కుర్చీ ప్రక్కనే ఉండవచ్చు - లేదా చెల్సీ బ్రిడ్జి మీదనే తారసపడవచ్చు.

ఫ్రాన్స్‌లో కంపుకొట్టే బిస్ట్రోలు తెలుసు - కానీ ఎప్పుడూ లోపల అడుగు పెట్టలేదనే చెప్పాలి - మెదలీనాను అలాంటి కంపులో ఊహించగలనా? కానీ ఈ పబ్ సంస్కృతి చాలా నాగరికమైనది!

అంతలో జూలి వచ్చింది - ఆమెతో స్టీఫెన్ కూడా ఉన్నాడు. ఆశావాది - బంగారు రంగు - వంకీల జుత్తు - పచ్చని కళ్ళు - అతని దృష్టిలో అరిస్టోటిల్ - ఈ ప్రపంచం సత్యమని నిరూపించాడు - ఇంకా అనుమానాలకు తావెక్కడ?

"అవును - సందేహానికి - సందేహం ఎందుకు?" అన్నాను.

"ఎవరు నమ్మనిది? నమ్మకం లేనిది ఎవరికి?"

"ఎవరికి కనబడతాడు?"

"నా మైండ్ చూడగలడు.."

"అయితే మైండ్ - మైండ్‌ను చూడగలదా.."

"ఎందుకు చూడలేదు?" స్టీఫెన్.

"నీకు ఒకే సమయంలో రెండు ఆలోచనలు వస్తాయా?"

"ఆగండాగండి - నన్ను మాయలో పడవేయకండి.."

"లేదండీ - నేను అరిస్టాటిల్‌తో మాట్లాడుతున్నాను.."

"అరిస్టోటిల్ స్పష్టమైన న్యాయశాస్త్రం ద్వారా నిరూపించాడు.."

"మీరు ఎప్పుడు ఇండియన్ లాజిక్, న్యాయశాస్త్రం వినలేదా?"

"ఓ.. అవన్నీ ఫిడేలు రాగాలవంటివి!"

"కాదు - కాదు" జూలీ మధ్యలో మృదువుగా..

"కాంతి కాంతిని చూడగలదా?"

“అది ఎలా వీలవుతుంది?” స్టీఫెన్.

“మీకు చెప్పానుగా - మార్మికంగా మాట్లాడవద్దని..”

అప్పుడు జూలీ అంది - “ఆయన మాట్లాడేది స్పష్టంగానే ఉంది - నువ్వు అర్థం కాలేదు అంటున్నావు..”

“నీ తెలివి ముందు నేను ఎంత..” అన్నాడు - మత్తుగా - ఇద్దరికీ బీరు తెచ్చాను - మా చుట్టూ వాతావరణం ఉత్సాహంగా, ఆనందంగా మారిపోతుంది. వ్యాపారస్తులు, ఆస్తిపరులు, అందమైన అమ్మాయిలు, అందరూ చేరుతున్నారు. రచయితలు మోరలెత్తుకొని బీరు తాగుతున్నారు. వాళ్ళతోపాటే ప్రచురణకర్తలూ ఉన్నారు. అంతలో ఒకరిద్దరు చిత్రకారులూ వచ్చారు - ఈజిల్ వగైరాలతో!

ఆడవాళ్లు పూసుకున్న పూల పరిమళాలతోపాటు పబ్‌లోని మిగతా అన్ని రకాల వాసనలు కలిసిపోయాయి. మనిషి మంచివాడే సుమా!

సహజమైనది - లోపం లేకుండా ఉంటుందని దీనికి జీవితంతో అవసరం లేదు - జీవితం అంటే ప్రేమ - ప్రేమించడం - సౌకుమార్యం - బంగారు జుత్తు - లావణ్యం - ఆడదాని పొత్తు - థేమ్సు ఎప్పుడూ ప్రవహిస్తూనే ఉంటుంది.

వాళ్ళిద్దరికీ మరొకసారి బీరు తెచ్చాను.

“చివరిగా ఒక ప్రశ్న - స్టీఫెన్?” అడగనా అన్నాను.

“ఓహో! ఇంకా ప్రశ్నలా..” అన్నాడు.

“బ్రెయిన్ - పదార్థమేనా?”

“అందులో సందేహం ఏముంది?” స్టీఫెన్.

“అంటే మన బ్రెయిన్ - పదార్థమే - ఈ భూమి పదార్థమే..”

“అది అలాగే - ఇండియన్ ఫిలాసఫర్‌గారు..”

“మరి అలాంటప్పుడు మట్టిని - లేదా భూమిని - భూమి ఎలా అర్థం చేసుకుంటుంది?”

“స్టీఫెన్ - అయితే నేను జూలియట్‌తో సంభోగిస్తే జూలీ అర్థం అవుతుందా - అయినా కాకపోయినా నేను ఆనందంగానే ఉన్నాను..” అక్కడితో స్టీఫెన్ ఆగిపోయాడు.

జూలీ - “నేను ఒక పుస్తక సమీక్ష రాస్తున్నాను - అందులో దేవుడున్నాడు - చెడు ఉన్నది కాబట్టి - అని ఉంది..”

“దేవుడంటే నీవే అర్థంలో అంటున్నావో - కానీ రెండు వ్యతిరేకాలు లేకపోతే ఈ ప్రపంచం ఉండదు - రెండు భిన్నమైన ప్రకృతిగల వస్తువులతోనే ప్రపంచం పోకడ ఉంటుంది - నీ చేతిలో రెండు పాదరసపు బిందువులు విడిగా ఉంచలేవు కదా! 'రెడ్ సీ'ని అరేబియన్ సీతో కలిపినట్లు - అవి రెండూ నీరే - ఒకటే.

ఇప్పుడు చెప్పండి - మట్టిలాంటి పదార్థమైన మెదడు - మట్టిని - భూమిని ఎలా సాకేతంగా చూస్తుంది - నీటిని - నీటికి వ్యతిరేకంగా ఎలా చూస్తాం? అంటే ఏదైనా ఉన్నది అంటే - అది ఉండటమే.

“మీరంతా పిచ్చివాళ్ళే - గాంధీ కూడా - ఇదిగో ఇప్పుడే మీరు నిరూపించారు” స్టీఫెన్.

“నేను అరాచకవాదిని - నాకు పదార్థం యదార్థమే - జూలీ నాకు సత్యమే - అలాగే నేను కూడా - ఇప్పుడు మీరు బీరు తెస్తారుగా - అది కూడా - మనం ఖర్చు పెట్టేది - ఈసారి పెద్ద సీసా తీసుకురండి - నెహ్రూకు జిందాబాద్!” స్టీఫెన్ ఉత్సాహంగా!

పబ్‌లో అందరూ గ్లాసులు పైకెత్తి - ‘ఛీర్స్ ఇండియా’ అన్నారు.

అరే, అదీ ఇంగ్లీషు పబ్. ఇంతటి మానవత్వం ఎక్కడా ఉండదు.

ఇలాంటి వాతావరణం ఫ్రాన్స్‌లో శ్రామికులలోనే ఉంటుంది. మధ్యతరగతి సమాజంలో మచ్చుకైనా కనిపించదు. అక్కడంతా దుర్మార్గమే. ఎందుకంటే అతను ఓడిపోయాడు - దానికి కారణం కూడా అతడే. బాడీలేర్‌కి ఇదే జరిగింది. అతని మారుటి తండ్రి - కంపు కొట్టే తల్లి - అతన్ని నాశనం చేశారు - అప్పుడు కదా ఆయన నల్లమ్మాయి దగ్గరకు చేరాడు. గతి తార్కికత సుఖ పురుషుని పెదవులపైనే ఉంటుంది.

కానీ ఇంగ్లాండు యువ వయసులో ఉంది. అయితే నాకు అంతగా పరిచయం లేదు. వీరి సహజత్వం - అమాయకత్వం నన్ను ఆకట్టుకున్నాయి. ఉత్సాహం కూడా - వీధి తలుపులకు ‘జుడా’లు పెట్టుకోరు. ఇంకా ‘ద్వారపాలకుల’ అలవాటు కూడా లేదు! వారి తోటల్లో పూలు పూస్తున్నాయి. ఎర్రని ఫ్లోరసెంట్ దీపాలు భవనాల మీద వెలుగుతుంటాయి. థేమ్స్ నది ప్రవహిస్తూనే ఉంటుంది.

తెల్లని సున్నపు కొండలు - నదీ సంగమం దగ్గర అర్థచంద్రాకారంలో నవ్వుతూ ఉంటాయి - అప్పుడే సీగల్ పక్షులు నావలతో పాటు రెక్కలు చాస్తుంటాయి. రాత్రికి గూటికి చేరాలి కదా!

ఇవన్నీ వదలి నేను ఫ్రాన్స్ వెళ్లిపోవాలి - నాకు వెన్నులో వణుకు వచ్చింది. ఈ ‘సమయం’ ఆగిపోతే బాగుండును కదా - ప్రపంచమంతా ఇంగ్లాండ్‌గా మారిపోతే-

ఆ మర్నాడు సావిత్రితో పాటు నడుస్తున్నాను. సాయంత్రం నదీతీరం వెంటనే - ఆమెతో నా ఆలోచనలు - ముఖ్యంగా ఇంగ్లాండ్ గురించి చెప్పాను... త్వరలోనే

రాణిగారు వస్తుంది. ఇప్పుడు రాజు అనారోగ్యంతో ఉన్నాడు - హైడ్ పార్క్ చెట్లు - నీటి కొలనులు - పిచ్చుకలు - పావురాలు - కుక్కలు - అన్నిటికీ ఏదో జరగబోతోందని తెలిసినట్లుంది - త్వరలో ఇప్పటి రాజరికం అంతం కాబోతోంది.

'ఏ రాజరికం?' అంది విద్యార్థినిలా సావిత్రి. ఇంకా నీకు అర్థం కాలేదా? జార్జ్-V చనిపోయినప్పటి నుంచీ ఎడ్వర్డ్-VIII తన సింహాసనాన్ని పరిత్యజించినప్పటి నుండీ 'కింగ్ హాల్' బాంక్ గుమస్తాల పాలన అలవాటు చేసినప్పటి నుంచీ ఈ దేశం తన మతాన్ని తాను ఎంచుకొని (Protestant) రాజు తన రాణిని తానే ఎంపిక చేసుకోవచ్చు - ఒక మహా సామ్రాజ్యాన్ని ఏర్పరచుకోలేదా?

ఎంతగా పెరిగిపోయింది - చివరికి పెర్త్‌లో ఏమి జరిగినా - అమెరికాలో ఇంకేమైనా స్టాక్‌మార్కెట్లు ఉన్న ధరలు - కరెంటు షేర్లో - అన్నీ వ్యాపారాలు రాజుని నిర్వీర్యం చేశాయి. హెన్రీ-V తర్వాత ఏ రాజు పరిపాలించాడు-

ఆ తర్వాత భరతుడు అయోధ్యరాజ్యాన్ని పాలించినట్లు - ఇంగ్లాండు కూడా భరతుణ్ణి తీసుకు వచ్చింది. 'నేను రాజును కాదు - రాజుగారి తమ్ముణ్ణి..' అంటూ చెబుతోంది. ఆయన పాదరక్షలు సింహాసనం మీద పెట్టి పాలిస్తున్నాను. నా ప్రక్కన నా అన్న ఉంటే ఎంత బాగుంటుంది?' అని భరతుడు వాపోలేదా?

రాజరికం - వ్యక్తిగతం కాదు - థేమ్స్ నదీ ప్రవాహంలాగా - అది జనన మరణాల మాదిరి - అనంతమైనది. కిరీటం చరిత్రకే ఉంటుంది. రాజు క్షమాపణ చెప్పకూడదు. రాజు తప్పు చేయడు అనేది - ఒక ధర్మానికి సంబంధించింది - కమ్యూనిస్టులు ఇలాగే అంటారు - 'పార్టీ ఏనాడూ తప్పు చేయదు...' అనేది ఒక ధర్మానికి సంబంధించింది -

కేంబ్రిడ్జిలో కమ్యూనిస్టుల గురించి మాట్లాడినప్పుడు - ఒక విషయం మరిచిపోయాను - కమ్యూనిజం తప్పనిసరిగా విజయం సాధించాలి - అదే అందరికీ మేలు-

హిట్లర్‌కీ - స్టాలిన్‌కి భేదం చూడు-

స్టాలిన్ - ఉక్కుమనిషి - క్రెమ్లిన్ వెనక రహస్యం - వ్యక్తిత్వంతో సంబంధం లేని వ్యక్తి! హింస, అభివృద్ధి - మరణం అన్నింటినీ వికారంగా తీసుకోగలగాలి - చరిత్ర వైయక్తికం కాదు.

క్రైస్తవులు బైబిల్ సూచనల కోసం వెతికినట్లు - స్టాలిన్ చరిత్రలో చిహ్నాల కోసం వెతికాడు - స్టాలిన్ చరిత్రలో జీవించాడు - చరిత్రగానే అంతరించాడు-

మరోవైపు హిట్లర్ - నూరెంబర్గ్ ర్యాలీల్లో - అంతా ప్రదర్శించేట్లు - తన గంభీరమైన గొంతుతో ఉపన్యాసాలతో జనాన్ని రెచ్చగొడుతూ - తన వ్యక్తిగత ప్రణాళికలతో రాక్షసత్వంతో జర్మనీ హిట్లర్‌గా సూపర్‌మాన్‌గా చనిపోయాడు - ద్వంద్వమే కథానాయకత్వం-

అదే 'వ్యక్తిత్వ వికాసం' - అదే కీర్తి.

ద్వంద్వ వ్యక్తిత్వంతో యోగిగా మానవత్వంతో పెద్దగా గొప్పగా హీరోగా వ్యక్తిగా చక్రవర్తిగా చివరికి ఒక విగ్రహంలా అందంగా చెక్కిన విగ్రహంలా నిలిచిపోవాలి!

ఇప్పుడు సావిత్రి నన్ను చెల్సీ వంతెన మీదకు తీసుకు వెళ్ళింది. నేను క్రింద నదీ ప్రవాహాన్ని చూస్తూ చెప్పసాగాను.

వ్యక్తిగతంకానిది - వినయంగా ఉండేవాడు - ధైర్యంగానూ ఉండలేడు - అదే కాతర్లయితే స్వచ్ఛమైనవారు - Trotsky గొప్ప విప్లవకారుడు - ఏ ప్రయోజనం - భయం లేకుండా మంటల్లో దూకగలడు - నన్నెవరూ చెడగొట్టలేరు - నేను అవినీతిపరుణ్ణి కాదు - అని గర్వంగా నేనే ఈ అగ్నిని అనేవాడు కూడా.

కాని స్టాలిన్‌కి ఇవన్నీ అవసరంలేదు. క్రెమ్లిన్ చుట్టూ వేలమంది కాపలా ఉంటారు - వేగుల మీద వేగులు - ఎవడికైనా ఎక్కువ తెలిస్తే - వాడి తల తెగవలసిందే - ప్రాణానికి విలువ లేదు. Yagoda కాని లేక Yezhov ఎవరైనా సరే - స్టాలిన్ దృష్టిలో వారిని చరిత్ర చంపింది. అలాగే స్టాలిన్ Trotsky ని చంపుతాడు - ఎందుకంటే అతను చరిత్రకు వ్యతిరేకి!

చరిత్ర ముందుకు సాగాలంటే మానవత్వం - మంచితనం ఎందుకూ కొరగాని గొప్పతనం పనికి రావు - అందుకనే - మార్షల్ తుకచెవోస్కీ - చనిపోవాలి - వ్యక్తిగతం కాని పాలకుడు ఎవరినీ జోరుగా ఎదగడానికి అంగీకరించడు-

స్టాలిన్ హీరో కాదు - అతనో రాజు - అతనో దేవుడు! సావిత్రి నా చేతిని లాగుతూ - 'నీ వాదన ఎంత బాగా వినిపిస్తావు' అంది.

'అదిగో అటు చూడు నౌకలు - అదిగో పైన చూడు - చంద్రుడు మబ్బులతో దోబూచులాడుతున్నాడు' అంటూ...

నేను పాడనా? 'మామా - చందమామా' అని అంటూ పాడాను.

మళ్ళీ చరిత్రలోకి వెళ్ళాం-

మనకి సూపర్‌మాన్ శత్రువు - ఇండియాలో ఏమి జరిగిందో చూడు - అరబిందో శంకరాచార్య అద్వైతాన్ని మెరుగు పరచాలని ప్రయత్నించాడు - పూర్ణానుసారాన్ని ఏ విధంగా మెరుగు పరుస్తావు? ఏ అంకె అయినా సున్నా ఉంటేనే కదా విలువ పెరిగేది - అలాగే అన్ని శాస్త్రాలు - వేదాంతంతో అంతం కావలసిందే - వేదాంతాన్ని

మెరుగు పరచ శక్యం కాదు - శూన్యాన్ని - వైయక్తింగా తీసుకోకూడదు - కాని సంఖ్యలన్నీ ద్వంద్వాలే - ఒకదానితో మరొకటి - కాని 'శూన్యం' అలా కాదు - అది పరిపూర్ణం.

నేను ఒకటి కాదు - నేను రెండు కాదు-

నేను నిర్వికల్ప - నిర్వాకారరూపిని-

నేను నేనే-

అరవిందుని విషయంలో ఆయన పాండిచ్చేరిలో చేరి కొత్త ప్రపంచాన్ని సృష్టించాలని అనుకున్నారు.

నువ్వు మూడంతస్తులు కట్టగలిగితే అయిదు కూడా కట్టగలవు కదా - అలా ఎంపైర్ స్టేట్ బిల్డింగ్‌లా వంద అంతస్తులు కట్టవచ్చు కదా-

అలాగే విమానాలు ప్రారంభంలో గంటకు యాభై మైళ్ళు తర్వాత వంద - మూడు వందలు - ఇప్పుడు ధ్వని వేగంకంటే ఎక్కువగా పయనిస్తున్నాయి. అలాగే ఎన్ని ప్రపంచాలైనా నిర్మించవచ్చు - కాని నిన్ను నీవు అధిగమించలేవు - నీ అవ్యక్తిక సిద్ధాంతాన్ని మార్చలేవు - అలాగే స్టాలిన్ చరిత్రలో వ్యక్తిని భౌతికపరంగా వ్యక్తీకరించి చివరికి ఈజిప్టులోని మమ్మీల మాదిరి మిగిల్చాడు-

అరబిందో కుళ్ళి కృశించి నశించిపోయే భౌతిక ప్రపంచాన్ని శాశ్వతం చేయాలని ప్రయత్నించాడు.

నైతికత - భౌతికం: కలిసి ప్రయాణం చేయాలి. మరణం లేనిది - నైతిక భావన - మరణం - శారీరకమైనది - ప్రకృతి విరుద్ధమైన విషయం - అమృతం సేవించటం అది నైతిక భావన - జీవసంబంధమైన ప్రక్రియను అధిగమించడం అత్యాశలాంటిది - ప్రకృతి నియమాలను ఉల్లంఘించటమే.

నైతికత - 'మమ్మి ఫికేషన్'తో పిరమిడ్‌లో అంతం కావలసిందే.

'నాకు ఊపిరాడటం లేదు - మీరు నన్ను చాలా దూరం - చాలా వేగంగా తీసుకుపోతున్నారు' సావిత్రి.

'ఒక్క నిమిషం - సావిత్రీ - త్వరగా ముగిస్తాను - మనిషికి శత్రువు సూపర్‌మాన్ - అతన్ని ఏ పేరుతో పిలిచినా అరబిందో స్టాలిన్, జరతూస్త్ర - పోడర్ జోషిమా - ఎలా అయినా సంబోధించు - అంతా మానవాళికి శత్రువులే'.

'ఇది చరిత్రలో కొత్త పెద్ద మనిషిని ఆవిష్కరిస్తోంది' అంటూ నవ్వింది సావిత్రి. (పోడర్ జోషిమా) అతను డాస్టోవిస్కీ పుస్తకంలోని ఒక పాత్ర - కుళ్ళి, కృశించి, కంపు కొట్టి చనిపోతాడు అందరిలాగానే - అతని మాయలు - మంత్రాలు ఏమీ కాపాడలేవు.

అరబిందో చనిపోయిన తర్వాత ఆయన శిష్యులు ఆయన పార్థివ శరీరాన్ని అలాగే ఉంచాల్సింది. మరణాన్ని జయించాలని తపించిన బోధకుడు - గురువు - అందరిలాగానే - జీర్ణించి మట్టిలో కలిసిపోయాడు. ఆయన శ్వాస ఆగిపోయి ఉంటుంది. నేత్రాలు గడ్డకట్టి ఉంటాయి. యోగి కదా - పద్మాసనంలో - కూర్చుండిపోయాడు. అది ఒకరకంగా అందమైన దృశ్యమే!

అప్పటికి గాలిలో తేమ పెరిగిపోయింది - చలిగాలి వంటి ఉష్ణోగ్రతను తగ్గించివేస్తోంది.

సావిత్రి - 'నేను ప్రకృతి నియమాలకు లోబడి ఉన్నాను. ఇప్పుడు వేడి - ఆహారం తప్పనిసరి' అంది. ఆమె రొమ్ములపైకి చీర కప్పుకుని ఈ తేమ నీకు కూడా మంచిది కాదు.

ఆమెతో ఏకీభవించి - నది నుంచి దూరంగా వచ్చాము. నీకు తెలుసా - జూలీ - ఇప్పుడు స్టాగ్ పబ్‌లో ఉండవచ్చు. అంతే, సావిత్రి 'నీకు ప్రదేశాలు, వ్యక్తులు బాగా తెలుసు!' అంటూ నవ్వింది - వెళ్దాం పదండి!'

'ఏమిటి సావిత్రి - పబ్‌లోనా?' ఆశ్చర్యం! అన్నాను.

'ఎక్కడికైనా సరే - నీతో తీసుకువెళ్ళు - వస్తాను ప్రియా' అని గునిసింది. 'నన్ను వెచ్చగా ఉంచు' నా చేతిని గట్టిగా పట్టుకుని - అంతే - నా ముందు మరో ప్రపంచం నిద్ర లేచినట్లు తెలియవచ్చింది.

'ఎక్కడికైనా - నన్ను వెచ్చగా ఉంచు.'

అరే - ఇది నేనేనా - బడిపంతులు - ఆరడుగుల వంగిపోతున్న బలహీనపు బ్రాహ్మడు - ఇది నేనేనా? ఆమె ప్రేమంపు కువకువలు విన్నది నేనేనా?

ఆమె ఈ మాటలు మొదటిసారిగా నాతోనే అంటుంది - ఇంతవరకు ఎవ్వరితోనూ అని ఉండదు కూడా - చరిత్ర నా మేథ - అన్ని ఆవిరయిపోయినాయి. ఒక్కసారిగా - ఆమెను పొదివి పట్టుకున్నాను - దగ్గరగా తీసుకుని నా శరీరానికి అదుముకున్నాను - నా భుజాల వరకూ కూడా రాని ఈ చిన్న ప్రాణిని - పొదివి కౌగిలించుకున్నాను. సందులు - చీకటి దారులూ దాటి టాక్సీ ఎక్కాం! ఆమెను నా చేతుల్లో చుట్టి - సాహోకి పోదాం - అన్నాను. ఒకరికొకరు - మా ఇద్దరి మధ్య ఉన్న ఖాళీ - ఏదో వెలుగుతో నిండి ఉంది - అదే దైవమా?

హెన్రీ ఫ్రాంక్ (Henry Frank) మాటలు గుర్తు వస్తున్నాయి.

'దేవుడు మనుష్యుల మధ్య విరామంలో ఉంటాడు' - ఆమెతో అన్నాను - 'అవును - ఇది దివ్యమే' దివ్యమైన క్షణాలే - అని గొణుగుతూ నిశ్శబ్దంలోకి వెళ్ళిపోయింది. మరి కొంతసేపటికి 'ఎక్కడికైనా తీసుకు పో - వెచ్చగా ప్రియా'.

'ఎక్కడికైనా వస్తావా? సావిత్రి?'

'ఎక్కడికైనా సరే-'

'ఇప్పుడే - రా - వెళ్దాం - రా.'

'ఓ - లేదు - రాలేను - నేను వెనక్కు వెళ్ళాలి!'

'ప్రతాప్ దగ్గరకు వెళ్ళాలి..' అంది.

'రా - తీసుకు వెళ్తాను' అని మరింత దగ్గరగా హత్తుకున్నాను.

'అవును - అదే దివ్యమైన క్షణాలు' అని నా ఒడిలో ఒదిగిపోయింది.

ఆమె పెదవులు స్పృశించాను - అవి కాంతితో వెలుగుతున్నాయి. తేనెతో తడిసి ఉన్నాయి. కవిత్వంలో పదాల మధ్య ఖాళీలా, సంగీతంలా!

ఇప్పుడు లండన్ - నగరం కాదు - నేనే లండన్ నగరాన్ని - ఈ ప్రపంచం నాకు ఒక ప్రదేశం కాదు - అది ఒక్క క్షణం స్తంభించిన కాలం - వర్తమానం.

బార్బిరోలిలో చియాంటి తీసుకురమ్మని చెప్పాను వెయిటర్‌కి.

'ఇప్పుడు నీవు ఇటాలియన్ నేర్చుకోవాలి-'

నేను కొత్త కెరటంలా తిరిగి వచ్చాను

కొత్తగా మొక్కలాగా మొలుచుకొచ్చాను.

ఆకాశాన్ని అంటుకుని ఉన్న తారలాగా

సావిత్రికి పాడి వినిపించాను - నువ్వు ఇటాలియన్ నేర్చుకో - ఆ భాషలో దివ్యమైన మంత్రాలున్నాయి. దేవుడు ధనవంతుడు - ఆర్నో నది మీద వారధి ఉంది - అది పెళ్ళి ఊరేగింపులకు ప్రత్యేకం!

'అవును, అలహాబాద్‌లో కూడా ఉంది. అయితే దానిని 'వేటగాని వారధి' అంటారు.

'సరే - సూపర్‌మాన్ - గురించి మాట్లాడనా?'

'ఆఁ ఇప్పుడు ఈ వైన్‌తో వెచ్చగా ఉంది - చెప్పండి! ఇప్పుడు మీతో చదరంగం ఆడమన్నా సిద్ధంగా ఉన్నాను.

'ఇప్పుడు మంత్రి సూపర్ మాన్'

'మరి రాజు?'

అతను యోగి - వేదాంతి - అక్కడ ద్వంద్వం లేదు.

'ఇది ఈ వైన్‌తో కష్టంగానే ఉంది' - 'రామా - మిమ్మల్ని అలా పిలవవచ్చా? - నా కోసం ఒక పాట పాడండి - మీ ఒడిలో వాలిపోయి - ఎక్కడా ఏమీ ఉండదో -

ఎవ్వరూ కనపడరో - తండ్రీ - డబ్బు - రాజమందిరాలు - ఏనుగులు - ఏమీ ఉండవో - ఒక్క అమ్మ తప్ప - ఏదో పర్వతం మీదికి...''

'కైలాస్ పర్వతమా?'

నీవు ధ్యానంలో కూర్చుని ఉంటావా?

మరి నువ్వు?

'నువ్వు - మేల్కోవాలని - ప్రపంచాన్ని భస్మీపటలం చేయకుండా మూడో కన్ను తెరిచి - అదే నేత్రం ఇప్పుడు చరిత్రతో ఆడుకుంటుంది కదా - అంటూ నవ్వింది. 'పక్షులు పాడుతుంటాయి - మామిడి తోరణాలు నవనవలాడుతుంటాయి - ఉదయ కిరణాలు మెరుస్తుంటాయి-' అన్నాను.

'నేను మూడుసార్లు ప్రదక్షిణం చేస్తా - మీ బూడిదరంగు పాదాల చెంత తలవాల్చి - నన్ను నీలో ఐక్యం చేసుకో స్వామీ అని అర్థిస్తుంటాను - నేను - స్త్రీని...''

''నేను హిందూ స్త్రీని'' అంది మెల్లగా - గిరిధర గోపాలా కృష్ణా-

నావాడివి కదా - నీవు తప్ప ఇంకెవ్వరు-

చరిత్రలో స్టాలిన్, సూపర్ మాన్ అందరూ ఎగిరిపోయారు.

చరిత్ర చిక్కులు విప్పాలని ప్రయత్నించి, ఏదో చిక్కుముడి విప్పి జానపదంలోలాగా ఇప్పుడు నాకు రాజకుమారి లభించింది.

ఓ రాజకుమారి - బుడంకాయలో నుంచి వచ్చింది.

నేను రాజమహల్ ప్రవేశించేసరికి రాజకుమారి కోసం మంత్రి కుమారుడు తిరుగుబాటు చేశాడు. ఏడుగురు రాజకుమారిలలో ఆరుగురిని నిర్బంధించాడు. మా ఇద్దర్నీ కట్టడి చేశాడు.

తిలటజెల్ మార్క్‌రాజుకి నేను ఈమెను అప్పగించాలి. కాని నేను అమృతం తాగాను కదా - ఆమె నా కోసం అదిగో ఆ సెలయేరు ప్రక్కనే, అడవిలో ఎదురు చూస్తుంది - నన్ను డ్రాగన్‌లు ముక్కలు చేస్తాయి. ఏదో ఒక రోజు ఈ అడవిలోనే మేము కలుసుకుంటాం. మా మధ్యలో ఓ కరవాలం ఉంటుంది. ఏదో ఒక రోజు ప్రేమ ఈ రాళ్ళన్నీ పగలగొట్టి మేము స్వేచ్ఛగా ఉండగలుగుతాం - మా సామ్రాజ్యం నిర్మించుకుంటాం.

''అప్పుడు మనకో బిడ్డ కలుగుతాడు''

''కాదు, ఇద్దరు - వినాయకుడు - కుమారస్వామి.''

అప్పుడు హోలీ రంగులు జల్లుకుందాం.

కొండ మీద చంద్రుడు వెలుగుతున్నాడు. మన్మథుడు పూలబాణాలు వదులుతున్నాడు.

ఎందుకు అతన్ని భస్మం చేయాలి?

'ఎందుకు చేయకూడదు - ఎప్పుడైతే ఆకర్షణ పోతుందో అప్పుడు మూడో కన్ను తెరుచుకుంటుంది!'

'బహుశా నిన్ను నేను ఆకర్షించలేదనుకుంటా..'

'అవును - ఆకర్షణ కాదు - అలా అయితే హుస్సేన్ మించి నన్నెవరూ ఆకర్షించలేరు - అతను మొగల్ చిత్రంలా ఉంటాడు - కాని ఎంత అందం ఉన్నా ఇదిగో - ఇక్కడంతా ఖాళీ' అని తలచూపింది. హిందూ స్త్రీకి తన కృష్ణుణ్ణి ఎలా ఆరాధించాలో తెలుసు. యమునా నది వెన్నెల్లో తడిసినప్పుడు గోవులన్నీ పాలిచ్చి నెమరువేస్తున్నప్పుడు బృందావనంలో కృష్ణుడు ఆడుకుంటున్నాడు. ఆ గోమందలన్నీ తాళ్ళు తెంపుకుని, లేళ్ళన్నీ అడవిలో నుంచి పారిపోయి బృందావనం చేరుతుంటే నెమళ్ళన్నీ నాట్యం చేస్తుంటే కృష్ణుడు ఎర్రని నేల మీద నృత్యం చేస్తుంటే అక్కడ ప్రేమ ఉత్సవం జరుగుతుంది. గోపికలు సిగ్గు విడిచి గోప యువకులు కోపం మరచి బృందావనంలో కృష్ణుని కేళిలో కలిసిపోతారు. మాకు అక్కడ స్వాగతం - సుస్వాగతం చెప్తారు - రా వెళ్దాం - అని సావిత్రి నన్ను నడిపించింది. అలా తిరుగుతూ పికడిల్లీ (Picadilly) వచ్చాం - రంగు రంగు దీపాలతో శోభాయమానంగా వెలిగిపోతోంది. బస్ కోసం వేచి ఉన్న 'క్యూ'లు (Tube) ట్యూబ్ రైలుకు వెళ్ళే మెట్లదారులు, ఇవన్నీ మేము ఈ ప్రపంచంలోనే ఉన్నామని గుర్తు చేస్తున్నాయి. చివరిగా గ్రోవర్ వీధిలో ఉన్న ఆడవారి హాస్టల్‌కి వరకూ వచ్చాం. ఇక్కడే గౌరి - సావిత్రి కోసం ఎప్పుడూ గది సిద్ధంగా ఉంచుతుంది. గౌరి హైదరాబాద్ నుంచి వచ్చింది. సావిత్రిలాగానే బొద్దుగా ఉంటుంది. కాస్త వాగుడుకాయ, అయినా సావిత్రిని జాగ్రత్తగా చూసుకుంటుంది. నాకు సావిత్రి గురించి ఎప్పుడూ భయమే - ఎక్కడ తప్పిపోతుందోనని! ఏదో పెన్ను - కళ్ళజోడు ఆమె మరిచిపోయినవి - తెచ్చి ఇవ్వటం కాదు - సావిత్రిని మళ్ళీ సావిత్రి దగ్గరకు తీసుకు రావటం!

"నేను ఇక్కడే ఉన్నాను - రేపు చూడండి. సరిగ్గా 14వ నంబర్ బస్ ఎక్కి 10 గంటలకు మీ ముందుంటాను. కెన్సింగ్ టన్‌లో" అని సవాలు చేసింది సావిత్రి. ఆమెను వదలి వస్తుంటే!

మర్నాడు పదింటికి ఆమె గౌరితో ఏదో జాకెట్టు గురించి మాట్లాడుతూంటుందని నాకు తెలుసు - నేను ఫోన్ చేసి ఆమెకు సమయాన్ని గుర్తు చేయాలి - 'చెప్తున్నానుగా - మీరు చేయాల్సిన పని లేదు' 'బిగ్ బెన్ కంటే ఖచ్చితంగా ఉంటాను రేపు!"

సావిత్రికి ప్రాధాన్యానికి, సామాన్యమైన విషయానికి అంత వ్యత్యాసం ఉండదు.

ఆమెను వదలి వస్తూ ఆమె చేతిని స్పర్శించాను - ఆ ఇంద్రియ జ్ఞానాన్ని నాతో తీసుకువెళ్లగలనా? ఇదెలా ఉందంటే ఒక ఆలోచనను ముట్టుకోగలమా - ఏదో కాఫీ కప్పు - నీటి చెంబు మాదిరిగా లేదా కదిలే గుర్రాన్ని ముట్టుకున్నట్లు? ఈ ఆలోచన స్థిరంగా ఉండదు - చైతన్యంతో వెలుగుతుంటుంది. ఉల్కలాగా తోక మండుతూ ఉంది! ఉల్కల దారి! నాకనిపించింది. ఇది సత్యం - ఇది పాలమీగడ - ఇది ఆనందం అని!

మర్నాడు లేచి స్నానం చేసి పంచెకట్టి, లాల్చీ వేసుకుని ముందుగా కొంతసేపు ధ్యానం చేసి అప్పటికి పది దాటిపోయింది. ఎక్కడా సావిత్రి జాడ లేదు. అంతగా ఆలస్యం కాకుండానే ఆమె కంచిపట్టు చీరతో, నీలాంబరిలాగా నెమలి పింఛంలాంటి జాకెట్టు వేసుకొని నుదుట కుంకుమ దిద్ది వచ్చింది! ఆమెకు ఆమే ఆశ్చర్యంగొలిపే విధంగా ఉంది. నేను వెళ్ళి ఆమె చేయి పట్టుకొని తీసుకు వద్దామని అనుకున్నాను కాని ఆమె నడకలోని వింత పోకడ చూసి ఆగిపోయాను.

"నేను శివుణ్ణి ప్రార్థిస్తున్నాను" అవును- శివుణ్ణే - అంటూ ఆమె చేతి సంచి తెరిచింది. గంధపు ధూప కళికను తీసింది. ఆమె కదలికలన్నీ ప్రౌఢ నిశ్శబ్దంలా ఉన్నాయి. 'దీనిని వెలిగించండి' అని అర్థించింది - నేను ఆ ధూపకాష్ఠాన్ని వెలిగించి తీసుకు వచ్చే సమయానికి ఆమె పూజాసామాగ్రినంతటినీ తన చుట్టూ పరచుకుని కూర్చున్నది. చిన్న వెండి హారతి పాత్ర, కర్పూరంతో వెండి కుంకుమ భరణి - గులాబీలు, తాజాగా నీటి బిందువులతో-

"నాకు గంగాజలం తెచ్చిపెట్టండి!" అని వెండిపళ్ళెం ముందుకు తెచ్చింది. కొన్ని నీళ్ళు వంపాను. ఆ నీటితో కుంకుమ కలిపింది.

"నన్ను - నాకు, నా పనికి అడ్డు రాకండి. ఇది ఆడవాళ్ళ వ్యవహారం" అంది.

"అరె, కాదు...." అని అడ్డు చెబుతూనే ఉన్నాను.

"మీరే కదా ఇంటి దగ్గర మగవాడు హిందూ ధర్మం ప్రకారం స్త్రీ ఆజ్ఞ పాటించాలని అన్నారు?"

"అవును, అలాగే పాటిస్తాను..."

అప్పుడు నా ముందు మోకాళ్లపై వంగి, నా చెప్పులు ఒక్కొక్కటి తీసి దూరంగా పెట్టింది. పూలు, కుంకుమ తీసుకుని ఏదో పాట సన్నగా పాడుకుంటూ నా పాదాలకు అభిషేకం చేసింది. ఇప్పుడు కర్పూరం వెలిగించి, ఆ పాత్రను కుంకుమ కలిపిన నీటి పళ్ళెంలో పెట్టి నాకు ఒకటి, రెండు, మూడు సార్లు హారతి ఇచ్చింది.

తర్వాత నా పాదాలను ముట్టుకుని, నీరు చిలకరించి, తన తలపై జల్లుకుంది. మళ్ళీ మోకరిల్లి, ఆమె తలను నా కాళ్ళకు ఆనించి, చాలాసేపు బరువుగా శ్వాసిస్తూ మెల్లగా వెక్కివెక్కి ఏడ్చింది. అంతలో తనను తాను సంబాళించుకుని, లేచింది. కొద్దిగా కుంకుమ భరణిలో నుంచి కుంకుమ తీసి తన నుదుట పెట్టుకుని తర్వాత పాపిట్లో దిద్దుకుంది. తర్వాత తన కుచద్వయం - ప్రేమ పొత్తిళ్ళలో పూసుకుంది.

ఆ తర్వాత ఒకరినొకరం తాకలేదు. అలాగే చాలాసేపు ఉండిపోయాం. "అలాగే ఉండు సావిత్రి" అన్నాను. ఒక్కసారిగా నా పెట్టెలోని మెట్టెలు - చిన్నమ్మ ఇచ్చిన అమ్మ మెట్టెలు గుర్తు వచ్చాయి.

"నేనెక్కడికి వెళ్తాను - వెళ్ళగలను, నేను నీ దానను కదా!" అంది.

మెల్లగా ఏదో గుడిలో వరండాలలో దారి తప్పినట్లు ఇంట్లోకి వెళ్ళి పెట్టె తెరచి, మెట్టెలు వెతికి, వాటికి చుట్టిన కాగితం తీశాను. వాటితో కొబ్బరికాయ, తమలపాకులు, వక్కలు, కుంకుమ, చిన్నమ్మ ఇచ్చినవన్నీ ఆమె కోడలి కోసం పెట్టినవి అన్నీ తెచ్చి "అవును - నేను ఈ ఉదయం అన్నిటితో సిద్ధంగానే ఉన్నాను.."

"నిజంగా" అని నవ్వింది - కాని ఆశ్చర్యపోలేదు.

"అవును - సావిత్రి - ఇది ఎప్పుడో - ఎప్పుడెప్పుడో జన్మాంతర కాలంలోనే నిర్ణయం జరిగిపోయింది.

"అవును - ఈ కేంబ్రిడ్జి విద్యార్థిని - సిగరెట్టు పొగ వదిలే చిమ్నీ - జాజ్‌కి చిందులు వేసే ఆటవిక - అంటుంది.

"నా స్వామి నాకు తెలుసు - వెయ్యి జన్మల నుంచీ - జన్మజన్మల నుంచి నా కృష్ణుడు నాకు తెలుసు..." అని.

"కృష్ణునికి - రాధ వలనే తానెవరో తెలిసింది. లేకపోతేహిమాలయాల మంచులో తపస్సులో ఉండేవాడు. యమునా తీరంలో నెమలిపింఛం ధరించి రాధ నవ్వులు వింటున్నాడు - ప్రకృతిలోని సంగీతం ఆమెలో వింటున్నాడు. రాత్రిలోని అర్థాన్ని - ఎర్రని మట్టిలోని జీవాన్ని తెలుసుకుంటున్నాడు - రాధ, అన్నీ రాధే కదా తెలియపరిచింది!"

"ఇది నా వధువు - నా ప్రేమ - నా ఇంటి నుంచి వచ్చిన నా తల్లి ధరించి మెట్టెలు - ఈ తమలపాకులు కొబ్బరి కాయ ఈ కుంకుమ - అన్నీ నా ఇంటి నుంచే" అని ఆమెను కుంకుమతో అభిషేకించాను. "ఇప్పుడు నన్ను ఈ మెట్టలు నీ కాలివేలికి పెట్టనీ.."

"వద్దు..." కోపంగా ఆపింది. నీవు బ్రాహ్మణ బిడ్డవు కావచ్చు. కానీ ఏ హిందూ స్త్రీ తన దేవుణ్ణి తన కాళ్ళను ముట్టుకోనివ్వదు..."

"అరె, ఎంత అమాయకురాలివి. అందుకే బ్రాహ్మణుని అవసరం రాజులకు రాణులకు రైతులకు వ్యాపారులకు అందరికీ తెలియజెప్పటానికి..."

"నీకు తెలియదా హిందూ పెళ్ళిలో వధూవరులిద్దరకూ ఒకేసారి అభిషేకం చేస్తారు. ఇద్దరూ గురువు, తల్లిదండ్రులకు పాదాభివందనం కలిపి చేస్తారు? అంటే గురువు దేవునికంటే గొప్పవాడు సుమా! ఇప్పుడు ఇవి నీ కాలి వేళ్ళకు తొడగనీ.."

ఇంతటి సిద్ధాంత రాద్ధాంతం ఆమెను అడ్డగించకుండా చేసింది. సావిత్రి బొటన వ్రేలి ప్రక్క వేలికి అమ్మ పెట్టుకున్న మెట్టెలు తొడిగాను. అవి ఆమెకు సరిగ్గా సరిపోయాయి. చిన్నమ్మ చెప్పినట్లు ఇవి మెదలీనాకు పెద్దవైపోయేవి.

సావిత్రి నా మంచం మీద కూర్చుండిపోయింది. ఎండ పొడ పవిత్రంగా ఆమె రాజ్‌పుట్ ముఖ పద్మం మీద పడి వెలుగుతోంది.

ఆమె మీరా భజన - పాడటం మొదలుపెట్టింది.

ఓ సాధుపుంగవా - ఓ సాధుపుంగవా - పోకు - వెళ్ళిపోకు - నా చితిని రాజెయ్యి.

నేను దగ్ధమయిన తర్వాత

చితాభస్మాని - నీ నుదుట పూసుకో-

ఓ సాధూ వెళ్ళకు....

రాత్రి 9.00 గంటలకు విక్టోరియా స్టేషన్‌కి వెళ్ళాం. చాలా ఆనందంగా, చాలా సంతోషంగా ఉన్నాం. మా ఇద్దర్నీ ఎవ్వరూ వేరు చేయలేరు. మళ్ళీ వివాహమూ చేయలేరు. మేము వివాహం చేసుకోలేదు. మాకు పెళ్ళే కాలేదు. అయితే ఒకరినొకరు పూర్తి ఎరుకతో ఎలా ఉంటాం?

"ఓ ప్రియా, ఓ ప్రియా, ఓ స్వామీ" అంటూ మంత్రంలా వినిపిస్తోంది. నా ప్రేమ, నా దేవుడు...

ఫ్లోరెన్స్ ఇటలీ ఆర్నో రివర్ బ్రిడ్జ్

"అయితే ఆర్నో వారధి - ఇటలీ, కుమారస్వామి, ఎప్పుడు?" అన్నాను.

(పెళ్ళి ఊరేగింపు - సంతానం)

అప్పుడు ఆమె ముఖం రైలు కిటికీలో నుంచి బైటకు పెట్టినపుడు ఆమె బుగ్గలు కన్నీటి కాటుక చారికలతో తడిసిపోయి ఉన్నాయి.

"ఒక్క మాట ఇవ్వగలను..." సావిత్రి

"ఏమిటది రాకుమారీ?" అడిగాను నవ్వుతూ.

"పార్వతి, శివుని దగ్గరకు వస్తుంది. శివుడు ధ్యానముద్రలో మైమరచి ఉన్నపుడు తన మూడో నేత్రం తెరిచి ముల్లోకాలను భస్మం చేయటానికి ముందు...

"అర్థం కాలేదు..." నేను భయంతో వణికిపోయాను. "వస్తాను, నా అవసరం నీకు లేనపుడు, నేను లేకుండా నీవు ఉండగలిగినపుడు ఓ సాధుపుంగవా?"

"ఇప్పుడు నాకు పూర్తిగా అర్థమయింది - సావిత్రి ఏ విషయమైనా స్పష్టంగా చెప్పగలదు. అదీ సత్యమే చెప్పగలదు. కానీ ఆమె పవిత్రమైన సత్యాన్ని వివిధ సమయాల్లో వివిధ పాఠాల్లో మార్చగలదు.

"నాకర్థమయింది - అలాగే అంగీకరిస్తున్నాను.." స్పష్టంగా, గంభీరంగా అన్నాను.

(ఇప్పటికీ నా గొంతు నాకు వినిపిస్తోంది..)

"ఇటలీ - ఎప్పుడంటే, శివోహం - శివోహం సత్యమయినపుడు-

"మరి అప్పటివరకూ?"

"అప్పటి వరకూ - నేను అలహాబాద్ వెళ్తాను. ప్రతాప్‌ను పెళ్ళి చేసుకుంటాను.."

"అంటే కొత్త గవర్నర్ గారి ఇల్లాలుగా పెత్తనం చేస్తారన్నమాట..." కొంత బాధతో కొంత తప్పనిసరిగా విధి లేక అన్నాను.

"రాజమహల్ గాని, ప్రభుత్వ బంగళాగాని అవి సమానంగా వ్యతిరేకాలే!" అన్నాను.

"మరి ఈ చరిత్ర జ్ఞాని - ఏమి చేస్తారో?"

"కాథర్ల చరిత్ర పూర్తి చేస్తాను.. మధ్య యుగపు ఐరోపా చరిత్ర బోధిస్తుంటాను. అదీ భారతీయ విశ్వవిద్యాలయంలో-

భారతదేశం చాలా విశాలమయింది - విభిన్నమయింది కూడా"

"నేనెప్పుడూ మంచి విద్యార్థినే" సావిత్రి.

అంతే - రైలు కూతపెట్టి సావిత్రిని తీసుకెళ్ళిపోయింది.

టాక్సీలో స్టాగ్ పబ్‌కి వెళ్ళాను. లేక 'బంచ్ ఆఫ్ గ్రేప్స్'కో నాకు సరిగా గుర్తులేదు. ఓ గడ్డపు చిత్రకారునితో ఒకటో రెండో గ్లాసులు తాపాను. అతను నైరూప్య చిత్రాల గురించి మట్లాడాడు - పబ్ ఎప్పుడూ పవిత్రంగానే ఉంటుంది. నువ్వు పవిత్రంగా ఉంటే!!

మన భయాందోళనలతో ముడిపడి ఉన్న మానసిక శృంఖలాలే మన విధి అని, డెస్టినీ అని అనుకుంటాను.

మధ్యమధ్యలో మనం చేసే ప్రయత్నాలే జన్మనక్షత్ర రాశులేమో! కర్మ నిర్వహించటం, నిర్వర్తించటం, నిన్ను నువ్వు తెలియపరచుకోవటం... స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు పూర్తిగా మానసికమైనవి. నీ వెలుపలు ఏమీ ఉండదు.

ఈ పూర్తి ప్రక్రియ ఇదే జీవిత కేంద్రం. విధి అది 'నేను'. ఎప్పుడైనా విధిని తప్పించుకోగలవా? అలాగే 'నేను'ను కూడా. ఆ 'నేను' విధిని అధిగమించగలను అని అంటావా? ఆ అనేది కూడా 'నేనే' కదా! ఈ 'నేను' ఏమైనా అనగలదా? లేదు గాక లేదు - అలాగే, విధి కాని, అనంతమైన కాలం నుంచి వేరుపడతాయా? కాని కాలం తన దర్శనంలో ఈ అనంతం ఉంటుంది. ఎలాగంటే అలలు లేస్తుంటాయి. అదీ నీరే కదా. గాలి వీచినపుడు, వర్షం విసిరినపుడు, ఈ తరంగాలు తెల్లని తరగలుగా తెరలు తెరలుగా లేచి పడుతుంటాయి. మెల్లగా, వేగంగా పరుగులు పెడతాయి. ఎక్కడికి - చివరికి తీరానికే. కానీ ఈ తెరలు - తరంగాలు ఇందులో చైతన్యం లేదు. కాదు. అసలు జీవం నీరే. నీటి కదలికలే జీవనం Lila.

సాధించటమంటే ఆత్మజ్ఞానమే. అదే స్వచ్ఛమైన ప్రాధాన్యత! బాహిర్ముఖమైన కార్యకలాపాలు ఆగిపోవాలి. అప్పుడే మనం క్షేమంగా ఉండగలుగుతాం. అదే ప్రశాంత నిర్వేదం.

మానసిక బంధాలన్నీ ఒక్కొక్కటి తొలగిపోతాయి. మధ్యధరా సముద్రంలా ప్రశాంతంగా ఉండగలుగుతాం.

నిన్ను నువ్వు గుర్తించగల జ్ఞానమే బ్రాహ్మణ్యం. జగన్నాథభట్టు అయినా, తార్కికుడు కపిలాచార్యుడైనా, అంతర్ముఖులై దర్శించిన జ్ఞానం ఏదో ఒక సమయంలో క్షణం ఆగి, నిన్ను నీవు చూడగలగాలి - జీవితంలోకి! వివాహం కాని- మాతృత్వం కాని, బాధ కాని, ప్రేమ పాశం కాని, ప్రేమ విజయం కాని ఇవన్నీ నిన్ను నీలోకి నడిపేవే - ఈ మునకలన్నీ నిన్ను గంగలో - నీలోని గంగలో ముంచి తేల్చేవే - ముడులన్నీ విడిపోవాల్సిందే -

"నా శరీరమే వారణాసి -

నాలో ప్రవహించేదే గంగ - ముల్లోకాలకూ మాత..."

వారణాసి పవిత్రమైనది - గంగామాత పాపాలన్నీ ప్రక్షాళన చేస్తుంది - కర్మ చేస్తూ - ఇది నా కోసం కాదు - అనుకోవటం పాపం - అలాగే కర్మఫలాన్ని ఆశించకపోవటం - నీకు స్వేచ్ఛనిస్తుంది-

అలాంటి పవిత్రమైన గంగలో - జీవన విధి కలిసిపోతుంది - నీ అనంత సముద్రంలోకి నీవు వెళ్ళిపోతావు - తెరచాపలన్నీ తెరుచుకుని వెళ్ళిపోతావు...

ఇంగ్లీష్ ఛానల్ దాటటానికి ఫెర్రీ ఎక్కాను. ఒకప్రక్క ఇంగ్లాండ్ పైన నీలాకాశం - క్రింద ఆకుపచ్చని సముద్రపుటలలు - ఆ ప్రక్క ఫ్రాన్స్ తీరం!

ఇంగ్లాండ్ - విడిగా పవిత్రంగా - ఇంగ్లాండ్ ఒంటరిగా ఉండిపోయింది - మరో తీరాన - ఫ్రాన్స్ - విప్లవంతో వెర్రెక్కిన జన సముద్రం - మానవ హక్కుల కోసం - కేకలు పెట్టిన జనసంద్రం - బానిసత్వపు సంకెళ్ళు తెంచుకున్న ఆధునిక సమాజం - వర్గవైవిధ్యపు గందరగోళం - అది ఫ్రాన్స్! ఫ్రాన్స్‌లో దేవుడు - అడ్డరోడ్ల కూడలిలో చలిమంట ముందు కూర్చుంటాడు - చేతులు వేడి చేసుకుంటూ-

డెక్ మీద కూర్చుని సీగల్ పక్షులు నాపై ఎగురుతుంటే - ఉప్పుగాలి నా శ్వాసలో ప్రవేశిస్తుంటే - మెల్లగా నాకు వచ్చిన ఉత్తరాలు చదవడానికి సిద్ధమైనాను.

వారం రోజులుగా వెళ్లక - ఇదిగో ఇప్పుడు ఈ ప్రయాణం ముందు - కుక్స్ బర్కెలీ వీధిలో నుంచి ఈ ఉత్తరాలు తెచ్చుకున్నాను. ఆ ఉదయం గ్రీన్ పార్క్ ఎంతో అందంగా ఉంది - ఖాళీగా, సెలయేళ్ళతో - రాజప్రసాదంతో - కేవలం నా కోసమే తయారైన పామ్ చెట్ల వీధితో - ఈ ఇంగ్లాండు నాదే సుమా - పేరుతో విడిగా - పవిత్రంగా ఉండిపోయిన ఈ ప్రదేశం! ఇంగ్లాండును ప్రేమించకుండా ఇక్కడ నివసించలేవు - నీకు ప్రవేశం దొరకదు - డ్రూయిడ్స్ - వాళ్ళు వెళ్ళిపోయే ముందు - ఈ వాతావరణంలో ఈ గాలికి ఊగే చెట్లతో ఏదో వదిలి వెళ్ళిపోయారు-

ఉత్తరాలు నాలుగే - నేనెంతో స్వేచ్ఛగా ఉన్నాననిపిస్తోంది - నిజానికి ఇప్పుడు లేచి ఈ సముద్రం మీద నుంచి నడిచి వెళ్లిపోగలననిపిస్తోంది - ఆకాశంలోకి ఎగిరిపోవాలని - ఏదో సంగీత వాద్యపు నాదంలా గాలిలో ప్రయాణం చేయగలననీ అనిపిస్తోంది.

ప్రపంచంలో ఎక్కడో ఏదో జరిగింది - దాని ప్రభావం నాలో వింతగా, కచ్చితంగా తెలుస్తోంది-

నేను తెరిచిన మొదటి ఉత్తరం - సరోజ రాసింది. కాస్త విచారకరమైనదే - కానీ స్పష్టంగానే ఉంది - ఆమె రోజూ పడే బాధలు ఏకరువు పెట్టింది - మెడికల్ కాలేజీలో ప్రవేశం నిరాకరించారని - కేవలం తను బ్రాహ్మణి కావడం మూలంగానని వాపోయింది.

"రోజూ - మంచం మీద పడుకొని ఆలోచిస్తూంటాను - నాన్న కానీ నాన్న గురించి - ఏదో దూర దేశంలో ఉన్న అన్న గురించి - ఈ పోరాటం ఒంటరిగా చేయలేను - నేను నీలాగా 'యోగిని' కాదు - వివాహం చేసుకోవాలని నిశ్చయించుకున్నాను - నేను ఎంపిక చేసుకొన్న వరుడు - బహుశా నీవు ఎంపిక చేయవు - నేను కన్నడం మాట్లాడితే అతను నేపాలి మాట్లాడతాడు - నేను చెస్ ఆడితే అతను గోల్ఫ్ ఆడతాడు - బాగా సంపాదిస్తున్నాడు. దయగలవాడు - నన్ను అపురూపంగా చూసుకుంటాడు - వచ్చి ఆశీర్వదించి - అన్నయ్యా వచ్చి అక్షింతలు వేయి...."

ఇంటికి పెద్ద కొడుకుగా ఇదే నా నిర్వాకం! బొంబాయిలో చిన్నమ్మకు చేసిన వాగ్దానం ఈ విధంగా నెరవేరుస్తూన్నాను.

మిగతా రెండు ఉత్తరాలు ఏదో ఆస్తిపాస్తులకు సంబంధించినవి. నాన్నగారి బీమా డబ్బు కోసం - కొన్ని ఆస్తులు చిన్నమ్మకు దఖలు పరచటానికి.

సుకుమారికి నేనే కదా గార్డియన్ - ఆమె స్కూలు నుంచి మార్కుల కాగితం కూడా వచ్చింది - నా సంతకం కోసం - నేను అన్నను - మగవాణ్ణి ఇంటికి పెద్దను.

చివరగా తెరిచింది మెదలీనా ఉత్తరం - నా మనసులోని ఆందోళనతో చిక్కుపడిన ఆలోచనలతో ఆ ఉత్తరం చదివాను. ఎంతో విచారంగా, ఎంతో స్వేచ్ఛగా ఉంది. ఆమె కూడా ఏదో ఆందోళనకు లోనవుతుంది. మా ఏనుగు ఆమెతో అన్నీ చెబుతుంది. ఆమె వేదన నాలోకి ప్రవేశించింది.

"నేను నిన్నేమి అడగగలను? అడగాలంటే తీసుకునే అర్హత ఉండాలి కదా! ఇచ్చేది ఎవరు? పుచ్చుకునేది ఎవరు? జీవన గమనంలోని శ్రావ్యత! నీవు నాకు ఉన్నావు - అని తెలుసు - నీవు లేవా? అదీ నాకు తెలుసు? ఉన్నావనే అనుకుంటాను. నిన్ను పోగొట్టుకుంటానా? అదీ తెలుసు! కానీ నిన్ను వదిలి ఎక్కడికి వెళ్ళగలను ప్రియా?"

బోలోన్ అసహ్యంగా ఉంది - చిమ్నీలతో, పొగతో - మురికి పట్టిన ఇళ్లతో - వర్షంతో. రైలెక్కి వెచ్చని కాఫీ తాగాను - ఆ రాత్రి రైలు కదలికల్లో - ఒంటరితనంతో నిద్రపోయాను - నిద్రకు లయ అవసరం - రైలు చక్రాల ప్రార్థనా శబ్దాలతో -

విచారం కొంత తగ్గవచ్చు - మన ప్రాధాన్యతలు తగ్గితే త్వరగా శాంతి లభిస్తుంది. నీవు నిద్రపోయి - పారిస్ చేరుకుంటావు - ఖాళీగా, మత్తుగా, ఈఫిల్ టవర్లా సాగినట్లుంది.

నేను దిగిన హోటల్ మాక్ మోహన్ ఎవెన్యూలో ఉంది - అందులోని పాలరాతి ఫ్లోరింగ్ - పురాతనమైన బీరువాలు - అక్కడక్కడ అలంకరించిన ఏ నాటివో చిత్రాలు, శిల్పాలు - ఇది మరో లోకంలోకి వచ్చినట్లుంది. ఒకవేళ వాటిని నేను ముట్టుకుంటే - చచ్చినవాటిని నిద్రలేపినట్లుంటుంది. బట్టలు మార్చుకుని బజారులు తిరగటానికి బయలుదేరాను - అదే ఈఫిల్ టవర్ చుట్టూ ఉన్న 'ఛాంప్ ఎలీస్'లో పుస్తకాల దుకాణాలు తెరిచి ఉంటాయని ఆశతో - కానీ పుస్తకాలు ఇక్కడ ఎందుకు ఉంటాయి?

ఇక్కడ ఆడదాని పవిత్రతకు చిల్లులు పడుతుంది - నీకు పొడవాటి కాళ్ళు, తెల్లని శరీరం, లావుగా సన్నగా ఆహ్వానిస్తూ - అదిగో - ఆ కనిపించే అమ్మాయిని చూసి - నవ్వి - నాతో తీసుకుపోయి - ప్రక్కలో పడుకోబెట్టుకుని - తీయితీయని కబుర్లు చెప్పాలని! నేను పవిత్రంగానే ఉన్నాను - కానీ నా వేదన - ఇలాంటి కోరికలు కలిగిస్తోంది!

మగవాడు శారీరకంగా బలహీనుడే - కానీ పారిస్ వారకాంత - ఆమెలోని విచారం - నీ వేదనకు అర్థాన్ని కలిగిస్తుంది. ఆప్యాయంగా కూడా ఉంటుంది. బహుశా కవిత్వ ప్రకృతి తెలియజేస్తుంది. అందరి ఆడవాళ్ళు కవిత్వంతో నిండినవాళ్ళు - అదిగో దాన్ని అన్వేషిస్తూనే మనం అక్కడికి చేరతాం. మన స్వాతంత్ర్యాన్ని పోగొట్టుకుంటాం. వారణాసిలో వారకాంతలు గంగమ్మ ఒడిలో పసుపు కుంకుమలతో బంగారు నగలతో మునుగుతారు. అప్పుడు వారి యౌవనం మళ్ళీ వస్తుంది. వారి స్తనాలు గట్టిపడతాయి. వారి శరీరాలు లావణ్యంతో మెరుస్తాయి. వారే నిన్ను ఆహ్వానిస్తున్నారు. నీలోకి నిన్ను ఆహ్వానిస్తారు - నీ ఎరుక నీకు కలిగిస్తారు - తెలుసునని తెలుసుకోవటమే ఎరుక - దీనికి వేరే పేరేమి ఉంటుంది? కాని నీ పెదాలకు అంటే కర్పూరపు విడెములు తాంబూలం - ఓ చందమామ - నా వజ్రమా - నా ప్రాణమా - అంటూ మౌనంగా పాడదా?

కాదు - ఇది సంపద కాదు - నాగరకత మరొకటి ఉంది. అక్కడ కన్యత్వం - జ్ఞానంతో అంతరిస్తుంది. ఆడతనం వేళ్ళ సందు నుంచి జారిపోతుంది - సిగ్గుతో, రహస్యంగా!

నీకు ఆమె తెలియాలి - అర్థం కాకూడదు - నీవు ఆమెను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించావా? - ఇక నీ జ్ఞాన యాత్ర ముగిసినట్లే.

ఆడవారంతా కవిత్వం మాట్లాడగలరు - వారు పేర్లు చెప్పినా వంట సామగ్రి గురించి మాట్లాడగలరు - పిల్లవాడి తడిగుడ్డలు గురించి చెప్పినా అంతా కవిత్వమే. అవన్నీ ఆమె ప్రక్కన మనం పరుండి - ఆ క్షణం ఆమెను ప్రేమిస్తున్నామని - దాని కోసం క్షణకాలమైనా మరణించగలమని తెలుసుకోవటమే మనం చేయగలిగింది!

అలా తిరిగి తిరిగి హోటల్‌కు చేరాను. నా అవసరాలన్నీ పురాతనమైనవి. తప్పనిసరివి - సహజమైనవి. కాని నేను బ్రాహ్మణుణ్ణి కదా - ఈ పారిస్ వారకాంత దారి తప్పిన మధ్యతరగతి పిల్ల కావచ్చు. ఒకసారి క్లిచీ కేఫ్‌లో కలిసిన ఇటలీ అమ్మాయిలాంటిది. ఆమెకు కాఫీ ఇచ్చి శాంత పరచిన తర్వాత నాతో చెప్పింది. ఇటలీ నుంచి వచ్చానని. ఒక గౌరవనీయమైన పెద్దమనిషికి భార్యనని. ఆయన మరో చెడిపోయిన స్త్రీతో వెళ్ళిపోయాడని. తాను దిక్కులేనిదాననయిపోయానని! అలా ఒకరి నుంచి మరొకరు అంతా గౌరవనీయమే సుమా. యౌవనం ఎంతకాలం ఉంటుంది! తెలిసేలోపు వెలిసిపోతుంది. ''నేను ఇల్లు బాగా చూడగలను. బట్టలు చక్కగా ఇస్త్రీ చేయగలను. డబ్బు వృథా చేయను. నాకు కావలసింది ఒక గూడు. ఓ తోడు..'' అంది. ఆమెకు కొంత డబ్బిచ్చి చిరునామా తీసుకున్నాను. నా నిజాయితీని తెలిపేందుకు - కానీ మళ్ళీ ఆమెను కలిసే ప్రయత్నం చేయలేదు.

నాకు పసుపు పూసిన శరీరం - కర్పూరపు వాసన కావాలి.

ఇవన్నీ పిచ్చి ఆలోచనలు - ఈ పారిస్ - చాంప్ ఎలీస్‌లో ఉన్న వాతావరణం అలాంటిది. నేను 'లాటిన్ క్వార్టర్'లో హోటల్ తీసుకోవలసింది. Deux Magots కి వెళ్ళాల్సింది. చిత్ర విమర్శకుడు - హెన్రీ బీడీనితో మాట్లాడి ఉండాల్సింది.

కాదా - హోటల్ అట్లాండైడ్‌లో ఉండాల్సింది. సీన్ వీధిలో - ఎంత బాగుండేది - ఒక్కసారిగా ఈ తిరుగుడులో అర్థరాత్రి అయిందని మర్చిపోయాను.

సావిత్రి పడుకుని ఉంటుంది, కళ్ళు తెరుచుకుని. ఇంకా ఆమె కాటుక చారికలు బుగ్గల మీదే ఉండి ఉంటాయి.

''ఎందుకు ప్రియా - ఈ కాటుక చారికలు ఇలాగే ఉండనీ - అద్దంలో చూసుకుంటున్నప్పుడు - నీ కోసం కన్నీరు కార్చానని తృప్తి ఉంటుంది.

ఇంకా వింత వికారపు సంగతి చెప్పనా? రామా! విడ్డూరంగానే అనిపిస్తుంది. ఆదివారం నుంచీ - అదే నీవు నన్ను వదలి వెళ్ళినప్పటి నుంచీ - నా నోరు పుక్కిలించనే లేదు తెలుసా? ఆదివారం నుంచీ నా పెదవులు కడగనే లేదు. నీవు ఇంగ్లాండు వదలి వెళ్ళే వరకూ నీ చుంబన పరిమళాలు పోకూడదని. అలాగే ఉండిపోయాను."

ఆ ఉదయమే చెప్పింది - చూడండి ఈ లోగా మా ఇద్దరి మధ్య ఎంత నీరు, ఎంత నేల చేరిపోయిందో. ఈ పారిస్‌లో నడిచే అపరిచితుడు కూడా సావిత్రి సామీప్యాన్ని ఆమె నిశ్శబ్దాన్ని, ఆమె లావణ్యాన్ని, కదలికలని, ఆమె ఆడతనాన్ని గుర్తు చేస్తున్నాయి. గుర్తుకు తెస్తున్నాయి.

ఇక్కడ ఆడా మగా తేడా ఏముంది. మగవాడికి ఆడదే దిక్కు. శుభ్రంగా ఉన్నా లేకున్నా- ఆలోచనలన్నీ సావిత్రి చుట్టూ తిరుగుతుంటే నేను నా నోరు శుభ్రం చేసుకొని పడుకున్నాను...

చాలా బాగా నిద్ర పట్టింది...!

ఆ తర్వాత కొన్నాళ్లపాటు పారిస్‌లోని చాలా పొడవైన వీధి రూ ది రిషెలూ సోర్బాన్ (యూనివర్సిటీ) మధ్య తిరుగుతూ, నోట్స్ సరి చూసుకుంటూ, పియర్ ది బ్యూవిల్ ఆఫ్ ఆవినానె గురించి జాతీయ గ్రంథాలయంలో సమాచారం సేకరిస్తూ, లేదా బెజీర్స్ కెతీడ్రల్ దహనం గురించో, తను గర్భవతిని గనుక ప్రాణభిక్ష పెట్టమని ప్రాథేయ పడిన మహిళ గురించో (కానీ అప్పుడు ఏబీడి సిట్యూ మరో అవిశ్వాసికి మరణ శిక్ష తప్పదు అంటూ ఆమెను మెట్ల మీద నుండి కిందికి తోసేస్తాడు) తెలుసుకుంటూ బిజీగా గడిపాను. నా ప్రొఫెసర్‌తో సంప్రదించడానికి సోర్బాన్‌కు కూడా వెళ్లాను. ఆయన చాలా మొహమాటస్తుడు. గొప్ప పండితుడు. మాట్లాడటం ప్రారంభిస్తే ఆయనను ఆపడం కష్టం. ఆ మాటల్లో నిగూఢార్థాలు కూడా ఉంటాయి. అందరికీ కావలసిన మనిషి. ప్రొఫెసర్ రాబిన్ బెస్సాయినాతో కలవాలంటే ఉత్సాహంగా ఉంటుంది. చరిత్ర గురించి ఆయనకున్న జ్ఞానం అపారం. ఆయన ప్రకారం అధిభౌతికవాదం (మెటాఫిజిక్స్) నాగరికతతో పాటు ఎదిగిన ఒక క్రీడ. వైరుధ్యాలు పెరగటం వల్ల చారిత్రక, తాత్వికత మరింత అద్భుతంగా, ఆసక్తికరంగా తయారవుతుంది. బౌద్ధ మతంలోని మణి manichaeism (ఇది ఒక ద్వైత సిద్ధాంతం. సందర్భాన్ని బట్టి ఇది క్రైస్తవం, బౌద్ధం, తావోయిజంలను పోలి ఉంటుంది). ఇది పెర్షియా గుండా ప్రయాణించి, బల్గేరియాలోకి ప్రవేశించి, యూరోపియన్ మతంగా మారింది. యూరోప్‌కిది ప్రత్యేకమైనది. యూరోప్ స్త్రీ పక్షపాతి 'హెలెన్ (సీతలాగ అపహరింపబడిన సుందరి) కోసం ఇండియాలో ఎవ్వరూ యుద్ధం చేయరు.

రాజధర్మం, ప్రజాభిప్రాయం పేరిట పవిత్ర సీతను రాజ్యం నుండి బహిష్కరించిన రాముడిలా ఎవరూ ఇక్కడ ప్రవర్తించరు. చాకలివాడి ప్రేలాపన నిజమైతే - సీతమ్మవారు రావణుడి చెరలో ఉంది గనక అపవిత్రమైపోయిందని చేసిన ఆరోపణ - అదెంత మూర్ఖం! అనాగరికం! హేతువిరుద్ధం! అయినా దాన్ని నమ్మశక్యమైనదే అయి ఉంటుంది. లేకపోతే క్షత్రియ కులంలో పుట్టిన రాముడు ఆమెను అడవులకెందుకు పంపిస్తాడు? ఇందులో పురుషాధిక్యత, ఒక ధర్మ సూత్రం కనిపిస్తుంది అని వివరిస్తాడు ప్రొఫెసర్ రాబిన్ బెస్సాయినా. మనం మైకేల్ రాసిన 'రామాయణం' చదవాల్సిన అవసరం ఉంది. ఆయన దాన్ని బైబిల్ ఆఫ్ హ్యూమానిటీ అన్నాడు. ఎంత అద్భుతమైన కవితా శక్తి! ఎంత మార్మికత! ఎంత అమాయకత్వం! కానీ అదంతా 19వ శతాబ్దం నాటిది. విక్టర్ హ్యూగో, లామార్టైన్‌ల కాలమది. రొమాంటిసిజం, విప్లవాల శకం అది. మానవ కళ్యాణం పేరుతో తుపాకులూ, ఖడ్గాలూ యూరోప్‌ను శాసించాయి. "మారణాయుధాలతో మానవజాతి ఎలా రక్షించబడుతుంది!" అని ప్రశ్నిస్తాడు నా మిత్రుడు. ఎందరో మహానుభావులు - వాళ్ల వల్ల లోకం ఇప్పుడు ఎంత మారింది?

"యూరోప్ అంటే నూతన అభిప్రాయాల, భావాల విపణి. ఎవరి అభిప్రాయాలు వాళ్ళు ఇక్కడ ప్రదర్శనకు పెడతారు. ఇండియా చైనాలలోలాగా నా బ్రాహ్మణ పితృదేవత రెండు, మూడు, ఐదు వేల సంవత్సరాలనాటి బ్రాహ్మణ ఋషి" అని చెప్పుకుంటారు. మేమింకా పాత రాతి యుగంలోనో, ఇనుప యుగంలోనో ఉన్నట్టే. అంటే ఇంకా డార్డోన్ గుహల్లోని రాళ్ళమీద చిత్రాలు గీస్తూనే ఉన్నాం. అవే అత్యాధునిక అభిప్రాయాలని మనం అంగీకరిస్తున్నాం. ఫాత్ డయోర్, పైబ్నిట్జ్, రేనాన్, టెయిన్ వాళ్ళు యూరోప్‌ను ఈ స్థితికి తీసుకొచ్చారు.

"యూరోప్ గురించి మరీ అంత దారుణంగా మాట్లాడకు" అంటూ అడ్డుపడ్డాను యూరోప్ తరపున వకాల్తా పుచ్చుకొంటూ. కానీ ఆయన వాగ్ధాటిని ఆపలేకపోయాను. గంగానదిని తలచుకుని పరవశించి పోతున్నాడు.

"ఇండియా నుండి వచ్చావు కదూ, మా (భవన) నిర్మాణ సామాగ్రి గురించి నా కనులు తెరిపించిది నువ్వే. క్రైస్తవం ఆవిర్భవించిన వెయ్యేళ్ల తర్వాత కతీడ్రల్‌లలో ఎక్కువ వెలుగు కావాలనిగాని, రోమన్ నిర్మాణాలే గోతిక్ ఆర్కిటెక్చర్‌గా మారాయనీ తెలిసిందిగానీ దానికి కారణం సామాగ్రిలో వచ్చిన మార్పు కాదు. మా పీటర్ ఎబెలార్డ్, మీ యాజ్ఞవల్క్యుడిలా లేదా నాగార్జునుడిలా మా కళ్ళు తెరిపించాడు. అనేక కారణాలవల్ల ఎబెలార్డ్ కతిడ్రీలకు మరింత వైశాల్యం, మరింత కాంతి అవసరమని భావించాడు.

వేజెల్ (కెథడ్రిల్)కూ, నాటర్‌డామ్‌కు తేడా ఏమిటో తెలుసా! ఒకటి ఇరుగ్గా, గిడసబారినట్టు ఉంటుంది. మరొకటి ఒక అద్భుతమైన కానుక. పవిత్ర భిక్షాపాత్ర అందులో దాగి ఉంది. ఆ పాత్ర వెదజల్లే కాంతి చర్చిని వెలుగుతో నింపుతుంది. నువ్వు చెప్పినట్టుగా, నీ అస్థికలు నిక్షిప్త సంపదగా మారిన దేశం గొప్పది. పగటి ఎండ వెలుగు తగ్గిన తర్వాత నీ అస్తికలు వెలుగే అక్కడ ప్రకాశిస్తుంది'' అదీ అసలు సంగతి.

కానీ మన బలిసిన చిత్రకారులు అక్కర్లేని విషయాలన్నీ నిరూపించడానికి ప్రయత్నిస్తుంటారు. ఫలానా సంవత్సరంలో ఫలానా రోజున ఫలానా మహానుభావుడు ఒక కథీడ్రల్‌కు రెండు బంగారు నాణాలని దానం చేశాడు'' అని ఒక మున్సిపాలిటీ గుమస్తా తన అకౌంటు పుస్తకంలో రికార్డు చేసాడు''. ఇదీ వాళ్ళు పరిశోధించి కనుగొన్న మహత్తర విషయం. ఇలా విరాళం ఇవ్వడానికి కారణం ఆ దాత తండ్రి క్రూసేడ్స్ (మత యుద్ధాలు) వెళ్లి తిరిగి రాలేదట. అందువల్ల ఆయన మరో మనవడిప్పుడు మరో క్రూసేడ్‌లో చేరి కాన్స్టంటి నోప్ నుండో, సిరియా నుండో కొన్ని ఆర్కిటెక్చర్ నమూనాలు తెచ్చాడట. హా... హా... హా...

"నువ్వు సరిగానే వివరించావు. మైడియర్. క్రూసేడ్స్ చేసినవాళ్లు వాస్తవ వాదులు. వీళ్ళు గోతిక్‌ను ఖండించారు. ఈ వ్యవహారంలో నిజమైన దైవదూషణ చేసింది ఎబెలార్డ్'' అన్నాడు ప్రొఫెసర్ రాబిన్ బెస్సానా.

"ఎబెలార్డ్‌తోనే మాడర్నిజం ప్రారంభమైందని చెప్పవచ్చు. అంతే కాదు. మనీషియన్‌ల గురించి ఏబెలార్డ్‌కు తెలుసు. అతడు వెస్టోలియస్ (బిషప్ ఆఫ్ క్యాన్సాంటి నోపుల్. క్రైస్తవ మత విశ్వాసాలకు విరుద్ధంగా బోధించాడు)ను బాగానే చదువుకున్నాడు. కానీ అజ్ఞానులు, మూర్ఖులైన మన పండితులు మనకు వైర్‌లెస్, విమానాలు ఉన్నాయి గనుక, మనకు చరిత్ర గురించి ఎక్కువ తెలుసనుకుంటారు. అంతే కాదు. మనమే ఆధునిక చరిత్ర నిర్మాతలమని కూడా నమ్ముతారు. యాత్రికులు, వ్యాపారస్తులు, విద్యార్థులు ప్రపంచం నలుమూలల నుండీ కొత్త జ్ఞానాన్ని కొత్త ఆలోచనల్ని మనకు పరిచయం చేశారు. గతంలో జనాలకు నిజమైన జ్ఞానతృష్ణ ఉండేది. అప్పటి వాళ్ళకు వార్తా పత్రికలు అందుబాటులో లేకపోవటం కూడా ఓ కారణం. చదివిందిగాక, విన్నదాన్నే వాళ్లు విశ్వసించారు. ఇండియాలో 'గురువు' అనే పదానికి నిర్వచనం - ఎవరి నుంచి మనం వింటామో - అతడే 'గురువు' అని నువ్వే చెప్పావు కదా! నిజమైన బోధ అంటే అదే! అంతే తప్ప, కొత్త పుస్తకం ఏది వెలువడితే దానిని చదివెయ్యటం కాదు. పదాలు మనలో విషం నింపుతున్నాయి'' అంటూ ముగించాడు. ఆ తర్వాత నా పరిశోధనా పత్రాల మీద

సంతకం చేసి ఇంటికి సాగనంపాడు. అతని వల్ల నాకు గాక, నా వల్లే అతనికి కొత్త వెలుగు కనిపించినట్లుగా తృప్తి చెందాడాయన.

"నీకేం కావాలి? తరతరాల జ్ఞానం నీలో దాగి ఉంది. నువ్వు మాలా ఆటవికుడివి కాదు. త్వరలో నేను హెన్రీ-IV మీద ప్రసంగించబోతున్నాను - నాలుగవ శతాబ్ది ముగిసిన సందర్భంగా - ఓకే, హెన్రీ-IV ను, అక్బర్‌తో పోల్చి చూడు. ఎలా ఉంటుందో! గుడ్ బై - మై డియర్" అంటూ చిరునవ్వు నవ్వి, వెనక్కి తిరిగి వెళ్లిపోయాడు.

ఆయన ఆప్యాయత నన్ను ఉక్కిరి బిక్కిరి చేసింది. దాతృత్వ భావనలు కెతీడ్రల్స్‌ను నిర్మించగలనా? రోడిన్ జ్ఞాపకం వచ్చాడు - మాకు షేక్స్‌పియర్ లేడు. దాంతే వేరు - మా ఫ్రెంచి వాళ్ళకు ఉన్నవే కెతీడ్రలు" అన్నాడతడు.

రోన్ నుంచి చార్లీ మామ నన్ను చూడటానికి పారిస్ వచ్చాడు. "ఆఁ... నా అల్లుణ్ణి చూడటం ఎంతో ఆనందంగా ఉంది" అన్నాడు. తనకు తనే చెప్పుకున్నట్లు!

ఆయన ఎప్పుడూ మంచి, ఖరీదయిన హోటల్‌లోనే ఉంటారు. ఈసారి కారులో వచ్చారు. ఇక్కడ తిరగడానికి ఇబ్బంది లేకుండా, చాలా ఆనందంగా ఉన్నాడు. నాతో పారిస్‌లో గడపడం ఏదో ఎంతో చిన్నతనం సరదాలాగా సంతోషంగా ఉన్నాడు. మనకంటే చిన్నవాళ్ళతో ఉంటే వాళ్లకు తెలిసిన ఎన్నో విషయాలు మనకు తెలియజేస్తారని ఆయన అభిప్రాయం! కానీ ఈ పారిస్‌లో నాకు తెలిసిందేమిటి?

రాత్రి డిన్నర్‌కి 'Perigourdine'కి వెళ్దాం.

Les Halles కి ప్రొద్దున అల్పాహారానికి - మళ్ళీ రాత్రికి Montmartre లో డిన్నర్ చేద్దాం. ఇలా చాలా ఉత్సాహంగా చెప్తున్నాడు. నేను సరే సరే అన్నాను.

"ఇప్పుడు పారిస్‌లో నీతో తిరుగుతుంటే ఎప్పుడో మేము మిలిటరీలో పని చేసిన రోజులు గుర్తొస్తున్నాయి.

"మా నాన్న నాకు చాలా సంపద ఇచ్చాడు. అప్పటికే అమ్మ చనిపోయింది. అప్పట్లో పారిస్‌లో చాలా విషాదం కమ్ముకుని ఉండేది.

"ఏకైక వారసుణ్ణి నా ముందు ప్రపంచం అంతా పరచుకుని ఉంది.. "తీసుకో, అనుభవించు నాయనా. నీకు వయసు మీరే సమయానికి చేయవలసిన బాధ్యతలు చాలా ఉంటాయి" అంటూ నాకప్పగించారు. ఫ్రాన్స్ - పారిస్ తెలుసుకోవడానికి ఇంకా వయసే చాలదు. అప్పుడు జీవితం చాలా సాధారణంగా, సంతోషంగా ఉండేది. సంపదకు లోటు లేదు..

"కానీ ఎప్పుడూ ఎక్కడో యుద్ధం జరుగుతుండేది. ఎక్కడైనా తూటా మోత వినపడితే బారక్‌లోకి పరుగు పెట్టేవారం.." బారక్ జీవితం నచ్చేది - ఆ విధంగా - మేము వీరులుగా, దేశభక్తులుగా చెలామణి అయ్యేవాళ్ళం.

"ఎప్పుడూ - అమ్మల గురించి - అక్కచెల్లెళ్ళ గురించి మాట్లాడుకునేవాళ్ళం. పదిమందిలో తొమ్మిది మంది మాలో ఎవరో ఒకరి అక్కనో, చెల్లెనో పెళ్ళి చేసుకునేవారం. పల్లెటూరు వెళ్ళి చాంపేన్‌తో స్నేహితుని ఇంట్లో పండగ చేసుకునేవాళ్ళం. మిలిటరీ యూనిఫారంలో వెళ్తే, ఇదిగో మా అమ్మాయిని చేసుకుంటావా అని అడగకుండా ఉండరు - సమాధానం ఎప్పుడూ సమ్మతమే. వివాహం చాలా ముఖ్యమైన సంఘటన జీవితంలో - పెళ్ళి! కొత్త బుట్టల పెళపెళలు - అత్తరు వాసనలు - టోపీలు - ఆహ్వానాలు - పెళ్ళి నృత్యాలు - ఆ తర్వాత, హనీమూన్! కార్సికాలో (Corsica) ఆ విధంగా నా మొదటి భార్యను చేసుకున్నాను. కాథరీనా కన్నతల్లి చాలా ఉత్తమురాలు. నేనే ఆమెకు విశ్వాసపాత్రంగా ఉండలేకపోయాను. రెండో కాన్పులో చనిపోయింది. అప్పటికీ ఇంకా కాన్పులు, కష్టంగానే ఉండేది. ఈ రోజుల్లా కాదు. ఇవ్వాళ కాన్పుకు వెళ్ళడమంటే ఏదో సూపర్‌బజార్‌కి వెళ్ళి వచ్చినట్లే కదా - తర్వాత జోబీ వచ్చింది నా జీవితంలోకి - నేనెప్పుడూ చెప్తాను - ఇప్పటి మీ తరం చాలా నిజాయితీగా ఉంటారు. మా తరమే త్యాగాలు చేయవలసి వచ్చింది.." ఇప్పుడూ తన చుట్టూ చూసి అప్పటికి లక్సెంబర్గ్ సెంటర్‌కి వచ్చాం. అక్కడ గుంపులను చూస్తూ - "ఇప్పటి ఫ్రాన్స్ చాలా ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉంది. మనం కోరుకొంటే చిన్నవాళ్ళమవుతామా? కావాలనుకొంటే జుట్టు కత్తిరించుకుని రంగు వేసుకోవచ్చు. నాకు తాతను కావలని లేదు. కాతరిన్‌కి బిడ్డ పుట్టటం ఊహించుకోలేకపోతున్నాను.

"అవును రామా!... మీ స్నేహితుడు జార్జి గురించి చెప్పు - అతని పేరు 'రష్యన్ పేరు'. పలకటమే కష్టం. కాని నాకు బాగా నచ్చాడు. నీ స్నేహితుడు కదా. నాకు ఇతర దేశస్థులంటే నమ్మకం లేదు. కానీ నీ సంగతి వేరు. నీవు మా వాడివి. నువ్వు మెదలీనా భర్తవి. 'మా వాడివి!' జోబి అంటుంది! నువ్వు ఎప్పటి నుంచో మాకు 'తెలిసి'నవాడివి సుమా!

నేను "జార్జి చాలా సంయమనంగలవాడు - తెలివికలవాడు. దైవభక్తి కలవాడు. ఆశ్రమాలకు వెలుపల ఇటువంటి యోగులుండటం అరుదు" అన్నాను.

"ఇదంతా మీరు చేసిందే కదా - నువ్వు మెదలీనా మీరు ఎంత ఆనందంగా ఉన్నారో మీ చుట్టూ అంత సంతోషం వెల్లివిరిస్తుంది. జోబీకి నువ్వంటే చాలా ఇష్టం-

"రామా - అతను ఆడవారిని గౌరవించే పద్ధతి చాలా శ్లాఘనీయం..." అంటుంది.

నేను వాచీ చూసి - "చార్లీ మామా - మనం రాత్రికి Montmartreకి వెళ్ళాలి కదా - టికెట్లు కూడా లేవు. త్వరగా వెళ్తే మంచిది..." అన్నాను.

మాంట్ మార్త్రే రెస్టారెంట్

"ఓ - అద్భుతం. నీవు అలాంటి చోటుకు రావటం సంతోషంగా ఉంది. నీవు సన్యాసం పుచ్చుకున్నావనుకున్నాను సుమా - చాలా బాగుంది - వెళ్దాం పద..."

"నిజానికి మనం ఎప్పటికీ నిజాయితీగా ఉండలేము - అదీ ఆడవారి విషయంలో - వాళ్ళలో ఏదో గందరగోళం ఉంది. బాధాకరం కూడాను. నా ఉద్దేశ్యంలో ఆడది పిల్లలను కనటానికే పరిమితం కావాలి. ఏమంటావు?"

నేనన్నది ఆయన వినే స్థితిలో లేరు. మొదటి అంతస్థు నుంచి క్రిందకు దిగాం. అక్కడ కూర్చొన్నవాళ్ళలో ఎవరైనా పలకరిస్తారేమోనని చూశాడు. తర్వాత తను ఎవ్వరినైనా గుర్తుపట్టగలడేమోనని ప్రయత్నించాడు.

పారిస్‌లో నీ స్వంత మనుషుల్ని కలవటం బాగుంటుంది. మిమ్మల్ని యువకులుగా చేస్తుంది.

"ఇక్కడ సీన్ నది రంగు ముదురుగా ఉంది. రోన్‌లో కంటే" అంటున్నారు చార్లీ కారులో ఎక్కుతూ. ఆ రాత్రి మౌంట్ మార్త్రే (Montrartre)కి చేరాం. లోపల వాతావరణం చార్లీ మామకు బాగా నచ్చింది. నగ్నంగా, అర్ధనగ్నంగా అమ్మాయిలు తిరుగుతుంటే ఆయన నావంక చూసి కన్నుగీటాడు. కోనియాక్ తాగుతూ పాటలు వింటూ అమ్మాయిల్ని చూస్తూ ఆయన అలసిపోయిన గుర్రంలా అయిపోయాడు. అక్కడ నుంచి క్లిచీ ప్లేస్ వైపు కారు తిప్పాడు. ఏవో అడ్రసులు కోసం వెతికి "అన్నీ చేతులు మారిపోయినట్లున్నాయి.." అన్నాడు. తర్వాత నన్ను Pont St. Miechel దగ్గర దింపి ఆయన వెళ్ళిపోయాడు. నేను టాక్సీలో నా హోటల్ గదికి చేరాను.

మర్నాటి ఉదయం చార్లీ మామ ఫోన్ చేసి "కాస్త తలనొప్పిగా ఉంది. అయినా 'Weber' దగ్గర ఒంటి గంటకు కలుద్దాం - తేలికపాటి భోజనం చేద్దాం" అన్నాడు. ఆయనకి రాత్రి భోజనం నచ్చలేదు.

నేను మామూలుగా కుక్స్‌కి వెళ్ళి ఉత్తరాలు తెచ్చుకుంటాను. ఈ Weber అక్కడికి దగ్గరే - అందులో శాకాహారం చాలా బాగుంటుంది. ఆ ఉదయం Richelieu వీధికి వెళ్ళాను. వేడిగా నీరసంగా ఉంది. అప్పుడే కాస్త దుమ్ము లేస్తోంది. కాని ఇప్పుడే కదా విక్టర్ హోగో, లామర్టై బోడిలేర్ గిజోట్, తానే, రివాన్, రైనర్ మారియా రిల్కె ఇందరూ ఈ బల్లల దగ్గరే కబుర్లు చెప్పుకుంటూ కాఫీ తాగారు!

గతం నాతో ఎప్పుడూ మాట్లాడుతుంటుంది. అదే వర్తమానాన్ని జ్ఞానపరంగా మారుస్తుంది.

ఆ మధ్యాహ్నం భోజనం అంతంత మాత్రం - అప్పుడే చార్లీ మామ - కాతరిన్‌కి ఫోన్ చేశాడు - ఆయన తర్వాత ఫోన్ నేనందుకున్నాను.

“కాతరిన్ చాలా సంతోషంగా ఉంది. త్వరలో పెళ్ళి కాబోతుంది కదా! “బావా - నా ఆనందానికి నీవే దారి చూపావు - నా పెళ్ళికి తప్పక నీవు ఉండాలి” అంది.

నేను “అప్పుడే నా చెల్లలు సరోజ పెళ్ళి కూడా ఉంటుంది. నేను ఇండియా వెళ్ళాలి. చక్కబెట్టాల్సిన వ్యవహారాలు చాలా ఉన్నాయి...” అన్నాను.

“అయితే మాద్ అక్కను కూడా తీసుకు వెళ్తున్నారా? మీ ఇద్దరా లేకపోతే నేను పెళ్ళి వాయిదా వేసుకుంటాను..”

“అవసరమే లేదు. అప్పటికి మెదలీనాకి నెలలు నిండుతాయి - ఇక్కడే ఉంటుంది. నీ సంతోషాన్ని వాయిదా వేయవద్దు!”

“అవును కదా. నా సంబరంలో ఆ విషయమే మర్చిపోయాను. ఆడదాన్ని అయికూడా - రామా, ప్రేమ మన అహాన్ని పెంచుతుందేమో?”

అరే - కాతరిన్ ఈ మాట నాతో తెలిసే అంటుందా?

“పిన్ని అంటుంది. నేను కూడా భారతీయుణ్ణి చేసుకుంటే బాగుండేది. రష్యాతో ఆగిపోయినందుకు బాధపడుతోంది..”

“రోన్‌లో నోటరీగా ఉండేవాడనా?” అంటూ నవ్వాను.

“కాదు, నేను ప్రొఫెసర్ కావాలనుకుంటున్నాను..” అంది కాతరిన్.

కాతరిన్‌కి బై చెప్తుండగా చార్లీ ఫోన్ బిల్లు చెల్లిస్తూ అక్కడున్న అమ్మాయితో ఏదో హాస్యమాడుతున్నాడు. ఆ తర్వాత ఆయన కారులో పారిస్ వదలి, నన్ను వదలి వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత పారిస్ వీధుల వెంట అగమ్యంగా తిరిగాను. ఏదో పోయింది. ఎక్కడో దొరుకుతుందేమోనన్న అర్థం లేని ఆశ... ఇలాంటప్పుడే నాన్న పోయినప్పుడు,

అమ్మ పోయినప్పుడు వారే కదా మనకు నిస్వార్థమైన ప్రేమనిచ్చేవారు. అది సహజమైనదే కావచ్చు, వసంత కాలంలో చెట్లు చివురులు తొడిగినట్లు. నది ప్రక్కనే ఉన్న పుస్తకాలు దుకాణాలు తిరిగాను.

రచయితల సామ్రాజ్యం కదా! హుగో - లా మార్టి, బాల్జాక్ - కొన్ని ఆడవాళ్ళ నగ్న చిత్రాలతో ఉన్నాయి. ఇది ఎంత నిజమైనా ఎంత అసహ్యంగా ఉన్నాయి?! శరీరం అంత ప్రధానమైనదా? దానికి అంత గిరాకీనా? ఊహ ప్రపంచం నదికి ఆవలి తీరంలో ఉంటుందని కదా పీటర్ ఏబ్‌లార్డ్ (Peter Abelord) అన్నాడు.

ప్రేమ ఎప్పుడు యౌవనంతోనే ఉంటుంది. ఉత్సాహంగానే ఉంటుంది. అదిగో నోట్రాడామ్ (Notre Dame) డోమ్‌లు మాదిరి. గాలిలో తేలుతున్నట్లు - రంగుల అద్దాల మాదిరి. అక్కడి తోటలోని గులాబీల మాదిరి. అవును, నేనూ ప్రేమించాను. ప్రేమతోనే ఉన్నాను. ప్రేమంటే తెలుసుకున్నాను. సావిత్రితో మాట్లాడాను. ఆమె కూడా నోట్రోడామ్ డోమ్‌లా గుండ్రంగా ఉంటుంది. ఆమెను 'నీవు' అనడంలో నన్ను నేను సంబోధించుకున్నాను.

రిల్కే (Rilke) అన్నట్లు నీకు వయసు వచ్చిన కొద్ది ప్రేమ అర్థమవుతుంటుంది. 19 ఏళ్ళకు ప్రేమ ఏమిటో ఎలా తెలుస్తుంది? మెదలీనా వంటి ఉడుకులాన్ పరిమళం ఇంకా పూర్తిగా పెరగని ఆమె చనుకట్టులాగా, మనం పెదవుల్ని ప్రేమిస్తామా? శరీరంగాల్ని ప్రేమిస్తామా? అలా ఎప్పటికీ కాదు. అది ఎప్పటికీ పూర్తి కాదు. అది ఒకరకంగా దోషం కూడా - ప్రేమ ఏమీ అడగదు - ఏమీ మాట్లాడదు - ఏమీ తెలియదు కూడా - అది సంపూర్ణమైనది - సీన్ నదిలాగా - అది అప్పటివరకే - సీన్ నదిలాగా - ఇరువైపులా భవనాలు లేచి - పార్కులు పెరిగి - ఆ చివరగా రెనాల్ట్ (Renault) కారు ఫ్యాక్టరీ - ఇంకా చివర - ఏమీ భేదం ఉండదు కదా - నది - ఎక్కడైనా నదిగానే ఉంటుంది.

ప్రేమను ఎవరు తీసుకుపోగలరు నీ నుంచి - ఎవరు - అందుకోగలరు? నేను సావిత్రిని ప్రేమించానని చెప్పగలనా? అది నన్ను నేను ప్రేమించుకోవడంలాంటిదే - ప్రేమ ప్రేమను ప్రేమిస్తుంది.

చార్లీ మామ తలనొప్పికి కారణం. రాత్రి కోనియాక్ - షాంపెన్ మాత్రమే కాదు. బహుశా నన్ను వదలిన తర్వాత ఆ రాత్రి తనకు పరిచయం ఉన్న చిరునామాలు వెతికి ఉంటాడు. ఎవరైనా గుర్తుపడతారన్న ఆశతో - కానీ - వయసు ఆడే నాటకం

- అదీ నీకు యాభై దాటిన తర్వాత - నీ అవసరాలను పారిస్ బాగా తీర్చగలదు. కానీ 'బారక్' మెంటాలిటీ ఐరోపాకి ఒక శాపంలాంటిది. 'ఫోనీ' యుద్ధ కాలంలో అందుకే సార్త్రే చాలా ఖ్యాతి గడించాడు. దెయ్యాలు కనపడనపుడు దెయ్యాల ఆలోచన ఉత్సాహంగా ఉంటుంది.

ఆక్స్ వెళ్ళే రైలెక్కాను. రైలు శబ్దాల లయ - వేగంలోని ఊయల - నన్ను మళ్ళీ ఈ లోకంలోకి తెచ్చింది.

'ఎస్కలార్‌మాండి' త్వరలోనే భూమి మీదకు వస్తుంది (నాకు పుట్టబోయే కూతురు) ఆమెను మెదలీనా బంగారు కురులు, నా నల్ల కళ్ళు, పొడవుగా పెద్దగా ఉంటుంది. త్వరలోనే పెరిగి యౌవనవతి అవుతుంది. మొదటి మన్మథ బాణం గుచ్చుకుని బాధపెడుతుంది కూడా. ఆమె అందంగా సరోజలాగా సిగ్గుతో తెలివితేటలతో అలరారుతోంది! అవును - సరోజలాగానే - నేను ఆమెను దగ్గరకు తీసుకుంటాను - పొదివి పట్టుకుంటాను - నన్ను నేను దర్శించుకుంటాను - దూరంగా వ్యక్తిగతంగా, సత్యవంతంగా. మనం తర్వాత తరాలతో మన ఆశలు, నిరాశలు నింపుకుంటాం. మన భార్యలతో సంభోగంతో మన ప్రేమలను బహుమతులుగా ఇచ్చుకుంటాం. మనకు ధైర్యం తక్కువ; భయం ఎక్కువ కదా - అందుకనే వెధవలు పుట్టుకొస్తారు. ఒకరి ప్రక్కన ఒకరు పడుకొని కౌగిలించుకుంటూ ఒకరి శ్వాస ఒకరు తీసుకుంటూ ఒకరి పెదవులు ఒకరు అందుకుంటూ అదే సత్యమనుకుంటూ మూలుగుతుంటాం.

ఒకరినొకరు ప్రేమగా మృదుస్వరాలతో పిలుచుకుంటాం. అలా సంవత్సరాలు గడిచిపోతాయి. జన్మ తర్వాత జన్మ జరిగిపోతుంటుంది. కానీ నిజమనేది ఏ నది ప్రక్కనో, క్లేర్ వారధి చెంతనో, నార్మన్ ఆర్చ్ క్రిందనో, సైకిళ్ళ మోతలోనో ఉండచ్చు. ఒక్కరు - ఒక్క స్త్రీ మాత్రమే - ఒక్క జన్మకే కాదు - ఈ భూమి సృష్టించబడి చెట్లు పెరిగి, నదులు ప్రవహించి, సముద్రాలు ఏర్పడి, నావలు, భవనాలు, పుస్తకాలు, విమానాలు అన్నీ ఆమెను అన్వేషిస్తూ గడిచిపోతుంటాయి.

పాపం చార్లే బాడీలేర్ St. Bernord! వారి వేదన ఇదే - స్టేషన్ దగ్గర మెదలీనా ఎంతో అందంగా కనిపించింది - నిండుగా - ఆమెను ఒక ఆరాధనా భావంతో ముద్దుపెట్టుకున్నాను - స్థిరంగా, వెచ్చగా, దగ్గరగా.

ఆమె నా ప్రేమ మందిరం - ఆమె కోసం పవిత్రమైన ఆసనం నిర్మించాలి.

మిగతా కథ చాలా తేలికగా చెప్పవచ్చు - గొప్ప నవలలో అయితే - రాజప్రసాదంలో - పల్లకీలతో - ఏనుగు అంబారితోను, లేక హిమాలయాల శిఖరాలపైనో ముగింపు ఉంటుంది - కానీ నేను కథ కల్పించి చెప్పడం లేదు - నేను రాసేది విచారకరమూ - అస్తవ్యస్తమూ అయిన జీవన సంఘటనల సమాహారం - దీనికి ఏ అలంకారాలు - అలంకరణలు జోడించకుండా - చారిత్రక క్రమంలో - విషయ ప్రధానంగా - ఏకరువు పెడుతున్నాను - సంప్రదాయబద్ధంగా - వస్తుతః నేను చరిత్రకారుణ్ణే.

కానీ చరిత్రలో కూడా కాతరిన్ బ్రగంటా, రెండవ చార్లీని పెళ్లి చేసుకుంటుంది - ఆ విధంగా బొంబాయి చరిత్రలోకి వస్తుంది - లేదా మేరీ మెడిచి హెన్రీ-IVని పెళ్లాడిన తర్వాత విధవరాలవుతుంది - మూర్ఖంగా రిజిలీ (Richeliea) మతాధిపతితో పోట్లాడి - కాందిశీకురాలిగా చనిపోతుంది - అలాగే ఇండియాలో ఓ రాకుమారి ఎవరినో పెళ్లి చేసుకున్న తర్వాత - తురకలకు బందీ అయి నౌరుద్దీన్‌ను పెళ్ళాడి తర్వాత సుల్తాన్‌కి భార్యగా మారుతుంది.

ఎన్ని వివాహాలు చూడండి - అంతమంది విధవరాళ్ళను చూడండి - ఎలీనార్ (Eleanor) ఎక్విటెన్ - వీళ్ళు లేకపోతే ఇటలీ భాషలో ప్రేమ కవిత్వం - ప్రణయ గాథలుగా గానం చేసేవారు కాదు.

ఫ్రెంచ్ చరిత్రకారుడు చార్లీ సైనబో (Charles Slignobos) చెప్పినట్లు - ప్రేమకథలు 11వ శతాబ్దం నుంచి మొదలయ్యాయి.

అంటే పాత రోజుల్లో అయితే - నేను - మెదలీనా కలుసుకోవటంగానీ ప్రేమించడంగానీ పెళ్లాడటంగాని జరిగి ఉండవు.

అప్పుడు బుద్ధిగల బ్రాహ్మణ యువకునిలా ఉదయం, సాయం సంజలు వారుస్తూ, ధ్యానంలో నిమగ్నమై, ప్రతి సంవత్సరం పవిత్ర యజ్ఞోపవీతాన్ని మార్చుకుంటూ, గోడమీద స్వస్తిక్ బొమ్మ వేస్తూ, అగ్ని చుట్టూ ప్రదక్షిణ చేస్తూ, పవిత్ర స్థలాన్ని శుభ్రం చేస్తూ, మండలాలను వేస్తూ, అగ్నిహోత్రుణ్ణి వెలిగిస్తూ, ప్రదక్షిణ చేస్తూ, గంగా జలాన్ని తెచ్చి పుక్కిట మంత్రాలు వల్లిస్తూ గడిపి, ఇంటికి వెళ్లి, మళ్లీ ఏడుసార్లు అగ్నికి ప్రదక్షిణ చేసి, ఏ సుబ్బమ్మనో వెంకటలక్ష్మినో పెళ్ళాడి - ఆమె కదా నాకు వారసుణ్ణి ప్రసాదించేది - నా తల కొరివి పెట్టాల్సింది - అప్పుడే కదా నేను వారణాసి ఆవు తోక పట్టుకుని వైతరణి దాటగలిగేది, ఆ విధంగా

నా కథ ముగిసేది! మెదలీనా ఏ డాక్టర్నో పెళ్లి చేసుకుని - ఇద్దర్నో ముగ్గుర్నో పిల్లల్ని కని పెట్టేది - ఎందుకంటే ఇక్కడ భారత్‌లోలాగా నక్షత్ర రాశి మీద ఆధారపడి ఉండదు - బ్యాంక్ ఖాతాలో ఉన్న సొమ్ము మీద ఆధారపడి ఉంటుంది సంతానప్రాప్తి! కానీ మెదలీనా నన్ను వివాహం చేసుకుంది - అది కదా ఈ కథలో విషాదకరమైన సంఘటన! నిజానికి జీవితమే దుఃఖమయం - ముందుకు చూసినా - వెనక్కి తవ్వుకున్నా - ఏ కోణంలోనుంచైనా - జీవితమంటే సంఘటనల సమాహారమే - ఆ విధంగా మన చరిత్రలో మరుగున పడిపోతాము - మన స్థానం మనకుంటుంది - చివరి క్షణాలు చేరువై తెలిసేవరకు - మన ప్రయాణం సాగుతూనే ఉంటుంది - కారులోనో, లాహోర్ లక్షాధికారి బండిలోనో - ఎందుకంటే అతనికి 9 లక్షల విలువైన వెండి ఉందని - ఆయనకి ఓ సాధువు - ఒక సూది ఇచ్చి - దీనిని మరు జన్మకు మోసుకు రమ్మన్నాడు మార్మికంగా - అలాగా రిబ్బన్లు - పథకాలు మోసుకుంటూ - యుద్ధంలో మరొకరి తల నరికినప్పుడు Yorubas మీ నుదుట వీరగంధం పూస్తారు - లేదా 'స్టాలిన్' శాంతి బహుమతి గెలుచుకోవచ్చు - ఆ విధంగా సోవియట్‌లో అన్ని వార్తాపత్రికల్లో మీ చిత్రాలు ముద్రిస్తారు - గర్వంగా నేను చరిత్రకారుణ్ణి - అన్ని రిపబ్లిక్‌లలో, Tamlock (తమలాక్) ఉజ్బెన్, అజైర్ బైజాన్ - ఎక్కడికైనా సరే - ఏదైనా సరే - చివరికి - ఎద్దు - ఆవు తోక పట్టుకుని వైతరణి దాటవలసిందే - నీ వారసుడు - వారణాసిలో నీ కోసం గోదానం చేసినా - చేయకపోయినా.

ఈ పెళ్లిళ్లు ఎందుకు? మరణంలోనే మళ్ళీ ప్రారంభం ఉంది - జాతి వంశం అంతరించిపోతుందని భయంతోనే - స్త్రీ - పురుష సంగమం - నీవు సంభోగించేది - నీ వారసుని కోసమే - ఆ వారసుడు అతని కర్తవ్యం అతను నిర్వర్తిస్తాడు - నీవు విచారించవలసిన పనిలేదు - నీ గంట తప్పక మోగుతుంది - చివరికి స్టాలిన్‌కీ గంట మోగుతుంది - నేను చరిత్రకారుణ్ణి.

అదిగో అందుకు పెళ్లి అవసరం - పెళ్ళిళ్ళు జరుగుతాయి - లేకపోతే జనాభా ఎలా పెరగాలి? అదిగో పెళ్ళి రిజిస్ట్రార్ దగ్గరికి వెళ్లి - అయ్యా - ఇవిగో నా కాగితాలు - ఇదిగో నా బర్త్ సర్టిఫికెట్ - (ఇది ఎంత బోగస్‌ది అయినప్పటికీ - మన దేశంలో జనన మరణ ధృవపత్రాలు ఎవరూ ఇవ్వటం లేదు) ఇదిగో ఎంబసీ పత్రాలు - ఇవిగో మూడు వేల ఫ్రాంకులు - ఇదిగో నా పెళ్లి కూతురు - దయచేసి మా వివాహం రిజిస్టర్ చేయండి - అని అర్థించాల్సిందే - లేకపోతే మెదలీనా - అదే మీ ఆశీస్సులు లేకపోతే - ఈ మెదలీనా రోశలీన్ నా భార్యగా మారదు - దయచేసి అంగీకరించండి!

ఆ విధంగా - జీన్ కారీఫార్ వారసుల చిట్టా తయారు చేస్తాడు. మూడువేల ఫ్రాంకులు ఆయనకి వెచ్చని సుఖాన్ని - కడుపునిండా ఆహారాన్ని ఇస్తాయి కదా!

పాపం - ఈయన గతి ఏమిటి - అందరూ కాతర్‌లా (Cathars)గా మారిపోతే - శరీరాన్ని మలిన పరచడం - సంగమ పాపం - జననం తాలూకు భయంకరమైన బాధ - ఇవన్నీ కాతర్లు వర్ణిస్తుంటే - ఈ మున్సిపల్ ఆఫీసర్ గతి ఏమిటి? కాతర్లంతా - ఏ గుహలోకో వెళ్లి ఉపవాసాలు - ధ్యానాలు చేస్తూ - వారి మరణం సునాయాసంగా వస్తుంది - మరో లోకం చేరడానికి వారికి గంధర్వులు వస్తారు - వారసులు గోదానం చేయవలసిన పనిలేదు - ఏ ఎద్దు తోక పట్టుకోవలసిన అవసరం లేదు - వారి లోకంలో నీలాకాశం బహుశా - మిణుగురు - పావురాలు - వారికి స్వాగతం చెబుతుంటాయి -

పేద బ్రాహ్మణుడు - తన బిడ్డను గంగా ఘాట్‌కు తీసుకోపోకూడదు - అతనికి శవవాహకులు దొరకరు - పేదవాడు కదా - అతని చేతుల్లోనే మోసుకు పోవాలి - కాష్ఠాలు కొనడానికి డబ్బు కావాలి - కాని సొమ్మేది - వాళ్ళంతా మూగుతుంటారు. 'ఇదిగో - బాగా ఎండిన పేళ్ళు - వెంటనే మండుతాయి - ఆ ముందు అమ్మేవాడు తడి చెక్కలమ్ముతున్నాడు - మోసపోకు - అని అరుస్తుంటాడు - 'మణుగు రెండణాలే' అంటాడు - ఈ పేద బ్రాహ్మణుడు రెండణాలు కూడా ఇవ్వలేదు -

అతనికి అవసరం కూడా లేదు - బిడ్డని గుడ్డలు చుట్టి చేతుల్లో మోసుకుపోతుంటాడు - మెట్లు దిగి మంత్రాలు వల్లిస్తూ - గంగమ్మ ఒడిలో వదిలి వేస్తాడు - ఆమె అన్నీ తీసుకుంటుంది - ఆ బిడ్డ మెల్లగా తేలుకుంటూ - సుడులు తిరుగుతూ - పూలతో పాటు ప్రవాహంలో వెళ్లిపోతుంటాడు - బ్రాహ్మడి కళ్ళల్లో నీరు కూడా లేదు - ఎందుకు ఏడవటం? ఇప్పటికి ఎంతమంది చనిపోలేదు? ఈ బ్రహ్మ భట్టు - విరూపాక్ష భట్టు - ఎక్కడికి పోతారు? మన పెద్దలు చనిపోకపోతే - వారి చితాభస్మాలు తీసుకుని మనం వారణాసి రాలేము కదా- ఈ జనన మరణాలు సహజాతాలు - ప్రకృతి సంఘటనలు - మనం విత్తనాలు వేస్తాం - పంట తీస్తాం - మొక్కలు నాటుతాము. ఎరువు వేస్తాం. కలుపు తీస్తాం - వర్షం వస్తే ఆనందిస్తాం - కరువు వస్తే బాధలు పడతాం - చివరికి అన్నీ జఠరాగ్నికి ఆహుతి కావాల్సింది- దీని నుంచి బైట పడే మార్గం లేదా? ఓ భగవంతుడా - ఈ జనన మరణ శృంఖలాల నుంచి - ఈ వర్షం - ఈ ఎండ - ఈ ఋతువులు - గ్రీష్మం - మళ్లీ వర్షం - గంగామాత మీద పూల జల్లులాగా...

చిన్నమ్మ ఉత్తరం రాసింది - సరోజ, సుబ్రహ్మణ్య శాస్త్రిని చేసుకోవడానికి నిర్ణయించుకోమన్నట్లు - "రామా - అతను చాలా మంచి బ్రాహ్మణుడు - చాలా పవిత్రుడు - కానీ సరోజకు సరితూగడు - సరోజ - ఎంత లావణ్యవతి - ఎంత సున్నితురాలు - కానీ ఎంత విచారం - నేను ఆడదాన్ని - ఏమి చేయగలను? నీవు ఇక్కడ ఉంటే - ఏమైనా చేసి ఉండేవాడివి - సరోజ నన్ను శత్రువులాగానే చూస్తుంది - నేను అందర్నీ సమానంగానే చూడడానికి ప్రయత్నిస్తున్నాను - నీవు మాత్రం నా సొంత కొడుకువా? కానీ నీ మీద నాకు ఎంత నమ్మకమో తెలుసు కదా! త్వరగా రా, రామా - నీ అవసరం ఉంది - నా ఆశీస్సులు - నీకు కోడలికి.... చిన్నమ్మ..."

చిన్నమ్మ అమృతమూర్తి - నా మానసిక కేంద్రం - నా మౌనాన్ని - నా ఆలోచనల్ని బాగా అర్థం చేసుకోగలదు - ఎప్పుడో - ఎక్కడో - నా కోసం బాధలుపడి ఉంటుంది - ఈ జన్మలోనే!

గదిలో నా మంచం కిటికీ దగ్గరగా ఉంటుంది. తరచూ వెన్నెల కిటికీలో నుంచి నేను పడుకున్నప్పుడు నన్ను పలకరిస్తుంటుంది. అలా వెన్నెల చూస్తూ ఆలివ్ ఆకుల సవ్వడి వింటూ సమయం గడుపుతుంటాను. మెదలీనా పక్క ఆ గోడ ప్రక్కగా ఉంటుంది. ఆమెకు వెలుగు సోకినా, గాలి తాకినా మెలకువ వచ్చేస్తుంది.

నేను అలా పడుకుని ఫిగ్ పిందెలు పండటం - నీలి పిట్టలు గూళ్ళకు చేరటం గమనిస్తుంటాను - ఇంకా తెల్లటి హైవే మీద పసుపు దీపాలతో కార్లు 'మార్సె'వైపు వెళ్తుంటాయి. మరికొంత ముందుకు వెళ్తే సెయింట్ చార్లీ చర్చి - దాని తర్వాత వీక్స్ పోర్ట్ - అలా ఒక్కో అడుగు ముందుకు పోతే నోట్రో డామ్ డిలా గార్డి - దాని చుట్టూ తిరిగి, దక్షిణంగా దృష్టి సారిస్తే, మధ్యధరా సముద్రం ప్రశాంతంగా పరుచుకుని ఉంటుంది. అంతా నీరే - అంతటా నీరే!

అలా నా చూపుల్ని మెదలీనా వైపు మరలిస్తే - ఆమెలో వస్తున్న శారీరక మార్పుల్ని స్పష్టంగా గమనించేవాడిని. బుగ్గలు కాస్త లావెక్కినాయి. ఆమె లోపలి వెలుగేదో ముఖంలో మెరుస్తోంది - విచారంతో కూడిన గర్వం ఏదో ద్యోతకమవుతోంది. దగ్గరగా వెళ్ళి ఆమె ముంజేతిని ముద్దాడి, తీయతీయని మాయమాటలు ఆమె చెవిలో ఊదవచ్చు!

ఎప్పుడైనా ఓ మధ్యాహ్నం - తన మౌనాన్ని మరుగునపెట్టి 'రామా - ఏదయినా మాట్లాడవా?' అని అడుగుతుంది. అప్పుడే తన పొత్తికడుపు తడుముకుంటూ - ఏదో పవిత్రమైన పాపాన్ని మోస్తున్నట్లు - ప్రేమ పంకిలాన్ని నింపుకున్నట్లు -

నా వంక చూస్తుంది. నేను నా దళసరి అద్దాలు తీసి 'మెదూ - నిన్ను చూసి చిన్నమ్మ చాలా సంతోషిస్తుంది - మన చిన్నారి, 'ఎస్కలార్‌మాండి' అచ్చం సరోజలాగా ఉంటుంది సుమా' అనేవాణ్ణి. తను అల్లుతున్న చలి తొడుగు (మనిషికి తొలి గూడు అదేగా) ప్రక్కన పెట్టి 'రామా, నీ గురించి చెప్పు...' అనేది! నేను అవాక్కయి - గర్భిణితో అబద్ధాలు చెప్పలేం కదా - ఆమె పవిత్రురాలు, జరగబోయేదానికి చిహ్నం - శ్వాసలాగా, ఒక పర్వతంలాగా, నది నిశ్శబ్దంలాగా - ఆమె శిరస్సును నా చేతుల్లోకి తీసుకుని - ఆమె బంగారు కురులతో ఆడుకుంటూ నుదుట ముద్దుపెట్టేవాడిని.

ఆమె నాకు చెందదు - ఆమె గర్భం - నన్ను దూరం చేసింది - ఆమెలో ఏవో రహస్యాలు దాగి ఉన్నాయి - తెలియరాని రహస్యాలు! ఇప్పుడు మాటలకు ఆమె అర్థం వెతకదు - ఆమెలో ఆమె మాట్లాడుకుంటున్నట్లు - అదీ ఒంటరిగా! అరె - ఆమె కోసం వేల మల్లెల దండ తేకపోయానా? ఆమె తల చుట్టూ చుట్టకపోయానా! రాత్రంతా ఆ పరిమళాలు ఆఘ్రాణిస్తూ పరవశించకపోనా!

మెదలీనా చాలామంది గర్భిణీలులాగా కోరికలు కోరేది కాదు. ఏదో మామిడికాయో, నల్లద్రాక్షో, ఘాటయిన ఉడుకులాన్ - ఇలాంటివేమీ కోరేది కాదు. ఆమె తపన ఎటో - ఎక్కడో ఉంది. దేనిపైనో తీవ్రమైన అభిరుచి పెంచుకుంది. ఎక్కువగా 'పాలీ' పాఠాలు వల్లిస్తోంది. బౌద్ధం పై వచ్చిన పుస్తకాలన్నీ చదువుతోంది. గ్రంథాలయానికి వెళ్ళి - మళ్ళీ రెనాన్, సెనార్ట్, డేవిడ్ నీల్ పుస్తకాలు తెచ్చుకుంది. ఇంగ్లాండు నుంచి తూర్పు ప్రాంతాల పవిత్ర గ్రంథాల కోసం సొమ్ము పంపింది. Psalms of Sisters ఎంతగానో నచ్చి అనువాదం చేస్తోంది. అందులో ఒక కథ ఆమెను ఎంతగానో కదిలించివేసింది.

ఓ సాయంత్రం - నేను చాలా దూరం నడిచి తిరిగి ఇంటికి చేరే సమయానికి ఆమె కన్నీళ్ళతో తడిసిపోయి ఉంది! అంతగా ఆమెను దుఃఖ పెట్టిన విషయం ఏమిటో తెలియలేదు - కాని ఆమె దుఃఖానికి ముఖ్య కారణం ఎప్పుడూ నేనే అనుకుంటాను. ఇప్పుడు కొత్తగా ఏమి చేశానా అని ఆశ్చర్యపోయాను. ఆమె మెల్లగా తల నా ఒడిలో వాల్చి - వస్సిత - బుద్ధుని కథ చెప్పింది. బుద్ధభగవానుడు వస్సితకు చెప్తున్నాడు - 'వెళ్ళు మాతా వెళ్ళి ఏ ఇంటి నుంచి అయినా ఇన్ని నువ్వులు తీసుకురా - నీ బిడ్డను బ్రతికిద్దాం - అయితే నువ్వులు అడిగే ముందు - ఆ ఇంటివారిని అడుగు - సోదరా - మీ ఇంటిలో ఎప్పుడైనా ఎవ్వరైనా చనిపోయారా? అని - ఎవ్వరూ చనిపోలేదు అని చెప్పిన వారి ఇంటి నుంచే గుప్పెడు నువ్వులు అడిగి తీసుకురా మాతా' అని పంపిస్తాడు! వస్సిత ఇల్లిల్లూ తిరిగి - మీ ఇంట్లో ఎవ్వరూ చనిపోలేదు కదా - అని అడిగితే - 'అవును సోదరి - అయ్యో చనిపోయావమ్మా'

'మాతా - చనిపోయారు' అనే వినిపించింది. తన బిడ్డ శరీరాన్ని మోసుకుంటూ తిరిగి తిరిగి - బుద్ధుణ్ణి చేరింది - 'భగవాన్ - ఇది మాతృత్వం కాదు - మా సంతానం - మట్టిలో కలిసిపోవలసిందేనా? మేమూ అంతేగా - మాలాగే - మా బిడ్డ కూడా - ఎంత విషాదం!' అని రోదించింది. అప్పుడు భగవాన్ - అవును తల్లీ - పుట్టిన ప్రతిదీ - గిట్టక తప్పదు - మట్టిలో కలవకా తప్పదు. ఈ సంక్లిష్టత మాసిపోవాలి - ఈ జనన మరణ శృంఖలాలు అంతమైపోవాలి వస్రిత అంటుంది - భగవాన్ నన్ను మీలో కలుపుకో స్వామీ...' మెదలీనా - మెల్లగా గొణిగింది - 'ఓ లార్డ్ నన్ను నీలో కలుపుకో...'

స్త్రీ దుఃఖం - మగవాని అశక్తత కదా! షండత కాదా?

స్త్రీ దుఃఖానికి ముఖ్యకారణం మగవాని నపుంసకత్వమే!

ప్రతి సాయంత్రం జార్జి వచ్చేవాడు - ఇప్పుడు చాలా సంతోషంగా స్వేచ్ఛగా ఉంటున్నాడు. నవ్వుతూ - నవ్విస్తూ, కాతరీన్ పుణ్యమా అని అతనిలో చాలా మంచి మార్పు వచ్చింది. అతను ఆనందానికి మార్గం కనుగొన్నట్లున్నాడు! విషాద ఛాయల్లో ఉన్న మా ఇంటి వాతావరణాన్ని అతని హాస్యంతో వెలిగించేవాడు, నా గదిలో అతనికి రాసుకునేందుకు బల్ల ఏర్పాటు చేశాను. నేను చరిత్ర అగాథాల్లో వెతుకుతుంటే అతను బడిపిల్లల జవాబు పత్రాలు తెచ్చేవాడు, వాటిని సరిచూస్తూ మధ్యలో చతుర్లాడేవాడు. ఒకరోజు - 'చూడండి - మానవ జాతి ఎక్కడికి పోతుందో' ఆరో తరగతి విద్యార్థి - కర్తవ్యం అంటే నువ్వు తొందరగా చేయగలిగింది' అన్నాడు. మరొకరు అది సార్వజనీనమైతే - టిబెట్టులో ఒక స్త్రీకి అయిదుగురు భర్తలుంటారు - అదే మొరాకో సుల్తాన్‌కు నలుగురు భార్యలుంటారు - ఎక్కడి ధర్మం అక్కడే!

అందుకే ఆగస్టు కామ్టే - గొప్పవాడి శాసనమే - కర్తవ్యం / ధర్మం అన్నాడు. కానీ నీ కర్తవ్యం ఏమిటి? నీ చుట్టూ ఉన్న చిన్న ప్రపంచానికి సంబంధించిదే - మధ్యయుగాల్లో రాజులే శాసించారు. ఇప్పటి మధ్యతరగతి ప్రజ - మున్సిపాలిటీకి కర్తవ్యం నిర్వహిస్తున్నారు. సోవియట్ రష్యాలో పార్టీలే నీ డ్యూటీ!

నిజానికి డ్యూటీ (ధర్మం) ఇలా నిర్వచించవచ్చు. నీ వ్యక్తిగత వ్యవహారం నీకానందాన్నివ్వాలి - అదే సమయంలో ఇతరులకు బాధ కలిగించకూడదు - ఇదే భారతంలో - *ఒరులేయేవియొనర్చిన / నరవర! యప్రియము తన మనంబునకగుదా / నొరులకు నవి సేయకునికి / పరాయణము పరమ ధర్మపథములకెల్లన్!*

- మహాభారతం, శాంతిపర్వం

జార్జి చెప్పిన దానికి - తిక్కన పద్యమే సరితూగుతుంది.

మెదలీనా వారానికి మూడు రోజులు లీజో దగ్గర తన 'పాలీ' పాఠాలు నేర్చుకుంటుంది. లీజోలో చాలా మార్పుని గమనించాను. బహుశా - జార్జి అతనికి మంచి విషయాలు బోధించి ఉంటాడు.

కాని తర్వాత నాకు తెలిసింది - నేను లండన్‌లో ఉండగా జరిగిన విషయాలు-

మెదలీనా పాలీ నేర్చుకుంటున్నప్పుడు - లీజో పాఠాలు చెప్పే సమయంలో మెదలీనా వంటింట్లోకి టీ తేవటానికి వెళ్ళింది. ఆమెకు లీజో అంటే చాలా జాలి - పాపం ఒంటరివాడు - అని దయగా చూసేది. ఆమె కప్పులు తీసుకుని వచ్చే సమయంలో రెండు చేతుల్లో రెండు కప్పులున్నాయి - లీజో తలుపు చాటున దాగి ఆమెను వెనక నుంచి చేతుల్తో కళ్ళు మూశాడు - ఇంక అంతే - మెదలీనా తన జాతిసిద్ధమైన కోపంతో కప్పులు వాడి ముఖాన కొట్టి చెంపలు వాయించింది. తన్నింది కూడా.

'నాకు చాలా కోపం వచ్చింది, పిచ్చి కోపం వచ్చింది. వాడు నేలమీద పడి, నన్ను క్షమించు - నన్ను క్షమించు - అని గోలపెట్టాడు. 'Jeme suis quine bate sauvage' అంటూ వేడుకున్నాడు. 'బహుశా నా పూర్వీకులు దుర్మార్గులేమో' అన్నాడు. క్షమించండి - అని బతిమాలాడు.

'అలాంటి మూర్ఖుణ్ణి క్షమించకుండా ఏం చేస్తాం' అంది. అంతే - తర్వాత విశ్వాసం గల కుక్కలాగా ఉంటున్నాడు. 'రామా, నీవు ఎక్కడికైనా వెళ్ళు - నిర్భయంగా - నాకు కాపలా కాయటానికి కుక్క ఉంది!'

మెదలీనా తన పాలీ పాఠాలు ఆపలేదు. ఆమెకు నెలలు నిండుతున్నాయి. ఆమె బరువు తెలుస్తూనే ఉంది. సహజంగా బాలింతకుండే మానసికమైన బాధ్యత, బరువు ఆమెలో బహిర్గతంగా కనపడుతున్నాయి. మేము చాలా దగ్గరయ్యాము. మాటలు తగ్గిపోయాయి. సైగలతో జాగ్రత్తలు పాటిస్తున్నాం. మా ఇంటి తోటలో ఉన్న నంది, మాకు అన్నీ చెప్పేది నిశ్శబ్దంగా - ముఖ్యంగా మెదలీనాకి, నా ఉత్తరం ఎప్పుడు వస్తుంది, కాలేజీకి ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎప్పుడు వస్తాడు - నంది మీద చెయ్యి వేసి జాగ్రత్తగా గమనిస్తే, ప్రకంపనాలన్నీ వినిపించేవి. టెలిగ్రాఫ్ కోడ్‌లాగా - మెదలీనా బాగా అర్థం చేసుకునేది. నంది పార్వతికి స్నేహితుడు కదా - శివునికి వాహనమే.

నేను నిజాయితీగానే ఉండాలి - మరో విధంగా ఉండవలసిన అవసరం లేదు. వసంతం రాబోతోంది. అప్పటికి నాన్న పోయి సంవత్సరం. పక్షులన్నీ మెల్లగా గూళ్ళకు చేరుతున్నాయి. ఎక్కడెక్కడో తిరిగి వస్తున్నాయి. మట్టి వాసన నన్ను చుట్టుకుపోతోంది. ఉదయభానుని వెచ్చని కిరణాలు నన్ను తాకుతున్నాయి. ఇండియా ప్రయాణం ఇంకా ఎంత దూరంలో ఉందో - ఆలోచిస్తున్నాను. నాలో తెలియని విషాదం నిండి ఉంది. ఈ విశాలాకాశం, చైతన్యంతో వెలిగిపోతున్న ధరాతలం - అంతా విచారగ్రస్తంగానే కనిపిస్తోంది. ఎక్కడో, ఏదో నాటకం, ఏకాంత ప్రదేశంలో నడుస్తున్నట్లు - పైకి లేవలేక, ఏమీ జరగకుండా, ప్రళయం సంభవిస్తున్నట్లు! ఈ భూమి మీద!

నువ్వు ఎక్కువగా గాఢంగా ప్రేమించేది - నీకు అత్యంత దగ్గరగా ఉండేది - ఆ శ్వాస నీతో మాట్లాడేది - సహజ పరిమళంతో - భారంగా, దగ్గరగా, అదే నీ విషాదాన్ని భరిస్తున్నట్లు - శక్తిహీనంగా, చనిపోయినట్లు!

నేను మెదూని దగ్గరగా హత్తుకున్నాను - ఆ రాత్రుళ్ళు ఆమెను వెచ్చగా ఉంచటానికి. మృదువుగా కన్నతల్లి పొత్తిళ్ళలో పెట్టుకున్నట్లు! వీలయితే పాలు కుడిపేవాడిని కూడా! నాకిప్పుడే అర్ధమవుతోంది - చూలింతలను అమ్మల దగ్గరకు ఎందుకు పంపిస్తారో! కాబోయే అమ్మమ్మకు అమ్మతనం బాగా తెలుసు - తన బిడ్డ పురిటి నొప్పులను తానే భరించగలదు - తన బిడ్డతో జీడిపప్పులు, పాయసం, చింతపండు పచ్చడి వేడివేడిగా తినిపించగలదు. గుత్తివంకాయ కూర, వారానికి మూడు రోజులు ఉల్లిపాయ పులుసు; అంతే పురుటి గదిలో ఏదో అద్దం పగిలిన శబ్దం - ఆ తర్వాత పురుటికందు ఏడుపు - కొత్త అవయవాలు, అంతా నవ్యంగా, సవ్యంగా జరిగిపోతుంది. పొత్తికడుపు ఖాళీ అయిపోయింది. ముక్కుపుటాలు వెల్లుల్లి వాసనతో నిండిపోతాయి. ఆ సమయంలో మెదలీనా కాళ్ళు నొక్కాలని ఆశిస్తాను. ఆమెను ఎంతగా సాకాలో అని వాపోతున్నాను.

ప్రేమ - విషాదం ప్రక్కప్రక్కనే ఉంటాయి. ఒకేలాగా ఉంటాయి. మెదు - 'రామా - చెప్పవా, నువ్వు నన్ను ప్రేమిస్తున్నావని' అని అడిగితే, 'ప్రియా - ప్రియా - చూడలేవా? నీ ప్రక్కనే ఉన్నాను - నీతోనే, నీలోనే ఉన్నానే - నేనూ నువ్వు వేరు కాదు - నేను నీలో లేనా? నేనూ నువ్వు సత్యంలో భాగమే కదా! సూర్యచంద్రులలాగా, నక్షత్రాలలాగా, ఈ అనంత విశ్వంలాగా' అని చెప్పేవాణ్ణి.

మెదూ ప్రక్కన పడుకున్నప్పుడు నాకెలాంటి పశ్చాత్తాపం లేదు. ఎటువంటి నిరోధాలు ఉండవు - సావిత్రి గురించిన ఆలోచనలు దిగమింగటాలూ లేవు. సావిత్రి ఉంది. నీలో కాదు - నాతోనే ఉంది. ఎవరో ఎక్కడో దూరంగా ఉన్నట్లు కాదు -

అసత్యంగానూ కాదు. ఓ కాంతి పుంజంలాగా, వెలిసిపోని వెలుగురేఖలాగా - ఎటు పోవాలో తెలియని వెలుతురులాగా - అనాదిగా ఘోషిస్తున్న సనాతన నిశ్శబ్దంలా అదే మొట్టమొదటి ప్రకంపనం - ప్రథమ ప్రణవనాదం, ఓం - అందులో నుంచే ఈ విశ్వం ఉద్భవించింది.

సావిత్రి - అర్థానికి నిర్వచనం - శబ్దార్థం!

ఆమె గతం - వర్తమానం - భవిష్యత్తు కూడా!

కానీ మా జీవితాలు - నాదీ - మెదూది - గాఢానురాగంతో పెనవేసుకుపోయినవి. ఒకరిపట్ల మరొకరికి ఎనలేని గౌరవం. ఒక చిన్న తప్పిదం - ఒక మానసిక అపశృతి - మమ్మల్ని శాశ్వతంగా విడదీసివేస్తుంది. మెదలీనాని ఒక చిన్న అబద్ధంతో చంపివేయగలను. మేము ఒక వింత మాయ గాజు గదిలో ఒకరి శ్వాస ఒకరు వింటున్నాం!!

మేము శారీరకంగా కంటే మానసికంగా ఏకమైపోయాం. ఆమె నా శ్వాస - నా శ్వాస ఆమెను చేరుతోందా? మధ్యలో ఎవ్వరైనా ప్రవేశించారా? ఒక్కోసారి సావిత్రి మృదువైన వెచ్చని, ప్రేమపూరిత హస్తం నన్ను తాకేది. అప్పుడు నేను అపరిచితుడిని - మెదలీనా - సావిత్రి మిగిలేవారు!

మెదూ మీద నుంచి - జాగ్రత్తగా, మెల్లగా నా చేయి తీసి ప్రక్కకు వత్తిగిలేవాణ్ణి - అప్పుడు సుతిమెత్తని ఒత్తిడి తగిలేది - సావిత్రి నాతో - 'ప్రియా - ప్రియా - వెళ్ళిపోకు' అని అన్నట్లు!

కాథరీనాని రమ్మని ఉత్తరం రాశాను. ఆమె మాతో ఉంటే కాస్త హుషారుగా ఉంటుంది. జార్జి కూడా సంతోషిస్తాడు. ప్రేమకు, కాలం - దూరం రెండూ శత్రువులే! ఉత్తరం సంగతి మెదూకు చెప్పలేదు. కాతరీనా, అంకుల్ చార్లీని ఒప్పించటానికి ఇబ్బంది పడింది. వారం తర్వాత వస్తూ - మేము మీలాగా కాదు - అదే 'ఇండియన్స్'లాగా కాదు - 'నువ్వు ఎప్పుడూ - మీ అమ్మ దగ్గర ఉండకూడదు - ఆ మధ్యనే నెలరోజులున్నావు - మళ్ళీ ఇప్పుడు - వాళ్ళేమీ షావుకార్లు కాదు' అని నాన్న హితవు చెప్పారు. ఇది నేను అర్థం చేసుకోగలను. నాన్నగారు అనేవారు 'మనింటికి చుట్టాలొస్తే మనం తినేదే పెడతాం - పట్టు పరుపులు లేకపోతే చాపల మీదే పడుకుంటారు' అని - కాథరీన్‌కి అన్నీ తెలుసు - పైగా జార్జితో గడపాలని తహతహలాడుతోంది. వాళ్ళు త్వరలోనే దంపతులు కాబోతున్నారు.

కాతరీన్ నిష్ఠూరంగా 'రామా - నువ్వు నా పెళ్ళికి ఉండవు కదా - నాకూ, జార్జికి ఇక పెద్దలెవ్వరు?'

'మా ఇంట్లో ఇదే మొదటి పెళ్ళి - సరోజ - చిన్నమ్మ అందరూ నా కోసం ఎదురు చూస్తున్నారు - నేను చేయవలసింది చాలా ఉంది - అర్థం చేసుకుంటావుగా' అని సముదాయించాను.

కాతరీన్ మా అందర్నీ మారిగ్నాన్ ఎయిర్‌పోర్టుకి కారులో తీసుకుపోయింది - మెదలీనా వెనక కూర్చొంది - చేతిలో రుద్రాక్ష మాలతో - ఆమెకు బౌద్ధం బాగా వంటబట్టింది. ఆమె ప్రక్కన జార్జి కూర్చున్నాడు - లిజో చాలా బుద్ధిగా 'నేను నార్త్ ఇండియా' వెళ్ళాలనుకుంటున్నాను - బూటాని భాష నేర్చుకుని నిఘంటువు రాయాలి - ఇంతవరకు అలాంటిది 1882లో రివరెండ్ ఫాదర్ టెంపుల్స్ టన్ ఒక్కరే రాశారు.'

జార్జి - నేను మెదలీనాని జాగ్రత్తగా చూసుకుంటాను. అని కాతరీన్ వంక చూశాడు - మీకు త్వరలోనే అన్ని మంచి వార్తలే వస్తాయి అన్నారు. మెదలీనా వంక చూశాను. నాగరకత ఎంతగా ముందుకు పోయినా గర్భిణీల విషయంలో అన్యాయమే చేసింది. ఇప్పుడు కనటమే కష్టమైపోతోంది. చిన్నమ్మ చివరి వరకూ పనులు చేస్తూనే ఉంది. తడి బట్టలు పిండుతూనే ఉంది. ఆరేస్తుండగా నొప్పులొచ్చాయి - అప్పుడే శ్రీధర్ భూమి మీదకు వచ్చాడు - అది కదా సహజత్వం అంటే!

'నేను త్వరగానే వచ్చేస్తా' - మెదలీనాతో అన్నాను.

ఆమెకు వంగి నమస్కారం పెట్టాను. అందరి ముందర ముద్దుపెట్టి వెళ్ళొస్తానని చెప్పటం నాకలవాటు కాలేదు! ఆమె చేతిని అందుకోవటం కూడా - అంతమందిలో అపవిత్రంగానే అనిపించింది! కాని సావిత్రి విషయంలో అలా అనిపించలేదే?

అలా ఆశ్చర్యపోయాను - విమానం దగ్గరకు చేరాను. విమానం తలుపు మూసుకోగానే - ఎందుకో మళ్ళీ అన్ని మామూలుగా ఉండవేమో అని అనుమానం వచ్చింది! మెదలీనాకి ఏదో ఒక బ్రహ్మాండమైన - సంపూర్ణమైన మార్పు జరిగింది - నాకూ - ప్రపంచానికి కూడా! మధ్యధరా ఆకుపచ్చని సిల్కు చీర కట్టుకుంది. వెచ్చని ఎండలో మెరిసిపోతోంది.

మనిషి - మరుగుజ్జులా - వేడిగా ఉండకూడదు - మార్కస్ ఓరిలీ (Marcus Aurelius) అద్భుతమైన మేధావి. అతని తెలివితేటలు ప్రపంచ వ్యాప్తం. సోక్రటీస్ శాశ్వతుడు - అతని ప్రవచనాలు ప్రపంచం ఉన్నంత కాలం ఉంటాయి.

అలెగ్జాండ్రియా - మనిషికి ధైర్యం భూగోళశాస్త్రం నేర్పింది - తూర్పు ప్రాంతపు జ్ఞానం భారతదేశంపై మహావిజ్ఞాన సర్వస్వం రాసింది. Eratosthenes

అలెగ్జాండ్రియాలోని గ్రంథాలయకర్త. పాటలీపుత్రకు Ptolemy రాయబారిని పంపాడు - 'సత్యాన్ని వ్యక్తిగత అనుభవంతో దర్శించాలి'.

మధ్యధరా సముద్రం - ఇది బ్రాహ్మణ సాగరం - ఇది భారతదేశపు సముద్రం - పవిత్రమయినది.

ఎక్కడో 'Rhone' రోనీలో గంగామాత రహస్యాలు తెలిసి ఉండాలి - నా దేశం, నా భూమి ఎప్పటికీ నాదే - పవిత్రమయింది.

"నీ దేశంలో అంత అందమయిన, సనాతనమయిన, పవిత్రమయిన దేశంలో జన్మించటం ఎంతటి అదృష్టం - రామా" అంది మెదలీనా ఒకసారి.

అవును - నిజమే.

సముద్రాలకు ఉత్తరాన-

హిమనగాలకు దక్షిణాన -

భారత పవిత్ర భూమి.

భారతవాసులు అక్కడే నివసిస్తారు -

తొమ్మిది యోజనాల పొడవు -

వారి కర్మఫలమే అనుభవిస్తారు -

మోక్షగాములై అన్వేషిస్తారు -

నాల్గవ అధ్యాయం:

సరోజ

శాంతాక్రూజ్‌లో దిగుతున్నప్పుడే గాయత్రి పాడుకుంటున్నాను. ఇరవైఏండ్లుగా ఈ మంత్రం నా నాలుక మీదే ఉంది. ఎన్ని లక్షల సార్లు జపించానో! ఓం! సత్యదర్శనం - బంగారు అంచులో దర్శనమవుతున్న సత్యసుందరం! అజ్ఞానపు పొరలు పారద్రోలు. నిన్ను కనులారచూడనీ! ఇప్పుడు నిశ్శబ్దంగానే జపించాను. మృదువుగానే పెదవులు కదిపాను. చెంతనే ఉన్నట్లు - ఆత్మీయంగా ఉన్నట్లు సౌందర్యంతో నిండుగా!

భారత్‌ను చూడాలనుకుంటున్నాను - ఈ దేశం ఈ నేల నా నరాలలో ఇమిడి పోయిన ప్రదేశం. అంతర కాశీని నా అంతరంగంలో దర్శించినట్లు! ఇప్పుడు భారత్ నాకు ఒక నేల కాదు, చెట్లు, అడవులు కాదు. పీలకాళ్ళు, బక్క చేతులు కాదు, పేద కూలీలు కాదు, అదిగో కొత్త యూనిఫాం వేసుకున్న ప్రభుత్వ ఉద్యోగి కాదు - నన్ను చూడు - ఇప్పుడు స్వతంత్ర దేశంలో ప్రభుత్వోద్యోగిని - అన్నట్లు గర్వంగా చూస్తున్నాడు! ఇవేమీ కాదు - మరేదో, మరెక్కడో కేంద్రీకృతమై, మరింత విస్తృతమై వినయపూర్వకంగా, దేవతలే దిగి వచ్చి ఈ ప్రదేశంలో తిరుగుతున్నట్లు చెట్లన్నీ అడవులయిపోయినట్లు, నదులన్నీ తమ పేరు తామే పెట్టుకుని పొంగిపోతున్నట్లు - పక్షులన్నీ రెక్కలు తొడుగుకొని పైకి - పైపైకి వెళ్ళిపోతున్నట్లు - మబ్బులకు అందకుండా - వాటి పిలుపు ఈ లోయల్లో ప్రతిధ్వనిస్తున్నట్లు - నేను చూసేది బ్రహ్మ - ప్రజాపతి! వరుణుడు - మైత్రేయి, ఇంద్ర, కృష్ణ, శివ, పార్వతీ సమేతంగా ఉన్న పుణ్యప్రదేశాన్ని - రాముడు, హరిశ్చంద్రుడు, యాజ్ఞవల్క్యుడు - ఇందరితో నిండిన నా దేశం - అది నిరంతర ప్రవాహం. దానికి కాలం లేదు - కేవలం అంతరిక్ష విశ్వాంతరాళం - అనంతం!

ఓ నల్లమబ్బు నిలబడి - చూడండి ఇక్కడ వర్షిస్తున్నాను - వర్షిస్తూనే ఉంటాను - అంటూ మన హృదయాలను - మేధను సారవంతం చేస్తుంది. కాలాతీతంగా ఈ ప్రక్రియ జరుగుతూనే ఉంటుంది! బహుశా ఈ కారణంగానే భారత్ చరిత్రకు వెలుపల ఉండిపోయింది.

ముక్కోణాకారంలో - చుట్టూ మూడు సముద్రాలతో పరివేష్టింపబడి, కాలాతీతమైన ఆత్మను చైతన్యాన్ని సొంతం చేసుకొని ఈ భూమికి పైన ఎక్కడో

బంగారు పళ్ళెంలా వెలుగుతూ దర్శనమిస్తోంది. అరేబియా సముద్రం పైగా విమానం మబ్బుల్ని చీల్చుకుని వస్తుంటే, ఏదో బంగారు రంగు మెరుపుతో పచ్చని ప్రకృతి పరుచుకుంటుంది - మీరు చేతితో అందుకోవాలని ఆరాటపడతారు. దాని రుచేదో తెలుసుకోవాలని ఉవ్విళ్ళూరుతారు - అది కేవలం మీకే చెందినట్లు ఆరాటపడతారు - మీరు భారతీయుడైనా, చైనాకి చెందినా - ఫ్రెంచివాడయినా, ఇది చరిత్రలో ప్రత్యేకంగా జరిగిన వింత! మానవాళి తమ కోసం ప్రత్యేక ప్రదేశాన్ని ప్రత్యేకించినట్లు - ఆ ప్రదేశం ఉంటుంది - ఎప్పటికీ - ఏదో ప్రత్యేక సందర్భం కోసం ప్రత్యేకంగా - సాయంత్రపు చీకటి వెలుగులో - మీరు కవిత్వం చదివిన తర్వాత మీ శ్వాసతో - మరణానంతర నిశ్శబ్దంలో - ప్రేమభావనలో - గాఢనిద్రలో - ఇది అందరికీ తెలిసిన 'ప్రదేశమే' కాని నీకు నువ్వే ముఖాముఖి దర్శించాలి!

అదిగో అలాంటి ఇండియా నేను చూశాను - కాని అంతలోనే 'కస్టమ్స్' అధికారుల పిలుపుతో - కూలీల అరుపులతో పోగొట్టుకున్నాను - ఈ బొంబాయి వికృతాకారం నన్ను బాధిస్తుంది. అదేదో మనకి చెందని విషయంలా - తాజ్‌లో స్నానం చేసి - త్వరగానే హైదరాబాద్ విమానం ఎక్కాను - మళ్ళీ నా ఇండియా నాకు కనిపించింది! కిందకు చూస్తే కొండలు - కాలువలు - రైళ్ళు - గ్రామాలు - నదులూ అన్ని తెల్లగా - పసుపు పచ్చని - ఆకుపచ్చని పొలాల మధ్యగా... త్వరలోనే హైదరాబాద్ చేరతాను.

హైదరాబాద్ నగర ప్రాదుర్భావం నాకు గుర్తుంది. గోల్కొండ రాజు - అనారోగ్యంతో - ఆర్థికమైన ఇబ్బందులతో కునాలుడై ఉన్నాడు. ఆయన దగ్గర ఉన్న, విలువైన రత్నాలు ఏమీ దారి చూపలేదు. ప్రధానమంత్రి - బ్రాహ్మణశ్రేష్టుడు - ఈ సమయంలో ఎంతో విచారగ్రస్తుడై - శత్రుభయంతో నిద్ర లేమితో గడుపుతుండగా - ఆకాశంలో ఆకుపచ్చని అలౌకికమైన నెమలి వర్ణం పరచుకోవటం చూశాడు - ఆశ్చర్యంతో ఆ వెలుగులో నుంచి సకల అలంకార శోభిత లక్ష్మీదేవి దర్శనమిచ్చింది. 'అమ్మా! పవిత్ర దేవతా - దయతో మా నగరంపై కొంత సమయం ఉండగలరా? మా రాజుగారిని పిలుచుకొస్తాను..' 'తథాస్తు' అంది, సకల సంపదల దేవత - బ్రాహ్మణమంత్రి పరుగు పరుగున తన సుల్తాన్ దగ్గరకు చేరి - జహాపనా - అదిగో - ఆ నది పైన లక్ష్మీదేవి - వచ్చి దర్శనం చేసుకో - అని ఆరాట పడ్డాడు. హస్సన్ కుతుబ్ షా ఖడ్గం - కిరీటంతో బయలుదేరితే - బ్రాహ్మణ మంత్రి దారి చూపుతున్నాడు - వంగి వంగి - అంతే సుల్తాన్ అతన్ని రెండు ముక్కలుగా నరికాడు - అలా అయితే లక్ష్మీదేవి ఇక్కడే ఉండిపోతుంది - అని ఆశతో. 'ఓ పద్మాసనా -

లక్ష్మీమాతా - నా మంత్రి ఇక తిరిగి రాడు - నీకు ఇక్కడే గుడి కట్టిస్తాను - ఉండిపో తల్లీ' అని ప్రాధేయపడ్డాడు. హసన్ కుతుబ్ షా లక్ష్మీదేవికి 'నాలుగు మినరెట్'తో మసీదులాంటి ఆలయం కట్టాడు - అప్పటి నుంచీ - లక్ష్మీదేవి ఈ నగరానికి ధనరాశులు కురిపిస్తూనే ఉంది. అందుకే 'భాగ్యనగరం'గా ప్రసిద్ధి పొందింది!! ఎంతో సుందర ప్రదేశాలు - భాగ్యాలతో విలసిల్లే నగరానికి - 'హైదరాబాద్' అనే అసహ్యమైన పేరు ఎందుకుంటుంది!

నేను వస్తున్నట్లు చిన్నమ్మకు చెప్పనే లేదు - ఏ రోజు వస్తానో ఎన్ని గంటలకు చేరతానో ఆమెకు తెలియదు. ఒక్కసారిగా ఆశ్చర్యపరిస్తే - దూరాలు చెరిగిపోతాయని... చేరువగా అనుకోవడానికి అవకాశం ఉంటుందనీ...

మధ్యాహ్నం వేళ అయింది. నేను చేరే సమయానికి. అప్పుడు పెరటి గేటు వేసే ఉంది. నేను తలుపు తీయగానే టైగర్ - చాలా కోపంగా నా మీదకు వచ్చింది. చివరికి నా ముందు పడుకుని క్షమాపణలు అడిగింది. 'ఇంటి యజమాని వచ్చాడు!' కుళాయికి ఇంకా మరమత్తులు చేయాలి. మెట్లెక్కి లోపలికి తొంగి చూశాను. అంతా నిశ్శబ్దంగా ఉంది. తలుపు మీద శబ్దం చేశాను - 'ఎవరదీ' చిన్నమ్మ దేవుని గదిలో నుండి బహుశా పూజలో ఉందేమో - 'నీ కొడుకు వచ్చాడమ్మా' అని గట్టిగా అరిచాను. అంతే - ఆమె గద్గద స్వరాన్ని వినకుండా ఉండలేకపోయాను.

'వచ్చావా?' అంటూ... మడివస్త్రాలతో ఉందిగా - నన్ను ముట్టుకోలేదు. పెట్టెలు నేనే మోసుకొచ్చాను - నౌకర్లంతా భోజనాలకు వెళ్ళినట్లున్నారు. టాక్సీ పంపేశాను. నా స్నానాల గదికి - వెచ్చని - పొగచూరిన - స్నానాల గదికి వెళ్ళాను.

గోడ మీద బల్లులు చాలా హుషారుగా తిరుగుతున్నాయి. పెరటిలో బొప్పాయి పండిందేమో - జామకాయలు దోరగా మారినాయి - స్నానాల గది కిటికీలో నుంచి చూస్తూ పెద్ద చెంబుతో అమ్మా - గంగా - గంగమ్మ తల్లి అనీ నీళ్ళు పోసుకున్నాను. గంగా, జమునా, సరస్వతీ అంటూ తలారా స్నానం చేశాను. వచ్చి తుడుచుకుని పంచె కట్టుకున్నాను. అప్పుడు పూజగదిలోకి వెళ్ళాను. చిన్నమ్మ ఇంకా పూజ చేస్తూనే ఉంది. దేవతా విగ్రహాలన్నీ పూలతో అలంకరించి ఉన్నాయి. ఈ విగ్రహం కిట్టన్న తాత వారణాసి నుంచి తెచ్చినదే. అక్కడ నుంచే చిన్నమ్మ నాకు 'మెట్లు' తీసి ఇచ్చింది - మెదలీనా, ఇంటి కోడలికి ఇవ్వమ్మని!

చిన్ని ఎత్తు పీట తీసుకొని కూర్చున్నాను - నాన్న దీనిమీదనే కూర్చునేవాడు. చిన్నమ్మ ప్రక్కనే కూర్చొని రామన్న తాత నా చెవిలో ఊదిన గాయత్రీ మంత్రాన్ని

'ఓం సత్యదర్శనీ' అంటూ ఆలపించాను. శ్రీధర్ నిద్ర లేచాడు - 'చిన్నమ్మా! నీ పూజ కానీ' అని శ్రీధర్ ఊయల ఊపుతూ-

హంస తూలికా - ఊయల బాబు -

అది నేను - నేను అదే -

హంస పాడుతోంది మధురంగా -

అన్ని అందులో కలసిపోతాయి -

శ్రీధర్‌కు ఎలాంటి భ్రమలూ లేవు. ఎవరు నిద్రపుచ్చుతున్నారో అమ్మ కాదని - తెలిసి గట్టిగా ఏడవటం మొదలు పెట్టాడు. అంతలో చిన్నమ్మ వచ్చి తీసుకుంది - ఏవో మాటలు మృదువుగా చెప్పింది. వాడు మళ్ళీ నిద్రపోయాడు. ఇంట్లో నిశ్శబ్దం అలముకుంది.

ఈ రోజు స్థిరవారం - రామా - సరిగ్గా సమయానికే వచ్చావు. మనం రాముని కథ చెప్పుకోవాలి అంటూ నా ప్రక్కనే పీట మీద కూర్చొని శ్రీరామ కథ చెప్పటం మొదలు పెట్టింది.

పూర్వ కాలంలో ఓ బ్రాహ్మణోత్తముడు - కొడుకుని పిలిచి - 'నాయనా, నాకు వయస్సు మీద పడుతోంది - ఒడలు వడిలిపోతోంది - నేను కాశీ యాత్ర చేస్తాను - బ్రహ్మభట్టా నేను యాత్రలో ఉన్నప్పుడు మీ అమ్మను - తొమ్మిది స్తంభాల మన ఇంటిని - పచ్చని పొలాలను - మన గోవులను జాగ్రత్తగా కాపాడు - పన్నెండేళ్ళు' - 'మీరు ఎలా చెబితే ఆ విధంగానే చేస్తాను తండ్రీ' అన్నాడు కొడుకు. భార్యను చూసి 'నేను వెళ్ళి వస్తాను' - ఆమె దుఃఖించింది. 'మరి చిన్నదాన్ని ఏమి చేస్తారు' అంది - ఏడేళ్ళ కూతురుని చూపించి - 'ఆమె నాతో వస్తుంది. మంచి వరునికిచ్చి పెళ్ళి చేస్తాను' మేళతాళాలతో ఊరి పొలిమేరకు వచ్చాడు. ఊరి జనం అందరూ సాగనంపటానికి వస్తారు. అతని భార్య కాళ్ళ మీద పడి 'మీరు కాశీ యాత్రకు వెళుతున్నారు. మీరు వచ్చేవరకూ మేము ఏమి చేయాలి?' అంటుంది.

'ఇల్లంతా శుభ్రంగా ఉంచు. ప్రతి శనివారం రామకథ వినిపించు' అని ఈశ్వరభట్టు యాత్రకు కూతురితో బయలుదేరతాడు - అడవులు - కొండలు - వాగులు దాటుకుంటూ.

'అమ్మా - నాన్నగారు వచ్చేవరకూ ప్రతి శనివారం రామకథ వినిపించుదాం - అని ఇల్లంతా పరికించి చూస్తాడు. తేజోవంతంగా, అలంకారాలతో - గోవులన్నీ ఆరోగ్యంగా - పొలాలన్నీ పచ్చగా పంటలతో ఉంటాయి. ఇల్లంతా ఆవుపేడతో అలికి - ముగ్గులు పెట్టి ఉంటుంది - గడపలన్నీ పసుపు పూసి కుంకుమ బొట్లతో

కళకళలాడుతుంటాయి. ఈశ్వరభట్టు యాత్ర మొదలయింది. ఎన్నో యోజనాలు ప్రయాణం చేసి ఒక చోట విశ్రాంతి కోసం ఆగుతాడు. వంట చేస్తాడు, ప్రార్థనలు, మంత్రాలు వల్లిస్తాడు, నదిలో స్నానం చేస్తాడు, సూర్యుడు ఉదయించక మునుపే ప్రయాణమయి - 'ఈశ్వర - ఇదిగో వస్తున్నా' అని సాగిపోతాడు.

ఆ విధంగా పౌర్ణమి తర్వాత పౌర్ణమి యాత్ర సాగిపోతుంటుంది. నర్మదా నది ఒడ్డున ఒక సాధువును చూస్తాడు. ధ్యానంలో ఉన్న సాధువు ఈశ్వరభట్టుని చూసి తన దగ్గరున్న కందమూలాలు, ఫలాలు ఇస్తాడు. అతని ఆరాధనకు సంతుష్టుడయి - అయ్యా - ఇదిగో - నా పుత్రికను స్వీకరించి, నాకు అల్లునిగా రమ్మంటాడు. 'అలాగే కానీండి' అని పుత్రికను భార్యగా స్వీకరిస్తాడు సాధువు. మీరు ఆనందంగా ఉండండి - రామకథ వినిపిస్తుండండి - అని అస్తమిస్తున్న సూర్యునివైపు యాత్ర సాగిస్తాడు.

ఎన్నో యోజనాలు యాత్ర తర్వాత - ఒక ఇంటి తలుపు తడతాడు - 'యాత్రికుణ్ణి' అని - ఒక స్త్రీ తలుపు తీసి - అయ్యో - ఇంటి యజమాని యాత్రకు వెళ్ళి, పన్నెండేళ్ళయింది - అని అంటుంది - 'విచారించకమ్మా' అప్పటివరకూ రామకథ - అని శ్రీరామకథ వినిపించి - మళ్ళీ యాత్రకు - అస్తమించే సూర్యునివైపు రాత్రి - పగలు వెళుతుంటాడు - ఎండలు మాడ్చినాయి - వానలు తడిపినాయి - రాత్రి చలి వణికించింది - అయినా ఈశ్వరభట్టు వెళుతూనే ఉన్నాడు.

చాలా - చాలా దూరం వెళ్ళిన తర్వాత ఓ పిలుపు వినిపించింది. యాత్రికుడా - ఆగవయ్యా - ఆ పిలిచిన సాధువు గుడ్డివాడు - అతని కొడుకు యాత్రకు పోయాడు - ఇంతవరకు ఎటువంటి వార్తా లేదు - ముసలి దంపతులు ఎదురు చూస్తున్నారు - పొలాలన్నీ పిట్టలు చేరాయి - పంటలన్నీ కోతకొచ్చాయి - 'ఈ పక్షులు చాలా తెలివిగలవి. అన్నివైపుల్నుంచి వస్తున్నాయి' ఇంటి కోడలు అంటుంది.

ఈశ్వరభట్టు వాళ్ళను కూర్చోబెట్టి - రామకథ చెప్పటం ప్రారంభించాడు. శ్రీరాముడు దీవెనలు ఇస్తాడు - ఈ కథ ప్రతి శనివారం వినిపించండి - అని తన దారిన వెళ్ళిపోతాడు.

చాలా చాలా దూరం ప్రయాణం చేస్తాడు అడవిలో - చీకటి పడుతుంది - మెరుపులు మెరుస్తాయి - చినుకులు పడతాయి - అతనికి సీతా సమేత రాముడు, లక్ష్మణుడు భరతశత్రఘ్నులు దర్శనమిస్తారు. వెనుకనే ఆంజనేయుడుంటాడు. పూల వాన కురుస్తుంది - ఈశ్వరభట్టు శ్రీరాముని పాదాలపై పడతాడు - రాముడు దీవించి, నీ యాత్ర సఫలమయింది - ఇక తిరిగి పో - ఇంటికి పో - అని దీవిస్తాడు.

శ్రీరాముని తనివితీరా చూసి ఈశ్వరభట్టు దక్షిణంగా ప్రయాణం మొదలుపెడతాడు - ఆత్మతృప్తితో - శ్రీరామదర్శనం - దివ్యానుభూతి అతనికి ఎనలేని శక్తినిస్తుంది.

అక్కడ నుంచి గుడ్డివాని కుటుంబాన్ని చూస్తాడు - ఓ బ్రాహ్మణా వచ్చావా - ఎంత అద్భుతం - మా పొలాలన్నీ సస్యశ్యామాలంగా ఉన్నాయి - పక్షులన్నీ పారిపోయాయి - అని ఈశ్వరభట్టుని కూర్చోబెట్టి అన్ని విషయాలు చెప్తాను - ప్రతి శనివారం రామకథ వినిపిస్తుంటాము అని అన్నారు.

'అద్భుతం - అద్భుతం' అంటాడు. వారికి తను చూసిన రాముని కథ వినిపిస్తాడు-

అక్కడ నుంచి ఇంటివైపు ప్రయాణం - అడవులు - ఏరులు - కొండలూ దాటుకుంటూ - తనకు ఆశ్రయమిచ్చిన ఇల్లాలు దగ్గరకొస్తాడు 'స్వామీ మీరు వెళ్ళగానే నా భర్త తిరిగి వచ్చాడు - రామకథ వినిపిస్తూనే ఉన్నాం - అని ఈశ్వరభట్టునికి మంచి భోజనం మిఠాయిలు పెట్టి రామకథ చెప్తారు-

అక్కడ నుంచి తన కూతుర్నిచ్చిన సాధువును చేరతాడు - అతని కుటీరం లతలతో పూలతో ఫలాలతో కళకళలాడుతుంటుంది. కూతురు, అల్లుడు ఆనందంగా ఉంటారు. వారి సంతానం అతని ఆశీస్సులు తీసుకుంటారు.

'నాన్నా - అమ్మకు చెప్పు - నేను ఆనందంగా ఉన్నానని' 'దయచేసి అమ్మకు చెప్పు' అంటుంది - 'రామా రామా' అంటూ సాగిపోతాడు.

తొందర్లోనే తన తొమ్మిది స్తంభాల ఇంటిని - కొడుకుని - భార్యని - గోవుల్ని చూడవచ్చు - అనుకుంటూ-

కాని ఇక్కడ జరిగింది వేరు - సోమ, మంగళ, బుధ - గురు, శుక్రవారాలు గడిచిపోయాయి - శనివారం బ్రహ్మ భట్టు - అమ్మ రామకథ వినిపించు' అంటాడు. ఆగు నాయనా - గోవులకు నీళ్ళు పెట్టి గడ్డివేసి వస్తాను. వడ్లు కొలిచి - దంచి వస్తాను - అంతే రామకథ వినిపించలేదు - ప్రతి వారం ఇంతే సంగతి - అమ్మ అడిగిన రోజు కొడుకుకు తీరదు - కొడుకు అడిగిన రోజు అమ్మకు తీరదు.

ఇల్లు బోసిపోతుంది - పంటలు పండలేదు. గోవులు ఎండిపోతాయి.

ఈశ్వరభట్టు వచ్చినప్పుడు పరిస్థితి ఇది - ఊళ్ళోకి ఈశ్వరభట్టు వస్తున్నాడని తెలిసి ఊరంతా పొలిమేరకు వెళ్తుంది మేళతాళాలతో-

ఈశ్వరభట్టు ముఖం వెలిగిపోతుంటుంది - అందరూ అతని తేజస్సు గ్రహిస్తారు - ఇంటివరకూ దిగబెట్టి వెళ్తారు. ఈశ్వరభట్టు కాళ్ళమీద ఎవ్వరో పడతారు - ఎవ్వరు నాయనా నువ్వు? - అతను చింపిరి గడ్డంతో గుర్తుపట్టలేనట్లుంటాడు - నేను

నీ కుమారుణ్ణి - అని బావురుమంటాడు! ఇది ఎలా జరిగింది? మేము ఒక్క వారం కూడా రామకథ వినిపించలేదు - అమ్మ వంటింట్లో - నేను వేరే పనిలో - ఏ శనివారం రామకథ చెప్పలేదు - అంటాడు.

అంతే - అప్పటి నుంచీ ఈశ్వరభట్టు రామకథ వినిపిస్తాడు. అతని సౌభాగ్యాలన్నీ తిరిగి వస్తాయి - "నా కూతురు ఎలా ఉంది?" అమ్మ అడుగుతుంది - భర్తతో ఆనందంగా ఉంది.

రామా - రామా - మాకు సంపదలివ్వు - మాకు సౌభాగ్యానివ్వు - మాకు సంతానాన్నివ్వు - వనాలివ్వు - పూవులివ్వు - పంటలివ్వు - గుడ్డివానికి చూపునివ్వు - చెవిటివానికి వినికిడినివ్వు - రామారామా - నీ దివ్య దర్శనాన్నివ్వు.

చిన్నమ్మ ఈ రామకథ పూర్తి చేసింది. అప్పుడే కారు ఆగిన చప్పుడు వినిపించింది. "అదిగో - సరోజ వచ్చినట్లుంది". మెల్లగా చిన్నమ్మ అంది. తలుపు తీయటానికి వెళ్ళింది. 'సరోజా - నీకు అమూల్యమైన కానుక ఇస్తాను - నీ పెళ్ళి కానుకగా. అసలైన రత్నాన్ని' అంది. సరోజ ఇంట్లోకి వచ్చి నన్ను చూసి కన్నీరు ధారగా కారుతుండగా "అన్నా, నన్ను దీవించటానికి వచ్చావా? నువ్వెంత విశాల హృదయం కలవాడివి?" అంటూ చిన్న పిల్లలాగా, చిట్టి పావురంలాగా నన్ను చుట్టుకుపోయింది! చిన్నమ్మ తీయని ప్రసాదం అందరికీ పంచింది. ఆ రాత్రి అందరం కలిసి భోజనాలు - మౌనంగా ముగించాము.

ఆ రోజులు ఏదో తెలియని బాధతో నిండిన సమయం - వింత వెలుగుతో నిండిన విచారం - అంతగా బాధించని బాధ!

చుట్టాలు - పక్కాలు - ఆడా - మగా అందరూ వచ్చిపోతున్నారు. ఏదో ఒకటి సలహాలు ఇస్తూనే ఉన్నారు. ఇదిగో - ఈ ధర్మవరం పట్టుచీర - నెమలి ఈక రంగుది తీయండి - పెళ్ళి వారికి కంచి చీరలు పెట్టండి - ఇదిగో ఆ మామిడి పిందెల అంచు - ఇదీ - కాదు అదీ - ఇలా ఎంపిక సాగిపోతుంది. పొట్టలు పెరిగిన వంటవాళ్ళు - త్రేన్చుతూ - పొడుం డబ్బాలు బొడ్డులో పెట్టుకొని - డబ్బులు మరో ప్రక్క చుట్టుకుని - చెప్పండి - వెయ్యి లడ్డూలు చేయాలా, లేక పన్నెండు వందలా - రెండో రోజుకు ఎన్ని - మూడో నాడు అవసరం ఎన్ని - పాలు, పాయసం చేయటానికి తెప్పిస్తున్నారా? పంచదార, బాదం, కాశ్మీరు పూవు తెప్పిస్తున్నారా - ఇదే సందడి.

ఇల్లంతా ఇరుగు పొరుగుతో నిండిపోయింది. అప్పడాలు చేసేవారూ, పచ్చళ్ళు పట్టేవారూ, పసుపు కొట్టేవారూ, బ్రాహ్మణులు వచ్చి పళ్ళికిలించి, లండన్ నుంచి బాబు వచ్చాడంట అని వాళ్ళలో వాళ్ళు చెప్పుకుంటూ ఇక రూకలకు కరువు ఉండదు - పందిళ్ళకు వాసాలు వస్తున్నాయి - పచ్చి తాటాకులు - అదేదో పెళ్ళి వాసన - శుభ పరిమళం వీస్తున్నాయి - మామిడి తోరణాలు - మల్లెల దండలు-

సీతారాం బాబాయి ఉన్నాడు, నా మారుటి చెల్లెళ్ళు - సీత, పార్వతి, పాప, లక్ష్మీదేవి, సంజమ్మ - కావేరి, ఆనంది, వెంకటలక్ష్మి, భాగీరథి, సావిత్రి! ఈ సావిత్రి చక్కగా నలుగురు పిల్లల్ని కనిఎండిపోయింది.

నాన్న మారుటి తమ్ముళ్ళు రామచంద్ర, లక్ష్మీనారాయణ, బాబాయిలు వచ్చారు - నవ్వుతూ సంతోషంగా ఆ పనీ ఈ పనీ చూస్తున్నారు. చతురోక్తులతో నవ్విస్తున్నారు. సంస్కృతం, తెలుగు, కన్నడం, ఉర్దూ, ఇంగ్లీషు అన్నీ కలిపి వినిపిస్తున్నాయి. ఒక భాషలో ఒక మాట, మరో భాషలో మరో అర్థం వస్తుంది. అదీ హాస్యం! ఏవో చిన్న అనుభవ కథనాలు, కాస్త వెకిలిగానూ. పందిటి గుంజలకు కొబ్బరి ఆకులు, అరటి బోదెలూ అలంకరిస్తూ కూలీలు, ఆకుపచ్చని గుడ్డలు, తెల్లని మల్లెలు, అలంకరణలన్నీ ఎవరో మహాత్మాగాంధీలాంటి బొమ్మ ఉన్న గుడ్డ కూడా కట్టాడు దేశభక్తుడు! జాతీయ జెండాల దండ కూడా వేశాడు. జాతిపితకు నివాళి! ఆ బొమ్మ తీసివేసే దమ్ము ఎవ్వరికీ లేదు. ఎవ్వరూ నోరు మెదపటానికి ఆస్కారం లేదు.

ఆడవాళ్ళు - వంటి నిండా పట్టు చుట్టుకుని హడావుడి చేస్తున్నారు. వాళ్ల నవ్వులు, వాళ్ళ నేర్పూ గొప్పగా ఉంటాయి. ఈ విషయంలో మగవాళ్ళు, దిగదుడుపే - ఈ ఆడపడుచులంతా - చిన్నమ్మ చుట్టూ చేరతారు - ఆమెకు అదృష్టవశాత్తు - నెలసరి త్వరగా వచ్చింది. అందుకని పూజగది, వంటిల్లు ఆమెకు నిషిద్ధం. అలా అందరికీ ఎప్పుడూ అందుబాటులో ఉండి పనులు పురమాయిస్తుంది. అన్ని పనులూ అయిపోతున్నాయి త్వరగా...

చుట్టాలంతా వస్తున్నారు - రైళ్ళలో - రఘు - చందూ (వీళ్ళు ఆలిండియా రేడియోలో పని) స్టేషన్‌కి వెళ్ళి చుట్టాల్ని తీసుకు వస్తున్నారు - సంజీవయ్య ఇంట్లో కొందర్ని - శంకరనారాయణ ఇంట్లో కొందర్ని బస ఏర్పాటు చేశారు. ఇప్పుడు పరీక్షలన్నీ అయిపోయాయి కదా - పిల్లలందరికీ శలవల సరదా. సరోజ సంతోషంగా ఉందని అనుకోవటంలో పొరపాటు ఏముంది - నేను నా గదిలో పడుకుని ఉంటే - నా ప్రక్కనే కూర్చుని ఉండేది - నేను మెదూ సంగతి - జార్జి సంగతి కాతరీనా సంగతి చెప్పేవాణ్ణి. అలా మాట్లాడుతూనే ఉన్నాను. నేనూ ఐరోపా వస్తే బాగుండేది - అసలక్కడే పుడితే బాగుండేది! అక్కడ ఎంత స్వేచ్ఛ! ఎంత వెలుగు! అనేది.

‘ఎలాంటి స్వేచ్ఛ? సరూ?’ ‘అది మూర్ఖమైన స్వాతంత్ర్యం - నీకంటే కాతరీన్ - మెదలీనా ఎలా బాగున్నారని అనుకుంటున్నావు?”

“వాళ్ళకు ప్రేమించడం తెలుసు!”

“మరి నువ్వూ?”

“హు - మాకు పిల్లల్ని కనటం తెలుసు! మోటారు కారులా, బాంక్ ఖాతాలాంటివాళ్ళం - మా సంతోషం - ట్రెజరీ రసీదులాంటిది!”

“సరోజా! అవన్నీ సర్దుకుంటాయి - కాలమే అన్నీ నేర్పుతుంది.”

“కాని అత్త - అత్తే కదా - ఆమె కోడలకు కన్నీరే తెప్పిస్తుంది. ఆడపడుచు - అర్థమొగుడు అంటారు”

“ఇంకా మరిది - ఇందరుంటారు నీ జీవితంలో!”

“సరోజా - కాలం మారిపోయింది.’

“మన దేశంలో కాదు - అదీ బ్రాహ్మణ కుటుంబాలలో అసలే కాదు - నా అత్తమామల్ని చూసేవరకూ ఆగు నీకే తెలిసి వస్తుంది” వాళ్ళిప్పటికే నేను వాళ్ళు విడిచిన బట్టననుకుంటున్నారు - నన్ను ఎప్పుడు రాయితో కొట్టాలో వాళ్ళకు బాగా తెలుసు - మాలాంటి ఆడపిల్లల్ని, మరొకరి ఇంటికి తోలివేస్తారు. ఏదో చాకలికి మురికి బట్టల్ని వేసినట్లు - నూలు గుడ్డల్లా - ఆడపిల్లలు చెట్లకు కాస్తారా?”

ఏమి సమాధానం చెప్పను? అప్పుడే బంగారు నగలు చేసే విశ్వబ్రాహ్మణుడు - ఆమె చేతి కొలతల కోసమో - వేలి ప్రమాణం కోసమో వచ్చాడు-

మరెవరో రెండో రోజు ఎన్ని మల్లెపూవులు కావాలని - అడగడానికి వచ్చాడు-

“నీ పూలు - మూసీ నదిలో పొయ్యి. తర్వాత వేడి పాలు తాగు పో!’ అని సరోజ కసిరింది.

‘అలాంటి అశుభాలు పలకవద్దు’ అని చిన్నమ్మ పెరటి నుంచి కోప్పడింది.

గోడ మీద బల్లులు చాలా సంతోషంగా తిరుగుతున్నాయి.ఎన్నో పురుగులు - ఈగలు అందుబాటులో ఉన్నాయి. బెల్లం - బియ్యం - సరుకులన్నీ సమృద్ధిగా ఉన్నాయి. అరటిపళ్ళు - లడ్డూల కోసం బూంది - అప్పడాలు డాబా మీద ఎండబెట్టి ఉన్నాయి.

మా ఇంటి పనిమనిషి ముత్తక్క కొడుకు కాకుల్ని అదిలిస్తున్నాడు - బెదరకొడుతూ - హాయ్ హాయ్ - ఈగలు గోడమీద వాలగానే - బల్లులు మెల్లగా వాటిని ఆరగించేవి - పెళ్ళిలో ఎవరి వాటా వారిది!

జామకాయలు పళ్ళవుతున్నాయి. మల్లె పందిరి విరగబూసింది. ఇంట్లో పెళ్ళికి నూతిలో నీళ్ళు కూడా పైకి వస్తాయి! చిన్నమ్మ అనేది.

"అంత్యక్రియలకి - వివాహానికి పెద్ద తేడా ఏముంది? రెండింటిలో బ్రాహ్మణులుంటారు - మంత్రాలు వల్లిస్తారు - అది కాశీ అయినా, ఇక్కడ అయినా వ్యత్యాసమేమిటి? రెంటిలో పందిరి ముందుగా వేస్తారు. తర్వాత సన్నాయి - డోలు - పూలు - తోరణాలు - నిప్పు - శాలువలు - ఒకే ఒక్క తేడా ఒక దాంట్లో ఇద్దరుంటారు - మరోదాంట్లో ఒక్కరే ఉంటారు" సరోజ నాన్న గురించి ఆలోచిస్తుండాలి. "అదిగో చూడు - మామిడి ఆకులు - ఇప్పుడు మండపం కడతారు..." ఇవన్నీ చిన్నమ్మ వింటూనే ఉంది. మౌనంగా నా వంక సహాయం కోసం చూసింది.

"రామా - ఆ దేవుడికే తెలియాలి - సుబ్రహ్మణ్యం చాలా మంచివాడు" సరోజ ప్రక్కకెళ్ళినప్పుడు చిన్నమ్మ నాతో అంది - "ఏదో నాకు చుట్టమని కాదు - ఆడిట్ ఆఫీసరనీ కాదు - చాలా మంచివాడు - చాలా శుభ్రమైనవాడు - మీలాగా నాగరీకుడు కాకపోవచ్చు - కానీ లోకంలో అందరూ బ్రతకాలి కదా - అప్పుడే కదా దాన్ని లోకమంటారు - నా చదువు చూసి మీ నాన్నకు చేశారా - మీ తాతాగారు? అదీ మూడో భార్యగా?" ఆడదానికి పెళ్ళి అవసరం - ఆమె గుడ్డిదైనా - చెవిటిదైనా - కుంటిదైనా - ఆమె గర్భమే ఆమె బ్రతుకు - మగవాణ్ణి ఎంచుకొనే స్వతంత్ర్యం మాకెక్కడిది? నిజమే - యూరోపులో అలా ఎంచుకునే వీలుందంటారు - అలాంటివన్నీ సినిమాలలో చూస్తాము. కానీ మనం ఇక్కడవాళ్ళం కదా - అందులోనూ బ్రాహ్మణులం కదా - నీ బ్రతుకు వేరు - నీ ప్రయాణం వేరు - నీకు ఆ దేవతల దీవెనలు మెండుగా ఉన్నాయి - అదృష్టవంతుడివి- మొన్న నీవు వచ్చి పూజగది గుమ్మంలో నిలబడినప్పుడు రాకుమారునిలా ఉన్నావు తెలుసా? రామా - నీవు మానవమాత్రుడవు కాదు సుమా?"

"అమ్మా - ఎక్కడ నుంచి వచ్చాను?" అని నవ్వాను - నాకు తెలీదు నాన్నా - కానీ నువ్వు ప్రత్యేకం - తెలివిగలవాడివి - యూరోపు వెళ్ళావు - పెద్ద యూనివర్శిటీ డిగ్రీ సాధించావు - మద్యం - మాంసం ముట్టవు. కనీసం సిగరెట్టు కూడా కాల్చవు. మిగతా చాలామంది చేసే పనికిరాని, అసహ్యమైన పనులు జోలికి పోవు. అది కృష్ణప్ప మూడో కొడుకులాగా, వెంకట్రామయ్య అల్లునిలాగా, వాళ్ళ నోట్లో గొట్టాలు చూడలేం, సూట్లు వేసుకుని భోజనాలు చేస్తారు. నువ్వలా ఉన్నావు అంటే, అదిగో, నీ తల్లి (గోడ మీద బొమ్మ చూపిస్తూ) నిన్ను పెంచిన తీరు, అందుకే ఇలా పవిత్రంగా ఉన్నావు" తర్వాత నిశ్శబ్దం!

మళ్ళీ చిన్నమ్మ "రామా, ఈసారి మమ్మల్ని వదలి పోవు కదా, చూడు అగ్నిహోత్రునికి కూడా తెలుసు నువ్వు ఇక్కడ ఉన్నావని! నువ్వు వచ్చినప్పటి నుంచి

అది వెలుగుతూనే ఉంది. ఇంటి యజమాని ఇంట్లో ఉంటే, దేవుడు గుడిలో ఉన్నట్లే..''

చిన్నమ్మ ఎప్పుడూ నగ్నసత్యాలే చెప్తుంది, ఎదురు చెప్పటానికి వీలు పడదు.

''నీకు సుబ్రహ్మణ్యం నచ్చుతాడు, సరోజకు తగినవాడు, అతన్ని ఆమె ఎప్పుడూ 'కాలి' కింద ఉంచగలదు.''

మధ్యాహ్నాలు మంచం మీద వాలేవాడిని, ఒంటరిగా, మౌనంగా, ఏదో జరుగుతోంది, అని ఎదురు చూస్తూ.

ఓ మధ్యాహ్నం - పెళ్ళికి రెండు మూడు రోజులు ముందేమో - పోస్ట్‌మాన్ కిటికీలో నుంచి ఒక ఉత్తరం జార విడిచి వెళ్ళాడు - అది మెదలీనా రాసింది-

''రామా - నా స్నేహితుడా -

ఈ విశాల ప్రపంచంలో - వింత వింత ప్రదేశాలలో ఎప్పుడూ ఆనందానికి అవకాశం ఉంది అనుకుంటాను - ఏది ఎంచుకోవాలో తెలియనప్పుడే ఆనందాన్ని అందుకోలేము - జీవితం కేవలం మిరియాల పొడితోనే నింపుకోవచ్చు - ఈ భూమినంతా మిరియాల కారం జల్లనూవచ్చు - సాలడ్ మీద - ఉడకబెట్టిన బంగాళాదుంపల మీదా జల్లినట్టు-

కానీ చిన్న మల్లెమొగ్గ దగ్గర ఆగి - లేదా నీవు నాటిన ఎర్ర గులాబీ మొక్క పూరేకుల అందాలను చూస్తూ - పరిమళాన్ని ఆఘ్రాణించనూవచ్చు - అన్నింటిలోనూ ఏదో క్రమ పద్ధతి ఉంటుంది - జార్జి అంటాడు - దేవుడు మన చుట్టుప్రక్కలే ఉంటాడు అని - మన పెరట్లోనో - ఈ మొక్కల వరుసలోనో - ఉన్నాడేమో - నేను మొక్కలకు నీళ్ల పెడుతూ - నీటి గొట్టాన్ని అలా వదిలి వస్తాను - నీళ్ల గురగురలాడుతూ మొక్కల మొదళ్ల తడుపుతూ ఉంటాయి.

ఇదంతా ఎందుకు చెప్తున్నాను - నా ఆలోచనలు ఎప్పుడూ నీ చుట్టూనే తిరుగుతున్నాయి - స్నానాల గదిలో గోడల మీద నీళ్ల పడకపోతే - నా బల్లమీద పెన్సిల్ విరగకపోతే - ఇంట్లో నువ్వు లేనట్లే - ఇవన్నీ సరిగ్గా ఉండాలని మేము గొణుగుతుంటాం - మీ వెంటపడి - అది మా హక్కు - మా బలహీనత - మగవాడి బలాన్ని ఎదుర్కోవటానికి! నీ పుస్తకాల ముందు పూలు పెడుతున్నాను - నీ బల్ల మీద మంచి గంధపు ముక్క వెలిగిస్తున్నాను-

అవును నీవు ఎలా ఉన్నావు - నీ వాళ్లతో?! ఇక్కడ పెరిగిన వాళ్ళకు కుటుంబం అంటే - అన్నా - చెల్లెలో - మిగతావారంతా శత్రువులే.

సాత్రే అన్నట్లు - Every other person is hell

నీకు మీ నాన్న అంతగా పట్టకపోవచ్చు - కానీ నీవాళ్లు నీకు ముఖ్యం కదా!

నేను చాలా సార్లు నీ ముఖం వెలిగిపోవటం చూశాను - సరోజ దగ్గర నుంచి ఉత్తరం వచ్చినప్పుడు - నా కోసం వాళ్లను ప్రేమించు - నేను నిన్ను తప్ప ఎవ్వరినీ ప్రేమించలేను.

నేనలా పడుకుని అనుకుంటాను - నీవు నాలో సృష్టించిన అపురూపాన్ని అలా తాకుతూ - మనల్ని ఇద్దర్ని ఒకటి చేసింది ఏమిటి - మనల్ని కలిపి ఉంచేదేమిటి - అని - ప్రేమను నిర్వచించగలమా? ఇక్కడ ఆ మాటను తరచూ వాడుతుంటాము - కేవలం శరీరాన్ని ప్రేమించడం సాధ్యమా - నాగసేనుడు చెప్పినట్లు - 18 ధాతువులతో మూలకాలతో రూపమానమైనదని గ్రీకు రాజు మనందరికీ చెప్పలేదా - అలాగే మన 'బుద్ధి'తో ప్రేమించగలమా - బహుముఖాలైన బుద్ధి పోకడలు ఎంత అసంబద్ధంగా ఉంటాయి - అది ఒకప్పుడు ఆరాధించిన దానినే తరవాత ద్వేషిస్తుంది - ఒకప్పుడు ఎంతో ప్రేమించిన దానినే భయంతో దూరం చేస్తుంది - దానికి నిలకడ ఎక్కడ? దీనంతటికీ అర్థం ఏమిటి రామా? మన రక్తనాళాలకు ఎర్రని రక్తాన్ని పంపే గుండేనా? లేదా రక్తంలోని ఎర్ర కణాలా - ఏది ప్రేమకు రుజువు? మనం ఎంత అజ్ఞానంలో ఉన్నామో కదా! ప్రతి పదం ఒక నూతనమైనదో లేక చర్వితమైనదో అనిపిస్తుంది - జార్జిని చూసి నవ్వుతుంటాను - అతను స్పినోజా ప్రేమ మేధావుల గురించి మాట్లాడుతూ ఉంటాడు - వారే శాశ్వతమైనట్లు - లావోజర్ (Laoisier) ప్రాణవాయువు - హైడ్రోజన్ కనుగొన్నాడా - అంతకుమునుపు లేదా? ఐన్‌స్టీన్ ఇదంతా తలక్రిందులు చేశాడు కదా - అప్పటివరకు - Hommair ఘన విశ్వాన్ని - మన పూర్వీకుల సిద్ధాంతాన్ని - అలాగే జార్జి ప్రేమ సిద్ధాంతాన్ని - ఇండియా బద్దలు కొట్టొచ్చు - జై హిమాలయ!

'నేను నిన్ను ప్రేమిస్తున్నానా' అని నాకు నేనే ప్రశ్న వేసుకుంటాను! నా ఉద్దేశం బుద్ధుడు ఆనందుణ్ణి ప్రేమించినట్లు!

'ఆనందా - నా గురించి దుఃఖించకు - అవును - నిన్ను నేను నా బిడ్డలాగా ప్రేమించాను - నీకు నువ్వు - దివ్వెలాగా వెలగాలి' అని చెప్పలేదా!

పూవులు విచ్చుకోనీ - నీటిని తరలిపోనీ - జనన మరణాలను ఆవర్తంగా గుర్తించు - సత్యాన్ని గ్రహించడమే ప్రేమించటం! ప్రేమ, సత్యం నుంచి వేరు కాదు - అయితే ప్రేమ సత్యంతో ఉండిపోగలదా - సూర్యకిరణాలు మృదువుగా ఉంటాయా?

శబ్దం - నిశ్శబ్దంగా ఉంటుందా? మనం వాటిని ఆపాదిస్తాం - నా మీద బంగారంలా వెలుగు - నేను మంచి భార్యగా మారిపోతున్నాను సుమా!?

- నీ మెదూ-''

పి.ఎస్.: డాక్టర్ చెప్పిన వాటితో నిన్ను బాధించను - ఏమో కనిపించలేదని - మిగతావన్నీ మామూలుగానే ఉన్నాయని - నేను చాలా లావయి గులాబీ రంగులో ఉన్నాను - ఇప్పుడు నువ్వు చూడకపోవడమే మంచిది - మళ్ళీ డాక్టర్ను కలిసినపుడు విషయం చెప్తాను - అప్పటి వరకు నిన్ను రోజూ మిస్ అవుతుంటాను - నువ్వు ఎండలో తిరగవద్దు - నల్లని మొగుడు నాకు ఇష్టం ఉండదు - జుట్టు సరిగా కత్తిరింపు చేయించుకో - ఇక్కడ మెడికల్ విద్యార్థుల్లా ఉండకూడదు - నేను పంతులమ్మని కదా - ఇలాంటివన్నీ పరిగణలోకి వస్తాయి - 'అదిగో, మేడమ్ భర్త వస్తున్నాడు' అని స్టూడెంట్స్ ఎగతాళి చేయకూడదు! సరోజకు నా అభినందనలు తెలుపు-

అదీ మెదూ ఉత్తరం!

ఏదో ఒక కారణంగా నాకు కోపంగా ఉంది - కానీ ఆ కోపానికి కారణం చెప్పలేను - బహుశా సరోజ విషయంలోనేమో?

రెండు రోజుల తర్వాత - మొదటిసారి పెళ్ళికుమారుని ఇంటికి వెళ్లాను - అతని బాబాయిలు, పిన్నులు, అన్నలు అందరూ మెల్లగా చేరారు - నా కోపం మరీ ఎక్కువై, బరువై, మౌనంగా స్థిరపడింది. ఇంటికి తిరిగి వచ్చిన తరువాత టెలిగ్రాం చూశాను - అది సావిత్రి దగ్గర్నుంచి - కేంబ్రిడ్జ్ నుంచి - "నా కోసం సంతోషంగా ఉండు - నీ ఆనందంలోనే నాకు స్వేచ్ఛ లభిస్తుంది - సరోజకు అభినందనలు."

నాకర్థమైంది - ఈ పెళ్లి నేను జాగ్రత్తగా జరిపించాలి - అన్నీ అధిగమించి నేను సంతోషంగా ఉండాలి - అందరినీ సంతోష పెట్టాలి! నా సంతోషం నిజం కాకపోవచ్చు - కానీ నా ఆనందాన్ని ఎవరు దోచుకోగలరు?

చిన్నమ్మను - సరోజను సంతోష పెట్టగలను - ఎవరు అడ్డు వచ్చినా - సరోజ భర్త - ప్రభుత్వ ఉద్యోగి కదా - ఏదో మిలటరీవాడిలాగా ఉన్నాడు - బిగుసుకుపోయి ఉన్నాడు - అతన్నీ సంతోష పెట్టాలి - ఈ ప్రపంచం మొత్తాన్ని సంతోషంలో ముంచెత్తాలి-

నేను సంతోషంగా ఉండాలి - అదిగో సన్నాయి మేళంలో హాయి ఉంది - నాదస్వరంలో నాగస్వరం వీనుల విందుగా ఉంది - ఆహ్వానితులనందరినీ పలకరిస్తున్నాను - పురోహితుల్నీ బ్రాహ్మణుల్నీ హెచ్చరిస్తున్నాను - రైల్వేస్టేషన్‌కి కార్లు సమయానికి పంపిస్తున్నాను - ముఖ్య అతిథులందరినీ జాగ్రత్తగా ఆహ్వానించి తీసుకురమ్మని పురమాయిస్తున్నాను - పెళ్ళి కుమారుని ఊరేగింపు కోసం సిద్ధం చేసిన అరేబియా గుర్రాన్ని పరీక్షించాను - తెల్లగా ఠీవిగా ఉంది - మంత్రాలు

వల్లిస్తూ పందిరంతా తిరుగుతున్నాను - సాయంత్రం అయింది - సరోజను గుడివరకూ ప్రక్క నుండి తీసుకు వెళ్లాను - చిన్నమ్మ గొణుగుతూనే ఉంది - సరోజుకు నమ్మకం కలిగించడానికి ఈ నడక అవసరం - త్వరగా బరువుగా నడుస్తున్నాను - సరోజ, తల్లి ఏనుగు పక్కన పిల్ల ఏనుగులా గంతులు పెడుతోంది-

"అన్నా - నన్ను ఏమి చేయమంటావు చెప్పు - ఏం చేయను? నాకు పారిపోవాలని ఉంది - ఈ పెళ్లి నాకు వద్దు - ఇతనిని నేను చేసుకోను - అది చాలా స్వార్థం కూడా - నాకు అతను తగినవాడు కాడు - నాకు అతని అంతస్తు, కారు, ఉద్యోగం - స్థితి నచ్చుతాయి - అతను కాదు! అతనిని భర్తగా ఊహించుకోలేక పోతున్నాను - నీవు వచ్చిన దగ్గర్నుంచి - ఈ విషయం బాగా అర్థమయింది" అని తన మనసులో మాట వెళ్ళగక్కింది.

ఇప్పుడు మూర్ఖంగా ప్రవర్తించవలసిన సమయం కాదు - నేను కుటుంబ పెద్దను - మూర్ఖంగా ఉండకూడదు - ప్రపంచంలో ఎవరినీ నిరాశపరచకూడదు - అది ధర్మం!!

హనుమంతుని గుడికి వచ్చాం - కొబ్బరికాయలు - తమలపాకులు - కర్పూరం - గంధపు ధూప కళికలు అర్పించాము. హనుమంతుడు సంతోషించినట్లున్నాడు - ఆయనకు రాముడే దేవుడు! ఆయన భక్తి ఆ శ్రీరామునికే అంకితం! ప్రదక్షిణలు చేశాం. అక్కడున్న మెట్ల మీద కూర్చున్నాం - సరోజ సంతోషంగానే ఉంటుంది -

"సరోజా - పెళ్ళయ్యాక మాతో ఉండటానికి అక్స్ రావొచ్చు - నా కూతుర్ని సాకవచ్చు -"

సరోజ మాట్లాడలేదు - నేను మోసం చేస్తున్నానని తెలుసు - సరోజ లేచి నిలబడి - "అవును - స్మశానానికి వెళ్ళిన తర్వాత పార్థివ శరీరం సంతోషంగానే ఉంటుంది - నేను తిరిగి ఇంటికి వెళ్ళిపోతానని చెప్పలేదు కదా - నేను దయ్యంగా మారిపోతానని అనలేదు కదా - నేను మాత్రం ఇప్పుడు ఇన్ని పూలు - ఇంత మేళం - ఇంతమంది చుట్టాలు - అతిథులను కాదని - ఈ పెళ్లి కాదనలేను కదా..." అంతే అంది!

మేము తిరిగి ఇంటికి వచ్చాం - అప్పటికే పెళ్ళి కొడుకు ఇంటి దగ్గర మేళాలు మోగుతున్నాయి - కార్లు ఇటూ అటూ తిరుగుతున్నాయి - పెట్రోమాక్స్ లైట్లు - వరుస దీపాలు - ఒకదాని తర్వాత ఒకటి వస్తున్నాయి - లెక్క పెట్టండి అని అడిగినట్లు - నేను అన్నీ సక్రమంగా ఉన్నాయా అని చూస్తున్నాను - తెల్లని అరేబియన్ గుర్రం నిండుగా అలంకరించి ఉంది - నెక్లెస్ కట్టారు - మెరుస్తోంది - పసుపుపచ్చని సిల్కు మెడకు చుట్టారు - కాళ్ళకి బంగారు రంగు గజ్జెలు కట్టారు - అది గేటు

వెనక నిలబడి ఉంది - పెళ్ళికొడుకు తమలపాకులు నములుతున్నాడు - ఇంట్లో అంతులేని శబ్దాలు మోగుతున్నాయి - సంతోషం అంటే ఇవే అని నమ్మబలుకుతూ - ఋషులు లేచి వస్తే - వారికీ సంతోషం అంటే తెలుస్తుంది - మెదూ అన్నట్లు ఎర్ర రక్త కణాలతో దోషం ఏముంది? చూడటానికి ఎంత బాగుంటాయి? కెంపులలాగా - మగవాడు తన భార్యని మంచం మీదకు సంతోషాన్నివ్వడానికే తీసుకెళతాడు -

ఒక కొబ్బరికాయ తీసుకుని పెళ్లి కొడుకు తల మీదకు విసరాలని బలంగా అనిపించింది - హత్యలో కూడా సంతోషం ఉంటుంది - రక్తానికి నీతి నియమాలు ఏముంటాయి? నీ గుండె కవాటాలలో సమయానికి ప్రవేశిస్తే - ఆ లయ ఆనందం కదా -

ఇప్పుడు అనిపిస్తోంది - లండన్ స్టాగ్ పబ్‌కి వెళ్లి జూలీతో కబుర్లు చెప్పాలని - అరె థేమ్స్ నది సరిగా ప్రవహిస్తోందా? అరిస్టాటిల్ కొత్తగా ఏమైనా చెప్పాడా - చర్చి మీద ఉన్నట్లు - బ్రిటిష్ మ్యూజియం మీద 'కోపులా' (Copula) ఉంటుందా? నాకు ఒక్కసారిగా గుర్తు వచ్చింది - కామ్ (Cam) నదిపైన వంతెన కట్టాలని ఒక అభ్యర్ధన సాధువులు పంపారు - క్లేర్ హాల్ నుంచి - రెండో ప్రక్క పచ్చిక బయలు చేరటానికి, గుర్రాలు గడ్డి మేయటానికి!

సరోజ మేడపైకి గదిలోకి వెళ్ళి తలుపు గడియ పెట్టింది - నేను చాలాసేపు తలుపు తట్టాను - కొట్టాను - బాదాను - అయినా సరోజ స్పందించలేదు - చివరికి 'అన్నా - నన్ను ఒంటరిగా వదిలివేయి - కొంతసేపు' అని ఊరుకుంది.

చిన్నమ్మ ఇదంతా గమనించి- "ఇప్పటికే 8:30 (రాత్రి) అయింది - ఊరేగింపు మొదలవుతోంది - మన ఇంటి మీదుగా వెళుతోంది - త్వరగా తెమలాలి నువ్వు, రామా' అని వెళ్ళిపోయింది.

నేను త్వరగా స్నానం చేసి - ఔరంగాబాద్ సాటిన్ లాల్చీ - పైజామా వేసుకున్నాను - తల శుభ్రంగా దువ్వుకున్నాను - మెదూ చెప్పింది గుర్తుంచుకుంటూ - ఆడవాళ్ళంతా పందిరి కింద చేరారు - కర్పూర పరిమళం - లక్నో అత్తర్లు గుప్పుమంటున్నాయి - తమలపాకులు తళతళలాడుతున్నాయి - నవ్వులతో, జరీ చీరలతో పందిరి వెలిగిపోతోంది - చెవి లోలాకులు - శృంగార ఘంటికలు మోగిస్తున్నాయి - మెడలో గొలుసులు - ముక్కెరలు - రత్నాలతో తళుక్కుమంటున్నాయి - పాపిట శీరలు మెల్లగా మోగుతున్నాయి - ఏదో అమాయకమైన ఆనందం గాలిలో నిండిపోయింది - మనిషికి కావల్సింది సంతోషమేగా!

నేను మెట్లు దిగి వస్తున్నాను - ఆడవాళ్ళందరూ ఒక్కసారిగా నిశ్శబ్దంగా నా వంక చూస్తున్నారు - నా చేతిలో సిల్కు పంచె, వెండి పళ్ళెంలో అత్తరు సీసాలు, మంచిగంధం పుల్లలు, మల్లె పువ్వులు ఉన్నాయి - అంతే - ఒక్కసారిగా అందరూ పగలబడి నవ్వారు - 'ఓ - ఇంటి యజమాని వస్తున్నాడండి - ఈయనే పెళ్ళికొడుకులాగా మెరిసిపోతున్నాడే' అని సీతా పిన్ని అరిచింది.

మేళం మొదలైంది - ఆ ప్రక్క వీధిలో బాణాసంచా పేలింది - మిలిటరీ బ్యాండ్ గోలగా మోగుతోంది - మధ్యలో సన్నాయి - డోలు వినపడుతున్నాయి - ఊరేగింపు మా వీధిలోకి తిరిగిన సమయానికి - నేను పందిరి చివరకు వచ్చి నిలుచున్నాను - పెళ్ళి కుమారుని సత్కరించాలి కదా -

నేను మేడ వైపు చూశాను - అంతా నిశ్శబ్దంగా - చీకటిగా ఉంది - సరోజ గదిలో దీపం లేదు - కిటికీ మూసే ఉంది - ఇప్పటికే మంత్రాలు చదివే శాస్త్రులంతా గొంతు పెంచారు - ఇవన్నీ విని చాలా కాలమైంది - పెళ్లి మంత్రాలు - వీటిలో చాలా శక్తి - మాయ ఉంది - పెళ్ళి కుమారుని మీదికి పూలు జల్లాను - గులాబీ వాసన నీళ్లు చల్లాను - పాలు - తేనె తాగించాను - కరిగిన వెన్న రుచి చూపించాను - మల్లెపువ్వు వెండి గిన్నెలో ముంచి అతని నాలుక తడిపాను - మళ్లీ పన్నీరు చిలికాను - అతని నుదుట కుంకుమ పెట్టాను - కంఠానికి గంధం పూశాను - అతన్ని సంస్కృత శ్లోకంతో మెల్లగా, స్పష్టంగా, స్థిరంగా నా చెల్లెలిని పెళ్లి చేసుకోమని అర్థించాను - అతను అంగీకరించాడు - తెల్లని అరేబియా గుర్రం సంతోషంగా సకిలించింది - ఆడవారంతా పాడటం మొదలు పెట్టారు - మంగళ గీతాలు - సంతోషం వెల్లివిరిసింది -

ఓ బృందావన విహారీ - ఓ కృష్ణా
మాతో - మాలో ఉండు - ఓ జానకీ నందనా
ఓ రాధానాథా - ఓ సౌందర్యమా మాతో ఉండిపో!

అరేబియా గుర్రానికి ఇదంతా అర్థం అయినట్లు సంస్కృత మంత్రాలు - మంగళ గీతాలు - చిన్నగా కదం తొక్కుతోంది - ఊరేగింపు ముందుకు సాగింది - కొంత దూరం ఊరేగింపుకు ముందుగా నడిచాను - సంధ్య వేళ ధూళి పైకి లేచింది - వీధులన్నీ చల్లపడుతున్నాయి - హైదరాలీ వీధికి - మహమ్మద్ బాగ్ - రెసిడెన్సీ కార్నర్ - మహాత్మా గాంధీ రోడ్ - క్లాక్‌టవర్ చుట్టి - హనుమాన్ ఆలయం దగ్గరకు- ఇంతవరకూ - నాకు ఏదో ఆందోళనగా - అనారోగ్యం ఉన్నట్లు అనిపించింది -

గుడి మెట్లు ఎక్కలేకపోయాను - "సీతారాం బాబాయి - నాకు ఛాతీలో బాగోలేదు - ఇక్కడ నుంచి నీవు ఊరేగింపుతో వెళ్ళు - నేను కార్లో కాసేపు కూర్చుని - ఇంటికి వెళ్తాను" - అన్నాను - 'సరే సరే - నేను ఏదో సర్ది చెప్తాను - చాలా దూరం విమాన ప్రయాణం చేశావు కదా!'

డాక్టర్ సుందరం కార్‌లో కూర్చున్నాను - కారు నిండా ఆడవాళ్ళు ఉన్నా నాకు కాస్త చోటిచ్చారు - నాకు శ్వాస ఆడటమే కష్టంగా ఉంది - ఈ రక్త కణాలకు వాటి భాష వాటికి ఉంటుంది - ఊపిరి అందడం లేదు - అరే - నేను ఇంటి యజమానిని కదా - చిన్నమ్మ చాలా ఆనందంగా ఉంది - సుకుమారి సంతోషంతో వెలిగిపోతోంది-

నా పరిస్థితి చూసి సీతారాం బాబాయి వేడి కాఫీ (ఎక్కడి నుంచి తెచ్చారో) ఊరేగింపు కిందకి వచ్చేలోపు ఇచ్చాడు - ఇంతకంటే వేడి డ్రింక్ ఇవ్వలేను అన్నాడు కొంటెగా - కాఫీతో కొంత మెరుగు పడ్డాను - మళ్ళీ ఊరేగింపు మొదలైంది - అందరూ రోడ్డుకు రెండు ప్రక్కలా చేరి చూస్తున్నారు - ఎంతమంది ఆడవాళ్ళు అసూయా దృక్కులు పడ్డాయో-

వాళ్లందరికీ తెలుసు - రేపో మాపో వాళ్ళమ్మాయికీ ఈ పెళ్లి తంతు జరుగుతుందని - పెళ్ళికొడుకు ఆకుపచ్చని అంగీలో - రత్నాల నెక్లెస్‌తో - చేతికి వజ్రాల ఉంగరాలతో - రాజకుమారుడిలాగా మెరిసిపోతున్నాడు - చేతిలో అణా - రెండు అణాల బిళ్ళలు జల్లుకుంటూ సాగిపోతున్నాడు - వీధులన్నీ పూల వాసనతో నిండిపోయాయి -

సీతారాం బాబాయి - 'ఇప్పుడు నువ్వు వెళ్లి - మెల్లగా ఇల్లు చేరి విశ్రాంతి తీసుకో - ఉదయం చాలా పని ఉంది' అన్నాడు. నా కోసం ఒక కారు కూడా ఉంచాడు - అందులో ఇంటికి చేరాను - ఇంటి ముందు తోట అంతా వెలిగిపోతోంది - గంధం, కర్పూరం, పూల వాసనలతో - గాలి బరువుగా ఉంది - పనివాళ్ళు, టైగర్ అందరూ గేటు దగ్గరే ఉన్నారు-

వాళ్లని పలకరించి లోపలికి వెళ్ళాను - టైగర్ నాతో కొంత దూరం వచ్చి - మళ్లీ పెళ్లి సందడి కోసం వెళ్ళిపోయింది.

మొదటిసారిగా నాన్న కోసం దుఃఖించాను -

కొంతసేపు విశ్రాంతి తీసుకుని - కాళ్లు, చేతులు, ముఖం కడుక్కున్నాను. మెల్లగా మెట్లెక్కి సరోజ గది తలుపులు తట్టాను - 'సరోజా - తలుపు తీయి'- అంటూ-

'రామన్నా - వచ్చావా' అంటూ ఏడ్చింది. 'తలుపు తీయి సరోజా' అని అర్థించాను.

సరోజ మెల్లగా తలుపు తీసింది - అదే చీరలో - అలాగే జుట్టు చెదిరిపోయి ఉంది - పూలు కూడా పెట్టుకోలేదు - ఇప్పుడే ముఖం కడిగినట్లుంది - చెవుల పైన జుట్టు తడిసి ఉంది.

'అన్నా - నీకు ఏమైంది? అలా పాలిపోయి ఉన్నావు?' అని అడిగింది.

'ఏదో కొద్దిగా నలతగా ఉంది' అన్నాను.

'ఇదిగో - మంచం మీద పడుకో' అని మెల్లగా నన్ను మంచ మీద పడుకోబెట్టింది. ప్రక్కన కూర్చొని విసరటం మొదలు పెట్టింది, చల్లగా ఉంది.

'ఏమిటి చదువుతున్నావు' అన్నాను

'అదా 'మ్యాజిక్ మౌంటెన్' అన్నది.

ఇప్పటి వరకు - ఈ నాటివరకు నాకు తెలియదు - అది మ్యాజిక్ మౌంటెన్ మూలంగానా, లేదా నా రక్తంలో ఎర్ర రక్త కణాలు వాటి స్వేచ్ఛ కోసం ఆరాటమో - నేను కూర్చుని ఒక్కసారిగా రక్తం కక్కుకున్నాను - సరోజ చీర మీద, నేలంతా ఎర్రగా మారిపోయింది-

సరోజ చాలా ధైర్యవంతురాలు - ఏ మాత్రం కంగారు పడకుండా - నన్ను శుభ్రం చేసింది - తన చీర మార్చుకుని, నేలంతా శుభ్రం చేసింది. నాన్నగారి బీరువా నుంచి పాత బ్రాందీ సీసా తీసి, గ్లాసులో పోసి నాకిచ్చింది. కొద్దిగా కోలుకున్నాను.

ఇంతలో సీతారాం బాబాయి వచ్చి - చూసి - అంతా అర్థం చేసుకున్నాడు.

'అరే రామా - మన తల్లులు చేసిన పాపాలు మనల్ని వెంటాడుతుంటాయి. నీకు ఆస్తమాతో ఊపిరాడలేదని చెప్పలేము కదా - అందుకని 'పాసనాల'ని చెప్పాను. రేపటికి బాగా ఉండాలి - లేకపోతే కమ్మోడు తీసుకుని అందరి మధ్యలోకి రాలేవు' అని బాబాయి వెళ్ళిపోయాడు.

నేను చాలా సేపు నిద్రపోయి ఉంటాను - కళ్ళు తెరిచి చూసేసరికి చిన్నమ్మ కనబడింది.

చిన్నమ్మ నాన్నగారి మాటలు గుర్తు చేసింది - పెద్దాడు వాళ్ళమ్మలాగానే - పారిజాతంలాగా మృదువైనవాడు - ఆరోగ్యంపరంగా చాలా బలహీనంగా ఉన్నాడు - జాగ్రత్తగా చూసుకోవాలి. సరోజ చాలా దుఃఖించింది.

'అన్నా - నాకు చేతిలో చేయి వేసి చెప్పు - నీవు నా దగ్గరే ఉంటానని - నేను జాగ్రత్తగా చూసుకుంటాను-'

'అలాగే చెల్లెమ్మా' అందరూ సంతోషంగా ఉండాలి.

ఆ రాత్రి సరోజతో పాటు ఆ గదిలోనే ఉన్నాను - నాకు క్రింద పరుపు వేసింది.

'అన్నా - నేను రాత్రంతా మేలుకొని ఉండాలంటారు పూజలో - నీకు సేవ చేయటం కంటే వేరే పూజ ఏముంది?' అన్నది.

చిన్నమ్మ చాలా విచారంగా - కిందకి వెళ్ళిపోయింది.

ఆ రాత్రి ఒకటి రెండు సార్లు కళ్ళు తెరిచి చూశాను - మెలకువ వస్తే.

సరోజ ఇంకా *మ్యాజిక్ మౌంటెన్* చదువుతూనే ఉంది. ఆ పుస్తకం పైన పడిన రక్తపు మరకల్ని తుడిచివేసింది. ఆ చిన్న దీపపు కాంతిలో ఆమె తదేకంగా చదువుతుంటే - నా ఓటమిని అంగీకరిస్తూ నిద్రపోయాను.

ఉదయం నాకు మెలకువ వచ్చేసరికి బాగా వెలుతురు వచ్చేసింది. ఇల్లంతా మంగళకర శబ్దాలతో నిండిపోయింది. వాద్యకారులు, మంగళాచరణం వాయిస్తున్నారు. స్నానాల గదిలో ఆడవాళ్లు పాటలు రాగాలు తీస్తున్నారు. సరోజకు మంగళ స్నానం చేయిస్తున్నారు. ఆమె లేత యౌవనపు శరీరాన్ని ఒక పరమార్థం కోసం సిద్ధం చేస్తున్నారు. అగ్నిహోత్రుని, సాంబ్రాణి దీపాలను వెలిగించారు. ఆ వాసనలన్నీ పైదాకా వస్తున్నాయి.

'బాలిగా' అని గట్టిగా అరిచాను - కేక వేశాను -

'ఏమిటి పెదబాబు' అంటూ పరుగులు పెట్టుకుంటూ వచ్చాడు.

'ఇప్పటివరకు చిన్నమ్మ గారు చాలాసార్లు మీకోసం పైకి వచ్చి వెళ్లారు. స్నానాల గదిలో వేడి నీళ్లు పెట్టాను. మీరు పళ్ళు తోముకోండి - వేడి కాఫీ తీసుకు వస్తాను' అంటూ మళ్లీ పరుగులు పెట్టాడు.

'నేను బాగానే ఉన్నానని చిన్నమ్మకు చెప్పు' అని వాడి వెనకనే కేక వేశాను. లేచి వరండాలో నుంచి కింద పెరట్లోకి చూశాను. అన్ని రంగుల పట్టుచీరలు తళతళ లేత ఎండలో మెరుస్తున్నాయి. బంగారు అంచు జాకెట్లు ముచ్చట గొలుపుతున్నాయి. రత్నాలు, రాళ్ళ నగలు, కెంపులు, పచ్చలు - అన్నీ తళతళ మెరుస్తున్నాయి. జడలు - జడల్లో పూలు, పూల జడలు - పాముల్లా కదులుతున్నాయి.

తులసికోట ప్రక్కన సరోజ కురులు ఆరబెట్టుకుంటోంది. అమ్మలక్కలు సాంబ్రాణి ధూపం వేస్తున్నారు. గోరింటాకు పెట్టి, కాళ్ళకు పసుపు, పారాణి రాస్తున్నారు.

మామిడి తోరణాలు, వెండి గిన్నెలు, క్రింద వరండా అంతటా కనిపిస్తున్నాయి. వాళ్లు ఎంత ఆనందంగా ఉన్నారో - పెళ్లంటే ఆడవాళ్ళ పండుగ.

ఇప్పుడు గుండె కాదు, నా కడుపు ఖాళీగా ఉందేమో - తిప్పుతోంది. ఏదో బయటకు పోవాలి!

చిన్నపిల్లలు బయట కేకలు పెడుతూ ఆడుకుంటున్నారు. కాకులు కొబ్బరి చెట్టు మీద కచ్చేరీ చేస్తున్నాయి.

ఎండ త్వరలోనే వేడెక్కుతుంది. 11 గంటలకే ముహూర్తం.

స్నానాల గదిలోకి వెళ్లి చూస్తే - రాత్రి ఎంత రక్తం కక్కుకున్నానో తెలుస్తోంది - సరోజ చీర అంతా ఎర్రగా - చుట్ట చుట్టి, మూల పెట్టి ఉంది - కాస్త కష్టంగానే నా పని కానిచ్చాను. అంతలో చిన్నమ్మ కాఫీ తెచ్చి ఇచ్చింది.

'రామా - నువ్వు బాగున్నావు - అదే ఆనందం నాకు - రాత్రి నీ చెల్లెలు సరోజ నీకు ఎంత సేవ చేసిందో నీకు తెలియదు - చివరికి అందరూ ఎంతో చెప్పగా పెళ్ళికి అలంకరణ మొదలుపెట్టింది - సీతారాం బాబాయి, గుడిలో గంటలా మోగుతూంటేనే పనులు అవుతున్నాయి - ఇంటిలో మగవాడు సమర్థవంతంగా ఉంటేనే అన్నీ సరిగ్గా నడుస్తాయి' అంటోంది.

నేను కాఫీ రెండు గుక్కలు వేయక ముందే బాబాయి వచ్చాడు -మెడ చుట్టూ జరీ కండువా చుట్టుకున్నాడు - చేతి నిండా రత్నాల ఉంగరాలున్నాయి - చాలా హడావిడిగా - ఊపిరాడకుండా మాట్లాడుతున్నాడు.

'అరే - లేవరా నాన్నా - వచ్చి నాకు సహాయం చెయ్యి - నువ్వు సుకుమారుడవని అందరికీ తెలుసు - సరోజను ఎంతసేపు బ్రతిమాలాను? నీవు వచ్చి నచ్చచెప్పి పెళ్ళికూతుర్ని చేయాలి - సమయం మించిపోతోంది - నీదే బాధ్యత' అని వెళ్ళిపోయాడు.

కష్టంగానే లేచాను - 'బాలి' నా స్నానానికి ఏర్పాట్లన్నీ చేశాడు - మేళం వినపడుతోంది - కారు హారన్లు మోగుతున్నాయి - గుర్రపు బళ్ళు వస్తున్నాయి. సైకిళ్ళు, సైకిల్ రిక్షాలు - వచ్చి పోతున్నాయి. ఆడవాళ్ళంతా పెద్ద గొంతుకలతో పాడుతున్నారు. ఎవరో వచ్చి - అప్పుడే 9:30 అయింది - ఎవ్వరూ సిద్ధంగా ఉన్నట్లు లేదు - అని తొందర చేశారు.

ముహూర్తం 11 గంటల 15 నిమిషాలకు - వాచీ చూశాను - 9 గంటలు అయింది - త్వరగా స్నానం ముగించి - నా పెట్టె ఎవరో పైకి పంపారు - కొత్త పట్టు

పంచె కట్టాను - ఎఱ్ఱని బంగారు అంచుతో మెరిసిపోతోంది - లక్నో కోటు వేశాను - సరోజ నా కోసం కొన్న శాలువా కప్పుకున్నాను - బంగారు గొలుసులో ఉన్న రుద్రాక్షలు మెడలో వేశాను - నన్ను తీసుకు వెళ్ళటానికి సుకుమారి వచ్చింది - 'అరెహో - రాజకుమారుడండీ' అని అరిచింది - నా తల దువ్వింది - గర్వంగా నా చేయి పట్టుకుని మెట్లు దింపింది.

నన్ను చూసి ఈ ప్రపంచం అసూయ పడాలని ఆమె కోరిక.

అయితే ఇల్లంతా ఖాళీ అయిపోయినట్లుంది. ఆడవాళ్ళంతా పెళ్ళికొడుకు ఇంటికి తరలి వెళ్ళారేమో! కింద చాపలన్నీ చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. పూలమాలలన్నీ మూలల్లో వడిలిపోతున్నట్లున్నాయి. పిల్లలంతా నిద్రావస్థలో - చెదిరిన పక్కల మీద పడి ఉన్నారు. పిల్లల, మూత్రాలు - సాంబ్రాణి వాసన ఘాటుగా వస్తోంది - టైగర్ కూడా పందిరి అంతా తిరిగి వాసన చూస్తోంది - బ్రాహ్మణ పురోహితులు పవిత్రంగా కనిపిస్తున్నారు. నేను గదిలోనే కూర్చుండిపోయాను. సుకుమారి అరుస్తోంది - 'అన్నయ్యా - నువ్వు సరోజక్కను చూడాలి - ఎంత అందంగా అలంకరణతో మెరిసిపోతోంది! ఆహా - పెళ్లి కూతురు అంటే అలా ఉండాలి - కానీ ఆ మూర్ఖుల ఇంటికి కోడలిగా వెళ్తోంది పాపం' ఈ చివరి మాటలు ఆమె గొంతులోనే దిగబడిపోయాయి దబ్బళంలా! ఆ తర్వాత కింద ఎవరితోనో మాట్లాడటం వినపడుతోంది - బహుశా సరోజతోనే - ఆమె గౌరీ పూజ చేస్తుండాలి - ఎవరైనా వచ్చి - రామా - నీ కోసం అందరూ చూస్తున్నారు - అని అంటారని - అనుకుంటున్నాను. కానీ ఎవరూ రాలేదు - ఈ నిశ్శబ్దం, శబ్దాలతో నిండిన నిశ్శబ్దం భరించ లేకుండా ఉన్నాను. ఈ ఇంటి యజమానినని నన్ను నమ్మించుకోవడానికి ప్రయత్నిస్తున్నాను - ఈ ప్రపంచానికి చిన్నన్నను.

నేను దృఢంగా, నిలకడగా విశ్వాసంతో ఉండాలి. కానీ సరోజను ఆ ఇంటికి ధారాదత్తం చేయటం జీర్ణించుకోలేకపోతున్నాను. సరోజ నాలాంటిదే - నేనే కదా నన్ను నేను సంభాళించుకున్నాను. నా ఆలోచనలన్నీ ప్రక్కకు తోసేశాను - నాలోకి నేను కుంచించుకుపోయాను. అక్కడే నాకు శాంతి దొరుకుతుంది. రాత్రిళ్ళు నదిలో చేపలు, నత్తగుల్లలు, రాళ్ళు, రత్నాలు అన్నీ ఉంటాయి. పైన నక్షత్రాలు చూస్తుంటాయి. నువ్వు ధైర్యం చేసి దిగాలి, అంతే! అనుమానం లేదు - ఈ స్థితిలో నేను చాలా సమయం గడిపి ఉంటాను. నేను కళ్ళు తెరిచే సమయానికి - సరోజ చేయి నా తల మీద ఉంది.

"అన్నా - నీకు బాగుంది కదా! నీ శ్వాస మామూలుగానే ఉంది కదా" ఆమె స్వరం ఎంతో తేలికగా ఉంది. స్పష్టంగా, సాధారణంగా! చాలాసేపు నా జుట్టులో వేళ్ళు పోనిచ్చి, అలాగే నిలబడిపోయింది. ఒక్కసారిగా ఏదో ధైర్యం నింపుకున్నట్లు నా ముందుకు వచ్చి, నెమలి వన్నె పట్టుచీర, సర్పంలాంటి వడ్డాణం, రత్నాలు పొదిగిన బుట్ట లోలాకులు, గంధం పూసిన కంఠం, మామిడి పిందెల బంగారు గొలుసు, ఇంతటి అలంకరణ ఆమె ఆత్మవిశ్వాసాన్ని పెంచినట్లుంది - చిక్కటి కాటుక దిద్దిన కళ్లు మూసుకుని చేతులు దగ్గరకు తెచ్చి, నమస్కరిస్తూ, నా పాదాలను తాకింది -

"అన్నా, నన్ను ఆశీర్వదించు - నీ ఆశీర్వాద బలంతో నా శిరస్సుపై నీ చేతులుంచు" అని అర్థించింది. అలా ఎంతసేపు ఉన్నానో - నిశ్శబ్దంగా, నిశ్చలంగా - మెల్లగా లేచి నా ముందు నిలబడింది. ఆమె ముఖంలో ఒక్క రాత్రిలో ఎంతటి పరిపక్వత వచ్చింది - చిన్నగా నవ్వి - "ఈ ఇంటికి, మన వంశానికి చెడ్డపేరు తీసుకురాను అన్నయ్యా - నువ్వు చింతించకు" అని పూజ గదిలోకి వెళ్ళిపోయింది.

నా కళ్ళలో నీళ్ళు తుడుచుకోక ముందే సీతారాం బాబాయి కేకలు వినబడుతున్నాయి - 'రామా - రామా' అంటూ - ఆయనతో సంతోషంగా పెళ్లివారి ఇంటికి వెళ్ళాను - సుకుమారి అక్కతో ఉండిపోయింది - సరోజతో - పెళ్లికూతురితో-

ఆహా - ఎలాంటి సమాగమం - పెద్దలందరూ లాయర్లు, మంత్రులు, ప్రభుత్వ కార్యదర్శులు, వారి భార్యలు, ఉపకార్యదర్శులు, ప్రొఫెసర్లు, రాజా సాహెబ్‌లు, ఆహా - ఎంత గొప్ప వివాహం - అట్టహాస వివాహం - అద్భుతమైన వివాహ వేడుక! అగ్నిహోత్రుని ఎదురుగా - నాకు పసుపు పూసిన పీట వేశారు - కాస్త ప్రక్కగా కృష్ణయ్య తాత వారసునిగా - వంశోద్ధారకుని హోదాలో - కానీ ఆయన వెళ్ళిపోయాడు - అయ్యో దేవుడా - మనుష్యులు ఎలా జీవిస్తారు - ఎలా మరణిస్తారు?! ఎందుకు పుడతారు - ఎందుకు చనిపోతారు!! పెళ్లి పురోహితులు నన్ను చూసి చాలా సంతోషించారు - నేను రాగానే వాళ్ళ మంత్రాలు తారాస్థాయిలో వినిపిస్తున్నాయి - నా పాత స్నేహితులు, నాన్నగారి మిత్రులు వచ్చి నాకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. నా యోగక్షేమాలు అడుగుతున్నారు - నాన్నగారి సేవకులు కొందరు కనిపించారు - నా దగ్గరకు వచ్చి వంగి - సలాములు చేస్తున్నారు. తలపాగా, యూనిఫారం అంతా సరంజామాతో సహా! స్వాహా - అగ్నిహోత్రం మండుతోంది - నేయి తాగుతూ - పాలు, తేనే, పెరుగు - 'నమోహం - స్వాహా' అంటూ మంత్రాలు వినిపిస్తున్నాయి. ఇదంతా నా హృదయాన్ని పవిత్రంగా, పవిత్ర శబ్దాలతో నింపివేసింది. ఇంతలో సుకుమారి వెండి గిన్నెలో కుంకుమ తెచ్చి నా నుదుట దిద్దింది.

పెళ్లి కుమారుడు పవిత్రంగా, సిద్ధంగా కనిపించాడు. అతని సాధారణ శరీరం మీద ఏదో కొత్త మెరుపు కనపడుతోంది. అతని కుటుంబం సంతోషంగా కనబడుతోంది - వాళ్ళందరిలో అతను బాగా చదువుకున్న వ్యక్తి - వారి స్థాయికి మించిన సంబంధం - సంతోషంగా ఉన్నారు. మంత్రాలు తారాస్థాయిలో మరింత బిగ్గరగా వినిపిస్తున్నాయి - సీతారాం బాబాయి ఎక్కడ? వెనుక ద్వారం నుంచి ప్రత్యక్షమయ్యాడు - పెళ్లి కుమార్తె వస్తోంది! అన్నాడు - మెల్లగా నా చెవిలో - పెళ్లి కుమారుడు లేచి నిలబడ్డాడు - నా వెనక నుంచి సరోజ కనిపించింది - నిబ్బరంగా - పవిత్రంగా - స్థిరంగా! మధ్యన తెర లేపారు - సీతారాం బాబాయి సరోజను పట్టుకొని నిలబడ్డాడు - ఆమె నల్లని గాజులు వత్తిడికి పగిలిపోయాయి - మా అందరి పిడికిళ్ళల్లో తలంబ్రాలు వేడెక్కాయి - అందరికీ పూలు పంచి పెడుతున్నారు.

వెయ్యి కళ్ళు - వేల పురుషుల చూపులు -

వెయ్యి కళ్లు - వేల కాళ్ళు -

ఈ ప్రపంచమంతా పరుచుకొని ఉన్నాయి-

పది వేళ్ళతో గుప్పిట పడుతున్నాడు -

ఈ పురుషుడు - సర్వ వ్యాప్తి చెంది ఉన్నాడు -

అమృతత్వానికి ఇతడే కారణం - మూలపురుషుడు -

దేవతలు ఈ కార్యాన్ని సంకల్పించారు -

వారికి ఈ పురుషుడే వారసుడు -

ఇదిగో ఈ ఘృతం - ఇదే వసంతం -

ఇదిగో ఈ కానుకే శిశిరం -

ఈ గంధపు కాష్ఠాలు - వేసవి!

సరోజ పెళ్ళి కుమారుని మెడలో పూలమాల వేసింది - గులాబులు, మల్లెలు, మరువాల పూలమాల వేసింది. చెమ్కీలతో, బంగారు దారాలతో, బరువుగా తయారు చేసిన పూలమాల వేసింది - ఆ మూల ఎక్కడో కూర్చొని - చిన్నమ్మ - కనుల నీరు కుక్కుకుంటోంది - ఆమెను సుకుమారి ఓదార్చి - తానూ కన్నీరు పెట్టుకుంది - అప్పుడు పిన్నమ్మలు, పెద్దమ్మలు - అందరూ కళ్ళు తుడుచుకున్నారు.

నేను కళ్ళు మూసుకున్నాను - అంతే! - సరోజ మా ఇంటి నుంచి వెళ్లిపోయింది.

నేనే - అతణ్ణి. నీవే ఆమె.

నేను ఆకాశాన్ని - నీవు భూమివి.

మనిద్దరం ఏకమవుదాం -

మన వారసుల్ని తీసుకు వద్దాం -

నేను కూడా పూలు, తలంబ్రాలు చల్లాను - సంతోషం అనేది మనం కోరుకునేది - మన సంకల్పం! నీకు కావాలంటే నీవు ఆనందంగా ఉండవచ్చు! బహుశా ఎర్ర రక్త కణాలు కూడా సహాయపడవచ్చు.

సంతోషం - ఆనందం అంటే భార్యకు భర్తలో, సంతానంలో - తన ఇంటిలో లభిస్తాయి - సరోజ ఎక్కడకు పోగలదు?!

సప్తపది - ఏడుసార్లు అగ్నిహోత్రుని చుట్టూ తిరిగారు - ఏడుసార్లు మా పూర్వీకుల నామాలు జపించారు -

రామకృష్ణయ్య, రంగన్న, మాధవస్వామి, సోమసుందరయ్య, సంజీవయ్య, రామచంద్రయ్య - అంటూ నామాలు జపించారు. అన్నిసార్లు తన పేరు మార్చుకుంది. ఆమె ఎక్కడికి వెళుతోంది - ఆ ఇంటి పేరు జపించింది - అగ్ని ఎగసింది - నెయ్యి పోస్తున్నారు - అగ్నిశిఖలు నాలుకలు చాస్తున్నాయి - ఇంకా దాహం అంటూ నెయ్యి తాగుతున్నాయి -

పన్నీరు అతిథులపై చల్లుతున్నారు - తాళిబొట్టుని ఆకుపచ్చని కొబ్బరి బొండా పైన పెట్టి - పురోహితుడు పెద్దలందరితో దీవెనలు తీసుకుంటున్నాడు. ఒక్కొక్కరూ రెండు చేతులతో తాకి - కళ్ళకద్దుకుంటున్నారు - ఎంత పవిత్రమైనది తాళి! అలా పందిరంతా తిరిగి వచ్చింది - పెళ్ళికుమారుడు సరోజ మెడలో మూడుముళ్ళు వేశాడు - అమ్మలక్కలు సరోజ జడను పైకి ఎత్తి పట్టారు - మొగలి పూల వాసన, మంచి గంధపు పరిమళం, పట్టుచీరలు, ఆడవారి వాసనలు - అన్నీ గాలిలో తేలి వస్తున్నాయి -

"అక్క - లక్ష్మీదేవిలాగా ఉంది" సుకుమారి, సుబ్బక్క అంటున్నారు.

మేళం మైకం కమ్ముతోంది - ఎంతో అద్భుతంగా ఉంది - మద్రాసు నుంచి నాదస్వరం సిద్దయ్య వచ్చాడు - ఆడవారంతా ఆశీర్వచనాలు పాడుతున్నారు - అందరికీ కొబ్బరికాయలు పంచి పెడుతున్నారు - చిన్నమ్మ అందరి బహుమతులు జాగ్రత్త చేస్తున్నది - వెండి పళ్ళాలు, బంగారు గొలుసులు, అందరి పేర్లు పైకి చెప్పి బహుమతులు ఇస్తున్నారు - సంస్కృతంలో ఆశీర్వచనాలు ఉచ్ఛరిస్తున్నారు - ఎక్కడ చూసినా ఆనందం వెల్లివిరుస్తోంది - అతిథులంతా విశ్రాంతిగా కబుర్లు చెప్పుకుంటున్నారు - కొందరు సిగరెట్లు వెలిగించారు - ఒక్కొక్కరు వరుసగా వచ్చి నా చేయి పట్టుకుని - అభినందనలు తెలుపుతున్నారు. అద్భుతంగా ఉంది వివాహం - అంటున్నారు.

నేను నా తండ్రి స్థానంలో ఉన్నాను! నువ్వు త్వరలోనే మాలో చేరిపోతావు అన్నారు కొంతమంది ప్రొఫెసర్లు! ఇక్కడ ఎన్నాళ్లుంటారు? కార్లన్నీ బారులు తీరాయి

- అతిథులను తీసుకుపోవడానికి - మెల్లమెల్లగా తలపాగాలు, శేర్వాణీలు, రిస్టువాచీలు, చేతికర్రలు, రంగు రంగు చేతి గుడ్డలు కదిలిపోయాయి - భోజనాలు - బాబాయి అజమాయిషీ చేస్తున్నాడు.

సైకిళ్ళు - సైకిల్ రిక్షాలు - వాటి గంటల మోతలతో హోరెత్తిస్తున్నాయి - ఎక్కడో అరేబియా గుర్రం సకిలింపు వినిపించింది - టైగర్ గేటు దగ్గరే ఉంది - అతిథులను లెక్కపెడుతున్నట్లు - ఇదిగో - ఇంతమంది సరోజ పెళ్ళికి వచ్చారు - అని మరో లోకంలోకి వెళ్ళినప్పుడు - తన యజమానికి చెప్పాలేమో!

తర్వాత మేళం వాళ్లకు చెల్లించాలి - టాక్సీల లెక్క చూడాలి - పాయసం కోసం కాచిన పాలు విరిగి పోయినట్లున్నాయి - ఈ సాయంత్రం ఊరేగింపు దిక్కు మార్చాలి - ఎవరో తెలివితక్కువవాళ్ళు దక్షిణ దిక్కుగా దారి పెట్టారు - సీతారాం బాబాయి గట్టిగా కేకలు వేసి మార్పించాడు. నేను అలసిపోయాను - మెల్లగా లేచి గదిలోకి వెళ్లాను - అక్కడ దివాన్ ఉంది - నా ప్రక్కనే సుకుమారి నిలబడి ఉంది - తాటాకు విసనకర్రతో విసురుతుంది - చల్లగా ఉంది - గంధపు వాసన వస్తోంది - పందిరి, ఇల్లంతా - మల్లెపూల దండలు - నా వెనకాలే వేళ్ళాడుతున్నాయి - అరే - ఈ ఘాటయిన వాసన భరించడం కష్టంగా ఉంది అన్నాను - వంటింట్లో నుంచి లడ్డూల వాసన కమ్మగా వస్తోంది.

తర్వాత నేను నిద్రపోయి ఉంటాను - నిద్ర లేచేసరికి వళ్ళంతా చెమటతో ఉంది - సుకుమారి లేదు - బాలిగాడు విసురుతున్నాడు - అంతలో సీతారాం బాబాయి వచ్చాడు - పురోహితులు - బ్రాహ్మణులు ఆయన వెంటనే ఉన్నారు - కొబ్బరికాయలు, తమలపాకులు, బంగారు నాణాలు అన్నీ సిద్ధంగా ఉన్నాయి. అందరికీ ఒక్కొక్కరికి వెండి పళ్ళాల్లో అన్నీ సమర్పించి, వారి పాదాలకు నమస్కారం చేశాను. అందరూ పేరుపేరునా నన్ను ఆశీర్వదించారు. నా వంశాన్ని దీవించారు. వారి సంస్కృతం లోపభూయిష్టంగా ఉంది. సంస్కృత దీవెనలు తప్పుగా పలికితే ఎంత అశుభం! అలా అనుకుంటూనే నేను తూలి పడిపోయాను. కొబ్బరికాయలు, తమలపాకులు చెల్లాచెదురైపోయాయి. నన్ను పట్టుకుని నిలబెట్టారు - సీతారాం బాబాయి - ఏమీ లేదు - ఏమీ లేదు - చాలా దూరం నుంచి గాలిలో ప్రయాణం చేసి వచ్చాడు కదా - అలసట ఉంటుంది - 'అవునవును' అన్నారు బ్రాహ్మణోత్తములు.

పెళ్ళికొడుకు వచ్చి నా ప్రక్కనే కూర్చున్నాడు - ఎంతో గౌరవం చూపిస్తూ - అభిమానంగా తన కొత్త బావగారి పట్ల! అతనికి తన భార్య సరోజను చూసి ఎంతో గర్వంగా ఉంది - ఈ కుటుంబంలోకి రావడం అదృష్టం! నాకు ఢిల్లీలో ఒక సహోద్యోగి ఉన్నాడు - అతనికి ఫ్రాన్స్, మాంటికార్లో బాగా తెలుసు - దక్షిణ ఫ్రాన్సు కూడా.

మీరు ఢిల్లీ వచ్చినప్పుడు పరిచయం చేస్తాను అన్నాడు - అతని తమ్ముడు వచ్చి నేను ఫ్రెంచి భాష నేర్చుకుంటున్నాను - అంబాసిడర్‌గా వెళ్లాలని అనుకుంటున్నాను-

విశ్వేశ్వరయ్య కొడుకు లక్ష్మణ వచ్చి తన సంతోషాన్ని తెలియజేశాడు - అతను కార్‌నెల్ (Cornell) నుంచి తిరిగి వచ్చాడు - రేడియో ఇంజనీరింగ్ చేశాడు. ఈ ప్రపంచం చాలా పెద్దది - ఎంతో అభివృద్ధి చెందుతోంది.

నేను ఈ గదిలో నాకు శ్వాస ఆడకుండా ఎందుకున్నాను? అంతలో సీతారాం బాబాయి - గట్టిగా అందర్నీ తిడుతున్నాడు - 'రామునికి అలా మూగితే ఎలా ఊపిరాడుతుందిరా - అందరూ తప్పుకోండి' అని అదిలించాడు. అంతే - పెళ్ళికొడుకు ఒక్కడే ఉన్నాడు - అందరూ వెళ్ళిపోయారు. అతని తలపాగా, చెమటా, చేతి బంగారపుటుంగరాలు - నేను కళ్ళు మూసుకోగానే అతను వెళ్ళిపోయాడు. నా కాళ్ల దగ్గర సరోజ కూర్చుని నొక్కటం - మెత్తగా - మృదువుగా వత్తుతోంది - అంతే - నిద్రలోకి జారుకున్నాను.

ఇప్పుడు ఊరేగింపు విషయం చెప్పి మిమ్మల్ని విసిగించారు - రాత్రి లడ్డూ 'ఫేని' విందు భోజనం అయిన తర్వాత - సరోజను తీసుకువెళ్ళటానికి పెళ్లివారు భజంత్రీలతో వచ్చారు. అప్పటికే అర్ధరాత్రి అయింది - సరోజ నా ప్రక్కనే కూర్చుంది. పెళ్లివారి కారు అలంకారాలన్నిటితో వచ్చింది. ఆడవాళ్ళంతా గుంపుగా వచ్చేశారు 'పెళ్లికూతురు - పెళ్లికూతురు' అంటూ.

"అన్నా - నాకు ఇక సమయం వచ్చింది" అని విసనకర్ర పక్కనపెట్టి బయలుదేరింది. "నేను త్వరగానే వస్తాను - నువ్వు త్వరగా కోలుకో - ఇల్లంతా నేను చూస్తుంటాలే" అంది. అలా అంటూనే చిరునవ్వుతో మెల్లగా మెట్లు దిగి కదిలిపోయింది - ఇది ఎంత బరువైన సన్నివేశం - ఎంత కఠినమైన నిర్ణయం - ఎంత బాధ్యత నాపై పడింది - ఒక్కసారిగా పెద్దరికం ఆమె భుజస్కంధాల మీద పడింది! ఆమె మెట్లు దిగుతుంటే - అందరూ పాటలు పాడుతూ స్వాగతం పలికారు - నవ్వులు మారుమోగుతున్నాయి - 'నీ భర్త పేరు చెప్పమ్మా' అని అడిగారు. సరోజను పెద్దగా బలవంతం పెట్టవలసిన అవసరం రాలేదు. 'మిస్టర్ సుబ్రహ్మణ్య శాస్త్రి' అని అదేదో తన ప్రొఫెసర్ పేరయినట్లు చెప్పింది.

ఆ రాత్రంతా చిన్నమ్మ నాకు సేవ చేస్తూనే ఉంది. నాకు మళ్ళీ రక్తపు వాంతి అయింది - అయితే కొద్దిగానే - ప్రమాదం ఏమీ లేదులే అంది. 'అమ్మా - నువ్వు

వెళ్ళి విశ్రాంతి తీసుకో - ఎప్పుడు నిద్రపోయావో ఏమిటో' అన్నాను. వెళ్ళి పెళ్ళివారింట్లో సందడి చూడవా?

ఏ అర్ధరాత్రి వేళలో ఒక్కరొక్కరే తిరిగి రావటం వినిపించింది-

'అరె - ఇలాంటి మనుషులు - మన బంగారాన్ని - ఆ కోపంలో వేశాము' అంది చిన్నమ్మ.

'తాళి కట్టే వరకు ఒక రకం - పెళ్ళయిన తర్వాత వాళ్ళ అసలు స్వరూపం చూడాలి' అంది సుకుమారి.

ఉదయం నేను కాఫీ తాగుతూ కూర్చున్నా - అప్పుడే సీతారాం బాబాయి వచ్చాడు -

'రామా - ఎంత పొరపాటు - మన సరోజను - లేత తమలపాకులాంటి సరోజను - అదిగో నరమాంస భక్షకుల ఇంటిలో పడవేశాము - వాళ్ల మాటలమ్ముకుంటారు - వాళ్ల కూతలు నేను ఆడవాళ్ళ ముందు చెప్పలేను -

'రాత్రంతా పెళ్లి కూతురు గది చుట్టూ తిరుగుతున్నారు ఆడవాళ్ళు - తెల్లారిందో లేదో - ఆ వెధవముండ గదిలో దూరింది - ''ఏమమ్మా - మేము తురకవాళ్ళమనుకుంటున్నావా - అని గదమాయించాను - సరోజ మూల కూర్చొని ఏడుస్తోంది - వాళ్లకు గడ్డి పెట్టి వచ్చాను!'

చిన్నమ్మకు సగం వినపడింది - 'శివ శివ' అని ఏడుస్తూ వంటింట్లోకి వెళ్ళింది. తర్వాత మాకు కాఫీ పంపించింది.

రెండు రాత్రులు తర్వాత - సరోజ, సుబ్రమణ్యం నా దగ్గర వీడ్కోలు తీసుకోవడానికి వచ్చారు.

చిన్నమ్మ సరోజకు ఇవ్వాల్సినవన్నీ సిద్ధంగా ఉంచింది. ఆమె ఆడుకున్న బొమ్మలతో సహా! దేవుని బొమ్మలు, చీరలు, నగలు, నట్రా, ఫోటోలు, అమ్మానాన్నలవి, నావి - సరోజ నవ్వుతూనే ఉంది.

వెళ్ళినప్పుడు తృప్తిగా, నిండుగా వెళ్ళింది. ఈ పెళ్లి తనకిష్టమన్నట్లు - 'అన్నా - ఢిల్లీ వచ్చి ఒక వారం ఉండి వెళ్ళు' అని అడిగింది. తన భర్తవంక చూసింది. 'బావగారు - ఢిల్లీలో వాతావరణం చాలా బాగుంటుంది - రండి' అన్నాడు.

అవును సరోజకు పెళ్లయింది!

'అవును రామా - సరోజ సంతోషంగా ఉంది. ఆడదానికి ఏమి కావాలి - ఇల్లు, భర్త - ఇవే కదా' అంది ఏదో సామెత చెప్తూ చిన్నమ్మ.

ఆ మధ్యాహ్నం డాక్టర్ గారు వచ్చి - నన్ను పరీక్ష చేసి వెళ్ళాడు. 'ఆందోళన పడనవసరంలేదు - ఇప్పట్లో ప్రయాణం పెట్టుకోకు - అసలు చలి దేశం నీకు

పడదు - అది దక్షిణ ఫ్రాన్స్ అయినా - వేసవికాలం ఆలోచిద్దాం - అప్పటివరకు తప్పదు'.

'కానీ నాకు భార్య ఉంది. త్వరలో కనబోతోంది' అన్నాను. 'అరే, నీ భార్య నువ్వు బతకాలని కోరుకోదా?' అని నవ్వాడు. 'నిన్ను చంపుకోవాలని అనుకోదు కదా!'

చిన్నమ్మ చాలా బాధపడింది. డాక్టర్ చెప్పింది విని. కణతలకు చేతులు పట్టుకుంది. చెంపలు వేసుకుంది - 'అంతటి అశుభం మాట పలకవచ్చా?'

ఇవాళ వైద్యశాస్త్రం చాలా ముందుకు వెళ్ళింది - నీలాంటివాడికి ఏమాత్రం ప్రమాదం లేదు - ఎక్స్‌రేలు చూసి చెప్పగలను - ప్రస్తుతానికి నీకు పూర్తి విశ్రాంతి కావాలి - ఎవ్వరినీ వచ్చి అతనిని విసిగించనీయకండి' అని గట్టిగా చెప్పాడు -

చిన్నమ్మ వంక తిరిగి - అమ్మా - ఇతర దేశాలలో రోగిని ఎంతో జాగ్రత్తగా చూస్తారు, సేవ చేస్తారు - మనం రోగి అంటే అదేదో పరీక్ష రాసినట్టు - తప్పినా పరవాలేదులే - అనుకుంటాం.

అమ్మా నువ్వే జాగ్రత్త తీసుకోవాలి - రామా - మీ నాన్న లేడు కదా - ఇంటికి నీవే ఈ ఇంటికి మూలస్తంభానివి - నువ్వు దృఢంగా ఉండాలి సుమా!

అదీ సంగతి.

పెళ్లి సందడి - హడావిడి - తర్వాత మెల్లగా కోలుకున్నాను. డాక్టర్ పాయి గారు - నన్ను బెంగళూరులో మూడు నెలలుండమన్నారు. నేను, చిన్నమ్మ, సుకుమారి శ్రీధర - ఇంకా మాతోపాటు వంటవాడు - బాలిగాడు - అందరం బెంగళూరు మకాం మార్చాము. అక్కడ ఒక ఇల్లు అద్దెకి తీసుకున్నాను - బసవ గుడికి పైగా - అక్కడ వాసాలతో, తాటాకుతో పందిరి కూడా వేశాము. ఆత్మీయులతో కలసి ఉండటం, సొంత కుటుంబంతో ఆనందం కదా! ఆ వాతావరణంలోనే వంటి మీద పుట్టుమచ్చలు, వారసత్వం, అన్నీ, మన నడక, తీరుతెన్నులన్నీ వంశపారంపర్యమని గొప్పలు చెప్పుకుంటాం - ఆనందిస్తాం. తలకట్టు దగ్గర నుంచి, కాలి మీద మచ్చ వరకు అన్నీ మన ముందు తరంలో ఎవరికో ఆపాదిస్తాం - అందులోనే ఒకరికి ఒకరు 'చెందుతాం'! ఇందులో ఒక ఏకత్వం, వంశపు వారసత్వం, నీవు తప్పించుకోలేని బంధం ఇమిడి ఉంటుంది. బహుశా మరణమే ఇందులో అడ్డు వస్తుందేమో! "అరే - నాన్న అచ్చం నీలాగే తల దువ్వుకునేవాడు తెలుసా.. అదిగో - నీ పాదం అచ్చం ఆయన పాదంలా వంగి ఉంది - నీ కాలి రెండో వేలు పొడవుగా ఉంది - నాన్నలాగే' - ఇలా చిన్నమ్మ అంతులేకుండా చెప్పేది. 'శ్రీధర్‌కి

మీ నాన్నలాగే కుడి చేతి మీద పుట్టుమచ్చ ఉంది చూడు' అని చూపించేది. రాత్రిళ్ళు చిన్నమ్మ ఏవో కథలు చెప్పేది - అవి వింటూ అలాగే నిద్రపోయేవాడిని అవునవును - అంటూ. తర్వాత వాళ్ళందరూ నా గురక విని నవ్వుకునేవాళ్ళు - 'చూశారా - వాళ్ళ నాన్నమ్మ అలాగే గురక పెట్టేది' అని. సత్తమ్మ హరిహరపురంలో మా ఇంటికి - అదే - తరతరాలుగా ఉన్న మండువా లోగిలికి కాపలా ఉంటుంది - సత్తమ్మ మా ఇంటి మేనత్త - ఇది సత్తమ్మత్త - అక్కడే మాతో ఉండటానికి వచ్చింది.

తర్వాత వర్షాలు పడ్డాయి - మా పొలాలు చూడడానికి వెళ్లాం మాల్నాడు - సత్తమ్మ అత్త మాతో అంది - హైమావతి నది అంచుల్లో నడుస్తూంటే ఏవో జ్ఞాపకాలు చుట్టుముట్టాయి - చిన్నమ్మ హరిహరపురం ఆరేళ్లుగా రాలేదు - కౌలుదారుల ఆటలకు అంతు లేకుండా పోయింది - సత్తమ్మత్త అన్నీ చెప్పింది -

'అరే అల్లుడా - నేనంటే ఎవరూ లేని విధవరాలిని - నన్ను ఎంతగా ఏడిపిస్తున్నారో ఈ రైతులు! నాకున్నది ఒక ఎకరమే - నా అంతట నేను వ్యవసాయం చేసుకోలేను కదా - వాళ్లు ఇచ్చిందే పుచ్చుకోవాలి - వాళ్లు చెప్పిందే నమ్మాలి. 'ఈ సంవత్సరం వర్షాలు లేవండీ', 'ఈ సంవత్సరం ఎరువు లేదండీ', 'ఈ పంటకు తెగులు వచ్చింది', ఇవి - వాళ్ళు చెప్పే సాకులు. ఆడదానికి ఇవన్నీ 'అలివికానివి భగవంతుడా' అని వాపోయింది.

'వీళ్లంతా నల్లని గొంగళ్ళు వేసుకొని, ఈ కొండ చరియల్లో ఉంటారు - మనకు వాళ్ళే దిక్కు' అని విచారించింది.

'అరే అల్లుడా - డెబ్బయి ఎకరాల సంగతి మర్చిపో - కాంచనపల్లి నుంచి సిద్ధాపురందాకా ఉంది నీ పొలం. వాళ్లు హిమనగరం కాంతపురంలో ఉన్న గరువు పొలాలు - సీతాపురంలో ఉన్న కాఫీ తోటలు - యాలకుల తోటలు - ఇవన్నీ వారి దయా దాక్షిణ్యాల మీద ఆధారపడి ఉన్నాయి.

మీ ఎస్టేట్ మేనేజర్ - సుందరయ్యకు బాగా ఉత్తరాలు రాయడం తెలుసు.

'అయ్యా - హైమావతి పొంగింది - పంటలన్నీ కొట్టుకుపోయాయి - శివనాగ వరకు మునిగిపోయింది - అయ్యా కట్టలు కూడా కోసుకుపోయాయి - మన పొలాలు మునిగి తేలుతున్నాయి.'

"అయ్యా - ఈ సంవత్సరం ఎరువు దొరకలేదు - పుష్ప, మాధురి, కాలా, నంది అన్ని పంటలూ చచ్చిపోయాయి. అయ్యా - గొడ్డూ-గోదా పారుడు రోగం వచ్చి చచ్చిపోయాయి." అని మీకు ఉత్తరాలు రాస్తారు. నిజానికి ఈ ఆవులన్నింటినీ

బాలపురం తోలాడు. అక్కడ సంతలో అమ్మేస్తాడు కటిక వాళ్లకి. మీ నాన్న ఉన్నప్పుడు యుద్ధం రోజుల్లో ఏం చేశాడు - అన్నింటినీ ఆ తెల్లవాళ్ళు కోసుకు తినడానికి ధారాదత్తం చేశాడు - ఈ సుందరయ్యే!

'ఆవుల్ని కటిక వాడికి అమ్మినవాడు రేపు మిమ్మల్ని కూడా అమ్మేస్తాడు. అల్లుడూ జాగ్రత్త' అని అత్త హెచ్చరించింది. ఇక్కడ మనుషులు, రైతులు మీకు తెలియదు. చిన్న విషయాన్ని రామాయణంలాగా చేస్తారు - అలాగే చెబుతారు.

'అబ్బా - కలుపు పెరిగిపోయింది - అయ్యా - గొడ్లన్నీ చిక్కిపోయాయి - మాకు వడ్లెప్పుడు కొలుస్తారు? మూడు నెలలుగా వర్షాలు లేవు'' ఇవీ కథలు - వాళ్ల కత్తి మీ మెడ మీద ఎప్పుడు పెడతారో?!''

"వెంకట రమణయ్య ఏమయ్యాడో - గుర్తించుకో'' అని ఇక ఆపేసింది మాట్లాడటం. అప్పటికే రైతులు నన్ను చూసి పరుగులు పెట్టుకుంటూ వచ్చారు. వరినాట్లు వేస్తున్నారు. వాళ్ల మోకాళ్లదాకా తడిసిపోయి ఉన్నారు. వరి నాళ్ళు వాళ్ళ చేతుల్లో నీళ్ళు కారుతున్నాయి.

అన్నీ పడేసి, చేతులు జోడిస్తూ- "చిన్నయ్య వచ్చారండి - చదువుల రాజు దయచేశారు - అరే చూడరా, రాజకుమారుడులా ఉన్నాడు కృష్ణప్ప కొడుకు - రాజుగారి వారసుడు'' అని వేళ్ళతో కణతలు నొక్కుకున్నారు. నాకు దిష్టి తగలకూడదని.

'అరే - హైమావతీ నీళ్లు తాగినవాళ్ళు మరొక విధంగా ఉండ్రా' అని సాకమ్మ, లావుపాటి సాకమ్మ, చెవిటి సాకమ్మ గట్టిగా అరిచింది - నోరు నొక్కుకుంటూ.

'ఆ బాబు - తాతలాగా దర్జాగా ఉన్నాడురా - ఆయన ఇక్కడ వడ్ల మర కట్టాడు కదా - అది ఎప్పుడూ పని చేయలేదు.'

'ఓసి గొడ్డుమోతుదానా - రంగీ ఇలాగా పెద్దవాళ్లను మర్యాద చేసేది - వెళ్లి పాలు తీసుకు రండి' అని గదమాయించాడు లింగ గౌడ. అంతలో ఊళ్లోవాళ్లంతా సుందరయ్య, రామయ్య, బోధయ్య, బళ్ళు తోలే శివరామణ్ణ, తిమ్మప్ప, పుట్టన్న, కిట్టన్న, సంజన్న, పడవ నడిపే కాలప్ప - అందరూ గుంపుగా వచ్చేశారు. నల్ల గొంగళ్ళు వేసుకుని, చెర్నాకోళ్ళతో, వెండి కడియాలతో చేతులు జోడించి, నాకు వంగి దండాలు పెట్టారు. పాలు వచ్చాయి. అరటిపళ్ళు కూడా. మేము బంగినపల్లి మామిడి చెట్టు కింద కూర్చున్నాము. మేము అరణి పొలం దగ్గర్లోనే ఉన్నాం. హైమావతి నది ప్రక్కనే ప్రవహిస్తోంది. నీళ్ళల్లో ఏవేవో కొట్టుకుపోతున్నాయి - మామిడి ముగ్గిన వాసన, కుళ్ళిన కంపు వస్తున్నాయి. ఆవుపేడ వాసన కూడా గాలిలో ఉంది.

నాకు ఆశ్చర్యమనిపించింది - ఈ నేల, ఈ నీరు, ఈ చెరువు, ఈ ప్రశాంతత - నన్ను నాకిలా రూపం ఇచ్చి తీర్చిదిద్దింది కదా అని. ఆశ్చర్యపోయాను!!

తరువాత తాతలు, తండ్రులు నివసించిన ఇంటికి వెళ్ళిపోయాం. కాసేపు ధ్యానం చేశాను, తర్వాత స్నానం చేశాను, ఏదో తిన్నాననిపించాను. అక్కడే తాళపత్రాలున్నాయి. తాతగారు చాలా జాగ్రత్త చేశారు. ఇవన్నీ తరతరాలుగా వారసత్వంగా సంక్రమించాయి. చాలావరకూ దీపాలు వెలిగించడానికి కాలిపోయాయి.

నా చిన్ననాటి రోజులు గుర్తుకొస్తున్నాయి - తాత గుండెల మీద ఎక్కడం, సత్తెమ్మత్త పొట్ట మీద నిద్రపోవడం, నానమ్మ, రంగమ్మ నన్ను భుజాల మీదకు తీసుకోవటం, తర్వాత పడుకోబెట్టి - లాలి పాడటం - జో కొట్టడం - అన్నీ గుర్తుకొస్తున్నాయి. రాత్రయితే రామన్న తాత - ఎంత తొందరగా కోపం వస్తుందో అంత తొందరగా మర్చిపోతాడు - తాటాకు మంటలాగా! పొద్దున్న నదిలో స్నానం చేసి - తడి బట్టలతో వస్తాడు - చేతిలో నీటి చెంబు, 'అరే - వాడికి ఏదైనా పెట్టు - ఏమీ అడగడు - వాడి నాన్నలాగానే' అని సత్తమ్మతో అన్నాడు.

ఇప్పటికీ తాళపత్రాలు - రాతప్రతులు ఉన్నాయి. మెల్లగా తీసి దుమ్ము దులిపి, ఇక్కడా - అక్కడా చదవడానికి ప్రయత్నించాను.

కొన్ని ఆయుర్వేద మందులు గురించి, కొన్ని ఉపనిషత్తుల గురించి వ్యాఖ్యానాలు, శంకరాచార్య రాసినవి కొన్ని వేద సంహితలు, రామాయణం ఇంకా చాలా ఉన్నాయి. కొన్ని బల్లి పురాణాలు, ఇంటిలో బల్లులు ఎక్కడ పడితే ఒంటిమీద ఏమి జరగవచ్చో ఇదీ కన్నడంలో ఉంది - సంస్కృతంలో కొన్ని ఉన్నాయి - ఇల్లు ఎలా కట్టాలి, వాస్తు శాస్త్రం, వ్యాపారం ఎలా చేయాలి - ఇవన్నీ ఎంతో వివరంగా వర్ణించి ఉన్నాయి. బ్రాహ్మణుడు ఇల్లు ఎలా కట్టుకోవాలి, ఇవన్నీ 16వ శతాబ్దంనాటివి. సంగీతం గురించి, నశ్యం గురించి, నశ్యం తయారుచేసే 18 విధానాలు, కామశాస్త్రానికి పనికి వచ్చేవి, ఉత్తర - దక్షిణాల, ఆగ్నేయ, మలబారు ప్రదేశాలలో ఎన్ని రకాలుగా ఏవి ఎందుకు చేస్తారు - అన్ని వివరాలు ఉన్నాయి.

'లింగశాస్త్రి ఆయుర్వేద, శాస్త్రవేత్త వివరాలు వివరంగా రాశాడు. కొన్ని రాగి రేకులు తీశాను - అవన్నీ జాగ్రత్తగా గుడ్డలో కట్టి ఉన్నాయి. కుంకుమ జల్లి, పసుపు పూసి, పూరేకులు పెట్టి ఉన్నాయి. నాకు ఇవన్నీ చదవడం చాలా గర్వంగా ఉంది. ఇవన్నీ చిన్నమ్మ దగ్గరకు తీసుకువచ్చి దీపాలు వెలిగించి చదివాను.

ముక్కంటి దేవుడు, శిరస్సున గంగను ధరించినవాడు మాకు సంతోష సంపదలు ఇచ్చుగాక - అని చదివాను. ఇదే రోజున 1615లో (1693 సి.ఇ.) శాలివాహన శకంలో శ్రీముఖ నామ సంవత్సరం, పుష్య మాసంలో 12వ రోజున వీరభద్ర చక్రవర్తి పాండవుల ఆయుధాలతో శత్రువులను జయించినవాడు. యాదవ వంశంలో, కృష్ణానది దక్షిణాన, కావేరికి ఉత్తరాన, 18 శాస్త్రాలు ఔపోసన పట్టినవాడు. దయాళువు, సర్వ రక్షకుడు ఆయన. తన దయా సముద్రం ఉప్పొంగగా, మూడు వేదాలు తెలిసినవాడు, తేజోవంతుడు, పవిత్రుడు, హిమవన్నగమంత ఔన్నత్యంగలవాడు - జ్ఞానసరస్వతీదేవిని తన కంఠంలో నిలుపుకున్నవాడు - సూర్యకిరణాల మాదిరి ఆయన జ్ఞానం తేజోవంతంగా ప్రకాశిస్తున్నది - విశ్వేశ్వర రామకృష్ణ భట్టారకునికి ఈ హరిహరపురం ధారాదత్తంగా ఇచ్చినది. ఎంతో పవిత్రమైన మకర సంక్రమణ సందర్భంగా - బంగారు నాణేలతో పవిత్ర జలాలతో అన్ని సర్వహక్కు భుక్తములతో ఈ గ్రామ - నిధినిక్షేపాలతో వర్తమాన భవిష్యత్తు కాలాలతో - జల ఖనిజ, నిధినిక్షేపాలతో వారికి, వారి వారసులకు సూర్యచంద్రులున్నంతకాలం (ఆచంద్రతారార్కం) తన బ్రాహ్మణ చతుర్కర్మలు నిర్వర్తించినంతకాలం, జ్ఞానాగ్నిని చల్లారనివ్వనంతకాలం బ్రహ్మముఖంగా కుమారులు, మనవళ్ళు, రానున్న తరతరాలుగా ఆజ్ఞాపించే తీరున శత్రువుల నుంచి, తురకల నుంచి, రక్షించుకుంటూ - హైమవతీ నది నిండుగా ప్రవహించే రీతిన పవిత్రాగ్ని మండినంతకాలం పుష్కలంగా సిరిసంపదలతో, రథాలు, అశ్వాలు, కరీంద్రాలు సింహంలా గర్జించే, చక్రవర్తి, నీడను చూసి భయపడే పాతాళ శక్తులు, అదిగో ఆ వీరభద్ర చక్రవర్తి మంత్ర జలాలతో హైమావతీ నదిలో స్నానమాచరించి సిరిగిరి పుత్రిక అయిన హైమావతి నదిలో హిమాలయ పర్వతంలా పశ్చిమ కనుమల్లో ఉన్న సిరిగిరి పర్వతం (ఇలా సాగిపోయిన - హరిహరపుర అగ్రహర దాన శాసనం..) చదువుతున్నాను.

శ్రీధరుడు - ఇవన్నీ వింటున్నాడు - ఏదో అర్థమయినట్లు - అక్కడే దీపాలకు సత్తమ్మత్త నెయ్యి పోస్తోంది. శ్రీధరుడు - దేవతల చెంతన పడి నిద్రపోయాడు - బల్లులు ఏవో తెలిసినట్లు గోడమీద పరుగులు పెడుతున్నాయి - గోవులు కుడితి కోసం వస్తున్నాయి. ఎక్కడో ఆలయ కుంజరం ఘీంకరించింది. నేను హరిహరపురంలో ఉన్నాను - అవును మా హరిహరపుర అగ్రహారంలో ఉన్నాను...!!

ఆ మధ్యాహ్నం ఆలూరు శ్రీకాంత శాస్త్రి వచ్చి నన్ను నది దగ్గరకు తీసుకువెళ్లారు. హైమావతి చాలా గంభీరంగా ప్రవహిస్తోంది. నెమలి రంగులో మెరిసిపోతోంది తల్లి!

శరీరం అంతా శుభ్రం చేసుకున్నాం - నేను నీటిలో మునగకూడదు - రామన్న తాత నా ఆలోచనలో మెలిగాడు - అమర, నిరుక్త, ఈషా, కేశోపనిషత్తులు ఆయన దగ్గరే నేర్చుకున్నాను - ఈ మాత ఒడిలో శ్రీకాంతశాస్త్రి, తాతగారిని ఎక్కడ దహనం చేశారో గుర్తు చేశాడు. హైమావతి మాత - ఆయన చితి ఆరిపోయేవరకూ వేచి ఉంది - ఒక్కసారిగా పొంగి ఆయన పవిత్ర చితాభస్మాన్ని తనలో కలుపుకుంది.

తిమ్మయ్య - రంగడు మాకు కూరగాయలు తెచ్చారు - ఆ రాత్రి మా వంటవాడు ఎంతో రుచికరమైన భోజనం పెట్టాడు!

రంగనాథ పూజారికి 300 రూపాయలు ఇచ్చాను. కెంచమ్మ గుడి మరమ్మతులు చేయమని.

చిన్నమ్మ - 'ఇదిగో - ఈ పట్టుచీర అమ్మవారికి..' అని సమర్పించింది.

ఆ సాయంత్రం ఆవులన్నీ తిరిగి రావడం ఆనందం కలిగించింది. 'గౌరీ' ఇంకా దృఢంగా ఉంది. ఇప్పుడు 11 ఏళ్ళు నిండాయి. ఇదిగో ఈ కోడెదూడ సంవత్సరం క్రిందనే ఈనింది. నంజప్ప అన్నాడు. ఇంకా మూడుసేర్లు పాలిస్తుంది - లాలీ - సేతు చనిపోయాయి సంవత్సరం కిందే.

సాయంత్రం అయిన వేళ ఊరిలో పెద్దలంతా వచ్చి - మమ్మల్ని అమ్మవారి దర్శనానికి, పూజాదులకు రమ్మని ఆహ్వానించారు. ఆహా - ఎంత అద్భుతంగా ఉంది మాత - ఆకుపచ్చని కన్నులు, గుండ్రంగా - తాతగారు బహుమానంగా సమర్పించిన 'సర్పబంధనం'తో వెలిగిపోతోంది. తాత - నేను పుట్టిన సందర్భంగా అమ్మవారికి ఈ 'సర్పబంధనా'న్ని ఆమె వడ్డాణంగా సమర్పించారని చెప్పారు.

ఇంటికి చేరాం. సిద్దన్న వచ్చి మంచి చెడ్డలన్నీ ఏకరువు పెట్టాడు. అందులో ఇంటి హద్దులు, పొలాల సరిహద్దులు, పక్కవాళ్ళ ఆగడాలు - అన్నీ ఉన్నాయి. 'అయ్యా - ఇక్కడ ఎవ్వరూ మన మాట వినరు, అదేమంటే హైమవతీ నదిలో పడేస్తామని బెదిరిస్తారు' అని - 'వాళ్ళ పెద్దవాళ్లతో మాకు ఎటువంటి పేచీ లేదు - ఈ తరమే ఇబ్బంది' అని వాపోయాడు.

చిన్నమ్మకు అన్ని వివరాలు తెలుసు - సీతారాం బాబాయి ఆమెకు ఎప్పుడూ అన్ని విషయాలు తెలియజేస్తూ ఉంటాడు. అందరూ సరోజ పెళ్లి వివరాలు అడిగారు. ఆహా - ఎంత గొప్ప కుటుంబం! ఒక కొడుకు లండన్‌లో, కూతురు ఢిల్లీలో అని గొప్పలు చెప్పుకున్నారు. 'ఇదిగో - ఇప్పుడు అందరికంటే చిన్నవాడు కూడా హైమవతీ పవిత్ర గంగ తాగాడు కదా! అతను కూడా ఇక్కడ ఉపనయనానికి, వివాహానికి

వస్తాడు తప్పకుండా' అని వారి కోరిక తెలియజేశారు - పోతేదారు - పటేల్ - సిద్ధ లింగయ్య అన్ని అజమాయిషీలూ చేశాడు.

ఆ రాత్రి నేను పడుకుని ఆలోచించాను - ఆ అగ్రహారం ఒడిలో.

ఇదిగో ఈ పొడవైన హైమవతీ లోయ ఇన్నేళ్లుగా మా కుటుంబానికి వడ్లు, చెరకు ఇస్తోంది. సంవత్సరం తర్వాత సంవత్సరం - పుష్కలంగా - అదిగో ఆ పర్వత శ్రేణులు, ప్రక్కగా ఉన్న కాఫీ తోటలు, పనస పళ్ళు, యాలకులు, తేనే దశాబ్దాలుగా, వందల సంవత్సరాలుగా, మా వంశాన్ని వృద్ధి చేస్తున్నాయి. నిజానికి వీటి చైతన్యమే మాలో ప్రవహిస్తోంది.

ఎంత అద్భుతమైన సందర్భం!

హరిహరపురంలో మేము ఎంతో సంతోషంగా గడిపిన తర్వాత - బెంగుళూరు వెళ్ళాము. ఢిల్లీ నుంచి సరోజ మాతో ఉండటానికి ఓ వారం తరువాత వచ్చింది. వాళ్ళాయనను భారత ప్రభుత్వం అధికారికంగా లండన్ పంపించింది. కొద్ది నెలలపాటు సరోజ మాతో ఉండవచ్చు. ఇది మా అందరికీ ఆనందదాయకమైన విషయమే.

నా జీవితంలో ఇంత ఆనందంగా ఉన్న రోజులు నాకు గుర్తులేదు. దాదాపు ఆరు వారాలు. చిన్నమ్మా, సరోజ, శ్రీధర, పనివాళ్లు బెంగుళూరు లాల్‌బాగ్, సిటీహాలు ఇవన్నీ నా జ్ఞాపకాల్లో అలా నిలిచిపోయాయి. చిన్నమ్మకు మా కుటుంబంలోని దగ్గర - దూరపు బంధువులు అందరూ తెలుసు. తెలియటమే కాదు - అందరితో రాకపోకలూ ఉన్నాయి. నాన్నగారు పనిగట్టుకుని మరీ అందర్నీ చూసి వస్తుండేవారు. వచ్చిన చుట్టాలకు ఎంతో ఆప్యాయంగా ఆతిథ్యమిచ్చేవారు. అదిగో ఆ సంప్రదాయాన్నే చిన్నమ్మ కూడా కొనసాగిస్తోంది. ఆ విధంగా చుట్టుపక్కల అందర్నీ కలిసే అవకాశం నాకూ కలిగింది.

ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మేమందరం వైకుంఠపాళీ, పులి-జూదం లాంటి ఆటలు ఆడుతూ, నవ్వుతూ, తుళ్ళుతూ గడిపేవాళ్ళం. "అన్నా - నువ్వు పూర్తిగా ఆరోగ్యంగా ఉండాలి. మిగతా విషయాలు నేను చూసుకుంటాను" అనేది సరోజ. ఇప్పుడు సరోజకు - చిన్నమ్మకు మంచి అవగాహన కుదిరింది. వివాహం సొంత మనుషుల్ని మరింత దగ్గర చేస్తుంది.

సుకుమారి తన ఈడువాళ్ళతో (ఆడ - మగ) సినిమాలు - షికార్లు చేయగలుగుతుంది. బెంగళూరులో ఎలాంటి పుకార్లు పుట్టవు, హైదరాబాదులోలాగా.

చిన్నమ్మ 'అరే రామా - బెంగుళూరు బ్రాహ్మణ నగరంరా' అనేది. 'హైదరాబాద్ ముస్లిం వాతావరణం - ఆడపిల్లలు బయట తిరగడం హర్షించరు. బెంగళూరులో చూడు - ఎలా సంతోషంగా సుకుమారి తన ఈడువారితో తిరుగగలుగుతోందో - ఎవరూ తప్పు పట్టరు - గుసగుసలాడరు. ఇది బ్రాహ్మణ నగరమే..' అంది. అప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం కులనిర్మూలన చట్టం తీసుకు వచ్చింది. ఎటువంటి ప్రభావం లేకుండా.

బెంగుళూరులో సాయంత్రం వాతావరణం చల్లగా ఉండేది. బసవన్నగుడి ప్రాంగణంలో సాయంసంధ్యలు నయనానందకరంగా ఉండేవి. నందీశ్వర ఆలయం నుండి గంటలు వినిపిస్తూ ఉండేవి. ఎంతో గంభీరంగా, పవిత్రంగా - ఆ శబ్దం ఓంకారంతో కలిసి పోతుండేది.

చిన్న-చిన్న గుట్టలు ఎక్కుతుండేవాళ్ళం. నాకు శ్వాస సమస్య ఇప్పుడు లేదు. సంజ చీకట్లు ఈ లోయల్లో పరచుకుని, మమ్మల్ని తాకుతుండేవి. ఒక్కసారిగా దీపాలన్నీ వెలిగేవి. గబ్బిళాలన్ని చెట్ల మీదకు చేరేవి. చిన్నమ్మ, సరోజ నందీశ్వరాలయంలోకి వెళ్లి, ప్రసాదం తెచ్చేవారు. అందరం మెట్లమీద కూర్చుని నవ్వుకుంటూ తినేవాళ్ళం. గాలిలో కర్పూరం, చంపకమాల పరిమళాలు నిండిపోయేవి. మా గుండెల నిండా ఆ గాలి నింపుకుంటూ ఇల్లు చేరేవాళ్ళం.

'శంభో శంకర - శంభో శంకర' చిన్నమ్మ స్తోత్రం చేసేది - మేము వారణాసిలో ఉన్నట్లుండేది.

సరోజ ఢిల్లీ నుంచి వంటవాడిని తీసుకు వచ్చింది - అప్పు నాయర్ - సాంబారు, ఇడ్లీ అద్భుతంగా చేసేవాడు.

నేను చాలా సంతోషంగా ఉన్నాను.

నన్ను డాక్టర్లు మళ్లీ పరీక్షలు చేశారు. "ఆఁ.. ఇప్పుడు అన్నీ బాగున్నాయి. ముఖ్యంగా ఎక్సరే. మీరు శాఖాహారం తీసుకోవడం కొంత కారణం. రోమ్‌లో ఉన్నప్పుడు రోమన్‌లాగానే ఉండాలి" అని సలహా ఇచ్చారు.

"మీ తాతగారు - మీ నాన్నగారిని కేంబ్రిడ్జ్ వెళ్ళనివ్వలేదు - ఆయన కూడా రామానుజం గారిలా చనిపోతాడని భయపడి. కానీ కాలం మారిపోయింది - నువ్వు యూరోప్ వెళ్ళావు కదా - అక్కడి ఆహారపుటలవాట్లు - వైన్ తాగడం తప్పనిసరి - లేకపోతే ఫ్రెంచ్ అమ్మాయిని ఎందుకు పెళ్లి చేసుకున్నావు" ఇది డాక్టర్ భీమసేన్ రావు గారి ఉపన్యాసం.

ఏమని చెప్పను? నవ్వేసి - 'నేను ఐరోపా బ్రాహ్మణుణ్ణి' అని అన్నాను. ఆయన 'సరే సరే' అని తల ఊపి, నీ ఎక్స్‌రేలన్నీ పరీక్షించి, తన నర్సులందరికీ 'ఇదిగో,

వీరు ఐరోపా బ్రాహ్మణులు' అని నవ్వేవాడు. 'ఫ్రెంచి వేదాంతి' అని కూడా కలిపేవాడు.

అందరూ నవ్వేసేవారు - మనం అన్ని విషయాలకు నవ్వుకుంటాం - బహుశా అదే మన ఊపిరితిత్తులకు మంచిదేమో!

నాగరికత బహుముఖీనమైనది - జీవితం ఒక అద్భుతమైన క్రీడ!

జననమరణాలు, విత్తనాలు చల్లటం, పంటలు తీయటం, సుఖదుఃఖాల పరస్పరానుబంధాలు, కూడికలు - తీసివేతల చిక్కుముడులు, ప్రేమావేశాల నామకరణాలు, లౌకిక నిర్ణయాలు, మభ్యపెట్టడాలు, లాభనష్టాలు, మన విజయాలు, రాజుల మరణం, రాజుల పట్టాభిషేకాలు, నియంతల అంతం - ఇవన్నీ ఒకదానివెంట మరొకటి జరిగిపోతుంటాయి. లాల్‌బాగ్‌లో నా పాదాల ప్రక్కగా కదిలిపోతున్న అద్భుతమైన చీమల బారులా - కానీ వాటికి ఏమీ తెలియదు. వర్షాల మధ్య సూర్యుడు వెలుగుతుంటాడని తప్ప! ఉత్సాహంగా తలలూచే వృక్షాల గాలి కెరటాల తప్ప ఆకాశంలో ఎగిరే విమానాలలో ప్రయాణించే మనుషులను మోసుకుపోతూ, భూమి చుట్టూ తిరుగుతుంటాయని - ఈ గోళాకార భూమి అంచుల నుంచి - అన్ని దిక్కుల నుంచి - వస్తూ పోతుంటాయని - అదిగో - ఆ టెలిగ్రాఫ్ వైర్లు నా పై నుంచి పోతున్నాయని, అవే ఈ మనుష్యుల విధి వ్రాతలను మోసుకుపోతున్నాయని దశాబ్దాలుగా 'అదిగో - శాము చనిపోయాడు', 'సుబ్బు పరీక్ష పాసయ్యాడు', 'లక్ష్మణ్ డెహ్రాడూన్ - మిలటరీ క్యాంప్‌కి బదిలీ అయ్యాడు' ఇలాంటి సందేశాలు ఇక ముందు కూడా దశాబ్దాల పాటు మోసుకుపోతాయి. నిస్తంత్రి సాంకేతికత వచ్చేవరకు - భవిష్యత్తులో మరెన్ని అసమాన, సమాచార సాధనాలు రాబోతున్నాయో, ఇప్పటికీ సైకిల్ మీద వచ్చే పోస్ట్‌మాన్, నీలం రంగు కోటు, కాకి ప్యాంటుతో, ఎర్రని కవర్లు పట్టుకుని, వార్తలు మోసుకు రాకపోవచ్చు. సాంకేతిక పరిజ్ఞానం ఎంత వేగంగా దూసుకుపోతుందో - ఇతర దేశాల నుంచి వచ్చే టెలిగ్రామ్‌ల పైనా అధికారులు దయతో 'భారత విదేశ సంచార సేవ' అని ముద్ర వేస్తారు. అలాంటి ముద్రతో మెదలీనా దగ్గర్నుంచే అయ్యుంటుంది. ఇప్పటివరకు టెలిగ్రాఫ్ వైర్ల వంక చూస్తూ గడిపి, ఇంటికి వచ్చిన నాకు ఏదో రాబోతోందని ముందుగానే తెలుసా? అంతగా ఆశ్చర్యపోలేదు. 'చిన్నమ్మ' నన్ను చూస్తూ - "రామా - నువ్వు చాలా ఆరోగ్యంగా ఉన్నావు" అనటం కూడా నేను ఆశ్చర్యపోకపోవడానికి కారణమేమో! చిన్నమ్మ అలా లోపలికి వెళ్లగానే టెలిగ్రాం

నా చేతిలో పెట్టాడు. దానిమ్మ చెట్టు అరుగు మీద కూర్చుని జాగ్రత్తగా కవర్ తెరిచాను. టెలిగ్రామ్ పంపించింది 'జోబీ' అత్త. అందులో సమాచారం- 'మెదలీనాకు కాన్పు కష్టమైంది - సిజేరియన్ చేయాల్సి వచ్చింది - కాన్పులోనే బిడ్డ చనిపోయాడు. మెదలీనా బాగానే ఉంది - నీవు కంగారు పడకు. మేము జాగ్రత్తగా చూసుకుంటాము' ఇది విధి వ్రాత!

సరోజ లోపల ఇస్త్రీ బట్టలు లెక్క చూస్తోంది. మూడు జుబ్బాలు, నాలుగు చీరలు, పది చేతి రుమాళ్ళు, నాలుగు తువాళ్ళు... నేను టెలిగ్రాం కవరు జేబులో పెట్టుకున్నాను. అది చీమల కోసం వచ్చింది!!

తర్వాత స్నానాల గదిలోకి వెళ్ళి నవ్వుకున్నాను. నాకు బాధ లేదు, సంతోషం లేదు, ఏదో బంధం తెగిపోయిందనీ కాదు. వీటన్నిటికీ అతీతంగా నా మానసిక స్థితి ఉంది. పిల్లవాడు ఆకాశంలో ఎగిరే గాలిపటాన్ని చూస్తున్నట్లు - పాములాగా దాని తోక వంకర్లు పోతూ గాలిగి అటూ-ఇటూ ఎండలో తిరుగుతున్నట్లు - ఎత్తుగా దారం చివర పసుపు - తెలుపు గాలిపటం, దాని తోక పాములా వంకర్లు పోతూ, తిరుగుతోంది.

గాలి చల్లగా, మెల్లగా వీస్తోంది. నేను పిల్లవానిలాగే నవ్వుకుంటున్నాను. గాలి తెమ్మెరల తెరలతో ఆడుకుంటున్నాను. ఈ ప్రపంచంలో ఎవరైనా హాయిగా జీవించవచ్చు, సంతోషంగానూ ఉండవచ్చు.

చూడండి - లాల్‌బాగ్‌లో అద్భుతమైన చీమలదండు - ఎలా కవాతు చేస్తోందో - గౌతముడు - 'వస్సిత'కు శాంతిని ప్రసాదించలేదా?

ఆ మధ్యాహ్నం అంతా నాకు పిచ్చి నవ్వు వచ్చింది. చిన్నమ్మతో 'పులి-జూదం' ఆడాను. తర్వాత సరోజ నిద్ర లేచి వచ్చినప్పుడు ఆమెతో 'దాడి' ఆడాను.

సాయంత్రం అందరినీ సినిమాకు తీసుకెళ్లాను.

సావిత్రి దగ్గర నుంచి ఉత్తరాలు అరుదుగా వస్తున్నాయి. అదీ తన 'చిన్న'తనాన్ని ఈ లావుపాటి మూర్ఖురాలు - ఈ అజ్ఞాని - ఈ విధంగా తన భయాన్ని మరోవిధంగా మార్చుకుంటూ రాసేది. నా ఆరోగ్యం బాగా కుదుట పడింది - రక్త కణాలు బాగా ఎర్రబారినాయి. వాటి భాష - ధర్మం వాటికి బాగా తెలుసు. మన సంతోషానికి బహుశా అవే కారణాలేమో?

వర్షాలు బాగా కురిశాయి, శ్రావణ మేఘాలు కొత్త వాసనలు మోసుకొచ్చాయి. పొలాలన్నీ వరి, చెరకు పంటలతో ఆకుపచ్చగా మారిపోయాయి. చెరువులన్నీ కొత్త

నీరుతో ఎరుపెక్కాయి. ఆవులన్నీ తడిసి, ఎండలో మెరుస్తున్నాయి. తమలపాకు తీగెలు నవనవలాడుతూ కొత్త చిగుళ్లు వేస్తున్నాయి.

సుకుమారిని, వంటవాళ్ళని హైదరాబాద్ పంపేశాము. ఆమె చదువుకు అంతరాయం కలగకూడదు. స్కూళ్లు, కాలేజీలు మన కోసం మూసి ఉంచరు కదా!

సరోజ భర్త లండన్ నుంచి చాలా ఉత్సాహంగా ఉత్తరాలు రాస్తున్నాడు. అతను మొదటిసారి విదేశాలకు వెళ్లడం. 'నా ప్రియమైన, పవిత్రమైన భార్యామణికి - నాతో నా అదృష్ట దేవత వచ్చింది. నీవు నా ఇంట్లో అడుగు పెట్టినప్పటి నుంచి అద్భుతాలు జరిగాయి. ఉద్యోగరీత్యా ఉన్నత పదవి వరించింది - ఇదిగో ఇప్పుడు యూరోప్ వచ్చాను. ఈసారి మన ఇద్దరం కలిసి రావచ్చు. నిన్ను ప్రతి క్షణం తలుచుకుంటున్నాను. కలిసినప్పుడు అన్ని వివరాలు చెప్తాను...'

ఆ ఉత్తరం సరోజ నాకు చూపించింది - సంతోషానికి రుజువుగా.

జంతువులకు వర్షం ఎప్పుడు వస్తుందో ముందుగానే తెలుస్తుంది. గంగా, గౌరి ఇంటికి పరుగు పెట్టుకుంటూ వస్తాయి. చెవులు వెనక్కి మెడవైపు రిక్కించి వస్తుంటాయి. అదిగో అలాగే - నా భవిష్యత్తు - ఎంత విచారంగా ఉంటుందో నాకు తెలిసిపోతుంటుంది.

సావిత్రి దగ్గర నుంచి నెలకు పైగా ఉత్తరం రాలేదు. కానీ ఈ సరికే ఢిల్లీ చేరి ఉంటుంది.

నేను 'మేఘసందేశం' పంపించాను. కాళిదాసు శ్లోకాలు

'ఓ శ్రావణ మేఘమా - నిప్పుల్లో మండేవారికి నీవే దిక్కు

చల్లని చినుకులు చిలకరించేది నీవే కదా -

ఇదిగో నా సందేశాన్ని నా ప్రియురాలికి అందించాను

అలకాపురిలో ఉన్న యక్ష గంధర్వ లోకంలో

నా ప్రియురాలికి - మహాశివుడు నివసించేది - ఆయన శిరస్సు

పైనుంచే కదా చంద్రకాంతి

లోకాలన్నీ వెలిగిస్తుంది..

సావిత్రి ఢిల్లీలోనే ఉంది - తన తండ్రితో పాటు ఢిల్లీలో మణిబాగ్‌లో ఒక మేడ తీసుకున్నారు. సూరజ్‌పూర్ రాజుగారు పూర్వం తెల్ల దొరలకు ఆతిథ్యం ఏ విధంగా ఇచ్చేవారో - అలాగే ఇప్పటి కొత్త దొరలకు ఆతిథ్యం ఇస్తున్నారు. పూర్వం పులివేట, మద్యం వినోదం - ఇప్పుడు విందూ వినోదాలే - పులులు లేవు.

సావిత్రికి ప్రపంచం అంటేనే విసుగు పుట్టింది. అలసిపోయింది. "నేనింకా ఏ నిర్ణయం తీసుకోలేదు, నేనంటే కోపం తెచ్చుకోకు, నన్ను కోపగించకు, నేను

చాలా బలహీనురాలిని. నువ్వు 'ఈట్స్' కవిత చదివేవాడివి. 'ఆడదంటే మట్టిలో - మట్టి - ఈ భూమి' అని. నేను అదిగో ఆ మట్టిలో పురుగుని, ప్రతాప్ రోజూ వస్తున్నాడు. నేను జూలో జింకలా కనబడుతున్నాను. నాకేదో పచ్చగడ్డి పరకలు తినిపిస్తాడు.

'రామా! నేను కృష్ణజింకనా? ఈ ఇనుప దడిని దూకి రాగలనా? కానీ ఒక విషయం చెప్పగలను. నేను నిన్ను ప్రేమిస్తున్నాను - నన్ను రక్షించు!'

లాల్‌బాగ్‌లో అశోక వృక్షాల క్రింద కూర్చొని రెండోసారి చదివాను. గాలులు బలంగా వీస్తున్నాయి. ఆ చెరువుకు అవతలి ఒడ్డున ఐదారుగురు స్నానాలు చేస్తున్నారు. ఇంకా చీకటి పడలేదు. బహుశా ఎవరినో దహన సంస్కారం చేసి వస్తున్నారేమో!

నా స్నేహితుడు డాక్టర్ అప్పస్వామి - చెప్పేవాడు - తన స్నేహితులలో కొందరు కష్టకాలంలో చాలా ఎక్కువ తెలివితేటలు ప్రదర్శించగలిగేవారని.

మరణం, పిచ్చితనం, ప్రతాప్, వివాహం, ఎర్ర రక్తకణాలు, పైన టెలిగ్రాఫ్ వైర్లు, ఆ పైన నక్షత్రాలు మిణుకుమిణుకుమంటూ వారణాసి ఎక్కడ లేదు? నీవు ఎక్కడ ఉంటే అదే కాశీ! కపిలవస్తు మానవాళికి అసలైన గృహం. మనందరికీ ఎవరికి వారికి 'కంటకాశ్వం' ద్వారం దగ్గర సిద్ధంగా ఉంటుంది. లేత వెన్నెల కిరణాలు ఆమె పాన్పు మీద తెరల మీదుగా పడుతోంది - ఆమె మడిచిన చేతి దిండుపై ఆదమరచి నిద్రిస్తున్న పసికందును వదిలిపోయే ధైర్యం మనకు ఉందా?

దేవతలు గుమ్మంలో సిద్ధంగా ఉన్నారా - మన నిష్క్రమణ శబ్దాలు ప్రపంచానికి వినిపించకుండా చేయటానికి సిద్ధంగా ఉన్నారా?

చిన్నమ్మతో నాకు బాగా సాన్నిహిత్యం పెరిగింది, ఈ రోజుల్లో. ఏడుగురు అప్పచెల్లెళ్ళలో ఐదో సంతానం చిన్నమ్మ - వాళ్ళ నాన్న కోర్టు గుమాస్తా - 'ఇదిగో ఎనిమిది అణాలు ఇచ్చాడు - ఆ రైతు ముండావాడు. పొద్దున్నుంచి రాసి పెట్టాను' అనే రుసరుసలాడుతూ నశ్యం డబ్బాతో వచ్చేవాడు నాన్న. ఆయనను చూస్తే అందరికీ భయమే. 'డబ్బు చెట్లకు కాయటం లేదు - పెళ్లిళ్లు ఎలా చేయాలో' అని అమ్మను తిట్టేవాడు. ఆయనకు ఇంతమందిని కనడం ఇష్టం లేదు. కానీ ఆమె కనాల్సి వచ్చింది. నిజానికి చిన్నమ్మకు నేస్తాలు - కొబ్బరిచెట్టు, సైకిల్ పంపు - 'రామా - నా బ్రతుకు మున్సిపాలిటీ పంపులా ఉండేది - రాత్రంతా శబ్దం చేస్తూ - ప్రొద్దున్నే నీళ్ల కోసం వచ్చేవాళ్ళమాటలన్నా వినేదేమో - కానీ నాకు తిట్లు - తన్నులే. పెళ్లయిన తర్వాత

మళ్లీ కన్నవారింటికి వెళ్లలేదు - ఇప్పుడు వాళ్లు నాకు పరాయివాళ్ళు. అందరూ 'మనసు' గురించి మాట్లాడతారు. మనసు ఆవుపేడతో చేస్తారా? లేదా పుల్లని మజ్జిగతోనా? కుళ్ళిపోతే పురుగులు పడతాయి సుమా!'' అంటూ శ్రీధరను నిద్రపుచ్చేది. అర్ధరాత్రి ఎప్పుడో సరోజ నిద్రలేచేది. 'చిన్నమ్మా, నిద్రలో కలవరించానా?' - 'లేదమ్మా - నేను అన్నకు రామకథ వినిపిస్తున్నాను - నువ్వు నిద్రపో - మీ ఆయన, మీ ఇల్లు కలలోకి వస్తాయి' అని సముదాయించింది.

డాక్టర్లు నన్ను కొన్నాళ్ళు ఊటీగాని, కొడైకెనాల్‌గాని వెళ్ళమన్నారు. అక్కడ తేమ లేని గాలి నీకు బాగా ఉల్లాసాన్నిస్తుంది - అని సలహా ఇచ్చారు. సరోజ 'అన్నా - నాతో ఢిల్లీ రారాదూ - అక్కడి నుంచి ముస్సోరి వెళ్దాం' అంది. కానీ నేను కొడైకెనాల్ వెళ్ళాలనుకుంటున్నాను. ఈ ఋతువులో అక్కడి గాలి చాలా పొడిగా, చల్లగా ఉంటుంది. అక్కడ ఒంటరిగా ఉంటే నా థీసిస్ కూడా పూర్తి చేసి యూనివర్సిటీకి ఇవ్వాలి. అవును - నేను ఇండియా తిరిగి రావాలి కదా!

సరోజ - చిన్నమ్మ హైదరాబాద్ వెళ్ళిపోయారు. సరోజ కొద్దిరోజులుండి ఢిల్లీ వెళ్లిపోతుంది. నేను అద్భుతమైన కొడైకెనాల్ కొండకు వెళ్లి, అవి ఎంత సనాతనమైనవో, ఎంత పవిత్రమైనవో, ఎంత నిశ్శబ్దంగా ఉన్నాయో, ఆ లోయలన్నీ ఎంత హరితంగా, లేతగా, మౌనంగా గానం చేస్తున్నాయో - ప్రశాంత సముద్రంలా పరుచుకుని ఆహ్వానిస్తున్నాయి.

కొండలు - గుట్టలు ఎక్కి దిగాను. కొండ గొర్రెలాగా నా ఊపిరితిత్తులు దృఢంగా తయారయ్యాయి.

కొడైకెనాల్ డాక్టర్ రూపోర్ట్ నన్ను పరీక్షించాడు. 'ఎత్తుపల్లాలు ఎప్పుడూ క్షేమం కాదు' ఆయన జర్మన్ దేశస్థుడు - 40 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాడు. అది 1914-18 యుద్ధకాలంలో వలస వచ్చినట్లున్నాడు. 'ఆఁ.. మీరు తిరిగి ఫ్రాన్స్ వెళ్ళవచ్చు. అదృష్టవంతులు - ఫ్రెంచ్ అమ్మాయిని పెళ్లి చేసుకున్నారు. అదీ ప్రావిన్స్‌లో ఉంటున్నారు. 'మిన్నీసెంజర్ల' గురించి 'పార్సిఫాక్' గురించి థీసీస్ రాస్తున్నారు.

ఆయన పాడటం మొదలు పెట్టాడు - అబ్బా - ఎంత మొరటుగా ఉందంటే చెప్పలేను.

పనివాళ్ళు తమిళ మాటలు - వెయ్యి రేకుల పూల వాసనలతో - అక్కడి వాతావరణం వింతగా ఉంది.

నాకు కొడైకెనాల్ ఎంతో నచ్చింది. ఆనందానికి నిలయమనిపించింది. అది కొడైకెనాల్ సరస్సులో ఓ పద్మం పైకి వస్తోంది. లక్ష్మీదేవి ఆ పద్మంలో ఉంది.. ఆమెకు ఇరువైపులూ కరీంద్రాలు, పూల హారాలతో 'తారాలత' పర్వతశ్రేణి పవిత్ర జలాల్లో నిలబడి ఉన్నాయి.

ఓ శ్వేతాంబరీ దేవీ-
సర్వాలంకార భూషితా
విశ్వంబరీ - సృష్టి మాతా
సర్వసంపద వరదాయినీ
నీకేలే నా వందనాలు

దుఃఖం మన నీడలాంటిది. మనం ముందుకు చూడవచ్చు. సరస్సు చుట్టూ వెండి వెలుతురుంది - అసలు వెలుగు రెండు కళ్ళ నడుమ నివసిస్తుంది సదా! అది తెలుసుకోవడమే ఆనందం!

మెదూ - నా గురించే ఆలోచిస్తోంది- "రామా, తొందరపడి తిరిగి రాకు. ఇప్పుడు నేను చాలా లావయి, ఆరోగ్యంగా ఉన్నాను. జోబి అత్త నన్ను బెదిరిస్తోంది. 'రామస్వామి పూర్తిగా కోలుకున్న తర్వాతే రావాలి. మళ్ళీ నా ముందు అతను దగ్గితే నిన్ను ఇండియా పంపిస్తాను' - అంటుంది. నిజంగా నా గురించి ఎంతో శ్రద్ధ తీసుకుంటున్నది - ఆమెకు సంతోషంగా ఉండటం అలవాటు! నేను రోజూ అరగంటసేపు నవ్వకపోతే ఊరుకోదు - నాకు పద్యాలు, పాటలు పాడి వినిపిస్తుంది. ఎంతో హాస్యంగా మాట్లాడుతుంది. ఇప్పుడు నేను 'వస్మిత' కథలోలాగా ఉన్నాను.

మెదలీనా ఉత్తరాలు నాకు సాంత్వన కలిగిస్తాయి. వాటిలో ఎంతో జ్ఞానం నిక్షిప్తమై ఉంటుంది. ఏదో తెలియని దుఃఖస్పర్శతో అవి వెలుగుతుంటాయి. ఎంతో ప్రేమతో నిండి ఉంటాయి. నాకు ప్రాణవాయువు నింపుతుంటాయి.

ఆమె ఒక స్థితప్రజ్ఞతను సంతరించుకుంది. ఎంతో ఉన్నతంగా ఎవ్వరూ అందుకోలేనంత ఉత్సాహంగా ఎదిగింది. నాకు సిగ్గనిపించింది - నాలోకి నేను కుంచించుకుపోయాను.

ఇప్పుడు సావిత్రి తరచుగా ఉత్తరాలు రాస్తోంది. ఆమె ఎక్కడ ఉంటే అదే ఆమెకు పూర్తి స్థానం. ఈ విశాల ప్రపంచంలో ఆమె ఉన్నచోటే ఆమె ప్రపంచం. ఆమె సన్నిధిలో ఉన్న వ్యక్తే అతి ముఖ్యుడు. అతనికి ఎంతో ఆప్యాయంగా విస్కీ

గ్లాసు అందివ్వగలదు. పంచదార పెట్టగలదు! అతని ఆనందమే ఆమెకు తక్షణ కర్తవ్యం అన్నట్లు. ఆమె దగ్గరగా కూడా ఎవరూ వెళ్ళలేరు. బహుశా నేను ఒక్కడినే వేళ్ళానేమో! ఆమె సర్వాంతర్యామి. ఆమెను చేరాలంటే ఆమెలాగా మారాలి.

ఇప్పుడు వాళ్ళంతా సూరజ్‌పూర్ వెళ్ళిపోయారు. ప్రతాప్ కూడా ఆమెను చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నాడు. రాజమహల్‌లో ప్రతాప్ రాజుగారిని కలుస్తున్నాడు. అదిగో - గజరాజు కోటలోకి వస్తున్నాడు. మావటి సుల్తాను చెవులు పట్టి లాగుతున్నాడు. మహా ద్వారం దగ్గరకు వచ్చినప్పుడు ఏడు గంటలు మోగుతున్నాయి.

సావిత్రి దీవాన్ మీద పడుకొని - బెర్ట్రెండ్ రస్సెల్ చదువుతోంది - సిగరెట్ కూడా వెలిగించింది, సాయంత్రాన్ని తనలోకి పీల్చుకోవడానికి. తన మౌనంలోకి వెళ్ళిపోయి అక్కడ వేచి ఉంటుంది. ఏ రాజకుమారుడో స్వయంవరంలో ఆమెను గెలుపొందాలి. ఓ సంస్కృత శ్లోకం గానం చేసి, చిక్కుముడి విప్పాలి.

'చెప్పు రాజకుమారా? త్వరగా చెప్పండి - నాకు కావలసింది ఏమిటి?' పూలమాల సిద్ధంగానే ఉంది. నవరాగాలు మోగుతూనే ఉన్నాయి. ఏమిటి ఈ 'సర్పబంధనం' విశృంఖలం చేయండి. నేను మీకు వరమాల వేస్తాను రాజకుమారా?

ఆమె ప్రపంచాన్ని చూడటంలేదు - తన నుదుట ఉన్న సింధూరాన్ని తిలకిస్తోంది - సావిత్రి!

సావిత్రి సూరజ్‌పూర్ నుంచి ఉత్తరం రాసింది. ఢిల్లీలో యువ రాయబారి నన్ను చూసి మోహించాడు. నేనేదో గంధర్వ కన్యలా ఉన్నానని, తనని చేసుకోమన్నాడు. ఇది దేశానికి ఎంతో మేలు చేస్తుందని నాన్నగారిని ఒప్పించడానికి ప్రయత్నించాడు. నాన్నగారికి ప్రతాప్ అంటే ఎంతో జాలి ఉన్నా ఈ రాయబార కార్యానికి ఆయన వ్యతిరేకం కాదు. ఆయనకు నా మీద ప్రేమ అలాంటిది. వీలైతే ఆ చందమామనే తెచ్చి నాకు కట్టబెడతారు! నేను నా కేంబ్రిడ్జి తెలివితేటలు ఉపయోగించి ఈ ప్రమాదం తప్పించాను. ఢిల్లీ జిమ్ఖానా క్లబ్బులో నా సోదరునితో డాన్స్ చేశాను. బాగా ఊగి! నీకు తెలియదు - నిన్ను ఉడికించటానికి చెప్తున్నాను. నాకు బహుమతి కూడా వచ్చింది.

రామా! ఈ ప్రేమలేఖ రాస్తున్నప్పుడు సూరజ్‌పూర్‌కు ఉత్తరాన ఉన్న సరస్సు తీరంలో ఉన్న అతిథిగృహంలో చీకటి పడుతోంది. సేవకురాలు నూనె దీపం - పద్మంలా అయిదు రేకులతో వత్తులు ఉన్నాయి. వెలిగించి తెచ్చింది. 'అమ్మా!

క్షమించండి. ఇక్కడ కరెంటు లేదు' అంటూ మిగతా వారంతా సరస్సులో చేపల వేటకు వెళ్లారు. ఇప్పుడు నేనెంతో బాగా చూడగలుగుతున్నాను. నా నుదుటే ఒక మణిదీపం ఉంది. నా తలపై ఐదు తలల నాగుపాము గొడుగు పడుతోంది. నా శ్వాస విశ్వాసంగా నిశ్శబ్దంలో లీనమైపోతుంది. నాన్నగారు - 'అమ్మా - నీలో ఎంతో సౌందర్యం, అలౌకికంగా కనపడుతోంది. వింత సౌందర్యం. మీ అమ్మను 17 సంవత్సరాల వయసులో పెళ్లి రోజున కూడా చూశాను. ఆమె జనానా దాటి ఎప్పుడూ రాలేదు.

నీవు ఏదో విచారంలో ఉన్నట్లు కనపడుతోంది. సాయంసంధ్య వేళ దుఃఖాన్ని నీ జరీ చీర అంచున ముడి వేసుకుని తిరుగుతున్నట్లుంది. మనం పనివాళ్ళలాగ దుఃఖించడానికి లోను కాకూడదు సుమా!' అంటారు. అవును - కోట గుమ్మం దగ్గర గజరాజు ఉన్నాడు. ఫిరంగులూ ఉన్నాయి. నాన్నగారి పర్వతంలాంటి అండ కూడా ఉంది. ఇంక దుఃఖానికి తావెక్కడ?

ఆయన ఇంగ్లీషు దొరలంతా వెళ్ళిపోయారు - స్నేహితులు - అది ఆయనకు విచారం - తాత్కాలికమే. మనం రాథోడ్ వంశం. మొగలులనే ఎదిరించాం. తర్వాత తెల్ల దొరలు. ఇప్పుడు బ్రాహ్మణులు, వైశ్యులు. వీళ్లంతా మనవాళ్ళే. వీళ్ళతో వ్యవహారం అంత కష్టమేమీ కాదు. మనతో పోలిస్తే ఈ ఆటలో వాళ్ళు కొత్తవాళ్ళే! ఏమీ ఇబ్బంది ఉండదు. నాన్నగారికి ఇదంతా చదరంగంలాంటిది! ఆయన ఎవరినీ ఏమీ చేయరు. దానికి తగిన ప్రతిఫలం పొందకుండా.

'రామా! ఇప్పుడిప్పుడే చీకటి పడుతోంది - అదిగో సరస్సు ఆవలి తీరంలో గుడిలో హారతి ఇస్తున్నారు - వచ్చి నా చెంత నిలబడగలవా? అదిగో చూడు కాగడాలు వెలిగిస్తున్నారు. అదిగో ఆలయ సంగీతం వినబడుతోంది. సరస్సులో నీరంతా నిశ్శబ్దంగా ప్రార్థనలో ఉన్నట్లుంది. నీవు నా చెంత నిలబడితే నిన్ను ఒక్క ప్రశ్న అడగాలని ఉంది - "నన్ను వివాహం చేసుకుంటావా?" నాన్నగారు నువ్వు కేవలం బడిపంతులువని కాదనవచ్చు. అమ్మ - ఆమె విలువలు ఉన్నతమైనవి - ఓ బ్రాహ్మణుడా? ఎంత పవిత్రమైన విషయం - అలాంటి వ్యక్తి మన మధ్యలో ఉండటం! కానీ స్త్రీకి తన భర్తను ఎంచుకునే అవకాశం ఎక్కడ ఉంది? ఆ అధికారం మగవారికి ఉంది - వారే ఆడదాని నుదుటి రాత రాస్తారు!

'రామా - చెప్పు - ఒక్కసారి రమ్మని - వచ్చేస్తాను - ఇదిగో - రాత్రి ఎంత పవిత్రంగా ఉంది - రేపు గోకులాష్టమి! కృష్ణుడు జన్మించిన పవిత్రమైన సందర్భం. ఉపవాసం ఉండాలి. పూజలు చేయాలి. నా దేవుడు నీవే కదా! నీకు చెప్పానా? సూరజ్‌పూర్‌లో మా రాజమహలంతా నా కాలి మెట్ల చిరుమువ్వలు మోగుతుంటాయని?

అమ్మతో చెప్పాను - దక్షిణాది బ్రాహ్మణుడు ఆ బహుమతిగా ఇచ్చాడని. అమ్మ ఎంతో సంతోషించింది! 'మనం ఇంత నాజూకుగా చేయించలేము - నీకు పెళ్లయిన తర్వాత ఇవి మరింత అర్థవంతంగా శోభిస్థాయి' అంది!

తురకలు, ఎడారులు దాటి గుర్రాల మీద కేకలు పెడుతూ వచ్చినప్పుడు, బ్రాహ్మణ మంత్రులకు లంచాలు ఇచ్చి, లోబర్చుకొని, కోటల్లో దూరటానికి ప్రయత్నించినప్పుడు, ఆహారం నీరు అందకుండా చేసినప్పుడు, రాజపుత్రులంతా గుర్రాల మీదకు లంఘించి, కత్తులు కటార్లతో వాళ్ళను ఎదిరించినప్పుడు, భార్యలకు, ఆడకూతుళ్లకు వీడ్కోలు చెప్పినప్పుడు, స్త్రీలంతా వారికి రక్త తిలకం దిద్ది పంపినప్పుడు, ఒక్కసారిగా కోటగుమ్మాలు తెరిచి శత్రువును ఎదిరించినప్పుడు, ఆడవారంతా మహాభారతం చదువుతూ మంటల్లో దూకారు. ఏ హిందూ స్త్రీ తురకవాడిని చేసుకోదు. ఇప్పుడు నా పరిస్థితి అలాగే ఉంది రామా! గుమ్మంలో తురకవాడు కనిపిస్తున్నాడు - వచ్చి కాపాడు! నన్ను చితిమీదకు చేర్చు. నీవే ఈ జన్మకు - ఎన్ని జన్మలకైనా నా దేవుడువి సుమా' - *సావిత్రి*

ఆమె పేరు క్రింద తన కంటికి కాటుకతో నల్లని బొట్టు పెట్టింది. ఎర్రని కుంకుమ రాసింది. అరే - ఎంతటి భావనా సౌందర్యం!

అవును - నా కోసం కూడా ఒకరు వేచి ఉన్నాడు. వాడు తురక కాదు - కంటక! నేనిప్పుడు నా వస్త్రాలు మార్చుకోవాలి - గంగానదికి చేరి కంటకాన్ని వెనక్కు పోయి ప్రజలకు ఈ విషయం తెలియజేయమని చెప్పాలి. కపిలవస్తు ప్రజలకు కంటకమే గౌతముణ్ణి గంగా తీరానికి చేర్చిందని తెలియాలి. శాక్యముని సన్యసించాడని ఇక తిరిగి రాడని ప్రజలందరికీ, రాజమందిరానికి తెలియాలి. ఇప్పుడు నేను బోధి వృక్షానికి, నిరంజన నదీతీరానికి వెళ్ళనవసరం లేదు. ఈ కొడైకెనాల్ సరస్సు తీరంలో చాలా వృక్షాలున్నాయి. అవి చాలా పురాతనమైనవి, రక్షణనిచ్చేవి. కానీ - అందుకు నేను ఇంకా సిద్ధంగా లేను. అసలు వంచకుణ్ణి నేనే. సావిత్రి లేఖ ఎంత నిజాయితీగా ఉంది - ఆమె పంచ దళ దీపపు కాంతిలో రాసినంత పవిత్రంగా ఉంది. అందుకు ఎంతో జ్ఞానం, స్వేచ్ఛ, ధైర్యం కావాలి. ఆ సమయం, ఆ సాయంత్రం! పగటికి, రాత్రికి నడుమ సమయం అది. వెలుతురుకి, చీకటికీ మధ్య 'ప్రదేశం' అది. ఒక్క రెప్పపాటు కాలం - బ్రహ్మ క్షణం! 'జ్యోతిర్మయ పరబ్రహ్మం' చిన్నమ్మ ఎప్పుడూ మంత్రించేది. చీకటికి ముందు దీపం వెలిగిస్తూ జ్యోతిర్మయమే బ్రహ్మ.

నువ్వు ఒక్కడివే అయితే వివాహం చేసుకోవచ్చు. నీతో మరొకరు లేనప్పుడు నీవు మరొకరిని పెళ్లి చేసుకోవచ్చు. వివాహం అంటే 00 - కానీ 010 కాదు.

నీ అహం సమసిపోయినప్పుడే వివాహం విజయవంతం అవుతుంది - నా అహాన్ని అణచేదెలా?

'దేవుడా - గురువా?' ఆ రాత్రి ఖాళీలో గట్టిగా అరిచాను. కొడైకెనాల్ ఇళ్లలో దీపాలు సరస్సులో కనబడుతున్నాయి.

ఈ ప్రపంచం - ఈ విశ్వం - ప్రతిబింబమే
లోలోన కనిపించేది - మాయా మోహం -
నిద్రలో - మెలకువలో - కల!
కానీ నీలో చైతన్యంలో - సత్యం -
కాంతిని దర్శించగలవానికే!

సావిత్రికి చాలా రకాలుగా ఉత్తరాలు రాశాను - ఏమని చెప్పాలి - 'దృఢసంకల్పం కలవాడికే ఆత్మ సిద్ధిస్తుంది' అని కదా ఉపనిషద్వాక్యం!

నన్నూ - సావిత్రిని దూరం చేసింది నీరు, నేల కాదు. అది కాలం మాత్రమే. నా అహం మాత్రమే. మార్పు ఆగినప్పుడే, అంతమైనప్పుడే నేను సావిత్రిని చేపట్టగలను! ఈ మార్పు అంతమైతే మా కలయిక ఎలా ఉంటుంది? వివాహానికి పందిరి ఎక్కడ వేయాలి? సీతారాం బాబాయి ఎక్కడుంటాడు - ఏనుగు ఎక్కడుంటుంది?

"వధూవరులందరూ వారణాసిలోనే జన్మిస్తారు - నా ప్రేమా, నా లక్ష్మీ" అని రాశాను - బహుశా ఇది ఆమెకు అర్థం కావచ్చు!

డాక్టరు రూపర్ట్ నా పరీక్షలన్నీ చేసి "బాగుంది - నీవు చాలా మంచి రోగివి - చెప్పినట్లు వినేవాడివి" అని నా వీపు తట్టి ప్రశంసించాడు.

'నీతో కాపురం చేయడం చాలా సులభం - నీవు మంచి భర్తవు కూడా సుమా!' రూపర్ట్ భార్య అంది.

"అవును - నీ భర్త కాకపోతే మిగతావారంతా మంచివారే మరి" అని డాక్టర్ నవ్వేశాడు.

తర్వాత మదురై మీనాక్షిని దర్శించుకున్నాను. ఆమె మీనాక్షి కదా - మీనులవంటి కన్నులు కలది. సర్వాలంకార భూషిత - దయాశీలి - పవిత్రురాలు. మూడు రూపాయలిచ్చి సావిత్రి పేర పూజ చేయించాను. అక్కడి నుంచి హైదరాబాద్

చేరాను. చిన్నమ్మ నేను ఆరోగ్యంగా కనపడేసరికి ఎంతో సంతోషించింది. ఆ తర్వాత కొత్తగా వచ్చిన విద్యాశాఖ మంత్రిని కలిశాను. ఆయన నాన్నగారి శిష్యుడే. ఒక సంవత్సరంలో 'సిద్ధాంత పత్రాలు సమర్పిస్తానని' ఆయనకు మాటిచ్చాను. ఇండియా వచ్చేస్తాను అని కూడా చెప్పాను.

తర్వాత చిన్నమ్మ 'సుకుమారి పెళ్లి సమయానికి వచ్చేయాలి' అంటే సుకుమారి 'అమ్మా - నన్ను కూడా ఎవరికో ముడిపెట్టి బాధ్యత వదిలించుకోవాలనుకుంటున్నావా?' అంది. 'నేను డాక్టర్ కావాలనుకుంటున్నాను - అంతే' అంది.

"శివ పుష్పానికి - శివుని శిరస్సే కైలాసం - ఆడదానికి భర్త పాదాలే స్వర్గం" అని సామెత చెప్పింది.

సామెతలను ఎలా తీసిపారేస్తాం?

ఆ తర్వాత ఓ వారం బొంబాయిలో గడిపాను - అక్కడ ఏదో పని ఉండి కాదు - అప్పుడే ఫ్రాన్స్ వెళ్ళటం ఇష్టంలేక! నాకేవో శకునాలు కనిపిస్తాయి. నక్షత్రాల దారిలో - కొన్నాళ్ళు మెదలీనాకు దూరంగా ఉండాలని - అందరికీ దూరంగా ఉండాలని కూడా- కెప్టెన్ శ్యాంసుందర్ ఇంటికే - కొలాబాలో - వెళ్లాను. ఆయన లండన్‌లో పరిచయమే - మీరు బొంబాయి వచ్చినప్పుడు మా ఇంట్లోనే ఉండాలని మాట తీసుకున్నాడు. ఆ ఇంటి బాల్కనీ నుంచి సముద్రం కనబడుతూనే ఉంది. ఆయనకు ఇద్దరు తెలివైన సంతానం, ఒక అందమైన భార్యా ఉన్నారు. ఆమె పేరు లక్ష్మి. కాస్త బొద్దుగా కలుపుగోలుగా నవ్వుతూ ఉంటుంది. ఆమె నవ్వులో ఎక్కడో కాస్త విషాదం కూడా దాగింది. కెప్టెన్ గారికి చాలా వ్యవహారాలు, అలవాట్లున్నాయి. ప్రతి రాత్రీ చాలా ఆలస్యంగా ఇంటికి వచ్చేవాడు - మిలటరీ క్లబ్ - స్నేహితులు! ఒకసారి నాతో అన్నాడు - 'నేను లండన్ నుంచి తిరిగి వచ్చినప్పటి నుంచి తెల్లతోలంటే ఇష్టపడుతున్నాను' - అంటూ నవ్వేశాడు! ఆహా - ఎంత తెలివిగా చెప్పాడు! నేను పిల్లల్ని, తల్లిని తీసుకొని వెళ్ళి ఇండియా గేటు, మలబార్‌హిల్స్ చూపించాను. లక్ష్మి విచారం చాలా బరువైంది. పట్టుచీర తడిపి కాళ్ల కింద తొక్కినట్లు, తర్వాత ఏ మూలో మరచిపోయినట్లుంది ఆమె పరిస్థితి. మంచి హిందూ ఇల్లాలు. మగవారంటే అసహ్యించుకుంటోంది. నన్ను మాత్రం మరో విధంగా ఎందుకు చూడాల్సిన కారణం లేదు- "మీకు కూడా తెల్లతోలే ఇష్టమనుకుంటా - మా ఆయనలాగా?" 'అందుకే ఫ్రెంచ్ అమ్మాయిని చేసుకున్నారు?'

చక్కగా వంట చేసేది. సినిమాలకు తీసుకెళ్ళమని అడిగేది. ఒకటి రెండుసార్లు నాకు దగ్గరగా వచ్చింది. నేను దూరంగా జరిగిపోయాను. దానికి కారణం ఆమె స్థూలకాయం. ఆమె ఎంతటివాడినైనా మగసిరి దోచేసి, తర్వాత వాణ్ణి సముద్రంలోకి

తోసివేయగలదనిపించింది. తర్వాత మంత్రాలు కూడా వల్లించవచ్చు - అదీ ఆమె భౌతిక శక్తి.

కానీ నేను నా ప్రయాణాలతో, సమస్యలతో దారీ-తెన్నూ, అంతూ - పొంతూ లేని రోడ్లతో, హోటల్ గదులతో, విమానాలతో, చెల్లి పెళ్ళితో, ఎక్స్‌రేలతో అన్నింటితో అలసిపోయాను. అంతేకాదు - నాకు నిజానికి భారత స్త్రీ స్పర్శే తెలియదు.

నా ఎర్ర రక్తకణాల గోల కూడా పడలేకపోతున్నాను. ఇక నా మగతనం ఎడారిపాలు కాకూడదనుకున్నాను.

ఎలాగో సావిత్రి లేదు - మెల్లగా, ధైర్యంగా లక్ష్మీ పక్కలో చేరాను. ఆమె నాతో చాలా ఆనందంగా ఉంది - పిల్లలు కూడా సంతోషంగా ఉన్నారు. వాళ్ళ అమ్మ సంతోషంగా ఉందని - పెద్దగా జరిగిందేమీ లేదు. నేను అందరిలాంటివాడిననే ఆమె ఆశించింది. సావిత్రి గురించి చెప్పమంది - అంతకంటే సంతోషమైన సంగతి ఏముంది? ఇంకెవ్వరితో చెప్పుకోలేని విషయం కదా - అది విన్న తర్వాత ఆమె నన్ను పూర్తిగా ఆక్రమించింది. "మగవాళ్లంతా పనికిరానివారే, వాళ్ళు చిన్నపిల్లలకంటే బలహీనులు".

"వాళ్ళకి ఎలాంటి వెచ్చని మాంసం అయినా చాలు - తెలుపు రంగయితే మరీ ఇష్టపడతారు" అని అనేది.

సావిత్రి పెళ్లి పుకార్లు నాదాకా వచ్చాయి. ఢిల్లీ, బొంబాయి రూటు బాగా రద్దీగా ఉంటుంది. ప్రయాణాలు - ఎవరో తెలిసినవాళ్ళు - తెలిసింది చెప్పేవాళ్ళు - సూరజ్‌పూర్ సంస్థానంలో రాజకుమారి వివాహం రహస్యంగా జరగదు కదా! కెప్టెన్ శ్యాంసుందర్ ఆ వార్త మోసుకొచ్చాడు. లక్ష్మి - నీ ప్రేమాగ్ని - వెలిగిపోతోంది సుమా - అనేది. ఆ తర్వాత ఆ వార్త దినపత్రికలలో కూడా కనిపించింది. చివరిసారిగా సావిత్రి తనే ఒక ప్రకటనలాంటి వార్త విడుదల చేసింది.

"సూరజ్‌పూర్ ప్యాలెస్ - ఈ సాయంత్రం 4.47 కి వివాహం జరుగుతోంది. నేను ప్రతాప్‌ను పెళ్లాడుతున్నాను. మీ ఆశీర్వాదాలు ఇవ్వండి - నేను మంచి భార్యగా ఉంటాను."

దీని తర్వాత లక్ష్మీ పూర్తిగా నాకు స్వాధీనమైపోయింది. నేను ఏదో ఊరగాయతో భోజనం చేసినట్లు. త్వరగా పగలు - రాత్రులు ఎంతో సంతోషంగా గడిచిపోయాయి. మరో వారం రోజులు ప్రయాణం వాయిదా వేశాను.

కెప్టెన్ సుందర్ కూడా సంతోషంగా ఉన్నాడు. బహుశా ఏం జరుగుతుందో తెలిసే ఉంటుంది. లక్ష్మిలో కొత్త కళ వచ్చింది. ఇప్పుడు సంతృప్తితో మెరిసిపోతుంది. నేను ఎప్పుడైనా కాస్త దగ్గితే ఎంతో సేవ చేసేది. విసనకర్రతో విసురుతూ, మృదువుగా మసాజ్ చేస్తూ, శ్రద్ధగా కాళ్ళు - చేతులు నొక్కేది.

నేనంటే ఆమెకు గౌరవ భావం కలిగింది. నేను సాధారణ ముక్కుసూటి మనిషిగా కనిపించాను. ఆమెకు కెప్టెన్ స్నేహితులంటే ఏమాత్రం గౌరవం లేదు. 'వాళ్లను నా ఎడం కాలితో కూడా ముట్టుకోను' అనేది. వాళ్ళూ, వాళ్ళ మీసాలు, మోటు మొహాలు అని చీదరించేది.

మహాభారతం - గీత చదవటం మొదలు పెట్టింది. ఏమైనా సందేహాలుంటే అడిగేది. 'ఎప్పుడైనా నిన్ను చూడటానికి యూరోప్ వస్తాను' అనేది. తన పిల్లల చదువుల గురించి సలహా అడిగేది.

ఆమె పక్కనే పడుకుని నేను ఆశ్చర్యపోయేవాడిని! నేనెవర్ని?

'రామా? సరోజ సోదరుడు? చిన్నమ్మ మారుతి కొడుకు?'

ఒక రోజున నాకు గుర్తొచ్చింది - కపిలవస్తు రాజమహళ్ళలో అందగత్తెలంతా నగ్నంగా పడుకొని ఉండటం -

'అక్కడ వేసవి విడుదులు - వెండితో నిండి ఉంటాయి -

'శీతాకాలంలో మంచి గంధంతో నింపి ఉంటాయి -

వసంత కాలంలో బంగారంతో మెరుస్తుంటాయి -

సంగీతకారులు కూడా అన్ని రకాలవాళ్ళుంటారు - వాళ్లలో మధ్యలో బోధిసత్త్వుడు ఉన్నప్పుడు - శుద్ధోధన మహారాజు గౌతముణ్ణి - ఈ రాజమహళ్ళు దాటి వెళ్ళనివ్వను - ప్రపంచంలోని దుఃఖాన్ని, వృద్ధాప్యాన్ని - రోగాన్ని చూడనివ్వను అని - కాపలా ఎక్కువ చేస్తాడు. రాజమహళ్ళన్నీ అందగత్తెలతో నింపివేస్తాడు. ఇవన్నీ గౌతముని కట్టిపడేశాయా?

నేను రహస్యంగానే విమానంలో నా ప్రయాణం ఏర్పాటు చేసుకున్నాను. ఇప్పటికే నేను బరువుగా తయారయ్యాను కదా!

రేపు రాత్రి వెళ్తాననగా లక్ష్మికి చెప్పాను. ఆమె చాలా గొడవ చేసింది. నన్ను షండుడా అని తిట్టింది. 'పిరికిపందా' అని కూడా. కొడుతుందేమో అనుకున్నాను. కానీ చాలా అందంగా ఉంది సుమా! నా కౌగిట్లోకి తీసుకుని శాంతపరిచాను.

గేట్‌వే ఆఫ్ ఇండియా - ముంబై

"నన్ను వదలి పోకు - నేను ఏమైపోవాలి?" అని ఏడ్చింది. 'మళ్ళీ వస్తావు కదా' అని అడిగింది. నేను ఆమెను ఆక్రమించగానే ఆవేశంలో తన విచారం మరిచిపోయింది. 'నీకు ఎప్పటికీ అభినందనలే' అని నవ్వింది. నా తల ఆమె గుండెల్లో దాచుకుంది. "నువ్వు నాకు ఎంతో గౌరవాన్నిచ్చావు - నేను ఇప్పుడు నీ అవసరానికి వస్తాను - నిన్ను ఆనందంగా ఉంచితే సుందర్ కూడా హర్షిస్తాడు - నువ్వు సుందర్‌కి మంచి స్నేహితుడవు కదా' అని గునిసింది.

నన్ను శాంతాక్రూజ్‌లో లక్ష్మీ వచ్చి వీడ్కోలు చెప్పింది. వింతగా ఉంది కదూ?

అయిదవ అధ్యాయం:

కాతరీన్

ఏటవాలు తోట - ఎరుపు, తెలుపు రాళ్లతో, పచ్చికతో ఉంటుంది. ఊరికి కాస్త దూరంగా, ఇంతకు పూర్వం ఉన్న విల్లా ఆన్ కంటే కాస్త చిన్నదిగా - అంచలంచలుగా ఉన్న ఆలివ్ చెట్లు - ఓ చిన్న వికెట్ గేటు - ఆ ఇంటిలో ఎవ్వరూ లేనట్లుగా - ఒంటరిగా అనిపిస్తుంది-

చాలా దూరంగా ఆల్పిలే కొండలు - ఇంకా దూరంగా కామర్గి పైగా సూర్యోదయం కనిపిస్తుంటుంది. ఇక్కడకు మారటం మెదలీనా నిర్ణయమే - ఆమె జీవితానికి సంబంధించిన ముఖ్యమైన నిర్ణయంలా, 'ఇక నేను ఇండియా వచ్చే అవకాశం లేదు' అని రాసింది - నేను ఎందుకనీ అడగలేదు!

పెదవి దాటని మాటలు - వినిపించే శబ్దాలకంటే సత్యమైనవి! 'మౌన వాక్య ప్రకటిత పరబ్రహ్మ తత్త్వం' అని శంకరాచార్య ఉవాచ.

మెదలీనా ఈ కొత్త ఇంటికి మారింది! 'ఇక ఆనీవిల్లాలో ఉండలేను' అని రాసింది. ఈ కొత్త ఇంటిని - 'రోచీవిల్లా' అని పిలుస్తోంది.

నేను ఇండియా నుంచి తిరిగి వచ్చిన రోజు చాలా విచారకరమైన రోజు - నాకు బాగా గుర్తు - అది 17 అక్టోబర్. ఆరోజు సముద్రంలో Raz-de-marie ఎగసి - కాసిన్ బీచ్‌లో ఉన్న గుర్రం మీద వెళ్తున్న రైతుని ఇద్దరి సోదరుల్ని లాక్కుని పోయింది!

నేను ఎగురుతున్న విమానం మూడు గంటలు ఆలస్యం - మధ్యధరా గాలులతో - చేరే సమయానికి - 'హారీ' విమానాశ్రయంలో లేడు - అరె! జీవితం అన్నిచోట్ల ఇంత వింతగా మారిపోయిందే! మార్సెకి బస్సులో వెళ్లాను. అక్కడ నుంచి ఆక్స్‌కి టాక్సీ తీసుకున్నాను.

ఈ మధ్యాహ్నం, చల్లని ఎండ ఏదో ప్రార్థనలాగా ఉంది. స్పష్టంగా! కొండలు బంగారు రంగులద్దుకుంటున్నాయి - పండుతున్న ఆకులతో.

ఇల్లు చేరే సమయానికి - మెదూ ఉత్తరం రాస్తుంది. చాలా ప్రశాంతంగా ఉన్నట్లు కనిపించింది. నిండుగా - స్వచ్ఛంగా. అవును! చాలా లావయింది! నా సామాను ఆమె మెట్ల మీద నుంచి ఇంట్లోకి తీసుకువెళ్లి - నా గదిలోకి దారితీసింది!

నా పుస్తకాలన్నీ శ్రద్ధగా సర్ది ఉన్నాయి. నేను రాసుకునే బల్ల కిటికీకి దగ్గరగా పెట్టింది. గదిలో గంధపు పొగ వాసన వస్తోంది. నేను పడుకునే దివాన్ పైన గోడకు అమ్మ ఫోటో వ్రేలాడదీసి ఉంది.

'త్వరగా స్నానం చెయ్యి రామా, ఒక్కసారే భోజనం చేద్దువు గాని' ఆమె స్వరం స్పష్టంగా, వింతగా వినిపిస్తోంది.

నేను త్వరగా సామాన్లన్నీ సర్దుకున్నాను. వెంటనే స్నానాల గదిలోకి వెళ్లాను. 'ఈ గీజర్ సరిగా లేదు' అని నీళ్లు వదిలింది. 'నువ్వు గ్యాస్ కట్ చేయడం మర్చిపోకు - లేకపోతే బయటకు పొక్కుంటూ పోవాలి - ఒకసారి నాకు అలాగే జరిగింది - ప్లంబర్‌ని పిలిచి సరిచేయిద్దాం' అని అంటూ వంటింట్లోకి వెళ్ళిపోయింది.

నాకు ఆలోచించడానికి కూడా ఓపిక లేదు. బాత్ టబ్‌లోకి, వెచ్చని నీళ్ళలోకి జారుకున్నాను. స్నానం పవిత్రమైనది. మనకు పునర్జన్మనిస్తుంది. సాయంత్రం చల్లగా ఉంది. నాలో ఉత్సాహం తిరిగి వచ్చింది. శ్వాస తేలికగా ఉంది. నేను 'ఇంటికి' వచ్చేశాను.

ఈ ఇంటిలో భోజనాల గది ఉంది - కింది అంతస్తులో - ఇంటి తోటవైపు కిటికీకి దగ్గరగా - పక్షుల కిలకిలలు - కీచురాళ్ళ గీలు వినపడుతున్నాయి - వంటింట్లో నుంచి అన్నపు వాసన (ఎసరు) వస్తోంది. టమాటాల వాసనతో కలిపి వస్తోంది. బహుశా ఫ్రైడ్‌రైస్ చేస్తోంది. మసాలా పొడి వేసినట్లు ఉంది.

'నీకు మసాలా దినుసులంటే చాలా ఇష్టం కదా - నిజానికి నీకు ఎలా వండి పెట్టాలో ఎప్పటికి నేర్చుకోలేనేమో' అంది.

భోజనాల బల్ల మీదకి ఆహారం తెచ్చింది. ఎప్పుడూ ఉన్నవే! 'సాస్ పాన్'తో కాలిన చెక్క హ్యాండిల్‌తో! అన్నీ మేము వాడే గరిటెలూ, ఫోర్కులు - అవే ముక్కోణపు 'మసిగుడ్డ' - బల్ల మీద ఒకే పళ్లెము - ఉండటం గమనించాను. లేచి మరో పళ్లెం తెచ్చాను. 'రామా! నేను తినకపోతే ఏమీ అనుకోకు - ఇది శుక్లపక్షం - ఎనిమిదో రోజు - ఈ రోజు ఉపవాసం!' నేను మంచి బుద్ధిస్ట్‌గా మారుతున్నాను' అంది ప్రశాంతంగా!

'అవును - నువ్వు చాలా దూరం ప్రయాణం చేశావు - బాగా ఆకలిగా ఉండి ఉంటావు - రామా - వడ్డించుకుని శుభ్రంగా భోజనం చేయి - నేను అలా పోస్టాఫీస్ వరకు వెళ్లి ఉత్తరాలు తెచ్చుకుంటాను - 'జోబి' రాస్తానని చెప్పింది' మెదూ తన గదికి వెళ్లి తర్వాత మెట్లు దిగి - తోటలోకి - అటు గేటు దాటి వెళ్లిపోయింది.

నేను చల్లని - విశాల సాయంత్రంలో మిగిలిపోయాను - నా పైన నక్షత్రాల గుంపులు చేరాయి. ఆపిల్ ఆకులు సముద్రపు గాలికి ఊపిరిపోసుకుంటున్నాయి.

ఇంటి ముందున్న సైప్రస్ పెద్దగా - అండగా కాపలా కాస్తున్నట్లుంది - పక్షుల కిలకిలతో సాయంత్రం నిండిపోయింది. గొర్రెలు ఇళ్లకు చేరుతున్నాయి. పిల్లలు అరుస్తున్నారు.

దూరంగా కొండలకవతల నిశ్శబ్దం నిద్రపోతోంది.

నేను తిండి మీద శ్రద్ధ పెట్టాను - అవును తినాలి! ఆహారం తినడానికే.

'ఓమ్ అదరూ, ఓమ్ పిబమా, ఓమ్ దేవో వరుణా: ప్రజాపతీ, సావిహన్నం, ఇహరత్, అన్నపతే, అన్నా ఇహర, ఆహారా, ఓమ్ ఇతః అని కదా చాందోగ్య ఉపనిషద్వాచకం!

కానీ మన ఊపిరితిత్తులు తిక్కగా పనిచేస్తాయి. నాకు ఒక్కసారిగా శ్వాస కరువైంది - ఒక్కసారి ఆగాను - ఇదేమీ విపరీతం కాదు - నేను సామాన్యమైన రామస్వామిని - మెదలీనా - భర్తను - ఆమె చరిత్ర బోధిస్తుంది. వీటిల్లో ఏదీ వింత కాదు - ఇండియా నుంచి ఇంటికి వచ్చాను! ఇందులో - ఈ భూమికి, ఈ గాలికి, ఈ ఆలివ్ ఆకులకు ఇంకా పైన నక్షత్రాల గుంపులన్నీ ఏమీ వింత కాదు - నేను ఇండియా నుంచి, లండన్ నుంచో, పారిస్ నుంచో కాదు - ఇండియా నుంచి వచ్చాను.

అవును, నిజానికి, కాలం గడియారం ముల్లులో - నీవు లెక్కపెట్టుకునే రోజుల్లో ఉంటుంది - వంటింట్లో క్యాలెండర్‌లో కూడా మార్చి, ఏప్రిల్ - వగైరా.. అక్టోబరు! 'ఊపిరితిత్తులు' బలహీనంగా ఉన్నాయి. అందుకే ఇన్నాళ్ళూ ఇండియాలో ఉండిపోయాను. కానీ మెదలీనా - మెదలీనాయే కదా? మార్పు ఏముంటుంది!

మెదలీనా వచ్చింది - అరే, చీజ్ మర్చిపోలేదు కదా! నీ కోసం ప్రత్యేకంగా ఉంచాను. అరే, నువ్వు శక్తి పుంజుకోవాలి' అని చిన్నపిల్లలా గలగలామంది. 'ఇవిగో - ఈ బాదం - వాల్‌నట్లు కూడా' అని నా ముందు పెట్టింది.

'ఇప్పుడు నిన్ను శ్రద్ధగా చూడనీ' అని 'నువ్వు కొడైకెనాల్‌లో ఉన్నావు కదా - కాస్త రంగు వచ్చావు' అంది.

నేను ఎక్స్‌రేలు - రక్తపరీక్షలు గురించి చెప్పాను - పైకి వెళ్లి మందులు తెచ్చింది.

'ఇవాళ - మనం 'ఏనుగు' దగ్గరకు వెళ్ళటం లేదు - ఇప్పటికే చల్లగా ఉంది - నా గదికి వెళదాం' అంది.

ఆమె గది - నా గదికంటే కాస్త చిన్నది - గదిలో నుంచి తోట కనబడుతోంది. సైప్రస్ కొమ్మలు - కిటికీలో నుంచి తొంగి చూస్తున్నాయి. నక్షత్రాలను లెక్కపెట్టవచ్చు.

ఈ ఇంటికి 'సెంట్రల్ హీటింగ్' లేదు - కానీ ఈ చలిగూడు చూడు ఎంత పెద్దదో - మనం ఆదా చేయవచ్చు - పైగా నువ్వు ఈ సంవత్సరం - ఎక్కువగా

లండన్, ప్యారిస్‌లో ఉంటావు కదా - నీ రిసెర్చ్ పని మీద, నాకిది సరిపోతుంది!' చెప్పుకుంటూ పోతోంది.

ఆమె గదిని పరీక్షగా చూశాను - గోడలు పసుపు - గ్రే రంగులో ఉన్నాయి. ఆమె మంచం ప్రక్కన, బల్ల మీద పెద్ద బుద్ధవిగ్రహం, తల ఉంది. 'ఇది ఎలా ఉంది - చాలా అందంగా లేదూ?' గోడల మీద ఇంకా బుద్ధుని చిత్రాలున్నాయి. 'హడ్డా' నుంచి తెప్పించిన 'గోకా - బుద్ధ' చాలా బాగుంది. 'టనకా' కూడా ఉంది - 'ఉగ్ర'మూర్తులు - సింహాల మాదిరి - ధ్యాన బుద్ధుడు - ప్రకాశవంతంగా (నింబస్) పద్మాలు - బోధిసత్త్వుడు ధ్యానంలో కూర్చుని - జ్ఞాన ప్రకాశంగా!! ఇది పారిస్ నుంచి - చార్లీ మామ తెచ్చాడు. 'నేను ఇప్పుడు ధ్యానం చేసి - ఇక్కడ నిద్రపోతాను. నీ గది నీకు నచ్చింది కదా - నీవు బాగా పని చేసుకోవడానికి అనుకూలంగా ఉంటుంది.'

సరోజ పెళ్లి, వివాహ వేడుకలు, చుట్టాలు, స్నేహితులు - హైదరాబాద్ - నా ఉద్యోగం - అన్నీ మాట్లాడుకున్నాం. 'నీకు ఈ చలి దేశం పడదు - నీ ఉద్యోగం నీ కోసం సిద్ధంగా ఉంది - మీ దేశంలో - ఇక్కడ పని పూర్తి చేయడానికి నేను సహాయం చేస్తాను - అందరికీ దూరంగా - ఈ ఇంటిలో ప్రశాంతంగా పని చేసుకోవచ్చు'.

క్యాథరిన్ గురించి అడిగాను - 'ఆమె గులాబీలా - గొప్పగా ఉంది - ఆమెను చూస్తే ఆనందంగా ఉండటం సంభవమే అనిపిస్తుంది. జార్జి ఆమెను పూజిస్తున్నాడు. పువ్వుల్లో పెట్టి చూసుకుంటున్నాడు. చార్లీ మామ వాళ్ళకి చిన్న 'మారిస్' కొనిచ్చాడు.

'ఇప్పుడు మనకు కారు లేకపోవటమే మంచిది - అయినా అవసరం ఏముంది - నీవు వెళ్లి పడుకో'.

నేను నా గదిలోకి వచ్చి అమ్మను చూశాను. బిగ్గరగా వెక్కివెక్కి ఏడవాలనిపించింది. కానీ కన్నీళ్లు తుడుచుకున్నాను. మెదూ వేడినీళ్ల సీసా తెచ్చిపెట్టింది - నా గది వెచ్చగా ఉండటానికి - హీటరు వేసి ఉంచింది - నేను చదువుకోటానికి బల్లమీద దీపం పెట్టింది - నాకు అవసరమైన పుస్తకాలన్నీ పేర్చింది - అందులో నాకు పనికివచ్చే పుటలు గుర్తులు పెట్టింది - వచ్చి నా పాదాల చెంత కూర్చుంది - దుప్పటి అంచుల్తో ఆడుకుంటూ -

ఇప్పుడు చైనా భాష, టిబెట్ అక్షరాలు, నేర్చుకుంటున్నా - టిబెట్ భాష సంస్కృతంలాగానే ఉంది - కానీ చైనీస్ కష్టం - 'చైనీస్ బుద్ధిజమ్' ఎక్కువగా తెలుసుకోవాలి అనుకుంటున్నాను - నిజానికి పాలీలో బౌద్ధ గ్రంథాలు లేవు - ముసల్మానులు నలందా విక్రమశిలలో నాశనం చేశారు -

బౌద్ధంలోని మేథోపరమైన వికాసానికి ప్రపంచంలోనే సాటి వచ్చేది లేదు - బౌద్ధం - ఆధునిక మతం - బౌద్ధ గ్రంథాలను నవలలులా చదవ వచ్చుని అంతగా తెలుసుకోవాలనే జిజ్ఞాస ఆ గ్రంథాలలో ఉంటుంది - అంతా హేతుబద్ధంగా ఉంటుంది - ఐరోపా వాళ్ళకి సత్యం - హేతుబద్ధంగా ఉంటేనే వింటారు - విశ్వసిస్తారు. డాక్టర్ రాబిన్ బాసినాక్ చెప్పినట్లు - మనం 'దేవుణ్ణి' అంగీకరించలేక పోతున్నాం - అందుకే మేరీమాతను సృష్టించుకున్నాం - ఆమెను కన్యను చేశాం - అప్పుడు ఆమె బిడ్డను అంగీకరించాం - కానీ బుద్ధుని జన్మ ఎంత సాధారణమైనది - సహజమైనది!

మాయా దేవి తొమ్మిది నెలలు మోసి, తన కన్నవారింటికి కాన్పు కోసం వెళుతుంటే - నొప్పులు వస్తాయి - అప్పుడు ఆగి - పూతతో ఉన్న మామిడి చెట్టు కొమ్మను పట్టుకొని - బుద్ధునికి జన్మనిచ్చింది - సాధారణంగా అందరిలాగానే - సాధారణ భౌతిక విధానంలోనే.

సాధారణంగా అంటే - సంపూర్ణంగా అని! నేను నా చేతిలో ఉన్న దంతపు కత్తితో - పుస్తకాలతో వింటున్నాను - మెదలీనా ఆపింది - 'అవిగో - నీ పత్రికలు - నేను ఉదయాన్నే లేచి - ధ్యానం చేస్తాను - బౌద్ధ మంత్రాలు ఎంతో ప్రశాంతతను ఇస్తాయి - అన్నీ రేపు చెప్తాను' - అని మెల్లగా నా పక్కలో సర్దుకుంది - ఆమె బంగారు కురులు సవరించాను - అవును - అవి అలాగే ఉన్నాయి - అవి నావే - కానీ ఉడుకు లాన్ పరిమళం లేదు - ముఖానికి పౌడర్ అద్ద లేదు - ఆమె సిద్ధంగా లేదు - నాకు చాలా నిరాశ కలిగింది - ప్రక్కకి జరిగాను - వేడి నీళ్ళ సీసా ఉంది - 'రామా - బాగా నిద్రపో - విచారం బుద్ధిపరమైనది' అంటుంది బౌద్ధం - విచారించకు - 'Mon ami'.

నేను దంతపు కత్తితో ఆడుకున్నాను - కిటికీ దగ్గరకు వెళ్లి గుండెల నిండా గాలి పీల్చాను - వచ్చి పడుకున్నాను - ఆ రాత్రి అన్ని కలల్లో చిన్నమ్మ ఉంది - చిన్న కుక్కపిల్లతో బెంగళూరులో ఆడుకుంటుంది.

నిద్రలో వర్షం - మట్టి వాసన వచ్చింది - నన్ను మంచం మీద పడుకోబెట్టి - బ్రాంది ఇచ్చారు - తర్వాత లావుపాటి కోపిష్టి డాక్టర్ వచ్చి సూది గుచ్చాడు. ఎక్స్‌రేలో ఏదో రాసి ఉంది - చైనీస్‌లో అనుకుంటా - జార్జి బల్లమీద కూర్చున్నాడు - విద్యార్థులకు 'ప్రాస్పెరో' బోధిస్తున్నాడు. అందరూ నవ్వుతున్నారు. వాళ్లంతా ఇండియన్లు - వాళ్ళందరూ నల్లద్దాలు - రంగుటద్దాలు పెట్టుకున్నారు - వాళ్ళ దగ్గర ఏదో కంపు కొడుతోంది - వాళ్లంతా రాజకుమారుల సంతానంలాగా ఉన్నారు-

ఉదయం మెలకువ రావడంతో - నాకు మంత్రాలు వినవస్తున్నాయి - ఓమ్ ధీం - ఓమ్ గీం - ఓమ్ క్రీం - అరే! నేను హరిద్వార్‌లో ఉన్నానా - నా ప్రక్కనే గంగ ప్రవహిస్తోందా?

జీవించడం ఎంత అద్భుతం! ఎంత పవిత్రం - అదీ భారత్‌లో - భారతీయుడిగా-

తర్వాత కొన్ని నెలలు ప్రశాంతంగా గడిచిపోయాయి - మెదూ నా పరిశోధనా పత్రాలు విషయంలో ఎంతో సహాయం చేసింది - నేను పరిశోధించేది - నిరూపించ తలచింది - మానవ పరిణామ క్రమంలో నాగరికత - అది 'ప్యూరిస్ట్' లేక ప్రొటెస్టెంట్ - కాని బౌద్ధం లేక జైనంగాని, ఇవన్నీ స్వీయ నాశనానికే దారితీస్తాయి - 'అభుమన్' నాగరకత - సోక్రటీస్, ఉపనిషత్తులు (శంకరాచార్యుల) కాథలిసిజమ్ (క్రిస్టియానిటీ కాదు) స్టాలినిజమ్ (లెనినిజమ్ కాదు) ఇవన్నీ శాశ్వతత్వంగల సిద్ధాంతాలు - అవి వర్తమాన చట్టాలకు పట్టం కట్టేవి - మనిషి ఒంటరివాడు - అతని ఏకాంతం - లేక ఒంటరితనంలోనే సర్వం నిబిడీకృతమై ఉంది - 'పూర్ణమిదం - పూర్ణమ్ స్వాహ' నాగరికత పని వంతెనలు కట్టటం - రాళ్లతో - ఇనుముతో కాదు - దానివలన శాశ్వతత్వం ఆపాదించబడుతుంది - హరిద్వార్, హృషికేశ్‌లో ఉన్న తాళ్ళు - ఊయల - వంతెనలు అవి పచ్చని తీరాలని - పరుగులెత్తే ప్రవాహాల్ని కలపాలి - పర్వతాలను నీ శ్వాసలో తెలుసుకోవాలి - చివరికి నీవు ఒంటరితనం నిశ్శబ్దంలో అవగాహనకు రావాలి - మరణం - మృత్యువు నీకు మిత్రుడని తెలిసి వస్తుంది - జన్మ తర్వాత జన్మలో అది మన ముందే ఉంటుంది - దాని అర్థం - అంతమని - ఉండటమంటే ఒప్పుకోవడమే - నైతిక ప్రపంచం - మిమ్మల్ని శాసిస్తుంది - న్యూటన్ లా ప్రకారమో - పాస్కల్ సిద్ధాంతం ప్రకారమో! అది భౌతిక ప్రపంచపు అస్తిత్వాన్ని తెలియజేస్తుంది - ఉపనిషత్తులలోని కథానాయకుడు ధీరుడు - అంతర్ముఖుడై తనని తాను తెలుసుకుంటాడు - తనిక్కడే ఉన్నాడని - ఎక్కడికీ వెళ్లలేదని - వెళ్లేందుకు ఏమీ లేదని! ఎక్కడా ఏమీ లేని 'సర్వం మిథ్య' అని - ఈ అందమైన సత్యాన్ని నీవు గుర్తించాలి - అప్పుడే నీకు నీవు తెలుస్తావు - 'ఎరుక' కలుగుతుంది!

ఆ విధంగా 'హిర్సే' సత్యాన్ని నిరూపిస్తుంది - బౌద్ధం వేదాంతాన్ని, కాథర్లు - క్రిస్టియానిటీని నిరూపించినట్లు!

మనదంతా - అగమ్యమైన కలయిక - మనం చిహ్నాలతో మాట్లాడుకుంటాం - మనం నిరూపించదలచిన విషయాన్ని చెప్పేందుకు - ఈ చర్చల్లో ఒక్కోసారి ఎంతో ఆగ్రహం వ్యక్తమవుతుంది - నాకు లాటిన్ రాదు - ఈ విషయంలో మెదలీనా

నాకంటే పై స్థాయిలో ఉంటుంది - నీడకు, ఛాయకు ఎవరు ఏ భాషలో చెప్పినా భాష్యం ఒక్కటే కదా - మెదలీనా ఇదే విషయాన్ని లాటిన్‌లో చెప్పడానికి ప్రయత్నిస్తుంది - మాకు లిజో ఎప్పుడూ అందుబాటులో ఉంటాడు - సందర్భాలను విడమరిచి చెప్పడానికి - ఎప్పుడూ మెదలీనాకే అతను వత్తాసు పలుకుతాడు.

ఒక్కోసారి మెదూ తన సహనాన్ని కోల్పోయి - 'నీకు అధ్యయనం చేయటం మీ విశ్వవిద్యాలయాలు నేర్పలేదు - ఇక్కడ ఇదే విషయాన్ని తొమ్మిదో తరగతి విద్యార్థి కూడా అర్థం చేసుకోగలడు' అంటుంది.

'అరే - ఇంగ్లీషు, ఫ్రెంచి భాషలు నాకు మాతృక కావు కదా' అంటే - అలాంటప్పుడు - ఈ సిద్ధాంత విషయమంతా ఫ్రెంచిలో ఉంది - నీవు మొదలుపెట్టకుండా ఉండవలసింది' అంది.

'మరి నీవు 'ప్రజ్ఞా పారమిత' సిద్ధాంతాన్ని ఎలా రాస్తున్నావు' అని ఎదురు చెప్పాను-

'నేను సిద్ధాంతాలన్నీ రాయటంలేదు - బౌద్ధాన్ని అధ్యయనం చేస్తున్నాను - నా ఆధ్యాత్మిక ఆనందం కోసం' అంది.

'అలాగే - నేను 'కాథలిసిజమ్'ను మెట్ట వేదాంతాన్ని నిరూపించడానికి వాడుకుంటున్నాను' అని ముగించాను.

ఇలాంటి చర్చలకన్నింటికీ సాయంత్రం వ్యాహ్యాళికి వెళ్ళటం ఒక్కటే మార్గం - మా కోసం క్రింద లిజో వేచి ఉంటాడు.

ఒక్కోసారి మెదూ వంట పనిలో ఉండిపోయి - 'మీరు వెళ్ళండి' అంటుంది - 'నేను వంట పూర్తి చేస్తాను' అని కూడా. మేము అలా తిరిగి వచ్చేవాళ్ళం - లిజోకి మా వాదోపవాదాలు సరదాగా ఉండేవి - అతని భాషాపరిజ్ఞానం మా వివాదాలకు ఏమీ దారి చూపేది కాదు - పైగా ఎటూ తేలని స్థితి వచ్చేది - మాకు కావాల్సింది కూడా అదే - భోజనం తర్వాత నేను మళ్ళీ మతగ్రంథాలు ముందేసుకుని కూర్చునేవాడిని - అందులో చర్చి ఫాదర్‌లు హైమన్లు పాడేవాళ్లను సజీవంగా దహనం చేయడం చదివాను - వాళ్లు చర్చిని ఎంతగా ప్రేమించినా - అది అన్యాయం కదా!

మెదూ 'ప్రజ్ఞా పారమిత' అధ్యయనంలో ఉండేది. ఆమెకు ఎప్పుడూ సందేహాలే - పాలీ, సంస్కృతం, చైనా భాష - ఇవన్నీ లిజోకి బాగా వచ్చు - అయినా నేను అతణ్ణి ఉడికించేవాణ్ణి - 'లక్ష్మణ భట్టూ' అని పేరు పెట్టి - అది అతనికి ఇష్టం కూడా - ఎందుకంటే భారతీయ గ్రంథాలలో 'భట్టు'లు ఎక్కువమంది లేరు - 'మా బ్రాహ్మణ వీధుల్లో భట్టులకు కొదవలేదు - వారణాసిలో అందరూ భట్టులే - నీవు విచారించకు' అనేవాణ్ణి లిజోతో.

లక్ష్మణ్ - ఝూలా గంగానది - రిషికేశ్

'వారణాసి? సారనాథ్ పక్కనే కదా - శాక్యముని 'ధర్మ చక్రా'న్ని అక్కడే కదా ఆవిష్కరించాడు - 'ఫోచర్' చక్రం అంటే - వీల్ అని అన్నాడు - కానీ సంస్కృతంలో 'చక్రం' అంటే 'ఆధారం' అని - 'భవం' అనీ - 'శూన్యకేంద్ర' అని - అదే బౌద్ధం చెప్పే 'శూన్యం' - చక్రానికి కేంద్రం ఈ శూన్య ప్రదేశం - అందులోనే కదా 'ఇరుసు' తిరిగేది - ఇక్కడి వాళ్లకి సరిగ్గా తర్జుమా చేయటం తెలీదు - నేను ఇండియాలో బౌద్ధ బిక్షువుగా తిరగాలి - అప్పుడే బౌద్ధం అర్థమవుతుంది' అన్నాడు.

'నేను టిబెట్ వెళ్లాను' అంది మెదూ.

'అదా? అక్కడంతా వజ్రయానం - ప్రేతపూజలు - భూతనాట్యాలు' అని ఎద్దేవా చేశాడు.

'ఆడవాళ్లంటే భూతాలా? 'హోమో సెపియన్స్'కంటే చాలా మెరుగు - ఏనాడైనా' అని కోపంగా అరిచింది. వంటింట్లోకి వెళ్లి కాసేపటికి తిరిగి వచ్చింది.

వంట ఆడవాళ్ళకి జన్మతః తెలిసిన విద్య - ఆమె 'చిన్న' మెదడుకు సాంత్వన - వంట చేయటం - 'ఈ చర్చల్లో మగవాళ్ళు మమ్మల్ని తేలిగ్గా ఆటపట్టిస్తారు - వంటిల్లు మాకు చక్కని సాకు - అక్కడే మేము శక్తి పుంజుకుంటాం' అంది.

ఎక్కువగా మాట్లాడితే ఆడవాళ్ళు కోమాలోకి వెళ్ళిపోతారు.

'అవునవును - ఫ్రాంకో పోలీసుకు ఈ విషయం బాగా తెలుసు - ఆడ ఖైదీలను ముట్టడించి - మాట్లాడించి స్పృహ పోయేటట్లు చేసేవారు' లిజో అన్నాడు.

'మాకు మా స్వరం వినటమే హాయి - మగ గొంతులు వెగటు పుట్టిస్తాయి - వాళ్ళెంత 'తెలిసిన'వాళ్ళే అయినా మెదూ అంది.

రోజుకు ఒక్కసారే భోజనం చేసేవాణ్ణి. ఎక్కువ తిని, అది అరిగించుకోవడానికి మన శక్తిని వృధా చేయటం నాకు నచ్చదు. యోగులు వనమూలికలు తిని - మళ్ళీ ఆరు నెలలు ఏమీ తినకుండా ఉండగలరు - మన ఉదరం వెన్నెముకకు అతుక్కుపోయి ఉంటే - ఎక్కువగా శ్రమించగలం - పొట్ట పెరిగిన కొలదీ - పని తగ్గిపోతుంది - వారణాసి బ్రాహ్మణులు - చార్లీ మామ పొట్టలు ముందుకు వచ్చి - తిన్నది అరగక - ఎన్నో ఇబ్బందులు పడతారు - ఇంధనం ఎంత ఎక్కువ తగలబడితే - అంత ఎక్కువగా పొగ - కాలుష్యం వస్తుంది!

ఒక్కోసారి నాకు అనుమానం వస్తుంది - బాన పొట్టతో చచ్చిపోయినవాడు ఏ లోకాలకు పోతాడు అని - అది 'దాంతే' కూడా తన 'ఇన్‌ఫెర్నో'లో రాశాడు!

మెదూ ఒకసారి అడిగింది - రామా - అక్రమ సంబంధాలు ఎందుకు పెట్టుకుంటారు? అని.

'మనం ఎంత నాగరీకులమని గొప్పలు చెప్పుకున్నా - జంతు లక్షణాలను, సహజాత గుణాలను వదిలించుకోలేము. నెమలి తన ప్రియురాలి కోసం నాట్యం చేస్తుంది. గీజిగ పిట్ట ఆకాశంలో గిరికీలు కొడుతుంది. తన 'దాన్ని' మురిపించడానికి.

ఆడది ఎంత సున్నితంగా ఉంటే - ఆమెకు అంత మోటు మగవాడు కావాలని కోరుకుంటుంది. ఆమెకు ఎప్పుడూ 'హీరో'నే కావాలి - మగడెవరైనా!

మగవాడు ఆడదాన్ని 'ఆమె కోసం' ప్రేమించడు. యాజ్ఞవల్క్యుడు మైత్రేయికి చెప్పినట్లు - ఆమె 'ఆత్మ' కోసం పరితపిస్తాడు.

'ఆడది అంటే ప్రకృతి' మగవాడు పురుషుడు!

నేను ఇండియా నుండి తిరిగి వచ్చిన తర్వాత - మా మధ్యలో ఏమీ లేదు - ఆమె గదికి ఎప్పుడు వెళ్ళినా గంధపు దూపం ఉంచేది - ఏదో మంత్రం జపిస్తూ ధ్యానంలో మైమరచి ఉండేది. ఈమె బౌద్ధం - భౌద్ధిక అగాథాలు తరచి మథిస్తోంది - అనుకున్నాను - తర్వాత ఆమె తలుపు తట్టడం మానుకున్నాను - ఏది అవసరం ఉన్నా చిన్న పుస్తకంలో రాసి - గది బయట బల్లమీద ఉంచుతున్నాను -

నేను గ్రంధాలయానికి వెళ్ళే ముందు - తిరిగివచ్చే సమయం ఆ పుస్తకంలో రాసి వెళ్లేవాడిని. నేను వచ్చే సమయానికి ఆమె ఒంటరిగా సాయంత్రపు వాహ్యాళికి వెళ్ళేది - తిరిగి వచ్చినప్పుడు ఆమె వదనంలో ఎంతో ప్రశాంతత కనిపించేది. ఈమెకు ఏమి జరిగిందో ఇక్కడ ఎవరిని అడగాలి? బహుశా 'పారిస్'లో జోబీ అత్తను అడగవచ్చు. అప్పటివరకు - రోచీ విల్లాలో జీవితం ప్రశాంతంగా జరిగిపోతుంది.

మెదూ బౌద్ధం గురించి చాలా విశ్వాసంతో మాట్లాడగలుగుతోంది - ఈ మధ్య 'అరబిందో'ను కూడా అధ్యయనం చేసింది.

ప్రపంచానికి కావాల్సింది ఇదే - ఇలాంటివాళ్లే - మార్మికంగా పురాతన కథనాలు నాకిష్టం - అప్పటివరకు సన్యాసినిగానే ఉంటాను - అంది నవ్వుతూ.

కొన్ని నెలలు గడిచిపోయాయి - నేను పారిస్ వెళ్ళేముందు - ఒక రోజు మెదలీనా గది తలుపు తీసి - లోనికి అడుగు పెట్టాను. అప్పటికే ఆమె ఇన్‌ఫ్లూయెంజాతో బాధ పడుతోంది. ఆమె పడక దగ్గరలో ఆగాను - 'అయ్యో నువ్వు ఎందుకు వచ్చావు? ఈ శరీరానికి రోగాలు - రొష్టులు వస్తుంటాయి - అనుభవించాలి - అది ప్రకృతిలోనే ఉంది - ఈ మాంసం ముద్ద కోసం నువ్వు ఎటువంటి విచారం పెట్టుకోకు' అని అంది.

నాకు దుఃఖం ముంచుకు వచ్చింది - అలాగే నుంచున్నాను - ఆమె నుదుటికి జామాయిల్ రాయాలనుకున్నాను - ఆమె రొమ్ముల మీద కాంఫర్ నూనెతో మర్దనా చేయాలనుకున్నాను. ఆమె నా చేతిని దూరంగా తోసివేసింది. ఈ గదిలో నేను పరాయి వాడిలాగా ఉన్నాను - ఆమె ఆ వాతావరణం అంతా పవిత్రంగా ఉంచింది. బుద్ధుని దగ్గర చిన్న కొవ్వొత్తి వెలుగుతోంది - ఆమె పూజలకు ఆయన సంతుష్టుడైనట్లున్నాడు - ఆయన ముందున్న రాగిపాత్రలో పూలరేకులు తేలుతున్నాయి - ఆమె చదివే పాలీ పుస్తకాలు చక్కగా, ప్రక్కగా సర్ది ఉన్నాయి. ఎర్రని గుడ్డలో చుట్టి ఉన్నాయి. బహుశా త్రిపిటకాలయి ఉంటాయి. 'ఇప్పుడు నేను పాలీ చదవగలను' అన్నది. ఆమె మంచం దగ్గరలో ఇండియా నుంచి వచ్చిన రెల్లు చాప ఉంది. అక్కడే చిన్న గుడి గంట కూడా - వ్యాస పీఠం ఉంది.

'నువ్వు ఇప్పుడు నాకంటే బ్రాహ్మణి అయిపోయావు' అన్నాను.

'నీ కోసం వేడినీళ్లు తెస్తాను' అంటే - 'వద్దు - ఈ శరీరానికి సహజమైన ఉష్ణం రావాలి' అంది.

'సంతం పాయతి స్వందేహ మాపదలమస్తక' మైత్రేయ అరణ్యకం చెప్పడంలేదూ - ఈ 'రొచ్చు'కు సేవలెందుకు? ఇప్పుడు నన్ను ఆ గదిలో చూడటమే ఆమెకు ఇష్టంగా లేదు. ఇక నేను వెళ్లిపోదామనుకుని వెనక్కు తిరిగినప్పుడు - నన్ను ఆపింది - ప్రియా - (ఎవరినో సంబోధించినట్లుంది) నువ్వేగా నన్నింత దూరం తీసుకు వచ్చావు' అంది.

నేను బుద్ధుని వంక చూశాను - క్షమాపణ వేడుకుంటూ - ఆమె చెక్క మీద - పలుచని పరుపు మీద - పడుకొని ఉంది. నా కళ్ళల్లో నీరు తిరిగింది - అది గ్రహించి - 'నీకు తెలుసు - నేను ఏది మొదలు పెట్టినా - చివరి వరకు చేస్తాను - ఇప్పుడు నేను 'సాధకురాలిని' - నేను బౌద్ధాన్ని లోతుగా చూస్తున్నాను - నువ్వు మంచి బ్రాహ్మణుడుగా ఉండు రామా' ఇదేదో ప్రార్థనలాగా అంది.

నా గదిలోకి వెళ్లి శ్వాస ఆడక ఉక్కిరి బిక్కిరి అయ్యాను - అరే! ఈ మెదూనా నేను పూజించి - మంత్రించి కూర్చోబెట్టాను?! మర్నాటి నుంచి - నా అవసరాలు తగ్గించుకున్నాను - ఆహారం, పరుపులు, దిండ్లు - అవసరానికే ఉంచాను - ఇవన్నీ మెదలీనా గమనించి చాలా విచారించింది. 'నువ్వు - ఇలాగా - ఇక్కడి మనిషిగా చేయకూడదు - అందులోనూ నీ 'ఊపిరితిత్తులు' బలహీనతను గుర్తుపెట్టుకోవాలి.

మర్నాటి నుంచి ఆమెకు సూప్ అందించాను - మందులు ఇచ్చాను. తలుపు తడితే - 'లోనికి రా' అని నెమ్మదిగా అనేది. నన్ను ఇప్పుడు బయటవానిగా చూడటంలేదు. ఆమె చేతిలో రుద్రాక్షమాల నిత్యమూ ఉండేది. నేను ధ్యానం పట్ల - ధ్యాస పెట్టాను. ఇప్పుడు నా ఆరోగ్యం చాలా మెరుగు పడింది.

ఇప్పుడు లిజో రావటం తగ్గించాడు - అతని బాధలు అతనివి. ఒకరోజు మెదూ ప్రక్కన కూర్చున్నప్పుడు - 'రామా - మనం ఆనందంగా ఉన్నాం కదూ - చలికాలంలో కూడా ఆమె గదిలో 'చలిమంట' వేయనిచ్చేది కాదు -

'ఎందుకు - అది అవసరమా' అంటూ నివారించేది. 'అవును - ఇక్కడ అవసరమే' - బ్రాహ్మణుడు తెచ్చిన తప్పుడు సలహా వినకు - ఆమె నవ్వుతూ - ప్రతి సాయంత్రం - 'చలిమంటగూడు' నన్ను వెలిగించమనేది.

అవును ఋగ్వేదంలో - 'అగ్నమిలే పురోహితం' అని కదా - ఇది బ్రాహ్మణుడు చేయాల్సిన పనే అని హాస్యమాడేవాడిని!

ఎప్పుడైనా ఆమె గదిలోకి చూసినప్పుడు పద్మాసనంలో 'కూర్చొని' పాలీ గ్రంథాలు చదువుతూండేది - 'రామా - దీని అర్థం ఏమిటి?' అని అడిగేది - నాకు పాలీ ఏమి తెలుసు? సంస్కృతంలో చెప్పినా ఉపయోగం ఉండేది కాదు.

ఆమె కళ్ల మధ్య ఏదో దివ్యశక్తి వెలుగుతున్నట్లుండేది. ఆహారం చాలా తగ్గించి వేసింది. మరణానికి చేరువవుతున్నట్లు ఏదో ప్రశాంతత ఆమెను అలుముకుంది. ఋతువులు ఇచ్చిన కూరగాయలే తినేది - అన్ని పండుగలు - అన్ని మండలాలు - ఇల్లంతా అలంకరించేది - ఉపవాసాలు చేసేది - తెల్లవారకముందే - బ్రాహ్మీ కాలంలో తలార స్నానం చేసేది - ఆమె చాలా ప్రశాంతంగా ఉంటోంది - కోపం వస్తే కాళీలాగా నిప్పులు కక్కేది.

టిబెటెన్ గ్రంథాలు చదివింది - మనకు రోజులో మూడు వందల మాటలు చాలు - అన్ని పనులూ సక్రమంగా చేసుకోవచ్చు - అందుకనే శనివారం మౌనంగా ఉండటం మొదలు పెట్టింది.

ఇండియాలో కంటే ఇక్కడ బట్టలు ఎక్కువ వేసుకుంటాము కదా - మరి మాటలు కూడా కాస్త పొడిగించవచ్చు - అని హాస్యమాడేవాడిని - ఫ్రెంచిలో -

ప్రపోజిషన్లు ఎక్కువ ఉంటాయి - అని ఒప్పించి - మరో నూటయాభై మాటలు కలిపి - నాలుగు వందల యాభై చేశాం - మెదలీనా ఆనందంగానే ఉందనుకుంటాను - నిజాయితీ - సాధారణ జీవితం ఆనందానికి హేతువు కదా - ఆమె సహోద్యోగులంతా ఇప్పుడు మెదలీనాను ఎంతో గౌరవిస్తున్నారు - ఆరాధనా భావంతో చూస్తున్నారు - కాలేజీ సిండికేట్‌కు అధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు - కాలేజీ ఇన్స్పెక్షన్ జరిగినప్పుడు - ఎంతో ప్రశంస కురిసేది - అప్పుడు ప్రిన్సిపాల్ నవ్వుతూ - మా 'సైమన్ లేడీ' ఈమె. పవిత్రురాలు - ఈ ప్రశంసల్లో కొన్ని నాకూ చేరేవి - దీని అంతటికీ కారణం నేనే అయినట్లు - ఒకరోజు పొద్దున్నే కేవలం చెప్పులు వేసుకుని - ఆమె ఆశ్రమాలు సందర్శించేది. మరోరోజు పర్వతాల వైపు వెళ్ళేది - ఎప్పుడో రాత్రి పొద్దుపోయిన తర్వాత ఇంటికి చేరేది - చాలా పవిత్ర ఆశ్రమాలు తిరిగి వచ్చేది - ఇవన్నీ చూస్తుంటే Druids అందరూ బౌద్ధులే అని రూఢీ అవుతోంది - నా దృష్టిలో 'కాథలిక్' కానిదంతా పవిత్రమైనదే - అని సూత్రీకరించింది.

ఆమె ధ్యానం ఆమెకు ఎంతో అంతర్దర్శనాలు - మరెన్నో సూచనలూ కల్పించేది.

నన్ను కూడా ఈ పర్వతారోహణకు ఎప్పుడైనా తీసుకుపోయేది - ఎన్నో వింత ప్రదేశాలు చూపించేది - ఆమెకేదో దివ్యశక్తులు సమకూరినట్లు అద్భుతంగా అనిపించేది - అలాగే మేడమ్ ఫిలాందర్ కొడుకు జబ్బుపడితే మెదూ ప్రార్థనలు చేసి అతనికి స్వస్థత చేకూర్చింది - ఫిలాందర్ ఇంటికి వెళ్ళాం - బాబు కూర్చుని ఆరోగ్యంగా ఉన్నాడు - మేము వేయించిన బాదంపప్పులు తీసుకువెళ్ళాం. ఫిలాందర్ మాకూ పెట్టింది.

మెదలీనాన అదృశ్య శక్తుల్ని నేను తక్కువ అంచనా వేయను. 'రామా - నేను నాస్తికురాలిని - చర్చిలో జరిగిన ఘోరాల మూలంగా - నీవే నాకు చూసే చక్షువునిచ్చావు.'

'అవును - బుద్ధుణ్ణి చూడమని!'

'చూడు - ఈ సాయంత్రం - ఎంత అద్భుతంగా ఉందో - అంది పచ్చిక మీద కూర్చుంటూ-

'రామా - నీవే స్నేహితుడివి - ఆనందంగా ఉండటం నేర్పావు - ఆనందంగా ఉంటానని - వాగ్దానం చెయ్యి' అంది.

'అలాగే' అన్నాను - మూర్ఖుణ్ణిలాగా!

కొన్ని సందర్భాలలో ఆమె అద్భుతాలు దర్శించేది. పూలమాలలు ఆమెతో మాట్లాడటం - లిల్లీ పూలు - గుర్రపు తోక పూలు - ఎర్ర మందారాలు ఆమెకు కబుర్లు చెప్పేవి. అలా పర్వత సానువుల్లో తిరిగి వస్తుంటే - ఒక సాయంత్రం దారిలో చిన్న 'ఫ్యాన్సీ' పూల మొక్క నలిగి వంగిపోయి ఉంది. 'చూశావా - ఎవరో మూర్ఖుడు తొక్కుకుంటూ పోయాడు - ప్రపంచమంతా ఇలాంటి నిర్దయులు ఉన్నారు - కఠినాత్ములు - పాపం - ఎలా అయిపోయింది' అని చేతిలోకి తీసుకొని గుండెలకు అదుముకుని వెన్నెల దారిలో ఇంటికి తీసుకు వచ్చింది. 'అంతే - మగవాళ్ళు ఇలా వాడుకొని పారేస్తారు' అంది. ప్రపంచమంతా మగవాళ్ళే అయినట్లు. 'ఇదే వాళ్ల పిల్లలకు జరిగితే? అవును - రెండు యుద్ధాలు ఐరోపాను ఈ విధంగా చేశాయి. హిట్లరు కాన్సన్ట్రేషన్ క్యాంపులు ఎంత దారుణమో కదా!' అని కన్నీరు పెట్టుకుంటూ, చిన్ని గుంత తీసి వంగిపోయిన రెమ్మను, నీలిరంగు ఆకులతో ఆ మొక్కను ఆ గుంటలో పెట్టేముందు - 'రామా - నువ్వు ఒక్కసారి ముట్టుకో - నీలో చాలా పవిత్ర శక్తులున్నాయి' అంది. 'అవును - పవిత్రం' అనుకున్నాను.

'అవును - పవిత్రం - బ్రాహ్మణ కాఠిన్యంతో' అని అలాగే ఆ మొక్కను సవరించాను. 'హుమ్-హుమ్, ఓమ్ హుమ్' అంటూ ఆ పూల మొక్కను గుంటలో పెట్టి, మట్టి సవరించింది. 'రామా - ఈ శ్రావణ శుక్రవారం తొమ్మిదో రోజు - చాలా పవిత్రమైన రోజు' అంది.

రోజూ ఆ 'ఫ్యాన్సీ'కి నీళ్లు పోసేవాడిని. దానిని 'బుద్ధుని మొక్క' అన్నాం. రోజూ రాత్రి పడుకునే ముందు - ఆ ఫ్యాన్సీని చూసి, సవరించి వచ్చి పడుకునేది మెదూ.

చివరికి ఓ వెన్నెల రోజు ఆ పూల మొక్క చిగురించి మొగ్గ తొడిగింది. మెదూ ముఖం వెన్నెల్లో వెలిగిపోయింది. అప్పటి నుంచి బుద్ధుని ముందు ఉన్న రాగిపాత్రలోని నీళ్ళు తెచ్చి - 'ఇది పవిత్రమైన గంగ' అని మొక్క పాదులో పోసేది - ఈ క్రమంలో నాకూ ఆ ఫ్యాన్సీ పూల మొక్క చాలా ప్రియమైనది. అవును - మనం సాకిన దానిని మనం ప్రేమిస్తాము.

అలాగే ఈ ప్రపంచాన్ని తయారుచేశాం - అందుకే దానిలోనే ఉండిపోయాం.

'మెదూ - చూడు ఎలా కళకళలాడుతోందో' అన్నాను. 'అవును - ఆసుపత్రిలో మన గాయాలు మానడంలేదూ - అలాగే'.

'అవును - జగదీష్ చంద్రబోస్ మొక్కలు బాధపడటం - చెట్లు దుఃఖించడం నిర్ధారించాడు' - అవును - అయినా దానికి పెద్దగా పరికరాలు అవసరం లేదు - అందులోనూ ఒక భారతీయుడు చెట్ల బాధలు చెప్పటం!'

'అవును - అదీ బెంగాలీ..'

'అంటే?..'

'బెంగాలీలు ఎంతో సున్నిత మనస్కులు - సంగీత ప్రియులు - కవితా మూర్తులు - సహృదయులు - ఎప్పుడూ ప్రకాశమానంగా వెలిగే మనుషులు' అన్నాను.

'వినటానికి చాలా బాగుంది' మెదూ.

అవును బెంగాలీలకు ఈ ప్రపంచం అంతా బృందావనమే. నెమళ్ళు నాట్యంతో అద్భుతంగా - నదీ ప్రవాహాల గలగలలతో, వర్షాలు, కమలాలతో - నృత్యం చేసే స్త్రీ పురుషుల కంఠసీమల్లో పూల దండలు - అవును చుట్టూ దుఃఖిస్తున్న సన్నని మొక్కలు..' 'ఇంకా..'

'ఇంకా - టాగూర్ శాంతినికేతన్ - ఈ ప్రపంచం అంతా సౌందర్యమయం - స్వర్గసీమ.'

'మరి మీ దక్షిణాదివారూ..'

'మేము శివుని మరుభూమిలో ఇళ్ళు కట్టుకుంటా - మాకు స్థలం తక్కువ! మరణ మృదంగాలు, భైరవ నృత్యం - మాకు స్వర్గానికి సమయం లేదు.'

'అవును - ఈ 'ఫ్యాన్సీ' ఎంత హాయిగా విచారిస్తుందో'

నేను రామన్న తాత ఉపనయనానికి ఇచ్చిన వెండి చెంబు ఇచ్చాను - దానితో ఎంతో శ్రద్ధగా ఆ ముక్కలు కాపాడింది నీళ్లు పోసి! అందులో నుంచి వచ్చేవి హైమావతీ ఉదకాలే!

ఒకరాత్రి 'ఫ్యాన్సీ' దగ్గరకు తీసుకు వెళ్ళింది - 'రామా - జేగంటలు వినపడుతున్నాయి!' అంది.

నా చుట్టూ ఏవో ఆకారాలు తిరుగుతున్నాయి - ఎప్పుడూ నాకు కనబడని దిక్కునే ఉన్నట్లుంది. అవి అక్కడే ఉన్నాయి - నాకు ఎటువంటి సందేహం లేదు!

తర్వాత మెదూ - రోడ్డు మీద నలిగిన గొంగళి పురుగుల్ని ఏరటం మొదలుపెట్టింది - కొన ఊపిరితో ఉన్నవాటిని బ్రతికించింది. లేత ఆకులు తినిపించింది - మళ్లీ వాటిని చెట్లు మీద వదిలిపెట్టింది - 'అయ్యో పాపం - ఎంత దీనం..'

'మెదూ - గొంగళి పురుగులు చెట్లను తింటాయి కదా' - 'వాటిని బ్రతకనీకు' అన్నాను - 'లేదు మనం అన్నింటినీ బ్రతకనీయాలి' - మంత్రాలు వల్లిస్తూ - చెట్టు చుట్టూ తిరిగేది - అన్నీ దేవుని సంతానమే -

అవును - సందేహం లేదు - మెదలీనాకు ఏవో శక్తులు - సమకూరుతున్నాయి - లిజోతో చెప్పి టిబెట్ నుంచి కాంగ్‌వింగ్ ఎముక తెప్పించి దానికి చిరుగంటలు కట్టింది. అవి కూడా టిబెట్ నుంచి వచ్చి ఉంటాయి - సందేహం లేదు. 'హమ్‌హమ్

ఫట్' అని మంత్రాలు చదువుతూ - గంటలు మోగిస్తూ తిరిగేది - ఆమె ధ్యానం చేసే సమయాలు పెరిగాయి. 'గతం మర్చిపో - భవితను గురించి ఆరాటపడకు - నీ మనస్సు వర్తమానంతో లీనం చేయి' అని నాగార్జున సిద్ధాంతం వల్లించేది. గుండ్రని బంతి మీద కూర్చొని ధ్యానం చేసేది - ఏదో కర్ర మీద కూర్చుని చేసేది - పాలీ పాఠాలు చదివేది - నిండు పున్నమికి గ్రహణానికి ఉపవాసం చేసేది - అప్పుడే రామన్న మరచెంబులో నీళ్లు బుద్ధుని చెట్టుకు పోస్తుండేది - అది కొత్త చిగుళ్ళేసి లేత ముళ్లు చూపేది.

అప్పుడప్పుడు నేను ఇంటికి తిరిగి వచ్చినప్పుడు 'మెదూ' ఎక్కడుందో కనిపించేది కాదు - ఏ మూలనో 'వజ్రాయానం'లో ధ్యానంలో ఉండేది.

నేను - 'సీట్ ఆఫ్ డైమండ్' అనేవాణ్ణి - అప్పుడప్పుడూ అలా వరండాలోకి వచ్చి - ఆక్స్ లోయను చూస్తూ నిలబడేది - బహుశా ఈ ప్రపంచం నిజమని నమ్ముతున్నదేమో!

స్వామి పరమానంద - యోగాసనాలపై పుస్తకం తెచ్చింది - ఈ యోగాసనాలు ఆమెకు ఎంతో ప్రశాంతతను ప్రసాదించాయి. బౌద్ధులు ఎప్పుడూ కుడిప్రక్కకు తిరిగి నిద్రపోతారు - ఇది కూడా ఆమె నిద్రకు ఎంతో ఉపయోగపడింది. ఎన్నో మండలాలు వేసి అందులో కూర్చున్నది. ఎప్పుడో బ్రహ్మీ ముహూర్తంలో 'ఇండియా'లో నిద్రలేచేది. తెల్లవారకముందు మూడు గంటలకు - అప్పటి నుంచీ నాలుగైదు గంటలు ధ్యానమే.

ఒకరోజు 'ఫ్యాన్సీ' వడలిపోయి నేలకు వంగిపోయింది. 'మరణం - చాలా సహజం' జీవించినవన్నీ మరణించాలి - ఆ మొక్క ఖర్మకాండలన్నీ చేసి పూడ్చిపెట్టాం - కానీ దానికి వేళ్లే లేవు - అందుకని దహనం చేసి - బోధిసత్వ పైన్ చెట్టు మొదల్లో చల్లాం బూడిదను.

కొన్నాళ్లకు మెదలీనాకు 'బ్లాక్ మెడోన్నా' కనిపించింది - ఉపవాసాల తర్వాత - 'రామా - నీకున్న శ్వాసకోశ రోగం తగ్గాలంటే - నాకు 'మెడోన్నా' ఎన్నో చెప్పింది - నేను ఎన్నో ఉపవాసాలు చేయాలి - నీవు ఎంతో నిష్టగా ఉండాలి' - ఏ ప్రార్థనలు చేయాలి - వగైరా అని ఏకరువు పెట్టింది - 'నీకు నయం చేస్తాను' అని శపథం చేసింది - ఆశ్వయుజము ఏడోరోజున దీక్ష తీసుకుంది - అప్పటి నుంచి 41 రోజులు - రెండు గంటలకు మేల్కొని - స్నానమాచరించి - మంత్రాలు ఉచ్చరించేది.

ఆమె ఎంతో దీర్ఘంగా, స్పష్టంగా, పవిత్రంగా మంత్రోచ్చారణ చేయటం విన్నాను - నా గది దగ్గరగా వచ్చి - ఉదకం జల్లి - మెల్లగా మంత్రాలు జపించేది - రెండు

గంటల నుంచి 4 వరకు ఇల్లంతా మంత్ర శబ్దాలతో నిండిపోయేవి - ఆ శబ్దానికి ఇల్లంతా పులకరించేది - పక్షులు నిద్రలోనే మేల్కొనేవి - చెట్లన్నీ నిటారుగా నిలబడేవి - ఆవులు ఆకాశంలోకి చూసేవి - ఆక్స్ లోయ అంతా ఆ పైన పర్వత సానువులు ఈ శబ్దంతో ప్రతిధ్వనించేవి. ఏంతో మధురంగా - మెల్లమెల్లగా - ఇవన్నీ తిరిగి వచ్చేవి - మధ్యధరా సముద్రం అలల లయతో పాడేది - పక్షులు ఒక్కసారిగా కిలకిలలాడేవి - చిన్న పిల్లలు నిద్ర లేచి ఏడ్చేవారు - ఊరిలో మగవాడు పనికి బయలుదేరేవాడు. ఉదయం రైలు కూత వేసేది - ట్రామ్ చక్రాలు మ్రోగుండేవి - ప్రపంచంలో కదలిక మొదలయ్యింది - అదిగో - బంగారు రంగు పద్మాలతో ఉదయభానుడు ప్రపంచాన్ని వెలుగుతో నింపుతున్నాడు.

ఉదయాన్నే మేడమ్ జీన్ వచ్చేది - ఏమిటి మన ఇంటికి దేవతలు వచ్చినట్లుంది? అంటూండేది - ఆమెకు మెదలీనా ప్రార్థనలు ఏమీ తెలియవు.

అవును - దేవుళ్లే - రాలేదని ఎవరంటారు - వింత వింత సంగీత ధ్వనులు వినిపించటంలేదూ - గాలికి లయగా 'డ్రీమ్' బీట్స్ వినపడటంలేదూ - 'దోరే ఫాసీ' అని - 'దోరేసీ' అని వినపడటంలేదూ - మేమిద్దరం ఎన్నో ఆటలు ఆడుకున్నాం - నమ్మండి - మాతో ఇంకా ఎవ్వరో - కూడా ఆడుతున్నారు.

ఆ ఎర్రని బంతి ఇటు-అటు పోతున్నది. ఒక్కసారిగా ఎవ్వరో పట్టుకున్నట్లు ఆగిపోయేది - అవును - మాతో ఎవ్వరో ఆడుతున్నారు.

శబ్దాలు నడుస్తున్నాయి - రంగులు రూపుదిద్దుతున్నాయి - ఎర్రగా - పచ్చగా చిలకల్లా - నీలంగా - హిమాలయాల్లా - నాలుగు ప్రక్కలా నాలుకలు చాచి నిప్పులు ఎగసిపడుతున్నాయి. అవి అటూ-ఇటూ తిరిగి - ట్రామ్ కారు శబ్దాలతో - సీలింగులో చేరేవి.

'విను - విను - అది సంగీతం!' మెదూ కళ్ళంత చేసుకుని చెప్పేది.

అవును 'డ్రీమ్‌బీట్' చాలా శక్తివంతంగా - మరో శబ్దాన్ని పుట్టించి - పర్వతాలకు మోసుకుపోయేది. నదులు, సముద్రాలకు రోడ్లు - మనిషి! నా వెన్నులో వణుకు పుట్టేది! నిటారుగా నిలిచి - 'మేదూ' అని అరిచేవాడిని -

కానీ ఆమె పద్మాసనంలో ఉండి - కళ్ళు అరమోడ్పులో - చిరునవ్వుతో - మౌనంగా ఉండేది. నేను నా గదిలోకి - అలవాటైన నా గది వాతావరణంలోకి వెళ్లిపోయేవాడిని - నా గదిలో మార్పు లేదు - కానీ దుమ్ము - ధూళీ లేకుండా - పరిశుభ్రంగా ఉంది - నాకు భయం వేసేది.

మెదూకు భయం అంటే తెలియదు - 'మేము అట్లాంటిక్ అడవుల్లో నుంచి వచ్చాం - నాకు భయం ఏమిటి' అనేది.

ఆమె కురులు రింగులు తిరుగుతున్నాయి - ఆమె చర్మం ఎండిపోతోంది - ఏదో - అంతగా ఇష్టపడని వాసనలు వెదజల్లుతోంది - ఆమె గోళ్ళు కాలినట్లున్నాయి - ఆమె గదిలో నుంచి 'హం ఫట్' అనే శబ్దాలు వినిపించేవి. ఒకసారి నా ముందు ఒక వ్యక్తి నడుస్తూ ఉండటం చూశాను - అతను అస్థిపంజరంలా ఉన్నాడు - మహాత్మా గాంధీలా ఉన్నాడు - ఇంకా పొడవుగా - వంగి - గబగబా నడుస్తున్నాడు - నా ముందు వణుకుతూ-

మెదలీనా - ఇది చాలా శుభసూచకం - అంది - 22వ రోజు నీకు ఈ దర్శనం కలుగుతుంది - అవును - నిజమే - అలాగే జరిగింది. ఇది నిజమే - ముమ్మాటికీ.

ఇప్పుడు పక్షులు మా దగ్గరకు వచ్చి గింజలు తింటున్నాయి. ఏమాత్రం బెదురు లేకుండా - మెదూ భుజాల మీద వాలుతున్నాయి. అలా ఎంతో మైకంతో - ఒక రాతి మీద కూర్చుని - పక్షులతో మాట్లాడుతూ ఆమె స్పృహ కోల్పోయింది.

నేను ఎంతో ఓర్పుగా వేచి ఉన్నాను - ఎప్పుడో మేల్కొని - 'రామా - ఎందుకు ఇది - మళ్ళీ ఇక్కడకు రావాలా?'

అవును - మెదూ - ఇవి రెండు ప్రపంచాలు.

మా ఇంటి చుట్టూ ఆత్మలు తిరుగుతున్నాయి - అన్ని భాషలూ మాట్లాడుతున్నాయి - నాకు అంతగా కనిపించవు - కానీ ఏ తలుపు చాటునో కిటికీ వెనకనో ఉన్నట్లు తెలుస్తుంది. వంటింట్లో చలిగూటి ప్రక్కనో, చెత్తబుట్ట పైనో కూర్చునేవి. చెట్ల మీద నుంచి శబ్దాలు చేసేవి - మమ్మల్ని అర్థించేవి. మీ కోరికలు కోరుకోండి - నాకు కోపం వచ్చి 'పొండి, బయటకు, పొండి బయటకు' అని కసురుకునేవాణ్ణి. వాటికి ఏ భాష వచ్చు? కోతుల్లా ఎగురుతూ, గెంతుతూ ఉండేవి. మెదూ వాటితో ఎంతో సౌమ్యంగా మాట్లాడేది. నేను అరుస్తూ, విసిగిస్తుండేవాడిని. అప్పటికి 29వ రోజు తిరిగి వచ్చింది. ఇప్పటివరకు ఎంతో వేడిగా ఉన్న ఇల్లు - చల్లబడటం మొదలైంది. ఇప్పుడు శబ్దాలు సరళంగా - మెత్తగా వినపడుతున్నాయి. ఇప్పటి ఆత్మల రంగులు మారి, నయనానందకరంగా ఉన్నాయి. అవి పూలరేకుల్లా, మంచుతునకల్లా అనిపించేవి. ఇప్పుడు సంగీతం మధురంగా ఉంది. గాలిలో ఆహ్లాదకరమైన సువాసనలు వస్తున్నాయి. కొండగాలిలో కోయిల పాట వినిపిస్తోంది. ఇప్పుడు ఈ దేవతలు దగ్గరగా వచ్చి కూర్చుంటున్నారు.

ఆకారాలు తెలిసినట్లు ఉన్నాయి - లావణ్యంగా ఉన్నాయి. చిన్ని లేడి పిల్లలా, గుఱ్రపు పిల్లలా కొన్ని ఎగురుతున్నాయి - కొన్ని తేలుతున్నాయి - హంసల్లా రెక్కలల్లారుస్తున్నాయి.

మెదలీనా చాలా ఆనందంగా ఉంది - ప్రపంచం ఆమె ముందు పరుచుకున్నట్లు సంతోషంగా ఉంది.

వర్షాకాలం నుంచి దసరాగా మారినట్లు ఉంది - ఏనుగులు బారులు తీరి వెళుతున్నాయి. పద్మసింహాసనంలాగా - బహుశా త్వరలోనే బుద్ధుడు నవకిరణాల నగపై కూర్చుని ఉంటాడేమో!

మెదలీనా సంతోషానికి అంతులేదు - అప్పటికే 31వ రోజు గుర్తు పెట్టింది - పాలమ్మాయిలా.

ధర్మం నేలంతా నిండిపోయింది. ప్రపంచమంతా నిండిపోతుంది - లేత బంగారు కిరణాల వెలుగు ఆక్స్ లోయలో నిండిపోయింది. ఈ భూమి తన బరువుతోనే తేలిపోతున్నట్లు-

అప్పటికి 36 రోజులు - ఇక మెదూ కళ్ళు మూతలు పడిపోతున్నాయి - ఏమీ నోటిలోకి వెళ్లడంలేదు - ఒకట్రెండు రోజులు ఒట్టి నీళ్ళే తాగింది. అప్పుడే కర్పూరం కలిపేవాడిని. తేనె కూడా - తేనె నీరు ఇస్తున్నాను - 38వ రోజు ఆమె వేయి రేకుల మల్లెలా పరిమళించింది. నీలి కమలంగా రాగించింది. ఆమె ప్రక్కనే కూర్చున్నాను. ఆమె శ్వాస ఎంతో మధురంగా ఉండేది. ఆమె పవిత్రంగా - దేవతలా దర్శనమిస్తోంది. ఆమెను ఆరాధించాను.

ఆమెకు Sainte bouillote ఇచ్చాను. వద్దంది. ఇది మరీ కృత్రిమంగా ఉంది.

ఆమె ప్రక్కమీద మల్లెలు - మార్గరెటీలు చల్లాను. అవును - ఇది చక్కగా ఉంది.

ఓం ధీమ్ - ఓమ్ గ్రీమ్! ఓం హ్రీమ్

OM DHIM - OM GIH OM HRIH.

ఆ రాత్రి ఎంతో బాగా నిద్రపోయింది.

40వ రోజు తేనే - నీళ్ళు కూడా తాగలేదు.

'నిమ్మ నీళ్ల తీసుకో - గాంధీ ఇవ్వే తాగేవారు' అన్నాను.

'నా దారిన నన్ను పోనీ' అంది.

నా గదికి నేను వెళ్ళిపోయాను.

41వ రోజు - చాలా ముందుగా నిద్ర లేచింది - అంటే రాత్రి 1.00 గం॥కు.

ధ్యానంలో 6 గంటల వరకు కూర్చుంది. ఎటువంటి శబ్దాలు లేవు - ఎంతో

ప్రశాంత - దయపూరిత దర్శనం జరిగినట్లనిపించింది. నేను చాలా తేలిక అయిపోయినట్లు - నా శ్వాస సక్రమంగా ఉన్నట్లు అనిపించింది.

ఆరుగంటలకు నేను స్నానాల గదిలో ఉన్నాను - అప్పుడు మంత్రోచ్ఛారణ స్పష్టంగా వినిపిస్తోంది - ఏదో అలౌకికమైన ఘంటారావం స్పష్టంగా వినిపిస్తోంది - మిగతా శబ్దాలు వినిపించకుండా. కేవలం సుదీర్ఘమైన మంత్రోచ్ఛారణ వినిపిస్తోంది.

'ధమ్మ భవనం - చుట్టూ గంటల తోరణాలుంటాయి..'

మహా శుద్ధాసన సుతనాత

అప్పుడు మళ్ళీ భూమి - భూమిగా మారింది. చెట్లు చెట్లలాగా కనిపిస్తున్నాయి.

ట్రాము కార్ల శబ్దం వినిపిస్తోంది - మనుషుల మాటలు - మోటుగా - మామూలుగా వినిపిస్తున్నాయి.

పాలు తెచ్చే బేగున్ మామూలుగానే ఉంది - వార్తాపత్రికలు, కరెంటు బిల్లులు వచ్చాయి. మేడమ్ జీన్ తలనొప్పి చెడు వాసన వస్తోంది - నేను ఆక్స్ లోయలోకి వెళ్ళినప్పుడు పొగాకు ఘాటు వాసన, గాలిలో దుమ్ము ఉంది.

ఆ సాయంత్రం మెదూ నా గుండెల మీద చేదు బత్తాయి రుద్దమంది. ఒకటి - రెండు - మూడోది కూడా. అలా 21 రోజులు రుద్దాలి. నా జ్వరాలు, శ్వాసకోశ రోగాలు పోతాయి. ఇవన్నీ మెదూకి కలలో అరబ్ డాక్టర్ చెప్పాడు.

ఇవన్నీ నేనెలా నమ్ముతాను? రోజులు గడిచిపోతున్నాయి - ఏమీ జరగలేదు.

మెదూ చుట్టూ పక్షులు చేరుతున్నాయి. మెదూ తెలిసినవాళ్లకు చిన్న-చిన్న రోగాలు నయం చేస్తోంది. మంత్రజలం ఇస్తోంది.

నన్ను ఒకసారి 'బ్లాక్ మెడోనా' దగ్గరకు తీసుకు వెళ్ళింది.

నాకు 'ఉత్తర రామ కథ' గుర్తుకు వచ్చి చదివాను.

'ఏమిటిది?' అంది.

'కిమ్ ఇదమ్ అపతీతమ్ అద్య రామశ్య' ఆమె సంస్కృతంలో మాట్లాడుతున్నట్లు.

'ఏమిటి దీని అర్థం రామా?' అని అడిగింది.

రామునికి ఏమయింది - అని చెప్పటం మొదలు పెట్టాను.

ఆ ఫిబ్రవరి మధ్యాహ్నం - నేను మెదలీనాకు చెప్పింది-

"ఇది అరణ్యమే కనబడుతోంది - ఇక్కడే సంసారులుగా - సన్యాసులుగా జీవించాలి! చాలాకాలం - చాలాకాలం - మన కర్మలు నిర్వర్తించాం! ఆనంద రసాలను ఆస్వాదించాం - ఇది పర్వతశ్రేణులు - నెమళ్లు నాట్యం చేస్తాయి,

క్రీంకరిస్తాయి. ఇక్కడ లోయల్లో అడవుల్లో లేళ్లు తిరుగుతుంటాయి. అదిగో - అక్కడే వెదురు పొదలు పాడుతుంటాయి. చీకటిలో నది అంచులకు పారుతుంటుంది. అదిగో అక్కడే ప్రస్రావణ పర్వతం నుంచి గోదావరి దొర్లుతుంటుంది. మేఘ మాలికలా విషపు జ్వాలలు మండినట్లు అదృశ్యశక్తి కాష్టాలను కాల్చినట్లు - మాసిన గాయం - హృదయాన్ని తాకినట్లు - గాఢమైన బాధ - నన్ను బలహీన పరుస్తోంది. ఇదేదో నిన్ననే మొదలైనట్లు - పంచవటి ఇక్కడే కదా ఆమెతో ఎక్కువ కాలం గడిపాడు - ఇదే నా స్వగృహయినట్లు - పంచవటి - ఇక్కడే మేము సంభాషించుకున్నాం - కానీ ఇప్పుడు రాముడొక్కడే - ఒంటరిగా - ప్రియమైనవి పోగొట్టుకుని - ఇప్పుడు పంచవటిని వదిలి పోవటం - హృదయ విదారకం - పంచవటికి వందనం.

ఆక్స్ లోయలో అప్పటి శీతాకాలపు రోజులు మా ఇద్దరి మధ్య ఎంతో అర్థవంతంగా, అనురాగపూర్వకంగా, గాఢమైన అనురాగంతో నిండిపోయాయి. వెచ్చని ఎండ పొడలో ఆలివ్ ఆకులు వెలుగు జిలుగులద్దుకుంటే - సైప్రస్ చెట్ల చుట్టూ ప్రాకిన వేళ్లతో ఏదో ఏకాంతాన్ని ప్రసాదిస్తుంటే - ఇవన్నీ ఏదో ఒక సూత్రాన్ని - ఒక మార్గాన్ని - ఒక సిద్ధాంతాన్ని - మాకు చూపుతున్నట్లుండేది.

ఇక వెలుపల ప్రపంచ ఆహ్లాదకరంగా, వాతావరణం నిండిపోయేది. బీగున్ తన గొర్రెల్ని పైకి తీసుకొని వస్తుంటే - వాడు వాటిని పచ్చిక మేయటానికి వదిలి - అతను ఆలివ్ చెట్టు క్రింద అలా వాలి - 'Patiet Provencal' చదువుతుండేవాడు. రెండు గొర్రెలు నా వంక చూసేవి - నేను ఏదో బాగా పరిచయం ఉన్నట్లు. చిన్న గొర్రెలు ఆడుకోవడానికి వచ్చేవి. వీటికి చైతన్యం మత్తు కలిగిస్తుండేది. ఇండియాలో మేక పాలు శ్వాసకోశాలకు ఆరోగ్యం అని అంటారు. ప్రతీ మధ్యాహ్నం అలా బీగున్ దగ్గరకు వచ్చేవాడిని. నన్ను చూసి అతని చిన్న సీసాతో పాలు - ఘాటుగా వాసన వచ్చేవి - చిక్కగా, తెల్లగా ఉండేవి - ఇచ్చేవాడు. ఎంత బాగున్నాయి ఈ 'అమ్మ పాలు' అవి ఏ మేలు చేశాయో తెలియదు కానీ - నాకు ఇక ఆరోగ్య సమస్యలు ఏమీ ఆందోళన కలిగించలేదు. డాక్టర్ సెరాఫిడ్ నన్ను పరీక్షించి ఎంతో మెచ్చుకున్నాడు - 'నీవు మంచి రోగివి సుమా' ఒక 'స్పూను' కాడ్ లివర్ ఆయిల్ తాగమంటే - జేబులో నుంచి రెండు రకాలు స్పూనులు తీసి - ఇందులో ఏ స్పూను అని అడుగుతాడు. ఇది నిజంగా చాలా నాగరీకులు చేసే పని. ఇక్కడ అంతా గొర్రెల మంద' అనేవాడు.

నా జాగ్రత్తకి కారణం - నేను మెదలీనాకు సమస్య కాకూడదు - ఇప్పటికే చాలా సమస్యలున్నాయి.

ఒక రోజున మెదలీనాకు ముల్లు గుచ్చుకుంది. ఆమె కాలంతా గుడ్డ చుట్టింది - మంత్రాలు చదువుతూ. రెండు రోజులకు వాచిపోయింది. నేను ఆమె గదిలోకి వెళ్ళి - కట్టు ఊడదీసి - వేడి నీళ్ళతో శుభ్రం చేసి - బోరిక్ పౌడర్ వేశాను. మెదలీనా ఆమె శరీరంలోని ఏ భాగాన్నీ నాకు చూపటానికి సిగ్గు పడిపోతోంది. చివరికి కాలు కూడా - కేవలం పాదమే ముట్టుకోనిచ్చింది. అయినా మంత్రాలకు చింతకాయలు రాలుతాయా? ఆమెకు కడుపునొప్పి వస్తే నన్ను కనీసం చేతితో 'సవర'దీయనీయలేదు. రోజురోజుకు యౌవనంలోని పిల్లలాగా ఆమె రొమ్ములు కప్పుకుని - అదేదో పాపంలాగా - 'నీవు సన్యాసి జీవితం గడుపుతున్నావు కదా - నా మూలంగా - నీకు హిందూ భార్యను చూడాలి!' అనేది.

'మెదూ - నీ గొంతు వాచింది. వేడి తువ్వాలు చుడతాను' అంటే - 'వద్దు - నేను రోగాలకు కూడా పనికిరాను' అనేది.

ఇప్పుడు ఆహారం అరచేతితో కొలిచి వండుకుంటోంది. రోజుకు మూడుసార్లు - మూడు ముద్దలే. 'బౌద్ధం' అలాగే చెబుతోంది.

బహుశా ఈ ఉపవాసాలే ఆమెకు వింత వెలుగును ప్రసాదిస్తున్నాయి.

'నీవు సరోజ పెళ్ళికి వెళ్ళినప్పుడు - నేను చనిపోతానని అనుకున్నాను - కాన్పులో అన్నీ సమస్యలే - ఆ భయంతో వీలునామా రాశాను. కాతరీన్‌కు తెలుసు. నన్ను దహనం చేయమన్నాను. ఇక్కడి పద్ధతి ప్రకారం ఖననం చేస్తారు కదా - అది నాకు ఇష్టం లేదు. ఫ్రెంచ్ చట్టాలు చాలా కఠినమైనవి - దహనం చేయడానికి కార్పొరేషన్ అనుమతి తీసుకోవాలి' అని చెబుతోంది.

'ఎందుకు అలా అశుభం పలుకుతావు - నీకంటే నేను మరీ బలహీనంగా ఉన్నాను కదా' అన్నాను.

'నువ్వు చెప్పావు కదా - బాబర్ చక్రవర్తి హుమాయున్ కోసం ప్రార్థన చేశాడని - అలాగే నేను నీకోసం ప్రార్థించాను. ముందు నేను వెళ్ళిపోవాలి. నీకింకా చాలా భవిష్యత్తు ఉంది. నీ కష్టాలన్నింటికీ కారణం నేనే' అంది.

'ఇప్పుడు నన్ను కాల్చుకు తినాలా?' అని కోపగించాను. ఆమెను ఎప్పటి నుంచో అడగాలనుకుంటున్న ప్రశ్న - ఇప్పుడే ఆమె నన్ను అడిగింది.

'రామా - మనల్ని విడదీస్తున్నది ఏమిటి?'

'ఇండియా' అన్నాను. కాని ఆమె - 'కానీ నేను 'బుద్ధిస్ట్' కదా' అంది. అందుకే బౌద్ధం ఇండియా దాటి వెళ్లిపోయింది. ఇండియా క్రూరమైనది సుమా-

'కానీ ఎవరైనా బౌద్ధంలోకి మారవచ్చు కదా-?'

'అవును - అలాగే ఇస్లాంలోకి - క్రిస్టియన్స్‌గా - కానీ హిందువుగా మారలేవు.'

'అంటే - కేవలం ఇండియన్‌గా పుట్టాలి.'

'అలా అయితే నీ ఇండియా రోదశి కాలంలో ఉంది.'

'కాదు - అదీ కాలంతో ఉంటుంది - ప్రక్కప్రక్కనే.'

'అందుకనే ఎప్పుడైనా - ఎక్కడైనా ఉంటుంది.'

'ఇది నాకర్థం కాదు-'

నీవు పూర్వం 'పాల్ వాలేరీ' (Paul Velery) చదివావు కదా - నేను Rainer Maria Rilke ని చదివాను. నువ్వు ఇప్పుడు రిల్కేని చదువు.

'అవును చాలా చదవాను - వాలేరీ ఇప్పుడు వేదాంతం చెబుతున్నాడు - రిల్కే చెప్పిన దేవతలు - నేను నమ్మను - అది టాగూర్ గంగలాగా - ఎక్కడా స్వర్గం ఉండటానికి ఆస్కారం లేదు' అన్నాను.

'అలాగా?' అంది - నిశ్శబ్దంగా ఉండిపోయింది. ఈ ప్రపంచం సత్యమా - అసత్యమా ఏదైనా సరే - అది సర్పమా - బంధనమా? రెండింటి మధ్య మరొకటిలేదు - మధ్యలో ఉన్నదంతా కవిత్వమే - పవిత్రమైనదే - నువ్వు చెప్పవచ్చు - కాదు కాదు - అది 'తాడు' మాత్రమే అని. సర్పం మధ్యలో నిలబడి! అలా సర్పం కళ్ల నుంచి - తాడును చూస్తూ అదే స్వర్గం - అక్కడే రుషులు - అవతారాలన్నీ దేవుళ్ళందరూ కథానాయకులా - ఈ విశ్వమంతా అనుకోవచ్చు.

ఎక్కడ వరకు వెళ్లినా - నీవు సర్పం కళ్ళలో నుంచే చూస్తావు. నీవు అది ద్వంద్వం అనవచ్చు - లేదా మార్చిన ద్వంద్వం అనుకోవచ్చు - స్వర్గానికి దారి తీస్తావు. తాడును చూసి సర్పం దృష్టితో - నీవు సర్పాన్ని అనుకుంటావు. నీవు ఆ తాడు కావచ్చు. కానీ నిజానికి నీవు ఏ విధంగా చూసినా - అక్కడ సర్పం లేదు - ఎప్పుడూ! ఈ ప్రపంచం సత్యమా? భ్రమా? మనకు తెలిసింది కలా, నిజమా?

ఆ సాయంత్రపు చీకటిలో - 'ఓ! అరే - అదిగో పాము! అయ్యో' అని పారిపోతావు - అలసిపోతావు - పడిపోతావు - భయంతో కలిగిన బాధకు దుఃఖిస్తావు. భయంతో చూసే కళ్ళకు పాము కనిపిస్తుంది. అది నీవే అనుకుంటావు. యోగిననుకుంటావు - అప్పుడు. గురువు దీపం తీసుకు వస్తాడు. నీకు మార్గం కనిపిస్తుంది. పొడవాటి తెల్లని మార్గం! పైన నక్షత్రాలు మెరుస్తుంటాయి. 'అరే - ఇది తాడు మాత్రమే' అని చూపిస్తాడు. నీ కళ్ళు నులుముకుని - చూసి - అసలు సర్పం ఎప్పుడూ లేదు - అని తెలుసుకుంటావు - ఎక్కడుంది చెప్పు? కవి! తాడుని చూచిన కవి పాము అనుకున్నాడు. అతను పాము అయి - తర్వాత యోగిగా మారాడు. ఇప్పుడు యోగి

తన యోగమే తను అంటాడు - కాని అది సత్యవంతంగా కాదు. అసలు - సిసలు దీనికి పేరు లేదు. తాడుకు తాను తాడని తెలీదు.

'అయితే ఏమిటది?'

'అది కేవలం తాడే - పాములా కనిపించిన పాము కాదు - అది తాడే - అంటే ఈ ప్రపంచం ఏమీ లేదు!? సత్యమూ - భ్రమా కాదు.'

'కాని 'బియాట్రిస్' ఉండవచ్చు కదా' అంది.

ఆఁ..ఉండవచ్చు - కానీ అక్కడ నేను ఉండకపోవచ్చు.

'మైత్రేయి ఆత్మను ప్రేమించ కలిగినప్పుడు యాజ్ఞవల్క్యుడుగా ఉండవచ్చు.'

'అలా అయితే - ఇండియన్ మైత్రేయి ఎక్కడుందో అన్వేషించు - మిత్రమా' అంది!!

'una vera Marchosa' నవ్వుతూ అన్నాను. (ఆహా త్యాగశీలి అండి) అన్నాను.

'అవును రాజకుమారా!' అంది.

'శరీరం లేనివాడు - మనసు లేనివాడు - అసలు అంగాలే లేనివాడు - అతనే అసలు చక్రవర్తి' అని పాఠం చదివాను.

ఆ విధంగా ఈ యుద్ధం ముగిసింది. చాలాసేపు మెదలీనా గదిలో కూర్చున్నాను. చందమామ ఆ చర్చి వెనకాల దాక్కుంది. రాత్రి వింత శబ్దాలతో సంగీత భరితంగా ఉంది. దూరం నుంచి సముద్రపు ఘోష వినవస్తోంది. ఇలాంటి ప్రశాంత శీతల నిశీధిలో ఎక్కడి నుంచైనా అలల లయ వినవచ్చు. ఈ ప్రపంచం కలా - నిజమా - ఏదైనా - ఈ సముద్రం రుజువుగా ఘోషిస్తోంది. దానికి ఏ పేరైనా పెట్టవచ్చు. అనామకమైన ప్రపంచానికి రుజువు కావాలా?

'La mer la mer toujours recommence' సముద్రం ఎప్పుడూ మళ్లీ ప్రారంభమవుతుంది. అల వెనక అల!

కెరటాల పరంపర!

రెండు రోజుల తర్వాత ఊర్లోకి వెళ్లి - మెదూకు పాదరక్షలు తెచ్చాను. దృఢంగా ఉన్నవి. ఒక సాయంత్రం ఆమె కాలికి కట్టు కడుతూ - 'మెదూ - నేను ఒక గమ్మత్తు చేశాను' అన్నాను.

'ఏమిటి?' అంది - చాలా బలహీనంగా నవ్వుతూ. ఉపవాసాలతో పడుకొని ఉంది కదా - విచారంగానూ ధ్వనించింది.

'ముందు ఒక కథ చెప్తాను - ఈ కథను రామకృష్ణ పరమహంస చాలాసార్లు చెప్పారు - అది వేదాంతసారం - చాలా కాలం క్రితం - ఒక సత్పురుషుడుండేవాడు.

అతను ప్రారంభించినదేదైనా నిష్టతో చేసేవాడు. ఒక మధ్యాహ్నం - ఎండ మండిపోతోంది. ఎండ ఇక్కడ మండిపోతోంది - అని ఆ మార్గం వైపు చూసి - అక్కడ మండిపోతోంది - అని దూరంగా చూశాడు. అరే అక్కడా అంతగా సెగలు వస్తున్నాయి. కొండ మీద కూడా - లోయలో, నది మీదా - ప్రక్క ఊళ్లలో - రాజప్రసాదంలో - కొండలమీద - ఎడారిలోనూ - బీడు పొలాల్లో - ప్రపంచమంతా ఎండ మండిపోతోంది సుమా - ఈ భూమినంతా తోలుతో కప్పి వేస్తాను - ఎండ తగలకుండా - అని తోళ్ళు తీసి కుట్టడం మొదలు పెట్టాడు. అక్కడ ఉన్న ఎద్దు - పెద్దగా నవ్వటం మొదలుపెట్టింది.

'ఎందుకు నవ్వుతున్నావు' అన్నాడు.

'మీరు ఏం చేస్తున్నారో - నాకు తెలుసు - ఎండ నుంచి రక్షణ పొందడానికి తోలు కవచాలు కుడుతున్నారు.'

'అవునవును.. నీకెలా తెలుసు?'

'అవును - నేను అరక లాగేటప్పుడు - ఏం చేయాలో నాకు తెలియదా? మీరు కాడి మీద వేయగానే - నా పని నేను చేసుకు పోతున్నాను కదా-'

'అవునవును - నీవన్నది నిజమే - అయినా ఇప్పుడు ఎందుకు నవ్వావు?'

'మీరు సంకల్పించింది - మంచి పనే - కానీ అది పూర్తవడానికి ముందే - ఈ దొడ్డి - ఆ దారి - ఆ కొండలు - ఆ నదులు - ఇవన్నీ కప్పాలంటే మీరు ముసలివాళ్ళయిపోతారు. మీ సంతానం కూడా పెరిగి పెద్దవాళ్ళయి ముసలివాళ్ళయిపోతారు. వేసవి తరువాత వేసవి, సూర్యుడు మండిపోతుంటాడు. ఎద్దులన్నీ చచ్చిపోతుంటాయి. గుర్రాలు కూడా - గొర్రెలు - అయినా చాలా కాలం అదే పని. ఈ తొడుగు చేస్తూనే వుంటారు - అన్ని ఋతువులు మారిపోతుంటాయి - కానీ మీ పని పూర్తి కాదు - దాని బదులు - మీరు నాకు నాడాలు కొడుతున్నారు కదా - కాలకుండా - అలాగే మీరు కూడా కాళ్లకి తోలు చెప్పులు కుట్టుకోండి - అప్పుడు ఎక్కడికి కావాలంటే అక్కడికి వెళ్ళవచ్చు - మీకు కాళ్ళు కాలవు.'

'సత్పురుషునికి ఈ మాట నచ్చింది - అంతే - బండి కట్టుకొని - రెండు చెప్పులు కుట్టించుకొని వచ్చాడు - కాళ్లు కాలకుండా అన్ని చోట్ల తిరిగాడు - అతను, 'నంది', పక్షులు, చెట్లు అన్నీ నవ్వాయి.'

'నంది' చనిపోయిన తర్వాతి శివుని నందికి తోడుగా వెళ్ళింది' అని కథ ముగించాను. ఆమె గాయం శుభ్రంచేసి - కట్టు కట్టి - నా గదిలో నుంచి - బూట్ల జత తెచ్చాను. అవి చూసి మెదూ నవ్వింది. చాలా బలహీనంగా - చాలా బలహీనంగా ఏదో కుందేలు శబ్దంలా-

'నీకు చెప్పానుగా - ఇండియా అసాధ్యమైనదని - ఆ ఎద్దులాగా - మేమూ తెలివిగలవాళ్లను చూసి నవ్వుతూంటాము.'

'ఇలాంటి కథ ఇక్కడ కూడా ఉంది..'

'కావచ్చు - తెలివితేటలు ఇండియా సొమ్మే కాదు కదా - కానీ నువ్వు నేలంతా కప్పలేవు కదా - ఈ బూట్లు వేసుకో -'

'ఆఁ.. మేము మంచిగా ఉంటాం..' అంది.

'మేము తెలివిగలవాళ్ళం..' అన్నాను.

'నేను 'మార్జాశా'లాగానే ఉంటాను. నన్ను బ్రాహ్మణుణ్ణిగానే ఉండనీ - ఎద్దులాగా..' అన్నాను.

ఆమెకు నేను తెచ్చిన బూట్లు నచ్చాయి. పసుపు రంగు బోర్డర్‌తో బీజ్ రంగులో ఉన్నాయి. నన్ను గౌరవించడానికి ఆమె వాటిని రోజూ వేసుకునేది. నేను పారిస్ - లండన్ వెళ్ళే వరకు - అప్పటికే నా పరిశోధన పూర్తి కావచ్చింది. బ్రిటీష్ మ్యూజియంలో కొన్ని పుస్తకాలు బాగ్లీన్‌లో కొన్ని పుస్తకాలు చూస్తే పూర్తి చేయవచ్చు. అన్ని కాగితాలు పెట్టె నిండా పెట్టాను. మరో పెట్టెలో ఉన్ని దుస్తులు సర్దాను. రాబోయేవి చలి రోజులు. అందులోనూ లండన్‌లో - మరీ చలి. జాగ్రత్తగా ఉండాలి కదా.

మెదలీనా అన్ని అజమాయిషీ చేస్తున్నది. రెండు పెట్టెలు మోయటం కష్టమని సైకిల్ టైర్ల బండి తెప్పించింది. బస్‌స్టాప్ వరకు.

బస్సెక్కుతుండగా 'నేనూ వస్తాను - స్టేషన్ వరకు' అని ఆశ్చర్యపరిచింది. బస్సులో ప్రక్కప్రక్కనే కూర్చున్నాం. వెచ్చగా!

అవును - బస్ బాగానే ఉంది. 'ఇన్నాళ్ళు టాక్సీల్లో తిరిగాం - డబ్బు దండగ' అంది.

'నా సున్నితమైన శరీరం తట్టుకోలేదు సుమా - ఈ బస్ కుదుపులు' అన్నాను.

'అవును - మహారాజు కదా..'

'నాకైతే మనుషులు కావాలి - అలవాటే - మా తాతలు విప్లవ కాలం నుంచి వారసత్వం కలవారు' అంది.

'అలాగే - 'మర్జాశా' అన్నాను. సెయింట్ చార్లె స్టేషన్‌కి రాగానే నేను ఫస్టు క్లాస్ టికెట్ కొన్నాను. 'మహారాజు!' అంది.

'అవును - నువ్వెప్పుడైనా పాదుషావే సుమా' అంది.

నేను పెట్టెలో ఎక్కాను. పోర్టరె పెట్టెలు సర్దాడు. మెదూ నేను ఔరంగాబాద్ నుంచి తెచ్చిన స్వెటర్ వేసుకుంది. పసుపు పచ్చనిది. ఆ రంగు ప్రక్కన ఆమె

బుగ్గలు పాలిపోయినట్లున్నాయి. ఎంతో దయగా, ఎంతో సత్యంగా కనపడుతోంది. అంతలో రైలు నన్ను తీసుకు పోయింది.

'ఓ దేవతా - ఇదిగో రాముడు చివరిసారిగా - నీ పాదపద్మాలపై తల వంచుతున్నాడు-'

సెయింట్ చార్లె స్టేషన్ నుంచి రైలు ఉత్తర దిక్కుగా పరుగులు పెడుతోంది. ఇగిరె, తరస్కా, అవిగ్న, ఆరెంజ్ ఊళ్ళు దాటుకుంటూ ప్రయాణం సాగుతోంది. చలికాలం మెల్లగా వసంతంలోకి మారుతోంది. నాకు సావిత్రి తలపుల్లోకి వచ్చింది. చాలా ఉత్తరాలు వచ్చాయి. ఆమె ఇప్పుడు అస్సాంలో ఉంది. రోజు ఎడతెరిపిలేని వర్షాలని, భూతియా నాగాల గురించి - కాఫీ తోటల గురించి రాసింది. "అబ్బ - ఒకటే వర్షం - భూమికి దాహం తీరదేమో! ఇప్పుడు స్వతంత్ర భారతం కదా - బలపడుతోంది - మంత్రులు, సెక్రటరీలు, వస్తున్నారు - పోతున్నారు విందులకు. మనం నిర్మించుకున్న 'భారత్' ఏమిటి? రామా - నిజంగా నాకు చాలా విచారంగా ఉంది. కొందరు మన పొరుగు చైనాలాగా అని - మరికొందరు లేదు-లేదు మనకు అన్నీ నేర్పిన ఇంగ్లాండ్‌లాగా అని వాదిస్తున్నారు. అసలు - ఇండియాని ఇండియాలాగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశం ఎవరికీ ఉన్నట్లు లేదు - నెహ్రూ హామ్లెట్‌లాంటివాడు - అతని పిచ్చి - అతని తెలివి అనుకుంటాడు. మిగతావాళ్లు దెయ్యాలనే (ప్రేతాలనే) చూస్తున్నారు. ఒఫీలియా చనిపోయింది. ఖననం చేశారు కూడా. షిల్లాంగ్‌లో ప్రతాప్ పోలో ఆడుతూ గుర్రం మీద నుంచి పడిపోయాడు. ఉత్తరం రాస్తూ ఉండు - సావిత్రి."

ఈ ఉత్తరం చాలాసార్లు చదివాను. ప్రతి అక్షరం అర్థమయింది. ఉత్తరంలోని ఖాళీలు, కామాలు, ఆమె అక్షరాల ఒంపులు - అన్నీ తెలుస్తూనే ఉన్నాయి.

మెదలీనా అన్నీ విశద పరుస్తుంది.

సావిత్రి అన్నీ గుర్తిస్తుంది.

నెహ్రూ కాదు - నేను హామ్లెట్! నా పిచ్చి కనీసం తెలివి కూడా అనుకోను. చేతుల్లో ముఖం పెట్టుకుని దుఃఖించాలి. కానీ కదిలిపోతున్న సుందర ప్రదేశాలను - అందమైన భవనాలను - ఆర్చి గేట్లను చూస్తున్నాను. కిందగా గుర్రపు బళ్ళు, ఎరువు తీసుకుని పోతున్నాయి. కోళ్లు - బాతులు రెక్కలల్లారుస్తూ ఎగురుతున్నాయి. నాకు ఇవన్నీ చూస్తుంటే నేను కలిసిన ఫ్రెంచి కవి గుర్తుకొచ్చాడు. ఆయన చెప్పేవాడు - నువ్వు కవి కావాలంటే - అదిగో - ఆ రైలు క్రాసింగ్ దగ్గర ఉద్యోగం చేయి. రైలు వచ్చే ముందు గంట మోగుతుంది - ఆకుపచ్చ దీపం - గేటు మూత పడుతుంది.

పిల్లలంతా గోలగా అరుస్తుంటారు. నువ్వు నేరస్థుడిలాగా నిలబడతావు. పిల్లల ముఖాలు చూడు - వెలిగిపోతూ ఉంటాయి. మధ్యాహ్నం దగ్గర్లో ఆవుల కొట్టానికి వెళ్ళు. పాలు, సాసేజీలు తెచ్చుకో. (ఇంటి దగ్గర పొట్లాడే పెళ్ళాం ఎలాగూ ఉంటుంది) - ఆవుల కొట్టాం దగ్గర పోలిష్ అమ్మాయిలుంటారు - కాసేపు కబుర్లు చెప్పు. ఇంటికి వెళ్ళి కవిత్వం రాయి. నిజంగా ఇప్పటి కవులకు ఇదే సరైన జీవితం. నీకెలాగూ పొట్లాడే పెళ్ళాం ఉంటుంది. రాత్రికి ప్రక్కలో వెచ్చగానే ఉంటుంది. నీవు రాసేది ఆమెకు ఏమీ అర్థం కాదు. కానీ నీకు పిల్లల్ని కనిపెడుతుంది. అదీ - నీకు మూడు ఉద్యోగాలుంటాయన్నమాట. తీరుబడిగా కవిత్వం రాయటం - రైలు గంట మోగగానే గేటు మూయటం - దేశానికి అవసరమైన సంతానాన్ని సాకటం!

చూశావా - అప్పుడే 'బాడీలేర్'లాగా రాయగలవు.

ఇదీ - కవిగారి కథనం. ఆయన కళ్ళ నిండా కవిత్వం ఉబుకుతుండేది. కానీ చాలా బలహీనంగా ఉండేవాడు. తొందరగానే చనిపోయాడు.

ప్యారిస్‌లో నా కోసం కాథరీన్ - జార్జి స్టేషన్‌కు వచ్చారు. నేను వద్దని చెప్పాను. 'రామా - ఇది నాకు కొత్తేమీ కాదు - నాన్నగారి క్లయింట్ల కోసం తరచూ వస్తూంటాను. ఇప్పుడు కారు కూడా ఉంది.'

నన్ను సరాసరి వాళ్ల అపార్ట్మెంట్‌కే తీసుకు వెళ్లారు. 'మైకెల్‌యాంజి' రోడ్డులో.

'ఇక్కడ నుంచి నీ గ్రంథాలయం కాస్త దూరమే. కానీ రోజూ నేను నా కారులో దింపుతానులే. నాకు ప్యారిస్‌లో తిరగటం సరదా. పారిస్ పౌరుడు చాలా తెలివిగల జంతువు. అతనిని పరికించడం చాలా తమాషాగా ఉంటుంది' అని నవ్వింది.

నా గది వంటింటి ప్రక్కనే ఉంది - 'నీకు వెచ్చగా ఉంటుంది - నువ్వు ఉన్నన్నినాళ్లు మాంసం వండను - ఒట్టు' అంది. 'నువ్వు ఉదయాన్నే స్నానం చేస్తావు కదా - ఇదిగో కాఫీ - పాలు ఇక్కడే ఉంటాయి - ఏమాత్రం మొహమాట పడకు' గలగలా చెప్పింది. జార్జి మౌనంగా ఉండిపోయాడు. పెద్దరికం వచ్చినట్లుంది. ఆ రోజు రాత్రి ఒంటిగంట వరకు కబుర్లు చెప్పుకున్నాం. భోజనాల సమయంలో జార్జి - 'ముందుగా నీకే చెప్తున్నాం - కాథరీన్ అమ్మ కాబోతోంది' అన్నాడు.

ఈ వార్త విని ఒక్కసారిగా గంగలో స్నానం చేసిన పునీతుడిలా అనుకున్నాను. ఎందుకో తెలియదు. కాతరీన్ సూప్ తెచ్చి పెట్టి నన్ను తల సవరించింది సరోజలాగా.

'అన్నా - నువ్వు నా కొడుకుని పెంచుతావు కదా - నీ తెలివితేటలన్నీ నేర్పుతావు కదా' అంది. నేను కదలిపోయాను.

జార్జి అడిగాడు - 'మెదూ ఎలా ఉంది' అని.

'ఇప్పుడు బుద్ధుని దారిలో నడుస్తోంది' అన్నాను.

జార్జి - 'కాథరీన్ - నువ్వు రష్యన్ నేర్చుకో - లేకపోతే నన్ను ఎప్పటికీ అర్థం చేసుకోలేవు - నా పూర్వీకుల భాష తెలిస్తేనే నా ఆలోచనలు తెలుస్తాయి' అన్నాడు.

"ఆహా - నీకు ముగ్గురు సంతానం కావాలి - నీ పనులన్నీ చేసి పెట్టాలి - నీ ఆలోచనలు తెలుసుకోవడానికి రష్యన్ నేర్చుకోవాలి - మీ మగవాళ్ళకి తృప్తి ఉండదే - ఏ ఆడదీ మగవాళ్ళను తృప్తి పరచలేదు' అంది.

'ఏమిటి - ఆ మాట రామా దగ్గరే అంటున్నావా?'

'కాని రామా - రామ - కాదు కదా' - అని ఎలా చెప్పాలో తెలియక తికమక పడింది.

'అవును రామా - మగవాడు కాదు!' జార్జి నవ్వాడు.

ఆ రాత్రి నన్ను గదిలోకి పంపిస్తూ - రామా నువ్వు ప్రార్థనలాంటివాడివి - అని నా బుగ్గ మీద ముద్దు పెట్టి శుభరాత్రి చెప్పింది. నువ్వు బాగా పెద్దవాడివైపోయావు అంటే - 'పురాతనత్వం' సంతరించుకున్నావు - అందుకే ప్రార్థనలాంటివాడివి అంది.

ఆ రాత్రి నాకు బాగా నిద్రపట్టింది. కలలు కూడా ఏమీ రాలేదు. బహుశా మెదూ కూడా హాయిగా నిద్రపోయి ఉంటుంది.

పాపం - పొద్దున్నే కాఫీ ఆమే చేసుకోవాలి కదా - అన్నట్లు రేపు గురువారం - మెదూకు సెలవే - నేను మరో గంట నిద్రపోయాను.

నా పరిశోధన కోసం రిచ్ మే రోడ్డు నుంచి - సార్బోని వరకు తిరుగుతూనే ఉన్నాను. ఈ రెండు చోట్ల నాకు కావలసిన గ్రంథాలకు లోటు లేదు.

ఇక్కడే నాకు చాలామంది స్కాలర్లు పరిచయం అయ్యేవారు. వాళ్ళ పరిశోధనాంశాలు కూడా వింతగా ఉండేవి. ఒకడు అస్సిరియాలజీలో (Assyriology) పరిశోధన చేస్తున్నాడు. సుమేరియన్ (Sumerian) గ్రంథాలు వెతుకుతున్నాడు. రాజరికాలు, వ్యాకరణం మూలాల కోసం. మరొకడు మధ్య ఆసియా వస్త్రధారణ విశేషాలు - ముఖ్యంగా స్త్రీలవి - పరిశోధిస్తున్నాడు. ఎందుకు? క్రిస్టియానిటీ (నెస్టోరియన్)గా పూర్తిగా బౌద్ధంలో నుంచి వచ్చిందని నిరూపించడానికి. స్త్రీల వస్త్రధారణలో ఎక్కడా 'సిలువ' కనిపించలేదని! అవి బౌద్ధంలోని స్వస్తిక్ ముద్రలే అని.

ఈ స్కాలర్లు - పరిశోధకులు వారి వ్యాపకం గురించి మాట్లాడతారు. నేనూ నా పరిశోధన గురించి చెప్పేవాడిని. కానీ ఒకరికొకరు ఏమాత్రం సాయపడరు.

పరిశోధన - నువ్వు ఎడారిలో దారి తప్పినట్లే. ఎక్కడ చూసినా నక్షత్రాలు కనిపిస్తాయి. నీకు ఎక్కడో ఒక నక్షత్రం కనిపిస్తుంది. దానిని అనుసరించి ఆ దుమ్ములో, ఆ అడవిలోని నువ్వు చివరికి - ఒక రాజ్యానికి చేరుతావు. అక్కడ తప్పనిసరిగా ఒక రాజకుమారుడు ఉంటాడు. అతనికి పెళ్లి కావలసిన కూతుళ్ళుంటారు. నువ్వు పరిశోధన సరైన రీతిలో, సరైన విషయంలో చేస్తే - అంటే నీ నక్షత్ర మండలాన్ని నువ్వు అనుసరించిన తీరు ఎప్పుడూ ప్రత్యేకంగానే ఉంటుంది (అదే పరిశోధన). నక్షత్ర మండలాలు సరళిని మరో పద్ధతిలో నీ పద్ధతిలో ఆకాశం మొత్తం వర్తులాకారంగా ఉన్నా నీ తార నీకు దారి చూపి - తార నిన్ను చేర్చే తీరం నీకు ప్రత్యేకం! అదిగో - నీ కోసం ఓ రాజకుమారి వేచి ఉంటుంది. వరమాల వేయటానికి.

నా తార, నా ప్రత్యేకమైన నక్షత్రం - పర్షియా - టర్కీకి, బల్గేరియా మధ్యలో ఎక్కడో ఉంది. బహుశా ఇప్రటీస్ లేదా ఆసియా మైనర్ పైన కావచ్చు. మానవ నాగరికత చిహ్నాలు పుష్కలంగా ఉన్న ప్రదేశం - నాకు తప్పనిసరిగా - కాతర్లకు - ఇండియాకు సంబంధం లభిస్తుంది - చాలా గ్రంథాలు పరిశీలించి, పరిశోధించాను. నాకు సహజమైన అంతర్దృష్టి - ఇది పరిశోధనా పరిశ్రమలో సహజంగా వృద్ధి చెందుతుందేమో! ఏ గ్రంధాన్ని చూసినా - నాకు కావలసిన విషయం ఏ పుటలో ఉంటుందో - ఈ అంతర్దృష్టి దారి చూపుతుంది - అది తప్పకుండా ఆ ప్రాంతంలోనే ఉంటుంది కూడా! నాకు కావలసిన ఎన్నో పరిశోధనాంశాలను ఇలాగే సేకరించాను. జార్జి హాస్యమాడేవాడు కూడా. 'ఇదంతా నీ యోగసాధన మూలంగా లభించింది' అని.

నీవు తప్పని సరిగా ఇక్కడి గ్రంథాలయాల్లో ఈ విషయం ప్రచారం చేయాలి. 'దివ్యదృష్టితో పరిశోధన - రామస్వామిని సంప్రదించండి - అని - ప్రకటన విడుదల చేయాలి. కేవలం డజను పాఠాలు - అన్ని మర్మాలు విడిపోతాయి అని కూడా. ఇలాంటి అద్భుతం ఇంతవరకూ ఎవరూ చేయలేదు' అనేవాడు.

మిగతా పరిశోధకులలకు ఈ దృష్టి ఉన్నదో లేదోగానీ - నేను మాట్లాడిన స్కాలర్లకు ఈ ఇన్ట్యూషన్ అంగీకరించారు. బహుశా నాకంటే ఎక్కువగా - నాకు లభించిన పరిశోధనాంశాలు చాలా ముఖ్యమైనవి. 'Druzes' చరిత్ర కోసం పరిశోధించిన గ్రంథాలన్నీ ఇంతవరకూ ఎవ్వరూ ముట్టుకోలేదు. 'Gobineau' చేసిన పరిశోధన చాలా ముఖ్యమైనది. అతను ఒక రాజర్షి. అద్భుతమైన, ప్రత్యేకమైన వ్యక్తి. ఆయన

తరువాత Saillyde Mollinfort శ్రమ అసాధారణమైనది. అరబ్బుల చరిత్ర కవిత్వంతో కూడిన మహోన్నత పాండిత్యం అసమాన్యం. వీటన్నిటిలో భారత్‌తో సంబంధాలు స్పష్టంగా చెప్పబడి ఉన్నాయి. భారతీయ తత్త్వ విచారణ గురించి గొప్పగా వివరించారు.

నేను Sailly చెప్పినదంతా చదివాను. 'డ్రూజేల' (Druzes) గురించి. తర్వాత Morganston వెల్లెన్ బీ (Wellenby) వీళ్ళు కూడా గొప్ప స్కాలర్లు. Wellenbyకి విషయ జ్ఞానం విస్తృతం. కానీ భాష ఎలా వాడాలో తెలియదు. నాకు సందేహం లేదు. ఇలా అనుకోవడం చిల్లరతనం - ఇలా ఉంటుంది - ఇది స్కాలర్ల రాతలు కాదు. దానికి కారణం ఆయన ముందు యుద్ధవీరుడు. అలెగ్జాండర్‌తో ఇండియాలో తిరిగాడు. అవన్నీ Amberie Textలో నిక్షిప్త పరిచాడు. ఈ Wellenby నాకు చాలా ఉపయోగపడిన పరిశోధకుడు. తర్వాత Massignon - ఈయన ఇండియా అంటే ఆరాధన - అంత అవగాహన కూడా. ఈ విధంగా పరిశోధనా సిద్ధాంతం చాలా ముందుకు తీసుకు వెళ్ళగలిగాను. కానీ 'Boleian'కి వెళ్తేగాని ఇది పూర్తి కాదు. Wellenby, Garraud గురించి మరింతగా సమాచారం సేకరించవచ్చు.

Messianic సంప్రదాయం Senitesలో దొరకవచ్చు. అంతేకాదు కాథరీన్ - జార్జితో నెలన్నరగా ఉంటున్నాను. ఇక్కడి నుంచి ఇంగ్లాండ్ వెళ్ళటానికి బలమైన కారణం కూడా ఇదే. వసంతకాలపు తొలిరోజులు - 1953 - ఇంగ్లాండ్ ప్రపంచ వ్యాప్తంగా తరలివస్తున్న అతిథులను ఆహ్వానించే సమయం. ఇప్పుడు ఇంగ్లాండ్‌కు అందమైన యువతి రాణిగా కిరీటం ధరించబోతున్న సమయం. ఆ సమయంలో ఎంతో చైతన్యవంతమైన రోజులు - అప్పుడు నేను లండన్ చేరాను. త్వరగా - పేలవంగా ముగిసిపోయిన చలికాలం - ఆ వెంటనే ప్రవేశించిన వసంత శోభ - పార్కులన్నీ తెలుపు, పసుపు, ఎరుపు పూలతో కళకళలాడుతున్నాయి. లండన్ పౌరుడు కొత్తబట్టల్లో అతిథులను సాదరంగా ఆహ్వానించడానికి సన్నద్ధమవుతున్నాడు. స్త్రీలు తమ దుస్తులను మరింత కనులకింపయిన రంగుల్లో ధరిస్తున్నారు - మగవాళ్ళు తక్కువ తాగుతున్నారు. ఇంగ్లీష్‌వాళ్లని ఈ విధంగా చూడటం నాకు ఆనందంగా ఉంది. వారి ప్రవర్తనలో ఎక్కడా పెళుసుతనం కనబడటంలేదు. వారి సార్వభౌమాధికారాన్ని ప్రక్కన పెట్టి ఎంతో మర్యాదగా కనిపిస్తున్నారు. ఇంకా ఆఫ్రికాలో వారి ఇబ్బందులు పడుతున్నారు - ఇండియా నుంచి చేతులు కడుక్కుని వచ్చేయటం - వారికి పెద్ద ఉపశమనంగా అనిపిస్తోంది. ఆక్స్‌ఫర్డ్ చాలా దయార్ద్రంగా - విధేయంగా - వినయంగా అనిపిస్తుంది. కేంబ్రిడ్జిలో ఉన్నంత చైతన్యం - ఇక్కడ తక్కువ. బహుశా కేంబ్రిడ్జిని సావిత్రి ద్వారా చూశాను కదా. అదే కారణం కావచ్చు. ఇప్పుడు ఆక్స్‌ఫర్డ్‌ను నేను

స్వయంగా తెలుసుకుంటున్నాను. త్వరలోనే లండన్ వచ్చేశాను. నాకు శుభవార్తే ఎదురయింది. 'కుక్స్' సావిత్రి ఉత్తరం ఇచ్చాడు. ఆమె ఉత్తరాలు - గ్రీన్‌పార్క్‌లో ఓ సైప్రస్ చెట్టుకు ఆనుకుని చదువుతున్నాను. నా చేతులు రుద్దుకుని సావిత్రి లేఖ చదివాను. ఆమె రాణిగారి పట్టాభిషేకానికి తండ్రితో వస్తున్నట్లు రాసింది. ఆయన బ్రిటిష్ రాజరికానికి ఎప్పుడూ విధేయుడుగానే ఉన్నాడు కదా - మరి కొత్త రాణిగారి కిరీటపు ధగధగలు కళ్ళారా చూడవద్దు!

"ఇప్పటి భారత ప్రభుత్వం నాన్నగారిని పట్టించుకోవడం లేదు - భరణం కూడా తగ్గించారు. 'అరే - ఈ చిన్నచితకా గుమస్తాలతో ఎలా పోట్లాడతాం - వాళ్లకి మనుషుల విలువ తెలుసా? మూర్ఖులు' అని మండిపడతారు. ఇప్పుడు ఈయన సలహా ఎవరికి కావాలి? పులి వేటకు వెళ్ళటానికి ఇంగ్లీష్ దొరలేరి? నెహ్రూ పిలిచి - 'రాజా - జపాన్ వెళ్ళండి రాయబారిగా - లేదా వాషింగ్టన్‌లో మన శాశ్వత రాయబారిగా ఉండండి' అని చెప్పరు కదా - 'ఇక ఇంగ్లాండ్‌కి ఎవరినో ఖద్దరువాలాను పంపుతారు. వాడు కిళ్ళీ నములుతూ బంకింగ్ హామ్ కారిడార్లో ఉమ్మి వేస్తూ తిరుగుతుంటాడు.' ఇదీ నాన్నగారి ఆవేదన. ఇప్పుడు ఇండియాలో కూడా పెద్దగా చెప్పడానికి ఏమీ లేదు. నాకు నువ్వే నా ఇండియా. అప్పుడప్పుడు నా గురించి ఆలోచించు. సావిత్రి."

నేను పచ్చటి నేలను చూశాను - అప్పుడే విడిపోతున్న పొగమంచు తెరలలో నుంచి ఓర్ ఫ్రే చెట్లు - ఆ తరువాత ఖాళీ రోడ్డు - ఆపైన పార్కు - ఇంకా దూరంగా బంకింగ్‌హాం ప్యాలెస్. అవును - సావిత్రి రాకకు రాణిగారే కారణం. కృతజ్ఞతాపూర్వకంగా ఆ ప్యాలెస్‌వైపు నడిచాను.

ఇక్కడ నా పరిశోధన వెనకబడింది. తర్వాత కొన్ని నెలలు అంతగా సాగలేదు. నా ఆరోగ్యం మెల్లగా క్షీణించింది. ఎక్సరేలలో ఎటువంటి నీడలు కనపడకపోయినా - నా ఎర్ర రక్తకణాలు నాకంటే తెలివిగలవి. నా బలహీనత వాటికి నాకంటే బాగా తెలిసినట్లు ఉంది. మార్పు కోసం బయటకి వెళ్ళాను. కానీ త్వరలోనే తిరిగి వచ్చేశాను. ఈసారి సరాసరి ఆస్పత్రికే. ఈ హాస్పటల్ ఈస్టర్ దగ్గర్లో ఉంది. అందులో చేరటానికి హైకమిషనర్ సాయం చేయవలసి వచ్చింది.

'మీకు ఎక్కువ రోజులు 'బెడ్ రెస్ట్' అవసరం. అది కూడా గుణం కనిపించకపోతే - తోరాకోప్లాస్టీ ప్రయత్నిద్దాం. మీ శ్వాస స్థిరంగా ఉండాలి - అప్పుడే మీరు ఆరోగ్యంగా ఉన్నట్లు లెక్క. కుడి ప్రక్కకు తిరిగి పడుకోండి!' ఇదీ ఆ హాస్పిటల్ విషయం.

డాక్టర్ బర్న్‌హామ్ - 'మీరు త్వరగా కోలుకోకపోతే మీకు 'చికెన్ సూప్' ఇస్తాము' అంటూ నవ్వాడు.

ఇక్కడ నర్సమ్మలు చాలా దయగలవారు. 'టెంపరేచర్ చార్ట్' జాగ్రత్తగా రాసి పెడుతున్నారు. డాక్టర్ బర్న్ హామ్ - 'మీరు కోలుకుంటారు - తప్పకుండా' అని భరోసా ఇచ్చారు. మీకు 'నూమో తొరాక్స్' పనికిరాదు. అదే ఇండియన్ మామిడికాయలాంటిది. నువ్వు చూడవచ్చు - కాని తినలేవు' అని నవ్వాడు. 'తోరోకో ప్లాస్టీ' అదే మనకు దారి. మీరు వినకపోతే మీ సీతారామ మామకు కబురు చేస్తా' అన్నారు.

మామ సంగతి ఎప్పుడో ఒకసారి చెప్పి ఉంటాను - కానీ ఎంత దయగల డాక్టరు - ఎంత గుర్తు పెట్టుకున్నారు - మరొకరి బాధను తొలగించేవారు - ఎంత దయగలవారు.

కేంబ్రిడ్జ్ నుంచి లక్ష్మి వచ్చింది ఆస్పత్రికి. ఇండియా హౌస్‌లో నేను లైబ్రరీలో ఉన్నప్పుడు కలిసింది. అద్భుతమైన గ్రంథాలయం అది.

నాకు ఏదో - ఎవరిదో శాపం తగిలిందని నమ్ముతోంది. ఆమె రాకలో అంతరార్థం తెలియనంత మూర్ఖుణ్ణి కాదు - భారత స్త్రీల - నుదుట పెద్ద బొట్టుతో తెలివిగా - పవిత్రంగా కనబడతారు. లక్ష్మికి యూరోపియన్ స్త్రీలంటే మంచి అభిప్రాయం లేదు. 'వాళ్లు వంటికి వళ్ళు ఆనించి డాన్స్ చేస్తారు. ఎప్పుడూ మగవాళ్ళని ఆకర్షించటానికి ప్రయత్నిస్తారు' అంటుంది. ఇక్కడ లక్ష్మి 'చైల్డ్ సైకాలజీ' చదువుతోంది. త్వరలో న్యూఢిల్లీ వెళ్లి విద్యాశాఖలో చేరుతుంది. బాలలకు 'నీతి పుస్తకాలు' తయారు చేయించి - దేశంలో స్కూళ్ళన్నీ సరఫరా చేయిస్తుంది.

నాకెలాంటి పవిత్రత - నీతి ఇష్టం లేదు. మన నైతికత మెట్ట వేదాంతం మీద ఆధారపడింది.

హరిశ్చంద్ర మహారాజు సత్యవాక్కు పరిపాలన కోసం రాజ్యాన్ని కోల్పోయాడు - భార్యను - కొడుకును కూడా - కానీ సత్యాన్ని రక్షించాడు. మన 'పవిత్ర' స్త్రీలకు సత్యవ్రతుని కథ చెప్పాలి.

మహాభారతంలోని ఆ కథలో - అడవిలో తపస్సు చేసుకుంటున్న ఋషి దగ్గరకు ఒక లేడి నురుగులు కక్కుకుంటూ భయంతో వచ్చి రక్షణ కోరుతుంది - ఆ వెనకే వేటగాడు - లేడిని వెతుక్కుంటూ వచ్చి - తాపసిని చూసి - వినయంగా నమస్కరిస్తాడు. 'అయ్యా - ఇటుగా లేడిపిల్ల వచ్చిందా - నా కుటుంబం తిండి లేక వస్తుంటుంది - ఐదుగురు పిల్లలు కడుపు మాడి ఉన్నారు - కరువుతో కడుపు కాలి ఉన్నాము - ఇటుగా లేడి వచ్చిందా' అని అడుగుతుంటాడు. 'సత్యవ్రతుడు' -

అయిన తాపసి ఏమి చేయాలి? సత్యమే పలుకుతానని శపథం చేసినపుడు - ఇప్పుడు సత్యం పలికితే లేడి ప్రాణం తీయదా? అప్పుడు వేదాంతపరమైన సత్యాన్ని - 'చూసినవాడు చెప్పలేడు - చెప్పేవాడు చూడలేడు' అని ఘోషిస్తాడు.

అదీ - సత్యవ్రతం అంటే. అది మెట్ట వేదాంత పరమైనది. నైతికతకు సంబంధం లేదు.

ఈ లక్ష్మి ఇండియా కాదు - కానీ ఈ లక్ష్మి ఎలాంటి ఇండియా అంటే - దండెత్తి వచ్చిన ముసల్మానులను, ఇంగ్లీషు వాళ్ళను అందరికీ తలలు వంచి నమస్కారం పెట్టిన జాతి! ఇండియాను అమ్మింది బ్రాహ్మణులే! దేవగిరిలో ఏమి జరిగింది? పూర్ణయ్య టిప్పుసుల్తాన్ రహస్యాలు అమ్మలేదా? తెల్లవాళ్ళు కోటగుమ్మంలో నుంచి రాలేదా? శ్రీరంగపట్నంలో ధైర్యసాహసాలు లేని సత్యం - అది బానిసల - విధవల నీతిగా మారిపోతుంది.

అహింస - గాంధీ చెప్పినట్లు - చైతన్యమైనది - ధీరోదాత్తమైనది - మన దేశాన్ని కాపాడుకోవాలి - విజయాలు సాధించాలి - ఉష్ట్ర పక్షిలా తల ఇసుకలో పెట్టి నీతులు వల్లించకూడదు. మనం సాధించే స్వాతంత్రం - స్వరాజ్యమన్నమాట - అంటే సత్యాగ్రహం - సత్యంతో రగిలిన ఆగ్రహం.

బలహీనమైన ఊపిరితిత్తులలు - నరాల బలహీనతలను ఎక్కువ చేస్తుంటాయి. డాక్టర్లు చెప్పారు.

లక్ష్మికి వీడ్కోలు పలికాను - అప్పుడంది - 'ఏమిటి సావిత్రి నిన్ను వివాహం చేసుకుంటుందా? ఎప్పటికీ అలా అనుకోవద్దు. ఆమె చీర కుచ్చిళ్ళు చుట్టూ ఎంతోమందిని తిప్పుకుని - ఏనుగులకు పడవేసింది - ఆమె కావాలంటే ఏ క్రికెట్ మహారాజునో చేసుకోగలదు. ఆమె మారుటి చెల్లెలు బడా వ్యాపారవేత్తను వివాహం చేసుకోలా? ఇప్పుడు స్వతంత్ర భారతంలో ఆయన కేంద్ర మంత్రి. ఇవాళ ఇండియాలో ఏదైనా రూపాయలతో కొనవచ్చు. రామస్వామిలాంటి బ్రాహ్మణ్ణి ఎవరు కోరుకుంటారు?'

'అయితే బాగా డబ్బు సంపాదించి - భార్యను కొంటానులే' అన్నాను.

లక్ష్మి నిలబడి - నా మీద దుప్పటి కప్పి - నా పుస్తకాలు చూసింది. 'ఆఁ.. ఈ ఇంగ్లాండు - వ్యాపారస్తులు - దుకాణదారులు! ఒక చేత్తో రాణి నెత్తిన కిరీటం పెడతారు. మరో చేత్తో డాలర్లు లెక్క పెట్టుకుంటారు. ఇండియాకి స్వాతంత్రం వచ్చింది. ఆర్థికపరమైన కారణాలతోనే' అంది.

'నాకు రాజరికం ఇష్టం - రాణిని గౌరవిస్తాను' అన్నాను.

'ఇది వినటానికి హాస్యంగా ఉంది. అది ఒక భారతీయుడి నోటి వెంట' అంది.

'నేను మహాభారత కాలంనాటి వాడిని. నాకు ఈ ఆర్థిక - వ్యాపార ధోరణితో పని లేదు.' అంతే - ఆమె నిష్క్రమించింది. తర్వాత చాలా వారాల పాటు నన్ను చూడడానికి రాలేదు. పోస్ట్ కార్డు పంపింది. ఫైనల్ పరీక్షలు అని. నాకు రాణీగారి పట్టాభిషేకం గురించిన కలలు రావడం మొదలయింది.

గాలిలో గుమ్మటాలు - బానర్లు ఎగురుతున్నాయి. ఎక్కడైనా ట్రంపెట్లు మోగుతున్నాయి. మనసులో ఆలోచనలాగా చిన్న-చిన్న విమానాలు తిరిగి వస్తున్నాయి. బహుశా అందులో దేనిలోనో సావిత్రి ఉండవచ్చు. ఈ ఆసుపత్రి కిటికీలో నుంచి చూస్తుంటే అలాగే అనిపిస్తోంది. చాలా రోజులుగా ఉత్తరమే లేదు - కానీ ఆమె వస్తున్నట్లు నాకు తెలుసు. ఆమె రాగానే నాకు తెలిసిపోతుంది.

ఇప్పటి లండన్ అలంకరణ: రాజకుమారులు, జూలూలు, సైనికులు, రాజకీయ నాయకులు - నాటకాలవాళ్ళు - ఆర్చీల మీద పని చేసేవాళ్ళు - గుర్రాల మీద పోలీసులు - ఇళ్ళ మీద వెలిగే దీపాలు - ఇవన్నీ ఎలాగైనా మార్చుకోవచ్చు. మనిషి తానేమిటో తెలుసుకునే ప్రయత్నమే ఇదంతా!

ఎందరిలాగానో ఉండటం - నీలాగా ఉండటమే అందరిలాగా నీతోనే మాట్లాడగలవు. నీతో నీవు! వస్తువులన్నీ శబ్దాలలో లయమవుతున్నట్లు మనకు కావలసినట్లు వీధులు - వెడల్పు - ఇరుకు అయిపోతుంటాయి. అవసరాలను - దూరాలను అనుసరించి వస్తువులు కనబడుతుంటాయి - అదృశ్యమైపోతుంటాయి - కనుమరుగై పోతుంటాయి.

విమానాలు ఎంత నమ్మకంగా ఎగురుతున్నాయో - కొంగలు జంట కోసం వెళుతున్నట్లుగా. థేమ్స్‌ను కేవలం నది మాత్రమే అనుకుంటాం. దేనిని ముట్టుకున్నా సంగీతం వినిపిస్తుందా? నువ్వు ముట్టుకున్న స్త్రీ విగ్రహం అయిపోతుందా? నిన్ను నువ్వు ప్రేమించుకోగలవు - నిన్నే నువ్వు ప్రేమిస్తావు! నీ చేయి పట్టుకుని నడిచేది విగ్రహంతోనే! బ్యానర్లు - బెలూన్లూ ఎగురుతూనే ఉన్నాయి. రాణీగారి పట్టాభిషేకం కదా - మగవాని అహంకారానికి చిహ్నం. నిశ్శబ్దంలో సంగీతంలా - చల్లని సరస్సులో హంసలా మనం స్వేచ్ఛగా ఉన్నాం. అందుకే వెలిగిపోతున్నాం.

కుడ్యాలన్నీ మణులతో మెరుస్తున్నాయి - పైకప్పు స్వచ్ఛంగా తళతళలాడుతోంది.

ఆసుపత్రిలో నర్సులంతా నమ్మకంతో ఉన్నారు. రాణీగారు వస్తారని. అందరినీ పలకరిస్తారని. రోగుల్ని దుప్పటితో కప్పి - థర్మామీటర్లు చూసి - ఎండతో వెలిగిపోతున్న ఆకాశాన్ని చూసి - రాణీగారు వస్తారు - మనందరితో చేయి కలుపుతారు. రోగులకు అంతా నయమైపోతుంది. ఆమె గులాబీ ఈకల గౌను రాపిడి - అలౌకిక పరిమళం - అందరికీ మేలు చేస్తుందని నమ్ముతున్నారు.

దీనికో కారణం ఉంది - ఇప్పుడు ఎవరైనా చనిపోతే - తీసుకుపోయేందుకు శవ వాహనాలు లేవు. గుర్రాలన్నీ వేరే పనిలో తీరుబడి లేకుండా ఉన్నాయి. రాణీగారి పట్టాభిషేకం! అందుకే విమానాలన్నీ నమ్మకంగా ఎగురుతున్నాయి. రైళ్ళన్నీ పట్టాలు వేసుకుంటూ పరుగులు పెడుతున్నాయి. ఎక్కడా ప్రమాదాలు జరిగే అవకాశం లేదు. నువ్వు ఎక్కడ నడిస్తే అక్కడ పూలు విరుస్తున్నాయి. ఎవరితోనైనా - ఏ భాషలోనైనా మాట్లాడవచ్చు. ఈస్టన్ స్టేషన్‌లో రైలు కూత పెడితే - అది సీతారామ మామ దొడ్లో చాకలి గాడిద అరిచినట్లుంటుంది. బహుశా రాజుగారి బట్టలు మోసుకెళుతున్నదేమో!

అంతా వాస్తవంలోనే ఉంటుంది. లిఫ్ట్ పైకి వచ్చినప్పుడు - నీ కోసం ఎవరో వస్తున్నారని చూస్తుంటావు. తలుపు తెరుచుకున్నప్పుడు అదిగో - ఆ వచ్చేది నీవాళ్ళే - అది ఎవరైనా నీకు కావాల్సింది ఒక్కరే - అదిగో 'జల తరంగ్'లాంటి స్వరం వినపడుతోంది. పింగాణీ గిన్నెలో నీళ్లు పోసి పుల్లతో తడితే - 'జల తరంగిణి' స్వరం గాలిలో అలలుగా తేలి వస్తుంది.

ఒకరోజు వినిపించింది - 'తొరాకోప్లాస్టీ'.. అది ఒక సంగీతంలా - అందమైన - శ్రావ్యమైన గీతంలా - చిన్నమ్మ పిలిచినా? సీతారాం మామను పిలిచినా? వాళ్లు 'తోరాకోప్లాస్టీ' అంటున్నారు. ఆపరేషన్ బల్ల అదే అంటుంది - డాక్టరు బరన్‌హాం 'అచ్ఛా జీ - నమస్తే' అంటున్నాడు. నాకేదో సంగీతం వినిపిస్తోంది - చర్చి గంటలు వినిపిస్తున్నాయి. మత్తుమందు శూన్యాన్ని చూపిస్తోంది. ప్రపంచంలో మళ్లీ సృష్టి జరుగుతోంది - ఊపిరితిత్తిలో అరిష్టం ఉంది - అదృష్టంలో చెడు ఉంది - మత్తులోంచి మేల్కోవడం - ప్రపంచాన్ని కొత్తగా దర్శించడం - అది నీకు నిద్రలో కనిపించిందే - సత్యం - వాస్తవం అంతర్వీక్షణం. అదే బాహిరకంగా చూస్తే ప్రపంచం అంటాం. దానికే 'జ్ఞాపకం' స్మృతి అని పేరు పెడతాం - జలపాతాన్ని పై నుంచి విను!

మనిషి ప్రపంచం నుంచి జ్ఞానం సంతరించుకోవాలనుకుంటాడు. కానీ తనలోనే నిక్షిప్తమై ఉందని తెలుసుకోవాలి.

అప్పుడే ప్రపంచం ఒక పండగలాగా ఉంటుంది.

మరణం ఒక బొమ్మలాగా తలుపుకు అంటించి ఉంది. లోపలికి రాలేదు కదా!

రాణీ ఒక్కతే రాగలదు - తన పదహారుమంది స్నేహితురాళ్లతో - ధవళ కాంతిలో మెట్లెక్కి - వరండా దాటి - అన్నీ వెలిగిపోతుంటాయి. హాస్పిటల్ వార్డులో ప్రార్థన చేసి - మమ్మల్ని చూసి నవ్వుతుంది. అంతే - జ్వరం చార్టులన్నీ కిటికీలో నుంచి ఎగిరిపోతాయి. అరిష్టపు పిట్టల్లా వెళ్లి చెట్ల మీద వాలుతాయి. పూలు విరుస్తాయి. రాణీ మాతో చాలాసేపు ఉంటుంది. ప్రపంచమంతా వీనుల విందైన సంగీతం నిండిపోతుంది.

ఆ తర్వాత ఆమె వచ్చింది - మళ్లీ-మళ్లీ వచ్చింది. ఈసారి సిగరెట్టు ఊదుతోంది - చాలాసేపు కూర్చుని -

'ఆడదానిగా ఉండకూడదు!' అంది.

'ఎందుకు సావిత్రీ' అన్నాను.

'ఆడదాని వయసు, మరణం వయసు ఒకటే' అంది.

'అంటే?' అన్నాను.

'ఆడదంటేనే మరణం! రామా - తెలీదా..'

'నాకు ఏమీ అర్థం కావడం లేదు సుమా..'

'నీవేగా అన్నావు - ఆడదంటే ప్రపంచం అని - ప్రపంచం అంతమైపోయేది కదా - లేదంటే 'వాస్తవం' అంటే 'మరణం' ఉండబట్టే కదా!

'ఈ ప్రపంచం ఇలాగే ప్రపంచం అయితే - ఇక 'వాస్తవం' ఏమిటి? వాస్తవాన్ని పదార్థంగా చూస్తే ఇక వాస్తవం 'సత్యం' లేదు - మరణ కిరీటమే 'పిరమిడ్' - ఇది మరణం అని చెప్పేవాడు మరణాన్ని చూడలేడు.'

'అయితే స్త్రీ మరణించాలి - లేదా మృత్యువుగా మారాలి. ఆడదంటేనే రోగం - అదే చారిత్రక సత్యం మగవాడికి!'

'మరి మగవాడు?'

'మగవాడే సత్యం - రామా! అతనే అత్యున్నతమైన కాంతి! మేము అబద్ధం - అబద్ధాన్ని సృష్టించేవాళ్ళం - 'జీవితం' అనే అసత్యాన్ని కల్పించేవాళ్ళం - అందుకే మమ్మల్ని మగవాడు అసహ్యించుకుంటాడు..'

'అయితే నా స్థానంలోకి నువ్వు రాగలవా?'

'నీకులాగా మారితే ఇక సమస్య ఉండదు - నాతో ఐక్యమయితే అదే అసలైన సావిత్రి.'

'అయితే సత్యవంతుడెవరు?'

'సత్యవంతుడే సత్యం' అని నిట్టూర్చాను.

ఇప్పుడు నా ఆపరేషన్ కుట్లు తీయగా నొప్పి పెడుతున్నాయి.

సత్యవంతుడు చనిపోడు.

నీకు చెప్పాను గుర్తుందా - పెళ్లికూతుళ్ళంతా వారణాసిలోనే జన్మిస్తారని.

అవును - అప్పుడు వారణాసియే పెళ్లికూతురన్నమాట.

సావిత్రి - మగవాడు చనిపోవాలి - అది తప్పదు.

'అలా అయితే ఆడదాని అస్తిత్వమే ఉండదు - Tristan చనిపోయినప్పుడు Iseult వచ్చింది - ఎప్పుడూ ఆలస్యంగానే'

'అయితే Iseult చనిపోతే?'

'అది మరణమే కదా - మరణం చనిపోతే?'

'అప్పుడు Tristan జన్మిస్తాడు - అప్పుడు మరణం (Iseult) ఉండదు.

'అయితే Iseult ఏమయింది?'

'Tristanగా మారిపోయింది.'

'Tristan చనిపోదు?'

'సత్యవంతుడు చనిపోడు.'

'ఎందుకని?' 'సావిత్రి బ్రతికి ఉండాలి కదా'

'అదే సత్యం - అదే సావిత్రి!'

అందుకే రాణిగారికి పట్టాభిషేకం.

'అది ఎలా?'

'మగవాడు తన మరణంలో ఆనందాన్ని చూడగలడు - మనిషికి మరణం పునర్జన్మ!'

'మరి పునర్జన్మ?'

'అది ఒక పండగ - ఒక సంబరం - ఒక మహాద్భుతం!'

'అంటే?'

'స్త్రీ ఒక త్యాగం - ఒక బలి - అన్నమాట'

'మరి త్యాగం ఏమవుతుంది?'

'అదే ప్రపంచం-'

'మరి ప్రపంచం?'

'అదే ఒక సామ్రాజ్యం-'

'అయితే ఆ రాజ్యం?'

'అదే రాణి!'

'ఆ విధంగా మనిషి తనకు తానే బహుమతి ఇచ్చుకున్నాడు!'

'అయితే మనిషికి చావు - మరణం లేదన్నమాట - అతను శాశ్వతం అనేగా?'

'అతని రూపమే కిరీటంతో ఉన్న రాణి?'

అప్పుడు 'ఇంద్ర - త్రిస్తుభ -' అనే మంత్రం చదివాను.

పంచదశ శిల - సోమ రాజు.

నాకు ఇప్పుడు అనంతశక్తి లభించింది.

నేనిప్పుడు క్షత్రియుణ్ణి.

ఓ దేవా - ఓ తండ్రీ - నన్ను నేను సమర్పించుకుంటున్నాను - నా బహుమతులు స్వీకరించు.

అగ్నిసాక్షిగా - వాయుశ్రవణంగా.

సూర్యుని సాక్షిగా - నేనిక్కడ?

నేనెవర్ని - అదే నేను.

ఋగ్వేదం ఘోషిస్తోంది.

రాణిగారికి నాలుగు సింహాల కిరీటం.

సావిత్రి నన్ను హాస్పిటల్లో చూడటానికి తరచూ వచ్చేది. ఎప్పుడు వస్తుందో కూడా తెలిసేది కాదు - వచ్చి నా జ్వరపు రికార్డు చూసేది - జ్వరం కూడా పరీక్షించి - నవ్వుతో క్షమాపణలు చెబుతూ - జ్వరం తగ్గింది - అవును నేనే నీ జ్వరం - అంటూ కంటనీరు పెట్టుకునేది - కన్నీరు కాటుకతో కలిసి ఆమె చెక్కిళ్లు మీదుగా జారేవి -

బెంగుళూరు నీలం చీర మీదో - లక్నో తెలుపు లీజో మీద పడేవి - వెలిసిపోయిన నా గుర్తుగా.

'రామా - నన్ను వాటితోనే దహనం చేయి' అనేది ప్రేమగా!

'మరణం - స్వకీయం - ఎవరిని వాళ్లే దహనం చేసుకోవాలి!' అనేవాడిని. అప్పుడు మీరా భజన ఒకటి పాడేది.

ఆమె పాటతో గదిలోనే శాంతి పరిమళం - వింత కాంతి నిండిపోయేవి.

అవును - రాజపుత్ర స్త్రీ - బృందావనంలో కృష్ణుని గురించి పాడుతోంది.

'ప్రియా - ప్రియా - నీ బాధను నా పెదవులతో తీసివేయలేనా' అంటూ తన పెదవులను నా పెదవులతో కలిపేది - తన మోమును నా శిరస్సుకు ఆనించేది.

'నీకు తెలుసా - నేను నిన్ను ప్రేమించటం లేదు'

'ఆఁ... తెలుసు - నీవు ప్రేమిస్తే - ఇది బృందావనమే అవుతుంది కదా-'

'అయితే - వేణునాదం వినిపించు - అందరినీ వదలి వచ్చేస్తాను - ఆ మొగుణ్ణి కూడా-'

'అలా అనకు - అతను నీకు భర్త - ప్రతాప్ మంచి భర్త-'

'అవును - అయితే బృందావనం ఎక్కడ?'

'కృష్ణుడు - ఎక్కడ ఉంటే అక్కడే-'

'అయితే కృష్ణుడు ఎవరు?'

'నేనే - నేను రాముణ్ణి కాకుండా ఉన్నప్పుడు ఈ శరీరం - ఈ మనసు లేనిచోట అదే బృందావనం - అక్కడే మురారి-'

'అయితే ఈ రాధ ఎవరు?'

'కృష్ణుడు ఇంకా కృష్ణుడు కాలేడు - అతను కృష్ణుడయినప్పుడు రాధగా మారిపోతాడు - ఇద్దరూ ఒకటే -

'సావిత్రీ అదే ఇందులో అసంబద్ధం - విరుద్ధం!'

'అదేనా ఈ జ్వరం - అది పోవాలంటే నేను ఏమి చేయాలి? ఓరి దేవుడా నన్ను తీసుకుపోలేవా?'

'సావిత్రీ - ఎవరిని ఎవరు తీసుకుపోతారు? నీకు నువ్వే - ప్రేమ ఉన్నచోట తీసుకోవటం ఉండదు - తీసుకోవటం ఉన్న చోట - ప్రేమ ఉండదు -'

'అయితే ఇది త్వరగా జరిగిపోతే బాగుండును, అది ఒక క్రమశిక్షణతో జరగాలి - శిష్యరికంతో జరగాలి.'

'ఎవరికి?'

'కృష్ణునికి శిష్యరికం చేయాలి - అదే పరమసత్యం' సావిత్రికి అర్థమయినట్లు-

'రామా - ఒకటి అడగవచ్చా' కిటికీ మూసి - కోటు వేసుకుంటూ - అంది.

'ఏమిటి సావిత్రీ?'

'ఎవరు - ఎవరికి చెందుతారు?'

'ఎవరికి వారే - చెందుతారు?'

'నాకు నేను కాకపోతే?'

'అయితే ఎవరికో చెంది ఉంటావు?'

'మరి - ఎలాగూ - దూడను తాడుతో కట్టివేసినట్లు - విమానం రాడారికి అనుసంధానమయినప్పుడు - మన ఇష్టప్రకారం కుదరదు కదా-'

'అవును - నువ్వు సురక్షితంగా ఎగరాలంటే రాడార్‌ని అంగీకరించాలి - లేదంటే కూలిపోతుంది - అదేమీ ఫ్లయింగ్ సాసరు కాదు-'

'అయితే - విమానం రాడార్‌ను అంగీకరించాలి' సావిత్రి.

'అవును అదే ధర్మం - ధర్మాన్ని కాదంటే బాధ మిగులుతుంది..'

'ఎవరికి?' 'ధర్మం పాటించనివారికి'

'బాధ అంటే ఏమిటి?'

'కర్తవ్యపు పర్యవసానం - బాధ'

'మరి సంతోషం?'

'అది ప్రేమ స్వరూపం.'

'అయితే నేనేమి కావాలి?'

'మంచి భార్యగా ఉండాలి-'

'మరి బృందావనం?'

సావిత్రి - ఎక్కడ బాధ ఉండదో - అక్కడ మురారి - మురళి వినిపిస్తుంది - ఆలమందలు మోరలెత్తి వింటాయి. చెట్లు పూలు పూస్తాయి. నెమళ్ళు నాట్యం చేస్తాయి - దేవతలు వచ్చి చూస్తుంటారు - అదే రాసలీల.

బ్రతుకు పండగ!

'మరి బాధ?' దానినేమి చేయాలి?

'సావిత్రి నీవు బాధపడితే - మరొకరిని బాధపెడుతున్నట్లే - నీవు సంతోషంగా ఉంటే నీతో ఉన్నవాళ్ళు సంతోషంగా ఉంటారు. ఆ సంతోషమే సత్యం - నిత్యం.'

'అరే - చాలా అడుగుతున్నావు సుమా - నిన్నింకా ప్రియా అని పిలవచ్చా?'

'తప్పకుండా - నీకే నా ప్రేమ - నీవే నా సంతోషం.'

నాకు పెదవులద్దీ ఆమె వెళ్ళిపోయింది. మరి కొద్ది రోజులకే లండన్ వదిలి ఇండియా వెళ్ళిపోయింది.

తర్వాత నేను హాస్పటల్ వదిలి వాటర్ లూ స్టేషన్‌లో రైలెక్కాను. మర్నాడు ప్యారిస్ చేరాను. కొన్నాళ్లు స్విజర్‌ల్యాండ్‌లో (ఎంగడీన్) మంచుకొండల్లో తిరిగాను. ఇప్పుడు సంతోషం - చాలా సంతోషంగా ఉన్నాను. ఆనందో[బహ్మ అని నా ఊపిరి తిత్తులు కూడా అరుస్తున్నాయి.

సరోజ ఉత్తరం రాసింది. మెదూ రాయలేదు. నాకు అర్థం అవుతోంది. అలాగే శబ్దాలు కూడా. ఈ భూమికి జ్వరం లేదు - స్థిరంగా మైలు రాళ్ళు - చెట్లు కనబడుతున్నాయి. అలా బజారుకి వెళ్తే పొగాకు వాసన ఘాటుగా వస్తోంది. కాఫీ మత్తుగా ఉంటోంది. గదిలో అడవి గాలి - బయట మంచు తెలుపు అద్భుతంగా ఉన్నాయి.

మనిషి బాధతోనే పుట్టాడు - అతని పునర్జన్మ ఒంటరితనం - ఏకాంతం - అతను అతనికే పాడుకోవాలి - కొండలు ఎక్కుతాడు - ముని కాళ్ళమీద - పర్వతాల మీద నిలబడతాడు - అక్కడి నుంచే మంచు తెరలు తెరలుగా జారిపోతుంటుంది - ఈ సంతోషం అంతా అతను మౌనంగా పాడుకోవాలి.

ఆల్ప్స్ (Alps) ఎక్కడికో తెలియని ప్రపంచంలోకి వెళ్లి పోతుంటాయి. అక్కడకు నీవు వెళ్ళలేవు - ఈ రాత్రికి నీకు నీవే అంగీకరించాలి. నువ్వు ఎలా వచ్చావో - అలాగే వెళ్ళిపోతావని - చివరికి మిగిలేది ఆనందమే - బ్రహ్మానందమే - నీ చుట్టూ ఉన్నవాళ్ల ఆనందమే -

నీ నిద్రలో కూడా మర్చిపోకు - ఈ ప్రపంచంలోనే నీ ఆనందం ఉందని.

నేను ప్యారిస్ చేరాను. కాథరీన్ ఆడ బిడ్డను కన్నది. వీరిద్దరినీ చూస్తుంటే ఆనందం చేతికందే ఫలంలా అనిపించింది. జర్మన్ వీధిలో గది తీసుకున్నాను. అది నదికి దగ్గర్లోనే - సాయంత్రాలు శీన్ గాలులు గుండె నిండా తీసుకోవచ్చు. ఆ విధంగా 'ప్యారిస్'ని నాలో నింపుకోవచ్చు. ఈ అక్టోబర్ నెలలో ఇక్కడి రోజులు ఆహ్లాదకరంగా ఉంటాయి. దక్షిణపు గాలులు సముద్రపు వాతావరణాన్ని మోసుకొస్తుంటాయి. వేసవి వేడి సాగదీసినట్లుంది. ఒక ఊపిరితిత్తి శరీరాన్ని తేలిక పరుస్తుంది. శ్వాస నిండుగా ఉంటుంది. ఈ ప్రాంతంలో ఒక నాట్రోడామ్ ఎదురుగా ఓ పాత హోటల్ పరిచయం ఉంది. 'కాక్ డోర్' మెట్లెక్కి వెళితే షిమాయి మేడమ్ నాకు కావాల్సినవన్నీ చేసిపెడుతుంది. నా శాఖాహారం ఆమె ఏదో రోగానికి పత్యం చేస్తున్నాననుకుంటుంది. చాలా జాగ్రత్తగా ఆహారం పెట్టి తక్కువ వసూలు చేస్తుంది. 'మళ్లీ నువ్వు విద్యార్థివి కదా - పాపం నీ తల్లిదండ్రులు ఎంత దూరంలో ఉన్నారో - చూడు ఎంత సన్నబడిపోయావో' అని దయచూపేది. 'జాగ్రత్త - గాలికి లేచిపోయి నోట్రోడామ్ మీద సాధువులా అతుక్కుపోతావేమో' అని హాస్యమాడేది.

ఆ హోటల్ ఎదురుగా జీన్ పుస్తకాల దుకాణం ఉండేది. ఎప్పుడు ఏ పుస్తకం కావాలన్నా ఇచ్చేవాడు. నా పరిశోధన బాగానే సాగుతోంది - ఇంకా రెండు అధ్యాయాలు పూర్తి చేయాలి. వెంటనే ఇండియా వెళ్ళిపోవాలని తొందర పడటంలేదు.

వెళ్లాలనీ లేదు. చిన్నమ్మ సరోజ దగ్గరకు వెళ్ళింది. ఇప్పుడు అలహాబాదులో ఉంటున్నారు. రోజూ గంగా స్నానం చేస్తుంది ఉదయాన్నే.

సుకుమారి బొంబాయిలో ఉంటోంది - ఆమె కమ్యూనిస్టు పార్టీలో చేరింది. కృష్ణమాచారిని పెళ్లి చేసుకుంది. సిద్ధాంతపరంగా నన్ను శత్రువనే అనుకుంటుంది.

సరోజ ఉత్తరం రాసింది. 'అన్నా - నాకు జీవితం చివరికి వచ్చేసింది - అంటే ఇక నాకు ఎలాంటి ఆశలు లేవు - సంతృప్తి - పని - ఇలాంటివేమీ లేనట్లే - ఏమీ ఆశించడం లేదు కూడా - నీవు ఎప్పుడు వస్తావా అని చూస్తున్నాను - అన్నా త్వరగా వచ్చేయి. నీ చెల్లెలు - సరోజ.'

నేను పారిస్ నేషనల్ లైబ్రరీలో పనిచేస్తూ - సరోజ ఉత్తరం ఎన్నోసార్లు చదివాను. నీ కోసం ఎక్కడో - ఎవరో ఎదురు చూస్తున్నారు - అనే భావన ఎంతో ఆనందాన్ని - దుఃఖాన్ని ఇస్తుంది. ఆమె కళ్ళల్లో నీళ్ళు - ఆమె కౌగిలిలో వెచ్చదనం - ఎలాంటి స్వేచ్ఛను ప్రసాదిస్తుంది!

నేను త్వరగా ఇండియాకి వెళ్లిపోవాలి. చిన్నమ్మను నా దగ్గర కనీసం 6 నెలలు ఉంచుకోవాలి. మిగతా ఆరునెలలూ ఆమె కూతుళ్ళతో ఉంటుంది. అవును - ఇంటికి వెళ్ళిపోవాలి - చిన్నమ్మను ఎప్పుడైనా యూరప్ తీసుకువచ్చి అన్నీ చూపించాలి. పారిస్ వీధులు, లండన్ బ్రిడ్జిలు - ఆమెకు ప్రదేశాలు - ప్రార్థనాలయాలు చూడటం ఇష్టం కదా - బహుశా సరోజ కూడా రావచ్చు. అరే - నేను పగటి కలలు కంటున్నానా!

నాకు ఒక్కసారిగా సావిత్రి చివరి మాటలు గుర్తుకు వచ్చాయి. వెళ్ళిపోతూ సిస్టర్ 'జీన్'తో అంటుంది - 'మగవాళ్ళు ఎలా బాధపడతారు? ఆడదాని బాధకు మొదలు - చివర ఉంటుంది. అది కేవలం శారీరకమైనది. మగవాని బాధకు అంతులేదు కదా?' అవును మేడమ్ - మీరు అన్నది నిజమే - నేను చాలా వార్డుల్లో రోగులను చూశాను - మగవాని బాధకు అంతం ఉండదు - వారికి బాధ ఎక్కడో కూడా తెలియదు - అతని విచారం - ఆంతరికం - శారీరకం కాదేమో' 'ప్రతి మగవాడు సిలువ మీద క్రీస్తులాంటివాడే సుమా' ఇవే సావిత్రి చివరిగా 'జీన్'తో అన్న మాటలు.

అవును - మగవాని బాధకు ఆది - అంతం లేదు. అది గంగానది ప్రక్క ట్రంకురోడ్డులాంటిది. దారిపొడుగునా చెట్లు పురాతనమైనవి. కాలం బరువుతో వంగిపోయినవి. వర్షానికి తడిసి - ఎండకు ఎండిపోయి ఉంటాయి. రాత్రి వచ్చి అన్నింటినీ కమ్మివేస్తుంది. ఊళ్ళు నిద్ర పోతూంటాయి - ప్రభుత్వ కార్యాలయాలు - ట్రావెలర్ బంగళాలు - నది ప్రక్క ఇళ్ల వరసలు - యాత్రలకు వెళుతూ - ఎప్పుడు పరివ్రాజకుడు ఒకడుంటాడు - నడిచిపోతూ. తట్టలూ - బుట్టలూ పెట్టుకు

నడుస్తుంటారు. ఆడవాళ్ళు - పిల్లలు ఏడుస్తూ ఉంటారు. ఇంతలో మోటారు కార్లు - హారన్‌లు మోగిస్తుంటాయి. ఎడ్లు బెదురుతుంటాయి.

అంతలో తెల్లవారుతుంది. ఆ రావిచెట్టు మీద రామచిలక ఎర్రని పండును కొరుకుతుంటుంది. అది ఒక్కటే మగవానికి సంతోషం. అతని బాధ ఈ ప్రపంచానికి చెందినది కాదు.

ఈ ప్రపంచానికి చెందాలంటే పెళ్లి చేసుకోవాలి. కాథరీన్ జార్జిని చేసుకున్నట్లు - అవును - మగవాడు పెళ్లి చేసుకుంటే ఈ భూమికి చెందుతాడు. గర్భం - 'భగ' (భగవతి) అదే ప్రకృతి. అది పొందగలిగినప్పుడే 'భగవాన్' - అతడే శివుడు!

సాయంత్రం - జార్జి ఇంటికి వెళ్ళేవాడిని - కాథరీన్ 'వీర' (వీర - కాథరీన్ కూతురు) ఎంతో సంతోషించేవాళ్ళు. ఏదైనా వారాంతం జోబీ అత్తను చూడటానికి రోనీ వెళ్ళి రాత్రికి తిరిగి వచ్చేవాళ్ళం. ఈ మధ్య మెదలీనా ఉత్తరం రాసిందని కాథరిన్ చెప్పింది.

ఇల్లు ఖాళీ చేసి రెండు గదులు తీసుకుందని చెప్పింది.

అప్పుడప్పుడు చార్లీ మామ వచ్చి కేతరిన్‌తో ఉండేవాడు. ఇప్పుడు వయసు మీద పడినట్లు కనబడుతున్నాడు. నన్ను తీసుకొని ఎక్కడెక్కడో తిప్పేవాడు.

మనం ఎవరితోనైనా వాదించవచ్చు - ఒప్పించనూవచ్చు - కానీ నిన్ను నువ్వు వాదించి గెలవగలవా? నిన్ను నువ్వు ఫూల్‌ని చేసుకోగలవా? ఇదే అసలైన పరిశోధనకు గీటురాయి.

రాత్రిళ్ళు శీన్ నది ప్రక్కన నడుస్తుండేవాణ్ణి. ఇంత ప్రశాంతమైన ఆత్మవిశ్వాసంగల నది ఎక్కడ ఉంది? ఈ నదే కదా ఫ్రెంచి రాజులకు బలాన్నిచ్చింది. ఫ్రెంచ్ భాషకు సొగసునిచ్చింది.

మెదలీనా ఎప్పుడైనా నాతో మాట్లాడుతుందా - ఆమె సంతోషంగా ఉందా? సావిత్రిని రాడార్ జాగ్రత్తగా చేర్చిందా? ఆమె మళ్లీ సూరజ్ పాలెస్‌కు వెళ్లి ఏనుగులను చూస్తుందా?

ఇప్పుడీ మూర్ఖపు కాంగ్రెస్ నాయకులతో - అసహ్యాపు రాచరికంతో కలిసిపోయిన అద్భుతమైన ఇండియాను అభివృద్ధి చేస్తున్నారా? అసలు ఇండియా అంటే వీళ్లకు తెలుసా? సావిత్రిలాంటి స్త్రీని ఇచ్చిన ఇండియా సంస్కృతి ఇప్పటి పాలకులకు ఎప్పటికి తెలుస్తుంది?

ఇండియా ఫ్రాన్స్‌లాంటిదే - ఇండియా అనేది ఒక భావప్రపంచం - ఇలా ఉండేవి ఆలోచనలు. ఇప్పుడు అక్కడికి వెళ్లాలా? నేనెప్పుడూ కాందిశీకుడనే -

అలాగే ఉండిపోవచ్చు - ఇప్పుడు గంగా మాతను చూడడానికి పోవాలా - గంగ నాలోనే ఉంది. నా ఇండియా నేను ఎక్కడ ఉంటే అక్కడే ఉంటుంది.

ఓ చెట్టులాగా మారిపోతే - ఒక నదిలాగా వాలిపోతే - ఒక స్త్రీ నామంలాగా మారిపోతే?!

నా పరిశోధన బాగానే నడుస్తోంది - తొమ్మిదవ అధ్యాయం పూర్తిచేశాను - అది 'హోలీ గ్రైల్' గురించి. పదో అధ్యాయం 'స్వర్గం' - గురించి - ఇది చాలా క్లిష్టమైనది - చాలా జాగ్రత్తగా 'సొర్బోనీ' ఆచార్యులకు సంతృప్తి కలిగేట్లుగా ఉండాలి. ఎందుకంటే వారు తెలివైనవారే కాదు - చాలా అనుభవంకలవారు. అనుభవ భారంతో అహంకారాన్ని తమ-తమ స్థానాల్లో (సొర్బోని పరిశోధనాలయం) పాతుకుపోయినవారు. వీరిని సంతృప్తిపరచడం చాలా కష్టసాధ్యమైనది.

సత్యంతో పాటే అసత్యం ఉంటుంది. మధ్యలో 'మిథ్య' కూడా ఉంటుంది. ఇది భారతీయ తత్త్వం. అలాగే స్వర్గమంటే - సత్యానికి 'Inversion' అనుకోవచ్చు. ఏ విషయమైనా తలక్రిందులుగా చూడవచ్చు. అసంభవమయినది అందంగా కనిపిస్తుంది.

స్వర్గాన్ని అన్ని కాలాల్లో - అన్ని ఆధ్యాత్మిక తత్వాలు వర్ణించాయి. అక్కడ పవిత్రులుంటారు - దేవతలుంటారు. నీవు అక్కడకు చేరాలంటే పవిత్రంగా ఉండాలి. అంటే అగ్నిప్రవేశం చేయాలి. అప్పుడే స్వర్గానికి వెళ్తావు.

అక్కడ ఏముంటుంది? గంధర్వులుంటారు - దేవతలుంటారు - సంగీతం అలౌకిక సంగీతం ఉంటుంది. నువ్వు ఎక్కడికైనా వెళ్ళవచ్చు. అక్కడ బాధ ఉండదు. కేవలం ప్రేమ ఉంటుంది. మధ్యలో గుర్రాల మీద వెళ్ళి తుర్కులతో యుద్ధం చేసి విజయం సాధించు. నీ దేశాన్ని రక్షించు. అక్కడ నీకోసం అందమైన స్త్రీలు ఉంటారు. ఎవరినైనా పెళ్లి చేసుకో - పిల్లల్ని కను - నీ సంపద ఆమె ముందు ఉంచు. నీ విజయాన్ని కీర్తించు - అదే నిజమైన స్వర్గం.

సనాతన - స్మార్త - అంటే సత్యాన్ని అంగీకరించటం - స్టాలిన్ సనాతనుడు - అచ్చంగా ముడిసరుకు - యదార్థవాది.

కాని ట్రోట్స్ కీ - స్వర్గాన్ని ఆశపెట్టాడు. స్టాలిన్ లౌకికమైన లెక్కలు వేశాడు.

అలాగే నెపోలియన్ బోనాపార్టీ - ఫ్రెంచ్ విప్లవాన్ని చాలా యదార్థ విధానంలో అమలు పరిచాడు. రోడ్లు వేయించాడు - వంతెనలు - వారధులు కట్టించాడు. సైనిక అకాడమీ స్థాపించాడు. న్యాయవ్యవస్థను ఏర్పరిచాడు. విద్యావిధానాన్ని తయారు చేయించాడు. విప్లవాన్ని ఆధునిక జీవితంగా మార్చాడు.

కానీ బోనపార్టీ ఈ ప్రపంచాన్ని మార్పు చేసి - తానూ మారిపోయాడు. ఒక చక్రవర్తిలాగా పోప్‌తో కిరీటం పెట్టించుకోవడానికి తహతహలాడాడు. ఫ్రెంచ్ విప్లవాన్ని తాను కథానాయకునిగా మార్చుకున్నాడు. ఆ విధంగా చక్రవర్తి నెపోలియన్ పతనమయినాడు.

కేవలం శాకాహారి అయిన హిట్లర్ - హింస మనకు తెలియనిది కాదు. అతనికి స్వర్గం మిలటరీ 'బంకు'లోనే అంతమైంది!

దాంతే బయాట్రిస్ స్వర్గంలో చాలా అందంగా కనిపించింది. కానీ ఎంత కఠినాత్మురాలు - స్వర్గంలోనే దాంతేకు పచ్చి నిజాన్ని చూపింది.

కళ్లు తెరవండి - నేనెవరో గుర్తించి - నా నవ్వును శక్తివంతం చేశావు - అతని ద్వారా కాంతిని చూసి ఇప్పుడు అతనికి కాంతిని చూపించాలని అనుకుంటోంది - మనిషి సూపర్‌మాన్ - అయినా అంతం కావాల్సిందే - నీవు ప్రపంచాన్ని చూసినా - ప్రపంచంలో నిన్ను చూసినా - అది అనుభవమే!

ఈ సమయంలోనే నాకు రాధాకృష్ణుల కథ గుర్తుకు వస్తోంది.

ఒకరోజు రాధ - కృష్ణుడు తనవాడే - కేవలం తనవాడే అనుకుంది. కృష్ణునికి - అన్నీ తెలిసిన - కృష్ణునికి రాధ ఆలోచన తెలియదా? ఆమె కృష్ణుడిని ఓ ఆవు దూడలాగానో - ఓ నగలాగానో తన సొంతం చేసుకోవాలని - తన అధీనంలో ఉంచుకోవాలని అనుకుంటోంది.

సర్వాంతర్యామికి తెలియదా? తెలిసిన వెంటనే ఏమి చేయాలో తెలియదా? ఏం చేయాలో తెలిసినప్పుడు అది జరగకుండా ఎలా ఉంటుంది? అలా జరిగేది ఆయన సృష్టి కదా-

'రాధా - దూర్వాస మహర్షి మన ఆతిథ్యానికి వచ్చినట్టున్నాడు - మన వార్తాహరులు సందేశం తెచ్చారు - మనకు ఆయన ఆశీర్వాదాలు పంపారు - ఆయనకు భోజనం పంపాలి కదా -

అయితే - నేనే వండి తీసుకెళ్తాను' అని రాధ వెంటనే అన్ని వంటకాలు సిద్ధం చేసి తెచ్చింది. కృష్ణుడు దర్బారులో ఉన్నాడు. 'మునీశ్వరులకు వంటకాలు నేనే తీసుకువెళతాను' - 'ఓ అద్భుతం - అలాగే' అన్నాడు కృష్ణుడు. అయితే జమునా నది పొంగి ప్రవహిస్తోంది - రాధ చూసి - 'కృష్ణా - జమున పొంగి ఉంది - పడవలేమీ లేవు' - అంటే - కృష్ణుడు - 'నీవు నా మాటగా చెప్పు -

'బ్రహ్మచారి - కృష్ణుడు దారి ఇవ్వమన్నాడు' అని' అన్నాడు. రాధకు అర్థం కాకపోయినా నది ఒడ్డున నిలిచి - 'బ్రహ్మచారి కృష్ణుడు దారివ్వమంటున్నాడు' అంటే - జమున సన్నని దారి చేసి - రాధకు నీళ్లు అడ్డు రాకుండా చేసింది -

ఆ దారిలో రాధ అవతల ఒడ్డుకు వెళ్లి - దూర్వాసులకు నమస్కరించి అరిటాకులో అన్నం, అన్ని వంటకాలూ వడ్డించింది - ఆయన సుష్టుగా, తృప్తిగా తిని - త్రేన్చాడు - ఆయన ఆశీర్వాదం పొంది - పాత్రలన్నీ జమునా నదిలో కడిగింది - ఆయన చేతులు కూడా జమునా నదిలో కడిగాడు. నది పొంగి ప్రవహిస్తూనే ఉంది.

తిరిగి వెళ్ళేదెలా - కృష్ణుడు ఒక్క మార్గమే చెప్పాడు - మరి ఇప్పుడు?

రాధ దూర్వాసుల మునీశ్వరులను అర్థించింది - ఆయనకు ముందే తెలుసు - వెళ్ళమ్మా - 'నిత్య ఉపవాసి - దూర్వాసులు దారి ఇవ్వమన్నారని అడుగు.'

రాధ ఆశ్చర్యపోయింది - ఇప్పుడేగా తిని త్రేన్చారు - 'ఉపవాసి అంటారేమిటి?'-

అయినా జమునా నదికి ఆ మాటే చెప్పింది.

నది మళ్ళీ రాధ వెళ్లేందుకు సన్నని దారి ఇచ్చి - నీటిలో తడవకుండా చూసింది.

రాధకు మనసంతా కకావికలమైపోయింది. అంతా అబద్ధం - ఈ ప్రకృతి అంతా అబద్ధాల పుట్ట - అబద్ధాలే - అసత్యాలే నమ్ముతుంది ప్రకృతి.

'కృష్ణా - అంతా అబద్ధం - ఈ ప్రపంచం అంతా అసత్యం! అని దుఃఖించింది.

'రాధా - ప్రపంచ అబద్ధం కాదు - అది మిథ్య - ఒక విషయం చెప్పు - నా శరీరం నీకు భర్తా?

'కాదు స్వామి' -

'నా మనస్సు నీకు భర్తా?' -

'కాదు స్వామి' -

'మరి కృష్ణుడు నా భర్త' అన్నపుడు నీవు చెప్పేది ఏమిటి?

అది భౌతికమైనదీ - మానసికమైనదీ కాదు. అంతకు మించినది - ఒక విశ్వాసం! అయితే రాధా - నా ప్రియా - ఒక విశ్వాసాన్ని ఎలా కట్టిపడేస్తావు - నీవు ఎలా ధరిస్తావు - అంతే - రాధ - కృష్ణుని పాదాల చెంత వాలి 'నాకు సత్యాన్ని చూపావు' అని - ఆ వెలుగులో తరించింది.

నీవు స్వేచ్ఛగా ఉన్నావంటే ఆ విషయం తెలుసుకోవటమే - అదే భౌతికమూ - మానసికమూ కాదు.

ప్రేమ అంటే - ప్రేమించే వ్యక్తి ఉన్నాడని - పవిత్రంగా ఉండటమంటే అలా ఉన్నామని ఎరుకయే.

పాపాలన్నీ ప్రక్షాళన చేసే - పవిత్ర జలాల ప్రవాహమా - ఓ గంగామాతా నీకు ప్రణామం.

నువ్వెక్కడుంటే అదే కాశీ - అంటుంది వేదాంతం.

ఋషులకు - తెలుసు. ఈ ప్రపంచం ఒక భావన - ఒక కల్పన - ఒక మిథ్య అని.

ఏకమ్ - అద్వయం - అదే సత్యం-

ప్రియా - సోదరా - నువ్వే సౌందర్యం - ఈ ప్రపంచం కాదు.

ఋగ్వేదం ఏమంటుంది - ఎప్పుడూ మరణాన్ని అంగీకరించను -

నిజానికి భ్రమ - అసలు మృత్యువే - మనిషి అన్వేషణ - మరణం అంతం కావాలనే - నీవు జీవించి ఉండి - మరణాన్ని ఆలోచన చేయవచ్చు - మరణించి జీవితాన్ని ఊహించగలవా?

చాలాకాలంగా సావిత్రి ఉత్తరాలు రాయలేదు. ఎన్నో ఉత్తరాలు రాసినా మెదలీనా సమాధానమే లేదు.

ఒక మంచు కురిసిన రోజు నేను యాక్స్ వెళ్ళాను. బహుశా ఆ దారిలో బుద్ధుడు పయనించి ఉంటాడు. గాలి వింతగా ఉంది. ఆయనకు మోకరిల్లిన కరీంద్రాలు అలాగే ఇక ప్రపంచంతో పనిలేదని శిలలైపోయాయి. కాళ్ళ మధ్య తమ ఘనమైన తొండాలు పెట్టుకుని ఆ తర్వాత గోత్‌లు వచ్చి ఆపైన శిలవలు పెట్టి చర్చిలు కట్టారు.

నేను ఒక చర్చిలో ప్రవేశించాను. రికామిగా తిరిగాను. మోకరిల్లాను. ఎందుకో తెలియదు. ఎవ్వరికో తెలియదు. మౌనంగా కళ్ళు మూసుకున్నాను. చనిపోయినవారు మనల్ని క్షమిస్తారా? మనం చేసిన తప్పులు మన్నిస్తారా?

మళ్ళీ మంచు కురిసింది. మెదలీనా గదులు వెతుక్కుంటూ వెళ్లాను - చిన్న గేటు - కె.ఆర్. రామస్వామి అని ఉంది. మెదలీనా మెట్లు దిగి వచ్చింది. పాలిపోయి - లావుగానే ఉంది. 'నేను - మెదలీనా - ఇది నేనే' అన్నాను.

'లోపలికి రావచ్చా?' అని అడిగాను.

ఇంట్లోకి దారితీసింది! వింతగా ఉంది.

చిన్న మంచం - పల్చని పరుపు - అవలోకితేశ్వరి విగ్రహం - చుట్టూ పూలు - గదిలో ఒక కుర్చీయే ఉంది. కూర్చున్నాను. గది అంతా గంధపు వాసన వస్తోంది.

'ఎందుకు వచ్చావు?' అంది.

'నిన్ను చూడాలని' అన్నాను.

'ఏముంది చూడడానికి - తోలు తిత్తి కదా!'

'అవును - మరో తోలు తిత్తి చూడవచ్చు కదా..' అన్నాను.

'అయితే నాకేమిటి సంబంధం?' అంది.

అలా ఎంతసేపు కూర్చున్నాను? ఆమె రుద్రాక్షమాల తీసుకుని లెక్కిస్తోంది - పద్మాసనంలో ధ్యానంలోకి వెళ్ళిపోయింది.

అక్కడి నుంచి వచ్చేశాను - చరిత్రలో వెనక్కి నడుస్తున్నాను - అక్కడ పోస్టాఫీస్ చుట్టూ తిరిగాను - నది ప్రక్కనే నడిచాను - తర్వాత టాక్సీ తీసుకొని స్టేషన్‌కి చేరాను. ఆహా - ఎలాంటి ప్రేమ రాత్రి - ఎలాంటి ప్రేమనది - ఎలాంటి మంచు - ఆ రాత్రి నన్ను రైలు పారిస్ చేర్చింది.

ఈసారి సెయింట్ మిచెల్ బోలివార్డ్‌లో ఏడవ అంతస్తులో గది తీసుకున్నాను. ఎప్పటి నుంచో అడుగుతున్నాను - ఈ గది కోసం అంత ఎత్తులో నా కిటికీలో నుంచి పారిస్ నా ముందు ఓ తాటాకు విసన కర్రలా పరచుకుంటుంది. వీధులు, ఎర్రని ఇంటి కప్పులు - చిహ్నాలు - దూరంగా ఆకుపచ్చగా సీన్ నది - ఆ పైన వంతెనలూ - అదిగో దూరంగా నోట్రాడామ్ జంట టవర్లు... వెనుక ప్రక్కన పారిస్ నిర్మాణాలు చరిత్రలో నిలిచిపోయినవి. ఇవి కాలంలో తమ ఆకారాలు ఏర్పరచుకున్నాయా? అదిగో విశాలమైన తోట - లక్సెమ్‌బర్గ్ పాలెస్! అదిగో - జలయంత్రం - పిల్లలు - కాగితం పడవలు - బహుశా అవి ప్రపంచాన్ని చుట్టి వస్తాయేమో!

ఎప్పుడైనా అలసిపోయినప్పుడు - ఈ పార్క్‌లోనికి వచ్చి కూర్చుంటాను - ఇది లవర్స్ పార్క్ - ప్రేమికుల కోసం బల్లలన్నీ గట్టిగా చేశారు. ఇక్కడే ఆమె ఎండ పొడలో ప్రియునికి తీపి మాటలు వినిపిస్తుంది. అలా వెళ్ళి నోట్రాడామ్ దర్శించి వస్తాను. నిజానికి ఇదే యూరోప్‌కి పవిత్ర చిహ్నం.

'మనం ప్రాపంచిక విషయాలు - విశ్వాంతరాళ సంగతులు మాట్లాడే సమయంలో - ఇవన్నీ మన బుద్ధికి వెలుపల అస్తిత్వంలో ఉన్న విషయాలే?' అనికదా మధ్యయుగాల మేధావులు ప్రశ్నించారు. మనం - మానవుడు - జంతువులు - అని మాట్లాడినప్పుడు - ఇవన్నీ సమూహాలకు సంబంధించినవా? దీనికి భౌతిక సత్యానికి

ఏమిటి వ్యత్యాసం? దీనికి మన బౌద్ధిక సత్యానికి ఏమిటి భేదం? ఈ విధంగా ఈ మేధావులు ప్రశ్నలు - సమాధానాలు వెతుకుతూ - వేల సంవత్సరాలుగా అన్వేషిస్తున్నారు - కవులు - శాస్త్రవేత్తలు - ఖగోళ శాస్త్రజ్ఞులు - ఎందరో ఎందరో ఈ ప్రయోగశాలలో - ఈ పరిశోధనాలయాలలో తిరిగారు.

అందుకే పారిస్‌లో ఎక్కడ నడిచినా - సత్యాన్వేషణ మార్గంలో నడిచినట్లే-

ఎప్పుడైనా ఒక వాక్యం సరిగా కుదరకపోతే - మౌనంగా ఉండిపోయి - గది గోడల వంక చూసేవాడిని - ఆ నది పైన గాలినడిగేవాడిని - అదిగో ఆ నోట్రాడామ్ టవర్లను చూసేవాడిని! మేరీమాతకు వందనం చేసేవాడిని! ఆమె నాకు దారి చూపేది - ఆమె కదా - ఈ ప్రపంచానికి మాత! ఆమె గర్భంలోనే సర్వమూ ఉన్నది! ఆ వాక్యం తృప్తిగా రాయగలిగిన తర్వాత - సాయంత్రం వీధిలోకి వచ్చి - బహుశా ఇక్కడే Verlaine నడిచేవాడేమో - తప్పతాగి - తన పేరు కూడా చెప్పలేని స్థితిలో - అవును నిన్ను నువ్వు మరచిపోవటం మంచిది. అప్పుడే సన్యాసివి కాగలవు.

అలాంటి పారిస్ - ప్రతి సాయంత్రం నిద్రలేస్తుంది. నేను గదిలో కూర్చుని చూస్తుంటాను. భూతాలు - గొప్పవాళ్లు - రాజులు - విప్లవకారులు - కవులు - అందరూ వస్తూంటారు. ఇక్కడ నుంచి ఎవ్వరూ నడవని చోటికి పోవాలి - తన బాధను భరించని చోటుకు పోవాలి.

మెట్లెక్కి జార్జి తలుపు తట్టేవాడిని - ఎప్పుడూ కాథరీన్ తలుపు తీసేది - పాపని ఎత్తుకొని - నవ్వేవాడిని - వీరాని ఆడిస్తూ సమయం గడిచిపోయేది.

మెదలీనా - కాథరీన్‌కి అన్నీ చెప్పింది - తన వీలునామా - మా విడాకులకు ఏర్పాట్లు అన్నీ చేసింది. 'రామాకి స్వేచ్ఛనివ్వాలి - ఇంకా వయసులో ఉన్నాడు కదా - ఇండియా వెళ్లి పెళ్లి చేసుకోవాలి - తన కుటుంబంతో కలసి ఉండాలి' - ఇది ఆమె సందేశం.

ఆ విధంగా విడాకుల కాగితాల మీద సంతకాలు పెట్టాను - కాథరీన్ సాక్షి సంతకం చేసింది. అవన్నీ 'లా' ప్రకారం జరిగిపోవాలి.

కాథరీన్ - నేను నోటరీ దగ్గర నుంచి తిరిగి వచ్చేశాం.

చివరికి నా పరిశోధన పూర్తి చేశాను. 278 పుటలు. ఇప్పటికి వారం క్రితం పూర్తి చేశాను.

డాక్టర్ రాబిన్‌కి చూపించాను - ఆయన శ్రద్ధగా చూశాడు. 'రామా - ఇక్కడ నీకు ప్రొఫెసర్ల సంగతి తెలుసా? వారే ప్రపంచంలో తెలివిగలవాళ్ళమనుకుంటారు. నీ సిద్ధాంతాలన్నీ పూర్తి కాకూడదు. అన్నింటి చివరా క్వశ్చన్ మార్కు ఉండాలి.

'ఈ విషయంలో ఎవరి సహాయం అయినా తీసుకో - అని - ఇది అంతా ఫ్రెంచ్‌లోకి తర్జుమా చేయించు - అప్పుడే సార్బోని ప్రొఫెసర్లకు చూపు' అని కూడా అన్నాడు. 'ఎవరైనా ఉన్నారా - నీకు సహాయం చేయటానికి?' నాకు జార్జి మదిలో మెదిలాడు.

ప్రక్క మీద ఎంతగా దొర్లానో - జబ్బు చేసి కాదు - ఇప్పుడు నాకు జబ్బు కూడా లేదు - ఇక్కడే ఉండిపోవచ్చు. కానీ ఎందుకు? ఎవరి కోసం?

సరోజ? అవును - సంతోషంగా ఉన్నా - లేకపోయినా ఆమె జీవితం స్థిరపడిపోతుంది - చిన్నమ్మ - గంగా స్నానం చేస్తోంది. త్వరలో కుంభమేళా కూడా. నేను వెళ్తే ఆమె ఎంతో సంతోషిస్తుంది. నిజంగా అంత ఆనందాన్ని ఇవ్వగలనా?

నాలాంటి ప్రొఫెసర్ హైదరాబాదులో ఏమి చేయగలడు? ఎక్కడికి వెళ్లాలి? ఎవరి దగ్గరకు పోవాలి? ఏ గుడిలో మొక్కాలి? ఏ నగరం నా కోసం చూస్తోంది - ఏ వయసు మిగిలింది?!

'నీవెవ్వరవు - ఎవ్వరికి చెందుతావు - ఎక్కడ నుంచి వచ్చావు - ఎక్కడికి వెళతావు - ఎవరి కోసం వెళతావు..'

ఎక్కడున్నా నేనే నా దేశం కదా - అని దిండులో ముఖం దాచుకుని దుఃఖించాను.

ఎంతగా దుఃఖించానో చెప్పటానికి సిగ్గుపడుతున్నాను.

శంకర పాదాలు - శ్లోకాలు చదువుతున్నాను. చిదానందరూపా - శివోహం - అని పాడుకుంటాను. దుఃఖం పొంగుకొస్తుంది. నాకేమి కావాలి? దేవుని కోసమా? నీ దుఃఖానికి పేరు ఉందా? రోడ్డు మీద ఉన్న విగ్రహం కోసమా? అది 'సెయింట్ మిచెల్' - అందుకే ఈ వీధికి ఈ పేరు. నాకు ఇంద్రుడు - ప్రజాపతి తెలుసు - సెయింట్ మిచెల్ తెలియదు - దేవుడు ప్రాంతీయుమా? 'దేవుని' కోసం ఎన్సైక్లోపీడియా చూస్తే 62 పుటలుంది. కానీ అవి నా అవసరాన్ని తెలియచెప్పలేదు.

ఇప్పుడు దేవుడు కాదు - గురువు కావాలి! 'ఓ దేవుడా - నా గురువు ఎవరు' అని అరిచాను.

ఏప్రిల్ గాలులు వీస్తున్నాయి. 'ఓ గురూ! ఎక్కడ? నాకు సత్యాన్ని చూపు - సత్య దృష్టినివ్వు ఓ గురూ..'

అప్పుడప్పుడు కాథరీన్ - జార్జిలను చూడడానికి వెళుతుంటాను. జార్జి నా పరిశోధనా గ్రంథాన్ని సరిచూస్తుంటాడు. ఫ్రెంచ్ భాషలోకి అద్భుతంగా తర్జుమా చేస్తుంటాడు. ఆ సమయంలో నేను వీర ప్రక్కన కూర్చుని ఆమెతో సత్యాన్ని గురించి మాట్లాడుతూ ఉంటాను. ఆమెకు ఏడు మాసాల వయసే అయినా - ఏదో అర్థమయినట్లు నా వంక చూసేది. చెప్పాను కదా - సత్యాన్ని గ్రహించాలి. అర్థం చేసుకునేది కాదు - ఆమె నన్ను గుర్తుపట్టేది - నా వంక చూసేది. నన్ను దాటి దర్శించేది.

వీరాతో ఉన్నప్పుడు చాలా ఆనందంగా ఉండేది. ఆయాను సినిమాకు పొమ్మని చెప్పేవాడిని. ఒక్కోసారి జార్జిని - కాథరీన్ ఏదైనా నాటకమో లేక సభలకో వెళ్ళమని ప్రోత్సహించేవాడిని. వీరాతో గడపడం ఎంతో ఆనందంగా ఉండేది. ఒక్కోసారి ఆమె ముందు నాట్యం చేసేవాడిని. ఆమెకు శంకరాచార్య శ్లోకాలు చదివి చెప్పేవాడిని. భర్తృహరి సుభాషితాలు వినిపించేవాడిని. ఇప్పటికే నేను వెళ్ళవలసిన - కలవవలసిన గురువు గురించి తెలిసింది - ఇన్నాళ్లు తెలిసినా - ఆయన పేరు ఇప్పుడే తెలిసింది. అందుకే తిరువనంతపురం వెళ్ళాలి. వీరాకు తెలిసేట్లు చెప్పేవాడిని. "నువ్వు పెద్దయిన తర్వాత రావచ్చు - నేను వెళ్లి - అప్పుడు నిన్ను గుర్తు పెట్టుకుంటాను..'

జార్జి - ఒకసారి నన్ను ఇక్కడ కొంతమంది వేదాంతులున్నారు - నువ్వు కలుస్తావా - అని తీసుకు వెళ్ళాడు. 'బోలేని విల్లి' వీధిలోని సంగమంలోకి - అక్కడ కొంతమంది భారతీయులున్నారు. అందులో ఒకరు నన్ను గుర్తుపట్టాడు కూడా. అమెరికన్‌లు - ఫ్రెంచివాళ్ళు - ఇంగ్లీష్‌వాళ్లు - ఆడా - మగా అందరూ ఉన్నారు. వాళ్ళు నాకెన్నో విషయాలు చెప్పారు. స్విట్జర్లాండ్ వెళ్ళినప్పుడు నేను చదివాను కూడా - అయినా తెలుసుకోవాలని - ఇప్పుడవన్నీ విశదంగా - నమ్మకంగా కనిపిస్తున్నాయి. అవును - తిరువనంతపురం వెళ్ళాలి.

ఇప్పుడు నాకు వారణాసి - గంగా - జమున ఏమీ లేవు. అన్నీ నాలోనే ఉన్నాయి - బయట వెతకవలసిన పని లేదు.

ఇది జార్జికి అర్థమవుతుందా? మెదలీనాకు అర్థమవుతుందా? మెదలీనాకు అవగతం అవుతుందా? ఆమె వజ్రాసనాలు - చక్రాసనాలు ఇంత తేలికైన సత్యాన్ని తెలియజేస్తాయా?

సత్యం అంటే ఆయనే - ఆయనే గురువు! ఆయన్ను విశద పరచటం అసంభవం. ఆయన నువ్వు కాదు.

శంకర శ్లోకాలు పాడుతుంటే - నా కళ్ళు వర్షించేవి. కన్నీరు అవి వీరా మీద పడేవి.

వీరా - చూశావా? ఆమె బుగ్గలు తడిచిపోయేవి. శ్రీధర్‌కు పాడిన ఊయల పాట పాడేవాడిని.

హంస ఊయల ఊపుతోంది.

అదే నేను - నేనే అది - హాయిగా.

ఎంత మార్దవంగా ఊయల ఊపుతోంది!

అన్ని కర్మలు - కాలం అంతా దాటిపోయింది.

ఇవాళ జార్జి - కాథరీన్ Oberon కి వెళ్ళారు. వచ్చినప్పుడు - ఆహా - ఎంత అద్భుతంగా - అట్టహాసంగా ఉంది! అంది కాథరీన్ - వంద సంవత్సరాల నాటి కథ ఇప్పుడు ఎలా నిజమవుతుంది?

ప్రేక్షకులలో ప్రెసిడెంటు - గ్రీకు రాకుమారుడు ఉన్నారు. కాని - స్వర్గం రామా! ఓబిరాన్ స్వర్గం?

'అరే - ఒక గాడిదను తీసుకురా సరిపోతుంది' అన్నాడు జార్జి.

'రండి - మీకు వెచ్చటి చాక్లెట్ డ్రింక్ ఇస్తాను' అంది కాథరీన్.

'అవును చాక్లెట్' అన్నాడు జార్జి.

'వీరా ఎలా ఉంది - నిన్ను ఇబ్బంది పెట్టలేదు కదా' అంది కాథరీన్.

'రామా - నువ్వు ఉద్యోగం కోసం ఇండియా వెళ్ళవలసిన పనిలేదు. వీరాను చూసుకో - వీరా నిన్ను ఇష్టపడుతోంది - నువ్వున్నప్పుడు నిశ్శబ్దంగా ఉంటుంది - మా ఇంటికి వచ్చేయ్ - నీ గది నీకిస్తాను' అంది.

'జార్జి చాక్లెట్ డ్రింక్ తాగుతూనే గ్రంధాన్ని అనువాదం చేస్తాడు' - అని కాథరీన్ అనేది.

'ఆఁ.. తప్పకుండా ఉంటాను - కానీ నేను వెళ్లే ముందు మరో బేబీ కావాలి' అన్నాను.

జార్జి 'ఆహా - ఎంత తెలివి?' అన్నాడు.

'అవును - బ్రాహ్మణ తెలివితేటలు' అంది కాథరీన్.

'బ్రహ్మం తెలిసినవవాడు బ్రాహ్మణుడు - ఇది ఒక వివరణ' అన్నాను. 'మరొకటి మృష్టాన్నాన్ని ఇష్టపడేవాడు బ్రాహ్మణుడే' అన్నాను.

'నువ్వు రెండో వర్గానికి చెందవులే - నువ్వు వెళ్లిపోయిన తర్వాత మేము ఏమి చేయాలి' అని కాథరీన్ బాధ పడుతుంది.

'నువ్వు మాలో కలిసిపోయావు' అంది విచారంగా.

జార్జి - 'మనం పూర్వ జన్మలో సోదరులమై ఉంటాం' అన్నాడు.

వంటింట్లో నుంచి కాథరీన్ వచ్చి 'నేను నీ భార్యను అయి ఉంటాను రామా - అందుకే వీరా నిన్ను ఇష్టపడుతుంది - పెళ్ళిళ్ళు స్వర్గంలో జరుగుతాయి కదా-' అంటూ 'ఒక్కోసారి భూమి మీద కూడా' అంది.

నేనూ - జార్జి వంటింట్లోకి వెళ్ళాం.

'పెళ్లి కూతుళ్లు - వారణాసిలో జన్మిస్తారు - పెళ్ళిళ్ళు వారణాసిలో జరుగుతాయి' అన్నాను.

'అయితే వారణాసి వెళదాం' అని కాథరీన్ అంది.

'అమ్మో - అక్కడ మండే చితులు - లేచే శవాలు - గంగా నదిలో మొసళ్ళు - ఇవన్నీ' అన్నాను. కాథరీన్ ఎక్కడో చదివింది కూడా!

గంగలో తేలే శవాలు - వీధుల్లో అడుక్కునేవాళ్లు - తగలబడుతున్న చితిమంటలు -

'అక్కడ దగ్గరలో సారనాథ్ ఉంది కదా! అక్కడికి వెళ్దాం - అక్కడే కదా బుద్ధుడు ధర్మచక్రాన్ని తిప్పాడు' అంది.

లేదు - మనం తిరువనంతపురం వెళదాం - 'ఏమిటి ఈ క్రొత్త ప్రదేశం?' కాథరీన్ అంది.

'ఇన్నాళ్ళు మీకు అబద్ధం చెప్పాను - నాకు నేను కూడా. నా నిజమైన స్థానం తిరువనంతపురం' అన్నాను.

'అక్కడ కాశీ ఉంది - మొసళ్ళు లేవు - చితిమంటలు కూడా లేవు' అన్నాను.

'సిలోన్ - అక్కడకు దగ్గరే' అన్నాడు జార్జి.

నాలాగే - అతను ప్రొఫెసర్ కదా - జాగ్రఫీ చెబుతున్నాడు.

అంతే - 'తిరువనంతపురం' - 2 చాక్లెట్ డ్రింకులు.

'అరే - ఆ పేరులోనే ఏదో మ్యాజిక్ ఉందే - 'తిరువనంతపురం - తిరువనంతపురం' - అన్నది కాథరీన్.

వేడి చాక్లెట్‌తో కుర్చీల్లో కూర్చున్నాం.

చాక్లెట్ బాగుంది.

ఒక రాజారావు

రాజారావు నవంబర్ 8, 1908లో జన్మించారు. ఈయన మైసూరు రాజ్యమైన హస్సన్‌లో హరిహరపురం స్వగ్రామం. అయితే వీరి తండ్రి హైదరాబాదులో లెక్చరర్‌గా పనిచేయటం మూలంగా వీరు చిన్నప్పటి నుంచి హైదరాబాదులోనే ఉన్నారు. ఆ రకంగా ఆయనకు తెలుగు భాషతో అనుబంధం ఏర్పడింది.


రాజా రావు

రాజారావు మదరస-ఇ-అలియా స్కూల్‌లో (హైదరాబాద్) మెట్రిక్యులేషన్ వరకూ చదివారు. ఆ తరువాత నిజాం కాలేజీలో డిగ్రీ చేశారు (ఇప్పుడు ఉన్న లోకాయుక్త భవనంలో అప్పుడు నిజాం కాలేజీ ఉండేది. ఉస్మానియా యూనివర్శిటీకి అనుబంధంగా). అప్పుడే ఈయన ఫ్రెంచి భాషను నేర్చుకున్నారు. ఆంగ్లం, చరిత్ర ప్రధానాంశాలుగా పోస్టు గ్రాడ్యుయేట్ చేశారు. హైదరాబాద్ ప్రభుత్వం 1929లో రాజారావుకు ఏషియాటిక్ స్కాలర్‌షిప్ ఇచ్చి పై చదువులకు యూరోప్ పంపించింది. ఆ విధంగా రాజారావు యూనివర్శిటీ ఆఫ్ మాంటిపెల్లర్, ఫ్రాన్స్‌లో చేరారు.

అక్కడ ఆయన అప్పటికే నేర్చిన ఫ్రెంచి బాషకు పదును పెట్టుకుని ఫ్రెంచి సాహిత్యాన్ని అధ్యయనం చేశారు. ఆ తర్వాత పారిస్‌లోని సార్బోనిలో ఐరిష్ భాష మీద భారత ప్రభావం గురించి పరిశోధన చేశారు. ఆ సమయంలోనే ఫ్రెంచి యువతి కామెలీ మౌలీని వివాహం చేసుకున్నారు. ఆమె మాంటిపెల్లర్‌లో ఫ్రెంచి భాష బోధించేది (1931). వారి వివాహ జీవితం 1939 వరకు సాగింది. తరువాత విడిపోయారు. ఈ వివరాలన్నీ *ది సర్పెంట్ & ది రోప్* లో ఆయన చర్చించారు. రాజారావు ఫ్రెంచిలో కొన్ని, ఇంగ్లీషులో కొన్ని కథలు 1931 – 32లో రాశారు. అప్పుడే కన్నడంలో కూడా కొన్ని వ్యాసాలు *జయ కర్ణాటక* పత్రికకు రాసినట్లు తెలుస్తుంది. 1939లో ఆయన ఇండియా తిరిగి వచ్చారు. ఇగ్బాల్ సింగ్ స్థాపించిన *చేంజింగ్ ఇండియా* కు సంపాదకత్వం వహించారు. రామమోహన్‌రాయ్ ప్రచారం చేసిన ఆధునిక భారత ఆలోచనా సరళిని రాజారావు *చేంజింగ్ ఇండియా* లో ప్రచురించారు.

1942 క్విట్‌ఇండియా ఉద్యమంలో ఈయన పాల్గొన్నారు. 1943 నుంచి 44 వరకు అహ్మద్ అలీ (ఈయన హైదరాబాద్ స్నేహితుడు) స్థాపించిన *టుమారో* పత్రికకు సంపాదకత్వం వహించారు. ఈయన రచనలలో ముఖ్యంగా భారతీయ సంస్కృతి గురించి, భారతీయ ధర్మం గురించి ప్రచారం చేసేవారు. ఆ దిశగానే *శ్రీ విద్యా సమితి* సాంస్కృతిక సంస్థను స్థాపించారు. ఆ తరువాత *చేతన* అనే సాంస్కృతీ సంస్థను స్థాపించి భారతీయ ఆలోచనా విధానాన్ని, భారతీయ ధర్మాన్ని ప్రచారం చేశారు. రాజారావు జాతీయోద్యమంలో చాలా చురుకుగా పాల్గొన్నారు. ఆయన అనుభవాలను 1938లో *కాంతపుర* నవలలో గాంధీ అహింసా సిద్ధాంతాన్ని, బ్రిటీష్ ప్రభుత్వాన్ని ఎదుర్కొన్న తీరును వివరిస్తారు.

రాజారావు రచనాశైలి భారతీయ తత్త్వశాస్త్రము, జానపద కథలు, సామెతలతో నిండి ఉంటుంది. అలాగే గాంధీ గురించి ఆయన మరొక పుస్తకం *ది కౌ ఆఫ్ ది బారికేడ్స్* (1947) కథాసంపుటిలో రాశారు. *ది సర్పెంట్ & ది రోప్* చాలా కాలం తర్వాత (1960) ఈ ఆత్మకథాత్మక నవల రాశారు. ఇందులో శంకరుని అద్వైతం, భారతీయ ధర్మశాస్త్రాలు, పాశ్చాత్య సంస్కృతి ఎన్నో విషయాలు కథాపరంగా చర్చించారు. ఈ *ది సర్పెంట్ & ది రోప్* – రజ్జు సర్ప భ్రాంతి అనే తాత్త్విక విషయాన్ని ఉపనిషత్, బ్రహ్మసూత్రాల నుంచి తీసుకున్నారు. ఆ తరువాత *క్యాట్ & షేక్స్పియర్* వెలువరించారు. ఇందులో మనం మెట్టవేదాంతం అంటామే అది హాస్యపరంగా ఎన్నో తాత్త్వికపరమైన ప్రశ్నలకు సమాధానం చెబుతూ వెళ్తారు.

రాజారావుకు స్త్రీలంటే ఎనలేని గౌరవం. స్త్రీ అంటే భూమి, స్త్రీ అంటే వాయువు, స్త్రీ అంటే స్వరం, స్త్రీ అంటే మన మనస్సు – అని ఆయన ఎన్నోసార్లు తన అన్ని రచనలలో ప్రస్ఫుటంగా రాశారు. స్త్రీని దుఃఖ పెట్టటమంటే మగవాని షండత అని ఖండితంగా చెప్తారు.

రాజారావుకు సంస్కృతమంటే చాలా ప్రేమ. ఇంగ్లీష్‌ను సంస్కృతంలా రాయాలని ఆయన ప్రయత్నాన్ని ఈ గ్రంథంలో గమనించవచ్చు.

రాజారావు చాలా కాలం అమెరికన్ యూనివర్శిటీలలో ప్రొఫెసర్‌గా సేవలందించారు.

రాజారావును వరించిన పురస్కారాలు: 1964లో కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం, పద్మభూషణ్ 1969లో, ఫ్రెంచి ప్రభుత్వం నోబుల్ ప్రైజ్‌లాంటి ఇంటర్‌నేషనల్ ప్రైజ్ ఫర్ లిటరేచర్ Neustadt (1988), పద్మవిభూషణ్ (2007)తో భారత ప్రభుత్వం ఆయనను గౌరవించింది. రాజారావు నిండు జీవితాన్ని తన 97వ ఏట 2007, జులై 8న ముగించారు.

రాజారావు శైలిని – "Lyrical, fluid, colloquial" అని *న్యూయార్క్ టైమ్స్* ప్రశంసించింది.

"More than any other writer of his generation Rao established the Status of Indian Literature in English" అని *ది హిందూ* ప్రశంసించింది.



THE SERPENT AND THE ROPE 1960 Edition

మిసిమి

వల్లభనేని అశ్వినీకుమార్

సంపాదకుడు

ఒక అశ్వినీకుమార్

వల్లభనేని అశ్వినీకుమార్; బెజవాడ, మొగల్రాజపురంలో మే 27న జననం.
తండ్రి సింహాద్రి అప్పారావు, తల్లి సీతామహాలక్ష్మి
చదువు – మొగల్రాజపురం, బంటుమిల్లి, మచిలీపట్నం, చెన్నపట్నం. ఫిలాసఫీ అభిమాన క్షేత్రం. విస్తృతంగా ఆంగ్ల సాహిత్యం, కొన్ని ప్రబంధాలు, చరిత్ర చదివారు. మద్రాసులో రెండు సంవత్సరాలు హైస్కూలు విద్యార్థులకు పాఠాలు చెప్పారు. ఎలక్ట్రానిక్స్, మోటారు ఫీల్డులో మక్కువతో పని చేశారు. పాతిక సంవత్సరాలు పర్యాటక రంగంలో సేవలందిస్తూ, ఎన్నో సాహస యాత్రలు చేశారు. మూడుసార్లు ప్రపంచ దేశాలలో మూడొంతులు పైగా పర్యటించారు. ఆ యాత్రాకథనాలు గ్రంథస్థం చేశారు.
తెలుగు డయోస్పరా మొదటిగా చిత్రించింది వీరి 'అమాహ' కథాసంపుటి. ఆత్మగతమైన భావసాంద్రతతో 'నాలో నేను' కవిత పలికింది. ప్రపంచ పేదరిక, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక వ్యాసాలు 'అంతర్వీక్షణం'లో ఉన్నాయి. 'సిద్ధార్థ' వీరి అద్భుతమైన రచనా శైలి, భావానుసరణకు ప్రశంసలందుకుంది. 'చార్లీ చాప్లిన్ నా కథ', 'పి.బి. షెల్లీ జీవిత కథ', 'బైరన్' బయోగ్రఫీ, ఆస్కార్ వైల్డ్ 'అగాథం' – డి ప్రొఫెండీస్, కీట్స్ జీవితం, కవిత్వం మొదలైన అనుసృజన గ్రంథాలు రాసి, ప్రచురించారు. ఇటీవలే 'పారిజాతం' కథాసంపుటి విడుదలై విమర్శకుల ప్రశంసలందుకుంది.
'ఓ ఖైదీ వీరగాథ' (ఆస్కార్‌వైల్డ్) ఆడియోగా విడుదల చేశారు.
కీట్స్ మరణించినప్పుడు షెల్లీ గానం చేసిన స్మృతి గీతం
'ఎడినోయిస్' తెలుగులో రాసి శ్రీ చాట్ల శ్రీరాములు వాయిస్ ఓవర్‌తో సంగీత భరితంగా కీట్స్‌కు సంబంధించిన విజువల్స్‌తో యూట్యూబ్‌లో ఉంచారు. Adonois ppt.
ప్రస్తుతం ఈ *రజ్జు సర్ప భ్రాంతి* గ్రంథాన్ని అందిస్తున్నారు.
కాంతపురం, బుద్ధ రతనాలు త్వరలో వస్తున్నాయి.

అశ్వినీకుమార్ రచనల గురించి
ప్రముఖుల అభిప్రాయాలు

"Amaha is book exciting short stories meant for readers of all ages. While reading this Book the first thing that would invariably strike the reader is the obvious soft and sentimental personality of its author Sri Aswini Kumar and its unmistakable reflection all through these pages... The author having traveled the world over, the scenarios chosen by him for these episodes were widely, from rural India to ultra modern cities of the world. These episodes present sensitive, personal and realistic situations of modern life... The author has done praiseworthy job in giving these situations an expression so touching and picturesque that reader invariably find himself emotionally involved. The style is simple, lucid and colloquial and often lyrical...." *- Triveni*

"....Hero's story... Chaplin presented before the spectators heroism in humour with an inherent blend of pathos, and endeared himself to people of the world... This voluminous memoir contains 31 chapters. He narrates trials turmmoil and triumphs with poise.... In Telugu the Story is told very truly by the translator Aswini Kumar...." *- The Hindu*

".... The Greatness of Chaplin's art was that he could make the audience laugh and weep at the same time. No other comedian could perfect this particular art as Chaplin did. Chaplin had faced very rough and unfriendly atmosphere in America during 1940's. The Telugu translation of Chaplin 's Autobiography is very good. I never felt that I am reading a translation. Aswini Kumar had done a wonderful job in translating the original and should be complimented for making Chaplin even dearer to telugu readers..." *- Ampashayya Naveen (The Hans India)*

“...జీవితంలో సాధనాసాధ్యాలకూ, కలిమిలేములకూ, కీర్తికీ, పతనానికీ అన్నిటికీ ఆఖరి మజలీ చార్లీచాప్లిన్ జీవితం. ఇంగ్లీషు నవల చదివినంతసుగమంగా, సుఖవంతంగా చదివిస్తుంది అశ్వినీ కుమార్ తెలుగు అనువాదం...” - సాక్షి

“....చార్లీ చాప్లిన్’ ఈ పేరు తెలియని వారుండరంటే అతిశయోక్తి కాదు. ఆయన ఆత్మకథ ‘నా కథ చార్లీ చాప్లిన్’ చాప్లిన్ బాల్యం, నాటకాలు, సినిమాలు ఆయన ‘ట్రాంప్’ పాత్ర, ఆయనను ముసురుకున్న వివాదాలు, సంపాదించిన పేరు ప్రఖ్యాతులు , ఆయన ప్రవాస జీవితం అన్నిటినీ తెలుగులో కళ్ళకు కట్టారు రచయిత....” - తెలుగు వెలుగు

“... ఈ పారిజాతం కథలు ఇంతవరకూ తెలుగులో రాని అనుభవాల జీవిత శకలాలు. అంతేకాదు, ప్రపంచంలో ఎన్నో దేశాలలో సంచరించిన రచయిత సేకరించిన కథావస్తువులు, కథన శైలి, తెలుగు కథను వెలుగు మలుపు తిప్పాయి.... విదేశాల, ప్రదేశాల యాంబియన్స్‌ను ఎంత ఆథెంటిక్‌గా రూపుకట్టించారో అంతే నిర్దుష్టంగా పల్లెటూరి బ్రతుకులు, వ్యవసాయ వ్యవహారాలు, మానవ సంబంధాలు కథాతోరణాలుగా అందించారు. వీరి కథనంలో మ్యాజిక్ రియలిజం కూడా చోటు చేసుకుంది....”

- అవసరాల రామకృష్ణరావు (ఇండియా టుడే, తెలుగు)

"...రచయిత దేశదేశాలన్నీ తిరిగి అక్కడ సౌందర్యానికి పరవశించి, తాను లోనైన అనుభవాలన్నింటినీ గుదిగుచ్చి కథలుగా మలిచారు. ఈ సంపుటిలోని కథలన్నీ వేటికవే విభిన్న ఇతివృత్తాలతో ప్రత్యేకత కలవి. వీటిలో అంతర్లీనంగా ఒక విషాదం, ఒక వినోదం, అంతరంగ మథనం, ప్రకృతి సౌందర్యం, దాగున్నాయి. పున్నమి వెన్నెల వెలుగులు, తేనెలు జాలువారే తెలుగు పలుకుబడి, ప్రకృతి రమణీయతల పలకరింపులు - ఈ కథలలో కోకొల్లలు. ముఖ్యంగా భవాని, పారిజాతం కథలలో స్త్రీ హృదయపు లోతులను తడిమి చూశారు. భాషకందని భావాలకు అక్షరరూపం ఇచ్చారు. భవాని పాత్రలో అంతులేని ప్రేమ, భావుకతతో కూడిన విషాదం పాఠకులను కట్టిపడేస్తుంది...."

- సాక్షి (దినపత్రిక)



అశ్వినీ కుమార్

".... అశ్వినీకుమార్ కథలలో బాగా పట్టించిన గుణం యాంబియన్స్. మనమే మరిచిపోయిన ఒక జ్ఞాపకపు తాలూకు యాంబియన్స్ - ఒక స్మృతి కిరణం. అమాహ అంటే ప్రోషిత భర్తృక అన్నప్పుడు పాఠకులలోని ప్రోషిత భర్తృకత్వాన్ని రచయిత వచ్చి రక్షించి, తన కథాసీమా సమయాల్లోకి తీసుకుపోతారు. నిఘంటువులో లేని అంతరార్థాలు, మానసిక సమయం, జ్ఞాపకాల నిరంతర ప్రవాహం, ఆగామి చింతన, పాత్రల జీవన స్రవంతి, ప్రాదేశిక సాన్నిహిత్యం, ఏకాంత జీవన చిత్రాలు, స్త్రీ-పురుషుల పరస్పరాకర్షణలలోని లైంగిక అంతరంగాలు - ఇవన్నీ అశ్వినీ కుమార్ పదాలే. తన కథాకథన కుతూహలం గురించి. ప్రపంచాన్ని తరచి తరచి చూసిన అశ్వినీ - గ్రామీణ నైసర్గికతను కూడా కళ్ళకు కట్టినట్టు చూపగలడని 'పారిజాతం' నిరూపిస్తుంది. విజ్ఞాని, విషయజ్ఞుడు, వినయశీలి అయిన రచయితతో ప్రయాణం హృదయోల్లాస వ్యాఖ్యలే. అంతర్దృష్టిని, తన్యతను పెంచుతూ.... ఉద్యమాలకు, ఉద్వేగాలకు ఊగిపోయే ఉన్మాదాలకి దూరంగా ఉందామని ఊహించుకుంటూనే దేశదేశాలు పరిభ్రమిస్తూనే వీలైనంతగా బాహిరమైన భ్రమలను తొలగించుకొనే ప్రయత్నంలో ఇంకా ఎంతో కొంత ఆంతరిక సంఘర్షణ, సంవేదన, సంతాపం ఉంటూనే ఉంటుందనుకోవడానికి ఈ చిన్న కవితా సంకలనం ఓ ఉదాహరణ... నల్లగా అరుస్తున్న సముద్రం, ప్రాణ వాయు రహిత అంధకారం, వెలవెల విలపిస్తోన్న వెన్నెల, మీరు ఇళ్ళకు పొండి, కాస్త ఎంగిలి పడండి లాంటి కరుణభర పదబంధాలున్నా చివరికి కలిగిన ఆత్మ సమస్థితి ఏమిటంటే - నువ్వు ప్రపంచం కాదు / నువ్వు కాలం కాదు / ప్రపంచంలో నువ్వు / కాలంలో నువ్వు.... బ్రతుకు ఒక పోరాటం / విప్లవాన్ని ఆలోచన అనకు అని.... అంచేతనే ఈ కవితా సంకలనం శీర్షిక సమంజసమే..."

- వేగుంట మోహన్‌ప్రసాద్

"....మీ ఏరియల్ సౌందర్యం షెల్లీ వ్యక్తిత్వంలా కడిగిన ముత్యం. వచనం సరళం. స్కాట్ సెలయేటి ప్రవాహం..." *- బేతవోలు రామబ్రహ్మం*

"... ఇప్పుడే చదవటం పూర్తయింది. మీ వచనంలో ఏదో మాయ ఉంది. చదివిస్తుంది. మళ్ళీ చదవమంటుంది. పుస్తకం మూసిన తరువాత వెంబడిస్తుంది..." *- ముకుంద రామారావు*

"... పారిజాతం... చిన్నత్త పాత్ర ఎలా సృష్టించారు? ఇప్పటికీ మూడుసార్లు చదివాను. పారిజాతం నన్ను హాంట్ చేస్తోంది. వచన కవిత్వంలో కవిత్వం వెతుక్కోవలసివస్తున్న ఈ రోజుల్లో మీ వచనమంతా కవిత్వమే..." *- ప్రొ. వి.ఆర్. రాసాని*

".... షెల్లీ గురించి మనకు తెలిసింది చాలా తక్కువ. తను నమ్మిన సిద్ధాంతం కోసం ఎన్నో కష్టాలపాలయిన షెల్లీని కళ్ల ముందు ఆవిష్కరించారు. కన్నీరు తెప్పించారు. మీ రచనా శైలి అద్భుతం..." *- అంపశయ్య నవీన్*

".......ఏ గొప్ప జీవితమైనా, త్యాగమూర్తి జీవితమైనా ఈ తరానికి అవి పాఠాలే... షెల్లీ జీవితం *ఏరియల్* లో చదివితే అది ఎంతో స్ఫూర్తిదాయకం... షెల్లీ అనీ, ఏరియల్ అనీ లేకపోతే ఇది అచ్చ తెలుగు రచనే..." *- సి.యస్. రావు*

"..... కొత్త తరహా ఇతివృత్తాలతో ఆ ఇతివృత్తాలకు తగిన ప్రాంతాలూ, పాత్రలతో, ఏమాత్రం కల్పన అనిపించని సహజత్వంతో, పాఠకుడికి దృశ్యమానం చేస్తూ అతన్ని కథాగమనంలో లీనం చేస్తూ మీరు చూపిన నేర్పు అడుగడుగునా ఈ కథల్లో కనిపిస్తోంది. ఇప్పుడు వస్తున్న కథలకు భిన్నమైన ధోరణిలో సాగిన మీ శైలీవిన్యాసం ఎంతో బాగుంది..." *- శీలా వీర్రాజు*

"... చాప్లిన్ తల్లి... ఆ మహాతల్లి... ఆ పిచ్చితల్లి... పిల్లల్ని పెంచడమనే పెద్దకష్టం తెలుసుకుంటే... ఏ దేశపు తల్లైనా కాళ్ళుకడిగి నెత్తిన పెట్టుకోవాలనిపిస్తుంది! ... ఒకసారి పుస్తకం మూసిన తరువాత... మనసుకి తడొస్తుంది, మెదడుకి చెమట పడుతుంది! విషాద ప్రపంచంలో ఉక్కిరిబిక్కిరైపోతాం..." *- తనికెళ్ళ భరణి*

"... ఇది బైరన్ కథ. వల్లభనేనివారి బైరన్ కథనం మిమ్మల్ని కట్టిపడేస్తుంది. బైరన్ జీవితం మిమ్మల్ని ఆశ్చర్యపరుస్తుంది. అతని మరణం విషాదం మీకు కన్నీరు నింపుతుంది. వెరసి ఇది గొప్ప అనుభూతి మిగుల్చుతుంది...." *- డా. దిలావర్*

"... ఈ ఆంగ్ల కవిత్రయం, కీట్స్, షెల్లీ, బైరన్‌లు రొమాంటిక్ కవులుగా, తిరుగుబాటు కవులుగా తరతరాలుగా ప్రసిద్ధి చెందారు. కీట్స్ 25 ఏళ్ళకు, షెల్లీ 30 ఏళ్ళకు, బైరన్ 36 ఏళ్ళకు తనువులు చాలించి, వారు నమ్మని స్వర్గంలో కలవటానికి వెళ్ళిపోయారు. షెల్లీ, బైరన్ జీవిత గాథలు వల్లభనేని జనరంజకంగా తెలుగు చేశారు. ఆస్కార్‌వైల్డ్ డి ప్రొపెండీస్‌ను అగాథంగా, ఆస్కార్‌వైల్డ్ శైలిని అద్భుతంగా తెనుగించారు...." *- కాండ్రేగుల నాగేశ్వరరావు*

".... ఆంద్రీ మార్వ్ ఎంతో శ్రమించి రాసిన షెల్లీ, బైరన్ జీవిత కథలు అత్యద్భుతంగా తెలుగు చేశారు. అంతేకాదు, వివిధ పుస్తకాల నుండి సమాచారం సేకరించి కీట్స్‌ను కూడా మనకు అందుబాటులోకి తెస్తున్నారు. అంటే ఇంగ్లీషు రొమాంటిక్ 'కవిత్రయం' జీవిత చరిత్రలు తెలుగువారికి కానుకగా ఇచ్చిన అశ్వినీకుమార్ ధన్యజీవి..." *- ముక్తవరం పార్థసారథి*

"... పి.బి. షెల్లీ స్వప్న విషాదం 'ఏరియల్' పుస్తకం చదివి అతిసామాన్య పాఠకురాలినైన నేను ఏదో ఒక అనిర్వచనీయ అనుభూతికి లోనైనాను. 'ఏరియల్' పుస్తకమంతా ఒక ఎత్తైతే, ఎ.కె. గారి 'ఎటువంటి కవి' కవిత ఒక ఎత్తనిపించింది...." *- యస్. కృష్ణవేణి, విజయనగరం*

కృతజ్ఞతలు

మిత్రులు, శతాధిక గ్రంథకర్త ముక్తవరం పార్థసారథి గారిని అప్పుడప్పుడు కలుస్తుంటాను. వారు ఆంగ్లంలో వచ్చిన ఐరోపా, అమెరికా సాహిత్యాన్ని ఔపోసన పట్టిన అగస్త్యుడు. మా చర్చ ఇండియన్ ఇంగ్లీష్ రచయితల మీదకు మళ్లింది. చాలా పొడవైన చిట్టానే ఉంది. దామోదర్ సవార్కర్, ముల్క్‌రాజ్ ఆనంద్, ఆర్.కె. నారాయణ్, సాల్మన్ రష్డీ, అరుంధతీ రాయ్ వగైరా. అయితే 20వ శతాబ్దం తొలి దశాబ్దాలలో ఆంగ్లంలో రచనలు చేసి, అంతర్జాతీయ కీర్తిని ఆర్జించిన రాజారావు రచనలపై మాట్లాడుకున్నాం. ఆ సందర్భంలో పార్థూ గారు 'మీరు ఇప్పటికే నాన్ ఇండియన్ రచయితల రచనలు తెలుగు చేశారు. ఒకసారి రాజారావును చదవండి..' అన్నారు. '*సిద్ధార్థ, చాప్లిన్, షెల్లీ, బైరన్, ఆస్కార్ వైల్డ్, కీట్స్* - ఇవన్నీ ఎంతో ఇష్టపడి తెలుగు చేశాను' అంటే రాజారావు *కాంతపుర, ది సర్పెంట్ & ది రోప్* చదవండి అన్నారు పార్థు గారు. అలాగే రెండు పుస్తకాలు తెప్పించాను. ఎందుకో ముందుగా *ది సర్పెంట్ & ది రోప్* చదివాను. అంతే, ఆ మాయలో మునిగి తేలాను. పార్థూ గారితో చెప్పగా 'జాగ్రత్త' అని హెచ్చరించారు. అలా ఎందుకన్నారో తెలుసు. అదిగో అలా మీ ముందుకు వచ్చింది ఈ 'రజ్జు సర్ప భ్రాంతి'. పార్థూ గారికి హృదయకపూర్వక వందనాలు తెలియజేస్తున్నాను.

మూడు నెలల్లో రాయటం అయిపోయింది. ఆశారాణితో 'నువ్వు డి.టి.పి. చేయవద్దు. వాయిస్ టు టెక్స్ట్ ప్రయత్నించు' అని చెప్పాను. ఆ విధంగా ఆమె మొదటి పాఠకురాలు. ఈ పుస్తకం వాయిస్ టు టెక్స్ట్‌గా మారింది. అయితే అంతటితో పూర్తవుతుందా?! ఎంతో శ్రమించి ఈ పుస్తకాన్ని తీర్చిదిద్దిన ఆమె ఓర్పుకు, నేర్పుకు ఆశీస్సులు. ఎంతో నేర్పుగా అచ్చుతప్పులు దిద్దిన కరుణకు అభివందనం. ముఖచిత్ర పటం రూపుదిద్దుకోవడానికి నా ఆలోచనలను రంగులలో సాకారం చేసింది జి షాన్. ఎప్పుడూ జోకులు పేలుతూనే ఉంటాయి. నేను ఉర్దూలో మాట్లాడుతుంటా, ఆయన తెలుగులో చెబుతూ ఉంటాడు. ఆయనకు నా కృతజ్ఞతలు. మధ్యాహ్నం భోజన విరామంలో అరుదుగా అందెశ్రీకి ఒకటి రెండు పేజీలు చదివి, వినిపించేవాడిని. 'ఆచార్యా! అద్భుతం' అనేవాడు. ఆయనకు వందనం.

ఇవన్నీ ఇలా ఉండగా, పుస్తకాన్ని ముద్రించాలంటే సాధారణ పరిస్థితులలో లక్షల మీద పని. అమ్మబోతే అడవి కదా! కృపాకర్ గారి కృపతో మాకు కావలసిన బడ్జెట్‌లో చక్కగా ముద్రించి ఇస్తున్నారు. ఆయనకు వందనాలు.

ఈ పుస్తకం గురించి నా మిత్రులు, శ్రేయోభిలాషులు శ్రీ ఆంజనేయరెడ్డి, శ్రీ బాపన్న, ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ, ఆచార్య అనుమాండ్ల భూమయ్యగార్లందరూ నన్నెంతగానో ప్రోత్సహించారు, వీరందరికీ నా అభివాదాలు.

- *ఎ.కె.*



ఆంగ్లం మనల్ని మేథోపరంగా ఆక్రమించింది కానీ, ఆధ్యాత్మికంగా ఆకర్షించలేకపోయింది. మన భావనాధార మాతృభాషకే పరిమితం.. గతం వర్తమానంలో లీనమైపోతుంది.. దేవతలు భూమి మీదకు దిగి వచ్చి మనతో కలిసిపోతారు. విశ్వాసం కథలు వినిపిస్తుంది.. ఇదిగో, ఇప్పుడు మీరు వినబోయే కథ అలాంటిదే.. ఇక్కడ ఎండలో ఏదో చైతన్యం చిరచిరలాడుతుంటుంది.. మనల్ని కూర్చోనివ్వదు, నిలబడనివ్వదు.. ఒకవిధమైన వింత పరుగు, మన బ్రతుకు. ఈ దారులకు అంతే ఉండదు. నీ కాలిబాట ఆగిపోదు. ఈ ప్రయాణంలో ఎన్నో బంధాలు, మరెన్నో భ్రమలు. అనాథను చేసిన అమ్మ - ఆదరించిన చిన్నమ్మ - ఆరాధించిన అర్ధాంగి - మమతలు పంచిన మారుటి చెల్లెలు - పెద్దరికం కట్టబెట్టిన వంశ మూలాలు - ప్రేమించి, వెళ్ళిపోయిన ప్రియురాలు...

మరి ఈ బంధాలన్నీ

భ్రమలేనా!